


ఒక రోజు

అఖిల

అఖిల భారత పత్రిక
జనవరి 2016




అతిమానస ఆవిష్కరణ

అది స్వాగతించబడుతుంది

वानस्पतिक नाम : Scadoxus multiflorus

January 2016

Sun	Mon	Tue	Wed	Thu	Fri	Sat
					1	2
3	4	5	6	7	8	9
10	11	12	13	14	15	16
17	18	19	20	21	22	23
24	25	26	27	28	29	30
31						



లోకోద్ధారకులు

పరమ శివుని విలయ తాండవం గతాన్ని ధ్వంసం చేసింది.... సర్వశక్తి సమన్వితుడైన భగవంతుని దివ్యతేజముతో దివ్యజీవులు గుంపులు గుంపులుగా పరలోక సరిహద్దులను దాటి, జన్మసోపానాల గుండా ఇహలోక జీవితం వైపు మర్త్యజీవన మనబడే చిన్న గదిలోనికి దిగిరావడం నేను చూసాను. దివ్యజీవన జనసముదాయంలోకి ప్రప్రథమంగా విచ్చేసిన ఆద్యజీవులు వారు. ప్రాతఃకాలాన గగనతలంలో మున్ముందుగా మిలమిల మెరిసే వేగుచుక్క అరుదెంచే బాటల ననుసరించి వారు విచ్చేసారు. యుగారంభ సంజవెలుగులలో వారి రాకను నేను గమనించాను. మహాద్భుత ఉషోదయ భానుడి తేజం వారి కళ్ళలో ప్రతిబింబిస్తున్నది. వారి విశాల లలాట ఫలకంపై ప్రశాంతత పరిఢవిల్లుతున్నది. వారు ప్రధాన సృష్టికర్తలు, ప్రపంచ పురోగమనాన్ని నిరోధించే అడ్డుగోడలను కూల్చగల శక్తిమంతులు, సంకల్ప శక్తుల క్రీడాప్రాంగణంలో విధిలాసాలతో తలపడగల మల్లయోధులు, దైవీ సంపదల గనుల నుండి దివ్యశక్తులను, కృపాకటాక్షాలను వెలికి తీసే శ్రామికులు, మాటల కందని మహా మహితాత్ముడైన భగవంతుని వార్తాహరులు, అమృతత్వానికి ఆకృతినీయగల వాస్తు శిల్పులు....

ఏదో ఒక రోజున వారి పదగమనం బాధాతప్త భూలోకంలో తప్పక మార్పును తీసుకొస్తుంది. దివ్యప్రకృతి వదనారవింద వెలుగుకు సార్థకత చేకూరుస్తుంది.

సావిత్రి; 343-44 — అనువాదం: డి. సత్యవాణి



అతిమానస పక్షి

ఎక్కడ దిగివచ్చిందో అక్కడే నిలుస్తుంది

Botanical name: Strelitzia reginae, (Bird of paradise, Crane flower)

February 2016

Sun	Mon	Tue	Wed	Thu	Fri	Sat
	1	2	3	4	5	6
7	8	9	10	11	12	13
14	15	16	17	18	19	20
21	22	23	24	25	26	27
28	29					



జీవన వేదనను ఆమె చరణస్పర్శతో ఉపశమింప జేయమని, అజ్ఞానాంధ కారంతో మసకబారిన మానవ అంతరాత్మను గట్టిగా మూసి బంధించి ముద్రవేసినవాటి నన్నిం టినీ పగలగొట్టి, విషయ పరంపరలతో మూసుకుపోయిన హృదయంలో ఆమె జ్యోతిని ప్రజ్వలింప జేయమని సమస్త ప్రకృతి ఆమెనే మూగగా పిలుస్తున్నది. ఇక్కడి సర్వ స్వము ఒకనాడు ఆమె ఉల్లాసభరిత ఆనందనిలయమవుతుంది. సమస్త వైరుధ్యాలు సైతం ఆమె సామరస్యతను సిద్ధింప చేస్తాయి. మన జ్ఞానసంపద ఆమె దిశగా ఉన్నతి పొందుతుంది, మన హర్షోద్రేకం ఆమెను వెదుకుతుంది. ఆమె ఆనందపారవశ్యత నెలకొన్న సీమలో మనం ఆవాస మేర్పరచుకొంటాము. ఆమె స్పర్శ మన బాధను మహదానందంగా మారుస్తుంది. మన ఆత్మ ఆమె ద్వారా సర్వజనుల ఆత్మతో ఏకమౌతుంది. మనలో పరివర్తన ఆమె ద్వారా జరుగుతుంది గనుక ఆమెలో స్థిరనివాస మేర్పరచుకొంటాము. మన జీవితం సార్థకమౌతుంది. అలా సార్థకతను పొందిన మన జీవితం ఊర్ధ్వస్థాయిలో హద్దులులేని అనంత నిశ్శబ్ద స్థితిని, క్రింది స్థాయిలో దైవాదరణ లభ్యమైన కారణంగా కలిగిన అత్యద్భుత స్థితిని పొందుతాము.

సావిత్రి: 314-15

అనువాదం: డి. సత్యవాణి




అతిమానస వెలుగుకై భౌతికంలో ఆకాంక్ష

ఒక గుత్తిగా, స్థిరంగా, పెడసరంగా, పొందికగా, పద్ధతిగా

Botanical name: Ixora javanica [Ixora singaporensis]

March 2016

Sun	Mon	Tue	Wed	Thu	Fri	Sat
		1	2	3	4	5
6	7	8	9	10	11	12
13	14	15	16	17	18	19
20	21	22	23	24	25	26
27	28	29	30	31		



"శోకనివృత్తిదేవతా, దివ్యకారుణ్యమాతా,

నీవు నా ఆత్మలోని ఒక భాగానివి – ఈ దుర్భరమైన ప్రపంచ దుఃఖాన్ని భరించడానికి ముందుకొచ్చావు. నీ ఉనికి కారణంగానే మనుషులు వారి పతనానికి లొంగకుండా ఉంటూ, ఆనందాన్ని కోరుతూ, విధితో పోరాడుతారు. నీ ఉనికి వల్లనే, బికారిలో కూడా ఆశ ఇంకా బ్రతికే ఉంటుంది, అయితే నీ శక్తి స్వాంతన పరచగలదు గాని రక్షించలేదు. ఏదో ఒక రోజున నేను శక్తిని తోడ్కొని తిరిగి వస్తాను. శాశ్వతుని పాత్రలోంచి దివ్యశక్తి ధారలు నీవు సేవించగలవు. ఆతని శక్తిప్రవాహాలు నీ అంగాంగాలలో విజయంతో ఉప్పొంగుతాయి. నీ ఉద్విగ్న హృదయ తీవ్రతని దివ్యజ్ఞానం యొక్క ప్రశాంతత శాంతింప చేస్తుంది. నీ ప్రేమ మానవజాతి నంతటిని ప్రేమబంధంతో ముడివేస్తుంది. మహాప్రకృతి యొక్క కార్యాచరణను నీ దివ్యకారుణ్యం శాసిస్తుంది. దుఃఖం, దైన్యం, ఈ పృథ్వి పై నిర్మూలించబడతాయి, సంపూర్ణంగా తొలగించబడతాయి. ఈ విశ్వంలో ప్రబలి ఉన్న మృగతత్వమైన క్రోధం నుండి ఈ ప్రపంచం స్వేచ్ఛను పొందుతుంది. ఆ అసురశక్తుల బాధల నుండి, ఆ క్రూరత్వం నుండి విముక్తి పొందుతుంది. అంతటా మరింత శాంతి, మరింత ఆనందం నెలకొంటాయి.

సావిత్రి: 507-08 అనువాదం: డి. సత్యవాణి



అతిమానస ఐశ్వర్యం

మానవునికి ఇప్పటికీ తెలియని, అతిమానస అస్తిత్వానికి
అందుబాటులో ఉన్న ఐశ్వర్యం.

Botanical name: Selenicereus

April 2016

Sun	Mon	Tue	Wed	Thu	Fri	Sat
					1	2
3	4	5	6	7	8	9
10	11	12	13	14	15	16
17	18	19	20	21	22	23
24	25	26	27	28	29	30



మహోన్నత బలసామర్థ్యాల అదితి, కార్యకర్మలు మరియు కార్యశక్తుల దివ్యజనని....

ఒక రోజు నేను తిరిగి వస్తాను, వెలుగును నాతో తెస్తాను. అప్పుడు నీకు నేను దైవప్రతిబింబమును అందిస్తాను. ఆయన వలన చూడబడిన విధముగా నీవు తేజోవంతమైన నీ ఆత్మ అగాధపు లోతులలో ప్రతిఫలించిన ఆత్మను, విశ్వమును చూడగలవు. అపరిమేయమగు నీ ఆధిపత్యశక్తి వలె నీ వివేకము విస్తారమగును. అ ప్పుడిక మానవ హృదయాలలో ద్వేషమనే దాని కేమాత్రమూ తావుండదు.

భయము, బలహీనతలు మానవ జీవితాలలోనుంచి వైదొలగిపోతాయి. స్వార్థా హంకారపు అరుపులు, ప్రపంచము నాహారముగా ఆశించు దాని సింహపు గర్జింపులు అంతరంగంలో సద్దు మణగిపోతాయి.

సమస్తమూ మహోన్నత బలసామర్థ్యము, పరమానంద భరితము, సంతోష దాయక శక్తిగా అవగలదు.

సావిత్రి 513-14 అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ



సంపూర్ణ అతిమానస ప్రకాశంలో చైతన్యపు తీవ్రత

ప్రపంచమును ప్రకాశమానం చేయటానికి అది ప్రజ్వరిల్లుతూ వెలిగిపోతున్నది.

Botanical name: **Helianthus**

May 2016

Sun	Mon	Tue	Wed	Thu	Fri	Sat
1	2	3	4	5	6	7
8	9	10	11	12	13	14
15	16	17	18	19	20	21
22	23	24	25	26	27	28
29	30	31				



కాంతి ప్రదాయిని అదితి, సంతోషము, శాంతి యొక్క దివ్యజనని, నీ కారణంగానే ఆత్మ దైవం వైపు లాగబడుతుంది, నీ కారణంగానే ద్వేషం ఉన్నప్పటికీ ప్రేమ వృద్ధి చెందుతుంది, జ్ఞానం నాశనం లేనిదై మహాంధకార బిలంలో నడుస్తున్నది.

నీవు అంతఃస్ఫూర్తి కిరణాలను వర్షించినప్పటికీ, మానవ మనస్సు దానిని పుడమి యొక్క మిణుగురు ప్రకాశమని తలుస్తుంది, అతని ఆత్మ ఆధ్యాత్మికమైన అహంకారంలో మునిగిపోతుంది, లేదా అతని ఆత్మ కన్న స్వప్నం సాధుత్వమనే తేజోమయమైన చిన్న కోష్ఠంలో బందీ చేయబడుతుంది. అక్కడ కేవలం దైవం యొక్క ప్రకాశవంతమైన ఛాయ మాత్రమే వచ్చి పడగలదు. శాశ్వతుని కోసం రగిలే అతని ఆకలిని నీవు మాత్రమే తప్పక పోషించగలవు, పరితపించే అతని హృదయాన్ని స్వర్గజ్వాలతో నింపగలవు. కిందికి అతని శరీరంలోనికి, జీవితంలోనికి దైవమును కొనిరాగలవు.

నా చేతిలో అతని చేయితో, ఒక రోజు నేను తప్పక తిరిగి వస్తాను. అప్పుడు నీవు నిరపేక్షుని ముఖమును తప్పక దర్శించగలవు. అప్పుడు దివ్య వాహము సిద్ధించబడుతుంది, అప్పుడు దివ్యకుటుంబము ప్రభవిస్తుంది, లోకాలలో ప్రకాశము, ప్రశాంతత నెలకొంటుంది.

సావిత్రి: 520

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ



అతిమానస సూర్యుడు

దాని కిరణాలు మమ్ములను ప్రకాశమానం చేసి, పరివర్తన చేయు గాక
యని మేము ఆకాంక్షించెదము.

Botanical name: Anthocephalus cadamba

June 2016

Sun	Mon	Tue	Wed	Thu	Fri	Sat
			1	2	3	4
5	6	7	8	9	10	11
12	13	14	15	16	17	18
19	20	21	22	23	24	25
26	27	28	29	30		



కాని భగవానుని కావల ఇంకా ఎక్కువ దాగి యున్నది. అది ఒక రోజు దాగియున్న తన ముఖమును బహిర్గతము చేయగలదు.

కేవలము మహామనస్సు మాత్రమే అలసట లేని అధిరోహణ అందుకోగలిగే సమస్తం కాదు. లోకాల శిఖరాగ్రమున జ్వలించు అగ్ని ఉంది, అక్కడ శాశ్వతుని ప్రకాశమునకు నివాసము కలదు, అక్కడ ఒక అనంత సత్యము, ఒక నిరపేక్ష ఆధిపత్యశక్తి కలదు. ఆత్మశక్తి మహోన్నత సామర్థ్యము దాని ముసుగును తొలగించగలదు. విశ్వపథమును రూపుదిద్దు దాని గొప్పతనపు అనుభూతి కలుగగలదు. దాని ముసుగు లేని ప్రకాశమందు స్వయం అది దర్శించబడగలదు, మహా అచేతనా అంధకార మందుండి ఒక నక్షత్రము పైకి పొడుచుకుని వచ్చుటను, ఒక సూర్యుడు దివ్యప్రకృతి శిఖరాగ్రము నధిరోహించుటను...

కొంతమంది మాత్రము అద్భుతమగు దివ్యమూలమును అస్పష్టముగ చూడగలరు, కొంతమంది నీలో నిగూఢ మహాశక్తిని అనుభూతి నొందగలరు, వారు నామరహిత పథమును చేరుటకై మరలుదురు. బ్రహ్మాండమైన దివ్యదినమున అడుగిడు సాహసికులు వారు. మనస్సు యొక్క పరిమితుల పరిధుల నధిగమించుచుతూ వారు ప్రపంచపు బ్రహ్మాండమైన పథకమును కనుగొనగలరు. దివ్యసత్యము, దివ్య ఋతము, మహా అపరిమేయ మందు వారు అడుగిడగలరు.

సావిత్రి: 704 అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ



దైవంపై అతిమానస మమకారం

బహువిధం, దరహాసభరితం, అనంతంగా తనను తాను
పునరావృతం చేసుకొంటుంది.

Botanical name: 'Father's Day' Rosa

July 2016

Sun	Mon	Tue	Wed	Thu	Fri	Sat
					1	2
3	4	5	6	7	8	9
10	11	12	13	14	15	16
17	18	19	20	21	22	23
24	25	26	27	28	29	30
31						

(అమరుల సరసన గద్దె నలంకరించే దైవర్షి నారదుడు, భూమిపై వున్న మానవుల దగ్గరకు దివ్యమానవునిగా గానం చేసుకుంటూ దిగివచ్చాడు. అతని గానంలో అనేక విషయాలు వెలువడుతుంటాయి. ఊర్ధ్వలోకాలలో యే విషయాలు వెలుగు చూస్తాయో వాటికీ, మర్త్యలోక వాతావరణంలో ప్రవేశించిన పిదప అతని గానంలో వెలువడే విషయాలకు భేదం వుంటుంది. ఈ క్రింది విషయాలు అతడు అశ్వపతి కొలువులోకి ప్రవేశిం చినపుడు అతడు గానం చేసినవి, దైవం మానవాళి కిచ్చిన ఒక బ్రహ్మాండమైన ఆశ్వాసం, వాగ్దానం యిందులో వున్నాయి. ఇది శ్రీఅరవిందుల మహాకావ్యం 'సావిత్రి' లోని ౬వ పుస్తకం అధ్యాయం 'విధివాక్కు' నుండి సేకరించిన చరణాలు: అనువాదకుడు)

"దేవర్షి రాగ, తాళ బద్ధంగా పాడే పాటలో మనుషుల కష్టాల గురించి దైవశక్తులు భువిపై యేం చేయాలని పెనగులాడుతున్నాయో దానిని గురించి, బాధకు సంబంధించిన మార్మికతకు వెనుకగల ఆనంద విషాదాల గురించి గానం చేస్తుంటే అచటివారు భౌతిక ప్రపంచ ప్రభావం నుండి బయటపడి, మామూలు జీవితం, చింతన నుండి విడవడి, ఆ ఉన్నత లయబద్ధ సంగీత మాధుర్యాన్నాస్వాదిస్తూ కొంత తడవు చేష్ట లుడిగి చూస్తుండిపోయారు.

నారదుడు దివ్యప్రేమ హృదయపద్మాన్ని గురించి, దాని నుండి వెలువడే వేనవేల పరమ సత్యపు కింజల్కాల గురించిన గానం వినిపిస్తున్నాడు. ఆ దివ్యప్రేమ కన్పించే వస్తువులచే తెరమరుగై నిదురిస్తూ కంపిస్తున్నట్లు గానం చేస్తున్నాడు.

ఆ దివ్యప్రేమ ప్రతి బాహ్యస్పర్శకు మేలుకొన పెనగులాడుతోంది. ఏదో ఒక రోజు అది ఆనందం నిండిన స్వరాన్ని వింటుంది. తనలో దాగిన భగవంతుని ప్రకృతి ఆవిష్కరించుకొన్నపుడు, ప్రకృతిని భగవంతుడు తనదిగా చేసుకొన్న పుడు దివ్య ప్రేమ తన అర్ధాంగి నందనవనమైన భువిపై వికసిస్తుంది.

అప్పుడు మహదానంద స్పందన బలంగా సుడులు తిరుగుతూ విశ్వపు లోతైన హృదయం ద్వారా సమస్తం లోనికి పాకిపోతుంది.

అప్పుడు పదార్థపు మత్తు నుండి, ఆమె మానసిక స్వప్నాల నుండి ప్రకృతి మేలు కొంటుంది, మేలుకొని భగవంతుని అనాచ్ఛాదిత మోమును తిలకిస్తుంది."

సావిత్రి: 417-18 అనువాదం: కె. వి. రావు



అతిమానసిక చేతన

అత్యంత వైభవోపేతంగా జాగృతమైనది, శక్తివంతమైనది, తనపై తనకు నమ్మకం వున్నది. దాని నడకలు దోషరహితం.

Botanical name: Hibiscus rosa-sinensis

August 2016

Sun	Mon	Tue	Wed	Thu	Fri	Sat
	1	2	3	4	5	6
7	8	9	10	11	12	13
14	15	16	17	18	19	20
21	22	23	24	25	26	27
28	29	30	31			

(శ్రీఅరవిందుల మహాకావ్యం 'సావిత్రి' మొదటి పుస్తకంలోని 'రహస్య జ్ఞానం' అనే నాల్గవ అధ్యాయం నుండి ఈ చరణాలు సంగ్రహితమైనాయి. ఆ అధ్యాయంలో వారు సృష్టిని గురించి వెల్లడించిన అద్భుత రహస్యాలలో యివి కొన్ని మాత్రమే. – అనువాదకుడు)


"ఈ ప్రపంచాన్ని రూపొందించిన వాడెవడో ఆతడే దాని ప్రభువు. మన తప్పులు దైవం వేసే అడుగులే. ఆ దైవం మన జీవితాలలో జరిగే భయంకర మార్పుల ద్వారా, పరిణామాల ద్వారా పనిచేస్తున్నాడు. ఘోరమైన సంగ్రామం, కఠిన పరిశ్రమలచే శ్వాస ఆడని పరిస్థితుల ద్వారా పనిచేస్తున్నాడు. అతడు మన పాపాలు, దుఃఖాలూ, కన్నీళ్ళ ద్వారా పనిచేస్తున్నాడు.

మన నిశ్చేతనను ఆతని జ్ఞానం ఆవలికి నెట్టివేస్తుంది. నిశ్చేతన, అజ్ఞానాలు యే రూపంలో వున్నా వాటిని భరించవలసిందే. మన దృఢ సంకల్పాలేవైనా, ప్రస్తుత విధి నిర్ణయం యెలా వున్నా యిటూ, అటూ కొట్టుకుపోవడం, తేలిపోవడం జరుగుతున్నా, నిలకడగా నిలువలేకపోతున్నాం అనుకునే పరిస్థితులలోగూడా, ఒక బలీయమైన, ప్రభావవంతమైన దివ్యమార్గ దర్శకత వీటన్నింటి నుండీ మనల్ని ముందుండి నడిపిస్తూ తీసుకుపోతుంది.

ఎన్నో రకాలుగా విభాగితమైన, విడివడిపోయిన, ఈ ప్రపంచంలో మన కప్పగించిన పనిని మనం పూర్తి చేసాక, మన శక్తికి తగినంతగా, మనం దానిని సేవించిన తర్వాత భగవంతుని ఆనందం, భగవంతునితో యేకత్వం, మన జన్మహక్కుగా మనకు లభిస్తాయి.

అజ్ఞేయపు కాలపట్టికలో ఒక రోజు నిర్ణయింపబడి వుంది. అది ఒక దివ్యజన్మ సంభవమయ్యే రోజు. కలిమి లేముల ద్వారా, ద్వంద్వాల ద్వారా సాగుతున్న మన జీవన గమనానికి కారణం మన అంతరాత్మలో వున్నది. అది దానిని సమర్థిస్తుంది. లేనే లేకపోయినా, లేక ఉన్నా, యెక్కడో మన కందనంత దూరాన ఉన్నాడంటున్నవాని దగ్గరకు సమస్తం చేరుకొంటుంది. ఈ ప్రశాంత సుస్థిర, సుదూర ప్రబల శక్తులు చివరకు పనిచేయ వూనుకొంటాయి."

సావిత్రి:59 — అనువాదం: కె. వి. రావు



అతిమానసిక ప్రేమ సౌందర్యం (ఆరోవిల్ పుష్పం)
తన ఔన్నత్యంలో నివసించమని మనల్ని ఆహ్వానిస్తోంది.

Botanical name: Hibiscus rosa-sinensis

September 2016

Sun	Mon	Tue	Wed	Thu	Fri	Sat
				1	2	3
4	5	6	7	8	9	10
11	12	13	14	15	16	17
18	19	20	21	22	23	24
25	26	27	28	29	30	



(అశ్వపతి మానవజాతి ఉద్ధరణకై చేసే ప్రయత్నంలో భాగంగా అనేక నిమ్న, ఊర్ధ్వ లోకాలలో సంచరిస్తాడు. ఆతడు బాగా అభివృద్ధి చెందని చిన్న మనస్సు జీవులున్న రాజ్యాలలోనికి ప్రవేశించాడు. ఆ స్థాయిలో కూడా జరుగుతున్న భగవంతుని కృషిని చూచాడు. అక్కడ కూడా దివ్యజ్ఞాన సంభవతను చూచాడు, రాబోవు బంగారు భవితను చూచాడు. పరిణామంలో ఆ రాజ్యాలకున్న స్థానాన్నీ దర్శించాడు. ఈ క్రింది చరణాలు శ్రీఅరవిందుల 'సావిత్రి' మహాకావ్యంలోని రెండవ పుస్తకం, పదవ అధ్యాయం నుండి సేకరించబడినవి: అనువాదకుడు)

"ఏదో ఒక రోజు ప్రకృతి ముసుగు వెనుక నుండి భగవంతుడు ప్రకాశిస్తూ తప్పక దర్శన మిస్తాడు. మన అజ్ఞానం కోశస్థ కీటక దశ లాంటిది. మన అజ్ఞానం ముందుకు సాగిపోతుంటే దాని మార్గం మీద, అది నూతన జ్ఞానంతో జతకడ్తుంది. అజ్ఞానపు అంధకారం, నల్లనైన వెలుగుముడి. భావం, అవిద్యతో, చేతనను వ్యతిరేకించేదానితో చేయి చేయి కలిపి, మహా సూర్యుని వైపు చుట్టు తిరుగుతూ సాగే ధూమ్రవర్ణ బాటపై నాట్యమాడుతుంటుంది.

అనంతత్వాల నుండి ఒక జ్వాల బహిర్గతమౌతుంది. ఏకైకుని ప్రహర్ష, ప్రకాశ మయ నిశ్చల సంద్రాల పైగా, ఆత్మ, వస్తువుల హృదయ లోతులను ప్రకాశింపజేయు సుదూర సర్వజ్ఞత నుండి వెలువడి ఒక మహనీయ దివ్యజ్ఞానం ప్రపంచాన్ని లక్షిస్తూ వస్తుంది. అది విశ్వమనస్సుకు, కాల ప్రభావానికి లోబడని జ్ఞానాన్ని కొనితెస్తుంది. దాని లక్ష్యం జీవితం, అది అజ్ఞానానికి స్వస్తి పలుకుతుంది."

సావిత్రి:257-58 అనువాదం: కె. వి. రావు




అతిమానస కార్యాచరణ జయం

(ఓరిమితో కూడిన పనికి, సంపూర్ణ సమర్పణకు ఫలితం)

Botanical name: Michelia champaca

October 2016

Sun	Mon	Tue	Wed	Thu	Fri	Sat
						1
2	3	4	5	6	7	8
9	10	11	12	13	14	15
16	17	18	19	20	21	22
23	24	25	26	27	28	29
30	31					




(సామాన్య జనులు సైతం తనలాగ తయారవాలని దైవం మన జీవన గమనాన్ని నడుపుతున్నాడు. మనం ప్రస్తుత మర్త్యస్థితికి చెందినవారము కాము. ఆదిలో నున్న మన మూలాలు దివ్యస్థితికి చెందిన విషయం మరచి మనలను మనం మరచి పోయాము. అయినప్పటికీ మన గత జీవిత వాసనలు మనలో ఎక్కడో ఇంకా పట్టుకొని వుండి మనలను పూర్వపు ఉన్నత దిశగా ఎదగాలని తరుముతున్నాయి. దైవం ఆ ఆశను తప్పక నెరవేరుస్తాడనే భరోసాను బలపరచుకొనే నేపథ్యంలో మనలను మనం స్వగతంగా ఇలా ఊరడించుకుంటున్నాము. – అనువాదకుడు)

"మన ఆక్రందనకు ప్రతిస్పందించి ఏదో ఒక రోజున ఆయన తప్పక వస్తాడు, మనకొక క్రొత్త జీవితాన్ని ప్రసాదిస్తాడు, ప్రస్తుత పరిస్థితులకు ఒక పరిపూర్ణతను చేకూర్చుతాడు. ఏదో ఒక రోజున శాశ్వతత్వపు ద్వారాలు మూసి వుంచిన తన రహస్యస్థావరాన్ని వదిలి, తన సహాయానికై ఆక్రోశించే లోకంలోనికి, జీవితంలోనికి, భువిపైన అవతరిస్తాడు. జీవాత్మకు ముక్తిని ప్రసాదించే సత్యసంపదను, అంతరాత్మను సంప్రోక్షించి పవిత్రపరచే ఆనందాన్ని, చేయిజాచి అందించే దివ్యప్రేమ పరిపుష్టిని తప్పక ప్రసాదిస్తాడు. ఏదో ఒక రోజున తన దివ్యసౌందర్యాన్ని కప్పి వుంచి గుప్తపరచిన తెరను తొలగించి, దివ్యతేజంతోను, పరమానందంతోను అలరారుతున్న తన శరీరాన్ని దర్శింపజేసి, లోకం గుండెలలోని ప్రకంపనలను ఉపశమింపజేసే దివ్యానందాన్ని వర్షిస్తాడు."

సావిత్రి: 200

అనువాదం: అందుగులపాటి కైలాసపతి



మర్త్యలోకంలో అమృతత్వం
(ఇది ఇప్పటికీ సిద్ధించలేదు)

Botanical name: Helichrysum bracteatum

November 2016

Sun	Mon	Tue	Wed	Thu	Fri	Sat
		1	2	3	4	5
6	7	8	9	10	11	12
13	14	15	16	17	18	19
20	21	22	23	24	25	26
27	28	29	30			

(సత్యవంతుని ప్రాణాలను తీసుకొని తన లోకానికి వెళుతున్న మృత్యుదేవతను సావిత్రి అనుసరిస్తున్న సందర్భంలో, వారిద్దరి మధ్య జరిగిన సంవాదంలో ఒక ఘట్టం ఇది. సావిత్రి వ్యక్తపరచిన మనోభావాలను అవహేళన చేస్తూ మృత్యుదేవత అంటాడు: అమృతత్వం, ప్రేమ అనే కేవలం మానవ మనసులో జనించిన ఊహలే, రూపు దాల్చిన భావావేశాలు మాత్రమే. కాలగమనంలో అ క్రమక్రమంగా క్షీణించి చివరకు అంతరించే దైహిక వాంఛలు, వగైరా వగైరా. ఆ మాటలను ఖండిస్తూ సా వి్త్రి తన ప్రేమ దైహికమైన తృష్ణ కాదు, అదొక భగవత్ ప్రసాదం, దానిలో ఒక ఆశ, భవిష్యత్తుపై నమ్మకం వున్నాయి. అది కాలక్రమేణా అంతరించే భ్రాంతి కాదు, దివ్య సీమలనుండి విశుద్ధమై, శాశ్వతంగా, సజీవంగా అందించబడే దివ్యనాదం లాంటిది అని అంటూ, ఇంకా ఇలా అంటుంది. – అనువాదకుడు)

"ఏదో ఒక రోజున నేను దైవశక్తుల మారువేషాలను, భయం అనే తెరను తొలగిం చి నన్ను ఆచ్ఛాదించి వున్న పాపమనబడే వస్త్రాలను విడిచివైచి, గొప్పదైన నా మధుర ప్రపంచాన్ని తప్పక చూస్తాను."

"ఉపశమనం పొంది దివ్యమాత ముఖారవింద దర్శనార్థమై ఆమె దగ్గరికి తప్పక చేరుతాము. కపట మెరుగని మన అంతరాత్మలను ఆమె పరంగా విస్తూ ఆమె వడిలో సమర్పిస్తాము, అందుకోడానికి ఆతృత పడుతున్న ఆనంద పారవశ్యక స్థితిని పొందుతాము, చిరకాలంగా అన్వేషిస్తున్న దైవాన్ని దర్శించి మహదానందంతో పులకించి పోతాము. అపుడు స్వర్గసీమల్లో ప్రతిధ్వనిస్తున్న అనూహ్యమైన స్వరగతుల మాధుర్యాన్ని ఆస్వాదిస్తాము."

"అట్టి ఆశ్రయం పొందాలని ఆశించేది విశుద్ధ దైవశక్తులే కాదు, మచ్చలేని పవిత్రులైన దేవతలు సైతం దేనిని పొందలేకపోయారో దానిని, ఒకే మాతృహృదయం నుండి బయల్వెడలిన ఆగ్రహావేశాపరులు, అవివేకంతో అజ్ఞానాంధకార చీకట్లలో మ్రగ్గుతున్న దైవధిక్కారులు కూడా దానినే ఆశిస్తారు, వారు కూడా ఆశ్రయం పొందుతారు. ఒక దివ్యమాతృమూర్తి ప్రేమాస్పదమైన దృక్కులను వారిపై ప్రసరింపజేసి తన నెదిరించిన కుమారులపై అపేక్షతో చేజాచి పిలుస్తున్నది."

సావిత్రి:613   అనువాదం:అందుగులపాటి కైలాసపతి



అతిమానస కార్యక్రమం

అసమగ్రమే కాని సంపూర్ణమైన కార్యక్రమం

Botanical name: Barringtonia asiatica

December 2016

Sun	Mon	Tue	Wed	Thu	Fri	Sat
				1	2	3
4	5	6	7	8	9	10
11	12	13	14	15	16	17
18	19	20	21	22	23	24
25	26	27	28	29	30	31



(మృత్యుదేవత, సావిత్రుల సంవాదంలో చివరి ఘట్టమిది. అతిమానస ఆవిష్కరణతో లోకంలోను, ప్రతి జీవిలోను సంభవించే పరివర్తన గురించి సావిత్రి వివరించినప్పుడు మృత్యుదేవత ఆమెను ఉద్దేశించి: అతిమానసమనబడే దివ్యశక్తిని మర్త్యలోకానికికొని వచ్చి, దైవిక విలువలను అచ్చట ప్రతిష్ఠించగల శక్తి ఆమెకు ఉన్నట్లయితే ఆ శక్తిని ప్రదర్శించమని, అప్పుడు సత్యవంతుడి ప్రాణాన్ని తిరిగి ఇచ్చేస్తాను అంటాడు. అందుకు సావిత్రి బదులివ్వలేదు గాని ఆమెలో మహాశక్తివంతమైన రూపాంతరీకరణ సంభవించింది. దివ్యతేజంతో ఆమె దేహంతో పాటు పరిసరాలు కూడా వెలిగి పోయాయి. పరివర్తన చెందిన సావిత్రిలో దివి నుండి అవతరించిన మహాశక్తిని మృత్యుదేవత దర్శించింది. అప్పుడు ఆ మహాశక్తి, సావిత్రి ద్వారా, మృత్యువు నుద్దేశించి అన్న పలుకుల్లో అతి ముఖ్యమైన . – అనువాదకుడు)

“ఓ మృత్యుదేవతా, ఇంకొంత కాలం నా ఉపకరణంగా జీవించు, ఏదో ఒక రోజున మనిషి కూడా నిశ్చల నీరవతతో నిండిన నీ హృదయాన్ని, నీ మహా నిశీధి యొక్క ప్రశాంతతను, శాశ్వత ధర్మానికి కట్టుబడిన నీ అచంచల విధేయతను, ప్రశాంతమైన నీ చూపులోని అపార దయాగుణాన్ని తప్పక తెలుసుకుంటాడు. కానీ, ఓ కాలాతీత మహాశక్తీ, ప్రస్తుతానికి ప్రక్కకు తప్పుకో, అవతరించే దివ్యశక్తి దారికి అడ్డు తొలగు, దేదీప్యమానంగా ప్రకాశిస్తున్న దైవానికి నీ నల్లని ముసుగు నుండి ముక్తుడిని చేయి, సత్యవంతునిగా పిలవబడు విశ్వాంతరాత్మను విడుదల చేయి, తన జీవితానికి, తన విధికి తానే కర్తగా నుండుటకు, దైవసన్నిధిలో మానవ ప్రతినిధిగా వ్యవహరించుటకు, దివ్యజ్ఞానానికి సహచరుడిగా, నిత్య వధువుకు నిత్య వరుడిగా నిలుచుటకు వీలుగా అతనిని నీ బాధ, అజ్ఞానాల గట్టి పట్టు నుండి విడుదల గాంచు.”

సావిత్రి:666

అనువాదం: అందుగులపాటి కైలాసపతి



ప్రశ్న: నేను ఏకాగ్రతలో కూర్చొనుటకు (బొంబాయిలో) ప్రయత్నిస్తున్నాను, కానీ శ్రీమాతకు ప్రణామం ఆచరించుట తప్ప మరేమి చేయలేకపోతున్నాను. నే ననుసరిస్తున్న పద్ధతి సరైనదేనా?

సమా: అతను చేస్తున్నది సరైనదేనని వ్రాయండి. ప్రణామ మాచరించేటప్పుడు అతను శ్రీమాత ప్రభావమునకు, ఇంకా శ్రీమాత అతనిలో నిర్వహించు కార్యక్రమమునకు తెరుచుకొని వుండాలని ఆకాంక్షించాలి, ఆమె కార్యాచరణను గురించిన చేతన అతనిలో కలగాలి.

CWSA 32:566-67

అనువాదం: సునీత శేఖర్

దర్శన దినములలో

శ్రీఅరవిందులు దర్శన మిచ్చుటకు పూనుకొన్న దినములలో దర్శన మివ్వటానికి ముందుగా, వారు జనులకు ప్రసాదించ దలచిన కొన్ని శక్తుల లేక వారికి కలిగిన కొన్ని సాక్షాత్కార అనుభవాల కేంద్రీకరణ ఎల్లప్పుడూ చోటు చేసుకొనేది. అందువలన ప్రతి దర్శనము ప్రగతి పథంలో ఒక ముందడుగుకు సంకేతం. ప్రతిసారీ ఏదో ఒక్క క్రొత్త విషయం జోడించబడేది. అయితే అది అభ్యాగతుల సంఖ్య పరిమితంగా వున్న సందర్భాలలోనే జరిగేది, కాని ముందుగా చేసే ఏర్పాట్లలో భాగంగా నుండేది.

ప్రస్తుతం ఈ ప్రత్యేక కేంద్రీకరణ కేవలం దర్శనాల దినములకే పరిమితం గాక ఇతర సందర్భాలలో కూడా సంభ స్తున్నది, శీఘ్రతరమౌతున్నది కూడా. ఈ పురోగమన ప్రక్రియలో వివిధ దశలు ఒకదాని నొకటి మరింత వేగవంతంగా అనుసరిస్తుంటాయి. బహుశా ఈ వేగాన్ని అనుసరించడం కష్టం కావచ్చు. ఎవరైనా ఆ వేగానికి దీటుగా అనుసరించడానికి శ్రద్ధ కనబరచకపోతే, మునుపటికన్నా మరింత ఎక్కువగా వెనక పడిపోతాడు, తన పురోగతి ఆలస్యమవుతున్నదనో లేక తాను ఒంటరిగా వదలి వేయబడుతున్నాడేమో అన్న భావనకు లోనవుతాడు.

ప్రశ్న: కానీ, శ్రీమాతా, ప్రతి దర్శనానికి మీరిచ్చే సందేశంలో ప్రాధాన్యత ఏమిటి? ఉదాహరణకు, ఈ రోజు అతిమానస సాక్షాత్కారానికి చిహ్నమైన పుష్పం యొక్క చిత్రాన్ని మీరు ప్రకటించారు.

సమా: అవును, నేను ఇప్పుడే చెప్పినట్లుగా, ఇది ప్రపంచమంతటా వేలకొలది ప్రతుల ద్వారా వ్యాప్తి చేయబడుతున్నది. ఇది ఒక విషయానికి బాహ్యరూపం కల్పించడం లాంటిది, సందేశాన్ని దూరతీరాలకు విస్తరింపచేయడం. దర్శన దినాన ఇవ్వబడిన ప్రతి సందేశంలోని సారాంశం ముందుగానే అధ్యయనం చేయబడి, నిరూపించబడి, పరీక్షించబడుతుంది. మొదట ప్రయోగాత్మకంగా పరిశీలించబడి తరువాత బహిరంగం చేయబడుతుంది. ప్రప్రథమంగా చేపట్టే క్రియ వ్యక్తిగత అభివృద్ధికి ఉద్దేశించ బడింది, దర్శన సమయంలో అది దూరతీరాలకు సైతం అందించబడుతుంది.

శ్రీఅరవిందులు ఎల్లప్పుడూ రెండు కార్యక్రమాల గురించి ప్రస్తా

వించేవారు. ఒకటి, లక్ష్యాన్ని వ్యక్తిగతంగా చేరుకొనటానికై వ్యక్తిని సిద్ధపరచటం. రెండవది ప్రపంచాన్ని సిద్ధపరచటం.... ఎందుకనగా వ్యక్తి యొక్క అభివృద్ధి, చెప్పటానికి, సమిష్టి అభివృద్ధితో లంకెబడి వుండదు, అది దానికి ఏ విధంగాను ఆటంకమూ కాదు, సహాయకారి కాదు. కాని రెంటి మధ్యన ఒక సమతుల్యతను సమకూరుస్తుంది.

CWM 8:263

ఈ దర్శన సందర్భాలలో శ్రీఅరవిందుల ఆశీర్వాదం అందుకున్న ఆనందం పొందిన తరువాత, ఇతరులతో కలిసి మెలిసి మాట్లాడుతూ ఆ అనుభవాన్ని బహిరంగ పరచటానికి బదులు, ఆ ఆనందానుభూతిని ఏకాగ్రతతో అంతరంగంలోనే అణచుకొని వుంచుకొనుట శ్రేయస్కరం. మాటల్లో వెల్లడించిన అనుభవాలు గాలిలో కలిసిపోతాయి. అ మనకు అందించగలిగే ప్రయోజనం మనం కోల్పోతాము.

CWM 16:86-87

ప్రశ్న: మధురమయీ, ఏప్రియల్ 24 న దర్శనానికై నన్ను నేనెలా సంసిద్ధపరచు కోవాలి?

సమా: నీకు ఏది అతి ముఖ్యమైన విషయమో, ఏది లేనిదే నీవు ఏమి చేయటానికైనా అశక్తుడివో, దానిని కనుగొనటానికి నీవు జాగరూకతతో అంతర్ముఖంగా అన్వేషించాలి.

CWM 16:334

ప్రశ్న: మధురమయీ, దర్శన దినాలు, డిశంబరు 5, 9 మరియు ఒకరి జన్మదినము ఏ విధంగా గడపాలి?

సాధారణ జ్ఞానము కన్నా మిన్నయైన సత్యజ్ఞానాన్వేషణలో డిశంబరు 5, 9 దినాలు మృత్యువు అంటే ఏమిటో, జన్మదినం జీవితానికి ప్రయోజన మేమిటో, కనుగొనటంతో గడపాలి.

ఆశీర్వాదాలు

శ్రీమాత

అనువాదం: సునీత శేఖర్

దర్శనానికి కావలసిన సరైన వైఖరి

ఆగస్టు 15 వ తేదీ దర్శనానికి ఇంకా పది రోజులు మాత్రమే మిగిలాయని ఎవరో నాతో అన్నారు. ప్రతి రోజూ 15 వ తేదీగానే భావించాలని నేను జవాబిచ్చాను. అదే సరియైన వైఖరి. ప్రతి రోజూ ఒక అవరోహణ చోటు చేసుకుంటుందేమోనని లేదా ఉన్నతతర చైతన్యముతో సంబంధము నెలకొంటుందేమోనని ఆశించాలి. అపుడు 15 వ తేదీ దానికదే అత్యంత ఫలదాయక మవుతుంది.

*

ఇక ఆగస్టు 15 గురించి; దానిపై ఎక్కువ ఊనిక పెట్టవద్దు. అది వ్యక్తిగతమైన సందర్భము కాదు, సాధారణ సార్వజనీనమైనది ఎందుకనగా ఒక వ్యక్తికి ఏ దినమైనా ఆగస్టు 15 కావచ్చు, అనగా, అది అతని జన్మదినము కావచ్చు లేక అంతఃసత్తలో ఏదో ఒకటి ఉదయించిన దినం కావచ్చు. సాధన ఆ భావనతో జరగాలి.

CWSA 35:523

దర్శన దినము సమీపించే కొలదీ ప్రతికూల శక్తులన్నీ వాటంతటవే సమీకృతమై వ్యక్తిగత లేక సామూహిక దాడి చేయ సన్నద్ధమవుతాయి. ఆ దాడి లక్ష్యం వ్యక్తిగతంగా ఏ సత్ఫలితం అందుకోవలసి వుంటుందో, దానిని అందుకోనీయకుండా ఆటంక పరచటం, సర్వజన శ్రేయస్సుకై ఏది ఉన్నత స్తరాల నుండి క్రిందికి తీసుకు రాబడాలో దానిని నిరోధించడం. అంతేగాక, చాలా తరచుగా దర్శన దినం తరువాత ఒక తీవ్ర మైన దాడి చేయబడుతుంది. ఎందుకనగా ఆనాడు ఏ మంచి అయితే సంభవించిందో దానిని విఫలం చేయడానికి లేక ఆ మంచి మరింత అధికం గాకుండా ఆపడానికి. కాని, వ్యక్తికి సంబంధించినంత వరకు అతనికి ఆ దాడికి లోనుగావలసిన అవసరం లేదు. అతనికి అట్టి దాడి లక్షణం గురించి ఎరుక వున్నట్లయితే, దానిని అతడు ప్రతిఘటించి నెట్టివేయవచ్చు లేక దాని ఒత్తిడి తీవ్రతరమైతే, అతను తన సంకల్పశక్తిని, విశ్వాసాన్ని స్థిరంగా నిలుపుకోగలిగితే, అతను దివ్యశక్తికి మరింతగా ఉన్మీలుడు కాగలిగి, ఒక నూతన పురోగతిని సాధించగలిగి, ఆ తాత్కాలిక అడ్డంకి నుండి బయటపడ వచ్చు....

CWSA 35:525

తనను తాను ఏకాగ్రపరచుకొని, ప్రశాంతతను నిలుపుకొని శ్రీమాత ఏది ప్రసాదించినా దానిని స్వీకరించుటకు తెరుచుకొని వుండటం దర్శనానికి సరియైన మార్గము.

CWSA 32:569

అనువాదం: కవితా శ్రీధర్

శ్రీఅరవిందులు

నూతన సంవత్సర ప్రార్థన

ముందుగా తెలియనిది, ఊహించనిది, అగ్రాహ్యామైనది, ప్రతి క్షణం మన ముందు కాచుకొని వుంటుంది. సమస్త విశ్వము, అందులోని ప్రతి భాగము ఒక వినూత్న రీతిలో పునరుత్పన్న మవుతుంటుంది. మీరే సర్వ శక్త్యాత్మకులు, మీరే ఏకైక పరమ సత్యము అనే ఒక నిజమైన, నిర్ద్వంద్వమైన శ్వాసము మనలో ఉన్నట్లయితే, సమస్త విశ్వము మీ సాక్షాత్కారముతో పరివర్తన చెందుతుందనే యదార్థం ప్రతి క్షణం నిరూపించబడుతుంది. కానీ, మన చుట్టూ వున్న వాటన్నింటికి ఎంతగా బానిసల మయ్యామంటే, దృశ్యమాన లౌకిక విషయాల సంకలనకు ఎంతగా ప్రభావితుల మయ్యామంటే, భవిష్యత్తులో సంభవించబోయే అత్యద్భుత రూపాంతరీకరణకు, మన ప్రస్తుత స్థితికి మధ్య మధ్యవర్తిత్వం నెరపడానికి మన విశ్వాసం ఎంత నిస్సత్తువగా నుందంటే... కానీ, ప్రభూ, ఏదో ఒకనాడు అది ఆవిష్కృతమవుతుందని నాకు తెలుసు. ఏదో ఒక రోజున మన వద్దకు చేరేవారందరినీ మీరు రూపాంతరం చెందిస్తారనీ తెలుసు. వారిని ఎంత ఆమూలాగ్రం సంస్కరిస్తారంటే వారు గత బంధనాల నుండి పూర్తిగా విముక్తి పొంది మీలోనే ఒక నూతన జీవితాన్ని ప్రారంభించేటంతగా. ఆ జీవితం మీతోనే నిండి వుంటుంది, మీరే దానికి సార్వభౌములు. ఈ విధంగా ఆరాటాలు, పరితాపాలు అన్నీ ప్రశాంతమైనవిగా, సందేహాలన్నీ వాస్తవాలుగా, వికారమైనదంతా సామరస్య మైనదిగా, అహంకారమంతా ఆత్మార్పణగా, అంధకారమంతా వెలుగుగా, బాధలన్నీ అంతులేని ఆనందాలుగా సంస్కరించబడతాయి.

కానీ, మీరు ఇప్పటికే మనోరంజకమైన ఈ మహాద్భుత పరివర్తన నిర్వహించటం లేదా? మా చుట్టూరా అది పుష్పించి వికసించడం నేను చూస్తున్నాను!

ఓ ప్రేమ సౌందర్యాల దివ్యసూత్రమా, సర్వోత్కృష్ట ముక్తిప్రదాతా, మీ శక్తిసామర్థ్యాలకు అడ్డు నిలిచేది ఏదీ లేదు. స్వయంగా మా అంధత్వమే ఓదార్పు నిచ్చే మీ నిరంతర జయ పరంపర దృశ్యాన్ని గాంచనీయటం లేదు.

నా హృదయం ఒక ఆనందభరిత గీతం ఆలపిస్తున్నది, నా మనోభావన ఆనందోద్వాహంతో దీప్తిమంత మవుతున్నది.

మహోన్నతము, అత్యాశ్చర్యకరమైన మీ దివ్యప్రేమ ప్రపంచముపై సార్వభౌమాధికారం కలిగి వుంటుంది.

CWM 1:54-55

శ్రీమాత

అనువాదం: కవితా శ్రీధర్

2016 సంవత్సరములో ముఖ్య దినములు

జనవరి 1	:	నూతన సంవత్సర శుభాకాంక్షలు. నూతన సంవత్సరారంభ దినము
ఫిబ్రవరి 21	:	శ్రీమాత 138 వ జన్మదినము
ఫిబ్రవరి 28	:	ఆరోవిల్ 46 వ జన్మదినము
ఫిబ్రవరి 29	:	అతిమానస అవతరణ యొక్క (ప్రతి నాలుగు వర్షముల) 15 వ వార్షికోత్సవము.
మార్చి 29	:	శ్రీమాత మొదటిసారి పాండిచ్చేరికి వచ్చిన దినము మరియు శ్రీఅరవిందులతో ఆమె ప్రథమ సమావేశము జరిగిన 102 వ వార్షికోత్సవము
ఏప్రియల్ 4	:	శ్రీఅరవిందులు పాండిచ్చేరికి చేరుకున్న రోజు 106 వ వార్షికోత్సవము.
ఏప్రియల్ 24	:	శ్రీమాత పాండిచ్చేరిలో శాశ్వత నివాసము ఏర్పరుచుకొనుటకు వచ్చిన 96 వ వార్షికోత్సవము
ఆగష్టు 15	:	శ్రీఅరవిందుల 144 వ జన్మదినము
సెప్టెంబరు 19	:	శ్రీఅరవింద సొసైటీ 56 వ వార్షికోత్సవము.
నవంబరు 17	:	శ్రీమాత మహా సమాధి దినము
నవంబరు 20	:	శ్రీమాత శరీరము సమాధి చేయబడిన దినము
నవంబరు 24	:	సిద్ధి దినము, భౌతికంలోకి శ్రీకృష్ణ చైతన్యము అవరోహించిన దినము. 1926 లో ఆశ్రమము ఏర్పాటు చేసిన రోజు.
డిశంబరు 2	:	క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల వార్షిక దినోత్సవం
డిశంబరు 5	:	శ్రీఅరవిందుల మహాసమాధి దినము
డిశంబరు 9	:	శ్రీఅరవిందుల దేహము సమాధి చేయబడిన దినము

2016 ఫిబ్రవరి 29 ప్రత్యేకమైన దర్శన దినము — అతిమానసిక శక్తి ఆవిర్భావము


పరివర్తన చెందే దశలు

(నూతన మార్గ విద్వేషనము)

అఖిల

అఖిల భారత పత్రిక
ఫిబ్రవరి 2016

విషయసూచిక



"ఒక గొప్ప ముగింపు నీ కెక్కడ కన్పించినా, దానికి ఒక గొప్ప ప్రారంభం వుండి తీరుతుంది. ఒక అమానుషమైన, బాధాకరమైన విధ్వంసం జరుగుతుందని నీ మనస్సు యెప్పుడు భయపడితే అప్పుడు ఒక విశాల మహనీయ సృష్టి తప్పక జరుగుతుందని చెప్పి దానిని ఓదార్చు. భగవంతుడు ఒక వినపడని స్వరంలో మాత్రమే కాదు, అగ్నిలో, సుడిగాలిలో కూడా వున్నాడు.

"విధ్వంసం యెంత గొప్పదైతే సృష్టి వికాసానికి స్వేచ్ఛామయమైన అవకాశాలు అంత అధికంగా వుంటాయి. కాని తరచుగా విధ్వంసం యెక్కువ కాలం జరుగుతుంది నెమ్మదిగా, సర్వాన్నీ అణచివేస్తూ జరుగుతుంటుంది. సృష్టి రాక నిదానంగా వుంటుంది లేక దాని విజయయాత్ర భంగపాట్లతో కూడి వుంటుది. రేయి మళ్ళీ మళ్ళీ వస్తుంటుంది, పగలు తచ్చట్లాడుతుంటుంది, లేక అయథార్థ సూర్యోదయం అని కూడా అన్పించవచ్చు. అలా అని నిస్పృహ చెందకుండా గమనిస్తూ, పని చేసుకుంటూ పోతుండాలి.

"ఏ కారణం నిమిత్తం భగవంతుడు తన ప్రపంచం మీద భయంకరంగా సుత్తిదెబ్బలు కొడ్తుంటాడు, దానిని అణగద్రొక్కుతుంటాడు, పిండిముద్దలా చేసి, ప్రపంచాన్ని కలియబెడ్తూ పిసుకుతుంటాడు, సాధారణంగా రక్తమడుగు లోనికి. యెర్రని కొలిమి నరకతాపం లోకి దీనిని విసరివేస్తుంటాడు? ఎందుకనంటే జన బాహుళ్యంలో మానవత్వం యింకా ఒక కఠిన, మొరటైన, అయోగ్యమైన ముడి ఖనిజం లాగానే వుంది. అలా చేయకపోతే ఆ ఖనిజాన్ని కరగించి దానికి ఆకారాన్నివ్వ వీలుపడదు. అతని పదార్థాన్ని బట్టే, భగవంతుడు పనిచేసే విధానముంటుంది. ఒక ఉదాత్తమైన, పరిశుద్ధమైన, వానిగా తనను తాను మార్చుకొనేందుకు, తనకు తానే సహాయం చేసుకోనిద్దాం. దానితో ఆయన పనిచేసే విధానాలు, సామ్యంగా, మధురాతిమధురంగా, అత్యంత హుందాగా వుంటాము, దాని ఉపయోగాలు అనుకూలమైనవిగా వుంటాయి.

SABCL 16:392-93 — శ్రీఅరవిందులు

భావానువాదం: కె. వి. రావు

పరివర్తన దశలు
(నూతన విధాన నిర్దేశనము)

సంపాదకీయం

మనలను 1971 లోనే శ్రీమాత ఈ విధంగా హెచ్చరించారు: "ఆ పాత పునాదులు కదలించబడి, ఒక తీవ్ర గందరగోళ పరిస్థితి నెలకొనివున్న 'దివ్య ఘడియలు' అనబడు ఒక దశలో మన మున్నాము. అయితే పురోగమన సాధనలో ముందుకు దూసుకెళ్ళాలనుకునే వారికి ఇది ఒక అద్భుతమైన అవకాశం, పురోగతికి ఒక అసాధారణ సంభావ్యత". నిజానికి ఇవి సంక్షుభిత సమయాలు లేక, ఒక విధంగా, పరివర్తన చోటు చేసుకొనే దశలు. అందుకు కారణం 1956 లో అతిమానస ఆవిష్కరణ జరిగినప్పటి నుండి మానవజాతి ఈ నూతన దివ్య చైతన్య వత్తిడితో అధికంగా ప్రభావిత మవుతున్నది. ఈ వత్తిడి ఒక అసాధారణ రీతిలో అధికమవుతూ మానవజాతి జీవన విధానాలను దివ్యజీవన తరహాలో మార్పు చెందుటకు ప్రోత్సహిస్తున్నది. కొంగ్రొత్త కోర్కెలు జాతి మనసులను కదిపివేస్తున్నవి,, మానవ అజ్ఞానాంధకార నిశీధిలో నిగూఢంగా క్రొత్త ఆశలు అంకురిస్తున్నవి. అయినప్పటికీ ఆ మహా నిశీధి ఇంకా అంతరించ లేదు. పౌరాణిక కాలం నాటి అగ్నిజ్వాలలు గ్రక్కే భీకరమైన మొసలి లాంటి జంతువు కొన ఊపిరితో అల్లల్లాడుతూ తన తోకను తీవ్రంగా అటూ ఇటూ విదిలించినట్లుగా, లోకం యొక్క పాత పోకడలు ఇంకా మార్పును ప్రతిఘటిస్తున్నవి. కొత్త పోకడలు ఇంకా బాల్యావస్థలోనే వున్నా మన చేతనలో కనపడని పగుళ్ళ ద్వారా తెలియుకుండానే నెమ్మదిగానైనా దృఢంగా ప్రవేశిస్తున్నాయి. శ్రీమాత 138 వ వార్షికోత్సవ జన్మదినోత్సవమును మరియు అతిమానస అవరోహణ యొక్క 15 వ వార్షికోత్సవమును పురస్కరించుకొని, శ్రీమాతకు అంకితముగా విడుదలైన సంచికలో, శ్రీమాతారవిందుల తపస్సు ద్వారా ప్రతిపాదించబడి, సఫలీకృతం కాబోతున్న మార్పునకు సంబంధించిన కొన్ని విధానాలు ప్రత్యేకంగా ఉటంకించబడ్డాయి.

ఈ మాసాని కున్న విశిష్టత అపారమైనప్పటికీ, శ్రీమాత 1958 ఫిబ్రవరి 21 న తమ 80 వ జన్మదినం, అనగా 1956 ఫిబ్రవరి 29 నాటి అతిమానస సాక్షాత్కారం జరిగి రెండు సంవత్సరాలు నిండిన సందర్భంగా ఇచ్చిన ఈ

సందేశాన్ని జ్ఞప్తికి తెచ్చుకోవడం ప్రయోజనకరం కావచ్చు:

"మార్పు చోటు చేసుకొనుటలో సంభవించే అల్పకాల వ్యవస్థ ఆవిర్భావాన్ని కొనియాడటం, కొన్ని విశ్వసనీయ భావాలను సంతృప్తిపరచ వచ్చు.

శాశ్వతమైన దివ్యచైతన్య సాక్షాత్కారాన్ని కొనియాడటం, విశ్వచరిత్రలో ప్రతి క్షణం చేయవచ్చు.

కాని, ఒక క్రొత్త ప్రపంచ అవతరణను, అతిమానస ప్రపంచ ఆగమనాన్ని కొనియాడటం, మనకు సంక్రమించిన ఆత్యాశ్చర్యకరమైన, అపురూపమైన హక్కు."

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

దివ్య ఘడియలు

నూతన ప్రపంచపు పురిటి నొప్పులు

అంతా ఆధారపడుతుంది, దైవంపై, కాలంపై, దాని అత్యవసర ధ్యేయంపై. అందుచే, ఈ అత్యవసర ధ్యేయంపై దృష్టి పెట్టుట అతి ముఖ్యం — మన సొంత మిడిమిడి జ్ఞానాన్ని అంటి పెట్టుకోవడం కంటే. కాలపురుషుడు, మృత్యు దేవత ఈ భయంకరమైన పని చేయడానికి, ప్రపంచాన్ని అధికంగా నాశనం చేయడానికి ముందుకు వచ్చాడు. అతని వలన కలిగే మహాభీతిని, ఆ ప్రభావాన్ని ఎవరు తట్టుకొనగలరు? అతను చేస్తున్నది ప్రస్తుత ప్రపంచాన్ని కూల్చడమే కాక రాబోయే ప్రపంచాన్ని సృష్టించడం కూడా. అందువలన ప్రపంచాన్ని నాశనం చేస్తున్నాడే అని దానిని అక్కున చేర్చుకొని రోదించుటకన్నా అతను నిర్మించబో తున్నదానిని కనిపెట్టి అందుకు తోడ్పడటం లాభదాయకం. కాని అతని గమనం ఏ దిశగా సాగుతుందో గ్రహించడం చాలా కష్టం. అదీ గాక, మన వైఖరి ఎల్ల ప్పుడూ, తాత్కాలిక నిర్మాణాలు ఏవైతే కేవలం యుద్ధభూమిలో సైనిక శిబిరాల వంటివో వాటినే భవిష్యత్ శాశ్వత భవనాలని భ్రమించి మెచ్చుకునే విధంగా నుంటుంది. సత్యాన్ని పాటించడంలోను, కలిని పాటించడంలోను తేడా ఉన్నదని పండితులు చెప్పడంలో సత్యమున్నది. కాని ఈ విజ్ఞానాన్ని అమలుచేయడంలో

వారు విజ్ఞత లేదా విజ్ఞానం కలవారుగా కనబడుట లేదు. వారు మరిచారు లేదా వారికి తెలియదు. ఇది కలి వినాశనానికి, పునర్జన్మకు కాలమని, ఇక ఎంత మాత్రం రక్షింప వీలుగాని గతానికి నిరాశ నిస్పృహలతో అంటిపెట్టుకుని ఉండే కాలం ఇది కాదని. వారిని వారు బంధించుకుంటారు. అది కలి వర్జించే పద్ధతి అని. వారు మరుస్తారు, కలి విడిచిపెట్టేది కేవలం గత ప్రపంచం యొక్క బలము, సామర స్యాన్ని కాని, దాని బలహీనతను కాదని, కలి మిగిల్చేది కేవలం మార్పు అనే సముద్రపు ఒడ్డున, స్థిర నివాసం కొరకు కట్టబడే ఒక తాత్కాలిక భూమికను మాత్ర మేనని. ఇది కూడ, ఏదో ఒక రోజున, సముద్రతరంగముల ధాటికి ముక్కలై అదృశ్యం కావలసిందే. అట్టి వినాశకాలం వచ్చిందా? వచ్చిందనే అనుకుందాం: వినండి, ఢీ కొడుతున్న ఆ జలాల భయంకర నాదం, దాడి జరిగే సందర్భాలలో వెలువడే శబ్దాలకన్నా అతిభయంకర నాదం. గమనించండి, నీరసంగా, విషణ్ణంగా, పశ్చాత్తాపరహితంగా, నిస్సత్తువ కలిగిస్తున్న ఆ జలాల వెల్లువ. ఒక పద్ధతి లేకుండా, ఒకదాని తరువాత మరియొకటి, బీటలు వారుతూ, పునాదులు కోర బడుతూ, కూలిపోతూ ఆ కట్టడాలు; నిశ్శబ్దంగా, ప్రవాహ చప్పుళ్ళలో, కదిలి పోతూ, ముక్కలవుతూ, మునిగిపోతున్న ఆ కట్టడాలు. ఎగసిపడే కెరటాల కింద నురగలో కలిసిపోతున్న ఆ కట్టడాలు. నూతన నిర్మాణాలకు సమయం వచ్చిందా? వచ్చిందనే చెప్పాలి. గమనించండి — వేగంగా, ఆతృతతో, ఇటూ అటూ తిరిగే మానవజాతిని; భవిష్యత్తుకై వారి అన్వేషణ, శోధన; ఒకదాని వెంట మరియొకటి తొందర తొందరగా వచ్చే అవతారాలు, వాటి విభూతులు. ఇవన్నీ చిహ్నాలు కావాలి; ఇవి చెప్పటం లేదా, అన్నిటి కంటె గొప్ప అవతార మొకటి వస్తున్నదని, కలియొక్క మొదటి సత్యయుగ స్థాపనకు.

మొదటిసారి విరుచుకు పడుతున్న నవ ఉషస్సు

కలి యొక్క మొదటి ఐదువేల సంవత్సరాలు గడిచిపోయాయి. సనాతన సత్యయుగపు అవశేషాలను చివరిసారిగా నాశనం చేయడానికి ఈ సమయం ఆవసరమైంది. బలహీనత, హింస, తప్పు, అజ్ఞానం, మరుపు పెరుగుతున్న లయలో, వేగంతో దూసుకుపోతున్నాయి — ఇవి చేశాయి మనకు ఆ పనిని. మొదటి సత్యయుగపు ఉషస్సు విరుచుకు పడడానికి సిద్ధంగా ఉన్నది. మనక

చీకటిలో మొదటి వెలుగుచారలు కనబడుతున్నాయి.

అవును. ఇది ఒక కొత్త సామరస్యం. కాని మూసపోసిన యూరపు పదార్థ వాదం కాదు. అర్థసత్యం, అబద్ధాలపై నిర్మింపబడ్డ పునాది కాదు. నశించేది రూపమే గాని హృదయం కాదు. ఎందుకంటే ప్రపంచం దాని పద్ధతులు, ఒకే పరమసత్యం యొక్క రూపాలు మాత్రమే. ఈ భౌతికప్రపంచంలో పరమ సత్యం నిరంతరం అనేక శరీరాలను, దుస్తులను ధరిస్తూ ఉంటుంది. ఈ మార్పు లన్నిటిని ఆ సనాతనుడు, అంతర్యామి ఆనందిస్తూ ఉంటాడు. చనిపోయిన సత్యయుగపు సత్యం, జన్మించబోయే నవ సత్యయుగపు పరమ సత్యం కంటె భిన్నం కాదు. ఎందుకంటే సత్యం ఎల్లప్పుడు, తనను తాను పునఃస్థాపించుకొని, కొనసాగుతూ ఉంటుంది.

భారతావని ఎంపిక చేయబడ్డ భూమి. ఇక్కడ సత్యం దాచపడి ఉంటుంది. దాని హృదయంలో అది నిద్రిస్తుంది — ఆత్మవికాసానికి ఎదురు చూస్తూ. భారత దేశ ఆత్మ సింహం వంటిది. కాంతివంతమైన దాని తీవి దర్పాలు దాని బలహీన తల్లో లేవు, దాని అసహ్యాకరమైన మారుతూ ఉన్న, దాని బాహ్యాల్లో లేవు. అవి పదిలపర్చబడి ఉన్నాయి, భద్రంగా దాని సనాతన, శక్తివంతమైన, జ్ఞాననేత్రాలపు ముకుళిత రేకులలో. భారతదేశం మాత్రమే మానవాళి భవితను నిర్మించగలదు, భారతావనిలోనే సమర్థమైన అవతారం జన్మించగలదు. దేశాలన్నింటినీ ఉద్ధరించ గలదు, తన ధూళిదూసరిత పరిసరాల నుండి దిగజారుడుతనం నుండి, — ముక్కలయి చిహ్నాలుగా మిగిలి యున్న సత్యయుగపు అవశేషాల నుండి, తనను తాను పోగు చేసుకోవాలి, యోగమార్గం ద్వారా. తన ఆత్మలో సంబంధాలు పునరుద్ధరించుకోవాలి, తన భవిష్యత్తును, గతాన్ని తెలుసుకోడానికి

CWSA 12:52 శ్రీఅరవిందులు

విప్లవాత్మక మార్పులకు ఇది సమయం

ఇది స్పష్టం — మేల్కొంటున్నది భవిష్యత్తే; అదే ప్రయత్నిస్తున్నది గతాన్ని దూరంగా తరిమివేయడానికి.

ఉదాహరణకు, విద్యార్థులు, శ్రామికులు, చేతులు కలుపుతున్నారు. సహజం గానే బుద్ధిస్తరంలో అనేక రకాల విప్లవ భావాలు కలగూరగంపలా, కలగాపులగంలా

ఉన్నాయి. విద్యార్థులు పరీక్షా విధానాన్ని వ్యతిరేకిస్తున్నారు, అసలు పరీక్షలే వద్దంటున్నారు. వారికే తెలియదు, వారొక అజ్ఞాతశక్తిచే ప్రేరేపింపబడుతున్నా రని. అది కోరుతున్నది — అధికతర సత్యం అభివ్యక్తమవాలని.

ఒక అధికతర దివ్యశక్తి బలవంతం చేస్తోంది జనాన్ని, వారు తప్పనిసరిగా ఏమి చేయాలో — దానినే చేయమని.

దాని వివరాలలో కాక, దిశలో, ప్రజా ఉద్యమ దిశలో — ఇది స్పష్టం. గతానికి స్వస్తి పలికి భవిష్యత్తుకు తలుపులు తెరవాలని.

ఇది ఒక మందకొడిగా సాగే భావ పరివర్తన వర్తన లాంటిది. ఎదుటనే ఉన్నది ఏమిటో, దానికై తహతహ, వెంపర్లాట. కాని నిజంగా ఏదో ఒకటి ఉన్నది. అదే దాని సౌందర్యం, అక్కడ ఒక మహాసంచలనం వున్నది. ఒక మహాశక్తి తనకు తానుగా అభివ్యక్త మవాలనుకుంటున్నది.

శ్రీమాత: ఒక శిష్యునితో సంభాషణలు మే 22, 1968

మనకేదో బోధించాలని తబ్బిబ్బుపడే పరిస్థితి వున్నది

చివరకు నేనొక నిర్ధారణకు వచ్చాను. దేనిని మనకు బోధించాలి అనే విషయంలో గందరగోళం ఉన్నది అని; దైనందిన జీవితం ఎలా గడపాలని. అంటే మనకు ఏమి జరగబోతోంది భవిష్యత్తులో అనే దానిపై కాకుండా, మనం ఏం చేయవలసి ఉంది నిత్యజీవితంలో అనే విషయంపై ఎక్కువ దృష్టి పెట్టాలని, అన్ని ఆలోచనలు, ముందస్తు ప్రణాళికలు, ఏర్పాట్లు — అన్నీ ఇంకా ఎక్కువ గందరగోళానికి అనుకూలంగా ఉంటాయి.

అట్టి అస్తవ్యస్త పరిస్థితి ఎదురౌతున్నదని దృష్టికి వచ్చినపుడు, నీవు చేయ వలసింది ఒక్కటే. వీటిని పర్యవేష్టించివున్న ఒకే ఒక్క దివ్యచైతన్యం, దివ్యశక్తి, దివ్యసత్తా, మహా ఐక్యతలో ప్రవేశించుట. అంతా జరుగుతున్నది ఈ ఒకే మహా ఐక్యతలో. ఇతర విజ్ఞానాలు, తీర్పులు, తెలివితేటలు ఏవీ లెక్కలోనికి రావు. వీటన్నింటిని పర్యవేష్టించివున్న దివ్యచైతన్యంతో పోలిస్తే ఇవి అణుమాత్రం. ఏ ఒక్కరికైనా ఏమాత్రం తర్కజ్ఞానం ఉన్నా, ఇన్ని విభిన్న వ్యక్తిత్వాలు ఎందుకు ఉన్నాయని, అవి కేవలం వారిలో ఆకాంక్ష, సమర్పణ భావము, నమ్మకము, విధేయత, ఈ ఐక్యతపై ఈ ఐక్యసత్తాపై కల్గించుటకేనని తెలుసుకోగలరు. విభిన్న

వ్యక్తులు, వ్యక్తిత్వాల అస్తిత్వానికి కారణమిదే. అంతే గాక, నీవు మనస్ఫూర్తిగా, తీవ్ర ఆకాంక్షతో నీవు 'అది' గా అవాలని. అదొక్కటే, ఒక్కటే — నీకు నిలిచేది అదొక్కటే. మిగిలినదంతా ఒక కనికట్టు దర్శనం.

తీవ్రమైనవి మరింత తీవ్రతరమయినాయి.

నేనిదివరకే చెప్పాననుకుంటాను; ఏ పదార్థసంబంధం లేనిదైనప్పటికీ ఎక్కువ బరువుగా ఉన్న ఒక స్వర్ణమయ మహాశక్తి ఎంతో బలంగా భౌతికాన్ని క్రిందకు అదుముతున్నది. అది భౌతికాన్ని — దాని అంతరంగంలో దైవము వైపు తిరిగి ఉండమని వత్తిడి చేస్తోంది. (క్రిందకు అదుముతున్న సంజ్ఞ). బయటకు తప్పించు కుపొమ్మని కాదు. (ఊర్ధ్వముఖంగా సంజ్ఞ) అందుకు ఫలితమేమంటే, సంక్షో భాలు అనివార్యం కావచ్చు అని. అదే సమయంలో దానికి సమయోచిత పరిష్కా రాలు కూడ ఉంటాయి. వీటి ననుసరించి సంభవించే సంఘటనలు వాటికవే మహా ద్భుతాలు. ఇదెలా ఉందంటే, రెండు తీవ్ర పరిస్థితులు మరింత తీవ్రతరమయి నట్టు — ఏది మంచో, అది ఇంకా మంచిగా, ఏది చెడో, అది మరింత చెడ్డగా అయినట్టు. ఒక భయంకర శక్తి ప్రపంచాన్ని క్రిందకు అదిమినపుడు ఇలా అవు తుందని నా అభిప్రాయం.

అవును. ఆ విధమైన అనుభూతి కలిగింది. ఈ పరిస్థితిలో సాధారణంగా ఉదాసీనంగా జరిగే పనులు మరింత క్లిష్టతరమవుతాయి, పరిస్థితులు, వైరు ధ్యాలు తీవ్రమౌతాయి. అసాధరణ అద్భుతాలు జరుగుతాయి, చనిపోతున్న వారు రక్షింపబడతారు, ఆకస్మికంగా పరిస్థితులన్నీ చక్కదిద్దబడుతాయి

వ్యక్తుల విషయంలోనూ ఇదే పరిస్థితి. ఎలా అంతర్ముఖులు కావాలో తెలిసిన వ్యక్తులు, ఎవరు మనస్ఫూర్తిగా పిలుస్తారో దైవాన్ని, ఎవరు అదొక్కటే శరణ్యమని తలుస్తారో, అదొక్కటే బయటపడే మార్గమని అనుకుంటారో, ఎవరు తమని తాము సమర్పించుకుంటారో దైవానికి, వారికి, క్షణాలలోనే అద్భుతాలు జరుగు తాయి. చిన్న పెద్ద తేడా లేదు. ముఖ్యమైనవి, ముఖ్యం కానివంటూ లేవు. అంతా ఒక్కటే. విలువలు మారుతాయి. ప్రపంచ దర్శనమే మారినట్లుంటుంది.

విలువలు పెరిగాయి

ఇది అతిమానస అవతరణ వల్ల ప్రపంచంలో కలిగే మార్పులపై ఒక అవగాహన కలగటానికి సూచిక. తటస్థంగా ఉండేవి పరిపూర్ణమౌతాయి. చిన్న తప్పులకు, మితిమీరిన పరిణామాలుంటాయి, ఒక చిన్న నిజమైన ఆకాంక్షకు, ఒక స్వల్ప నిజాయితీకి అద్భుత ఫలితాలొస్తాయి. మనుషుల్లో విలువలు పెరిగాయి. భౌతికపరమైన దృక్కోణంలో కూడా అతిచిన్న పొరపాటుకు అత్యధికతర పర్యవసానాలు కలుగుతాయి. ఆకాంక్ష అత్యల్పమైన నిజాయితీతో కూడినదైనప్పటికీ, అద్భుతమైన ఫలితాలు దక్కుతాయి. విలువలు పెరిగాయి, నికరమైనాయి.

ప్రపంచం చేతనాపూర్వక ఔన్నత్యం సాధించాలనే దృష్టితో ప్రతి విషయం సంకల్పించబడింది. చైతన్యం దివ్యతరమగుటకు సంసిద్ధమౌతోంది. ఇది పరమ సత్యం. మనం తప్పుగా భావించేది అంతా సాధారణ మానవ భావన మాత్రమే సంపూర్ణంగా.

మనం అతిమానసం అని పిలిచేది, సృష్టిని ఉన్నతమైన దివ్యశక్తికి అధికంగా ప్రభావిత మయేటట్లు చేస్తుంది. మన లోకజ్ఞానం, తర్కం, క్రియాశీలత, అంతా నిరుపయోగం, నిష్ప్రయోజనం. వీటి కెంతమాత్రం బలం, అస్తిత్వం లేదు. ఇప్పుడు 'ఉన్న' దానితో వాటికి ఏమాత్రం సంబంధం లేదు. నిజంగా ఇది ఒక నవ్య ప్రపంచం.

శ్రీమాత

ప్రశ్న: 1919 లో శ్రీఅరవిందులు వ్రాశారు, ఈ సంక్షోభంలు, వైపరీత్యాలు, బహుశా కొత్త సృష్టి యొక్క పురిటినొప్పులు కావచ్చును అని. ఇవి ఎంతవరకు కొనసాగుతాయి — ఈ ఆశ్రమంలో, ఇండియాలో, ప్రపంచంలో?

సమా: కొత్త సృష్టికి ప్రపంచం ఇష్టపడి, సంసిద్ధమై, స్వాగతం పలికే దాకా. కొత్త సృష్టి యొక్క చైతన్యం అప్పుడే భూమిపై పనిచేస్తోంది, ఈ సంవత్సర ప్రారంభం నుండి (1919). దీనిని నిరోధించే బదులు, ప్రజలు దీనికి సహకరిస్తే, ఆ పని ఇంకా త్వరగా జరుగుతుంది. కాని మూర్ఖత్వం, అజ్ఞానం, చాలా మొండివి కదా!

CWM 15:106 అనువాదం: యస్. వై. సోమయాజులు

ఆధ్యాత్మికమైన సమాజ లక్ష్యం: పరిధి:

ఒక ఆధ్యాత్మిక సమాజం, తన ఆధ్యాత్మిక వ్యక్తులలాగా అహంలో గాకుండా, ఆత్మలో నివసిస్తుంది. సమిష్టి అహంలో గాకుండా సమిష్టి అంతరాత్మగా నివసిస్తుంది. అహంకారిక దృక్పథం నుండి స్వేచ్ఛ కలిగి వుండడం దాని ప్రప్రథమ అత్యంత సహజ లక్షణం అవుతుంది. సమాజ అహంకారమనే, ఆ నిరాకార అతి పెద్ద శిలాప్రతిమ బలిపీఠంపై ఆతని అంతరాత్మను, పురాతన యజ్ఞంలోని ఒక బలి పశువులా తోలుకుపోతుండే సమష్టి సంకల్పానికి, లక్ష్యాలకు, సమాజ అహంకారానికి, అతడు యెంతో కష్టపడి సంపాదించుకొన్న విలువైన వ్యక్తిత్వాన్ని, అతని వ్యక్తిగత సంకల్పాన్ని ఆహుతి చేసేందుకు ఆతనిని అంగీకరింపజేయటం ద్వారా, లేక అందుకు ఆతనిపై వత్తిడి కలిగించడం ద్వారా, యిప్పుడు మనం చేయాలనుకొంటున్న విధంగా అహంకార నాశనాన్ని చేయవద్దు. చేస్తే అది అల్ప అహంకారాన్ని పెద్ద అహంకారానికి, అందరి అహంకారాలు కలిసిన ఫలితంగా తయారైన ఒక పెద్ద రాశిలాంటి అహంకారానికి బలిచేసినట్లవుతుంది. ఆ పెద్ద రాశిలాంటి అహంకారం గుణంలో ఉత్తమమైనదై, విశాలమైనదై, ఉదాత్తమైనదై వుండదు, ఉండకపోగా వ్యక్తిగత అహంకారం కన్న లోపభూయిష్టమైన, తరచుగా అసహ్యకరమైన, అత్యంత అనాగరిక ఆదిమజాతి నిర్జీవ శిలారూప దేవత కన్న క్షుద్రమైన దేవతారాధనగా అవుతుంది. సర్వమందు ఒకటిగా వున్న, ప్రతిదానిలోను పరిపూర్ణంగా, సంపూర్ణంగా వున్నదానిలో నివసించడం ద్వారా, దాని పరిపూర్ణ ప్రతిరూపంగా యెదగడానికి — ఆతని స్వభావం, దాని సచేతన పరిధి, సర్వాలింగక విశ్వజనీనమైనదైనప్పటికీ అది వ్యక్తిగతమైనదేననే విషయాన్ని యిక్కడ గుర్తు పెట్టుకోవాలి — ఆధ్యాత్మిక మానవుడు తన అహాన్ని కోల్పోవడానికి, ఆత్మను కనుగొనడానికై చూస్తుంటాడు.

*

ఆధ్యాత్మిక సమాజం తనకున్న పరిధిలో సమస్త జ్ఞానాన్ని ఆకళింపు జేసుకొంటుంది. కాని మొత్తం ధోరణిని, లక్ష్యాన్ని, వ్యాపకశక్తిని కేవలం ప్రాపంచక సామర్థ్యం — ఆ సామర్థ్యం అలక్ష్యం చేయగూడనిదైనప్పటికీ — కొరకు మాత్రమే

గాక, స్వీయాభివృద్ధి, ఆత్మాన్వేషణ, యితర సమస్తమైనవాటిని తన శక్తులుగా తయారు చేసుకొంటుంది. అది భౌతిక, అంతరాత్మిక, విజ్ఞాన శాస్త్రాధ్యయనాలను, ప్రపంచాన్ని, ప్రకృతిని వాటి ప్రక్రియలతో సహా కేవలం తెలుసుకోవడానికే గాక వాటిని భౌతిక మానవ అవసరాలకు వుపయోగించడానికి, యింకా చెప్పాలంటే అన్నింటి ద్వారా, అన్నింటిలోనూ, అన్నింటి క్రిందా, అన్నింటిపైనా అతిశయించి వున్న దైవాన్ని , ప్రపంచంలోనూ వున్న దైవాన్ని దాని ముసుగులలోనూ, వెనుక వున్న ఆత్మ పనిచేసే విధానాలను తెలుసుకొని ఉపయోగించడానికి అది భౌతిక, అంతరాత్మిక విజ్ఞానశాస్త్రాల అధ్యయనాన్ని కొనసాగిస్తుంది. అది సాంఘిక ధర్మాన్ని బలోపేతం చేసే లేదా దానిని పాక్షికంగా సరిచేసి, కర్మ నియమంగా ప్రతిష్ఠించడం కోసం గాకుండా నైతికతా లక్ష్యంగా చేస్తుంది. సాంఘిక ధర్మం అనేది కేవలం ఒక నియమం మాత్రమే, తరచుగా అది అస్తవ్యస్తంగా, అజ్ఞానయుతంగా, ద్వంద్వంగా వుంటుంది, మానవ సముదాయానికి సంబంధించినదిగా వుంటుంది, కాని మానవునిలో దివ్యస్వభావాన్ని అభివృద్ధి చేయడాని కుద్దేశించినదై వుంటుంది. కేవలం అంతరంగానికి, బాహ్యానికి సంబంధించిన ప్రపంచ ప్రతిబింబాలను వ్యక్తం చేయడమేగాక, వాటి వెనుకకు పోయి విశిష్ట సృజనాత్మక దృష్టితో చూచి, మనకు కన్పించే, కన్పించని రూపాల ముసుగులు లేక సంకేతాలు, విశిష్ట ఆకారాల పరమ సత్యాన్ని, దివ్యసౌందర్యాన్ని బహిర్గతం చేయడం కళల లక్ష్యం.

ఒక నూతన సాంఘిక వ్యవస్థ: సమత పునాది

ఒక ఆధ్యాత్మిక సమాజం, దాని సాంఘిక ధర్మం రీత్యా, వ్యక్తిని — మహర్షి దగ్గర్నుండి, నేరస్తుని వరకూ, అత్యంత నైపుణ్యంగా తయారుచేసిన యేదో యంత్రం లోనికి పంపించి పరీక్షించవలసిన సాంఘిక సమస్యగా, సాంఘిక మూసకు తగినట్లుగా బల్లపరుపుగా చేసో, లేక చితకగొట్టి అవతల పారవేసే ప్రత్యేక వస్తువులుగా, ఒక వలలో చిక్కుకుపోయి విలవిల లాడుతూ విడుదలకోసం చూస్తున్న అంతరాత్మలుగా, యింకా యెదుగుతున్న, యెదగడానికి ప్రోత్సహించవలసి వున్న అంతరాత్మలుగా తయారైన, యింకా ఈడురాని బాల్య అంతరాత్మలకు శక్తిని, సాయాన్ని అందించే అంతరాత్మలుగా గౌరవిస్తుంది.

ఉత్పత్తి చేసే భారీయంత్రాంగాన్ని, అది పోటీతత్వం కలదైనా, లేక సహకార తత్వం కలదైనా, అదేదైనా సరే, సృజించేందుకు గాక — మనుషులందరికీ, కొందరికే గాకుండా అందరికీ, ప్రతివానికీ అతని కత్యంత ఉన్నత పరిమాణంలో — వారి స్వీయస్వభావానుసారం, అంతరంగం వైపు యెదగడానికి, వారి కుండే స్వేచ్ఛా విరామ సమయాన్ని బట్టి కర్మలోని ఆనందాన్నందించడం ఆధ్యాత్మిక సమాజపు ఆర్థిక విధానాల ఉద్దేశ్యం.

యంత్రం కోసం నివసిస్తూ, యంత్రాంగాన్ని తన దేవునిగా, తన విశాలాత్మగా భావిస్తూ యంత్రం కోసమే జీవించే మనిషితో, క్రమబద్ధం చేయబడే, సాయుధం చేయబడే, ప్రభుత్వ భారీయంత్రాలుగా జాతుల్ని, వాటి వాటి ఆంతరిక జీవిత పరిధిల్లో, ఆధ్యాత్మిక సమాజ రాజకీయ వ్యవస్థ పరిగణించదు. అంతేగాక జాతి అనబడే యంత్రం, చెక్కుచెదరకుండా, శక్తివంతంగా వుండి, యింకా యింకా విశాలం, సంక్లిష్టం అయి, అజమాయిషీ చేయలేనంతగా తయారౌతూ, యాంత్రికంగా మరింత సమర్థవంతమైనది, సంపూర్ణమైనదిగా తయారై, తొలి పిలుపుకే తన బలిపీఠంపై యితరులను బలిచేయ, అక్కడే తానూ రక్త మోడ్చడంతో సంతృప్తిపడే రాజకీయంగా వుండదు. ఈ జాతులు లేక పాలనా వ్యవస్థలు, తమ పరస్పర సంబంధ బాంధవ్యాలలో, శాంతి లేక యుద్ధసమయాల్లో, ఇరువురికి సంబంధించిన సాయుధ దళాలు, లేక నిరాయుధులైన లక్షలాది సామాన్య జనం మీద విషవాయువులు వెదజల్లేందు కుద్దేశించిన వినాశకర యంత్రాల్లా, ఆధునిక యుద్ధక్షేత్రంలో యుద్ధవిమానాలు, లేక శత్రు టాంకులలాగా హతం చేసే కార్యానికి నియమింపబడిన మనుష్యుల్లా దారుణంగా విరుచుకు పడడంలో సంతృప్తి పొందేవిగా వుండదు. ఆ రాజకీయ వ్యవస్థ, జన బాహుళ్యాన్ని గణ – అంతరాత్మలుగా తమ వ్యక్తిగత స్వభావాన్ని బట్టి యెదిగే వ్యక్తిలాగా, ఆ యెదుగుదలతో పరస్పరం సహాయం చేసుకొనేందుకు, ఒకే సర్వసామాన్య మానవ కార్యంలో మొత్తం జాతికి సహాయపడేందుకు ఆత్మావిష్కరణ చేసుకోవలసి వున్న రహస్య దైవతంగా పరిగణిస్తుంది. దివ్యాత్మను వ్యక్తిలోనూ, సమిష్టిలోనూ కనుగొనడం, ఆధ్యాత్మికంగా, మానసికంగా, ప్రాణికంగా, భౌతికంగా దాని మహా మహనీయ, విశాలతకు, సంపన్నతకు, ప్రగాఢతను సంభావ్యతలను, సర్వుల ఆంతరిక జీవితంలోనూ వారి బాహ్య కర్మ, స్వభావంలోనూ

సాకారం చేసుకోవడమనేది, సర్వులూ చేయవలసిన కార్యంగా ఆ వ్యవస్థ, ఆ జాతి ముందు పెడ్తుంది.

ఎదుగుతూ వుండే ఆంతరిక స్వేచ్ఛాధర్మం

మానవజాతి ఆధ్యాత్మిక యుగంలో అత్యంత గౌరవప్రదమైన ధర్మం, ఆంత రిక స్వేచ్ఛ వికాసానికి సంబంధించినది. మనిషి ఆత్మ-జ్ఞానానికి సంబంధించి పట్టించుకోదగినంత చేరువకు రానంతవరకు, దాని వైపుకు తన మోమును త్రిప్ప నంత వరకు అతడు బాహ్య వత్తిడికి సంబంధించిన నియమాన్నుండి బయట పడలేడు, పైగా అందుకోసం అతను చేసే ప్రయత్నాలన్నీ వ్యర్థమౌతాయి. అతడు యిప్పుడూ, యెప్పుడూ గూడా, బాహ్య వత్తిడి కొనసాగినంత కాలం, యితరులకు బానిసే, తన కుటుంబానికి, తన కులానికి, తన శాఖకు, తన మతా నికి, తన సంఘానికి, తన జాతికి బానిసే, అలా గాక మరో విధంగా వుండలేడు. అవి కూడా వాటి అసంస్కృత, యాంత్రిక వత్తిడిని ఆయన మీద పడకుండా చేయలేవు. అవీ వాటి అహానికి, వాటి స్వీయ స్వభావానికి బానిసలే. ఇతర వత్తిడి నుండి బయట పడడానికి మనకున్న హక్కును ప్రతిష్ఠించదలచుకొంటే, మనం మన మీద బరపుతున్న పరమాత్మ వత్తిడిని సంవేదించి, దాని ప్రకారం నడుచు కోవాలి, మన నిమ్న స్వభావాన్ని ఒక యిష్టపడిన బానిసనుగా చేయాలి. సచేతన మైన, ప్రకాశమయ లేక ఉన్నతీకరించబడినా యింకా తనకు తాను లోబడివున్న భాగంగానే మిగిలిపోయిన, మనలో వున్న దివ్యపురుషుని సహచరి లేక భాగ స్వామినిగా మన నిమ్న స్వభావాన్ని తయారుచేయాలి. ఎందుకనంటే, అలా నిమ్నస్వభావాన్ని లొంగేటట్లు చేయడం, మనం స్వేచ్ఛ పొందడానికి ముందుగా నెరవేర్చవలసిన షరతు. ఆధ్యాత్మిక స్వేచ్ఛ మన ప్రత్యేక మనస్సు, జీవితాలు, అహంకారంతో కావాలనుకొనేది గాదు, అది మనలో మన బాహ్య అంతర అస్తిత్వ భాగాలలో, మన చుట్టూ వున్న వారందరిలో వున్న దివ్యసత్యానికి విధేయం గావడం. అయినప్పటికీ మన అస్తిత్వపు సహజ అంగాల స్వేచ్ఛను భగవంతుడు గౌరవిస్తాడనీ, తమను తాను కడతేర్చుకొనడం ద్వారా గాకుండా సహజ వికా సంతో దైవాన్ని తమలో కనుగొనడం ద్వారా తమ స్వీయ స్వభావంలో యెది గేందుకు ఆతడు తగినంత చోటిస్తాడనీ మనం గమనించగలం. చివరకు వాళ్లు

అంగీకరించే, పూర్ణం, నిరపేక్షం అయిన బానిసత్వం, వాళ్ళలోనే గల వెలుగు, శక్తి, వాళ్ళ ఉన్నతోన్నత అస్తిత్వపు మూలాన్ని గుర్తించి ఆకాంక్షించ యిష్టపడే ఒక బానిసత్వం అయి వుండాలి అది. ఆధ్యాత్మికత యెరుక లేని స్థితిలో గూడా, సాధ్యమైనంతగా విశాలమైన స్వేచ్ఛలోనే, అత్యంత ఆరోగ్యకరమైన, అత్యంత యథార్థమైన, అత్యంత సజీవ వికాసం, కర్మ, పుట్టుకు రావడం మనం చూడ గలం. అధికంగా పెట్టిన వత్తిడి, కాలక్రమేణా కృశించిపోవడంగా, లేక తీవ్రమైన అశాంతి, భావప్రేలుళ్ళచే వివిధంగా పెరిగిన లేక ఉపశమించిన కర్కశత్వం అవుతుంది. మనిషి తన ఆధ్యాత్మిక ఆత్మను గురించి తెలుసుకొన్న వెంటనే, అలా తెలుసుకొనడం వల్ల, దాని కోసం అన్వేషించడం వల్ల కూడా సనాతన చింతన, మతం దర్శించినట్లు, అతడు బాహ్యధర్మం నుండి తప్పించుకొని స్వేచ్ఛకు సంబంధించిన ధర్మం లోనికి ప్రవేశిస్తాడు.

మానవజాతి ఆధ్యాత్మిక యుగం ఈ సత్యాన్ని తెలుసుకొంటుంది. అది యంత్రాల ద్వారా మనిషిని పరిపూర్ణుని చేయ ప్రయత్నించదు, లేదా అతని అవధి అవయవాల నన్నింటినీ కట్టడిచేసి నిటారుగా నిలబెట్టదు. పోలీసు, అధికారి, క్రిందిస్థాయి ఉద్యోగియైన వ్యక్తి రూపంలో అతని ఉన్నతతర ఆత్మను సంఘ సభ్యునికి చూపించలేదు, లేక ఒక సామ్యవాదపాలన లేక సోవియట్ శ్రామికవర్గ పాలన రూపంలోగాని చూపించలేదు. తన లోలోపలే వున్న ఆత్మ, దివ్య ఆంతరిక వత్తిడి చేత, అదే లక్ష్యంగా గల, అది ఉపయోగించే సమస్త ప్రాథమిక సాధనోపా యాలను సక్రియం చేయడం ద్వారా మానవ జీవితంలో, బాహ్య వత్తిడి అంశంతో అవసరాన్ని, వీలైనంత వెంటనే, సాధ్యమైనంత వరకు క్షీణింప జేయడం దాని లక్ష్యం. చివర్లో ప్రధానంగా, ఒక్కదానినే గాకపోయినా, వత్తిడిని తన చుట్టూ వున్నవారిపై ఆధ్యాత్మిక వ్యక్తి సైతం ప్రయోగించగల — ఆధ్యాత్మిక సంఘం యెంత యెక్కువగా ప్రభావం చూపగలదో — అంతగా అది మనలో వున్న ఆంతరిక నిరోధాల ద్వారా, బాహ్యవ్యతిరేకతల ద్వారా దివ్య వెలుగు, స్వీయ దైవస్వభావం ద్వారా, యెదిగేందుకు వత్తిడి, కోరిక, శక్తి మనలో మేలుకొంటుంది. ఆధ్యాత్మిక అరాచకవాది కల గన్నట్లు ప్రాథమిక షరతు నెరవేర్చబడింది గనుక, సర్వులూ ప్రగాఢ స్వేచ్ఛాపరులై వుండే పరిపూర్ణ ఆధ్యాత్మిక సమాజం అవు తుంది. అటువంటి స్థితిలో ప్రతి వ్యక్తీ తనకు తానే ఒక ధర్మం, కాని ఆ ధర్మం,

దివ్యధర్మం, ఎందుకనంటే పూర్తిగా గాకపోయినా ప్రధానంగా తన స్వార్థం కోసం, తన స్వంత పని కోసం నివసించే ఒక అహంలో గాక దైవసత్యతలో నివసించే ఒక అంతరాత్మ అతడు. అహం నుండి విడుదలైన స్వంత దివ్యస్వభావ ధర్మంలో ఆతని జీవితం కొనసాగుతుంది.

ఏకత ధర్మం

ఆధ్యాత్మిక జీవితం రూపరహితమైన ఒక యేకత్వానికి పూచిన పుష్పం గాక ఒక సచేతన, వైవిధ్యభరితమైన యేకత్వానికి పూచిన పుష్పం. వ్యక్తి తన స్వకీయ వ్యక్తిగత అస్తిత్వం ద్వారా తన ఆంతరంలోని దైవసత్యత లోనికి యెదగవలసి వుంది. అందుచేత, కొంత పెరుగుతుండే పరిమాణం గల స్వేచ్ఛ జీవి అభివృద్ధి చెందేటప్పుడు అవసరం; పరిపూర్ణ జీవితానికి గుర్తు, షరతు గూడా పరిపూర్ణ స్వేచ్ఛ. కాని ఆ విధంగా తనలో చూచే దైవాన్ని ఆతడు సమంగా యితరు లందరిలో అదే పరమాత్మగా కూడా చూస్తాడు. ఇతరులతో వృద్ధి చెందుతుండే ఆంతరిక యేకత్వం అతని అస్తిత్వపు ఆవశ్యక నియమం. పరిపూర్ణ జీవితానికి గుర్తు పరిపూర్ణ యేకత్వం. తనలో దైవాన్ని చూడడం, కనుగొనడం మాత్రమే గాక, సర్వంలోనూ, దైవాన్ని చూడడం, కనుగొనడం, తన వ్యక్తిగత మోక్షాన్ని, సిద్ధిని కాంక్షించడం మాత్రమే గాక ఇతరుల మోక్షానికి, సిద్ధికి కాంక్షి చడం అనేది ఆధ్యాత్మిక వ్యక్తి ధర్మం. కాంక్షించిన దివ్యత్వం, ఒకే దైవం కోసం గాక, అతనిలో ప్రత్యేకమైన, భగవంతుని కోసం అయినట్లైతే, లేక అతని ఒక్కని కోసం మాత్రమే అతడు భగవంతుని కాంక్షించినట్లైతే, ఫలితంగా దక్కేది ఒక అతిశయించిన అహంకారం. అది 'గోథే' సంబంధ సాధుత్వంగల అహంకారం లేక 'నీషే' వూహించిన అతిమానుష అహంకారం లేక దేనితోనూ సంబంధం లేని ఆత్మ-జ్ఞానం, లేక జీవిత కఠిన సత్యాలకు దూరంగా పోయేవాని వైరాగ్యం లేక ఒంటి స్తంభం మీద వుండే యే మధ్యయుగం నాటి తాపసి వైరాగ్యమో అవు తుంది. కాని సర్వంలో భగవంతుని దర్శించేవాడు, భక్తిపూర్వక సేవతో సర్వంలో వున్న భగవంతుని సేవిస్తాడు. చెప్పాలంటే అతడు తన స్వకీయ స్వేచ్ఛ కోసం గాక అందరి స్వేచ్ఛ కోసం కాంక్షిస్తాడు, తన సిద్ధి కోసం మాత్రమే గాక అందరి సిద్ధి కోసం కాంక్షిస్తాడు. విశాలతను విశ్వజనీనతలో గాక మరెందులోనూ తన

వ్యష్టిత్వం పరిపూర్ణం కాదని భావిస్తాడు. తన స్వీయజీవితం, విశ్వజనీన జీవితంతో యేకత్వంలో సంపూర్ణమైనట్లు భావిస్తాడు. అతడు తన కోసం, రాష్ట్రం కోసం, సంఘం కోసం, వ్యక్తిగత అహం కోసం లేక సామూహిక అహం కోసం గాక, మరింత మహనీయమైన, తనలో వున్న భగవంతుని కోసం, విశ్వంలో వున్న దైవం కోసం నివసిస్తాడు.

CWSA 25:256-60 శ్రీఅరవిందులు

ఆధ్యాత్మీకరించబడడానికి మానవుడు అంగీకరించినట్లైతేనే...

అన్నింటినీ మించి, అసలు మొత్తం సమస్య, మానవజాతి మేలిమి బంగారం స్థితికి చేరుకొన్నదా లేక యింకా అది పుటం పెట్టవలసిన స్థితిలోనే వుందా అనేది.

ఒకటి మాత్రం స్పష్టం, మానవజాతి యింకా మేలిమి బంగారంగా తయారు గాలేదు, అనేది కంటిక్కనుపిస్తోంది, అది తథ్యం కూడా. మానవజాతిలో యెంపిక చేయదగ్గ కొద్దిమంది, చాలా తక్కువ సంఖ్యలో, బహుశా మేలిమి బంగారంలా రూపాంతరీకరించబడటానికి సిద్ధమై వుండవచ్చునని ఆశకు తావిచ్చేదేదో ప్రపంచ చరిత్రలో జరిగింది. వాళ్ళు హింస లేకుండా బలాన్ని, విధ్వంసం లేకుండా వీర త్వాన్ని, దుర్ఘటన జరుగకుండా ధైర్యాన్ని చూపగలరు. ప్రస్తుత భూమి చరిత్రలో ఒక నిర్ణయాత్మక మలుపు దగ్గరకు మరొకసారి మనం చేరుకొన్నాం. ప్రతి దిశ నుండీ నన్ను "యేం జరుగబోతోంది?" అని అడుగుతున్నారు. ప్రతి చోటా సంక్షోభం వుంది, యేదో జరుగుతుందన్న భయం వున్నాయి... "ఏం జరుగ బోతోంది". ఉన్నది ఒకే ఒక సమాధానం. "మనిషి ఆధ్యాత్మీకరించబడడానికి అంగీకరించినట్లైతేనే". కొంతమంది వ్యక్తులు మేలిమి బంగారం అయితే బహుశా సరిపోతుందేమో, ఎందుకనంటే ఘటనా ప్రవాహదిశను మార్చడాని కది సరి పోతుంది... ఇదొక ఆవశ్యకత, అత్యవసరమైన ఆవశ్యకత అన్న స్థితి మన కెదు రైంది. మన నుండి దైవం కోరే ఈ ధైర్యం, ఈ వీరత్వం తన స్వంత యిబ్బంది లకు, తన స్వంత అపరిపూర్ణతలకు, తన స్వంత అజ్ఞానాలకు వ్యతిరేకంగా పోరాడడాని కెందు కుపయోగించ గూడదు? ఆంతరిక పరిశుద్ధత జరిగే కొలిమిని వీరోచితంగా యెందుకు యెదుర్కోగూడదు? అలా యెదుర్కొంటే, అలా చేస్తే మొత్తం నాగరికతను అంధకారం లోనికి నెట్టిన ఆ భయంకర అసాధారణ పరిణా



మంలో జరిగిన విధ్వంసాల గుండా మరోసారి పోవలసిన అవసరం వుండదు.

ఇదీ మన ముందున్న సమస్య. దీనిని తన స్వంత విధానంలో ప్రతి ఒక్కరూ పరిష్కరించవలసి వుంది.

ఈ సాయంత్రం నన్నడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్తున్నాను, నా సమాధానం అంటే అది శ్రీఅరవిందుల సమాధానమే. ఒకసారి మనిషి, తనను ఆధ్యాత్మీకరించడానికి అంగీకరించినట్లైతే... మానవ దృక్పథం నుండి చూస్తే, కాలం వత్తిడి చేస్తోంది, అని నేను ఇంకా కొంత విషయాన్ని అందుకు జత చేసి చెప్తాను.

"ఆధ్యాత్మికరించబడడాని కొకసారి మనిషి సమ్మతిస్తే అంతా పరివర్తన చెందుతుంది; కాని అతని మానసిక, ప్రాణిక, భౌతిక స్వభావం, వున్నత ధర్మాని కెదురు తిరుగుతుంది. అతడు తన అపరిపూర్ణతను ప్రేమిస్తాడు."

CWM 9:74-75 శ్రీమాత

ముందుకు ఒక దూకు దూకాలి

ప్రశ్న: ప్రపంచం సంక్షోభంలో వుందని నిజంగా అన్పిస్తోంది.

సమా: అవును నిజమే.

ఉదయం నుండి అలా వుంది — సమ్మెలు, పోరాటాల అశాంతులు... అశాంతిని సృష్టించినవారి సహాయంతోనే శాంతి తిరిగి నెలకొల్పబడాలని అన్పిస్తోంది. జరుగవలసింది అదే. సాధారణ శుభేచ్ఛ, నైతిక, సాంఘిక నియమాలు అన్నింటి మీదా ఆధారపడకుండా — అదంతా మట్టి గరచేటట్లు చేయబడింది — పైకి లేవాలి. దివ్యసంకల్పం, దివ్యసామరస్యత నెలకొనాలి, మనం కోరేది దాన్నే. వస్తువుల సాధారణ ధర్మాన్ని, సాధారణ సాంఘిక కట్టుబాట్లకు యెదురు తిరిగిన వాళ్ళనే మనం అందుకు యెంచుకుంటాం. ఒక వున్నత చేతనతో, ఒక నిజమైన సత్యంతో సంబంధం కలిగి వున్నారనేదాని నది ఋజువు చేస్తుంది.

అలా చేయడానికిదే సరైన సమయం (ముందుకు దూకినట్లు సంజ్ఞ)

వ్యవస్థీకరించే దృష్ట్యా చూస్తే, అదొక శక్తి... అది ప్రబల శక్తి. అదొక అద్భుతం, వున్నత శాంతి చేతుల్లో ఈ శక్తిని పెడితే, యథార్థ చేతనలోనయితే, యేదైనా కొంత చేయవచ్చు. తప్పక అతడు పైకెగరి దూకాలి.

తిరిగి శాంతిని నెలకొల్పాలనే జనం అంతా పాతభావాల్లోకి ఆకర్షితులా

తారు. అందుచేత వాళ్ళెపుడూ గెలువలేరు. ఆ గతం గతించిపోయింది, శాశ్వతంగా ముగిసిపోయింది. మనం పైపైపుకు పోతాం, అలా లేవగలిగినవాళ్ళే పని చేయ గలుగుతారు.

CWM 11:253 శ్రీమాత

"ప్రపంచానికి మూడు రకాల విప్లవాలు తెలుసు. భౌతికం ఫలితాలను పొందింది. నైతిక బౌద్ధిక ఫలితాలు అనంతంగా వాటి పరిధిలో, ఫలితాల్లో, సుసంపన్నతను పొందాయి., కాని ఆధ్యాత్మికంగా విత్తబడిన బీజాలు గొప్ప విత్తనాలు."

"మనం ఈనాడు ప్రపంచంలో చూస్తున్న మార్పులు, వాటి ఆదర్శం, వాటి ఉద్దేశ్యాన్ని బట్టి చూస్తే, బుద్ధిగత, నైతిక భౌతికమైనవి. తన సమయం కోసం ఆధ్యాత్మిక విప్లవం వేచి వుంది, యీ మధ్య కాలంలో యిక్కడా, అక్కడా తన తరంగాలను లేచి పడేటట్లు చేస్తోంది. అది పూర్తిగా సంభవమయ్యేంత వరకు యితరమైనవి అర్థం కావు. అప్పటివరకు, ప్రస్తుతం సంభవించేవాటిని గురించిన మన వ్యాఖ్యానాలన్నీ, అంచనాలన్నీ వ్యర్థం. ఎందుకనంటే మానవజాతి తరువాతి తరాలు నిర్ధారించేవే దాని స్వభావం, శక్తి, ఘటనలు."

SABCL 16:393-94 శ్రీఅరవిందులు

భావానువాదం: కె. వి. రావు

దేవతల, మతాల యుగం ముగిసిపోయింది

ఏ విధంగా చూసినప్పటికీ, విషయాలను సులభంగా అర్థమయేటట్లు చేయటానికి, ఏమని చెప్పవచ్చంటే, విలక్షణయుతమైన పాత ప్రపంచం, శ్రీఅరవిందులు చెప్పేటటువంటి ఊర్ధ్వమనో సృష్టి ఏదైతే ఉన్నదో, అది, దేవతల యుగం, పర్యవసానంగా అది మతాల యుగం. మునుపే నేను చెప్పినట్లుగా, తనకు ఊర్ధ్వంలోని దాని దిశగా మానవుడు చేసిన ప్రయత్నం యొక్క సారఫలితం లెక్కలేనన్ని మతాలు రూపుదిద్దుకోవటానికీ, అత్యున్నత ఆత్మలకూ, అదృశ్య ప్రపంచానికీ మధ్య మతపరమైన సంబంధం ఏర్పడటానికీ కారణమయింది. దాని నంతటికీ పరాకాష్ఠగా ఒక ఉన్నత లక్ష్య సాఫల్య దిశగా జరిగే ప్రయత్న ఫలితంగా మతాల ఐక్యత అనే భావం ఈ అభివ్యక్తతల కన్నింటికీ వెనుక నున్న "ఏకైక విషయం" తలెత్తింది. ఈ భావం, చెప్పాలంటే, నిజంగానే, మానవ ఆకాంక్షలకు కట్ట కడపటి పరిమితి. అయితే, అది పొలిమేర వద్ద, ఒక విధంగా అది ఊర్ధ్వ మనోప్రపంచానికి, ఊర్ధ్వ మనోసృష్టికి చెందినది, అక్కడి నుండి అది అవగాహన చేసుకోలేనటువంటి, నూతన సృష్టి అయిన, ఈ "ఇతరమైన దానిని" చూస్తున్నట్లున్నది — అది దానిని చేరాలనే ప్రయత్నం చేస్తున్నది, ఆ ప్రయత్నం సఫలం కాబోతున్నదని అనుకుంటున్నది. కాని దానిని గ్రహించ లేకపోతున్నది. దానిని గ్రహించాలంటే తిరిగి వెనుకకు మరలవలసిన ఆవశ్యకత ఉంది. తప్పనిసరిగా ఊర్ధ్వ మనోసృష్టిని వదలివేయాలి, తప్పనిసరిగా నూతన సృష్టి, అతిమానస సృష్టి జరిగి తీరవలసి ఉంది.

ఇప్పుడు, ఈ పాత విషయాలన్నీ ఎంత పాతగా కనిపిస్తున్నాయో, ఎంత పనికిరానివిగా అయ్యాయో, ఎంతగా ఊహాపోహల మీద ఆధారపడినవై పోయినాయో — అసలైన సత్యానికి అది ఎంతగానో హాస్యాస్పద విషయమై పోయింది. అతిమానససృష్టిలో ఇక ఎటువంటి మతాలు ఎంతమాత్రమూ ఉండవు. జీవితం సమస్తమూ వ్యక్తీకరణే, దివ్య మహా ఏకత్వం ప్రపంచంలో రూపాలుగా వికసించడమే. అప్పుడిక ఇప్పుడు మనుషులు పిలిచే దేవతలు ఎంత మాత్రమూ ఉండరు. ఈ గొప్ప దివ్య అస్తిత్వాలు తమకు తాముగా నూతన సృష్టిలో పాలు పంచుకొనే

అవకాశం ఉంది; కాని ఆ విధంగా చేయాలంటే, వారు, భూమి మీద మనం అనే టటువంటి "అతిమానస పదార్థం" అనేదాన్ని ధరించవలసి ఉంటుంది. ఒకవేళ కొంతమంది తమ లోకంలో ఇప్పుడు వారు ఉన్నట్లుగానే ఉండదలచుకుంటే, భూమి మీద అతిమానస అస్తిత్వాలతో వారి సంబంధం స్నేహితులలాగానూ, కలిసి పనిచేసే వారిలాగాను, సమానులుగానూ ఉంటుంది, ఎందువల్లనంటే, అత్యు న్నతమైన దివ్యసారం భూమి మీద నూతన అతిమానస ప్రపంచంలోని అస్తిత్వా లలో అభివ్యక్తమవుతుంది గనక.

భౌతిక పదార్థపు అతిమానసీకరణ జరిగినప్పుడు, భూమి మీద అవతరించడం ఇక ఎంత మాత్రమూ కింది స్థాయికి చెందిన విషయం కాదు, దానికి పూర్తి వ్యతి రిక్తం. అది మరి ఏ విధంగానూ పొందలేనటువంటి సమృద్ధత నిస్తుంది.

CWM 9:149-52

పృథ్వి కోసం గెలవలసిన మూడు విషయాలు

శ్రీఅరవిందులు నాతో పృథ్వి తయారు కావడానికి మూడు ఇబ్బందు లున్నాయని చెప్పారు, ఆ మూడింటిని గెలవాలి (ఇది పూర్తిగా బాహ్యదృక్పథం ప్రకారం. నేను మానసిక లక్షణాల గురించి మాట్లాడటం లేదు): ప్రభుత్వం, డబ్బు, ఆరోగ్యం.

ఈ మూడింటిలో, అంతరంగ పరివర్తనకు ఆరోగ్యం చాలా ఎక్కువగా సూటిగా సంబంధించి యున్నది, కాని పూర్తిగా కాదు, కారణం, అది నిరంతరం బయటి నుంచి వచ్చిపడే వాటి మీద ఆధారపడి ఉంది — ప్రభావితం చేసేవి మరియు స్పందనలు — బయటి నుంచి సంక్రమించేవి. నీవు తినవలసి ఉంది: నీవు ఆహారంతో పాటుగా స్వీకరించే ప్రతిదీ — అది చాలా విచిత్రం! భుజించడం కావలసినంత పనికి ప్రాతినిధ్యం వహిస్తున్నది — భౌతికమైన జీర్ణక్రియ అనేది ఎంత మాత్రమూ కాదు, కాని ఇమిడించుకోవటం, అనుగుణంగా అనుకూలపరచు కోవటం అనే పని ముఖ్యమైనది. పర్యవసానంగా, మూడింటిలో ఆరోగ్యం చాలా ఎక్కువగా సూటిగా అంతరంగ అభివృద్ధి ప్రభావంలో ఉంది, కాని నేను మొదట చెప్పిన విధంగా, పూర్తిగా మట్టుకు కాదు. ఆ కారణాన దానిని కూడా గెలిచి తీర వలసిందే.

డబ్బు విషయంలో, శ్రీఅరవిందులు ఇక్కడ ఉన్నప్పుడు సమస్య ఏమీ ఉండేది కాదు: మాకు కావలసినంతా సమకూడేది. కాని ఆఖరి రెండు సంవత్సరాల నుంచి కష్టాల పరంపర మొదలయింది, ఆయన చెప్తూ ఉండేవారు, నేను మీకు ఇదివరకే చెప్పినట్లున్నాను. అది చుట్టూ ఉన్నవారి తప్పుడు దృక్పథం ఫలితంగా మొదలయింది; ఈ తప్పుడు దృక్పథం సమస్యకు తగినంత ప్రాతినిధ్యం వహించింది — అది తక్కువ నుంచి తారస్థాయికి వెళ్ళిపోయింది, అది పూర్తిగా తీవ్రస్థాయికి చేరింది.

ప్రభుత్వం విషయంలో, అది వ్యతిరేక దిశను అనుసరించింది. మొదట్లో అది భయోత్పాతం కలిగించే శత్రుత్వాన్ని కలిగి ఉంది, దానర్థం, కేవలం మేము ఇక్కడ ఉండటానికే ప్రతి నిమిషం పెనుగులాడవలసి వచ్చింది. శ్రీఅరవిందులు నాతో చెప్పారు, ఆరోగ్యమూ, డబ్బూ రెండూ ఒక్కసారిగా దారి కొస్తాయి; బహుశా ఆరోగ్యం మొదట, డబ్బు దాని తరువాత, కాని పెద్దగా తేడా లేకుండానే. ఆయన ఇంకా ఇలా చెప్పారు, "ప్రభుత్వం విషయంలో, పరిష్కారం మాత్రం ఒక్కటి ఉంది, కేవలం ఒక్కటి మాత్రమే: అది ప్రభుత్వం అయిపోవడం". నీవు ప్రభుత్వం కాకపోతే, నీవు దాని నెన్నటికీ గెలవలేవు, ప్రథ్వీ పరివర్తన పొందిన తరువాత తప్ప — కాని దాని తరువాత చేయవలసిన పని ఏమీ మిగలదు!...

...మూడు క్షేత్రాలలో — ప్రభుత్వం, డబ్బు, ఆరోగ్యం — విషయాలు ఎల్లప్పుడు ఒక కొనకు చేరుతాయి, ఆ కొన ఎంత ఉద్రిక్త స్థితికి, జటిల స్థితికి చేరుతుందంటే, నీకు అంతరంగ ధృఢవిశ్వాసం అనేది లేకపోతే అది ఎల్లప్పుడూ సర్వనాశనానికీ, పతనానికీ దారితీసే పరిస్థితి ఉంది. అది ఎల్లప్పుడూ ఆ కొనకు చేరినప్పుడే... (ఒక్కసారిగా వెనుకకు తిరిగే సంజ్ఞ) ప్రతిదీ పూర్తిగా ఒక్కసారిగా వెనక్కు తిరుగుతుంది — అంతకు ముందు కాదు, ఒక్క నిమిషం ముందుగానూ కాదు.

The Mother's Conversation with a disciple: October 19, 1963

నూతన ప్రపంచంలో స్త్రీలు

నిజంగా జరిగేటటువంటి విషయం, గొప్ప సంఘటనలు, పనులు జరిగే సమయంలో, పోషిస్తున్నామనే అలక్ష్యంతో, ఒక చిరునవ్వుతో స్త్రీలను ఒక మూలకు

నెట్టివేసే అలవాటు, ఈ అర్థం వచ్చే విధంగా: అభాగ్యులైన, అశక్తులైన, అల్పులైన ప్రాణులారా ఇది మీ వ్యవహారం కాదు....

అంతే, స్త్రీలు కూడా, అణగి మణగి, చిన్నపిల్లలవలె, బహుశా సోమరితనంతో దానిని ఒప్పుకున్నారు, ఇటువంటి అవమాన పరిస్థితి కనీసం చాలా దేశాలలో ఉంది. ఇది తప్పు అని చెప్పడానికి నేను ఎంత మాత్రం వెనుకాడను. భవిష్యకాలంలోని జీవితంలో, స్త్రీలింగానికి, పుంలింగానికి మధ్య ఇటువంటి విభజనకూ, ఇటువంటి అసమతౌల్యస్థితికీ తావు ఉండదు. స్త్రీపురుషు లిద్దరిలో నిజమైన సంబంధం అన్యోన్య సహకార సహాయాలతో అడుగులు వేస్తూ, చాలా దగ్గరగా కలసిమెలసి పనిచేయడంలో ఉంది. ఇప్పటి నుంచి, మనం తప్పకుండా యదార్థమైనటువంటి మనఃస్థితిని తిరిగి ధారణచేసి, మనకి దక్కవలసిన స్థానాన్ని సొంతం చేసుకుని, మన వాస్తవిక ప్రాముఖ్యతను గట్టిగా ప్రకటించాలి — ఆధ్యాత్మికంగా ముందటివారమని, శిక్షణ గరపేవారమని. వాస్తవంలో, కొంతమంది మగవారు, వారికి ఉన్నాయన్నట్లుగా చెప్పుకునే అనుకూల పరిస్థితులతో బహుశా కొద్దిగా డాబుసరిగా అహంభావంతో, వాస్తవంలో కనపడేటటువంటి స్త్రీల బలహీనతను ఈసడించవచ్చునేమో (ఈ బాహ్య బలహీనత కూడా పూర్తిగా కచ్చితంగా ఉన్నది కాకపోయినప్పటికీ), కాని: ఒకరెవరో ఎంతో సరిగా నిజం చెప్పారు, "అతడిని ఏమైనా చేయనీ, మొత్తానికి అతిమానవుడు స్త్రీ నుంచే జన్మించవలసి ఉంది."

అతిమానవుడు స్త్రీ నుంచే పుట్టడం జరుగుతుంది, ఇది ప్రశ్నించటానికి తావులేని ఎంతో పెద్ద సత్యం; కాని ఈ సత్యంతో మనం గర్వించనంత మాత్రాన సరిపోదు, దీని అర్థం ఏమిటో మనం స్పష్టంగా తెలుసుకోవాలి, మనం జాగ్రత్తగా ఇది మనకు కల్పించే బాధ్యత ఏమిటో ఎరిగి ఉండాలి. ప్రస్తుతం ప్రపంచమంతటా విస్తరించిన, కచ్చితంగా అత్యంత ప్రాముఖ్యమైన మన వాటాను కలిగి అత్యంత శ్రమభరితమై విధాయికమైనది ఈ పని.

CWM 2:158

స్త్రీల హక్కుల సమస్య

...స్త్రీల హక్కుల సమస్య, ప్రపంచంలోని అన్ని సమస్యలలాగా, తిరిగి ఆధ్యాత్మిక సమస్యలలోకే వస్తుంది. ఎందువల్లనంటే ఆధ్యాత్మిక వాస్తవికతే

ఇతరము లన్నింటికీ మూలంగా ఉన్నది; దివ్యప్రపంచం, బౌద్ధమతంలోని దమ్మత అనేదే దానికి శాశ్వత పునాది, దాని మీదనే ఇతర లోకాలన్ని నిర్మాణమయ్యాయి. ఈ పరమోత్కృష్ట వాస్తవికత ననుసరించి స్త్రీపురుషులు హక్కులు, విధులలో అందరూ సమానులే. ఈ క్షేత్రంలో కేవలం ఉండగలిగేటటువంటి ఒకే ఒక్క తేడా చిత్తశుద్ధి, తీవ్ర భావావేశంతో కూడిన ఆకాంక్ష, స్థిర విశ్వాసం కలిగిన ఇచ్ఛాశక్తి మీద ఆధారపడి ఉన్నది. ప్రాథమికమైనటువంటి ఈ ఆధ్యాత్మిక సమానత్వమును గుర్తించటంలోనే స్త్రీపురుష సంబంధాలలో కేవలం గంభీరమైన, శాశ్వతమైన పరిష్కారాన్ని కనుగొనగలగటం జరుగుతుంది. ఈ ప్రకాశంలోనే అది తప్పక ఉంచబడాలి, ఇటువంటి ఉన్నతస్థితిలోనే కార్యసరళి, నవ్యజీవితం కేంద్రీకరించబడి మన అన్వేషణ తప్పక జరగాలి, దాని చుట్టూ భవిష్య మానవ జాతి దేవాలయ నిర్మాణం చేయబడుతుంది.

CWM 2:150

వివాహ వ్యవస్థ అంతం

...సహజంగానే మొత్తం వివాహానికి సంబంధించిన భావమే వినోదాత్మక మైనది, కారణం నేను దానిని చిన్నపిల్లల చేష్టగా అనుకుంటాను.

మీకు తెలుసు కదా, అరోవిల్లిలో వివాహా లుండవు. ఒక స్త్రీగాని, పురుషుడు గాని ఒకరి నొకరు ప్రేమించుకుంటే, కలసి జీవించ దలచుకుంటే, ఎటువంటి తంతు లేకుండా వారు కలసిమెలసి జీవనం చేయవచ్చు. వారు విడిపోదలచు కుంటే అంతే స్వతంత్రంగా విడిపోవచ్చు. ప్రేమ అంతరించిన తరువాత వారిని బలవంతంగా కలసిమెలసి ఉండమనటం ఎందుకు?

జనులు ఈ విధంగా స్వతంత్రంగా ఉంటే, ఈ విషయంగా చాలా నేరాలు జరగకుండా చేయవచ్చు. ఒకదాని నుంచి మరియొకటి దాచి ఉంచవలసిన అవ సరం లేదు. లేదా వేరుపడటానికి నేరాలు చేయడం కూడా ఉండదు. సహజంగానే వారు ఒకరి నొకరు ప్రేమించుకుంటే ఎప్పుడూ సహజంగానే సహజీవనాన్ని కొనసాగిస్తూ ఉంటారు, ఏ న్యాయసూత్రాలతోనూ బలవంతంగా కలిసి ఉండ నవ సరం లేకుండానే. అందువలననే ఈ వివాహపు తంతులు, క్రతువులు చాలా చిన్నపిల్లల చేష్టలలాగా ఉంటాయి.

అరోవిల్లిలో పుట్టిన పిల్లలకు ఇంటిపేరు అనేది ఉండదు. వారి పేరు మట్టుకే వారికి ఉంటుంది.

CWM 13:236

ఒక నూతనమైన, అధిక సత్యపరమైన సంబంధానికి పునాది

(వివాహ విషయంగా కింద పేర్కొనబడిన జాబును పైన చెప్పిన విషయంతో బాటుగా ప్రకటించబడాలని శ్రీమాత సలహా ఇచ్చారు.)

మీ భౌతిక జీవితాలనూ, మీ భౌతిక అవసరలనూ, ఐక్యం చేయడానికి జీవితంలో కష్టాలనూ, జయాలనూ, ఓటములనూ, గెలుపులనూ కలిసి ఎదుర్కొనడంలో భాగస్వామ్యము లవడానికి — అదే వివాహానికి పునాది, కాని అది మాత్రమే చాలదని మీకు ఇప్పటికే తెలుసు.

మీ ఇంద్రియ సంవేదనలలో ఐక్యమవడానికి, ఒకటే అయిన సౌందర్యాత్మకమైన రుచులు, సుఖాలు కలిగి ఉండటానికి, ఒకటే అయిన విషయాలలో, ఉమ్మడిగా ఒకే రకంగా స్పందించడానికి, ఒకరి ద్వారా మరియొకరు, ఒకరి కోసం మరియొకరుగా — అది బాగుంటుంది, అది అవసరమే, కాని అది మాత్రం చాలదు.

ప్రగాఢమైన మీ అనుభూతులలో ఏకం కావడానికి, జీవితంలో ఆటుపోటులు ఎన్ని ఉన్నప్పటికీ, ఎన్నడూ పెరుగూ, తరుగూ లేకుండా ఉండేటటువంటి పరస్పరం ప్రేమ, సౌకుమార్యాలు కలిగి, ప్రతి సందర్భంలోనూ ఆనందమునూ, మితిమీరిన ఆనందమునూ, ప్రతి పరిస్థితిలోను కలత లేమినీ, ప్రశాంతతనూ, సంతోషమునూ ఒకరిలో ఒకరు పొందుతూ — అది మంచి విషయం, అది చాలా మంచి విషయం, అది ఆవశ్యకమైనది, కాని అది మాత్రం చాలదు.

మీ మనస్సులు ఐక్యంచేసుకోవటానికి, మీ ఆలోచనలు సామరస్యపరచుకోవటానికి, వాటిని పూరకం చేయడానికి, మేధోపరంగా మీరు ముందస్తుగా నిర్ణయించుకొని చేసే పనులను, కనిపెట్టే కొత్త విషయాలను కలసి పంచుకోవడానికి; ఒక్క మాటలో చెప్పాలంటే, మీ మానసిక కార్యకలాపాల పరిధిని విస్తృతపరచుకోవటం ద్వారా, సుసంపన్నం చేసుకోవటం ద్వారా ఇద్దరు ఒక్కసారిగా గడించిన దానిని సమరూపం చేయడానికి — ఆది చాలా మంచి విషయం, అది తప్ప

కుండా అవసరమే, కాని అది మాత్రం చాలదు.

వాటన్నింటికీ మించి బహు దూరంగా, లోలోపల, కేంద్రభాగంలో, అస్తిత్వ శిఖరాగ్రాన, అక్కడ ఒక అస్తిత్వపు సర్వోత్కృష్ట దివ్యసత్యం విరాజమానమై యుంటుంది, ఒక శాశ్వత మహాప్రకాశం, జన్మపరంపరల కన్నింటికీ, దేశానికీ, పరిసరాలకూ, విద్యాబుద్ధులకూ స్వతంత్రంగా విరాజమానమై యుంటుంది, అదే మూలం మన ఆధ్యాత్మికాభివృద్ధికి కారణము, ప్రభువు; ఆ తత్ మాత్రమే మన జీవితాలకు శాశ్వత దిశానిర్దేశాన్నిచ్చేది; ఆ తత్ మాత్రమే మన భవితవ్యాలను నిర్ణయించేది, ఆ చైతన్యంలో మాత్రమే మనం తప్పక ఐక్యం కావాలి, ఆకాంక్ష లోను, ఆరోహణలోను ఒకటి కావాలి, ఒకే ఆధ్యాత్మిక మార్గంలో ఒకే విధమైన వేగంతో ముందుకు అడుగులు వేయాలి, అదే శాశ్వతమైన వివాహ సంబంధం యొక్క రహస్యం.

CWM 13:236-37

కొత్తగా బయల్పడేది

సంభావ్యమయ్యేటటువంటి సమ్మేళనా సముదాయంలో కొత్త మూలకం ప్రవేశపెట్టబడిన ప్రతిసారి, దానిని ఏ విధంగా చెప్పవచ్చంటే, అది పరిమితులను చింపి పటాపంచలు చేసివేయడానికి కారణమవుతున్నది: ప్రవేశించినదేదో అది పాత పరిమితులను అదృశ్యం చేయగా, కొత్త సంభావ్యతలు వచ్చి చేరుతు న్నాయి. అది అనంతంగా పాత సంభావ్యతలను పెంచివేస్తున్నది. కనుక ప్రాచీన జ్ఞానం ప్రకారం, నీ కొక ప్రపంచం ఉన్నది, పన్నెండు లోతులతో లేక పన్నెండు — ఎట్లా చెప్పడం? ఒకదాని తరువాత మరియొకటి వెంట వెంట వచ్చే పరిమా ణాలతో కూడిన పరిమిత క్షేత్రాలు; అటువంటి ఈ పన్నెండు పరిమాణాల పరిమిత క్షేత్రాలలో, హఠాత్తుగా నూతన పరిమాణాలతో కూడిన పరిమిత క్షేత్రాలు రూపు దిద్దుకుంటున్నాయి; అప్పుడు ఈ పాత సూత్రాలన్నీ చటుక్కున మార్పు చెంది, బయటకు విడుదల అయే పాతవాటి యొక్క మొత్తం సంభావ్యతలను... ఒకరు అవి ఎక్కువ అవుతాయని చెప్పలేరు, కాని కొత్త సంభావ్యతలు చాలా మట్టుకు అనంతమైన సంఖ్యతో అనుబంధం చేయబడుతాయి, ఇదంతా జరిగే పద్ధతి ఇట్లా ఉంటుంది, ఇంతకు మునుపు ఉన్న తర్క ప్రామాణికత అంతా కొత్త తర్క

ప్రామాణికతతో పనికిరాని తర్కప్రామాణికత అయిపోతుంది.

మొత్తం మీద పరిమితమైనటువంటి, బాహ్యంలోని, పరిమిత దృక్పథంలో, నేను మీకు కొన్ని విషయాలను, నా సొంత అనుభవం కానివి, కాని నేను విన్న వాటిని గురించి చెప్తాను. ఉదాహరణకు, చాలామంది, 'వయస్సుకు మించిన బుద్ధికౌశలం కలిగిన పిల్లలు' (అసాధారణ ప్రజ్ఞను, లక్షణాలను కలిగిన పిల్లలు) ఉన్నారు. నేనెవరినీ కలవలేదు, కనుక, ఈ పిల్లల నిజమైన అసాధారణ ప్రజ్ఞ ఏమిటో నేనేమీ చెప్పలేను. అయినప్పటికీ, వాటికి సంబంధించి చెప్పబడిన కథలను బట్టి, సాధారణ మానవ చైతన్యానికి ఆశ్చర్యం కలిగించే ఒక రకమైనటువంటి కొత్త లక్షణాలను కలిగినవారు ఉన్నారనే విషయం స్పష్టమవుతున్నది. ఏమి జరుగుతున్నదో అర్థం చేసుకోవటానికి ఇటువంటి రకాలైన ఉదాహరణలు ఉపకరిస్తాయని నేను అనుకుంటున్నాను.... కాని ఇది సంభవమే, వాస్తవానికి, ఇప్పుడు జరిగే విషయాలన్నీ మనం ఎప్పుడూ చూసేవి కావు. కాని, విషయమేమిటంటే, వాటిని ఏ విధంగా అర్థవివరణ చేస్తామనేది. నేనిప్పుడే చెప్పినదానిలో ఒకటి కేవలం కచ్చితమని అనుకుంటున్నాను, దాని లక్షణం, విశ్వంలోని సమూహాలు మరియు సంభావ్యతా సమ్మేళనాలు హఠాత్తుగా గణనీయంగా మార్పుకు లోనవుతాయంటే, పరిశోధన చేసేవారందరికీ ఇది బహుశా విభ్రమం కలుగ జేస్తుంది.

CWM 8:313-314

నవ ఉషస్సు బాలలు

ఈ మధ్యనే, బుధవారం తరగతులలో ఒక రోజు, మనం అసాధారణ ప్రజ్ఞ కలిగిన చిన్నపిల్లల గురించి మాట్లాడుకున్నాం. కొందరంటారు అసాధారణ ప్రజ్ఞ కలిగిన చిన్నపిల్లల సంఖ్య చెప్పకోతగినంతగా పెరుగుతున్నదని, మరికొంత మంది — అమెరికా దేశస్థులలో సైతం — అంటారు, ఇది శ్రీఅరవిందుల ప్రభావము, కార్యాచరణం వలన అని, మరి ఇతరులంటారు, అది ఆటంబాంబుల ఫలితంగా అని! కాని వాస్తవమేమిటంటే, అసాధారణ ప్రజ్ఞను కలిగిన పిల్లలు చాలా పెద్ద సంఖ్యలోనే ఉన్నారనే విషయం. నేను దాని గురించి ఎక్కువ వివరంగా మాట్లాడదలచుకో లేదు, ఎందువల్లనంటే నా దగ్గర ఋజువులు లేవు, మీకు ఇవ్వటానికి నా దగ్గర మంచి ఉదాహరణలు ఏవీ లేవు. దాని తరువాత జరిగిన

విషయం, ఎవరో ఒకరు ఒక ఎనిమిది సంవత్సరాల పిల్ల వ్రాసిన ఫ్రెంచి పుస్తకాన్ని నా కోసం తీసుకువచ్చారు. సహజంగానే, అది జరిగే విషయమా అని కొంత మంది వాదిస్తారు, అది ఏ విధంగా సంభవించగలదో నేను మీకు తరువాత తెలియజెప్పుతాను. ఎనిమిది సంవత్సరాల పిల్లకు ఆ పుస్తకం మెచ్చుకోతగినదే. దానర్థం ఆ పిల్ల వయసు తెలియకపోయినట్లయితే, ఆ పుస్తకం అద్భుతమైనది కాకుండా పోదు; కాని అక్కడక్కడ, ఆశ్చర్యం కలిగించే కొన్ని వాక్యాలున్నాయి. నేను వాటిని వ్రాసిపెట్టుకున్నాను, వాటిని మీకు నేను వినిపించ బోతున్నాను.

(శ్రీమాత ఆ వాక్యాల కోసం తన పుస్తకంలో వెతుకుతున్నారు) ఒక చిన్న వాక్యం ఇలా ఉంది: "మనం నిజంగా ఒకరి నొకరు ప్రేమించుకుంటే, మనం ఒకరి నుంచి మరియొకరం దేనినీ దాచి ఉంచలేము"... ఇది చాలా బాగుందనే విషయం సుస్పష్టమే. దాని తరువాత, ఇంకొకటేదో, ముఖం మీద గోధుమరంగు మచ్చలున్న పిల్లవాడికి వ్రాసినది – మీకు తెలుసా అటువంటి మచ్చ లేమిటో? ఆ పిల్ల ఆ పిల్లవాడికి వ్రాస్తున్నది: "నీవు చాలా అందంగా ఉన్నావు, అవును నేను చెప్పేది వాస్తవం, నీ మచ్చలు చాలా ముద్దుగా ఉన్నాయి; అది ఎట్లా ఉందంటే, ఒక దేవత నీ ముఖ మంతటా గోధుమ గింజలు చల్లింది, ఆకాశంలోని పక్షులను ఆకర్షించడానికి". కచ్చితంగా ఇది ఎంతగానో కవిత్వమే.

చివరగా, నిజంగా ఎంతో బాగున్నదొకటి నేను ఇవ్వబోయే వివరణకు ద్వారం తెరచేదానిని మీ కందించబోతున్నాను: "నేను కేవలం ఒక చెవిని, ఒక నోటిని, పదాల తుఫాను రణగొణ ధ్వనిని చెవి వింటుంది, మీకు దానిని నేను వివరించి చెప్పలేను, ఒక అపారమైన గొంతు నాలో కోలాహలం చేస్తున్నది, నా నోరు వాటినే పదే పదే చెప్తున్నది. కాని నాలో ప్రవహిస్తున్న ప్రకాశంతో పోలిస్తే నేను చెప్తున్నది ఏమీ లేదు."

ఇది ఎంతో అందంగా ఉన్నదనేది సుస్పష్టం.

CWM 8:316

భవిష్యత్తుకు తయారు చేసే విద్య

పిల్లల కోసం, కచ్చితంగా వారు పిల్లలు కాబట్టి, వారిలో భవిష్యత్తును గెలవాలనే ఇచ్ఛను, ఎల్లప్పుడూ ముందుకు దృష్టి సారిస్తూ తాము పోగలిగినంత

వేగంగా అది ఏమిటో అనేదాని వైపుకు కదిలిపోయే ఇచ్ఛని క్రమక్రమంగా మనసులో పుట్టించటం అనేది అత్యుత్తమమైన పని — కాని వారు మొత్తం బరువును, ధ్యానపు తిరగలిరాయిని బోలి, నిరంకుశమై కుంగదీసే భూతకాలపు బరువును వారితో ఈడ్చుకుంటూ వెళ్ళకూడదు.

పిల్లలకు తెలియజేయాలి: అభివ్యక్తం చేయవలసిన అద్భుతమైన విషయాలెన్నో ఉన్నాయి, వాటిని అందుకోవటానికి మిమ్మలను మీరు సిద్ధం చేసుకోవాలి. అప్పుడు వారు ఏదో ఇంకా ఎక్కువ నిర్దిష్టతను, తేలికగా అర్థం అయ్యేదాన్ని కోరుకుంటే, అప్పుడు నీవు వారికి చెప్పవచ్చు: శ్రీఅరవిందులు వీటిని ప్రకటించటానికి ఏతెంచారు: నీవు వాటిని చదవగలిగినప్పుడు, నీవు అర్థం చేసుకోగలవు. ఈ విధంగా ఇది వారిలో ఆసక్తిని రేకెత్తించి, తెలుసుకోవాలనే కోరికను...

కాని అన్నింటినీ మించి, చాలా ముఖ్యంగా పరిహరించవలసిన దేమిటంటే ఈ విభజనలు. వారిలో ప్రతి ఒక్కరి, అందరి మనస్సులలోను ఉన్నది: ఆధ్యాత్మిక జీవితం సాగించటానికీ, సర్వ సాధారణ జీవితం సాగించటానికీ మధ్య, ఆధ్యాత్మిక చైతన్యం కలిగి ఉండటానికీ, సర్వ సాధారణ చైతన్యం కలిగి ఉండటానికీ మధ్య విభజన — ఉన్నదల్లా అక్కడ కేవలం ఒక్కటే చైతన్యం. చాలా ఎక్కువ మందిలో అది మూడు వంతులు నిద్రావస్థలో ఉన్నది, కృతకమై వికృతంగా ఉన్నది, చాలా మందిలో అది ఇంకా కృతకమై వికృతంగానే ఉన్నది. కాని ఆవశ్యకమైనది, చాలా తేలికైన విషయం, ఒక చైతన్యంలో నుండి మరియొక చైతన్యంలోకి గెంతటం కాకుండా, ఒకరి యొక్క చైతన్యాన్ని తెరవాలి (ఊర్ధ్వముఖంగా సంజ్ఞ), దివ్యసత్య స్పందనలతో నింపాలి, ఇక్కడ ఉన్నదానిలో తప్పక సామరస్యతతో నింపాలి — అది అక్కడ నిరంతర చిరంతనత్వంతో ఉంటుంది — కాని ఇక్కడ, ఉండవలసిందేమిటి: భూమి యొక్క "రేపు". నీ వెనుక నీవు ఈడ్చుకు వెళ్ళవలసిన మొత్తం బరువును నెత్తిన పెట్టుకుని ఆ భారంతో నీవు కుంగిపోతే, తప్పకుండా నీవు వదలి పారవేయవలసినదంతా నీతో బాటే ఈడ్చుకుంటూ వెళితే, నీవు వేగంగా ముందుకు వెళ్ళలేవు....

*

మనకు మనుషులు కావాలి — ఓహ్! మనకు విలక్షణమైన ఉపాధ్యాయులు కావాలి — మొదట, తెలిసింది సమస్తం విస్తారంగా తగిన విధంగా లిఖించబడిన దానిని తమ వద్ద కలిగి, ప్రతి ప్రశ్నకు సమాధానం ఇవ్వగలిగిన వారయ్యుండాలి, అదే సమయంలో, అనుభవం లేకపోయినా, కనీసం జ్ఞానం కలిగినవారు — అను భవం కూడా ఉంటే ఇంకా మంచిది — నిజమైన మేధో అంతర్బుద్ధి వైఖరితో — సహజంగానే సామర్థ్యం ఇంకా ఎక్కువగా కోరదగినదే — తెసుసుకునేదానికి నిజమైన త్రోవ మానసిక నిశ్శబ్దమనీ, ఆ శ్రద్ధతో కూడిన నిశ్శబ్దమే ఇంకా ఎక్కువ నిజమైన చైతన్యం వైపుకు మరల్చిన దవుతుందనీ, అక్కడి నుంచి వచ్చేదానిని అందుకోగలిగిన సామర్థ్యాన్ని కలిగి ఉండాలనీ అనేటటువంటి కనీస జ్ఞానం ఉండటం చాలా మంచిది. అత్యుత్తమమైన విషయం ఈ సామర్థ్యం; కనీసంగా అదే నిజమైన విషయమని వివరించి చెప్పబడాలి — ఒక విధంగా ఋజువులతో చేసి చూపించే పద్ధతి (నిరూపణతో ప్రదర్శించి చూపడం) — మొత్తం జ్ఞానం యొక్క క్షేత్రాని కంతటికీ సంబంధించి కేవలం ఏది తప్పక నేర్చుకోవలసినది అనే దృక్పథం మాత్రమే కాకుండా, ఏమి చేయాలనేదాని యొక్క మొత్తం క్షేత్రాన్ని కూడా తెలుసుకొనేవిధంగా అది పని చేయాలి: ఎలా చేయాలనే కచ్చితమైన సూచనను అందుకొనే సామర్థ్యం; ఆ విధంగా ముందుకు పోతూ ఉంటే, తప్పకుండా చేయవలసినది ఏది అనేదాని స్పష్టమైన అవగాహనగా, తప్పకుండా దానికెప్పుడు చేయాలి అనే కచ్చితమైన సూచనగా అది మారిపోతుంది. కనీసం పిల్లలు, ఆలో చించే సామర్థ్యం వారికి వచ్చి రాగానే — అది ఏడు సంవత్సరాలప్పుడు మొదలవుతుంది కాని పద్నాలుగు లేక పదిహేనులో అప్పుడది చాలా సుస్పష్ట మవుతుంది — ఏడు సంవత్సరాలప్పుడు పిల్లలకు చిన్న చిన్న సూచన లివ్వాలి, ఎట్లా చేయాలనేదాని పూర్తి వివరణను 14 సంవత్సరాలప్పుడు ఇవ్వాలి. లోతైన సత్యంతో సంబంధం కలిగి ఉండటానికి కేవలం అదే మార్గం, మిగిలినదంతా హెచ్చుతగ్గులుగా ఏదో సూటిగా తెలుసుకోగలిగినదానికి వికృతమైన మానసిక ఉజ్జాయింపు మాత్రమే.

చివరి మాట ఏమిటంటే బోధకులు కనీసం, తమకు తాముగా క్రమశిక్షణతో

పాటు, అనుభవాల కోసం చిత్తశుద్ధితో మొదలుపెట్టినవారై యుండాలి, అది పుస్తకాలను పోగు చేసుకోవటం కాదు, ఇప్పటి విధంగా తిరిగి అప్పజెప్పడం కాదు. ఈ పద్ధతిలో ఒకరు బోధకులు కాలేరు; కావాలనుకుంటే బయటి ప్రపంచం ఆ విధంగా ఉండాలనుకుంటే ఉండనీ. మనం ప్రచారం చేసేవాళ్ళం కాదు, మనం కేవలం ఏది చేయవచ్చో చూపించాలనుకుంటూ, అది తప్పక చేయవచ్చని ఋజువు చేసే ప్రయత్నం చేస్తున్నాం.

*

సత్యపు చుక్కలు కొన్ని

పిల్లలతో వారు చాలా చిన్నగా ఉన్నపుడు వారితో వ్యవహరించడం, అది ఎంతో అద్భుతం. అప్పుడు చేయవలసినది ఎంతో తక్కువ: ఈ మాత్రం చేస్తే చాలు —

ఎన్నడూ తప్పు చేయవద్దు.

ఎన్నడూ నిగ్రహం కోల్పోవద్దు.

ఎల్లప్పుడూ అర్థం చేసుకో.

ఈ గమనం ఎందుకుంది, ఈ ప్రేరణ ఎందుకొచ్చింది, బిడ్డయొక్క అంతరంగ తత్వం ఏమిటి అని తెలుసుకోవటం, స్పష్టంగా చూడటం, దేనిని ధృఢపరచి, దేనిని ముందుకు తీసుకురావాలి — కేవలం ఇది మాత్రమే చేయవలసినది. వారిని వదలివేయడం, వారి వికసనానికి వారిని స్వేచ్ఛగా వదలివేయడం, మామూలుగా చాలా విషయాలు చూడటానికి, చాలా వాటిని స్పృశించడానికి, ఎన్ని చేయడానికి సాధ్యమౌతుందో అన్నింటిని చేయడానికి అవకాశం ఇవ్వడం. అది చాలా వినోదాత్మకం. అన్నింటినీ మించి, నీవు ఆలోచించేదానిని వారి మీద రుద్దే ప్రయత్నం చేయకపోవడం.

వారి నెప్పుడూ తిట్టవద్దు. ఎల్లప్పుడూ అర్థం చేసుకో, ఒక వేళ బిడ్డ తయారుగా ఉంటే వివరించు; అతడు వివరణకు సిద్ధంగా లేకపోతే — నీవు నీకుగా తయారుగా ఉంటే, చెడ్డస్పందన స్థానంలో నిజమైనదానిని ప్రవేశపెట్టు, కాని ఇది.... ఇది ఉపాధ్యాయుల నుంచి ఒక పరిపూర్ణతను తప్పక కోరుతున్నది, కాని చాలా అరుదుగా వారికిది వుంటుంది. కాని బోధకుల కోసం ఒక కార్య

ప్రణాళిక తయారుచేయడం చాలా ఆసక్తిదాయకంగా ఉంటుంది, అసలైన అధ్యయన కార్యప్రణాళిక, అట్టడుగు నుంచి — చాలా నమ్యత తలిగినది, ప్రభావములను ఎంతో లోతుగా అందివ్వ గలగినది. వారు చాలా చిన్న పిల్లలుగా ఉన్నప్పుడు, వారికి కొన్ని చుక్కల సత్యాన్ని అందించగలిగితే వారి అస్తిత్వం వృద్ధి పొందుతున్న కొలదీ వారు పూర్తిగా సహజంగా వికసిస్తారు. అది చాలా చక్కనైన కార్యక్రమము.

CWM 12:402-05 శ్రీమాత

అనువాదం డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

అక్కడున్న పాతదే తనకు తను పరివర్తన నొందటం లేదు, అది ప్రభవించిన ఒక కొత్త ప్రపంచం. సరిగ్గా అవి రెండూ ఒకదానిలో నొకటి చిక్కుముడిలో ఉన్న సంధికాలం, నడుమలో మనం ఉన్నాం — మునుపటిది, సర్వశక్తిమంతంగా ఇంకా విడువకుండా పట్టుకునే ఉన్నది, అది సర్వ సాధారణ చైతన్యాన్ని పూర్తిగా శాసిస్తూనే ఉన్నది, కాని కొత్తది ప్రశాంతంగా జారుతూ వస్తున్నది, ఇంకా ఎంతో నిరాడంబరతతో, చడీ చప్పుడూ లేకుండా గుర్తించబడనిదై — అది ఎంతగా చడీ చప్పుడు లేకుండా గుర్తించబడనిదిగా ఉన్నదంటే, ప్రస్తుతానికి మట్టుకు, బాహ్యంలో అది దేనినీ ఎక్కువగా కలవరానికి లోను చేయడం లేదు, చాల ఎక్కువమంది చైతన్యంలో తెలియనిదిగా కూడా ఉన్నది. అయినప్పటికీ అది పని చేస్తున్నది, వృద్ధి నొందుతున్నది — తనను తాను తన ఉనికిని ప్రత్యక్షంగా చాటి చెప్పేటంత ప్రబలంగా అయ్యే పర్యంతం.

CWM 9:150 శ్రీమాత

అనువాదం డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

అతిమానస ప్రభావం క్రింది యథార్థ మానవజాతి

మొక్కలు, మొక్కల సహజ సౌందర్యం (అదెంతో అద్భుతం) తర్వాత యెంతో సామరస్య జీవితంగల జంతుజాతి మనుష్యులు జోక్యం చేసుకోనంత వరకు కంటిక్కనుపించి, అంతా కూడా యథాస్థానంలో వున్న తర్వాత, మానవ జాతిలాగా యథార్థ మానవజాతి, అంటే, సౌందర్యం, సామరస్యం, మురిపించే తత్వం, జీవన శోభ, జీవానాభిరుచిగల — అందంలో జీవించాలనే అభిరుచివల్ల అందవిహీనం, నీచం, తుచ్ఛం, అయినదంతా సహజంగానే అణచివేతకు గురౌ తుంది. అదొక శుద్ధమైన మానవజాతి — అత్యున్నతస్థాయి మానవజాతి, కాని చాలా చక్కటిది, వునికిలో కొచ్చింది. మానవజాతినై వున్నందుకు పరిపూర్ణ తృప్తితో వుంది, ఎందుకనంటే అది సామరస్యంగా జీవిస్తోంది. నూతన సృష్టి ప్రభావం క్రింద దాదాపు సకల మానవజాతి, యేదిగా తయారుకాబోతోందో ముందుగా తెలిపేదిగా వుందది. మానవజాతిని అతిమానసిక చేతన యేం చేయ బోతోందో, అదిగా నా కది కన్పించింది. అందులో జంతుజాతుల నుండి దేనిని తీసుకొని మానవజాతి తయారైందో, దాని పోలిక యిక్కడ కన్పించింది. అది సహజంగానే బాగా కలగలిసిపోయి వుంది. కాని వస్తువులు పరిపూర్ణంగా, ఉత్త మంగా తీర్చిదిద్దబడ్డాయి, సంపూర్ణంగా ఉపయోగించబడ్డాయి. మనస్సు ప్రభావం క్రింద జంతుత్వం మరోవిధంగా తయారైంది, సహజంగానే అది యేదో కలబోతే, యెందుకనంటే మనస్సు అసంపూర్ణం. అదే విధంగా అతిమానసిక ప్రభావం క్రింద మానవజాతి యెలా తయారు కాగలదో చూపే ఉదాహరణలు, చక్కని సమతూకంగల ఒక సామరస్యపూర్వక మానవజాతులో వున్నాయి. కాక పోతే అది చాలా దూరాన వుంది. వెంటనే అది అలా జరుగుతుందని నీవు ఆశ పెట్టుకోవద్దు — అది చాలా చాలా దురంగా వుంది.

ఇప్పుడు కూడా, మనం మార్పు చెందుతున్న కాలంలో వున్నాం అనేది స్పష్టం, యిది చాలా కాలం వుంటుంది, పైగా బాధమయం కూడా. కృషి మాత్రం కొన్ని సమయాల్లో బాధాకరంగా (తరచుగా బాధాకరంగా) వున్నా చేరవలసిన గమ్యం, చేరబోయే గమ్యం స్పష్టంగా దృష్టికి తేవడంతో దానికి తగ్గ మూల్యం

దక్కినట్లౌతుంది. అదొక అభయం, అవును అదొక నిశ్చితత్వం. కాని సమస్త దోషాన్ని, సమస్త వైకల్యాన్ని, మానసిక జీవన సమస్త వికారాన్ని రూపుమాపగలదేదో గా అవుతుంది. — ఆ తర్వాత చాలా సుఖసంతోషాలతో వుండే, మానవజాతిగా వున్నందుకు బాగా సంతృప్తిపడిన, మానవజాతి కన్న యితరమైనదేదోగా వుండవలసిన అవసరం యేమాత్రం లేని, ఒక మానవ సామరస్యతగల మానవజాతి అవుతుందది.

CWM 11:25-26

భవిష్యత్తులోనికి సాక్షాత్కారాల బాటలు

జరుగబోయేవాటిని ముందుగానే చూచిన సాక్షాత్కారాల భవిష్యత్తులోనికిది బాటలను తెరుస్తుంది. నూతన క్రియాశక్తులకు, యెరుకతోగాని, యెరుకలేకగాని, తెరచుకొన్న మొత్తం మానవజాతి ఉద్ధరించబడుతుంది. ఒక ఉన్నత, మరింత సామరస్యంగల, మరింత పరిపూర్ణ జీవితంలోని కన్నట్లు ఉద్ధరించబడుతుంది. వ్యక్తిగత రూపాంతరీకరణ సదా ఆహ్వానించదగినదీ, సాధ్యమయ్యేదీ గాకపోయినా, ఒక నూతన క్రమబద్ధత సాధ్యమయ్యేటట్లు, ఒక నూతన సామరస్యం పాదుకునేటట్లు, ప్రస్తుత అశాంతి, సంఘర్షణ, అంతర్ధాన మయ్యేందుకు, సకలమూ సామరస్యంగా పని చేసేందుకు అనుమతించే ఒక క్రమబద్ధత ఆ స్థానంలో నిలిచేందుకు, ఒక విధమైన సాధారణ ఉద్ధరణ, సకలానికి సంబంధించిన ఒక సామరస్యీకరణ జరుగుతుంది.

జీవితంలో మనస్సు జోక్యం వక్రబుద్ధులు, వికారం, అపార్థాల మొత్తం రాశిని సృజించింది. ఇది మొత్తం మానవజీవితాన్ని భయంకరమైనదేనిగానో తయారు చేసి, బాధను, దైన్యస్థితిని, నైతిక దారిద్ర్యాన్ని పెంచి ఒక క్షుద్రమైన, ఏవగింపు కలిగించే ప్రదేశంగా తయారుచేసింది. దీన్నంతా వ్యతిరేక మార్గంలో రద్దు చేసే ధోరణిగల యితర పర్యవసానాలు వుంటాయి. అది పోవాలి. ఏదెలా వున్నప్పటికీ, నిరాడంబరంగా సహజ సిద్ధమైన, అన్య ప్రమేయం లేని జీవన సామరస్యం గల జంతు జీవితం కన్న యెన్నో విధాన నీచమైనదానిగా మానవజాతిని తయారు చేసిందిదే. ప్రత్యేకించి ఆహంకారిక అవసరాలు తీర్చే సేవకునిగా మనస్తత్వాన్ని వుపయోగించడం వల్ల పెడదారి పట్టిన మానవ విభాగం మొత్తంలో, యిప్పుడు

న్నంత దుఃఖమయంగా, అసహ్యంగా బాధపడడం జంతువుల్లో యెన్నడూ లేదు. మనం దాన్ని దాటి పైకి పోవాలి, దివ్య వెలుగు, దివ్య సామరస్యత లోనికి గెంతాలి లేక వెనుకకు, ఒక ఆరోగ్యకరమైన, అపసవ్యం కాని జంతు నిరాడంబరతలోనికి పడిపోవాలి.

...కాని యెవరైతే ఉద్ధరించబడలేరో, పురోగమించడాన్ని వ్యతిరేకిస్తారో వాళ్ళు యితర ప్రమేయం లేకుండా మానసిక చేతన నుపయోగించ లేరు. వాళ్ళు మానసిక స్థాయికన్న దిగువ స్థాయికి పడిపోలేరు.

అతిమనస్సుతో మమేకం కాగలిగిన, తమన తాము ముక్తం చేసుకోగల మానవజాతికి చెందిన, మానవచేతనకు చెందిన జనాభా పూర్తిగా రూపాంతరం చెందుతుంది. ఇంతవరకు కంటిక్కనుపించే రూపంలో బయట పడని, భవిష్యత్తుకు చెందిన వాస్తవికత వైపుకు పురోగమిస్తుంది. ప్రకృతికి బాగా చేరువలో వున్న జంతుజాలం నిరాడంబరతకు బాగా దగ్గరగా వున్న జనాభా ప్రకృతి లోనికి తిరిగి తీసుకోబడుతుంది, దానితో బాగా కలిసిపోతుంది. కాని మనస్సును దుర్వినియోగం చేయడం ద్వారా అపసవ్యతను అనుమతించే మానవ చేతనకు సంబంధించిన కలుషిత భాగం రద్దైపోతుంది. జగత్ చరిత్ర గమనంలో అంతర్ధానమైన, విఫలమైన ఇతర జాతులుండి వున్నట్లే, యిటువంటి మానవాళి, నిష్ఫలమైన ప్రయత్నానికి చెందిన భాగం — దీన్నే లేకుండా చేయాలి.

CWM 9:298-01

ఒక నమూనా నగరం

సమస్త జాతి విరోధాలను, సాంఘిక కట్టుబాట్లను, తమను వ్యతిరేకించే నైతికతలు, పోటీపడే మతాలకు దూరంగా మనుషులు నివసించగలిగిన ఒక ప్రదేశం భూమికి అవసరం. గతానికి ఊడిగం చేసే స్థితి నుండి బయటబడి కనుపించే సృష్టిలోనికి రావాలనుకొంటున్న దైవచేతనను ఆవిష్కరించుకొనడానికి, ఆచరించడానికి తమనుతాము యెక్కడ పూర్తిగా అంకితం చేసుకోగలుగుతారో అటువంటి ఒక చోటు అవసరం భూమికి వుంది.

ఇటువంటి చోటుగా తాను కావాలని ఆరోవిల్లి అనుకొంటోంది, రేపటి పరమ

సత్యాన్ని నేడే జీవించాలని ఆకాంక్షించే వారందరికి తానున్నానని అది చెప్తోంది.
CWM 13:202

ప్రశ్న: భిన్న విలువలు గల జనం, సామరస్యంగా ఒక చోట నివసిస్తూ కలిసి యెలా పనిచేయగలరు?

సమా: తప్పక అవసరమైన శాశ్వత యేకత్వాన్ని కలిగి వుండడానికి సమస్త భేదాలు యెక్కడ ఒకటవుతాయో ఆ చోటును కనుగొనడానికి, తన లోలోతుల లోనికి పోవడంలోనే పరిష్కారం వుంది.
CWM 13:202

పేదరికాన్ని, బాధను రద్దు చేయడం వైపు కొక అడుగు

ప్రశ్న: ప్రపంచంలో యింకెంత మాత్రం పేదరికం లేని, బాధపడడం లేని రోజొకటి వస్తుందా?

సమా: శ్రీఅరవిందుల బోధనను అర్థం చేసుకొన్నవారి యందు విశ్వాసమున్న వారందరికీ ఆ రోజొకటి వస్తుందని నిశ్చయంగా తెలుసు. ఇదెక్కడ జరుగుతుందో అటువంటి ప్రదేశాన్నొకదాన్ని సృజించాలనే వుద్దేశ్యంతో మేము ఆరోవిల్లి నగరాన్ని నిర్మించాలనుకొంటున్నాం. కాని దాని సాకారం జరగాలంటే మనలో ప్రతి ఒక్కరం తనను తాను మార్చుకోవాలని కృషి చేయాలి. ఎందుకనంటే మనిషి పడే బాధల్లో చాలా వరకు, భౌతికానికి, నైతికానికి సంబంధించిన వారి స్వంత పొరపాట్ల ఫలితమే.

ప్రశ్న: ఆరోవిల్లిలో నివసించడాని కొచ్చేవాళ్ళు ఒకే బయటి ప్రపంచం నుండి వచ్చినవాళ్ళు, అవే బలహీతలు లోపాలతో పుట్టినవాళ్ళే అయినందువలన అక్కడ బాధపడడమనే దింకెంతమాత్రం వుండదని మీరెలా నమ్ముతున్నారు?

సమా: ఆరోవిల్లిలో బాధపడడం యింకెంత మాత్రం వుండదని నేనెప్పుడూ అనుకో లేదు. ఎందుకనంటే ఇప్పుడున్న విధంగా వుండే మనుష్యులు బాధపడడాన్ని ప్రేమిస్తారు, దాన్ని తిట్టుకుంటూనే ఆహ్వానిస్తుంటారు.

కాని యథార్థంగా శాంతిని ప్రేమించడానికి, సమత్వాన్ని ఆచరించడానికి ప్రయత్నించడం వాళ్ళకు నేర్పడానికి మనం ప్రయత్నించాలి.

నేనన్నదాని అర్థం యేమిటంటే సంకల్పించకుండానే వచ్చిపడే పేదరికం

బిక్షమెత్తుకునే అవసరం వుండని విధంగా ఆరోవిల్లిలో జీవన విధాన మేర్పడుతుంది — బయట నుండి యాచకులొస్తే వాళ్ళు అక్కడి నుండి వెళ్ళిపోవడమో లేక వారికి ఆశ్రయమిచ్చి, పని చేయడంలో వుండే సంతోషాన్ని తెలియజెప్పడమో జరగాలి.

CWM 10:268

ప్రశ్న: ఆరోవిల్లిలో వున్న ఆస్తి అందరికీ అంటే ప్రతి వ్యక్తి, ప్రతిదాన్నీ ఉపయోగించుకోవచ్చుననా దాని అర్థం? లేక వస్తువులను జాగ్రత్తగా వాడే వాళ్ళ కే ఇస్తారా?

సమా: ఇదంతా భూమి మీద ఇంతవరకు బాగా విస్తరించని చేతనను సూచిస్తుంది. ఉపయోగించడం తెలియనివాళ్ళకు వస్తువు లిస్తారని కాదు దీనర్థం. ఆరోవిల్లిని నడపటానికి సాంప్రదాయా లన్నింటి నుండి స్వేచ్ఛ పొందిన అతిమానస సత్య వేరుకగల ఒక చేతన అవసరం.

CWM 13:208-209

ప్రశ్న: ఆరోవిల్లికి యెటువంటి రాజకీయ వ్యవస్థ వుండాలి అని మీ ఉద్దేశ్యం?

సమా: నవ్వు తెప్పించే ఒక నిర్వచనం తోస్తోంది నాకు: ఒక దివ్య అరాచకం; కాని ప్రపంచం అర్థం చేసుకోలేదు. మనుషులు తమ చైత్యపురుషుని తెలుసుకోవాలి, తమను తాము అన్యప్రేరణ లేకుండా, స్థిరనియమాలు, చట్టాలు లేకుండా తమను తాము చక్కదిద్దుకోవాలి — అదీ ఆ ఆదర్శం.

ఇందుకోసం అతని చైత్యపురుషునితో అతనికి సంపర్కం వుండాలి, దానితోనే అతను నడుపబడాలి, అహం పెత్తనం, ప్రభావం అంతర్థాన మవ్వాలి.

CWM 13:219

బిచ్చమెత్తుకోవడం, పోలీసు, జైళ్ళు వుండవు

ఆరోవిల్లిలో బిచ్చమెత్తుకోవడాన్ని అనుమతించరు. బజారులో బిచ్చ మెత్తుకొనే పిల్లలను బడికి, వృద్ధులను ఒక ప్రత్యేక యింటికి, జబ్బుపడ్డవాళ్ళను ఆసుపత్రికి, ఆరోగ్యంగా వున్నవాళ్ళను పనికి పంపుతాం.

ఒక బడి, ఒక యిల్లు, ఒక ఆసుపత్రి, ప్రత్యేకమైన పనులు చేసే ప్రదేశాలు యేర్పాటు అవుతాయి. వాళ్ళను యితరులతో కలవనివ్వరు, ఎందుకనంటే

కొంతమంది బయట నుండి వచ్చి బజారులో బిచ్చమెత్తుకోవడం మొదలుపెట్టి వుండవచ్చు.

పోలీసు లుండరు... సరైన పదం దొరకడం లేదు... రక్షకబృందం ఒకటుంటుంది. ఒక రక్షకదళం, జపానులో వున్న అగ్నిమాపక దళానికి చెందినవాళ్ళ లాగా ఒక దళం వుంటుంది. వాళ్ళు కసరత్తు చేయగలరు, దుర్ఘటనలు జరిగినపుడు — ఏవైనా సరే భూకంపాలు లాంటవేవి జరిగినా — కావలసినదంతా చేస్తారు. ఇళ్ళలోనికి బయట నుండి యెగబ్రాకి ప్రవేశిస్తారు. పోలీసులకు బదులు ఒక విధమైన రక్షకదళం వుంటుంది. వాళ్ళవసరమేమైనా వుందేమోనని వాళ్ళు క్రమం తప్పకుండా పట్టణంలో వివిధ ప్రాంతాలకు వెళ్ళి చూస్తారు. బిచ్చమెత్తుకొనేవాళ్ళు కన్పిస్తే నేను చెప్పినట్లు వాళ్ళను సర్దుబాటు చేస్తారు.

పిల్లల కొక బడి ఉంటుంది. వృద్ధులకు ఆశ్రయమిచ్చే యిల్లొకటి వుంటుంది. వికాలంగులకు, రోగులకు ఒక ఆసుపత్రి వుంటుంది. ఆరోగ్యంగా వున్నవాళ్ళు పనిచేయడానికొక చోటు వుంటుంది.... ఊడ్వడం దగ్గర్నుంచి ప్రతి పనీ వుంటుంది... అవసర మనిపించే ప్రతి పనీ వాళ్ళ వాళ్ళ సామర్థ్యాన్ని బట్టి చేస్తారు. ఇది జరగాలి.

పిల్లలకు పని చేయడం నేర్పడానికి వాళ్ళు పని చేయడానికి అవసరమైనదేమిటో నేర్పడానికి ప్రత్యేకించి ఒక బడి వుంటుంది. జైలు వుండదు, పోలీసు లుండరు.

CWM 13:261-62

వైద్యులుండరు, ఆసుపత్రు లుండవు

జబ్బులు లేకపోతే వైద్యు లుండరు అర్థమైందా. వాళ్ళు కావాలని వాటిని ప్రోత్సహిస్తున్నారని చెప్పడం లేదు నేను, కాని వాళ్ళు స్నేహపూర్వకంగా వుండరు.

అది చాలా సున్నితమైన విషయం, కాని పూర్తిగా యదార్థం.

దివ్యచేతనలో (మనం దాని విశ్వజనీన చేతన అందాం) జీవకణాల కొక కంపనాత్మక వ్యవహారం వుంది. ఆలాంటిదాన్నే ఒక వైద్య సంబంధ చేతనలో కూడా చూచాను, అదెలా మారిపోయి వుందో నీకు తెలుసా! మొదట్లో చాలా

ఘనిష్ట లక్షణాన్ని కలిగి వుంది. (మరోలా అయితే అది వుండదు) తరువాత... అది "ప్రమాదకరం" "తప్పించుకోలేనిది". రెంటికి మధ్యలో, దాన్నెలా చెప్పాలో తెలియడం లేదు. అదొక కఠిన "విధి" లాంటిది. వాళ్ళు "ఓ అదొక జబ్బు" అన్నపుడు, అంతా ముగిసినట్లే. అది యదార్థం కాదు. "ఒక జబ్బు" అనబడేదేం లేదు. ఒకే విధమైనవి రెండు లేవు. కాబట్టి వాటి వాతావరణమే ఒక సమస్య.

ప్రశ్న: ఆసుపత్రుల పేరు చెప్పగానే బిగుసుకుపోతాను, వాటిల్లో నాకు జబ్బు మరింత యెక్కువవుతుంది.

సమా: అవును, యిక్కడ ఆసుపత్రిలో నీకు జరిగిందదే. (వాస్తవాని కదొక స్వల్ప అస్వస్థత). అదే జబ్బుగా తయారైంది.

అదలా వుంటుంది...

ఇది ప్రత్యేకించి యే వైద్యునికీ వ్యతిరేకంగా కాదు. (వాళ్ళు కూడా వాళ్ళకు తెలియకుండానే ఆ వాతావరణానికి బాధపడతారు) అదీ, వైద్య సంబంధ వాతావరణం.

వాళ్ళ మనుగడకు కారణమే వ్యాధి. వ్యాధులు లేకపోతే వైద్యులుండరు, వాళ్ళ అవసరం వుండదు. వాళ్ళు మరో విధంగా వుండేవారు కాని వైద్యులుగా గాదు, బాగా ఉపయోగం వున్న మరేదోగా అయ్యేవారు, యేమయ్యేవారో నాకు తెలియదు — మానవ శరీర తత్త్వానికి సంబంధించిన శాస్త్రివేత్తలు, ఆహార విషయాలకు సంబంధించిన శాస్త్రివేత్తలు, తెలుసుకోడానికి మంచి విషయాల న్నించే అన్ని రకాల వాటికి సంబంధించిన శాస్త్రివేత్తలై వుండేవారేమో గాని వైద్యులుగా మాత్రం కాదు. వైద్యుడనేవాడు వుండేది వ్యాధి నయం చేయడానికి. వైద్యులండటానికి వ్యాధులుండాలి.

వైద్యులు లేనప్పుడు వ్యాధులున్నాయో లేదో గట్టిగా చెప్పలేను — అశాంతు లుండేవి, దుస్సంఘటన లుండేవి, అన్ని రకాలైనవీ వుండేవి. యెందుక నంటే అదంతా సృష్టిలో వుంది, కాని "వ్యాధి" అనే పేరు తగిలించుకొని కాదు. నైపుణ్యంగల వైద్యులు (అంటే వాళ్ళ వ్యాపారాన్ని గురించి బాగా తెలిసిన వాళ్ళు) అధికంగా తయారైనపుడు (అమ్మ తమ గుప్పెటను గట్టిగా మూసి చూపుతూ) కరుడు గట్టిన వ్యాధులు తయారయ్యాయి. కాబట్టి వైద్యుల వల్ల

ప్రయోజనం, వాటిని నయం చేయడం — వ్యాధులే లేకపోతే వాళ్ళ ఉపయోగం వుండదు.

వాళ్ళు జీవన శాస్త్రజ్ఞులుగా నుండాలి.... చైనావాళ్లకా భావం కొంతవర కుండేది. మరిప్పుడేలా వుందో తెలియదు. కాని గతంలో ప్రతి కుటుంబానికి ఒక వైద్యుడుండేవాడు (అతని రక్షణ క్రింద అనేక కుటుంబా లుండేవి) అందరూ మంచి ఆరోగ్యంతో వుంటేనే వైద్యునికి సొమ్ము ముట్టజెప్పేవారు, యెవరైనా జబ్బుపడితే ముట్ట జెప్పేవారు కాదు!

శ్రీమాత ఒక శిష్యునితో సంభాషణ, నవంబరు 13, 1965

స్వచ్ఛంద విరాళం: పన్నులు లేవు

అది స్పష్టం, పన్ను లుండవు. కాని ప్రతి వ్యక్తీ సమాజ సంక్షేమానికై తన పని ద్వారా, వస్తురూపేణా లేక డబ్బు రూపేణా విరాళం యివ్వాలి. ఇవ్వడానికి డబ్బు తప్ప మరేం లేనివాళ్ళు డబ్బే యిస్తారు. కాని నిజం చెప్పాలంటే "పని" అంటే ఆంతరికమైన పని కావచ్చు — కాని ఆ మాట చెప్పలేం, యెందు కనంటే జనం తగినంత నిజాయితీపరులు గాదు. పని రహస్యమైనది గావచ్చు, పూర్తిగా అంతరంగానికి సంబంధించిన కార్యం గావచ్చు. కాని అందుకు పూర్తిగా కేవలం చిత్తశుద్ధి కలిగినదై, యథార్థమైనదై, దానికి తగిన సామర్థ్యం కలిగినదై వుండాలి, నాటకం కాగూడదు. అది శారీరకశ్రమే కానవసరం లేదు.

*

కమ్యూనిస్టు విధానాన్ని ఒక విధంగా సవరించి రూపొందించిన పద్ధతది. కాని అందరినీ సమమట్టానికి తీసుకొచ్చే తత్త్వం కలది కాదది. సామర్థ్యాన్ని బట్టి, స్థానాన్ని బట్టి, అది అంతరాత్మికానికి లేక మేధస్సుకు సంబంధించినది గాక, ప్రతి వ్యక్తీ ఆంతరిక స్థాయిని బట్టి వుంటుంది. యథార్థమేమిటంటే, భౌతికంగా ప్రతి మానవుడికి హక్కున్నది — కాని అది "ఒక హక్కు" కాదు... ప్రతి వ్యక్తి భౌతిక అవసరాలు, హక్కులు, సమానత్వాలు అనే భావంతో గాక, కనీస అవసరాల ఆధారం మీద అది వుండాలి. అదొకసారి పాదుకొల్పబడితే, ప్రతి వ్యక్తీ అతని

ఆర్థిక వనరులను బట్టి గాక, ఆంతర సామర్థ్యాలను బట్టి తన జీవితాన్ని చక్కదిద్దు కొనే స్వేచ్ఛ కలిగి వుంటాడు.

CWM 13:26

శ్రీమాత

భావానువాదం: కె. వి. రావు

భవితను ఫలవంతం చేసుకోవటం

ధనం మళ్ళీ ధనాన్ని పెంపొందించుకొనుటకు కాదు.

ప్రప్రథమంగా, ఆర్థిక దృష్టితో చూసినట్లయితే, మనం చేసే పనులన్నీ ఈ విధంగా ఆధారపడి ఉంటాయి. ధనం కేవలం మళ్ళీ ధనాన్ని తయారుచేసుకొనుటకు కాదు. ధనం ధనాన్ని పెంచాలని అనుకోవటం ఒక అసత్యమయిన వాదం, పెడదారి పట్టించడం.

ధనం అనేది ఒక సమూహం, ఒక దేశం లేదా యింకా బాగా చెప్పాలంటే ఈ పృథ్వియొక్క సంపదను, సౌభాగ్యాన్ని, ఉత్పాదకతను పెంచటానికి ఉద్దేశించబడినది. ధనం ఒక సాధనం, ఒక శక్తి, ఒక బలం. అంతే కానీ అదే అంతిమ ప్రయోజనం కాదు. అన్ని శక్తులూ, సామర్థ్యాల మాదిరిగానే అది కూడా చేతులు మారుతూ, చలామణి అవుతున్నప్పుడే వృద్ధి చెందుతుంది, శక్తిని పెంచుకుంటుంది, అంతేకాని కూడబెట్టడం, మురగబెట్టటం వలన కాదు.

ఒక దృఢమైన దృష్టాంతంతో లోకానికి ఒక విషయం నిరూపించాలని ఇక్కడ ప్రయత్నిస్తున్నాం. అదేమిటంటే ఆంతరిక మానసిక సాక్షాత్కారం మరియు, బాహ్యవ్యవస్థ వ్యవస్థలో, మానవ దురవస్థకు గల కారణం రూపుమాసిన ఒక ప్రపంచాన్ని సృష్టించబడ గలదని.

ఆర్థిక సమస్యకు పరిష్కారం

ప్రశ్న: ఒక వ్యక్తి చైతన్యం మెరుగుపడినపుడు అతని ఆర్థిక పరిస్థితి సుస్థిరమౌతుందా?

సమా: చైతన్యం మెరుగుపడటమంటే చైతన్యపు పరిధి వికసించటం, విస్తృత

పడటం, మరింత మెరుగుగా వ్యవస్థీకరించబడటం. అప్పుడు దాని ఫలితంగా సహజంగానే బాహ్య స్థితిగతులన్నీ (ఆర్థిక స్థితితో సహా) అధికంగా నియంత్రణ లోకి వస్తాయి. మెరుగైన చేతనలో సహజంగానే వ్యక్తికి తన స్వంత ఆర్థిక పరిస్థితిపై మనసు నిమగ్నం కాదు.

ఆర్థిక సమస్యకు పరిష్కారం:

రెండు సమస్యలను సమన్వయం చేయటం ద్వారా అనగా:

1. అవసరాలకు తగినట్లుగా ఉత్పాదనను సరిచేయడం;

2. ఉత్పాదనకు అనుగుణంగా అవసరాలను సరిపెట్టుకోవటం

CWM 15:53

ధనం గురించిన విభేదాలు

ధనానికి సంబంధించిన స్పర్థలు దాని యజమాన్యపు విభేదాల వలన ఏర్పడుతాయని చెప్పవచ్చు, కాని నిజానికి ధనం ఎవరికీ చెందదు. ధనాన్ని స్వంతం చేసుకోవాలనే ఆలోచన సర్వాన్నీ వక్రీకరించింది. ధనం ఎవరికీ స్వంతం కాకూడదు. అధికారంలా అదికూడా మీ కివ్వబడిన ఒక క్రియాసాధనం. దానిని మీరు “మహా ప్రదాత అనతగు దైవం యొక్క సంకల్పం” తో ఒక ఉద్దీపించబడ్డ, నిస్వార్థరీతిలో వినియోగించాలి. మీరు ధనాన్ని వ్యాపింపచేయాటనికి, వినియోగించటానికి మంచి ఉపకరణ మయినట్లయితే. అప్పుడు ధనం మీ వద్దకు వస్తుంది. అది ఏ విధంగా ఉపయోగించబడాలో, ఆ విధంగా వినియోగించగల మీ పాత్రత ననుసరించి మీ వద్దకు వస్తుంది. అదే నిజమైన పద్ధతి.

ఈ పృథ్విపై కార్యాచరణ కోసం ధనం అనే శక్తి ఉద్దేశించబడింది, అనగా దివ్యశక్తులు ఈ భూమిపై ఆవిష్కృతం కావటానికి ఈ భూమిని సంసిద్ధం చేసే కార్యం కోసం. దానిని వినియోగించే శక్తి అందుకు కావలసిన స్పష్టమయిన, అవగాహనాపూర్వక మయిన యథార్థమైన దృష్టి కలవారి హస్తాలలోకే అది చేరవలసి ఉన్నది.

ముందుగా కావలసిన ప్రాథమికమైన విషయం ఏమిటంటే ధనాన్ని సొంతం చేసుకోవాలనే భావన కలగ కూడదు. దాని అర్థం ‘ఇది నాది’ అనే భావన. లోకులు ఎందుకు ధనం తమకు సొంతం కావాలనుకుంటారో నాకు అర్థం కాదు. తమకు

నచ్చిన విధంగా వాడుకొనేందుకు, దానితో చేయాలనుకున్న పని చేయడానికి, తమ వూహలకు అనువుగా ఉపయోగించుకోవడానికే కదూ? అవును అలానే జరుగుతూ ఉంటుంది. మరి కొంతమంది దానిని ఎక్కడో భద్రపరచి ఉంచా లనుకుంటారు. అదొక జబ్బు. ఎంతో కొంత నిక్షిప్తపరచి ఉంచుతారు. కానీ అదొక జబ్బు. ఎప్పుడూ చేతిలో కొంత ధనం ఉండటానికి పోగు చేస్తుంటారు. కానీ జనులు తాము స్వీకరించి, పంపిణీ చేసే స్థావరంగా ఉండాలని, ఎంత విస్తృతము, నిస్వార్థమూ, సమగ్రమూ విశాలమూ అయితే అంత అధికంగా శక్తిని కూడగట్టుకో గలమని అర్థం చేసుకోవాలి (భౌతికంగా మార్చబడిన శక్తి — నగదు — నాణె ములు) ధనాన్ని ఉత్తమ రీతిలో వినియోగించగల సమర్థతకు తగినట్లుగా ధనాన్ని నిలుపుకోగల శక్తి ఉంటుంది. ఉత్తమమంటే సార్వజనీన మయిన ప్రగతి దృష్టిలో ఉత్తమమయినది, విశాలమయిన దృక్పథం. అపారమ యిన అవగాహన, దీప్తిమం తమైన, కచ్చితమయిన సత్యయుతమయిన విని యోగం. అహంకారపు వక్రమ యిన అవసరాలకు కాక పృథ్వి పరిణామానికి అభి వృద్ధికీ, సార్వజనిక అవసరాలకు వినియోగించబడాలి. విశాలమయిన దృక్పథ మెపుడూ అధికాధికమైన సమర్థతను కలిగి ఉంటుంది.

ధనవ్యయం వెనుక ఉండవలసిన నిజమైన దృక్పథం

దోషపూరితమయిన చలనాలన్నింటి వెనుక ఒక నిజమైన కదలిక ఉంటుంది. అతి తక్కువ వృథాతో, అతి ఎక్కువ ఫలితాలను పొందే దిశానిర్దేశం చేసి, విని యోగించి, వ్యవస్థీకరించగలగటంలో ఒక ఆనందం ఉంటుంది. అది చాలా ఆసక్తికర మయిన దృక్పథం. ధనాన్ని ప్రోగు చేసుకోవాలనేవారికి ఉండవలసిన సరియైన దృక్పథమేమిటంటే దానిని చాలా విస్తృతమైన పరిమాణంలో వినియోగించగల సామర్థ్యాన్ని కలిగి ఉండటం. కొంతమంది ధనాన్ని కలిగి ఉండి దానిని ఖర్చు చేయాలనుకుంటారు. అది మరొక విషయం. వీరు ఉదార స్వభావాన్ని కలిగి ఉంటారు, కానీ ఒక పద్ధతి, నియమం ఉండదు. అన్నీ అవసరాలను, నిజమైన అక్కరల నన్నింటినీ సరిగా తృప్తి నొందించగలగటంలో ఉండే ఆనందం మంచిదే. అది ఒక రుగ్మతను ఆరోగ్యంగానూ, అసత్యాన్ని సత్యంగానూ, బాధను సంతో షంగానూ మార్చటంలో కలిగే ఆనందం వంటిది. ఒక అసహజమయిన తెలివి

తక్కువ అవసరాన్ని చాలా సహజమైనదిగా చిత్రించడం లాంటిది. ఒక పని చేయటానికి యింత మొత్తం ధనం అవసరమౌతుంది, బాగు చేయటానికి యింత, ఏర్పాటు చేయటానికి యింత, అది కట్టడానికి యింత, దీనిని వ్యవస్థీకరించటానికి యింత, అవసరం — అది మంచిదే. ధనం సరిగ్గా ఎక్కడ అవసరమో అక్కడకు చేర్చే వాహికలుగా ఉండటానికి జనులు యిష్టపడతారని నాకు తెలుసు. ఆ విధంగా చేసేవారికి అది సరైన దృక్పథం. కాని అహంకారంతో మూర్ఖత్వంతో స్వప్రయోజనానికి కూడబెట్టు. కోవాలనేవారికి కాదు.


ధనాన్ని ప్రోది చేసుకొనే అవసరం, ఖర్చు చేసే అవసరం (రెండూ అజ్ఞాన, అంధకారపూరితం) రెండూ సమన్వయి మయినపుడు అది ఒక స్పష్టమయిన దృక్పథానికి, సమర్ధవంతమయిన వినియోగానికి దారి తీస్తాయి. అది మంచిదే. అపుడు నెమ్మదిగా దానిని ఆచరణలో పెట్టే అవకాశం కలుగుతుంది. కానీ సర్వత్రా ఒకే సమయంలో ఉండి అన్నీ ఒకేసారి నిర్వహించటానికి, అతి స్వచ్ఛ మయిన ఆలోచనలూ, నిజాయితీతో వ్యవహరించగలవారికే అది అవసరం. అపుడు ధనమనే ఈ ప్రశస్తమయిన సమస్య పరిష్కారమౌతుంది.

ధనం అనేది ఏ ఒక్కరికీ చెందినది కాదు. ధనం ఒక సమిష్టి సంపద. అది కేవలము సమగ్రము, సర్వతోముఖము, సార్వత్రికమయిన దృక్పథం కలవారి చేతనే ఉపయోగించబడాలి. దానికి నేను మరొకటి కూడా కలుపుతాను. సమ గ్రమూ, సర్వతోముఖమే కాక ఆవశ్యకంగా సత్యము అయి కూడా ఉండాలి. విశ్వప్రగతికి అనుకూలంగా ఉండటానికీ, కేవలం అకర్షణీయమైనదానికీ మధ్య భేదాన్ని తెలియచేయగల దృష్టి ఉండాలి. ఒక విధంగా చూసినపుడు పొరపాట్లు, వృధాలు కూడా సాధారణప్రగతి సహాయకాలే. ఇవి కష్టపడి నేర్చుకునే పాఠాలు.

CWM 13:269-71

శ్రీమాత

అనువాదం: డా. సరోజా ప్రసాద్



విజయాన్ని కొనితెచ్చేది త్యాగమూ, పరిత్యాగము, బలహీనత కాదు, కేవలం పరమానందం. ఏ ఆనందం శక్తి, సహనము, ఉన్నతోన్నతమయిన ధైర్యమో అది మాత్రమే విజయాన్ని తీసుకురాగలదు. అతిమానసశక్తి నుండి ఆవిర్భవించిన ఆనందం. అది అన్నిటినీ విడిచి పారిపోవటం కన్నా కష్టతరం. అది అనంతమైన, మహత్త్వమైన ధీరత్వాన్ని కోరుతుంది. కానీ అదొక్కటే విజయానికి మార్గం.

CWM 9:5 — శ్రీమాత

అనువాదం: డా. సరోజా ప్రసాద్

ఒక క్రొత్త ప్రపంచం

ప్రభుత్వం చేసిన ఘోర తప్పిదం

నా ఉద్దేశ్యము ఏమిటంటే — ఎప్పటిలాగే, మరి ఇప్పుడు ఇంకా అధికంగా — మనుషులు తమ తమ భావాల్ని, అనుభవాల్ని ఆధారం చేసుకొని తమ అంతరంగాల్లో కొన్ని నియమాలు ఏర్పరుచుకుంటారు, వాటిని అమలులో పెట్టటానికి ప్రయత్నిస్తారు. ఈ సందర్భంగా నేను చెప్పేది ఏమిటంటే, ఇది సరియైన విధానం కాదు. (శ్రీమాత పిడికిలి బిగించి ఒక బలమైన సందేశం ఇస్తారు), అది హేతుబద్ధం కాదు; అది అసత్యం. చివరకు జరిగేది ఏమిటంటే మనం అనుకూలం అనుకున్నవి కూడా మనకు వ్యతిరేకం అవుతాయి, లేదా బలహీనపడి మరుగవుతాయి. జీవితం అలాగే ఉంటుంది.

నియమాలు వీలయినంత విస్తృతంగానూ, సరళంగాను, నిదానంగానూ ఏర్పడుతూ అభివృద్ధి దిశగా పరిణామం చెందుతూ వుంటాయి. ఏదీ యథాతథంగా వుండకూడదు కదా! ప్రభుత్వాలు మాత్రం కొన్ని నియమ, నిబంధనలతో ఒక చట్రం ఏర్పరచి అందరినీ అదే చట్రంలో వుండాలనే, అదే నియమ నిబంధనలను యథాతథంగా అనుసరించాలనే శాసనం చేస్తాయి. కాని కాలక్రమేణా అవి అభివృద్ధి నిరోదకాలుగా మారుతాయనీ, జీవితాలు స్వేచ్ఛగా ఎదగకుండా నిర్బంధం చేస్తాయనీ కూడా అనుకోవాల్సి వస్తుంది!

జీవితం ఒక క్రమపద్ధతిలో వెలుగు, విజ్ఞానము, శక్తియుక్తులను సంతరించుకునేలా పరిణామం చెందాలి. వీలయినంత వరకూ అందరికీ నచ్చేటట్లు వుండాలి. అవి వీలయినంత సరళంగా కూడా వుండాలి. మన అవసరాలకు, అలవాట్లకు తగిన విధంగా వెంటనే మార్పు చెందేలా వుండాలి.

(మౌనం)

సంక్షిప్తంగా చెప్పాలంటే సమస్యలను మేధోపరంగా నిర్ణయించే పద్ధతి నుండి ఆధ్యాత్మిక చేతన నిర్ణయించే పద్ధతికి మార్చాలి.

CWM 13:267

నిజాయితీ పైనే దౌత్య సంబంధాలు ఆధారపడాలి

ప్రపంచం అసత్యంపై ఆధారపడి జీవిస్తున్నది. మానవ సంబంధాలన్నీ అసత్యం మీద, మోసం మీద ఆధారపడుతున్నాయి. దేశాల మధ్య సంబంధాలు అంతే. మాట వరసకు అందరూ శాంతినే కోరుతారు. కాని అదే సమయంలో ఆయుధాలు కూడా సమకూర్చుకుంటూనే వుంటారు. కాని స్పష్టమైన నిజాయితీ ఉన్నపుడే వ్యక్తులుగాని, దేశాలుగాని మార్పును తీసుకొని రాగలవు.
CWM 13:268

ద్వంద్వ జాతీయత

సర్వమానవ సమైక్యతా చేతన స్థిరపడి విస్తృతమయినప్పుడు మాత్రమే చిరకాలం మనగలిగే నిజమైన శాంతియుత వాతావరణం భువిపై నెలకొనగలదు. ఈ లక్ష్యసాధనకు తోడ్పడే పథకాలన్నీ స్వాగతించతగ్గవే, కాని బాహ్య పరిస్థితులకు సంబంధించినవాటికి మాత్రం పరిమిత ఫలితం దక్కుతుంది. ఏది ఏమైనా, అన్నింటి కన్నా అతిముఖ్యమైన, అత్యవసరమైన, అనివార్యమైన, ఆచరణాత్మక పథకం మానవ చేతన పరివర్తన చెందటానికి, దాని పని తీరులో మార్పును తెచ్చి వికాసవంతం చేయుటకు ఉపకరించేదిగా నుండాలి.

ఈ పథకం కార్యరూపం దాల్చే లోపల కొన్ని ఉపయుక్తమైన బాహ్యాచర్యలు చేపట్టవచ్చు. వాటిలో ద్వంద్వ జాతీయత సూత్రం ఒకటి. ఈ సూత్రానికి ఎల్లప్పుడూ ఎదురయ్యే ప్రధాన అభ్యంతరం ఒకటి వుంది. ఇరుదేశాల మధ్య యుద్ధ వాతావరణం ఏర్పడే పక్షంలో ద్వంద్వ పౌరసత్వం గలవారు ఇరుకున పడే పరిస్థితి తటస్థిస్తుంది. అయితే, శాంతిని యధార్థంగా వాంఛించేవారు తప్పక అర్థం చేసుకోవవసినది ఏమిటనగా యుద్ధం గురించి మాట్లాడటంగాని, యుద్ధం సంభవిస్తుందని అనుకోవడంగాని, యుద్ధం గురించి ఆలోచించడంగాని ఆ భయానక స్థితికి ద్వారాలు తెరిచినట్లవుతుంది అని.

యుద్ధం రద్దుపరరచడమే శ్రేయస్కరమనే చేతన మనిషిలో వికసన మయ్యే వరకు, రద్దు గావాలని అభిలషించేవారు ఎంత అధిక సంఖ్యాకులైతే అంత ఎక్కు

వగా ఒక స్థిరమైన శాంతియుత వాతావరణం నెలకొనే అవకాశం ఏర్పడుతుంది.
CWM 15:59

కొత్త తరహా పాలనా వ్యవస్థ

మతస్వామ్యం కాని, దొరల పాలనకాని, ధనస్వామ్యంకాని, లేక ప్రజాస్వామ్యమైనా కానీ పూర్తిగా పరాజయం దిశగానే పయనించాయి. సామ్యవాదమూ, సమాజవాదమూ కూడా ఇందుకు మినహాయింపు కావు.

మౌలికంగా సామ్యవాదం కాని, సమాజవాదం కానీ ప్రభుత్వ ప్రమేయాన్ని నిరశించేవే. ఎందుకంటే ఆ సిద్ధాంతాలకు ప్రభుత్వాలను నడిపించే శక్తియుక్తులు ఉండవు అని లెనిన్ వంటి మేధావుల సహాయ సంపత్తులతో మాత్రమే పరిపాలన కొనసాగించ గలవు. కాని చివరకు ఈ ప్రక్రియ కూడా 'అసమర్థమైనదే' అనిపించుకున్నది.

కేవలం 'సత్యచేతన' మాత్రమే ఆ లోపం భర్తీ చేయగలదు. 'సత్యచేతన', దాని యొక్క అనేక ప్రక్రియల ద్వారా, ఈ కార్యక్రమం నిర్వహించగలదు. ఏ ఒక్క విధానమూ సరిపోదు. నిజానికి ఇలాంటి సందర్భాలలో ఏ ఒక్కటి అయినా ఒక సమూహాశక్తితోనే పని చేస్తుంది. ఒక్కటిగా ఏదీ తనంతట తానుగా దేన్నీ నిర్వహించలేదు.

'సత్యచేతన' తో ఉన్నవారు ఏ సమాజానికైనా చెందినవారు కావచ్చు. అది జన్మతహా సంక్రమించే హక్కు కాదు. ఎలాంటివారైనా స్వయంకృషితో ఈ దిశగా అభివృద్ధి సాధించగలరు. రాజకీయ కోణంలో నుండి చూస్తే ఇది ఒక మంచి మార్పు. ఇది కుల, మత, విచక్షణతో సంబంధం లేనిది. ఇది సాపేక్షము కానటువంటి సత్య స్వరూపము. ఇలాంటి ఉన్నతమైన చేతనను సాధించిన వారెవరైనా రాజ్యాన్ని పరిపాలించవచ్చు. అట్టివారికి కులాలతో, స్థలాలతో నిమిత్తమే లేదు. ఇట్టిదే సరియైన దృక్పథం. ఉన్నత చేతన మాత్రమే సర్వ సాధారణంగా మనం ఎదుర్కొనే భౌతిక సమస్యలను పరిష్కరించగలదు. ఉన్నత చేతన సాధారణ విషయాలపై దృష్టి సారించలేదనీ, అది ఎప్పుడూ ఊర్ధ్వదిశగానే ఆలోచిస్తుందనే మనం భావిస్తుండబట్టే మన దేశం ఇలా శాపగ్రస్తం అయింది. ఈ భావనే మన పాలిటి శాపం. దీన్ని మనం రూపుమాపాలి, ఊర్ధ్వచేతన మాత్రమే ప్రతి

చిన్న విషయాన్ని స్పష్టంగా గమనించి, దాన్ని గురించి ఆలోచించగలదు. మనకు అవసరమైనవానినీ, సత్యమైనవానినీ గుర్తించి నిర్ణయించగలదు. ఈ విధమైన ఒక కొత్త తరహా పాలనావ్యవస్థను నిర్వహించటానికి ప్రయత్నించవచ్చు.

పార్టీరహిత ప్రభుత్వము

ఒక నూతన ప్రక్రియ ప్రారంభమయేకాలం లోకి అడుగిడుతున్నాం. మనకు నూతన వ్యవస్థ ఏర్పడాలి. ఇది ఒక గడ్డుకాలం. రానున్నది ఎలా వుంటుందో మనకు కొంత తెలుసు కాబట్టి దాన్ని వీలయినంత త్వరగా, వీలయినంత తేలికగా సాధించుకోవాలి. వెనుకంజ వేయటం అర్థంలేని పని. వెనుకంజ వేస్తే ఎన్నాళ్ళకైనా ఎక్కడవేసిన గొంగళి అక్కడ వున్నట్లే! మనం ముందంజ వేయాలి, అవధులు దాటాలి; పార్టీరహిత సమాజాన్ని సాధించుకోవాలి.

ఈ విషయంలో శ్రీఅరవిందుల కన్నా ఎవరూ బాగా వివరించలేరు. ఎందుకంటే ఆయన పార్టీలకు, వర్గాలకు అతీతుడు. వర్గ విభేదాల లాభనష్టాలు ఆయనకు తెలిసినంతగా మరెవ్వరికీ తెలియదు. వారు వ్రాసినవి శ్రద్ధగా చదివిన వారందరికి ఈ సందర్భంగా ఉత్పన్నమయ్యే ప్రశ్న లన్నిటికీ జవాబు దొరుకుతుంది. అంతే కాదు ఈ మార్పులు సంభవించటానికి కారణమైన దివ్యశక్తి గురించి కూడా అవగాహన కలుగుతుంది. ఏ దివ్యశక్తి అయితే వారి వెనుక నుండి నడిపిస్తుందో అదే ఈ మార్పు వెనుక కూడా వుంటుంది. మనం మార్పును ఆహ్వానించాలి. బూజుపట్టిన పాత భావాలు పట్టుకొని ఇంకెంత కాలము వ్రేలాడ కూడదు.

శ్రీఅరవిందుల సందేశాన్ని ప్రజాబాహుళ్యంలో ప్రచారం చేయటమే మనలను వర్గాలకు అతీతులుగా చేస్తుంది. శ్రీఅరవిందులు అధికారం కోసం రాజకీయాలను ఎన్నుకోలేదు. వారు ప్రతిపాదించినవి వారి భావాలు, ఆదర్శాలు మాత్రమే. వాటిని అర్థం చేసుకొని ఆచరిస్తే దేశం బలం సంతరించుకుంటుంది. శ్రీఅరవిందులను అర్థం చేసుకున్నవారు మాత్రమే వాటిని ప్రజాబాహుళ్యానికి అందించగలరు.

ప్రశ్న: కాని, మాతా మీ బిడ్డలు పరిపాలిస్తే కాని...

(శ్రీమాత నవ్వుతారు) వారు భంగపడతారు, అణచివేయబడ్డ అనుభూతికి లోనవుతారు. ఎవరైనా రాజకీయాల్లోకి పోవాలనుకుంటే ఆ విషయం వేరు;

మిగతావారు రాజకీయాల్లోకి ప్రవేశించకుంటేనే ధృఢంగా వుండగలరు!
CWM 15:407

సామ్యవాదానికీ, పెట్టుబడిదారీ విధానానికీ కాలం చెల్లుతుంది

పెట్టుబడిదారీ వ్యవస్థ ముగిసే రోజులు వస్తున్నాయి. సామ్యవాదమూ ముగిసిపోతుంది. సిద్ధాంతాన్ని బ ట్టి కమ్యూనిజం నిర్మాణాత్మకమైనది కాదు. అది 'ధనస్వామ్యాన్ని' నిలువరించే ఆయుధం వంటిది. కాని, యుద్ధానంతరం సైనికులు నిరుద్యోగులుగా మారినట్లు కమ్యూనిజం కూడా పరిణామం చెంది 'అతీత సత్యం' గా మారే అవకాశం వుంది. ఈ సత్యం తెలుసుకొని మేము ఆ దిశగా కృషి చేస్తూనే వున్నాము. అది త్వరలో భువిపై తన పరిపాలన ఆరంభిస్తుంది.
శ్రీమాత: *శిష్యునితో సంభాషణలు*, మార్చి 21, 1956

భవిష్య నాయకులు

బాహ్యం నుండి వచ్చే నిర్ణయాలు నేను విశ్వసించను. లోనున్న చేతన బలీయం అవుతుంది. ఇంకా దృఢతరం అవుతుంది. అనగా ప్రజలను శోధిస్తుంది. ఆ చేతన వత్తిడినే నేను నమ్ముతాను.

ఇది గాక మిగతా పనులన్నీ మానవుడు సాధారణంగా చేస్తున్నవే! అవి బాగానే జరుగుతున్నాయి కూడా! కాని ఉన్నట్లుండి వాటిలో మార్పు వస్తున్నది. రూపురేఖలు కూడా మారిపోతాయి కదా! చివరకు అంతా ముగుస్తుంది; అంత వరకూ చేసినదానికి కూడా అర్థం లేకుండా పోతుంది.

నిర్వహణాశక్తి పైనుండి ఆవిర్భవించాల్సిందే; తప్పదు. (చేతులతో సూచిస్తారు) అందుకు మన మనసు ప్రశాంతంగా వుండాలి కదా? (మళ్ళీ సంజ్ఞ), నిలకడ ఇక్కడ వుండాలి. (శిరోభాగాన్ని చూపుతారు) అది ఇట్లా వుండాలనీ, అట్లా వుండాలనీ, అలా చేస్తే బాగుండేది అనీ కూనిరాగాలు తీస్తే ప్రయోజనం లేదు. శాంతం, శాంతం. పరమాత్మకు తెలుసు నీకు ఏది కావాలో!
CWM 13:307-08

నీ కోసం నీవు పనిచేయటం కాదు. అన్నింటి కంటె ముందు భగవదాజ్ఞగా నీవు వర్తించాలి, దైవేచ్ఛను నెరవేర్చాలి. నీ పరంగా నీవు ఎవరినీ ఆజ్ఞాపించ

కూడదు. వ్యక్తి కేంద్రంగా ఏది చేసినా దానిని 'సత్యం' అనలేము. అలా సత్యా సత్యాలను కనిపెట్టటం కూడా కష్టమే. అందుకే అలాంటివాటిని త్రోసిరాజనాల్సి వస్తుంది. (తిరస్కారభావం వచ్చే సంజ్ఞ చేస్తారు.)

అందుకే మనిషి ఒంటరివాడుగా దేన్నీ సాధించలేడు. ఇది జీవిత సత్యం. వ్యక్తిపరంగా చేసేవాటికి ఫలితం రాదు. మనకుగా మనం ఏదైనా చెయ్యగలమని భావించరాదు. కేవలం దేవేచ్ఛను నెరవేరుస్తున్నామనే భావించాలి. అప్పుడు మనకు తెలియకుండానే 'భౌతికం' అనే వ్యతిరేక శక్తిని సున్నితముగా ఎదుర్కొన గలము. ఆ మృదుత్వాన్ని అర్థం చేసికోగలిగిన నాడే మనకు సరియైన అవగాహన కలిగినట్లు. 'భౌతికమే' అసలైన ప్రతిబంధకం!

సంఘర్షణలు తలెత్తినపుడు మనము సహజంగానే కుచించుకుపోతాము. అవి మనకు సాధారణంగా వస్తూనే వుంటాయి కూడా. అట్లాంటి సందర్భాలే మనల్ని నత్తల్లా లోలోనికి ముడుచుకునేలా చేస్తాయి.

ఇంకో కష్టాన్ని కూడా ఎదుర్కోవలసి యుంటుంది. నీకు మనసులో వ్యక్తిగ తంగా ఏ కోరికా లేకపోయినా, నీ ప్రక్కవానికైనా రావచ్చు గదా? దాని వలన కూడా నీలో ప్రతిస్పందన కలుగుతుంది. అపుడు నీవు కూడా ఎంతో కొంత దానిని అంగీకరిస్తే నీ అలోచనలు ఆ పరిధిలోనే భ్రమిస్తుంటాయి. అపుడు జరిగేదే మిటో నీవే చూస్తావు.

ఈ చర్య నిరంతరం జరుగుతూనే వుంటుంది. మొదట్లో ఒక వ్యక్తిలో ప్రారం భం అయిన కోరిక క్రమేణా ఇతరులలోనూ జనిస్తుంది. దీనికి అంతే వుండదు. ఇది అంతటా జరుగుతున్నదే. ఇట్లాంటి సందర్భాలలో ఎక్కువ దృఢంగా వున్న ఇచ్ఛ మాత్రమే తట్టుకొని నిలబడుతుంది. కాని అది కూడా నిరర్థకమే!

దైవాన్ని సేవిస్తున్నామని చెప్పటం కేవలం మాట మాత్రంగా కారాదు. మన ద్వారా కార్యనిర్వహణ చేస్తున్నది భగవంతుడే అనే భావన కలగాలి.

అసలు మనకు ఏది 'స్వేచ్ఛ', ఏది 'దైవేచ్ఛ' అని ఎలా తెలుస్తుంది? నేను చెప్పేది ఏమిటంటే మీ, మీ ఇచ్ఛలను పరిత్యజించండి; దైవేచ్ఛ ఏమిటో అప్పుడు తెలుస్తుంది! తెలిసినదా!

CWM 13:332-33

నిర్వహించుట లేక నడిపించుట పనిగా గలవారికి

మీరు ఇతరులను సంతోషపెట్టాలనుకున్నపుడు పనులు ఏవిధంగా జరుగుతు న్నాయో ఆ విధంగానే కొనసాగిస్తూ ప్రకృతి గమనం మనిషిని ప్రభావితం చేయ టానికై నిరీక్షించాలి. మానవుని కర్తవ్యం ప్రకృతిని అనుసరించటం కాదు. ప్రకృతిని తనకు అనుకూలంగా మలచుకోవటం!

*

జ్ఞానులు ప్రపంచాన్ని శాసించాలి అని నేను అన్నప్పుడు నేను ఆధ్యాత్మిక దృక్ప థంతోనే అలా అంటున్నాను. నాకు రాజకీయ దృక్పథం ఏదీ లేదు. రకరకాల ప్రభుత్వాలు మనుగడ సాగించవచ్చు: అది అప్రస్తుతం. పరిపాలకులు ఏ స్థాయి వారైనా కావచ్చును, కాని సత్యాన్ని దర్శించినవారి నుండే వారు స్ఫూర్తిని పొందాలి; దైవచిత్తాన్నే నెరవేర్చాలి.

CWM 15:55-56

దీని సారాంశం ఇదే

గ్రహింపుకు రానిది ఏదైనా అణగద్రొక్కబడిన అనుభూతికి లోనౌతుంది, కాని అవగాహన లోనికి వ్చేచది విస్తృతి చెందుతున్న శక్తి అనుభూతిని పొందుతుంది. అలాగే... అణగద్రొక్కబడేదంతా వ్యతిరేకించేది అని చెప్పవచ్చు. దానికి గ్రహించే శక్తి వుండదు. విశాల దృక్పథం వుంటేనే గ్రహింపు లోనికి వస్తుంది. హృదయం కూడా వికసించాలి. అప్పుడు చూడండి.... దుస్సాధ్యమైన విషయం కూడా ఎలా అవగాహన లోనికి వస్తుందో! ఇది అద్భుతం అనిపించటం లేదా?

శతాబ్దాలుగా కరుడుగట్టిన అలావట్ల వలననేగా మనం ప్రతిఘటించేది? అసలు వికాసం మాత్రమే క్రమంగా విస్తరించి పరమాద్భుతంగా కనపడుతుంది. ఎంత సుందరంగా వుంటుందో!

అహం యొక్క పట్టు సడలుతున్నది

అహం సన్నగిల్లుతూ వుండటం మనకు తెలుస్తుంది. ఫలితం కనపడుతూనే వుంటుంది. అహం క్రమంగా మరుగౌతుంది. దీన్ని నీవు గమనించాల్సిన అవసరం

కూడా వుండదు. పాత పద్ధతులలో తెలుసుకోవాలని అనుకోవద్దు. ఆ అవసరమే ఉండదు. ఇలా గ్రహించాలి. (శ్రీమాత సంజ్ఞ చేస్తారు).

అహానికి లోబడి వుండటం అవసరం లేదు. అవన్నీ ఒకనాటి విధానాలు. 'అహం కరిగిపోవాలి', దాని బదులు వినయము, విశ్వాసము రావాలి. వినయము సహజంగా రావాలి. అది మానసికంగా గ్రహించి తెలుసుకునేది కాదు. దివ్యచేతనే దాని మూలం. ఈ రకమైన (ఆధ్యాత్మిక) భావన అహం స్థానంలో ఉండాలి. అప్పుడు 'అహం' ఎలా అంతర్ధానం అవుతుందో, అవశేషాలు కూడా మిగల్చకుండాపోతుందో మీరే గమనిస్తారు. (శ్రీమాత సంజ్ఞారూపంగా చేతులు చూస్తారు)

నే నెప్పుడూ బాల్యావస్థలోనే ఉన్నాననిపిస్తుంది. (రోజుకు కనీసం ఏబది సార్లయినా!) అలాంటి భావనలో ఉన్నపుడల్లా నన్ను ఒక దివ్యశక్తి చుట్టుముట్టి ఓలలాడిస్తూ వుంటుంది. (శ్రీమాత నవ్వుతారు).

శ్రీమాత, శిష్యునితో సంభాషణలు జూన్ 24, 1972

అధికారం మరో విధంగా మార్పు చెందటం

ఈ మార్పు దేశాలలో కూడా సంభవిస్తుంది. క్రమంగా వ్యక్తుల అధికారం (వ్యక్తిస్వామ్యం) పోయి దివ్యేచ్ఛ అధికారం లోనికి వస్తుంది. మనం ప్రస్తుతం ఎదుర్కొంటున్న పరిస్థితులు ఈ పరిణామానికి నిదర్శనాలే! రాబోయే దానిని పాత వ్యవస్థ ఎదుర్కొని నివారించే ప్రయత్నం జరుగుతుండటం వల్లనే ఈ అస్తవ్యస్త పరిస్థితి దాపురించింది.

మన ఉనికిలో — స్థూలమైనా, సూక్ష్మ మైనా — ఏ భాగం అయినా మార్పుకు గురియైనపుడు దాని సున్నితత్వం ఇంకా పెరుగుతుంది. సమస్యలను వ్యక్తిగత కోణం నుంచి కాక విశ్వదృక్పథం నుండి తిలకిస్తే అతి సున్నిత విషయాలు కూడా వెలుగు లోనికి వస్తాయి. ఈ విషయం నేను ఇదివరకే గ్రహించినా ఈ మధ్య శారీరకంగా కూడా ఈ స్పందనలు గ్రహిస్తున్నట్లు గమనిస్తున్నాను. ప్రస్తుతం ఆ తీవ్రత చాలా బలీయంగా వున్నది. ఈ అనుభవం ఇంతవరకు ఎరుగనివారు ఎంతో భయపడతారు. దీని వలన అనారోగ్యం కూడా కలిగే అవకాశం వున్నది. సాధారణ సమస్యల విషయంలోనూ ఇంతే! అనుభవంలోకి వచ్చి అర్థం

చేసుకున్నవారికి ఇది సాధనలో చివరి మజిలీకి చేరుకునే మార్గమే అని అనిపిస్తుంది. (శ్రీమాత చేతులను పైకెత్తి సూచిస్తారు).

'అనేకత్వపు' భ్రమలు తొలగిపోవాలి. వ్యక్తిగత ఉనికి ప్రశ్నార్థకమే అనిపించాలి. ఇదే గ్రహించాల్సిన ఉత్తమ భావన. అప్పుడు మాత్రమే మనం 'విశ్వవీణకు తంత్రులమై' లయబద్ధ స్వరాలను మీట గలము.

CWM 11:221-23 శ్రీమాత

అనువాదం కె. ఆర్. ఎల్. నరసింహారావు

అధికార పత్రాలు — ఉన్నత సత్యం

1. ఇక్కడ ఆశ్రమంలో మన ధ్యేయం ఒక ఉన్నతోన్నత సత్యాన్ని అభివ్యక్తీకరించటం, సాధారణ మానవ ఆచారాలను అనుసరించటం కాదు. ఈ అధికార పత్రాలకు నేను అనవసర ప్రాముఖ్యతను యివ్వను. ప్రస్తుత ప్రపంచ పరిస్థితులకు అవి కేవలం ఒక అవసరమం మాత్రమే, అంతః సత్యంతో వీటికి సంబంధం లేదు.

2. జీవిత వాస్తవాలలో నిజానికి వ్యక్తి యొక్క శక్తి అతని అధికార పదవిపై ఆధారపడి ఉండదు, కేవలం అతని అంతఃచేతన యొక్క తేజస్సు, శక్తిపై ఆధారపడి ఉంటుంది.

CWM 13:161 శ్రీమాత


అనువాదం డా. సరోజా ప్రసాద్

February 2016 1 February 2016 TN/PMG/(CCR)/ WPP No. 473/2015-17

AKHILA - Akhila Bharata Patrika (Telugu)

Registered with the Registrar of Newspapers for India: No. 23593/72 (monthly)

Matter shall reveal the Spirit's face. — Sri Aurobindo



Editor: A.Kailasapathi
Published by Pradeep Narang on behalf of Sri Aurobindo Society,
No. 11, Saint Martin Street, Puducherry - 605001
Printed by Swadhin Chatterjee at Sri Aurobindo Ashram Press,
38, Goubert Avenue, Puducherry - 605001

Single copy: Rs. 20 **Annual Subscription: Rs. 180 (in India)**

A Monthly Published by
SRI AUROBINDO SOCIETY, PUDUCHERRY - 605001



భవితకు బాటలు

అఖిల

అఖిల భారత పత్రిక

మార్చి 2016

బుధవారం నాటి సామూహిక ధ్యాన సమయంలో

ఈ సాయంత్రం దైవం యొక్క ఉనికి, యదార్థమైనది, భౌతికమైనది, మీ మధ్యన ఉండింది. నేను ఈ విశ్వానికన్నా పెద్దదైన, సజీవ స్వర్ణమయ కాంతి గల రూపం ధరించి ఉన్నాను, ఒక బ్రహ్మాండమైన, దృఢమైన, స్వర్ణ ద్వారం ఎదురుగా నున్నాను. లోకాన్ని దైవం నుండి వేరుపరచే ద్వారమది. ఆ ద్వారాన్ని చూస్తున్నప్పుడు, నా చేతనలో కలిగిన ఒక్క కదలికలో నేను సంకల్పిం చాను, నాకు తెలిసింది, 'సమయ మాసన్నమయింది' అని. అంతే, రెండు చేతులతో ఒక బలమైన బంగరు సుత్తిని ఎత్తి ఆ ద్వారంపై ఒక్కసారి, ఒకే ఒక్క సారి మోదాను. ఆ ద్వారం ముక్కలు ముక్కలై పగిలిపోయింది.

అపుడు, అతిమానస వెలుగు, శక్తి, చేతన క్రిందికి భూమిపై జోరుగా, ఒక అవిచ్ఛిన్న జలపాతంలా దుమికాయి.

CWM 13:51

మీరు నన్ను ఏమి చేయమని కోరినారో అదే నేను చేసాను

ఓ నా ప్రభూ, మీరు నన్ను ఏమి చేయమని కోరినారో అదే నేను చేసాను. అతిమానస ద్వారాలు తెరువబడ్డాయి, అతిమానస చేతన, వెలుగు, శక్తి భూమిని వెల్లువలా ముంచెత్తుతున్నాయి.

ఇప్పుడు అతిమానసము అక్కడ వున్నది కావున — అది తెలిసినదానను భూమిపై నేనొక్కతినే అయినప్పటికీ బేషరతుగా చెప్పగలను అది అక్కడ వున్నదని — ఈ రూపం యొక్క కర్తవ్యం ముగిసింది, దాని స్థానే మరొక రూపం ఆ పని చేపట్టాలనా? నేను ఈ ప్రశ్న మిమ్ములను అడుగుతున్నాను, సమాధానం అర్థిస్తున్నాను — ఎన్నో వైరుధ్యాలు ఏర్పడినా, ఎన్నోసార్లు నిరాకరించబడినా, అది నాకు నిర్దేశింపబడిన కార్యమేనని నాకు ఖండితంగా తెలియడానికి. అది నాకొక సంకేతం.



ఒకే ఒక భద్రత

ఒకే ఒక భద్రత వున్నది: దైవానికి అంటిపెట్టుకొని వుండుట, ఈ విధంగా; (పిడికిళ్ళు బిగించిన అభినయం). ఏది దైవమని తలుస్తారో దానికి అంటిపెట్టుకొనుట కాదు, ఏది దైవమనే అవగాహన ఏర్పడుతుందో దానికి కూడా కాదు.... అది ఒక తీవ్ర మైన అభిలాష.... సాధ్యమైనంత నిజాయితీతో నిండిన అభిలాష; దానికి అంటి పెట్టుకొనుట.

CWM 11:20

శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

ఆ సంకేతం ఏదైనా కానీ, నేను చింతించను, అయితే అది స్పష్టమైనది కావాలి.

CWM 13:56

ఇకపై అది ఒక సంభావ్యత కాదు, ఒక వాస్తవం

నాకు తెలుసు — మన నుండి ఆయన ఏమి ఆశిస్తున్నారో అది మనం తప్పక సాధించి తీరుతామని. ఇకపై అది ఒక సంభావ్యత కాదు, ఒక వాస్తవం. అయితే, అది సాధించడానికి అవసరమైన సమయం దీర్ఘ మైనదా లేక కొంత మాత్రమేనా అనేది మన వ్యక్తిగత ప్రయత్నం, మనం కనబరచే ఏకాగ్రత, మన మా విషయానికిచ్చే ప్రాముఖ్యతను బట్టి వుంటుంది.

పరాకుగా నుండే పరిశీలకుడికి విషయాలు పూర్వం ఏ విధంగా నున్నాయో, ఆ విధంగానే వున్నట్లు కనిపించవచ్చు, కానీ ఏ విధంగా పరిశీలించాలో తెలిసిన వారికి, పైకి కనిపించేవాటిని చూసి మోసపోనివారికి విషయాలు సవ్యంగానే సాగు తున్నాయని తెలుస్తుంది. ప్రతి ఒక్కరు వారి వారి సమర్థత మేరకు వ్యవహరిం చాలి. అప్పుడు, బహుశా ముందస్తు ఫలితాలు అందరికీ అందటానికి సంవత్స రాలు పట్టకపోవచ్చు.

లోకంలోని అన్ని సంగతుల్లోనికి ఈ విషయం నీకు ఆసక్తిని రెకెత్తిస్తుందేమో నీకే తెలియాలి.

CWM 9:192

అవసరమైన తీవ్ర ఆకాంక్ష

ఈ పరివర్తన కోసం జీవించడం కన్నా విలువైనది ఈ లోకంలో మరొకటి లేదని, ఇది రేకెత్తించే తీవ్రమైన ఆసక్తిని మించినది మరొకటి లేదని దేహం తనం తట తాను గ్రహించగలిగే క్షణమొకటి వస్తుంది. అది దేహంలోని జీవకణాలన్నీ, అత్యంత కుతూహలంతో ఉవ్విళ్ళూరుతున్న దివ్యప్రకాశం అభివ్యక్తమవాలని మొరపెట్టుతున్నట్లుగా నుంటుంది. ఆ పరివర్తనలో అవి ఒక ప్రగాఢమైన ఆనం దాన్ని పొందుతాయి, అది విజయవంతమై తీరుతుందని విశ్వసిస్తాయి.

నా ప్రయత్నమంతా ఈ తీవ్ర ఆకాంక్ష మీలో కలగాలనే ఆవశ్యకతను మీకు

తెలియజేయాలని. అది తెలుసుకుంటే, దానితో పోలిస్తే జీవితంలో మిగతావన్నీ చెల్లనివి, నిస్సారమైనవి, నిష్ప్రయోజనమైనవి, విలువు లేనివి అని అర్థమవుతుంది.

CWM 9:191

పరివర్తనకు దారి తీసే మూడు మార్గాలు

ఈ పరివర్తన సమస్య పరిష్కారానికి మూడు మార్గాలున్నాయని, మూడు విధాలుగా కార్యాచరణ గావించ వచ్చునని, సంపూర్ణ పరిష్కారానికి ఈ మూడు విధానాలను మేళవించాలని , నాకు మరింతగా స్ఫష్టమవుతున్నది. ఒకటి సహజం గానే అతి ముఖ్యమైనది 'ఆధ్యాత్మికం' అనబడే విధానం. అది దివ్యచేతనతో సంపర్కం — దివ్యప్రేమ, దివ్యచేతన, దివ్యశక్తి, అవును అదే, ఈ త్రివిధ లక్షణాల మేళవింపు: పరమోత్కృష్టమైన దివ్యప్రేమ, దివ్యచేతన, దివ్యశక్తితో సంపర్కము, వాటితో తాదాత్మ్యము: భౌతిక కణాలన్నింటికీ ఆ 'తత్ ' ను అందుకోగల, దానిని అభివ్యక్తపరచగల, దానిగా నుండగల సమర్థతను సమకూర్చటం. అన్ని మార్గాలలోకి, ఇది అత్యంత శక్తివంతమైనది, అత్యావశ్యకమైనది.

ఒక రహస్య మార్గం కూడా వున్నది. అది నడుమ నుండే లోకాలన్నింటికి భాగస్వామ్యం కలిగిస్తుంది. అన్ని శక్తుల గురించి, అన్ని వ్యక్తిత్వాల గురించి, మధ్యనున్న అన్ని క్షేత్రాల గురించిన విషయ పరిజ్ఞానం ఈ మార్గంలో వాడ బడుతుంది. ఈ సందర్భంలోనే వ్యక్తి అతిమానసాని కున్న దివ్యలక్షణాలను ఉప యోగించుకుంటాడు. ఇది రెండవ మార్గం. శివ, కృష్ణ, శ్రీమాతల వ్యక్తిత్వాలు ఈ విధానంలో భాగాలు. ఇదీ గాక ఒక ఉన్నత మేధాసంబంధమైన విధానం వుంది. అది శాస్త్రీయ విధానాన్ని మించిన ఒక అతీతశక్తి ప్రయోగంతో సమస్యను దాని మూలం నుండి పరిష్కరించబూనుతుంది. అది కూడా తనదైన ప్రాముఖ్య తను కలిగి వుంటుంది. సమస్యను అన్ని కోణాలలో పరిశీలించి పరిష్కరించే దృష్టిలో ఈ విధానం ఉజ్జాయింపులకు తావివ్వకుండా సూటిగా కార్యాచరణ గావిస్తుంది.

ఈ మూడు విధానాలను జోడించినట్లయితే పరిష్కార ప్రక్రియ వేగం పుంజు కుంటుందనుట సుస్పష్టం.

మొదటి మార్గం పాటించకపోతే ఏదీ సాధ్యపడదు, అది లేకుండా మిగతావి కేవలం బూటకాలుగానే మిగిలిపోతాయి, ఎటూ దారితీయవు, అనిశ్చితంగా గిర గిరా తిరుగాడుట తప్ప. అలా గాకుండా మొదటి విధానానికి మిగతా రెండింటి తోడ్పాటును అందించినట్లయితే అప్పుడు కార్యాచరణ మరింత సూటిగా, కచ్చితంగా, వేగంగా సాగ గలదని నా కనిపిస్తుంది.

CWM 11:60

విశ్వాసానికి గల శక్తి

మానవజాతి, మానవ చేతన యొక్క భాగము ఏదైతే అతిమానసంతో ఐక్యత చెంది తనకై తాను స్వేచ్ఛను పొందగల శక్తి కలిగి వుంటుందో అది సంపూర్ణంగా పరివర్తన చెందుతుంది. బాహ్యాకృతిలో ఇంత వరకు అభివ్యక్తం కానటువంటి ఒక భవిష్య వాస్తవికత వైపుగా ముందుకు అడుగేస్తుంది; మహా ప్రకృతికి, జంతు జాలానికి సహజమైన సాధారణ ప్రవృత్తికి దగ్గరగా నున్న భాగము మహా ప్రకృతిలో పునర్లీనమై దానిలో పూర్తిగా ఇమిడిపోతుంది, కానీ మానవచేతనలోని కలుషితమైన భాగమేదైతే బుద్ధిని దుర్వినియోగం చేయుట ద్వారా దుశ్శీలతను అనుమతిస్తుందో దానికి ఉద్వాసన పలుకుతుంది. ఈ రకానికి చెందిన మానవజాతి ఒక ఫలవంతం కాని ప్రయత్న ఫలిత పార్శ్వము. అది పరిహరించబడాలి — ప్రపంచ చరిత్ర గమనంలో అర్థాంతరంగా అంతరించిపోయిన కొన్ని జీవరాశుల మాదిరిగా.

గతంలో కొందరు ప్రవక్తలకు ఇటువంటి అలౌకిక దర్శనం కలిగింది, కానీ సర్వ సాధారణంగా జరిగినట్లే, విషయాలు కలగూరగంపలా మిశ్రితమై వారికి కలిగిన అలౌకిక దర్శనంతో పాటు, ఈ భౌతిక ప్రపంచం రూపాంతరం చెందుటకు సమ్మతించే మానవజాతి వర్గాన్ని ఉద్ధరించడానికై రాబోతున్న అతిమానస ప్రపంచ దర్శనం కలుగ లేదు. అందువలన జన్మతః ఈ వక్రగతికి చెందిన మానవ చేతన వర్గానికి చెందినవారికి ఒక నమ్మకం కలిగించటం కోసం ఆ ప్రవక్తలు ఒక విశ్వాసం ద్వారా విమోచన లభ్యమౌతుందని బోధించారు: భౌతిక ప్రపంచంలో దైవం యొక్క త్యాగశీలతపై విశ్వాసముంచినవారు స్వయంచాలకంగా, కేవలం అంధవిశ్వాసంతోనే, అర్థం చేసుకోవలసిన అవసరం లేకుండా, తెలివితేటలు ఉప

యోగించకుండానే రక్షణ పొందుతారు. మరో ప్రపంచంలో ఆ ప్రవక్తలు అతిమానస ప్రపంచాన్ని దర్శించనూ లేదు, పైగా భౌతిక ప్రపంచంలో చోటు చేసుకొన్న మహోన్నతమైన త్యాగం చివరకు ఆ భౌతిక ప్రపంచంలోనే దైవం సంపూర్ణంగా అభివ్యక్తమవటానికి దోహదపడే ఆత్మవికాసాన్ని ఆటంకపరిచే శక్తుల నిర్మూలన మవుతుందని గ్రహించలేదు.

CWM 9:300-01

అతిమానవులుగా శిక్షణ పొందుతున్నవారు

ప్రాక్టికంగా అనుభవంలోకి వచ్చిన వాస్తవాలు లెక్కలేనన్ని వుంటాయి అనేది నిజం. ప్రతి ఒక్కరి శక్తి మేరకు వారు పరివర్తన చెందిన స్థాయి మారుతుంది. ఎంతో కొంత అతిమానవునిగా ఎదగటానికి ముందు అనేకమైన ప్రయత్నాలు, ప్రయోజనకరమైనవి, కానివి తప్పక జరుగుతాయి. ఇవి కూడా ఎంతో కొంత ఫలప్రదమైన ప్రయత్నాలన తగ్గవే.

తమ సాధారణ స్వభావాన్ని అధిగమించాలని శ్రమించేవారందరు, దివ్యమైన పరమ సత్యముతో సంపర్కం చెందుటకు ఉపకరించిన గాఢమైన అనుభవాన్ని భౌతికంగా పొందాలని ప్రయత్నించే వారందరు, లోకాతీతమైన లేక అత్యున్నతమైన లక్ష్యం దిశగా మరలడానికి బదులు స్వయంగా తమ అంతరంగంలో తాము సాధించిన చైతన్య మార్పిడిని భౌతికంగాను, బాహ్యస్థితిలోను సిద్ధింపచేయ ప్రయత్నించే వారందరు — వారంతా అతిమానవ శిక్షణను పొందుతున్న వారే. వారి ప్రయత్నాలు సఫలీకృతం కావటంలో లెక్కలేనన్ని వ్యత్యాసాలుంటాయి. సాధారణ మానవునిగా కొనసాగకూడదని, సాధారణ జీవితం గడప కూడదని మనం ప్రయత్నించిన ప్రతిసారి, మన కదలికలలో, చర్యలలో, ప్రతిక్రియలలో దివ్యమైన పరమ సత్యాన్ని వ్యక్తపరచుటకు ప్రయత్నించిన ప్రతిసారి, సాధారణ అజ్ఞాన ప్రభావానికి లోబడుటకు బదులు పరమ సత్య నియంత్రణకు లోబడినపుడు, అలాంటి అన్ని సందర్భాలలో మనము అతిమానవులుగా శిక్షణ పొందుతున్న వారమే. మన ప్రయత్నాల సాఫల్యతను బట్టి కొద్దో గొప్పో యోగ్యతగల, ఎంతో కొంత పురోగతి సాధించిన అతిమానవ శిక్షణ పొందుతున్న వారమే.

CWM 9:411

మానసిక జిజ్ఞాస మాత్రమే సరిపోదు

...ఏది ఏమైనా, మాటలతో, భావాలతో యధాలాపంగా ఒక ఆటలా సాగే ఒక విధమైన మానసిక జిజ్ఞాసకు, జీవి యొక్క నిజమైన ఆకాంక్ష ఏదైతే వాస్తవంగా, కచ్చితంగా గణనీయమైనదో, అత్యావశ్యకమైనదో, అది తప్ప వేరొకటి లెక్కించ తగ్గది కాదో, ఆ ఆకాంక్షకు, ఆ ఆంతరిక ఇచ్ఛకూ మధ్య హస్తిమశకాంతరభేదం వున్నది. ఆ లక్షణాలున్నందు వల్లనే ఆ ఆకాంక్షకూ, ఆ ఆంతరిక ఇచ్ఛకు తప్ప వేరొకదానికి విలువ లేదు; అది తప్ప వేరొక్కటి లెక్కించ తగ్గది కాదు, దాని గురించి తప్ప ఉనికికి, మనుగడకు వేరొక కారణం లేదు. అయినప్పటికీ చర్మ చక్షువులకు అతిమానసం గోచరించాలని ఎవరైనా వాంఛిస్తే, అవసరమైనది అదే.

... అయినా కూడా, ఎంతో మోసపూరితమైన, అవాస్తవమైన, పురాతనమైన, పైకి మాత్రం కనిపించే విషయాలను మాత్రమే గమనించే అస్పష్టమైన, అనిశ్చితమైన దృష్టికి బదులు సాధారణమైన, కార్యోన్ముఖమైన చేతన, కొంత స్వయం నియంత్రణ, దేహాన్ని అదుపులో నుంచుకోగల శక్తి, విషయాలను గురించిన ప్రత్యక్ష జ్ఞానం, వాస్తవాన్ని గుర్తించగల శక్తి, విస్పష్టమైన దృష్టి, ఆంతరిక గ్రహణ శక్తి ఉన్నట్లయితే ఆ అనుభవం అతి త్వరలో కలిగే అవకాశ ముంటుంది, కాని అందుకు ఆ వ్యక్తి తనను తాను సిద్ధపరచుకోవాలి.

మనం పీల్చే గాలి ఎంతో ఉల్లాసవంతంగా నున్నది, జీవంతో తొణికిసలాడుతున్నది, మనకున్న శక్తి అపారమైనది, మన్నిక గలది అనే సామాన్య భావతరంగాలలో తేలిపోవడం బదులు, ఎల్లప్పుడూ ఒక గ్రుడ్డివాడిలా తడుముకునే బదులు, చేయవలసిందేమిటి అనే దానిపై ఒక స్పష్టమైన, నిశ్చయమైన, కచ్చితమైన, ఆంతరిక అవగాహన కలిగి వుండాలి. కావలసింది ఇది; అది కాదు.

ఎవరైనా ఈ లక్షణాలను వెంటనే అలవరచుకోగలరు — అందుకు అతడు సంసిద్ధమై వున్నట్లయితే!

CWM 8:204-06

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

అతిమానవుడవటానికి అభ్యర్థిత్వం

నీవు అతిమానవు డవటానికి అభ్యర్థివయితే, నీవు నీ అహంకారాన్ని లేకుండా చేసుకోవటానికి తీర్మానించుకోవాలి, దాన్ని దాటిపోవటానికి తీర్మానించుకోవాలి. నీవు దానిని నీతో ఉంచుకున్నంత కాలం, అతిమానసమనేది నీకు ఏదో తెలియనిది గాను, చేరలేనిదిగాను అవుతుంది.

కాని ప్రయత్నం ద్వారా, నియమావళి ననుసరించటం ద్వారా, పురోగమిస్తూ వశపరచుకోవటం ద్వారా, నీ అహంకారాన్ని నీవు అధిగమించి, దానిని దాటిపోతే, కనీసం కేవలం నీ అస్తిత్వంలోని అత్యల్పభాగంలోనైనా ఇది జరిగితే, ఎక్కడో ఒక చోట ఒక చిన్న కిటికీ తెరచుకోవటానికి అది పనిచేస్తుంది. జాగ్రత్తగా ఆ కిటికీలో నుంచి చూస్తే, నీవు అతిమానసాన్ని క్షణకాలం దర్శించగలవు. అది ఒక వాగ్దానం. నీవు దానిని ఆ క్షణకాలం చూసినప్పుడు, అది నీకు ఎంతో అందంగా కనపడుతుంది, తక్షణం నీవు మిగిలినదంతా వదిలించుకోవాలనుకుంటావు.... అహంకారానికి చెందినదానిని!

క్షణకాల అతిమానస దర్శనానికి, సమస్త అహంకారన్నుంచి పూర్తిగా తప్పకుండా విముక్తి నొందాలని నేను అనటం లేదని దయచేసి గుర్తు పెట్టుకోండి; అదే అయినట్లైతే, అప్పుడది ఏదో చాలా మట్టుకు అసాధ్యమైన కార్యమే అవుతుంది. లేదు, వాస్తవంగా కొద్దిగా ఎక్కడో ఒక చోట, నీ అస్తిత్వంలో కాస్త ఒక మూలలో, కనీసం కేవలం మనస్సులో కాస్త ఒక మూలలో అహంకారం నుంచి విముక్తి పొందడం అవుతుంది; అది మనస్సు, ప్రాణము కూడా అయితే, అది చాలా మంచి విషయం, కాని యాదృచ్ఛికంగా — ఓహ్! యాదృచ్ఛికంగా కాదు — పునః పునః చేసే ప్రయత్నాల ద్వారా నీ చైత్య అస్తిత్వంతో సంపర్కంలోకి వెడితే, అప్పుడు ద్వారం విశాలంగా తెరచుకుంటుంది. చైత్యం ద్వారా నీవు హఠాత్తుగా, అతిమానసం అంటే ఏమిటో, చాలా స్పష్టమైనటువంటి, అందమైనటువంటి దర్శనాన్ని పొందగలవు, కేవలం. దర్శనం మాత్రమే పొందగలుగుతావు, సాక్షాత్కారాన్ని కాదు. అది చాలా గొప్ప విషయం. కాని ఈ విధమైన అందమైన సాక్షాత్కారత కోసం పోకుండా కూడా, చైత్యసాక్షాత్కారం కోసం, నీవు నీ మనస్సులోని కొంత భాగాన్ని లేక ప్రాణికంలో కొంత భాగాన్ని విముక్తి

చేయడంలో సఫలీకృతుడవైతే, అది తలుపులో ఒక విధమైన రంధ్రాన్ని, తాళం చెవి పట్టే సందును చేస్తుంది; ఈ తాళంచెవి పట్టే సందులో నుంచి, నీవు క్షణకాలం దర్శనం పొందుతావు, వాస్తవంగా కొంచెం సేపు క్షణకాల దర్శనం మాత్రమే. అది అప్పటికే చాలా ఆకర్షణీయము, చాలా ఆసక్తిదాయకం.

CWM 3:242

మృదుత్వం, విస్తృతం గావించటం, పరిపూర్ణ సమత్వం

మొట్టమొదటగా, మానసిక దృక్పథం ప్రకారం నేను చెప్పిన స్థితి అక్కడ ఉండి తీరాలి.... పరిపూర్ణ సమత్వం. అది ఒక సంపూర్ణ స్థితి. నేను 1956 నుంచి, సంవత్సరాలుగా పరిశీలిస్తున్నాను, ఇటువంటి పరిపూర్ణ సమత్వంలో తప్ప ఏ అతిమానస ప్రకంపనా ప్రసరించ శక్యం కాదు. ఒక వేళ ఈ సమత్వానికి ఏమాత్రం తక్కువ వ్యతిరేకత ఉన్నా — యదార్థంలో ఎంత తక్కువ అహంకార గమనం ఉన్నా, అహంకారపూరితమైన ఇష్టాలు, అయిష్టాలూ ఉన్నా, అది రా బోదు, అది ప్రసరణం కాదు. అప్పటికే అది కావలసినంత అడ్డంకిని ఏర్పరిచిన దవుతుంది.

దీనితో పాటుగా సాక్షాత్కారం సంపూర్ణం కావటానికి రెండు నిబంధన లున్నాయి. అవి అంత తేలికగా సంపన్నం కావు. ఆ రెండు నిబంధనలు: మొద టిది, విస్తరించుకోగలిగిన సామర్థ్యం, విస్తృతపరచుకో గలిగినది, అదీ అపరిమి తంగా; దానిని ఎలా చెప్పవచ్చంటే, దానితో నీవు అతిమానస చైతన్య పరిమాణం వరకు నిన్ను నీవు విస్తృతపరచుకో గలవన్న మాట, అది సంపూర్ణత్వం. అతి మానస చైతన్యం, పరమేష్ఠి చైతన్యం, ఆయన సంపూర్ణత్వంలో — నేను "ఆయన పరిపూర్ణత్వం" లో అని చెప్పినప్పుడు, దానర్థం, నేను పరమేష్ఠిని, ఆయన మహా అభివ్యక్తతా దృక్పథాన్ని దృష్టిలో ఉంచుకుని మాట్లాడుతున్నాను. సహజంగానే, ఉన్నతోన్నతమైన దృక్పథం నుంచి, అంతస్సార దృష్టిపథం నుంచి — మహా అభివ్యక్తతతలో దేని యొక్క అంతస్సారం అతిమానసం అవు తుందనేది — పరమేష్ఠితో సంపూర్ణమైన తాదాత్మ్యతా సామర్థ్యం తప్పక ఉండాలి, కేవలం ఆయన మహా అభివ్యక్తతా దృక్పథంలో మాత్రమే కాకుండా, ఆయన అచలమైన లేదా నిర్వాణం దృక్పథంలో కూడా, మహా అభివ్యక్తతకు

ఆవలగా — కాని దీనికి తోడుగా, ఒకరు తప్పక పరమేష్ఠి మహా పరిణామంతో తనను తాను తాదత్మ్యతను పొందగలగాలి. ఇది రెండు విషయాలను సూచి స్తుంది: మొదటగా ఉండవలసినది, ఒక విశాలత్వము, కనీసంగా అపరిమితమైనది, నేను చెప్పిన విధంగా, అదే సమయంలో పరమేష్ఠి మహా పరిణామంలో ఆయనను అనుసరించ గలగటానికి సంపూర్ణ మృదుత్వం కలిగి ఉండటం. ఏదో ఒక ప్రత్యేక క్షణమాత్రం ఒకరు విశ్వం ఎంత విశాలంగా ఉందో అంత విశాలంగా తప్పకుండా ఉండటమే కాకుండా, అనిశ్చితంగా, మహా పరిణామంలో ఉండాలి. ఇవి రెండు నిబంధనలు, అవి అక్కడ శక్తిమంతంగా తప్పక ఉండాలి.

CWM 10:111-17

పరిపూర్ణ సమతౌల్యము, సమర్పణముల ఆవశ్యకత

...అది ఎలా అనిపిస్తుందంటే, అత్యంత నిశ్చయాత్మకమైన, స్పష్టమైన విషయం, బహుశా మొదట అభివ్యక్తమయ్యేదొకటి ఉన్నది — బహుశా — అది మహదానంద, మహాసత్య దృక్పథాల కంటే ఎక్కువగా మహదాధిపత్యశక్తి దృక్పథం. పృథ్వి మీద ఒక నూతన జాతి స్థాపించబడాలంటే, అది మనుగడ సాగించాలంటే తప్పనిసరిగా మిగతా ప్రాపంచిక మూలకాల నుంచి రక్షింపబడాలి; ఆధిపత్యశక్తి యే రక్షణ — ఏదో కృతకమై బాహ్యంలోని అనృతమైనటువంటి ఆధిపత్య శక్తి కాదు, కాని నిజమైన బలశక్తి, గెలిచే మహదేచ్ఛ. కనుక అతిమానస కార్యాచరణ, సామరస్యత, ప్రకాశము, హర్షము, సౌందర్యముల పని కన్నా ముందే ఆధిపత్యశక్తిగా, రక్షణ నొసగేదానిగా పనిచేస్తుందని అనుకోవటం అసా ధ్యమేమీ కాదు. సహజంగానే, ఈ ఆధిపత్య శక్తి పని నిజంగా ప్రభావవంతంగా ఉండాలంటే, అది దివ్యజ్ఞానం, దివ్యసత్యం, దివ్యప్రేమ, దివ్యసామరస్యతల మీద స్థాపించబడాలి; కాని ఇవి దర్శనీయంగా, కొద్ది కొద్దిగా అభివ్యక్త మవగలిగిన పరిస్థితి, ప్రభువు దివ్య ఇచ్ఛ, దివ్య ఆధిపత్య శక్తి చర్య ద్వారా భూమిక సిద్ధం చేయబడినప్పుడే ఉంటుంది.

కాని ఇవి కనీసంగానైనా సాధ్యపడాలంటే, అక్కడ తప్పక మొదటగా సంపూర్ణ సమతౌల్యం పునాదిగా ఉండాలి; ఆ సమతౌల్యం స్వార్థాహంకారమును సంపూ ర్ణంగా లేకుండా చేసినదై, పరమేష్ఠికి పరిపూర్ణ సమర్పణను, నిజమైన పవిత్రతను

కలిగించినదై యుండాలి: పరమేష్ఠితో తాదాత్మ్యత. ఈ పరిపూర్ణ సమతౌల్యం ఆధారంగా లేకుండా, అతిమానస ఆధిపత్య శక్తి ప్రమాదకరమైనది, ఒకరు ఏ విధంగానూ దానిని కోరకూడదు లేదా కిందికి లాగాలని అనుకోకూడదు, ఎందు కనగా కేవలం అణుమాత్ర పరిమాణంలోనైనా అది ఎంతో శక్తిమంతమై, ఎంతో అప్రతిహతమై, మొత్తం వ్యవస్థను అస్థిరపరచగలదు.

CWM 9:242

నిజమైన వైఖరి

ప్రశ్న: ప్రస్తుతం ఉండవలసిన నిజమైన వైఖరి, ఎంతగా పారదర్శకతతో నిష్కప టంగా ఉండగలమో అంతగా ఉండటానికి ప్రయత్నించటం కాదా?

సమా: పారదర్శకతతో నిష్కపటంగా, నూతన శక్తి గ్రాహ్యతతో ఉండటం.

అన్నింటినీ మించి, నమ్మకంతో ఉండటం. మహాపదార్థంలోని పెద్ద చిక్కు ఏమిటంటే భౌతిక చైతన్యం (అనగా మహాపదార్థంలోని మనస్సు) అనేక ఇక్కట్లు ఒత్తిడి మూలంగా రూపుదిద్దుకుంది — ఇబ్బందులు, ఆటంకాలు, కష్టాలు, సంఘర్ష ణలు. దానిని ఈ విధంగా చెప్పవచ్చు, అది వీటి మూలంగా "సాధించబడింది", దాని మీద అవి ఒక ముద్రను వదలిపెట్టాయి. చాలా మట్టుకు నిరాశావాదం, ఓట మినే పొందుతాననే నైరాశ్యత, అది కచ్చితంగా చాలా పెద్ద అడ్డంకి.

ఈ విషయంగా నేను నా పనిలో చాలా ఎరుకతో ఉన్నాను. అత్యంత భౌతిక చైతన్యం, అత్యంత భౌతిక మనస్సు, కొరడా దెబ్బల ద్వారా పనిచేయ డానికి, ప్రయత్నం చేయడానికి, ముందుకు పోవడానికి అలవాటు పడింది; లేని యెడల అది తమస్సు. దాని తర్వాత, అది ఊహించేదంతా, ఎల్లప్పుడూ ఇక్క ట్లనే, ప్రతికూలతనే ఫలితంగా కార్యక్రమం విపరీతంగా మందగిస్తుంది. చాలా నిర్దుష్టతతో, చాలా స్పష్టంగా, స్ఫుటంగా తరచు కలిగే అనుభవాలు అవసరమౌతాయి: దానిని ఒప్పించడానికి దాని అన్ని ఇబ్బందుల వెనుక, దాని అన్ని పరాజయాల వెనుక ఒక మహా విజయముంది. దాని అన్ని వ్యథలు, దాని బాధలు, దాని వ్యతిరేకతల వెనుక ఒక దివ్యానందం ఉంది. అన్ని ప్రయత్నాలలో దీని నొక్కదాన్ని మాత్రం చాలా తరచుగా పునః పునః చేయవలసి ఉంటుంది; మొత్తం కాలమంతా నీవు ఆగిపోవడానికో లేదా తొలగించడానికో, ఒక నిరాశను,

ఒక సందేహాన్ని, పూర్తిగా ఓటమితో కొట్టుమిట్టాడే ఒక ఊహను మార్పు చేయడానికో బద్ధుడవై యుంటావు.

CWM 11:1-2

పరిస్థితుల కంటె నిజమైన వైఖరి చాలా ముఖ్యమైనది

కచ్చితంగా మనిషి ఇతరుల యందు పరిపూర్ణత కోసం చూడకుండా సహజంగా తనను తాను పరిపూర్ణత నొందించుకోవడానికి మరలడమనేది అతడు ఒక పెద్ద అంగ వేయడమే అవుతుంది. ఈ విపర్యయం (వెనుకకు పూర్తిగా మరలడం) నిజమైన అభివృద్ధి కంతటికి అసలైన పునాది. మానవుని మొట్టమొదటి సహజ ప్రేరణ: "అది పరిస్థితుల తప్పు, మనుషుల తప్పు... తప్పు..., ఇది ఈ విధంగా ఉంది, అది ఆ విధంగా ఉంది, తరువాతది మరేదో విధంగా ఉంది...." ఇదే అనిశ్చితంగా సాగిపోతూ ఉంటుంది. మొదటి అడుగు, మొట్టమొదటి అడుగు వేస్తున్నప్పుడు చెప్పవలసినదిది: "నేను ఆ విధంగా ఉండవలసినట్లుగా ఉన్నట్లైతే లేక ఈ శరీరం అది ఉండవలసిన విధంగా ఉన్నట్లైతే సమస్తం పూర్తిగా దానికి సరిపోయినదవుతుంది." కాని నీవు పురోభివృద్ధి పొందాలంటే, నీవు మిగతావారి పురోభివృద్ధి కోసం నిరీక్షిస్తూ ఉండవలసినట్లైతే, నీవు పురోభివృద్ధిని పొందటానికి, అనిశ్చితంగా నిరీక్షించవలసి ఉంటుంది. అదే ప్రతిచోటా అందరికీ అందజేయవలసిన మొదటి విషయం. ఎప్పుడూ ఇతరుల మీద లేదా పరిస్థితుల మీద తప్పును రుద్దవద్దు. ఎందువల్లనంటే పరిస్థితు లెటువంటి వైనప్పటికీ, అవి ఎంత అధ్వాన్నంగా కనపడుతున్నప్పటికీ, నీవు నిజమైన వైఖరిని, నిజమైన చైతన్యాన్ని అట్టిపెట్టుకుంటే, నీ అంతరంగ పురోభివృద్ధికి వాటి ప్రాముఖ్యత ఏ మాత్రం ఉండదు, ఎటువంటి ప్రాముఖ్యతా ఉండదు — నేనిది చెప్పడమే కాకుండా, నేను దీనిలో మరణాన్ని కూడా చేరుస్తున్నాను.

వాస్తవానికి, అదే నేర్చుకోవలసిన మొదటి పాఠమనిపిస్తుంది.

శ్రీఅరవిందులు వ్రాశారు (నేను స్వేచ్ఛగా అనువాదం చేస్తాను), పాపం అనబడే భావం పురోగతిని శీఘ్రం చేయడానికి చొప్పించబడింది, తక్షణమే (శ్రీమాత నవ్వు) మనిషి పాపాన్ని ఇతరు లందరిలోనూ చూసాడు — అతడు దానిని తనలో ఎన్నడూ చూడలేదు.

నిజమైన వైఖరి ప్రతిదానిని మారుస్తుంది

ఒక స్థాయి వరకు కొన్ని ప్రకంపనల వైపు ఉండే వైఖరి నీకు పూర్తి హాయిని కలిగిస్తుంది లేదా నిన్ను పూర్తిగా వ్యాధికి లోను చేస్తుంది! ఉండే ప్రకంపన ఒకటే. విషయాలు అటువంటివి, తికమకపెట్టి విభ్రమం కలిగించే విషయాలు. ప్రతి నిమిషం, అది అంతే — ప్రతి నిమిషం, ప్రతిదానికీ.

ఇక్కడ చైతన్యం ఒక విధమైన వైఖరిని తీసుకుంటుంది, అప్పుడంతా ఆనందం, సామరస్యత; విషయం అదే విధంగా ఉంటుంది, కాని అప్పుడు (ఎడమ వైపు వంపిన సంజ్ఞ), చైతన్యం వైఖరిలో స్వల్పమార్పు, అప్పుడా విషయం చాలా మట్టుకు భరింపశక్యం కానిదవుతుంది! ఇటువంటి అనుభవాలు, ఎప్పుడూ... వాస్తవంగా మీకు చూపించడానికి ముఖ్యమైనది కేవలం ఒక్కటే ఉన్నది, చైతన్యం యొక్క వైఖరి: వ్యక్తిగత జీవికి ఉండే పాతవైఖరి (ముడుచు కున్న సంజ్ఞ), లేక ఈ విధంగా విస్తరించిన సంజ్ఞ అది తప్పకుండా (మనం అర్థం చేసుకోవటానికి మాటలలో) అహంకారం ఉనికిగాని లేక అహంకారం రద్దుగాని. అది అంతే. ఆ తర్వాత, నేను మునుపే చెప్పిన విధంగా, జీవితంలో చేసే పనుల కన్నింటికీ, సర్వ సాధారణమైన పనులలో సైతం, అహంకారం ఉనికి బాధపడితే గనక (కచ్చితంగా అదేమిటో మీకు తెలియజేయటానికి), వాస్తవానికది నీ ఆరోగ్యంలో అసమతౌల్యానికి దారి తీస్తుంది, దానికి కేవలం ఒక్కటే నివారణ మార్గం: అహంకారం అదృశ్యమైపోవడం, అదే సమయంలో రోగం సమస్తం అదశ్యమైపోతుంది. పూర్తిగా అప్రాముఖ్యమైనవిగా తలచే విషయాలు, పూర్తిగా... అది ప్రతి విషయానికీ, ప్రతి విషయానికీ, ఎల్లప్పుడూ, ఎల్లప్పుడూ, రాత్రి, పగలు.

CWM 11:219

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

అపజయ భయం, నిరాశావాదం పెద్ద ప్రతిబంధకం

వ్యక్తి చివరిదాకా ఉత్సాహంతో కొనసాగాలి, తట్టుకొని నిలవాలి, ఆ విధంగా ప్రభావితుడు కావాలి, సహనశక్తి తప్పక కలిగి వుండాలి. ఒక విషయంపై పూర్తి వ్యతిరేకత కలిగి వున్నప్పటికీ, బాధపడినప్పటికీ, దుఃఖపడినప్పటికీ (దైహికంగా అని నా భావము) అలిసిపోయినప్పటికీ నీవు పట్టు వదలకుండా కొనసాగాలి. సహనము, చెక్కుచెదరని విశ్వాసము, ఈ రెండూ నీ కుండవలసిన అత్యంత ఆవశ్యక లక్షణాలు. పట్టు వదలకుండా, ఉత్సాహం కోల్పోకుండా, సహనంతో ఉండాలి. కావలసింది అది. అన్నింటినీ మించి ప్రగాఢ విశ్వాసం కలిగి వుండాలి. భౌతిక పదార్థములో అన్నింటి కంటే పెద్ద అవరోధము భౌతిక చేతన (అనగా భౌతిక పదార్థంలోని మనస్సు) కష్టాలు, బాధలు, విఘ్నాలు, సంఘర్షణలు, దుష్కరమైన ప్రయాసలు, కఠినమైన ఒత్తిడులతో తయారవుతుంది. వీటన్నిటి ద్వారా తయారుచేయబడి నందువలన వాటి ప్రభావం దానిపై గట్టి ముద్రను వేసింది. చెడు జరుగుతుందనే భావన, ఓటమి భయము నిశ్చయముగా ఘనమైన ప్రతి బంధకము.

వీటిని గురించిన ఎరుక నా పనిలో ఉంది. అధికంగా భౌతికపరమైన చేతన, అధికంగా భౌతికపరమైన మనసు కొరడా దెబ్బలు తింటే తప్ప పనిచేయాడానికి, పురోగమించడానికి పూనుకోవు. అది అలవాటుగా మారింది. అదే తమస్సు. అది ఎప్పుడూ కష్టాలను, వ్యతిరేకతలను, ముందుగా వూహించుకున్నందున పురోగతి గమనాన్ని మందగింప చేస్తుంది. ఈ కష్టాల వెనుక దైవానుగ్రహ మున్నదని, అపజయాల వెనుక విజయ మున్నదని, ప్రతిబంధకాలు, బాధలు, వైరుధ్యాల వెనుక దివ్యానంద మొకటి వున్నదని నమ్మిక కుదరడానికి యధార్థమైన, దైహికమైన అనుభవాల అవసరముంది. అన్ని ప్రయత్నాలలోకి ఈ అనుభవమే తరచూ కలుగుతుండాలి. సర్వకాల సర్వావస్థల యందూ ఒక నిరాశావాదాన్ని, ఒక సందేహాన్ని, ఒక ఓటమి కలుగుతుందనే ఊహను కలుగకుండా చేయటానికి లేక దానిని మరో విధంగా మార్చటానికి, నీవు తోడ్పడాలి.

CWM 11:256-257

చెడు జరుగుతుందనే భావన అసురుని ఆయుధము వంటిది

దైవికమైన వాతావరణము ఏర్పడటానికి ఇష్టము లేనివారు, ఉద్దేశపూర్వకంగా ఆ వాతావరణం కోరే దైవాభిలాషులను నిరుత్సాహపరుస్తారు. మీరు నిశ్చయముగా వాటి మీద దృష్టి పెట్టకుండా నిర్లక్ష్యము చేయాలి. చెడు జరుగుతుందనే తలంపు అసురుడి ఆయుధము, అసుర ప్రవృత్తి; నేను ఏదైతే సాధ్యపడుతుంది అని గ్రహించానో, అది సఫలమైనట్లయితే అది ప్రతికూల శక్తులపై ఒక నిశ్చయమైన విజయమవుతుంది. సహజముగానే అసురుడు తన శక్తి కొలది తనను రక్షించుకోడానికి ప్రయత్నిస్తాడు. అసురుడెప్పుడూ అలానే వుంటాడు. నిరాశావాదం ఛాయామాత్రం కనిపించినా, అది ఆసురికమే అని గ్రహించాలి. అదే అతని గొప్ప ఆయుధం.

CWM 11:256-57

వ్యక్తి తప్పనిసరిగా గొప్ప సహనం కలిగి వుండాలి

మెరుపులా మెరిసి మాయమయ్యే అద్భుత అనుభవాని కంటే, చిరకాలం ఆ ప్రభావం కొనసాగటానికి నిజమైన పరివర్తన పరిణామం తోడ్పడు తుందని నా విశ్వాసము. అందుకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చాలా ఓరిమి కలిగి వుండాలి. చాలా నెమ్మదిగా, బరువుగా, పెడసరంగా వున్న చేతన ఏదైతే వేగంగా పురోగమించలేదో, పాతదానికే అంటిపెట్టుకొని వుంటుందో, దానికి నిజ మని తోచినదానికే కట్టుబడి వుంటుందో, ఆ నిజము ఎంతటి అల్పమైనదైనా దానిని వదలి కదలలేదో అటువంటి చేతనతో మనం వ్యవహరించాలి. అట్టి స్థితిని సరిచేయాలంటే అపారమైన ఓరిమి అవసరం, కావలసిందంతా పట్టు వదలకుండా అంటిపెట్టుకొని వుండటం, సహనంతో, ఓరిమితో వుండటం. శ్రీఅరవిందులు ఈ విషయాన్ని ఎన్నో మార్లు, ఎన్నో విధాలుగా చెప్పారు. ఓరిమితో వుండు, నీవు తప్పక గెలుస్తావు, సహించు, నీవు తప్పక జయిస్తావు. అపారమైన ఓరిమిగల వారినే విజయం వరిస్తుంది.

CWM 11:2-3

పక్షపాత వైఖరి నవలంభించకుండా వుండటం ఉత్తమం. నైతికదృష్టితోనో లేక పురోగమన దృష్టితోనో ముందుగా ఊహించుకున్న అభిప్రాయాలకో సామాజిక, మానసకి సాంప్రదాయాలకో కట్టుబడకుండా వుండటం కన్నా మంచిది వేరొకటి లేదు.

ఆ మానసిక అవరోధాలను అధిగమించటంలో దశాబ్దాలు గడిపిన చాలామందిని నేనెరుగుదును. నిజంగా, నిరాడంబరంగా, నిష్కపటంగా, నాకేమి తెలియదు అనుకునే నిరాడంబరతతో వుంటూ, ఏది వచ్చినా దానిని స్వీకరించుటకు సంసిద్ధులై వున్నట్లయితే, ఏదో ఒకటి జరగవచ్చు. సహజంగానే అభివృద్ధి కోసం, జ్ఞానం కోసం, పరివర్తన కోసం, వీటన్నింటినీ మించి దివ్యప్రేమ, పరమ సత్యం గురించి ఒక తృష్ణ, ఒక తీవ్రవాంఛ కలుగుతుంది. ఆ వాంఛను నిలత్రొక్కుకుంటే, పురోగతి వేగవంతమవుతుంది, నిజంగా ఆ తీవ్ర వాంఛ అత్యావశ్యకమైనది.

మిగతావన్నీ ముఖ్యం కావు. దేన్ని పట్టుకోవాలో, దేన్ని స్వీకరించాలో, ఏ అనుభవం కావాలో, దేనిని ప్రేమించాలో, ఏ అలవాట్లను అనుసరించాలో, వేటిని అవసరాలని అనుకొని పట్టుక వ్రేలాడాలో తెలిసి ప్రపంచాన్ని యధాతథంగా పట్టుకుని వ్రేలాడుతారో, వారంతా వాటన్నింటినీ గురించిన అవగాహన తమ కున్నదనుకొని వాటికి బందీలవుతారు. వాటన్నింటినీ ఒకదాని తర్వాత ఒకదానిని ఒక పద్ధతి ప్రకారము వదిలించుకోవాలి. అనుబంధాలను తెంచుకోవాలి. దీన్ని వేలసార్లు చెప్పినా మనుష్యులు తిరిగిదాన్నే చేస్తున్నారు.... చాలా వాక్చాతుర్యముతో ఇతరులకు బోధించేవారు సైతం వాటిని పట్టుకు వ్రేలాడుతారు. వారి దృష్టికి, వారి అనుభవాలకు అభివృద్ధికై వారనుసరించే అలవాట్లకూ, అదొక్కటే మార్గమనుకొంటారు. బంధనాలు ఇక వద్దు. స్వేచ్ఛను పొందండి. ఎల్లవేళలా ప్రతిదానినీ మార్చుటకు సంసిద్ధులై వుండండి. ఒక్క విషయాన్ని తప్ప — ఆకాంక్షను, జిజ్ఞాసను.

'తత్' కోసం జిజ్ఞాస

నాకు బాగా అర్థమైన దేమిటంటే కొంతమంది మనుషులకు దైవిక భావన ఇష్టముండదు. వారు ఆ భావనను తక్షణమే దారుణమైన పాశ్చాత్య పెడదారులతో పోల్చి కలజేసి చూసుకోవడంతో వారి జీవితాలు కొంతవరకు సంక్లిష్టమవుతాయి. కాని మీకు అది అవసరము లేదు. ప్రతి ఒక్కరికి కావలసింది, అవసరమైనది దివ్యప్రేమ, కావలసింది అవసరమైనది పరమ సత్యము, మహోత్కృష్టమైన పరిపూర్ణత, అంతే చాలు. సూత్ర నియమాలు ఎంత తక్కువగానుంటే అంత మంచిది. కానీ ఆ 'తత్ ' మాత్రం అవసరం. అదొక్కటే తృప్తిని కలిగిస్తుంది వేరేది కాదు. దానితో ప్రగతిపథ గమనం ప్రారంభించు. నీ దారి నీదే. దారి ఏ దైనా పరవాలేదు. ఆధునిక అమెరికా యువత అనుసరించే మితిమీరిన అసంబ ద్ధమైన, విధానాలు కూడా అనుసరించవచ్చు. అది ముఖ్యం కాదు.

CWM 11:5-6

సంకటముల కంటే దైవానుగ్రహం గురించే ఆలోచించు

పనిచేస్తున్న దివ్యశక్తి ఎంత బలమైనదిగా ఎంత పట్టిన పట్టు విడవనిధిగా వుంటుందో, సహజముగా ప్రతిఘటన కూడా అంత తీవ్రంగా ప్రతిఘటిస్తుంది. దీనికి ప్రత్యామ్నాయముగా — నేను మీకు చెప్పేది అంత సంతోషముగా వుండదు — నీకు తటస్థించిన చిన్న బాధలతో, స్వల్ప అసౌకర్యాలతో, నీ వనుకునే పెద్ద అవలక్షణాలతో ప్రభావితుడవయ్యే బదులు. అన్నింటికీ అతీతమైన ఆవలి తీరము వైపు చూడటానికి ప్రయత్నించు. దైవశక్తి ఎంత శక్తివంతమైనది, భగవదనుగ్రహము ఎంత చురుకుగా పని చేస్తుంది, దైవ సహాయం ఎంత అపారంగా లభిస్తున్నది అని ఆలోచించు. ఒక్క మాటలో — నీ అహంకార భావనలు, స్వార్థ ప్రయోజనాలు తగ్గించుకుని వ్యక్తిగత విషయాలే కాకుండా ఇతర విషయాలను కూడా పట్టించుకున్నట్లయితే బహుశా మీ సమస్యల పట్ల అవగాహన సానుకూలముగా మారుతుంది.

మంచిది — ఇదే నేను మీకిచ్చే సలహా. మిగతా విషయాలు నేను మీకు

సూచించిన పరిష్కారాన్ని మీరు వినియోగించినప్పుడు మాట్లాడుతాను. మీ గురించి మీరు తీవ్రముగా విచారించకండి.

చివరకు బహుశా ఈ సమస్య మీకు ఆసక్తికరమైనది కావచ్చు కాని, నిస్సందేహముగా ఇదొక్కటే అత్యంత ఆసక్తిదాయకమైనది కాదు!

CWM 8:218-20

నా కిప్పటికీ సాక్షికముగా అనుభవమైనదేమిటంటే. ఎవరైనా ఈ విధమైన ఆంతరిక సామరస్య స్థితిలో నిమగ్నులై దృష్టిని ఏమాత్రం శరీరం వైపు మళ్ళించ కుండా వున్నప్పుడు, దేహం చాలా బాగా పనిచేస్తుంది. అదేమిటంటే నీవు స్వయంగా నీ పైనే నీ ఏకాగ్రతను నిలుపుకున్నట్లయితే, అది సర్వాన్ని తలకిందులు చేసి చెడగొడుతుంది. దానిని నేను చాలా సార్లు గమనించాను, అనేక పర్యాయములు — వాస్తవానికి వ్యక్తి తనకు తానే రోగగ్రస్తుడిని చేసుకుంటాడు. అది సంకుచితమైన చేతన, విభాజిక భావన ఫలితం. ప్రతి చోటా దివ్యచేతన, దైవానుగ్రహం అంతా సవ్యంగా జరిగేటట్లుగా పని చేస్తుంటాయి. ఈ సంకుచిత చేతన మీ కొనసాగింపుతో మానసిక దౌర్బల్యం ఏర్పడి నందువలన అంతా అస్తవ్యస్తమవుతుంది. చాలా విచిత్రం!

అహం కేంద్రీకృతమైన మానసిక దౌర్బల్యము — దానినే శ్రీఅరవిందులు "వృద్ధ మానవుడు" అన్నారు. ఇది చాలా ఆసక్తికరం.

CWM 11:202-07

అనువాదం: జి.వి.యస్.వి.ప్రసాదరావు

వైఖరి మాత్రమే ప్రధానమైనది; ఫలితం ఎలా వున్నా సరే! (అట్లా అని ప్రతికూల పరిస్థితులు తప్పనిసరి అని కూడా నేను సూచించటం లేదు). వైఖరే ముఖ్యం. అవును. అంతే (శ్రీమాత చాచిన చేతులతో సంజ్ఞ చేస్తారు) నాకు తెలిసినంత వరకు, చాలా సందర్భాలలో దైవానికి సమర్పించుకోవటం అంటే దైవాన్ని పూర్తిగా విశ్వసించటమే అని నేననుకోను. నమ్మకం వేరు, సమర్పణ వేరు. దైవానికి నిన్ను నువ్వు సమర్పించుకున్నపుడు నువ్వేమి కోరుకుంటావంటే, "ఓ దేవా, నీవు నన్ను ఎంత బాధించినా, పరీక్షించినా నన్ను నీకే సమర్పించుకుంటాను" అంటావు. అందులో పూర్తిగా విశ్వాసరాహిత్యం ఉందిగా! ఇదేదో వింతగా వుంది కదూ! లొంగి వుండటం, విశ్వాసం కలిగి వుండటం ఒకటి కాజాలవు. విశ్వాసం ఒక భిన్నమైన, అచంచలమైన ఎరుక. దాన్ని ఏదీ కదిలించజాలదు. దివ్యచేతన వెలుగులో చూస్తే ఏదైతే పరిపూర్ణ ప్రశాంతతో దానినే మనంతట మనంకష్టాలుగా, బాధలుగా, దురవస్థలుగా మార్చుకుంటాం.

CWM 11:182

ప్రశాంతత అనేది ఒక కోశస్థ స్థితి

ఓపిక పట్టండి, నిశ్చలంగా వుండండి. అంతా ఇందులోనే వున్నది. ఇది ఒకే ఒక మార్గం అని నేను కూడా నమ్ముతున్నాను. ఇదే అంతర్గత ప్రశాంతత. భౌతికంలోని ఘర్షణలను నిలువరించాలంటే ఈ అంతర్గత ప్రశాంతత పరిపూర్ణ స్థాయిని చేరుకోవాలి. కొంతకాలంగా, — ప్రత్యేకంగా జనవరి మొదటి నుండి — అసురశక్తులు బాంబుల వర్షం కురిపిస్తున్నాయి. ఈ ఉధృతి మీకూ తెలుసు. అందువలన మీరంతా ఇలా వుండాలి. (శ్రీమాత స్థాణువులా, నిశ్చలంగా వుండిపోతారు). ఇంతే. భౌతికంగా మీరు చలించి, దేహాన్ని తప్పు పట్టకూడదు. దానికి వీలయినంత విశ్రాంతి, నిశ్చలత ఇవ్వాండి.

ఇది ఎవరికైనా సంభవించవచ్చు. అదే సమస్య. నేను చెప్పేది ఏంటంటే, "ఏమీ కాదు, కంగారు పడకండి; వీలైతే అందులో ఏదైనా మేలు దాగి వున్నదా అని ఆలోచించండి. అదే మీ నిరంతర ధ్యాస అయ్యేలా చూడండి. దానిలో

దాగివున్న ప్రశాంతతను అన్వేషించండి".

ఒక విధంగా నేను ఎల్లప్పుడూ మిమ్మల్ని ఈ ఆనందమయకోశంలోనే వుండ మంటాను. మనసు కోతిలాగా చంచలమైనది. అదే భౌతిక సంవేదనలకు కారణం. ఈ స్థితి నుండి కేవలము ప్రశాంతత మాత్రమే మీకు విశ్రాంతి కలిగించగలదు.

భౌతిక మనస్సును రూపాంతరం చెందేలా చేయటంగాని, దానిని తిరస్కరించటంగాని తీవ్రంగా ప్రయత్నించకండి. దాని పని దాన్ని చెయ్యనివ్వండి, కాని అదే సమయంలో ప్రశాంతతను ఆహ్వానించండి. ప్రశాంతతలో జీవించండి. ఇది అర్థం చేసికోండి. ప్రశాంతతే; ప్రశాంతతే ఏకైక మార్గం!

CWM 11:13

దృఢమైన అభీష్టం వుండి తీరాలి

ఈ మార్గానికి సంకల్పమే బలమైన పునాది. పరిస్థితులతో బాటు వ్యక్తి కూడా మారాలి గదా! ఇందుకు చక్కని మార్గాలు అనేకం వున్నాయి. విజయానికి దారి తీసే ఏ మార్గమైనా ఉత్తమమైనదే!

ఉన్నదాంతో విసిగి, వేసారి మారాలనే ఇచ్ఛ కొందరికి జనిస్తే, మరి కొందరిలో ఆలాంటి స్థితి రాబోతుందన్న స్పృహ వలన మిగతావన్నిటినీ వదలి, రానున్న సుందర సత్యాన్ని ఆహ్వానించటానికి సంసిద్ధులౌతారు.

ఆ విధంగా ప్రతి ప్రగతిశీల కార్యక్రమానికీ బలమైన, అచంచలమైన ఇచ్ఛ ఉండితీరాలి. దానికి ప్రతిబంధకమైన వాటినన్నిటినీ సంతోషంగా విడిచిపెట్టాల్సిందే. ప్రగతిని అడ్డుకునేవాటినన్నీ దూరంగా తరిమివేయాలి. అవ్యక్తమైన భవిష్యత్ సత్యదర్శనాన్ని ఆహ్వానించటానికి మనం సిద్ధంగా వుండాలి. రానున్న సత్యచేతనను ఎవరూ ఆపలేరు. అది ఎలాగైనా ఆవిష్కరింపబడుతుంది. ప్రకృతి కూడా దాన్ని కాదనలేదు. అది రానున్న రోజు ఎంతో దూరంలో లేదు. అది ఇప్పుడిప్పుడే రూపుదిద్దుకుంటున్నది. పాత అలవాట్లను, బంధనాలను తెంపుకొని భావిలో అది రానున్నది, అది వచ్చేది ఏదో ఒకసారి కనపడి పోవటానికి కాదు; ఇక్కడ మన ప్రపంచంలో ఆచరణలోనికి రావాలనే అది వస్తున్నది.

మనిషి నిద్రాణస్థితిలో వున్నాడు; మరపు అతన్ని ఆవహించింది. జీవితాన్ని ఒక ఆటగా భావిస్తున్నాడు. ఏదో మాంద్యం అతనిని కప్పివేసింది. కానీ, బాగా

గుర్తుంచుకోండి: మనం ఒక నూతన శకాన్ని ఆవిష్కరింపనున్నాము. అదృష్టం మనల్ని వరించబోతున్నది. అపురూపమైన నూతన యుగంలోకి మానవాళి అడు గిడబోతున్నది. మన పయనాన్ని నిరోధించి అడ్డుకునేదాన్ని ఏదైనా మనం అవ లీలగా దాటిపోవాలి.

ఈ నిజాన్ని ఎప్పుడూ గుర్తుంచుకోవటమే మన కర్తవ్యం. ఈ క్షణమే అది మన ముందు గోచరించకపోయినా, ఆ నమ్మకం మనలను వీడకూడదు. దానిని పదే పదే జ్ఞప్తిలోనికి తెచ్చుకోవాలి. ఆ భావనలోనే నిద్రించాలి. ఆ భావనలోనే మేల్కొనాలి.

ఈ నేపథ్యంలోనే మన కార్యక్రమాలన్నీ రూపొందించుకోవాలి. ఒక నూతన ప్రపంచం ఆవిర్భవించ నున్నదనీ, దాన్ని మనమంతా దర్శించగలమనీ విశ్వసిం చాలి. మనమంతా అందులో భాగస్వాములు అవుతాము; అందులో చక్కగా ఇమిడిపోతాము. అలాంటి మహత్తర అవకాశం కోసం దేన్ని వదలుకోవటానికైనా మనం సిద్ధపడాలి.

CWM 9:157-160

నిరంతర ఆరాటము, విస్తృతి చాల అవసరము

అతిమానస జీవిగా మనగలగాలంటే, అలాంటి ప్రపంచంలో జీవించాలంటే మన చేతన విశాలంగా ఎదగాలి. వ్యక్తిగతంగా కూడా మనం ముందుకు పోవాలి. ఇది ఒక్క అదటున జరిగేది కాదు. కొంచెం కొంచెంగా ప్రారంభించి, తరువాత వెనుదిరిగి మరచిపోయేది కాదు. నిరంతర భావన, నిరంతర సంకల్పము, నిరం తర చింతన దానికి ఆయువుపట్టు.

ఏదో కాసేపు "అతిమానస చేతన" అనేది ఒకటి వుందనీ, అది భూవాతా వరణం లోనికి వస్తే అంతా మంచిగా వుంటుందనీ అనుకుంటే చాలదు. ఆ కొద్ది క్షణాలు గడచిపోగానే మళ్ళీ మామూలు జీవితం మామూలుగానే సాగిపోతే ఆ దివ్యచేతన రానేరాదు; వచ్చినా నీపై ఏ ప్రభావం చూపదు. ఈ విషయంలో శ్రీఅరవిందులు చాలా స్పష్టంగా చెప్పారు కూడా: "రాబోయేది నీ వనుకోవటం వల్ల వచ్చేది కాదు; అది భగవత్సంకల్పం..." నా వలన అది రాదు అని నిరుత్సా హపడ వద్దు కూడా. అసలు నీ అభిప్రాయం ఏమిటని ఎవరడిగారు? నీకు తగినంత

ఆకాంక్ష వుండాలి, అంతే; నీవు దానిని అంటిపెట్టుకొని వుండి, చేతనను వీలయినంత విస్తృతం చేసుకోవాలి. నిజం చెప్పాలంటే ప్రతివాడు సంకుచితమైన మనస్సుతో కుచించుకుపోయి అతిచేతన హృదయంలో కాలూనటానికి కూడా చోటు లేనట్లుగా తయారైనారు. మీ మనసులు ఎంతో చిన్నవైపోతున్నాయి. ప్రాపంచిక విషయాలతోనే అవి నిండి యున్నాయి. అలాంటప్పుడు అతిమానస చేతన మీ హృదయాలలో ఎలా ప్రవేశించగలదు? హృదయాలు విశాలమైతేగాని అతిమానసచేతన మీలో ప్రవేశించదు. దీనితో పాటు మీలో తీవ్రమైన ఆకాంక్ష కూడా వుండాలి. ఉన్నదాంతో, తెలిసినదాంతోగాని, సాధించినదానితోగాని సరి పెట్టుకుందాములే అనే తృప్తి ఒకటే చాలదు. ఇంకా సాధించాలని బలమైన ఆకాంక్ష వుంటేనే అసలైన 'సత్యచేతన' విశ్వమానవ కళ్యాణానికి సిద్ధపడుతుంది. అచంచలమైన విశ్వాసం బలీయంగా వుండాలి.

CWM 8:204-06

సాధించాలనే తృష్ణ

రానున్న నూతన జాతి ఆవిర్భావానికి స్వాగతం పలకాలనే కోరిక చిన్నపిల్లల్లోనే అధికంగా ఉంటుందని నా నమ్మకం. పెద్దవాళ్ళు వాళ్ళలా వుండలేరు. ఇక్కడకు వచ్చిన వారి విషయంలో వారంతా 'పూర్తి' స్వేచ్ఛను అనుభవించేలా చూడటం నాకు తలకు మించిన భారం అవుతున్నది.

"ఈ ప్రపంచం సువిశాలమైనది. మీకు ఎక్కడైనా చోటు వుంటుందని" నేను పదే పదే చెబుతున్నాను. కాని వాళ్ళకు ఆకాంక్షగాని, ఆత్మవిశ్వాసంగాని ఉంటేనే గదా!

మీకు అర్థమైందనుకుంటాను. నిజంగా వాళ్ళంతా ఒక విధంగా వృద్ధులే! నేనే యవ్వనోత్సాహంతో వుంటున్నాను. ఈ అవేదన, ఈ కాంక్షలే మనలను ముందుకు లంఘింపచేసే శక్తి. ఇప్పుడున్న అల్పమైన ఆరాటాలు, సంతృప్తి మనలను ఏమాత్రం ముందుకు నడిపించలేవు. చివరకు అవి మనలను లోగొని హరిస్తాయి. అంతే!

జరుగనివాటికి ప్రచారం ఎక్కువ. అదొక విధమైన ప్రదర్శనగా మారింది. కాని ఆకాంక్ష మాత్రం చాలమందిలో జ్వలించటం లేదు. (శ్రీమాత అడ్డంగా

తల ఊపుతారు) వాళ్ళ సుఖాలు వాళ్ళకు చాలు. ఇక వాళ్ళు ఏమైనా చేయ వచ్చు. కాని అసలు సత్యం ఏమిటంటే వ్యక్తికి సాధించాలని తపన ఉన్నప్పుడే నూతన శకారంభం జరుగుతుంది. తాను విజేతను అనే భావం అతనిలో జనిం చాలి. ఇదే అసలు విషయం

CWM 11:251-252

అనువాదం: కె. ఆర్. ఎల్. నరసింహారావు

లాగవద్దు, స్వయంగా సమర్పించుకోవాలి

నేను దీని గురించి మీతో చర్చిస్తున్నాను కనుక మీకొక విషయం సిఫారసు చేయాలనుకుంటున్నాను. మీ ప్రగతి కామనతో, మీ సిద్ధి కొరకై ఆకాంక్షతో మీరు శక్తులను మీ వైపు లాగకుండా జాగ్రత్త వహించండి. ఒక స్థిరమైన నిస్వార్థ చింతనతో సాధించగలిగినంత నిష్పాక్షిక దృష్టిని అలవరచుకొని మిమ్ములను మీరు అర్పించుకోండి, తెరిచి వుంచుకోండి. మీ గ్రహణశక్తిని అమితంగా పెంచు కోండి, కానీ ఆ దివ్యశక్తిని మీ వైపు లాగటానికి ప్రయత్నించకండి, ఎందుకంటే అలా లాక్కోవాలనుకోవటం చాలా ప్రమాదకరమైన అహంకారం. మీరు ఆకాంక్షిం చవచ్చు, మిమ్ములను మీరు తెరిచి ఉంచుకోవచ్చు, సమర్పించుకోవచ్చు, కానీ స్వీకరించాలని ప్రయత్నించ వద్దు. విషయాలు పెడదారి పట్టినప్పుడు లోకులు దివ్యశక్తిని దూషిస్తారు. కాని అందుకు బాధ్యత దివ్యశక్తిది కాదు; అది పాత్రగా నున్న మీ యొక్క అత్యాశ, అహంకారం, అజ్ఞానం, బలహీనతలే.

ఫలాపేక్ష లేకుండా మిమ్మల్ని మీరు ఉదారంగా సమర్పణ చేసుకోండి. అప్పుడు, ఒక లోతైన పరిశీలనా దృష్టితో మీకు ఎపుడూ ఎటువంటి హాని జరగదు. అదే మీరు తీసుకోవాలని ప్రయత్నించినపుడు అగాధపు అంచుల వద్ద ఉంటారు.

నివేదన — అణచకుండా నయం చేసే మార్గం

ప్రశ్న: అణచకుండా నయం చేయటానికి మార్గం ఉందా? ఎందుకంటే కచ్చితంగా

దివ్యకాంతి మామూలుగా ప్రసరింప బడుతుంది, తత్ఫలితంగా దోషాలు భూస్థాపితమౌతాయి.

సమా: అవును, అది సాధారణంగా జరిగేది. అందుకు వ్యతిరేకంగా జరగాలి. దానిని భూస్థాపితం చేయడానికి బదులు నివేదన చెయ్యాలి. ఆ సమస్యను, దోషాన్ని వెలుగులోనికి తేవాలి. సాధారణంగా అది అందుకు గిలగిలా కొట్టుకుంటుంది, నిరాకరిస్తుంది! కానీ (శ్రీమాత నవ్వుతారు) అది ఒక్కటే మార్గం. అందువలననే ఈ దివ్యచైతన్యం అంత అపురూపమయినది. అణచివేయాలనేది మంచి చెడులనే అభిప్రాయం వలన వస్తుంది. చెడు అనుకొనేదాని పట్ల ఒక విధమైన నిరసన, అవమానకరంగా భావించటం. మీరు దానిని తిరస్కరిస్తారు. (అసహ్యపడినట్లు అభినయం.) దానిని చూడాలనుకోరు, అది ఉండకూడదనుకుంటారు. ప్రథమంగా తెలుసుకోవలసిన దేమిటంటే మన చేతనలో బలహీనతే ఈ విభజన చేస్తుంది. అక్కడొక దివ్యచైతన్యం ఉంది (ఇప్పుడు నాకు రూఢి అయింది) అందులో యివేమీ లేవు. అక్కడ మనం 'చెడు' అని దేనిని అంటామో, 'మంచి' అని అనేది కూడా అంతే అవసరం. మీ స్పందనలను, భావనలను, కార్యకలాపాలను ఆ దివ్యవెలుగులో ఉంచినపుడు, అది వాటిని నయం చేస్తుంది. ఏదో నాశనం చేయవలసినదానిలా తిరస్కరించటమో, అణచివేయటమో చేయకుండా (అది నాశనం చేయబడదు!) దానిని ఆ దివ్య చైతన్యపు వెలుగులో ఉంచాలి. దీని వలన నాకు చాలా రోజులపాటు ఒక ఆసక్తికరమయిన అనుభవం కలిగింది. మనం సమ్మతించని, మనలో అసంతులతని కలిగించే కొన్ని విషయాలను మన నుంచి దూరంగా విసిరివెయ్యాలనుకోవడం బదులు వాటిని అంగీకరించి, మనలో ఒక అంశంగా భావించి (శ్రీమాత తన చేతులను తెరుస్తారు) వాటిని పైకి నివేదించండి. వాటికి నివేదించబడటం యిష్టం ఉండదు, కాని అందుకు వాటిని ఒత్తిడి చేసే మార్గం ఒకటుంది. మనలో నిరసన సన్నగిల్లిన మేరకు వాటిలో నిరోధం కూడా అంతగా తగ్గిపోతుంది. మనలో నిరసన స్థానే ఉన్నతమయిన అవగాహన ఏర్పరచుకున్నప్పుడు మనం గెలుస్తాం. అది మరింత సులభతరం.

నేను దానిని విశ్వసిస్తాను. మనల్ని క్రిందకు లాగే అన్ని చలనాలనూ ఉన్నతమయిన అవగాహనకు అనుసంధించాలి.

CWM 11:212

సద్గుణము యొక్క సమస్య

సద్గుణ మనేది జీవితంలో చెడు అనిపించినదానిని తొలగించటంలో సమయ మంతా వెచ్చిస్తుంది. ప్రపంచ దేశాలన్నింటి సద్గుణాలను ఒక చోట చేర్చితే, మనుగడలో చాలా కొద్ది విషయాలు మాత్రమే మిగులుతాయి.

సద్గుణం పరిపూర్ణతను కోరుతుంది. కానీ పరిపూర్ణత అంటే సర్వసమగ్ర సంపూర్ణస్థితి. అందువలన ఈ రెండు పరస్పర విరుద్ధాలు. సద్గుణం అనేది తొలగి స్తుంది, తగ్గిస్తుంది, పరిమితం చేస్తుంది. పరిపూర్ణత అనేది అన్నిటినీ అంగీకరి స్తుంది. దేనినీ తిరస్కరించదు, కానీ ప్రతిదానిని దాని సరైన స్థానంలో ఉంచు తుంది. కనుక ఈ రెండు ఏకీభవించవనేది విదితమే.

జీవితాన్ని గంభీరమైనదిగా భావించటంలో సాధారణంగా రెండు మార్గా లున్నాయి. మొదటిది ఏమాత్రం ప్రాధాన్యత లేని వాటికి ప్రాధాన్యత నివ్వటం, రెండవది జీవితాన్ని పవిత్రమూ, ఉండదగిన వనుకున్నా కొన్ని సద్గుణాలకు కుదిం చుకోవటం. ఉదాహరణకు శ్రీఅరవిందులు ఇక్కడ విజ్ఞత గల, లేక నైష్ఠికులైనవారిని గురించి మాట్లాడుతారు. ఈ సద్గుణం వారిలో పొడిగా, నిస్తేజంగా, ఆర్ధతారహి తంగా, ఉగ్రంగా మారి — స్వతంత్రంగా, సంతోషంగా, ఆనందంగా ఉన్న అన్నిటిలో తప్పు లెన్నుతూ ఉంటుంది.

CWM 11:155

జీవితాన్ని పరిపూర్ణం గావించే ఒకే ఒక మార్గం

జీవితాన్ని పరిపూర్ణం గావించే ఒకే ఒక మార్గం — నా దృష్టిలో ఈ పృధ్విపై జీవితాన్ని అని — అందుకు తగినంత ఎత్తు నుండి దానిని, కేవలం వర్తమాన సంపూర్ణ స్థితిలోనే కాక, భూత, వర్తమాన, భవిష్యత్ కాలాల మొత్తంలోనూ చూడాలి. అది ఏమై ఉండినది, ప్రస్తుత మేమిటి, భవష్యత్తులో ఎలా ఉండ బోతుంది? — అన్నీ ఒకేసారి చూడగలిగి ఉండాలి. ఎందుకంటే ప్రతిదానిని దాని నిర్ణీత స్థానంలో నుంచడానికి అదొకటే మార్గం. దేనినీ తీసివేయలేము. ఏదీ తీసివేయకూడదు కాని ప్రతీదీ దాని నిర్ణీత స్థానంలో, తక్కువవాటితో పూర్తి సామరస్యంగా ఉండాలి. అపుడు ఎంతో 'చెడ్డ'గా, ఎంతో 'దోషభూయిష్టం' గా,

ఎంతో 'అనంగీకార' మైనదిగా నైష్టికాచార సంపన్నులకు కనిపించేవన్నీ సమగ్ర దివ్యజీవనంలో అనందాతిశయమైనవ, స్వేచ్ఛాయుతమైన కదలికలు అవుతాయి.

అనంతమైన తన ఉనికిని తానే అవలోకించుటలో అపారమైన ఆనందం పొందే పరాత్పరుని అద్భుతమయిన హర్షాతిరేక ఆహ్లాదభరిత స్థితిని తెలుసుకొనుటకు, అర్థం చేసుకొనుటకు, అనుభూతి పొందుటకు, దానిని జీవితంలో అనుభవించుటకు మనలను ఏదీ ఆపలేదు. ఈ ఆనందం, అద్భుతమైన దరహాసం అన్ని చీకట్లనీ, అన్ని బాధలనీ, అన్ని వ్యధలనూ కరిగించి వేస్తుంది. మీరు తగినంతగా మీ అంతరాల లోతులకి వెళ్ళినపుడు ఆ అంతరంగ సూర్యుడు దర్శన మిస్తాడు. మిమ్మల్ని ఆ వెలుగు వెల్లువలో ముంచెత్తుతాడు. అక్కడ ఏ నీడలూ, బాధలూ లేని సామరస్యమయిన, తేజోమయమయిన రవిభాసిత నవ్వుల వెల్లువ ఉంటుంది. నిజానికి అమితమయిన కష్టాలు, అనంతమయిన దుఃఖాలను, అధికమయిన శారీరక బాధలను — మీరు ఆ దృష్టితో చూసినట్లయితే, ఆ స్థాయి నుండి — ఆ కష్టం యొక్క అవాస్తవికతను, ఆ విచారం యొక్క అవాస్తవికతను, ఆ బాధ యొక్క అవాస్తవికతను చూడగలుగుతారు. అక్కడ కేవలం సంతోషమయమూ, తేజోమయమయిన ప్రకంపన మాత్రమే ఉంటుంది. నిజానికి కష్టాలను కరిగించివేయటానికి, దుఃఖాలను అధిగమించటానిక, బాధను తొలగించటానికి యిది చాలా శక్తివంతమయిన మార్గం. మొదటి రెండూ సాపేక్షంగా సులభతరమైనవి — సాపేక్షంగా అని అన్నాను — చివరిది అధిక కష్టతరం ఎందుకంటే మనం దేహాన్ని దైహికమయిన అనుభూతలను ఎంతో రాశీభుతమైనదిగా, తిరుగు లేనిదిగా భావించే అలవాటును కలిగి ఉన్నాము. కానీ అది కూడా మిగిలినవాటి వంటిదే. ఎందుకంటే మనం మన శరీరాన్ని ఒక అస్థిరమైనదానిగా, మృదువైనదిగా, అనిశ్చితమైనదిగా, కావలసిన రీతిలో మలచబడగలదిగా భావించుటకు అలవాటు పడలేదు. అంధకారాన్నంతటినీ, కష్టాల నన్నిటినీ, విభేదాలన్నిటినీ, అసమతలన్నిటినీ — రోదించి, గోల చేసి, గీ పెట్టే అన్నింటినీ కరిగించే జ్యోతిర్మయ దరహాసాన్ని మనం అందులోకి కొనితెచ్చుకోవటం యింకా నేర్చుకోలేదు కనుక.

CWM 10:155

దేనినయినా నిరోధించినపుడు అది మరింత బలోపేతమవటం చూశాను. అంతా సాఫీగా సాగిపోతున్నదనే భావన ఉన్నప్పుడు దెబ్బలు తిన్న అనుభూతి వుండదు. అది ఈ గీరుకున్న చిన్నగాటు లాంటిదే. (శ్రీమాత తన మోచేతిని చూపిస్తారు), ప్రతికూల పరిస్థితు లెదురైనప్పుడు, నీవు పెంకెతనంగా ప్రవర్తిస్తే దెబ్బ తింటావు. అది ఎలా గుంటుందంటే, ఎలా కింద పడాలో తెలిసిన వ్యక్తులకు క్రింద పడినా ఏమీ విరగవు: అదే ఎలా పడాలో తెలియని వ్యక్తి కొద్దిగా పడినప్పటికీ, ఏదో ఒకటి విరగ్గొట్టుకుంటాడు. ఇది కూడా అలాంటిదే. ఎలా పరిపూర్ణమైన ఐక్యతా భావన కలిగి వుండాలో మనిషి నేర్చుకోవాలి. సరిచేయాలనుకోవటం. తిన్నగా తీర్చి దిద్దాలనుకొనటం కూడా ప్రతిఘటించటమే అవుతుంది.

నీవు అన్నట్లుగా ఈ దండయాత్ర కొనసాగితే ఏమి జరుగుతుంది? అది చాలా సరదాగా ఉంటుంది. చూద్దాం (శ్రీమాత నవ్వుతారు). మిగిలినవాళ్ళు యిదే స్థితిలో ఉండరు కనుక వాళ్ళకి బహుశా విసుగనిపించవచ్చు. కాని దానికి నేనేం చెయ్యలేను (శ్రీమాత మళ్ళీ నవ్వుతారు) ఎప్పుడూ నవ్వుతూ ఉండాలి. ఎల్లప్పూడూ భగవంతుడు నవ్వుతాడు. ఆయన నవ్వుతూనే ఉంటాడు. ఆయన నవ్వు ఎంతో బాగుంటుంది. చాలా అందంగా ప్రేమతో నిండి ఉంటుంది. అది మిమ్మల్ని అసాధారణమయిన మాధుర్యంతో చుట్టివేస్తుంది. మనుషులు దీనిని కూడా వికృతపరిచారు, అన్నిటినీ వికృతపరిచారు.

CWM 11: 56

అనువాదం: డా. సరోజా ప్రసాద్

దివ్యహాస సూర్యుడు

దివ్యహాస సూర్యుడు అన్నిటి మధ్య ఉన్నాడు, అన్నిటి సత్యంలో దానిని చూచుట, అనుభూతి చెందుట, జీవించుట నేర్చుకోవాలి మనమంతా. దాని కొరకు ప్రతి విషయంలో గంభీరంగా, పట్టుదలగా ఉండే మనుషులను తప్పించు కోవాలి. చాలా విసిగించే మనుషులు వాళ్ళు. ఎప్పుడైనా వాతావరణం గంభీ రంగా మారిన వెంటనే ఏదో ఒక తప్పు జరిగిందని బావించే ప్రభావ మున్న దని, ఒక పాత అలవాటు పునరుద్ధరింపబడడానికి ప్రయత్నిస్తున్నదని, దానిని అనుమతించకూడదని నిశ్చయించుకోవచ్చు.

తప్పు చేసాననే భావన, పాడు చేసాననే పశ్చాత్తాపం, తగినవాడను కాననే భావన — ఓహ్! మరో కాలానికి, ఒక చీకటి కాలానికి చెందిన వనిపిస్తోంది నాకు.

కాలంలో నిలిచి ఉండేవి, పట్టుకు వ్రేలాడేవి, ఓర్పుతో ఉండేవి, చిన్నా పెద్దగా విభజించే అలవాటు, పవిత్రమైనవిగా అపవిత్రమైనవిగా విభజించే అలవాటు — ఇటువంటి అల్పమైన విషయాలు ఆధ్యాత్మిక అనుభవాలకు పునాదులెలా అవుతా యని ప్రశ్నించేవారుంటారు. ఆధ్యాత్మిక జీవితం గడుపుతున్నామని చెప్పుకునే వాళ్ళు ప్రశ్నిస్తారు.

అయినప్పటికీ, ఇది ఒక క్రమక్రమంగా, భౌతికంగా రాశీభూతమైన యదా ర్థంగా రూపుదిద్దుకుంటున్నది. ఇక్కడ భగవంతుడు కొన్ని విషయాలలో ఉన్నాడు, కొన్నిటిలో లేడు అనేదేమీ లేదు. భగవంతు డెప్పుడూ, అన్ని విషయాలలోను ఉన్నాడు. అతడు దేనినీ తీవ్రంగా పరిగణించడు, ప్రతిదీ వినోదిస్తాడు. నీతో ఆడుతాడు, అతనితో ఆడడం నీకు తెలిస్తే. అతి చిన్న విషయాలతో కూడా ఆడు కుంటాడు. కొన్ని టేబులుపై పెట్టాలా? (ఆడుకుందుకు) వాటిని ఎలా అమర్చాలో ఆలోచించ నక్కరలేదు. కొన్ని ఒక వైపు, మరికొన్ని వేరొక వైపు, దానినలా ఉంచు, దీనినిలా వుంచు, మరోసారి మరోలా, ఎంత మంచి ఆట. దైవంతో ఎలా ఆడాలో, నవ్వాలో, నేర్చుకుందాం.

CWM 10:156

మీరు అర్థం చేసుకోవాలి. ఒకే ఒక పద్ధతి, పరిష్కారం ఉన్నది. మీలో 'అహం' (నేను అనే భావన) పోవాలి. అదే అంతా — 'నేను' కు బదులుగా ఏమీ లేకుండుట — చదునుగా, విశాలంగా, నునుపుగా ఉంటుంది. (అభినయంతో చూపుతారు) అటువంటిది ఏదో మాటలలో చెప్పలేము, కాని అది ఒక స్థిరమైన అనుభూతి. "మీరు ఏది సంకల్పిస్తారో అదే, మీరు సంకల్పించినట్లుగానే". మాటలు చాలవు. ఒక ఎరుకతో కూడిన సంవేదన — విశాలత్వం, ఒక స్పష్టమైన అనుభవం. ఈ శరీరం లేదని, దానిని ఉపయోగిస్తారు మాత్రమేనని — 'తత్' అనుభూతి. ఉన్నది ఒకే తత్ — అదే వత్తిడిని కలుగచేస్తుంది (అభినయం). దాని అనుభూతి చెందుతావు, ఈ దివ్య అపారత యొక్క ఎరుక, చివరకు అది చూస్తావు. ప్రతిబింబాలు కావవి స్పష్టమైన అనుభూతినిచ్చే దృశ్యం — ఈ విశాల (అనంత) శక్తి యొక్క దృశ్యం. నిన్ను అదిమే విశాల స్పందనలు, దానిచే అదమబడుచున్న ఈ ప్రపంచం, దానిచే తెర తీయబడి, విశాలమౌతున్నదానిని (ప్రపంచాన్ని) చూస్తావు. నిజంగా చాలా ఆసక్తిదాయకంగా ఉంటుంది.

ఇదొకటే పరిష్కారం, ఇతరమైనదేదీ లేదు. మిగిలినవన్నీ ఆకాంక్షలు, భావనలు, ప్రతీక్షణలు. అది ఇంకా అతిమానవమే, అతిమానసం కాదు.

అది ఒక ఉన్నతతర మానవజాతి మానవు లందరినీ ఊర్ధ్వస్థాయికి కొని పోయేది. కాని దానివల్ల ప్రయోజనం లేదు.

ఈ దృశ్యం స్పష్టం. మానవులంతా పైకి ఎగబ్రాకటానికి పట్టుకు వ్రేలాడుతున్నారు. కాని వారు తమని తాము సమర్పించుకోవాలనుకోడం లేదు. అది తీసుకోవాలనుకుంటోంది! అది పని చేయదు. అది తనని తాను నిర్మూలించుకోవాలి. అప్పుడే ఆ 'తత్' రాగలదు; ఆ స్థానం తీసుకోగలదు.

అక్కడే ఉన్నది రహస్యమంతా. ఈ వైపు మానవులంతా విషయాలను తీసుకోవాలనుకుంటున్నారు, బలవంతంగా. వాటిని పైకి లేవనెత్తుదా మనుకుంటారు. (చేతితో నుదుటి వైపు సంజ్ఞ చేస్తారు). ఇది ఆసక్తిగా ఉంది, కాని అది కాదు. అవకాశా లన్నింటిని వాడుకోవాలి. అప్పుడు వారిలో "ఏదో" అర్థం చేసుకోగలదు. 'అది' ఒక్కటే ఉన్నదని. వారు దాని ముందు సాష్టాంగపడాలి. తాము అదృశ్య

మయే వరకు (శ్రీమాత తన చేతులను ఆత్మసమర్పణ సూచనగా విస్తరిస్తారు). నిజంగా అది చాల కష్టమైన పని — అదృశ్యమవడం నేర్చుకోడం.

(నిశ్శబ్దం)

(శ్రీమాత నవ్వుతారు) బిడ్డా! మన మక్కడికి తప్పక చేరాలి.

CWM 11:215-16

వీరోచితంగా ఉండవలసిన కాలం

శతాబ్దాలుగా మానవజాతి నిరీక్షించింది ఈ సమయం కోసం. అది వచ్చింది. కాని చాలా కష్టకాలం ఇది. ఈ భూమిపై మన మున్నది, విశ్రాంతి పొందుటకో, మనలో మనం ఆనందించుటకో అని నేను చెప్పను. ఇప్పుడు దానికి సమయం కాదు. మనం ఉన్నది కొత్త సృష్టికి దారి ఏర్పర్చడానికి. ఇది చెప్పడానికే పిలిచా మిమ్మల్ని. చేపట్టగలిగినది చేపట్టండి, చేయగలిగింది చేయండి. నిజాయితీగా చేసే పనులకు, ప్రయత్నాలకు, గరిష్ఠంగా నా సాయ మందించ బడుతుంది.

ఇది వీరోచితంగా ఉంజడవలసిన సమయం. సాధారణంగా చెప్పబడేది వీరత్వం కాదు. అది సంపూర్ణంగా ఒకటి కావడం. నిజాయితీగా, వీరోచితంగా ఉండాలి అని నిశ్చయించుకున్న వారందరకూ, ఎల్లపుడూ, దైవసహాయం ఉంటుంది. నీవీక్షణంలో భూమిపై ఉన్నావు. ఎందుకంటే, ఎప్పుడో ఒక సమయంలో, దానిని కోరుకున్నావు గనుక. నీ కెంత మాత్రం జ్ఞాపకం లేకపోవచ్చు, కాని నాకు తెలుసు, అందుకే నీ విక్కడున్నావని. నీవు ఎదగాలి. నీవు చేయవలసిన పని స్థాయికై నీవు ప్రయత్నించాలి. నీలో బలహీనతలను, పరిమితులను జయించాలి. అన్నిటి కంటె ముఖ్యంగా, నీవు నీ 'అహం' తో చెప్పాలి, "నీ రోజులు చెల్లాయి" అని. అహంలేని జాతి, అహానికి బదులు దివ్యచైతన్యం ఉన్న జాతి మనకు కావాలి. ఈ దివ్యచైతన్యమే జాతిని అతిమానస స్థాయికి ఎదగనిస్తుంది, అతిమానస జీవికి జన్మ నివ్వ నిస్తుంది.

నేనొక బందీగా ఇక్కడ ఉన్నానని నీవు నమ్మితే, అది తప్పు. నేను బందీని కాను. మానవజాతి పరివర్తనకు నా మొదటి ప్రయత్నం చేయడానికే నాకీ శరీర మివ్వబడింది. శ్రీఅరవిందులు నా కలాగే చెప్పారు. నేను దానిని చేస్తున్నాను. నాకు బదులు మరొకరు దానిని చేయాలని నేను కోరను. నా కది ఆనందదాయకం

కాదు. కానీ దాని ఫలితాల కొరకు నేను నా ఇచ్ఛతో చేస్తాను. అందరూ లాభపడ గలరు దాని వల్ల. నేను మిమ్ములని అడిగేది ఒక్కటే. మీ అహం చెప్పేంది వినొద్దు. మీ హృదయంలో నిజాయితీగా "అవును" ఉంటే, నన్ను మీరు సంపూర్తిగా తృప్తి పర్చగలరు. నాకు మాటలు అవసరం లేదు. నిజాయితీగా మీ హృదయా లను అంటిపెట్టుకొని ఉండటం, నా కవసరం. అంతే.

అంతర్గత నిరోధం ఘోర విపత్తును కలిగిస్తుంది.

సగటు మానవ నైజం ఎలా ఉంటుందంటే వేరే పద్ధతిలో పొందే విజయం కంటె అది తన సొంత ఇచ్ఛతో ఓటమిని కోరుకుంటుంది. నేను తెలుసుకుంట న్నాను ఈ ఘోర అవివేకాన్ని, ఈ నమ్మశక్యం కాని అవివేకాన్ని.

మానవ వివేకపు లోతు నమ్మశక్యం కానిది. అదెలా ఉందంటే, ఇప్పుడు నేను చెప్పిన దివ్యశక్తి క్రిందకు పోతోందలా (సంజ్ఞ చేస్తారు క్రిందకు) ఏ ఆటంకం లేని అవరోహణలా ఇంకా, ఇంకా లోతుగా అవచేతన లోకి.

అవచేతనలో అద్భుతమైన నమ్మశక్యం కాని విషయా లున్నాయి. వాటిని చూస్తూ రాత్రి తరువాత రాత్రి గడుపుతున్నాను. దివ్యశక్తి పోతోంది — ఇంకా ఇంకా క్రిందికి, ఆగకుండా.

అప్పుడు అరుస్తుంది, మానవ అవచేతన. "ఓహ్! అప్పుడే కాదు. ఇంకా అప్పుడే కాదు — అంత త్వరగా కాదు" అని. దీనికి వ్యతిరేకంగా పోరాడాలి. అది సాధారణ అవచేతన. సహజంగానే ఈ నిరోధం తెస్తుంది ఘోర విపత్తును. అప్పుడు మన మంటాము, "చూడు, నీ చర్య ఎంత లాభకరంగా ఉందో అది తెస్తోంది, ఘోర విపత్తును". నమ్మశక్యం కాని అవివేకం. నమ్మశక్యం కాని అవివేకం.

ప్రతివారు దైవాన్ని పట్టుకు వ్రేలాడుతూ ఉండాలి. వ్రేలాడుతూ ఉండాలి.

CWM 11:310

అనువాదం: యస్. వై. సోమయాజులు

దివ్యక్రియాశక్తులతో యేకం గావటంలోనే పరిష్కారం వుంది

భూమి చరిత్రలో మన మిప్పుడొక సంధికాలంలో వున్నాం. అనంత కాలంలో అదొక క్షణం మాత్రమే, కాని ఆ క్షణం మానవ జీవితంతో పోలిస్తే చాలా కాలాన్ని యిముడ్చుకొన్న క్షణం. నూతన సృష్టి కోసం సన్నద్ధం గావడానికై పదార్థం పరివర్తన చెందుతోంది, కాని మానవ శరీరం ఆ మార్పుకు తగినంత మెత్తనైనది కాదు, ప్రతిఘటిస్తుంది. ఈ కారణం చేతనే ముందుగా తెలుసుకోలేని అస్వ స్థతలు, వ్యాధులు సైతం అనేకంగా విజృంభించి వైద్యశాస్త్రానికి సమస్యగా తయారవుతున్నాయి.

దీనికి పరిష్కారం యిప్పుడు పనిచేస్తున్న దివ్యక్రియాశక్తులతో యేకం గావడంలో వుంది, అంతే గాక పనిని తేలిక చేసే దృఢవిశ్వాసం, శాంతియుత మైన ఒక స్వీకరణ శక్తిలో వుంది.

CWM 16:423

ఉత్తమ పరిష్కారం

... ప్రతి పనినీ చేసేది దైవం అనే అనుభవం నీ కున్నట్లైతే, అప్పుడు ఒక అచంచల విశ్వాసంతో "నీ వాదనల కన్నింటికీ విలువ లేదు, దైవంతో వుండడంలోని ఆనందం, దైవాన్నెరిగి వుండడం, అన్నింటినీ అధిగమిస్తుంది — సృష్టిని అధిగ మించిపోతుంది, జీవితాన్ని దాటి పోతుంది, సంతోషాన్ని మించిపోతుంది, విజ యాన్ని దాటిపోతుంది, ప్రతిదాన్నీ దాటిపోతుంది." (శ్రీమాత వేలెత్తి చూపుతూ) "తత్" అంటారు. అప్పుడంతా చక్కబడుతుంది, దానికి సంబంధించినదంతా సమాప్తమవుతుంది. "తత్" వెలుగులోనికి నెట్టుతున్నట్లు, వెలుగులోనికి, దివ్య క్రియాశక్తితో సంపర్కంలోనికి, స్వభావంలో వున్న కుళ్ళునంతా... అదంతా అంత మయ్యేందుకు బలవంతంగా నెట్టుతున్నట్లుంటుంది....

...ఒకే ఒక్క మార్గం వుందని చాలా చాలా అనిపిస్తోంది... (అమ్మ నవ్వు తారు) వినోదం కలిగించే ఒక చిత్రంలా వుందది. మనస్సు మీద కూర్చొని "మెదలకుండా వుండు" అని చెప్పు. అదొక్కటే మార్గం.

మనసు మీద కూర్చొని (అమ్మ తన తల మీద చిన్నగా తడుతూ) "నోర్మూ

సుకో" అని చెప్పు. కాని, బిడ్డా, మనకా విశ్వాసం లేదు. విశ్వాసం ఏర్పడగానే... దివ్యజీవనం కావాలి అంటాం — అయినప్పటికీ, అదంటే భయపడ్తాం! భయం పోయి మనం నిజాయితీగా తయారైన వెంటనే... ప్రతిదీ మారిపోతుంది, యథార్థంగా! "ఈ జీవిత మింకెంత మాత్రం మాకొద్దు" అంటాం. (అమ్మ నవ్వుతారు) దాన్నంటిపెట్టుకొనేదేదో వుందక్కడ. అదెంతో పొసగని విషయం. మనం మన పాత భావాలకు కట్టువడి వుంటాం... ఈ పాత ప్రపంచానికి కట్టువడి వున్నాం, ఇది పోవాలి — అందుకు మనం భయపడుతున్నాం. దైవశిశువు, మనస్సు తల మీద కూర్చొని ఆటలాడుతున్నాడు!... ఈ బొమ్మను చిత్రించగల ననుకొంటున్నాను, అది అద్భుతంగా వుంటుంది. (అమ్మ కొంచెం కఠిన స్వరంతో) "దైవం తప్పు చేసాడు, అతడలా చేసి వుండగూడదు" అని చెప్పగలిగినంత బుద్ధితక్కువ వాళ్లం మనం. అది హాస్యాస్పదంగా లేదూ.

(నిశ్శబ్దం)

నా దృష్టిలో అత్యుత్తమమైన పరిష్కార మేమిటంటే (అంటే తేలికైనది అని అర్థం) "నీవు సంకల్పించినదే, నీవు సంకల్పించినదే" అని పూర్తి చిత్తశుద్ధితో దైవాన్ని ఉద్దేశించి చెప్పడం. ఆ తర్వాత — అర్థం చేసుకోవడం వస్తుంది. అప్పుడు నీ వర్థం చేసుకొంటావు. కాని మానసికంగా అర్థం చేసుకోవు, అదక్కడ (అమ్మ తమ శిరస్సు స్పృశిస్తూ) లేదు.

"నీవు సంకల్పించినదే".

CWM 11:311-12

వినమ్రతే రక్షణ

వినమ్రత, ఒక పరిపూర్ణ వినమ్రత సమస్త సాక్షాత్కారానికి ముందుగా నెరవేర్చవలసి వున్న ఒక షరతు. మనస్సు చాలా మొండిది. అంతా తనకు తెలుసు ననుకొంటుంది, అంతా అర్థం చేసుకొన్నా ననుకొంటుంది. అదెప్పుడైనా ఆదర్శం పేరు మీద దేని కోసమైనా పనిచేస్తే అదే దానికెంతో ఉదాత్తమమైన కార్యంగా కన్పిస్తుంది. దాంతో అదివరకటి కంటే మరింత మొండిగా తయారవుతుంది. అది అనుకొంటున్న ఉదాత్త భావాల కన్న, దాని గొప్ప పరహిత, లేక యితర ఆదర్శాల కన్న ఆవల ఉన్నతమైనదేదో వున్నదనేదాన్ని చూచేటట్లు

దాన్ని తయారు చేయడం దాదాపు అసాధ్యం. దానికి పరిష్కారం వినమ్రత ఒక్కటే. కొన్ని మతాలు తన జీవులను కించపరచే, ఆ జీవులు తన ముందు మోకరిల్లాలని చూచే యీ భగవంతుడితో వుండే మతాలు భావించేటటువంటి వినమ్రత గురించి కాదు నేను మాట్లాడేది. నా చిన్నతనంలో ఈ విధమైన వినమ్రత నన్ను యెదురు తిరిగేటట్లు చేసింది. తన జీవులను కించపరచే భగవంతుడిని నమ్మ డానికి నేను ఒప్పుకోలేదు. నేను మాట్లాడేది అటువంటి వినమ్రత గురించి కాదు. తన కేమీ తెలియదని, తనకు తెలిసిందేమీ లేదని, యథార్థమైనదిగా, అత్యంత ఉదాత్తమైనదిగా లేక నిస్వార్థమైనదిగా ప్రస్తుతం కన్పించే దానంతటి కావలగా యేదో వుండి వుండవచ్చునని గుర్తించే వినమ్రత గురించి నేను మాట్లాడుతున్నాను. సదా పరమేశ్వరునికి తనను విచారణ కప్పగించుకొనడంలో, సర్వాన్నీ ఆతని ముందుంచడంలో యథార్థమైన వినమ్రత వుంది. నా కేదైనా దెబ్బ తగిలి నప్పుడు (నా సాధనలో దెబ్బలు చాలానే తగిలాయి) వెనువెంటనే అప్రయ త్నంగా ఒక స్ప్రింగులా యెగసి నన్ను నేను ఆయన ముందు పడవేసుకొని "నీవే దిక్కు ప్రభో" అనే ప్రతిచర్య జరిగేది నాలో. ఇటువంటి వినమ్రత లేకుండా నేను దేన్నీ సాక్షాత్కరింప జేసుకోగలిగి వుండేదాన్ని గాదు. నన్ను నేను అర్థం చేసుకోవడానికి మాత్రమే "నేను" అనడం, కాని వాస్తవానికి "నేను" అంటే అర్థం పనిముట్టు అయిన యీ దేహం ద్వారా పలికే ఆ పరమేశ్వరుడే. ఈ విధమైన వినమ్రతను నీవు జీవించడం మొదలుపెట్టినపుడు, దానర్థం నీవు సాక్షాత్కారానికి చేరువవుతున్నావన్న మాట, అదీ షరతు, ఆరంభ కేంద్రం కూడా.

శ్రీమాత ఒక శిష్యునితో సంభాషణలు: డిశెంబరు 21, 1957

"అణకువ కలిగి వుండండి" అనెవరికైనా చెప్పినప్పుడు, వాళ్ళేమనుకొంటారంటే "యితరుల యెడల అణకువతో వుండడం" అనుకొంటారు. అది చాలా తేలిక. అటువంటి అణకువ మంచిది కాదు. యథార్థమైన వినమ్రత దైవం యెడల విన మ్రత అంటే దైవం లేకుండా నేనేమీ కానని, యేమీ చేయలేననీ, దేనినీ అర్థం చేసుకోలేననీ, కచ్చితమైన, సరియైన, సజీవమైన స్పృహను కలిగి వుండడం. నీ వెంతో అసాధారణమైన తెలివితేటలు గలవాడివైనప్పటికీ, సమర్థుడవైనప్పటికీ,

దివ్యచేతనతో పోలిస్తే అది శూన్యం, అనే భావనను సదా నిలుపుకొనే వినమ్రతను కలిగి వుండాలి. ఎందుచేతనంటే అప్పుడే అతనికి స్వీకరించే యథార్థ వైఖరి యెల్లపుడూ నిలిచి వుంటుంది. అణకువతో స్వీకరించడంలో దైవానికి వ్యతిరేకంగా నీకు లేని ప్రాముఖ్యతను ప్రదర్శించడం వుండదు.

శ్రీమాత ఒక శిష్యునితో సంభాషణలు: సెప్టెంబరు *13, 1967*

మన చుట్టూ అనేక చిక్కు లున్నాయని నీకు తెలుసు, కాని యెటువంటి సమస్యా లేని, ముక్కుసూటిగా వుండే, దాపరికం అంటూ లేని ఒక చోటు యెప్పుడూ వుంటూనే వుంటుంది. ఇది నా వాస్తవానుభవం. అన్వేషిస్తూ, దాని కోసం పని చేస్తూ నీవు సున్నా ఆకారంలో (గిరగిరా) తిరుగుతూ చిక్కు వడిపోయానని అనుకొన్నపుడు ఆంతరిక వైఖరిలో యేదో వారిస్తుంది, అకస్మాత్తుగా — చాలా సునాయాసంగా — అది బయటకు తెరుచుకొంటుంది.

నాకీ అనుభవం చాలా తరచుగా కలుగుతూండేది. అందుకని ఆ అనుభవాన్ని నీకు కలిగించమని శ్రీఅరవిందులను అడిగాను.

అందుకనే వారు అనేకసార్లు నిరాడంబరంగా వుండు, సరళంగా వుండు అని చెప్పారు. నీవేం అనుకొంటున్నావో దాన్ని ఆడంబరం లేకుండా చెప్పు. నిరాడంబరంగా వుండు, విడువకుండా సరళంగా వుండు.

ఇవి మాటలు మాత్రమే, కాని వాస్తవానికి, వారీ మాటలు మాట్లాడినప్పుడు వెలుగుబాట ఒకటి తెరచుకొంటున్నట్లుండింది, అంతా చాలా సరళంగా తయారైంది. "ఒక అడుగు తర్వాత మరొక అడుగు వెయ్యి, అంతే మనం చేయాల్సింది." నా కదలా అన్పించింది.

ఆసక్తి కలిగించే విషయం అది. సమస్యలన్నీ అక్కడ (అమ్మ తమ తలను స్పృశిస్తారు) వున్నట్లు తోస్తోంది. వాటిని చక్కదిద్దడం చాలా చిక్కులతో కూడుకొన్న వ్యవహారం. నిరాడంబరంగా వుండు అని వారు చెప్పినప్పుడు వారి కనుల నుండి ఒక వెలుగు వస్తున్నట్లుగా వుండింది, అకస్మాత్తుగా వెలుగు నిండిన ఒక ఉద్యానవనంలో వున్నట్లనిపించింది — యెంత విచిత్రం!

వెలుగులో తానమాడుతున్న ఒక ఉద్యానవనం అన్న అభిప్రాయం కలగించింది.

నిరాడంబరతను గురించి అంత గొప్పగా వత్తి చెప్పారు. నీవు చూచిన దాన్ని లేక నీకు తెలిసినదాన్ని ఆడంబరం లేకుండా చెప్పు — నిరాడంబరం, నిరాడంబరత... అదంతా ఒక ఆహ్లాదం కలిగించే ఉద్యానవనం అనే భావన కలిగించింది.

నిరాడంబరంగా, నిరాడంబరంగా వుండు.

చిక్కులుంటూనే వుంటాయి (అదే సంజ్ఞ) అది కష్టమయం, క్లిష్టతరం. అప్పుడో ద్వారం తెరచుకొంటుంది. నిరాడంబరంగా వుండు.

అది ఎలా వుండిందంటే ఇక్కడ యీ కణతల దగ్గర యెంతో వత్తిడి వున్నట్లుగా వుండింది.

(నిశ్శబ్దం)

అది వేరే స్థాయిలో అయినప్పటికీ, అటువంటి కష్టాన్నీ నేను యెదుర్కోవలసి వచ్చిందనేది మరచిపోకు. నేను చూడవలసిన జనం, నేను చేయవలసిన పనులు, పరిష్కరించవలసిన సమస్యలు, ప్రతిదీ బ్రహ్మాండంగా పోగుపడ్డాయి. ఆ గుంపు అంతా ఒక గట్టి మోపుగా తయారైంది — యెంతో దట్టించినట్లు తయారైంది. ఒక సాధారణ దేహ జీవితానికి — గంటలు, కాలం, క్రియాశక్తులకు — అదెంతో దట్టించబడిందిగా తయారైంది. అయినప్పటికీ దానంతటి వెనుక ఒక విధమైన "సక్రియ చలనరహిత స్థితి" వుండింది. పురోగమించే, పరిణమించే ప్రవాహంపై దానితోపాటే పుట్టుకొచ్చినట్లుంది. కాని యీ చలనరహిత స్థితి... నేనేదైవా చేయదలచుకొన్నదాన్ని చేయ ప్రయత్నిస్తే — నేను ప్రతిదీ చేయవలసి వుందని నీకు తెలుసుగా — అప్పుడది అసాధ్యంగా తయారౌతుంది. విషయాలన్నీ కలసి బంకమట్టి ముద్దగా తయారైపోవడం వల్ల, బాధాకరంగా తయారౌతోంది. ఇప్పుడు కూడా వారి సమాధానం, నిరాడంబరంగా వుండు, నిరాడంబరంగా వుండు.

ఈ రోజు ఉదయం నేను "నడుస్తున్నప్పుడు" రోజూవారీ కార్యక్రమం, ఆ రోజు చేయబోయే పని యెంతో భయంకరంగా కనిపించి, అసాధ్యం అన్పించింది. అయినప్పటికీ అదే సమయంలో ఈ... చలనరహిత ఆంతరికస్థితి నాలో వుంది. నేను నా మానసిక రూపకల్పనలను, చర్యను ఆపిన వెంటనే అదొక ఆనంద తాండవంగా తయారైంది. కణాలన్నీ కంపిస్తున్నాయి (ఒక విధమైన ఆనందోత్సాహం, ఒక అసాధారణ సంగీతం) కణాలన్నీ దివ్యసన్నిధి మహోల్లాసంతో

కంపిస్తున్నాయి. కాని లోనికి ప్రవేశిస్తున్న, దాడి చేస్తున్న బయటి ప్రపంచాన్ని చూచినపుడు... ఈ ఆనందం అదృశ్యం కాలేదుగాని, వెనకడుగు వేసింది. ఫలితం, నేనెప్పుడూ, కదలకుండా కూచొని వుండిపోయినట్లు అన్పించడం — నేనలా చేయగలిగినప్పుడల్లా అది చాలా అద్భుతంగా అన్పించేది. కాని, నిజమే, నిస్సహాయతా సూచనలు, వృద్ధాప్య లక్షణాలు, అరుగుదల, తరుగుదలకు సంబంధించిన, శక్తి తగ్గిపోతున్నటువంటి సూచనలన్నీ బయట నుంచే లోనికొస్తాయి. అదంతా అసత్యం అని నాకు బాగ తెలుసు. కాని దేహంలో ప్రశాంతత అనుల్లంఘనీయం. నాకూ శ్రీఅరవిందుల సమాధానమదే: నిరాడంబరంగా వుండు, నిరాడంబరంగా వుండు, చాలా నిరాడంబరంగా వుండు.

అలా వారనడంలోని అర్థమేమిటో నాకు తెలుసు. దళాలుగా యేర్పడి రావడాన్ని, వ్యవస్థలాగా తయారై రావడాన్ని. సంప్రదాయమని చెప్పుకొంటూ రావడాన్ని, న్యాయబద్ధ ఆలోచనలాగా రావడాన్ని, అడ్డుకోవాలి, వాటిని ప్రవేశించకుండా తిరస్కరించాలి. వాటిల్లో దేన్నీ వారంగీకరించరు. వారు నిరాడంబరత అనే స్థితి కర్మలో వ్యక్తం, కదలికలో, జీవితంలో అప్రయత్నంగా లభించే ఆనంద స్థితి. నిరాడంబరంగా వుండు, నిరాడంబరంగా వుండు, నిరాడంబరంగా వుండు, నిరాడంబరంగా వుండు. సహజానంద స్థితి. వారు దివ్యం అని చెప్పే ఆ స్థితి అన్యప్రమేయం లేని, ఒక సుఖస్థితి, దానిని పరిణామంలో తిరిగి ఆవిష్కరించాలి. మనం దానిని తిరిగి ఆవిష్కరించాలని వారు కోరుతున్నారు. ఇప్పటికి చాలా రోజుల నుంచి (నీ పనికి కూడా అదే వర్తిస్తుంది) నిరాడంబరంగా వుండు, నిరాడంబరంగా వుండు, నిరాడంబరంగా వుండు అని చెప్తూ యిక్కడున్నారు. వారి నిరాడంబరతలో, ఒక ప్రకాశమయానందం వుంది.

ఒక సహజ సంతసోల్లాస స్థితి

ఇక్కడున్న గడ్డు సమస్య, వ్యవస్థీకరించే మనస్సు. అది భయంకరం! అది లేకుండా మన మేం చేయలేమని, దానిని నిరోధించడం కష్టం అని అది మన ల్నెంతగానో నమ్మించింది. నిజానికది సమస్త మానవజాతిని నమ్మించింది ఈ మానసికమైన వ్యవస్థీకరించే శక్తి లేకుండా, చెప్పుకోదగినదేదీ సాధించలేమని, మానవులలో ఉత్తములు అని చెప్పుకొనే వాళ్ళందరూ కూడా దాన్ని నమ్మారు.

కాని ఒక గులాబీ పూవు యెలా ఆనందంగా వికసిస్తుందో అటువంటి నిరా

డంబర ఆనందంతో వికసించాలని శ్రీఅరవిందులు నన్ను కోరుతున్నారు. నిరాడంబరంగా వుండు, నిరాడంబరంగా వుండు, నిరాడంబరంగా వుండు. నేనా మాట విన్నపుడు, మాట్లాడుతుండగా చూచినపుడు, అదొక బంగారు సెల యేటిలా, సువాసనలు వెదజల్లే నందనోద్యానవనంలా నాక్కనిపించింది. అంతా, సర్వం, సమస్తం నిష్కపటంగా వున్నట్లనిపించింది. నిరాడంబరంగా వుండు.

గత రెండు మూడు రోజుల్నుంచీ నీ కోసం, దానికై యెదురు చూస్తున్నాను. ఈ రోజు ఉదయం అది నా కందింది, యెందుకంటే పేరుకుపోయిన పని చాలా యెక్కువగా తయారైంది. ఈ రోజు దాకా వాటిని కనీసం ఒక పద్ధతిలో పెట్టడానికి ఇప్పుడు నాకున్న దాని కంటె పది రెట్లెక్కువ సమయం కావాలి. అక్కడ నేను కొంచెం యిరుకున బడినట్లైంది. "నడక" మధ్యలో ఆపేసి సేద తీరమని నాకొక శక్తి సైతం చెప్తోంది. నా సంకల్పమంతా కలిపి దానిని అడ్డుకొంటున్నారు. చివరకు నేనేదో బుద్ధి తక్కువ పని చేస్తున్నానని అనిపించింది. అదే విషయం, వారూ అదే విషయం చెప్పారు నాకు. నేను కొంచెం సేద దీరాను — వెంటనే అంతా చక్కబడింది.

ముఖ్యంగా, మనం యెంతే వత్తిడితో బ్రతుకుతున్నాం, కాదా?

'ఈ వారానికి నా సందేశం సంగతి యింకా అలానే వుంది. దాన్ని గురించేం చేద్దాం. అవును అది అందుతుంది. కాని మనం యెప్పుడూ బాగా వత్తిడికి లోనవుతూ వున్నాం. ఆ స్తుతిపాత్రమైన మనస్సుచే మనం నియంత్రించబడు తున్నంత కాలం సేదదీరమంటే తమస్సులోనికి, అచేతనలోకి పడిపోవడమేనని నా నమ్మకం. పాత ఆలోచనలన్నీ అలాగే వుండిపోయి, తమను తాము కొనసా గించుకొంటూనే వుంటాయి. ఆ అద్భుతమైన తప్పులు పట్టి హెచ్చరికలు చేసే వాటి తాలూకు అవశేషం లాంటిది నాతో యిలా అంటోంది. "తమస్సు, తమ స్సుతో జాగ్రత్తగా వుండు! నీవు కునికిపాట్లు పడుతున్నావు, అది మంచిది కాదు, చాలా చెడ్డది, చాలా చెడ్డది. అది మతిలేని వ్యవహారం, యెందుచేతనంటే తమస్సు, ఆనందం కలిగించేది కాదు, ప్రకాశమయమైందీ కాదు. కాని యిది వెంటనే ఆనందం కలిగిస్తుంది, తేలికపడ్డ భావన కలిగిస్తుంది."

శ్రీమాత ఒక శిష్యునితో సంభాషణలు సెప్టెంబరు 16, 196!

భావానువాదం: కె. వి. రావు

భగవంతుని సహాయం పొందడంలో అహంకారం అడ్డుపడుతుంది

ఎవరికి నా సహాయం అవసరమో వారందరికీ అది లభిస్తుంది, కానీ అహంకారం దానిని అందుకోవడంలో అడ్డుపడుతుంది. అహంకారానికి అంతరాత్మకి మధ్యగల తేడాను 'వి' అర్థం చేసుకొన్నాడా? అహంకారం అడ్డంకి. అది మొదట్లో మానవ జాతిని మలచడానికి అవసరమయ్యింది, కానీ, ఇప్పుడు మనం దివ్యమానవజాతి, ఉన్నత మానవజాతి పరిణమించడానికి తగిన త్రోవను సిద్ధం చేస్తున్నాం. ఇక్కడ అహంకారం చేయాల్సిన పని అయిపోయింది. అది దాని పని సక్రమంగా చేసింది, ఇప్పుడిక అది అదృశ్యమైపోవాలి. ఇప్పుడు మనలో వుండేది చైత్యపురుష సత్త, మానవునిలో దైవ ప్రతినిధి. అతడే తదుపరి జాతిలోకి ప్రయాణిస్తాడు. కాబట్టి ఈ చైత్యపురుషసత్తను కేంద్రంగా చేసుకొని అతని చుట్టూ మన అస్తిత్వాన్ని అంతా సమీకరించుకోవడం నేర్చుకోవాలి. అతిమానసజాతిగా పరిణమించాలనుకొనే వారు అహంకారం నుండి విముక్తిని పొంది చైత్యపురుషసత్త చుట్టూ కేంద్రీకృత మవ్వాలి.

శిష్యునితో సంభాషణలు, 13 ఏప్రిల్, 1972

ఒక చిన్న పిల్లాడికి మల్లే అమాయకంగా వుంటే అన్ని బాగా జరుగుతాయి, కాని నీవు భయపడకూడదు, జబ్బు పడతాననో, బలహీనమైపోతాననో... ఆఖరికి చని పోతానేమో ననో గూడా. ఈ రకమైన భయాలుండవలసిన పని లేదు. నీ విలా వుండాలి (విశాలతను, శాంతాన్ని కనబరిచే సముద్రంలా సూచన). మన మెప్పుడూ చిరునవ్వుతో కూడిన విశ్వాసాన్ని మాత్రమే కలిగి వుండాలి (నేనిది ఎప్పటికప్పుడు చవి చూస్తూ వుంటాను. దానంతటదే నాలో ఏర్పడుతూ వుంటుంది.) అయితే దానిని సంపాదించాలంటే ఈ సృష్టి అంతటి విశాలమైన చైతన్యాన్ని కలిగి వుండాలి. నీవు సృష్టి అంతటి విశాలమైన, సంపూర్ణ విశ్వాసం గలవాడవుగా ఎదుగుతావు.... చివరకు అది ఒక చిన్న పిల్లాడిగా తయారవుతుంది. ఏమి చేయబడాలో మనకంటే బాగా ఆ దైవానికి తెలుసు. ఏమి చేయబడాలో

మన కంటే బాగా ఆతనికి తెలుసు.... మన చిరునవ్వుతో ఉండగలిగితే, అది చాలా తేలికగా జరుగుతుంది.
శిష్యునితో శ్రీమాత సంభాషణలు 17 మే 1972

ప్రతి ఒక్కరికీ ఏది జరగాలో అదే జరుగుతుంది

ఎవరైనా భగవంతునికి తనను తాను అర్పించుకుంటే, ఆతనినే నమ్మితే, దైవమే అతడి బాగోగులు చూసుకొంటాడు. (దీనిని ఎలా వివరించాలి?) ఉదాహరణకి నీ గురించి చేయవలసినదంతా అది అనుక్షణం చేయబడుతున్నది. నీవు ఒక వేళ మరెవరి గురించైనా దైవాన్ని అడిగితే, అది కూడా ఆయన చేస్తాడు. అది కూడా అతని మంచికే చేయబడుతుంది. కాని ఆ మంచి, దైవం ఏది మంచిది అని తలుస్తాడో, అదే.

నీవు మాత్రం ప్రశాంతంగా ఉండాలి — పరిపూర్ణ విశ్వాసంతో కూడిన ప్రశాంతతతో...

అవరోధాలను అంతరింపజేసే శక్తి ప్రశాంతత కున్నది.
శిష్యునితో శ్రీమాత సంభాషణలు 18, జూన్, 1972

నీవు ముందుకు పోవడానికే అంతా సంభవిస్తుంది

చాలా మట్టుకు ఈ భౌతికంలో లీనమైపోతూ వున్న ఒక అనుభూతి కలుగుతున్నది.... సమస్యల్లోనూ, పనిలోనూ నిమగ్న మైనప్పటికీ బాహ్యంలో మేమేదైనా చేస్తున్నామా అనే స్ఫురణ కూడా లేనంతగా వుంటున్నా.... యోగం లేదా మరేదయినా జరుగుతూనే వుంటుందా?

ఇప్పుడు ఈ మొత్తం అస్తిత్వం (శరీరం దీనిని బాగా అర్థం చేసుకుంది) ఈ అస్తిత్వాని కంతా తెలుసు — జరిగేది సాధ్య మైనంత త్వరితంగా నీవు ముందుకు సాగేలా చేసేదే... అడ్డంకులు, భేదాభిప్రాయాలు, అవగాహనా లోపాలు, నిరర్థకమైన మానసికోద్వేగాలు, ఇలా ప్రతిదీ... నిన్ను ముందుకు నడపడం కోసమే... ఒక కేంద్రం తరువాత మరో కేంద్రాన్ని దాటుతూ, నీవు సాధ్య మైనంత వేగంగా ముందుకు పోయేలా చేయడానికే.... నీకు గనుక భౌతిక పదార్థంతో సంబంధం లేకపోతే మరి అది ఎలా రూపాంతరం చెందుతుంది? ఈ అభ్యంతరాలు, ఈ

భేదాభిప్రాయాలు, పైన కనిపించేవాటిని చూచే పై పొర మనస్సు నుండే వెలువడు తున్నాయా అనడానికి యిదే ఋజువు. ఇది కేవలం నీ చేతనిని జాగృతపరచడా నికి, తద్వారా అలాంటి విషయాలతో ఏమార్చబడకుండా వుండటానికి, ఇదంతా పూర్తిగా బాహ్యమైనది, పైపైని కనిపించేది అని స్పష్టంగా చూడటానికి. దీనికి వెనుకగా జరుపబడేదంతా సాధ్యమయినంత వేగంగా రూపాంతరీకరణ వైపుగా కదులుతున్నదని చూడటానికి.

CWM 11:217

అందుకు ఒకే మార్గం వుంది

అందుకు ఒకే మార్గం మాత్రమే వుంది: సర్వోన్నత చైతన్యం ఏమి కోరు తున్నదో దానినే కోరడం, మన హాస్యాస్పదమైన, అల్పమైన తలంపును బట్టి పర్యవసానాలు ఎలా అన్నా వుండనీ...

ఈ విధంగా (శ్రీమాత తమ హస్తాలు విస్తరింప జేస్తారు) దైవం ఏమి కావా లని కోరుతాడో దానిని కోరడం. మనం — మనమే ఆ తనను తాను మరిచిన దైవం. ఇప్పుడు మన కర్తవ్యం ఆ విస్మరించిన అనుబంధాన్ని పునః స్పందానిం చడం. దానిని నీ కిష్టమైన ఏ పేరుతో పిలుస్తావో పిలువు. దివ్య సమగ్ర పరిపూర్ణులు గావడమే జరుగవలసింది. అంతే

దివ్యసమగ్రత దివ్యశక్తి జ్ఞానంగా మారి తీరడమే జరుగవలసింది. దానిని ఎలాగైనా పిలువు, నేను పట్టించుకోను. అట్టి ఆకాంక్ష మనలో వుండాలి. మన మీ బురదలో నుండి, ఈ మూఢత్వం నుండి, ఈ అచేతన నుండి, ఈ ఏవగింపు పుట్టించే ఓటమి నంగీకరించే భావన నుండి నుజ్జు నుజ్జు చేయడానికి సమ్మతిం చిన వలన ఈ అవలక్షణాల నుండి బయటపడాలి.

మనం భయపడుతున్నాం, మనం దీని (శ్రీమాత తమ చేతులపై చర్మాన్ని చూపుతూ) మనుగడ కోసం భయపడుతున్నాం. దీని కోసం, ఇదే విలువైనదై న్నట్లు. ఎందుకంటే మనం సచేతనంగా వుండాలని కోరుకొంటున్నాం. కానీ సర్వోన్నత చేతనతో మమేకమవుదాం, అపుడు మనం ఎప్పటికీ చైతన్యవంతు లుగా వుండొచ్చు! కావలసింది అదే. కచ్చితంగాఅదే. మన చేతనను అసలేది నశించిపోతుందో దానితో ఏకం చేస్తున్నాం, దాని కనుగుణంగానే నాశనమై

పోవడానికి భయపడుతున్నాం. నేనింత చక్కగా నీకు చెబుతాను. మన చేతనను శాశ్వత చైతన్యంతో కలుపుదాం. శాశ్వత చైతన్యంలోని ఆనందాన్ని అనుభవిద్దాం.

శిష్యునితో శ్రీమాత సంభాషణ 19 జూలై 1972

దివ్యప్రేమ కున్న శక్తి

దివ్యప్రేమలో, దాని మూలంతో, ఏదో నిరంతరం దివ్యానుగ్రహ జోక్యంలా భావించబడేది ఒకటి వున్నది. అది ఒక శక్తిలా, ఒక తీయదనంలా సర్వత్రా వ్యాపించే ఓదార్పు భావనా ప్రకంపనంలా వుంటుంది. కానీ ఇవన్నీ ఒక దేదీప్యమాన చేతనను నేరుగా కొన్ని కేంద్రాలపై ఏకాగ్రపరుస్తుంది. అక్కడే "ఆలోచన" అన్నదాని అసలు ఉపయోగాన్ని నేను అవలోకించాను. ఆలోచన అన్నది భావ ప్రకంపనాన్ని అక్కడ అవసరమైన చోటికి చేర్చే వాహకంగా పని చేస్తుంది. ఈ శక్తి, ఈ మధుర మైన ప్రకంపన ప్రపంచమంతటి పైనా స్థిరంగా ఉండి దానిని స్వీకరించమని ఒత్తిడి కలుగ జేస్తుంది. కానీ యిదంతా ఒక నిస్వార్థ చర్య. ఆలోచన — దేదీప్య మానమైన ఆలోచన శరణాగతమైన ఆలోచన, ఒక సాధనానికి మించి మరేమీ కాని ఉపకరణం, యితరమైన వాటికి వేటికీ పూనుకోని, కేవలం చైతన్యం ద్వారా సాగిపోవడంలోనే తృప్తి చెందే ఆలోచన. ఒక మధ్యవర్తిగా, ఒక బాంధవ్యాన్నీ, ఒక అనుబంధాన్నీ ఏర్పరచడానికి, ఈ నిస్వార్థశక్తిని కొన్ని నిర్దిష్ట స్థాన బిందువులపై అవసరం మేరకు పని చేయగలిగేలా చేయడానికి ఉపకరిస్తుంది.

దీని నింకా సమగ్రంగా చెప్పాలంటే "చెడు" అన్నది ఎప్పుడూ తన నివారణను, తానే మోసుకొంటూ తిరుగుతుంది. అది ఎట్లాంటి బాధ అయినప్పటికీ దాని నివారణ కూడా దానితో పాటే వుంటుందని చెప్పవచ్చు. మామూలుగా ఒక చెడును పనికిరానిదిగా "నిరర్థక" మైనదిగా, "మూఢ" మైనదిగా చూసే బదులు బాధను ఆవశ్యకం గావించిన ఆ కదిలకను , ఆ పరిణామాన్ని ఆశించిన ఫలితాన్ని అందుకొనేదిగా చూడాలి. దానితో పాటే ఎవరైతే దైవకృపను స్వీకరించడానికి తమను తాము ఉన్మీలనం గావించుకుంటారో వారి బాధ కూడా నివారించబడుతుంది.

ఇక్కడ మూడు విషయాలున్నాయి. ఒకటి బాధ పురోగతిని సాధించిడానికి ఒక ఉపకరణంగా, రెండు పురోగతిగా, మూడు ఆ బాధ నివారణగా — ఇవి పరస్పరం అనుగాములు కావు. ఇవి సహవాసులు. ఏకకాలంలో మూడు మూకుమ్మడిగా వుంటాయి. పరివర్తనా ప్రక్రియ జరిగే తరుణంలో అది ఒక భాధను సృష్టించినట్లయితే, దానిలోనే దాని నివారణోపాయం కూడా వుంటుంది. ఆ స్థితిలోనే వేదన ననుభవించడానికి కావలసిన ఆకాంక్ష, వికసనం కూడా వుంటాయి. ఆ ప్రభావం సంపూర్ణం, సమగ్రం: అది రూపాంతరీకరణతో పాటు, దానిని పొందడానికి కావలసిన ప్రక్రియతో పాటు మనలోని విరుద్ధ వైఖరివల్ల ఉత్పన్నమైన బూటకపు బావావేశాన్ని నివారించడం, ఈ 'బాధ' అన్నదానిని లోకంలో యింకా పరిచయంకాని దానితో భర్తీ చేయటం; అది ఆనందానికి, శ్రేయస్సుకు, విశ్వాసానికి, రక్షణకు సంబంధించినది. పరిపూర్ణమైన ప్రశాంతతలో నెలకొని వుండే ఒక అతీత సంవేదన — కచ్చితంగా అది శాశ్వతంగా నిలిచి వుండేది.

ఈ విశ్లేషణ దివ్యానందం యొక్క 'మూలసంపద' అనబడే విషయాన్ని కొంత అసమగ్రంగా వ్యక్తపరుస్తుంది.

శ్రీమాత

అనువాదం: హర్షవర్ధన్

సువర్ణ సేతువు

అఖిల

అఖిల భారత పత్రిక

ఏప్రిల్ 2016

సంపాదకీయం

శ్రీమాతారవిందుల సమాగమము భూలోకంలో ఒక నూతన శకారంభానికి నాంది సూచిక. శ్రీఅరవిందులు శ్రీమాతను మానవజాతి గుండెలలో ప్రతిష్ఠించారు. అది చరిత్రలో నమోదు కానటువంటి ఒక అమోఘమైన అంశం. ఆ మహాత్ముల తపః ఫలితముగా నేడు అతిమానస చేతన మరియు మహాశక్తి భూలోక మందు క్రియాశీలమై మానవజాతిని నూతన భవితకు అనువైన విధంగా మలుస్తున్నది. ఈ దివ్యభవిత మార్గదర్శనానికి కిటుకు శ్రీమాత వద్ద ఉన్నది. ఆమె ప్రత్యక్ష ఉనికి నేటి మానవజాతి రేపటి అతిమానవజాతి దిశగా అడుగేయటానికి అనుసరించ వలసిన దుర్గమ మార్గాన్ని దాటడానికి ఉపకరిస్తుంది. 'సావిత్రి' మహాకావ్యంలో ఉటంకించబడినట్లుగా:

"లోకం విన్నది ఈమెను గురించే అయితే
ఏ శుభ పరిణామానికీ ఆశ్చర్యపడ వద్దు.
ఆమె హృదయ పరివర్తన ఒక రసయోగ స్పందన
అవలీలగా సాగే అద్భుత ఆనందహేల"

సావిత్రి, పుట 723 అనువాదం: అందుగులపాటి కైలాసపతి



నేను కేవలం శ్రీఅరవిందుల శక్తిని, నా బిడ్డ లందరికీ దివ్యజననిని

నా బిడ్డ లందరు నా చేతన మరియు నా అస్తిత్వములో సమభాగస్తులు. వారు పరివర్తన చెంది సిద్ధి బడసినప్పుడు ప్రతి ఒక్కరికి నా యొక్క మరియు శ్రీఅరవిందుల యొక్క ఒక వ్యక్తిత్వ పక్షాన్ని అభివ్యక్తపరచుటకు సమాన హక్కు లభిస్తుంది.

సార్వజనీనమైన అభివ్యక్తి అభిలషిస్తూ సర్వజనావళిలో సమిష్టిగా ఏకీభావన ఏర్పడినప్పుడు, భువిపైన ఒక వినూత్న దివ్యజగత్ సృష్టి సమ్మతించ బడుతుంది. ప్రతి ఒక్కరు ఎవరి పాత్రను వారు పోషిస్తారు. కానీ ఏ పాత్ర గూడా సమిష్టి వ్యవస్థలో ఒక శక్తిగా ఉపకరించితే తప్ప సంపూర్ణతను సంతరించుకోలేదు.

CWSA 32:84

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

[illegible]

ప్రశ్న: భౌతిక అవతరణ లోనికి దైవశక్తులను, భగవదనుగ్రహమును అధికాధికముగా తీసుకురావడమే గాక, శ్రీమాత ఒక వ్యక్తిగా తానే స్వయంగా వాటి రూపధారి అని నేను భావించడము యథార్థమేనా?

సమా: అవును

ప్రశ్న :ఆమె రూపధారణ భౌతికమును స్ఫూర్తిగా మార్చి రూపాంతరీకరణ చెందడానికి సదవకాశ మనుకోవచ్చా ?

సమా: భూచైతన్యము మార్పుచెందడానికి, అతిమానసమును స్వీకరించిన ముందుగా అందుకు అవసరమైన రూపాంతరీకరణ సాధ్యమవడానికి అది ఒక అవకాశము. తదుపరి, అతిమానసం వలన జరిగే రూపాంతరీకరణ భావికాలంలో జరుగుతుంది. కాని భూచేతన పూర్తిగా అతిమానసీకరణ మగుట సాధ్యపడదు. మనిషిని మనస్సు ఏ విధముగా ప్రతిబింబిస్తుందో, ఆ విధంగానే ముందుగా అతిమానసమును ప్రతిబింబించే నూతన మానవజాతి ఆవిర్భవిస్తుంది.

ప్రశ్న: శ్రీమాత దివ్యప్రకాశమునకు దివ్యశక్తులకు మన వ్యక్తిత్వము ఎంత ఎక్కువగా తెరుచుకోగలిగితే, అంత ఎక్కువగా ఆమె శక్తి ఈ విశ్వము నందు ప్రతిష్ఠించబడుతుంది. ఆ విధంగా జరగదా?

సమా: ప్రతిష్ఠించబడేది రూపాంతరీకరణశక్తి — విశ్వశక్తి సర్వవ్యాపకమై ఎల్లప్పుడూ వుంటుంది.

*

అతిమానస చేతనను భూమి పై తీసుకువచ్చే క్రమములో శ్రీమాత అవతరిస్తారు. ఆమె అవతరణ ఆమె సంపూర్ణ సాక్షాత్కారాన్ని ఇచ్చుట సాధ్యపడునట్లు చేస్తుంది.

*

అతిమానస పరమ సత్యమును భూమి మీదకు తీసుకువచ్చి దాని కార్యాచరణను రూపొందించడం యోగం యొక్క అంతిమ లక్ష్యం అని మాత్రం చెప్పగలను (మిగతా లక్ష్యాలు, దశలు ప్రాథమికమైనవిగా, ఉపకరణాలుగా ఉపకరిస్తాయి.) ఆశ్రమ కార్యనిర్వహణ నా ద్వారా, శ్రీమాత ద్వారా జరగాలనే భావన ఉంది.

ఈ లక్ష్యంతోను, పరమ సత్యం ఆవిష్కరిస్తుందనే విశ్వాసంతోను సాధకులు నా పైన, శ్రీమాత పైన నమ్మకముంచుతారు. వారికి మేము మార్గదర్శకులుగా నుండాలి, అవరోహిస్తున్న ఏ విషయాలనైతే వారు ఏ విధంగానూ అందుకోలేరో వాటిని మా ద్వారా స్వీకరించాలి. వారు ఈ సత్యమార్గంలో గాక, వేరొక మార్గ మును అనుసరించాలనుకుంటే, అలా చేయడానికి వారు స్వతంత్రులు, కాని అది ఈ ఆశ్రమములో సాధ్యపడదు. కారణం అందులో వారికి ఫలితం దక్కదు, ఎందుకనగా ఇచ్చట పని చేయుచున్న దైవశక్తి యొక్క అంతిమ లక్ష్యము అది కాదు గనుక. మా ద్వారా ప్రసరించే దివ్యశక్తిని నిరాకరించి మరొక సాధనా మార్గము ననుసరించితే, ఈ మార్గము నుండి తప్పిపోతారు, వారు మా సము ఖము నందు, ఈ యోగసాధనలో ప్రయోజనం పొందరు. ఇక్కడ నిర్వహించబడే కార్యంలో ఒక సామరస్య పూర్వకమైన వ్యక్తుల సముదాయంగా ఏర్పడతారు.

శ్రీమాత ప్రత్యక్షముగా తమ ఉన్నత చైతన్యస్థితి నుండి సాధకుడుని ప్రభా వితం చేయరు. ఆమె కావాలనుకుంటే చేయగలరు. ఆమె ప్రపంచమంతటిలో అతిమానసచేతనా పరవర్తనను కూడా ఒక్క రోజులోనే తీసుకు రాగలరు. కాని అలా చేసినట్లయితే ఇక్కడ సృష్టించబడిన అతిమానస చేతానా స్వభావం ఉన్నత స్తరాల్లో వున్నట్లే వుంటుంది.

అజ్ఞానభరితమైన లోకం అతిమానస లోకంగా పరిణమించి నట్లుండదు. అది చూడడానికి అతిమానసం ఏ విధంగా నుంటుందో ఆ విధంగా ఉండదు. నిజానికి అది దివ్యమనసు అయి వుంటుంది.

ఇది అతిముఖ్యమైన సత్యం.

CWSA 32:32, 34, 98, 93 7

32, 33, 34, 98

అనువాదం: జి. వి. యస్. వి. ప్రసాదరావు

దూరాభారం సమస్య కాదు

శ్రీమాతారవిందుల ప్రభావానికి లోనవుటకు షరతులేమీ లేవు — అపారమైన విశ్వాసము, ఆధ్యాత్మిక మార్గానుసరణలో నిరుపాధికమైన నిజాయితీ, ఆ ప్రభావానికి ఉన్మీలనమై వుండాలనే సంకల్పశక్తి, సమర్థత తప్ప. అయితే సాధారణంగా నిజాయితి, విశ్వాసము మూలంగానే ఆ శక్తి లభిస్తుంది.

ఆశ్రమం వెలుపల వుంటూ ఈ యోగం అనుసరించటం సాధ్యపడుతుంది. భారతదేశ ఉత్తర, దక్షిణ ప్రాంతాలలో ఈ విధంగా చేసేవారు చాలామంది వున్నారు.

*

మా వ్యక్తిగత సహానుభూతి లభ్యమవుతుంది కానీ అది అధికంగా అంతర్ముఖమైన అందుబాటులా వుంటుంది; దానికి ఆధారంగా భౌతిక సంపర్క అంశాలు కొన్ని వుంటాయి. ఈ అంతర్ముఖ సంపర్కం, ఈ అంతరంగ సహాయం కడు దూరంగా నుండి కూడా అందుకోవచ్చు.

CWSA 32:106-07

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి జానకి

మానవజాతితో దైవం వర్తించే విధానం

దైవం పిలుపుకు విశ్వాసంగా ఉండటం.

ఆత్మప్రకాశానికి, దైవం పిలుపుకు విశ్వాసంగా ఉండాలని నేను చెప్పినప్పుడు, నేనేమీ గతించిపోయిన దానినిగాని లేక నీ తరఫున జరిగిన పొరపాటును గురించి గాని ప్రస్తావించటం లేదు. నేను కేవలం గడ్డు పరిస్థితులలోను, ఇంకా నీపై జరిగే దాడులన్నింటిలోను ఉండవలసిన గొప్ప అవసరాన్ని మాత్రమే సూచిస్తు న్నాను — దివ్యసత్యం పిలుపుకు, తప్పకుండా ఆచరించవలసిన దివ్యప్రకాశపు మౌనసంజ్ఞలకు వ్యతిరేకమైన ఎటువంటి సలహాలకైనా, ప్రేరణలకైనా, ప్రలోభా లకైనా చెవి యొగ్గటాన్ని తిరస్కరించటం, అటువంటివాటి నన్నింటిని ఎదుర్కో నటం. సందేహము, కుంగుబాటులు అన్నింటిలోను "నేను దైవానికి చెందిన వాడను, నేను అపజయం పొందను" అని చెప్పాలి; అపవిత్రమైన, అయోగ్యమైన సూచనల కన్నింటికీ "నేను శ్రీఅరవిందులు, శ్రీమాత ఎంచుకున్న అమృత శిశువును; స్వయంగా నాకు నేను, వారికి నిజాయితీగా ఉండి తీరాలి — గెలుపు తథ్యం; ఒక వేళ నేను పతనమై పడిపోయినా, తిరిగి మరలా నేను లేవగల ననేది కచ్చితంగా జరిగే విషయం" అని సమాధానం ఇవ్వాలి; మన ఆదర్శం నుండి మరలిపోయి, మరొక ఆదర్శానికై పాటుపడమనే ప్రేరణల కన్నింటికీ, "ఇదే మహత్త్వమైనది, ఇదే దివ్యసత్యం, నాలోని ఆత్మను కేవలం సంతృప్తి పరచ గలిగింది ఇది మాత్రమే; నేను అన్ని పరీక్షల గుండా, ఘోర వ్యధల గుండా సహ నంతో దైవయాత్రలో కట్టకడపటి వరకు పయనిస్తాను". దివ్యప్రకాశానికి, పిలుపుకు విశ్వాసం కలిగి ఉండాలని నేను చెప్పినదాని అర్థం ఇది.

CWSA 32:104

దివ్య స్నేహితుడు శ్రీమాత

నీ యెడల మా వైఖరిలో ఏదైనా మార్పును కలిగించగలదని నీవు తలంచ నవసరం లేదు. బాహ్య విషయాల వలన మారిపోగలగటానికి మాకు నీ యెడల ఉన్నది ప్రాణికమైన ప్రేమ కాదు: అది కొనసాగుతుంది, మేము పట్టుదలతో నీకు సహా యమే కాకుండా, నిన్ను ఉద్ధరించే ప్రయత్నము చేస్తూ ఉంటాము, నిన్ను దివ్యప్రకాశం దిశగా నడిపిస్తాము, అప్పుడు జరిగే ఆత్మ మరియు హృదయ సంయోగంలో నీవు దివ్యస్నేహితుని, శ్రీమాతను గుర్తించ గలుగుతావు.

CWSA 32:101

మా సన్నిధి, శక్తి, శాంతి, ప్రేమ ఎల్లప్పుడూ నీతో ఉంటాయి. అది నీవు తప్పక అర్థం చేసుకుని, దాని చైతన్యాన్ని నీవు అట్టి పెట్టుకోవటం నేర్చుకోవాలి. అది నీవు చేస్తే తక్కినదంతా అల్ప ప్రాముఖ్యమైనది (నీ కష్టాలు, నీ పూర్వ ప్రకృతి మొదలైనవి), కాలక్రమేణా అంతా సర్దుకుంటుంది.

CWSA 32:105

అదేమీ అపరాధమా లేక దండించతగినదా అనే ప్రశ్న కాదు — మనం జనులను వారి అపరాధాలను ఖండించి, శిక్షించదలచుకొంటే, న్యాయనిర్ణయం చేసే అత్యున్నత ధర్మాసనంలాగా సాధకులతో ప్రవర్తించదలచుకొంటే, ఏ సాధనా సాధ్యపడదు. మాకు వ్యతిరేకంగా నీవు చేసే నిందారోపణ ఏ విధంగానూ న్యాయసమ్మతంగా అనిపించచం లేదు. సాధకుల యెడల కేవలం మా కర్తవ్యం వారిని ఆధ్యాత్మిక సాక్షాత్కార దిశగా తీసుకువెళ్ళడమే — మేము కుటుంబం పెద్దగా గృహ సంబంధమైనటువంటి తగాదాలలో జోక్యం చేసుకుంటూ, ఒకరిని సమర్థిస్తూ, ఇంకొకరిని పూర్తిగా దండనార్హులను చేస్తూ ప్రవర్తించలేం! అయినప్పటికీ తరచు 'ఎక్స్' తడబాటుకు లోనవుతూ ఉండవచ్చు, అతడికి చేయూత నివ్వడంతో పాటుగా, తిరిగి అతనిని పైకి లేపి, దైవం దిశగా మరియొకసారి అడుగులు వేసేటట్లు చేయవలసి ఉంటుంది....

CWSA 32:115

శ్రీమాత, నేను అందరితోను దైవధర్మం ప్రకారం వ్యవహరిస్తాం. మేము ధనవంతులను, బీదవారిని, మనుషుల ప్రమాణాల ప్రకారం గొప్ప-జన్మ లేదా నీచ-జన్మ కలిగినవారందరినీ ఒకే విధంగా అక్కున జేర్చుకుంటాం, వారికి సమానమైన ప్రేమను, రక్షణను అందజేస్తాం. సాధనలో వారి పురోగతే మాకు ప్రధాన విషయం — ఎందువల్లనంటే వారు దాని కోసమే ఇక్కడికి వచ్చారు, అంతేగాని వారు వారి అభిరుచులు తీర్చుకోవడానికీ లేదా కడుపులు నింపుకోవడానికీ కాదు, సర్వ సాధారణమైనటువంటి ప్రాణికవాంఛలు తీర్చుకోవడానికీ లేదా తమ పదవి కోసం లేక స్థానం కోసం లేక అవసరాల కోసం పోట్లాడటానికి కాదు. శ్రీమాత ప్రేమకు లేక రక్షణకు వారు ఏ విధంగా సమాధాన మిస్తారనేదాని మీద ఆ పురోగతి ఆధారపడి ఉంటుంది — అందరి మీదా సమానంగా వర్షించే ఆమె శక్తులను ఏ విధంగా అందుకుంటారు, ఆమె ఒసంగినదానిని ఏ విధంగా ఉపయోగిస్తారు

లేక దురుపయోగం చేస్తారనేది. కాని శ్రీమాతకు బాహ్యంలో అందరితో ఒకే విధంగా నడచుకోవలసిన ఎటువంటి ప్రత్యేక భావనా లేక విధాయకమూ లేదు — ఆమె ఆ విధంగానే చేయాలని పట్టుబట్టడం అనేది అసంబద్ధం, బుద్ధిహీనత — ఆమె గనక ఆ విధంగా చేస్తే, విషయాల సత్యతకు, దైవధర్మానికి అనృతత్వ మును ఆమె నిరూపపించినట్లవుతుంది. ప్రతి సాధకుడు అతని ప్రకృతిని బట్టి, అతని సామర్థ్యాలు, వాస్తవిక అవసరాలను బట్టి (అతడు హక్కుభుక్తంగా కావాలని పట్టుబట్టేవి లేదా కోరికలు కాదు), అతని ఆధ్యాత్మిక సంక్షేమానికి ఏది అత్యుత్తమ మైనదో దానిని బట్టి వ్యవహరించవలసి ఉంటుంది. అది ఏ విధంగా చేయబడు తుంది అనే దానిని, సాధకులు అజ్ఞానంతో శ్రీమాత వారి ప్రమాణాల ప్రకారమే తప్పక చేయాలని లేక సమానత్వమనే వారి భావాలకు లేదా న్యాయవర్తనం లేదా హక్కుభుక్తంగా వారి ప్రాణికం కోరేవాటిని లేదా బాహ్యప్రపంచం నుంచి వారు తమతో తెచ్చుకున్న సిద్ధాంతాల ప్రకారం నడచుకోవాలని ఆజ్ఞాపిస్తే మేము వాటిని తిరస్కరిస్తాం. మేము మాలోని దివ్యప్రకాశం ప్రకారం, ఈ భౌతిక మహాప్రకృతిలో దేనినైతే స్థాపించాలని అవిరళ కృషి చేస్తున్నామో ఆ దివ్యసత్యం కోసం పని చేస్తాం.

CWSA 32:116

మానవ చైతన్యం అనేక ముడిపదార్థాలతో తయారయింది, వేగవంతమయిన నిరంతర ఆధ్యాత్మిక ప్రయత్నాన్ని అందరూ తట్టుకోలేరు — వారికి శిక్షణ గర పాలి, జ్ఞానం కలిగించాలి, వారి అలవాట్లలో మార్పు తీసుకురావాలి. అందువల్లనే శ్రీమాత, నేను ఆత్మ ఇతర భాగాల మీద వృద్ధి నొందటానికై సమయం కేటాయిస్తాం, దానికి సమయ మెక్కువ తీసుకుంటే మేము చింతించం, ఎప్పు డంటే దానికి అక్కడ ప్రధానంగా చిత్తశుద్ధి, ఇచ్ఛ ఉండి ఉంటేనే — కచ్చితంగా అవి నీలో ఉన్నాయి. విషయాలు శీఘ్రగతిలో పోవటం లేదని సహనం కోల్పోవద్దు లేదా తేలికగా నిరాశను దరిచేరనీయవద్దు. ఆకాంక్షించు, ధృఢవిశ్వాసమనే సూర్యకాంతిలో నిన్ను నీవు ఉంచుకునే ప్రయత్నం చేయి, విత్తనాన్ని వృద్ధి పొందనీయి.

CWSA 232:117

ప్రతివారు తప్పుడు ప్రతిక్రియలను వదిలించుకోవలసి ఉంటుంది — వారు

ఇక్కడ ఉన్నది దాని కోసమే. ఇంకొక విధమైన నివారణ ఏదైనా ఉన్నదా? వారు దానికి మానసికంగా సిద్ధంగా లేకపోతే, అప్పుడు మేము సాధారణ జీవితంలోనే కొనసాగుతూ ఉండిపోయి, ఒకరు పెద్ద కుటుంబంలో వ్యవహరించే విధంగా తగాదాలలో జోక్యం చేసుకుంటూ, సయోధ్య కుదురుస్తూ, సముదాయించుతూ, చివాట్లు పెడుతూ, శిక్షిస్తూ, మందలిస్తూ, విషయాలను ఏదో ఒక విధంగా మరి యొక ఘర్షణ తలెత్తేవరకు పోనిస్తూ ఉండాలి. దానికి అంతులేదు, మేము దానిని చాలా కాలం క్రితమే వదలివేశాం. ప్రతివారు తమకు తామే అవశ్యం సరిదిద్దు కోవాలి — దాని నుంచి బయటపడటానికి మార్గాంతరం లేదు.

CWSA 32:117

చేయవలసిన ప్రయత్నం

సహాయం సాధికారకమౌతుందా అనే సందేహం ఏమాత్రం హేతుబద్ధమైనది కాదు, ఎందువల్లనంటే జీవితంలో స్పష్టంగా కనపడుతున్నదాని నంతటిని బట్టి, గతంలోని ఆధ్యాత్మికానుభవ మంతటిని బట్టి, ప్రత్యేకానుభవం కలిగినవారందరిని బట్టి, ఎవరైతే శ్రీమాత నుంచి, నా నుంచి సహాయం పొందారో (అటువంటి వారెందరో ఉన్నారు) వారిని బట్టి ఇవన్నీ సరిపోతాయి, అందర్గతమైన లేదా ఆధ్యాత్మిక సహాయం ఒకరి నుంచి మరియొకరికి లేదా జగద్గురువు నుంచి శిష్యులకు లేదా నా నుంచి నా శిష్యులకు సాధ్యం కాదనే భావనను వ్యతిరేకించ టానికి. అందువల్ల ఆ సందేహం వాస్తవంగా హేతువు కారణంగా తలెత్తింది కాదు, కాని అది ప్రాణికం నుంచి, భౌతిక మనస్సు నుంచి వచ్చి నిన్ను బాధపెటు తున్నది. భౌతిక మనస్సు తన అనుభవంలోనికి రానిదాని నంతనూ సందేహిస్తుంది. ఒక వేళ అది అనుభవించినా ఆ అనుభవం అక్కడ ఏమాత్రం లేకపోయినా లేదా తక్షణం జ్ఞానేంద్రియాలతో తెలుసుకోలేకపోయినా దానిని అది సందేహిస్తుంది — ప్రాణికం అధైర్యం, నిరాశతో కూడిన సూచనలను తీసుకువచ్చి సందేహాన్ని గట్టిగా మరింతగా బలపరచి స్పష్టమైన దృష్టిని అడ్డుకుంటుంది. అందువల్ల అది కష్టతరమై సహేతుకమై కారణాలు చూపించి సమర్థంగా ఎదుర్కొన లేనటువంటి

దవుతున్నది. దానికి అత్యుత్తమమైన పద్ధతి స్పష్టమైన అవగాహనతో అది స్వయంగా సృష్టించుకున్న ఇబ్బందిగా గ్రహించి, లేకుండా చేసుకోవాలి – అలవాటుగా మారిపోయి, సొంతంగా రూపుదిద్దుకున్న అలవాటుగా మారిన సంస్కారం లేదా మానసిక రూపకల్పనను ముక్కలు చేసి చెదరగొట్టేయాలి, ఫలితంగా అనుభవానికి స్వతంత్రంగా, నీకు స్వేచ్ఛాయుతమైన మనస్సు, ప్రాణికం ఉండే అవకాశం ఉంది.

CWSA 32:122

కేవలం నిరంతరంగా శ్రీమాత ప్రకాశాన్నీ, శక్తనీ ఆకాంక్షిస్తూ ఉంటే, నీవు పురోగతి నొందగలవు. కేవలం శ్రీమాత ప్రకాశానికీ, శక్తికీ నిరంతర పునశ్చరణతో, పట్టుదలతో ఉండటం మూలంగా కలవరం, వ్యవస్థీకరించలేని అలవాటును తగ్గించుకో గలవు. చిట్టచివరకు అది లేకుండా పోతుంది. కేవలం ఆ విధంగా మాత్రమే నిమ్న అస్తిత్వం తయారుకాబడి, చిట్టచివరకు నిశ్చయాత్మకమైన దివ్యసత్యం, దివ్యప్రకాశం అవతరణ సాధ్యమౌతుంది.

CWSA 32:135

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

శ్రీమాత యొక్క పరమ ప్రశాంతత నీ మనస్సుకు ఊర్ధ్వంగా నున్నది. ఆకాంక్ష ద్వారా, నిన్ను నీవు అంతర్ముఖంగా తెరుచు కొనుట ద్వారా అది దిగి వస్తుంది. నీ ప్రాణిక, భౌతిక సత్తలు దాని వశమైనప్పుడు సమచిత్తం సులభంగా పొందవచ్చు. చివరకు అది తనంతట తానుగా లభ్యమవుతుంది.

*

ఉపదేశం ద్వారా అనగా బోధన ద్వారా ఈ సాధన ఈయబడదు, కొనసాగించబడదు.

ఎవరైతే శ్రీమాతపై ఏకాగ్రతతో ఆకాంక్షను నిలుపుకొని ఆమెకు ఉన్మీలురై, అంతర్ముఖంగా ఆమె కార్యక్రమాన్ని, ఆమె నిర్వహణ సామర్థ్యాన్ని గ్రహించగల శక్తి కలిగి వుంటారో వారు మాత్రమే ఈ యోగంలో అనుకూల ఫలితం పొందగలుగుతారు.

CWSA 32:135-36

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

ఆకాంక్ష, నిరాకరణ, శ్రీమాత స్మృతి, ఆమెకు సమర్పణా భావం, ఆమె చేత నతో సంయోగం, ఇవన్నీ సాధనకు యోగ్యమైన ప్రధాన మార్గాలు అనుట పరమ సత్యం. అతిమానసాన్ని స్వయంగా తన కోసం, తనదైన స్వంత మార్గాల ద్వారా అన్వేషించటం అవివేక వర్తనం అనుట కూడా సత్యమే. ఆ విషయాన్ని నేను ప్రారంభం నుండి చెపుతున్నాను, ఇటీవల మరింత ఎక్కువగా నొక్కి వక్కాణిస్తు న్నాను. దైవంతో సంయోగం మౌలిక లక్ష్యంగా నిర్ధారించుకొని, మిగిలినవన్నీ దానికి అనుబంధమైనవిగా, దానికి పర్యవసానాలుగా పరిగణించటం, అభివృద్ధి, అనుభవాలు మొదలగునవి కేవలం వాటి నిమిత్తమో లేక తన అహం సంతృప్తి కోసమో అర్థించకపోవటం సాధకుడు అవలంభించవలసిన సరైన వైఖరి అనుట కూడా సత్యమే. సాధకుడు స్వయం వ్యక్తిత్వోపాసకుడు, స్వార్థపరుడు, అనుమా నాస్పదుడు అయినా ధ్యానం, భవిష్య దర్శనం, యోగంలోని ఇతర అంశాలన్నీ దుర్వినియోగ మవుతాయి. అంతమాత్రం చేత ధ్యానం, భవిష్య దర్శనం మొద లైనవి సాధనలో పనికిరావని, వర్జనీయమని అర్థం కాదు.

CWSA 32;137-38

సాధకుడి నుండి అపేక్షించబడన కృషి, ఆకాంక్షకు, నిరాకరణకు, సమర్పణకు సంబంధించిన ఈ విషయాలు మూడు నెరవేరినట్లయితే, మిగిలినదంతా శ్రీమాత దివ్యానుగ్రహం వలన, నీలో పనిచేసే ఆమె శక్తి వలన, దానంతట అదే సమకూరు తుంది. అయితే ఈ మూడింటిలో అతి ముఖ్యమైనది సమర్పణ. అందుకు అవ సరమైన ప్రాథమిక లక్షణం కష్టకాలంలో గట్టి విశ్వాసము, నమ్మకము, అపారమైన ఓరిమి కలిగి వుండుట. ఆకాంక్ష ఉన్నప్పుడు మాత్రమే విశ్వాసము, నమ్మిక వుంటాయి అనే నియమమేమీ లేదు. మనిషిలో మాంద్యము ఏర్పడి నందువలన ఒత్తిడి కలిగిన కారణంగా ఆకాంక్ష అణగారినప్పటికీ విశ్వాసము, నమ్మిక, ఓరిమి నిలువగలవు. ఆకాంక్ష అణిగివున్నప్పుడు విశ్వాసము ఓరిమి లోపించినట్లయితే సాధకుడు కేవలం తన స్వయంకృషి పైనే ఆధారపడుతున్నాడని అర్థం. దాని ఉద్దేశం 'ఓహ్, నా ఆకాంక్ష అణగారిపోయింది గనుక నాకిక ఆశ చిగురించే అవ కాశం లేదు. నా ఆకాంక్ష విఫలమయినందున శ్రీమాత మాత్రం ఏమి చేయ గలదు?' అన్నట్లుగా నుంటుంది. ఆ విధమైన ఆలోచనకు బదులు సాధకుడు ఈ మాదిరిగా భావించాలి, "ఫరవాలేదు, నా ఆకాంక్ష తిరిగి నెలకుంటుంది. ఈ

మధ్య కాలంలో శ్రీమాత అనుభూతి నాలో లేనప్పటికీ ఆమె నాతో వున్నారని నాకు తెలుసు. అత్యంత క్లిష్టకాలమందు కూడా నన్ను కాపాడగలదు." అటువంటి సవ్యమైన సమగ్ర వైఖరి నీ కుండాలి. అట్టి వైఖరిని గలవారికి కృంగుబాటుతన మేమీ చేయలేదు; ఒకవేళ సంభవించినా అది భంగపడి తొలగిపోవలసిందే. ఇది తామసిక సమర్పణ కాదు. తామసిక సమస్య ఎప్పుడవుతుందంటే, "నేనేమీ చేయను, అంతా శ్రీమాతనే చేయనీ. ఆకాంక్ష, తిరస్కరణ, సమర్పణ ఇవన్నీ అనవసరం. వాటి పనినంతా శ్రీమాతనే నాలో చేయనీ", అనే భావన నీలో ఏర్ప డినప్పుడు. ఈ రెండు వైఖరులు మధ్య చాలా వ్యత్యాసముంది.

ఒకటేమో ఏమీ చేయకుండా బాధ్యతలను తప్పించుక తిరుగువానిది, మరొకటి తనకు సాధ్యమైనంత నేర్పుతో పనిచేసే సాధకుడిది. అట్టివానికి ప్రతి కూల పరిస్థితులు దాపురించినందు వలన కొంత కాలం అణగద్రొక్కబడి నప్పటికీ, అన్నింటికీ వెనుక శ్రీమాత శక్తి, ఉనికి వున్నదనే ప్రగాఢ విశ్వాసం తనలో నిలుపు కున్న కారణంగా ప్రతికూల శక్తిని నిరోధించి సాధన కార్యక్రమాన్ని తిరిగి చేపడ తాడు.

CWSA 32:139-40

ప్రాణిక సంబంధమైన దోషాలు, ప్రతిబంధకాలు అందరిలోను ఒకే విధంగా నుం టాయి, అలాగే మనస్సు యొక్క అసమగ్ర పరిణామాలు కూడా. ప్రతి వ్యక్తి తనలో దైవంపై విశ్వాసంతోను, గట్టి నమ్మకంతోను, ఆతనికి ఉన్మీలుడై వుండాలి; శ్రీమాత మహాశక్తి అన్ని విషయాలను క్రమేణా చక్కబరుస్తుంది.

CWSA 32:218

ఏ వ్యక్తి అయినా కేవల స్వయంకృషితో సాధన చేయలేకపోయినా ఆతని వ్యక్తిగత ప్రయత్నం తప్పక అవసరమనుట యదార్థము. శ్రీమాత మహాశక్తి అవసరమే కాని దానిని అందుకొనుటకు సాధకుడు తనను తాను తెరచుకోవాలి, ఆ మహాశక్తికి ప్రతికూలమైనవాటిని తిరస్కరించాలి. సాధనలో పూర్తి నిజాయితీని, ఆకాంక్షను, సంకల్పశక్తిని కనబరచాలి. సర్వము ఉన్మీలనమై, సమర్పణ సంపూర్ణ మైనప్పుడు మాత్రమే దైవశక్తి సాధన కార్యక్రమాన్ని వ్యక్తిగత ప్రయత్నమే మాత్రం అవసరం లేకుండా దానిని తానే స్వయంగా చేపడుతుంది. కాని అది ప్రాథమిక దశలో జరగదు. నిర్ణీత దశ ఆసన్నమయ్యే వరకు వ్యక్తి తనను తాను

ఉన్మీలనం చేసుకుంటుండాలి, పరిశుద్ధపరుచుకుంటుండాలి, సమర్పణ గావించు కుంటుండాలి.

CWSA 32:218

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

శ్రీమాత శక్తి

ప్రశ్న: మీరు తరచుగా శ్రీమాత శక్తి గురించి మాట్లాడుతారు, అదేమిటి?

సమా: అది మానవ స్వభావంలో అజ్ఞానాన్ని తొలగించి, దానిని దివ్యప్రకృతిగా మార్చగల దైవశక్తి.

*

ప్రశ్న: నేను ఏ పని చేసినా 'నేనే' చేసినట్లు ఎందుకు భావిస్తాను? నిజానికి మనలో ప్రతిదీ శ్రీమాత శక్తిచేత చేయబడుతున్నది నిజం కాదా?

సమా: నేను శ్రీమాత శక్తి గురించి చెప్పినపుడు... ఈ అజ్ఞానంలో పనిచేసే మాహా ప్రకృతిశక్తుల గురించి చెప్పటం లేదు, పై నుంచి మానవ ప్రకృతిని పరి వర్తన చేయడానికి అవరోహించే ఉన్నత దివ్యశక్తి గురించి చెప్తున్నాను.

CWSA 32:193

ఈ చంచలమైన మనస్సు, అస్థిరమైన ప్రాణికము, నీకు మాత్రమే ఉన్న ప్రత్యేక గుణాలు కాదు, ఇది ప్రారంభంలో ప్రతి సాధకునిలోను ఉండే మానవ స్వభావాలు. శ్రీమాత శక్తి, కృపల ద్వారా, నీవు అప్పుడప్పుడు అనుభూతి చెందుతున్నానని చెప్పే విడుదల, శాంతి, ఆనందాలను మరింత ఎక్కువగా పొందాలి. ప్రారం భంలో అది కొంత తక్కువ సమయం మాత్రమే వస్తుంది. అయితే నీవు మార్గంలో పట్టుదలతో సాగుతుంటే గాని అనుభవం అనేక సార్లు కలుగుతూ క్రమంగా స్థిర మైన అనుభవంగా మారుతుంది. నీవు ఫిర్యాదు చేసే లోపాలను తొలగించేది అదే.

CWSA 32:195

శ్రీమాత యొక్క శక్తి, అస్తిత్వము ఉన్నత స్థితుల్లో మాత్రమే పని చేయదు.

అది నీలోనే, నీ దగ్గరే, నీ చేరువలో ఉంది. నీ స్వభావం దాన్ని స్వీకరించడానికి తయారుగా ఉన్నప్పుడు పని చేయటానికి సంసిద్ధమై వుంటుంది. అది ఇక్కడున్న అందరిలో అదే విధంగా పని చేస్తుంది.

CWSA 32:197

ప్రశ్న: సాధకుడు సరైన దృక్పథంతో పని చేస్తున్నప్పుడు, అతడిపై సూటిగా ఆ ఉన్నత శక్తి పని చేస్తున్నప్పుడు, అతని లోపాలను, అపరిపక్వతలను తొలగించడానికి లేక శుద్ధి చేయడానికి ఆ శక్తి ఎలా పని చేస్తుంది?

సమా: శీఘ్రంగానో లేక క్రమంగానో అంతరంగ చేతనను జాగృతం చేస్తూ స్వయంగా నేనే చేస్తున్నాననే అహంకార తత్వాన్ని మార్చి, దైవసేవలో పని చేస్తున్నాననే తత్వాన్ని ప్రతిష్ఠిస్తుంది. ఆ విధంగా అతడి లోపాలను, అతడి చర్యలను స్వయంగా పరిశీలించుకునేలా చేసి, వాటిని సరిదిద్దుకునేలా ప్రోద్బలం చేయడంలో అతడి చైతన్యానికి, శ్రీమాత చైతన్యానికి మధ్య ఒక సంబంధాన్ని స్థాపిస్తుంది. అందు కోసం అతడి ప్రకృతిని మరింత ప్రబలంగా శ్రీమాత చైతన్యాన్ని, శక్తిని అందుకునేందుకు సిద్ధం చేస్తుంది. దానికి కావలసిన అనుభవాలను అందిస్తూ, అతడు యోగం ద్వారా పొందబోయే మరింత ఉన్నత అనుభూతులను పొందడానికి సరైన స్థితిని సమకూరుస్తుంది. అతడి చైత్య పురుష సత్త అభివృద్ధికి ప్రేరణ కలిగిస్తూ, అతడిని విశ్వమాతగా నున్న శ్రీమాతకు తెరుచుకునేలా చేస్తుంది. సహజంగా అది ఒక్కో వ్యక్తిలో ఒక్కో విధంగా పని చేస్తుంది.

CWSA 32:198

శ్రీమాత శక్తికి సంబంధించినంత వరకు, దాన్ని అందుకుంటున్నపుడు దానిని జీర్ణించుకొనే వరకు ప్రశాంతంగా ఉండటం ఉత్తమం. ఆ తరువాత బాహ్యమైన కదలికలు, కలయికల ద్వారా చెదిరిపోకుండా, స్థిరంగా నుంటుంది.

CWSA 32:214

ప్రశ్న: నేను ధ్యానం చేయాలని ప్రయత్నించాను, కాని నా మనసు సహకరించనందువలన వదిలేశాను.

సమా: నీవు ధ్యానం చేయలేనప్పుడు ప్రశాంతంగా వుండి శ్రీమాత మహాశక్తిని, శాంతిని ఆహ్వానించు.


CWSA 32:214

ప్రశ్న: నా పనిని సమర్పణగా నెరవేర్చటానికి నేనేం చేయాలి? నేను ఎల్లవేళలా శ్రీమాతతోనే ఉండాలంటే ఏం చేయాలి?

సమా: నీవు చేయవలసిందల్లా ధృడ విశ్వాసంతో, సంతోషంగా ఉండడానికి ప్రయత్నించడం. ఒక వేళ నీవు నిరాశకు లోనైతే, ఆ నిస్పృహను తొలగించడానికి శ్రీమాత శక్తిని ఆహ్వానించు. నీకు అస్వస్థత కలిగితే దానిని తొలగించడానికి శ్రీమాత శక్తిని ఆహ్వానించు. నీవు పని చేస్తున్నప్పుడు నీకు ఆలంబనగా ఉండటానికి నీ ద్వారా ఆమె పని చేయటానికి శ్రీమాత శక్తిని ఆహ్వానించు. ఎలాంటి కష్టాల వల్ల నీవు బాధపడుటను, నిరుత్సాహం పొందుటను అంగీకరించక, ప్రశాంతంగా, శ్రీమాత శక్తికి మాత్రమే తెరుచుకుని ఉండి ఆ శక్తి నీలో పని చేస్తూ, నిన్ను పరివర్తన చేయడానికి అనుకూలంగా ఉండు.

CWSA 32: 217

అనువాదం: డి. సత్యవాణి



సాంసారిక జీవితం ఒడుదుడుకులతో సతమతమౌతున్న క్షేత్రాన్ని బోలి వుం టుంది.... ఇక్కడ జీవితం సవ్యంగా, గడపాలంటే... మీ జీవితాన్ని, కార్యాచర ణని, దైవానికి సమర్పణ గావించాలి, అంతరంగంలో దివ్యశాంతి నెలకొనాలని ప్రార్థించాలి. మనసు నెమ్మది చెందినపుడు, దివ్యమాత నీ జీవితానికి ఆలంబనగా ఉన్న అనుభూతి కలుగుతుంది. అంతా ఆమె చేతులకు అప్పగించు, — శాంతిని పొందాలనే కోరిక వున్నట్లయితే ప్రథమంగా చేయవలసిన పనులు ఇవి.

*

లేదు, ఆశ్రమంతో ఉన్నంత మాత్రాన చాలదు — శ్రీమాత శక్తికి తెరుచుకుని ఉండాలి, బాహ్యప్రపంచం బురదలో క్రీడిస్తున్నపుడు అంటుకున్న మాలిన్యాన్ని తొలగించాలి.

CWSA 32:143, 156

అనువాదం: డి. సత్యవాణి



యోగిగా , సన్యాసిగా, తపస్విగా ఉండటం ఇక్కడ లక్ష్యం కాదు. ఇక్కడ లక్ష్యం రూపాంతరీకరణం. నీ స్వంత శక్తి అంటే అమితమైన శక్తితోనే రూపాంతరీకరణం జరుపబడుతుంది. అందుకు కేవలం దివ్యమాత చేతుల్లో నిజంగా ఒక పసిబిడ్డ మాదిరిగా వుండటం వలననే అది జరుగుతుంది.

CWSA 32:143

శ్రీమాతకు తెరచుకోవాలి

ప్రశ్న: నేను ధ్యానం చేయలేకపోతున్నాను. ఎందుకనగా ధ్యానానికి కూర్చున్నప్పుడు ఎన్నో ఆలోచనలు చుట్టుముడుతున్నాయి. అప్పుడు నేను ముందుకు పోవడానికి, నాలో శ్రీమాత పని చేయడం సుగమం గావడానికి ఏ త్రోవను నేను అనుసరించాలి?

సమా: నీవు ధ్యానించలేకపోతే ప్రార్థించు. నీవు చేస్తున్నదంతా శ్రీమాతకి సమర్పించు. నీ స్వభావాన్నీ, నీ చర్యలను ఆమె అధీనం లోనికి తీసుకోమని వేడుకో, ప్రేమించు. ఆరాధించి కావలసింది ఏమిటనగా నిన్ను నీవు పూర్తిగా తెరచుకోవటం శ్రీమాత చేతనను గ్రహించగలిగుట. అందుకు సమయం పట్టినా నీవు నిరాశకు, నిరుత్సాహానికి, ప్రతిఘటనకు లోనవ కూడదు. కారణం ఈ విషయాలన్నీ నీ ఉన్మీలన మార్గంలో ఎదురవుతూనే వుంటాయి.

CWSA 32:159

చేయవలసినదంతా నిన్ను నీవు శ్రీమాతకు తెరుచుకొని ఉండటమే. కొన్ని నిర్దిష్టమైన అనుభవాలకై నీ స్వభావం సమాయత్త మవడానికి ఎప్పుడూ కాస్త ఎక్కువ సమయం తీసుకొంటుంది. సత్వర ఫలితాలను పొందటానికి అసహనం, నిరుత్సాహ మనేవి లేకుండా నిరంతర స్వీయ వికసనం జరుగుతూనే ఉండాలి.

CWSA 32:159

ఛాయా చిత్రం గురించిన నీ అనుభవం చాలా సున్నితమైనది, యధార్థమైనది. శ్రీమాత ఛాయాచిత్రాన్ని ఆమె పట్ల భక్తిప్రపత్తులతో గమనించేవారు, శ్రీమాత సన్నిధిని ఆ చిత్రం ద్వారా అనుభూతి చెందగలరు. నిజమైన ఆమె సన్నిధి, ఆమె సూక్ష్మ భౌతిక సన్నిధి నీకు అనుభూతి కలగటం వాస్తవమే. నీ భౌతిక మనస్సు నిజ చైతన్యానికి తెరుచుకొంటున్నదని ఈ అనుభవం తెలుపుతుంది. ఇంకా యిది పెరిగి మిగిలియున్న నీ పాత స్వాభావికమైన కదలికలు మటుమాయమౌతాయి.

CWSA 32:154

ప్రశ్న: ఏది నిజమైన ఉన్మీలనం?

సమా: శ్రీమాత సన్నిధిని, ఆమె శక్తులను పూర్తిగా గ్రహించగలగటం.

ప్రశ్న: ఉన్మీలనానికి సంబంధించి కచ్చితమైన, సరియైన నిబంధన ఏమిటి?

సమా: ఆకాంక్ష, ప్రశాంతత స్వీకరించగల విశాలత, దైవానికి చేరువ కాకుండా ప్రయత్నించేవాటి నన్నింటినీ నిరాకరించడం.

ప్రశ్న: శ్రీమాతకు నిజంగా ఉన్మీలనం చెందావని నిరూపించడానికి గుర్తు లేమిటి?

సమా: దానంతటఅదే విదితమౌతుంది. నీవు శాంతిని, సమత్వాన్ని, విశాలతను, ప్రకాశాన్ని, దివ్యానందాన్ని, దివ్యజ్ఞానాన్ని, శక్తిని సంవేదన చెందినప్పుడు శ్రీమాత సన్నిధి లేదా సామీప్యం లేదా ఆమె శక్తి పనిచేయడం గురించి అవగాహన కలిగినప్పుడు ఈ అంశాలలో దేనినైనా నీవు అనుభూతి చెందినా అది ఉన్మీలనమే. అనుభూతి ఎంత అధికంగా వుంటుందో ఉన్మీలనము అంత పరిపూర్ణమవుతుంది.

ప్రశ్న: అస్తిత్వము యొక్క చిక్కు ముడులను విప్పే మార్గమేమిటి?

సమా: ఆకాంక్ష ద్వారా, దైవశక్తి పనిచేయడానికి గాను వ్యక్తి సమ్మతించడం ద్వారా, దైవశక్తి దిగివచ్చి పని చేయడం ద్వారా.

ప్రశ్న: 'ఉన్మీలనవం', అనగా అర్థం ఏమిటి? శ్రీమాత నుండి ఏదీ దాచకుండా వుండటం కాదా?

సమా: ఉన్మీలన దిశగా అది మొదటి అడుగు.

ప్రశ్న: వ్యక్తి ఎలా వికసించగలడు?

సమా: విశ్వాసం ద్వారా, నిశ్చలమైన మనసుతో శరణు పొందడం ద్వారా.

*

పూర్తిగా శ్రీమాతకు ఉన్మీలన మవడానికి నీవు అంతర్గతంగాను, బాహిరంగాను తెరచుకోవాలి. నీవు నిర్మొహమాటంగా ఉన్నది ఉన్నట్లుగా ప్రతిదీ ఆమెకు చెప్పాలి. నీ అంతరంగంలో ఉన్నదంతా నిష్కపటంగా, నిస్సంకోచంగా ఆమె ముందుంచడానికి వెనుకాడకు. అది ఒక్కసారిగా నీవు పూర్తిగా ఉన్మీలనం చెందటానికి, నీకు ఆమె తన సహాయాన్ని పూర్తిగా అందించడానికి తోడ్పడుతుంది.

CWSA 32:184

ఏదైనా ప్రతికూల శక్తి ఎదురైతే ఎవరైనా దాని సలహాలను వినకూడదు, స్వాగతించకూడదు. శ్రీమాత వైపు తిరగాలి, ఆమె నుండి వెనుదిరిగే ప్రవృత్తిని నిరాక

రించాలి. వ్యక్తి ఉన్మీలనం చెందగలడా లేదా అన్నది కాదు, భక్తి పూర్వకంగా, విశ్వాసపాత్రుడిగా ఉండి తీరాలి. వ్యక్తి యోగసాధనకు భక్తివిశ్వాసాలనేవి ఆసర మైన లక్షణాలు కావు. అవి చాలా సాధారణమైన విషయాలు. పరమ సత్యాన్ని ఆకాంక్షించే ఏ పురుషుడైనా, స్త్రీయైనా తప్పక సాధించగలగాలి.

CWSA 32:160-61

శ్రీఅరవిందులు

అనువాదం: సిహెచ్. హర్షవర్ధన రాజు

శ్రీమాత నామజపము

మన దేశంలో ఎవరైనా గురూపదేశం పొందాడంటే ఆ గురువు తన శిష్యుని హృదయ పూర్వకంగా స్వీకరించినట్లే. మన ఆశ్రమంలో మాత్రం 'శ్రీమాత' నామమే ఒక మంత్రం. ఇక్కడ పనులు కేటాయిస్తాం, ఆకాంక్ష పెంచుకోమంటూ వర్జనీయ లక్షణాలను వదిలించుకోమంటాం, శ్రీమాతకు తెరుచుకొని వుండ మంటాం.

CWSA 32:139

స్వప్నాలలో చూచే అనుభవం ప్రాణిక ప్రపంచానికి సంబంధించినది. నిన్ను ఎదిరించి, ఎదుర్కొనాలనే భయంకరశక్తి శ్రీమాత అండ నీకు ఉండటం వల్ల నిన్ను ఏమీ చేయలేక పోయింది.

ప్రపంచంలో ప్రాణిక శక్తులను ఎదుర్కొన గలిగిన మార్గాలు రెండే: ఒకటి శ్రీమాత సహాయాన్ని అర్థించటం, రెండు, భయాన్ని పూర్తిగా విడనాడటం. ధైర్యంగా వున్నంత కాలం ఏ శక్తులూ నిన్ను ఏమీ చేయలేవు. శ్రీమాత నామాన్ని జపిస్తే చాలు, నీకు అన్ని భయాలూ తొలగిపోతాయి.

CWSA 32:359

భయపెట్టే శక్తులు కేవలం ప్రాణికం నుండే జనిస్తాయి. నీ సాధనను అడ్డుకునేందుకు అవి నీకు భయాందోళనలు కలిగిస్తాయి. అలాంటి సమయాల్లో గుండె దిటవు చేసుకొని, "నాకు శ్రీమాత ఎల్లపుడు రక్షణగా వుంటుంది; నాకు



ప్రశ్న: నేను 'పూర్ణయోగ మార్గంలో' ఉన్నానో, లేదో సరిగా అర్థం కావటం లేదు.

సమా: శ్రీమాత వైపు తమ అంతరంగాన్ని త్రిప్పినవారంతా ఈ యోగం చేస్తున్నట్లే. కేవలం మీ ప్రయత్నాల వల్లనే మీరు 'పూర్ణయోగులు' కాగలమని భ్రమపడకండి. అట్లా ఎవ్వరూ సాధించలేరు. మీరు మిమ్మల్ని శ్రీమాతకు అర్పించుకోండి. ఆమె హస్తాలను అందుకోండి. సేవ ద్వారా, భక్తి ద్వారా ఆమెకు సన్నిహితులు కండి. అదే ఆకాంక్షించండి. అప్పుడే శ్రీమాత మీ యోగసాధనను సుగమం చేస్తుంది. ఇంకో విషయం: పూర్ణయోగంలో మీరు ఎంత ముందుకు వెళ్ళామని కాని, 'అతిమానసానికి' ఎంత చేరువలో ఉన్నామని కాని ఎప్పుడూ బేరీజు వేసుకోకండి. మీరు మిమ్మల్ని శ్రీమాతకు అర్పించుకొని, ఆ విశ్వాసంతో వుంటే చాలు. ఆమె ఎలా కోరితే అలా వుండండి, అప్పుడు ఆమే అన్నీ చూసుకుంటుంది!

CWSA 32: 151-52

అనువాదం: కె. ఆర్ . ఎల్. నరసింహారావు



శ్రీఅరవిందులు ఒక లేఖలో నీకు వ్రాసారు కదా! ఆ ప్రకారమే శ్రీమాతను ధ్యానంలో జపించు. ఆమెనే ప్రార్థించు. ఆమెకే నిన్ను నీవు అర్పించుకో. నీవు చేసే పనులలో, మనోభావాలలో నీవు అదే ఆకాంక్షతో వుండు. నీ పిలుపును ఆమె అందుకొని నిన్ను విశుద్ధం చేస్తుంది. నీ జీవితమే మారిపోతుంది. ఆమెదైన నిశ్చలత, ప్రశాంతత నీ మీద ప్రసరించి, ఆమె శక్తి, వెలుగు, ఆనందమూ నీకు లభిస్తాయి. అదంతా పై అంతరాలలో వున్న దే. కాని మనం అవధులు దాటి 'అతీత మానసాన్ని' చేరుకోగలిగిన నాడే అవి మన చేతనలో ప్రవేశిస్తాయి. ఆ విధంగా మన మనో, ప్రాణ, దేహాలను పునీతం చేస్తాయి.

అనువాదం: కె. ఆర్ . ఎల్. నరసింహారావు

భయమెందుకు?” అని తలచుకో. అన్ని భయాలు వాటంతట అవే తొలగిపోతాయి. అనేకమంది సాధకులు చేసింది కూడా ఇదే. వారు కలలో కూడా ప్రార్థన చేసేవారు.

ఎప్పుడూ భయపడవద్దు. భయాలను ఏవగించుకొని తిరస్కరించాలి. శ్రీమాత రక్షణ నీకువెపుడూ అందుబాటులో వుంటుంది.

CWSA 32:306-07

అనువాదం: కె. ఆర్. ఎల్. నరసింహారావు

శ్రీమాత కృప

యోగంలో అత్యంత ప్రధానమయిన విషయం అడుగడుగునా దివ్యకృపను విశ్వసించటం, ఎడతెగకుండా ఆలోచనలను ఆమె దిశగా మళ్ళించటం, తన అస్తిత్వం పూర్తిగా తెరుచుకునేటంత వరకు అమ్మ శక్తి ఆధారంలో పనిచేయటం అనుభూతి చెందేంతవరకు తనను తాను సమర్పించుకోవాలి.

CWSA 32:166

ప్రశ్న: శ్రీమాత కృప పని చేయాటానికేమైనా సూత్రం ఉందా?

సమా: వ్యక్తి తన చైత్యపురుష సత్తను ఎంత ఎక్కువగా అభివృద్ధి పరిస్తే దివ్యకృప పని చేయడానికి అంత ఎక్కువ వీలు కలుగుతుంది.

CWSA 32:51-52

ప్రశ్న: శ్రీమాత కృప ఎల్లప్పుడూ సర్వజనీనంగా ఉంటుందా?

సమా: సర్వ జనీనమూ, ప్రత్యేకమూ కూడా.

ప్రశ్న: సాధారణంగా శ్రీమాత ఇచ్చేదానిని ఎలా స్వీకరించాలి?

సమా: కేవలం మిమ్మల్ని మీరు తెరచి ఉంచుకోండి, ఆ క్షణంలో మీకు కావలసినది, మీరు అందుకోగలిగినది, వస్తుంది.

CWSA 32:166-67

వ్యక్తులకు సంభవించే కష్టాలతో శ్రీమాత అప్రసన్నులు కారు — కేవలం అది ఆమె మరింత సహాయము, ఆలంబన యివ్వటానికి కారణమౌతుంది. నీవు చెప్పే



ఎల్లప్పుడూ పరమాత్మ యొక్క, శ్రీమాత యొక్క కనుసన్నలలో ఉన్నట్లుగా జీవించు. దివ్య ఉనికికి సముచితంకాని దేనినీ చేయవద్దు, ఆలోచించవద్దు, అనుభూతి చెందవద్దు.

*

అహంలో కేంద్రీకరణ ఎక్కువగా తగ్గినప్పుడే చైత్యపురుష సత్త నేరుగా తెరుచుకోవటం సులభతరం అవుతుంది. దానితోపాటు శ్రీమాత పట్ల బలమైన భక్తి భావన ఉండాలి. ఆధ్యాత్మికమయిన వినమ్రత, సమర్పణా భావం, ఆధారపడటం అవసరం.

*

నిరంతరమయిన సంసర్గం వలననే వ్యక్తి పూర్తిగా తెరుచుకోవటానికి సంసిద్ధమవుతాడు. హృదయం తెరుచుకోవటంతో శ్రీమాత ఉనికి యొక్క అనుభూతి కలగటం ప్రారంభమౌతుంది. పైనున్న ఆమె మహాశక్తికి తెరుచుకోవటంతో ఉన్నత చేతనాశక్తి క్రిందకు శరీరంలోకి దిగి వచ్చి, స్వభావాన్నంతా మార్చుటకు పని చేస్తుంది.

అనువాదం: డా. సరోజా ప్రసాద్

ఈ ఆలోచనలన్నీ నీపై పని చేస్తున్న దుష్ప్రభావపు వత్తిడి వలన ఏర్పడిన సూచనల వలన జనించినవే. నీవు ఎల్లప్పుడూ శ్రీమాత కృపపై ఆధారపడవచ్చు. నిన్ను మేమ దూరం చేయమనే పరిపూర్ణమైన నిశ్చయంతో ఉండు. మా ఆలంబన నీ కెల్లప్పుడూ ఉంటుంది.

CWSA 32:544

అనువాదం: డా. సరోజా ప్రసాద్

శ్రీమాతను గురించిన మానసిక చేతన

ప్రశ్న: ఏ విధమైన భావన శ్రీమాత దర్శనం సంతృప్తిని, మహదానందాన్ని సమకూరుస్తుంది?

సమా: హృదయపూర్వకమైన భావన.

ప్రశ్న: శ్రీమాతకు విరుద్ధంగా ఏమైనా విన్నప్పుడు, ఏ విధమైన భావన కలిగితే గుండె గాయపడుతుంది?

సమా: హృదయపూర్వకమైన భావన.

ప్రశ్న: ఏ విధమైన భావన వున్నట్లైతే శ్రీమాత స్మృతి మాత్రంచే సంతృప్తి, మహదానందం సమకూరుతుంది?

సమా: హృదయపూర్వకమైన భావన.

ప్రశ్న: ఏ విధమైన భావన వున్నట్లైతే, శ్రీమాతకు దైహికంగా దూరముగా నున్నప్పటికీ హృదయంలో ఆమె సాన్నిధ్య అనుభూతి కలుగుతుంది?

సమా: హృదయపూర్వకమైన భావన.

ప్రశ్న: సంపూర్ణమైన హృదయపూర్వక ప్రేమగల స్థితిలో నున్నానని ఏ విధంగా నిర్ధారణకు రాగలను?

సమా: అహం అంతరించటంతో, స్వచ్ఛమైన ఆరాధనా భావనతో, దైవానికి విధేయుడవై సమర్పణా భావన కలిగి వుండటంతో.

ప్రశ్న: దైవానికై హృదయాంతర్గత ప్రేమ ప్రభవించినప్పుడు, కన్నీలు కారటం నేను తరచుగా గమనిస్తుంటాను.

సమా: అవి ఆరాధన లాంటి భావనలు కలిగినప్పుడు హృదయంలో నుంచి పొంగి పొర్లే కన్నీళ్ళు.

ప్రశ్న: శ్రీమాతపై భక్తి నాకు ఏ విధంగా ఏర్పడుతుంది?

సమా: ఒక హక్కుగా లేక అధికారిక భావనగా కాకుండా, 'శుద్ధభక్తి' తో స్వచ్ఛమైన పూజ్య భావన, ఆరాధనా భావన, ప్రేమ భావన కలిగి వుండటం వలన

వాతావరణమంతా ప్రశాంతంగా, నిశ్చలంగా నున్నప్పుడు నీలో ఒక లోతైన భావనా స్థితి నెలకొన్న అనుభూతి కలుగుతుంది. అందరిపై సమానమైన మధుర భావన ఒకటి ఎడతెగకుండా పెల్లుబుకుతుంది. అది శ్రీమాత వైపుగా అవిచ్ఛిన్నంగా ఎగుస్తుంది, దైవంతో ఒక మధురమైన అనుబంధం ఏర్పడి నట్లనిపిస్తుంది, అస్తిత్వమంతా మెత్తనైనట్లనిపిస్తుంది — ప్రశాంతమైన, నిశ్చలమైన, మధురమైన శాంతి, సంతృప్తులతో నిండిన స్థితి అది.

సమా: అది హృదయగతమైన ప్రేమ.

*

దైవాన్ని గురించి తీవ్రమైన కోరిక లేక దైవంపై భక్తి కలిగి వుండటమనే ఒక్క లక్షణం చాలు, వ్యక్తిని ఇతర కోరిక లన్నింటి నుండి విముక్తి నొందించడానికి — మౌలికంగా దానిని కోరిక అని అనలేము, కానీ అది ఒక ఆకాంక్ష, ఒక అంతరాత్మ ఆవశ్యకత, అంతరంగ అస్తిత్వ ఉనికి ఊపిరి. అందువలన దానిని కోరికలలో జమ కట్టలేము.

CWSA 32:466, 467, 476

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

శ్రీమాత శరణు పొందు

...శ్రీమాత యొక్క మరియు నీ యొక్క రక్షణలో తలదాచుకునే అలవాటును, సామర్థ్యాన్ని నీవు పెంచుకోవాలి. ఈ కారణంగానే బహిర్ముఖమైన మనస్సుతోనో లేక మనస్సులో అంతకు పూర్వమే ఏర్పడిన ఉద్దేశాలను, రూపకల్పనను విలువైనవిగా ఎంచి వాటిని వదలలేక వాటి ప్రకారంగా విషయాలను విమర్శించి, నిర్ధారణకు రావటం మానుకోవాలి. ఈ అలవాటు పునరావృత మైనప్పుడు నీలో నీవు ఈ విధంగా పునశ్చరణ గావించుకో: "నా కన్నా శ్రీమాతారవిందులకే ఏది మేలైనదో తెలుసు — నాకు లేని అనుభవం, జ్ఞానం వారి కున్నాయి — సాధారణ మానవుని కున్న తెలివితేటలతో కార్యాచరణ గావించటం కన్నా శ్రేష్టమైన ఫలితం దక్కడానికై వారు పాటు పడతారన్ని నిస్సందేహం." క్లిష్ట పరిస్థితులలో కూడా ఈ భావన కొనసాగేలా దానిని నీలో స్థిరంగా నిలుపుకోగలిగితే ఆసురిక మాయ రేకెత్తించే వెర్రి ఆలోచనలను నీవు మరింత సులభంగా ప్రతిఘటించ గలవు.

CWSA 32:100-01

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

సమర్పణ

నిన్ను నీవు దివ్యజననికి సమర్పించుకొనకుండా ఆమె వైపు తిరిగి వున్నానని అంటే దానికి పెద్దగా ఆధ్యాత్మిక విలువ లేనట్లే. ఈ యోగాన్ని అభ్యసించేవాళ్ళు తప్పక ఆత్మార్పణ గావించుకోవాలి, సమర్పణ అవ్వాలి. ఎందుకనంటే అటు వంటి దినదినాభివృద్ధి చెందే సమర్పణ లేకుండా తన గమ్యం దరిదాపుల్లోకి చేరడం కూడా సాధ్యపడదు. ఆమె వైపు తిరిగి వుండడమంటే ఆమె దివ్య క్రియా శక్తిని నీలో పని చేయడానికి నీ లోనికి ఆహ్వానించడం. ఆ దివ్య క్రియాశక్తికి నీవు సమర్పణ గాకపోతో దానిని నీలో అసలు పని చేయనీయడం లేదన్నట్లు, దాని స్వకీయమైన సత్య విధానంలో దానిని పని చేయనీయకుండా నీవు కోరినట్లు అది

నీలో పని చేయాలనే షరతు మీద దానిని అనుమతించినట్లు అవుతుంది. ఇటువంటి సూచన మామూలుగా దివ్యకృప, లేక దివ్యక్రియాశక్తిని, దైవకార్యం కోసం గాక తన స్వకార్యం కోసమే కోరుకొనే యేదైనా హాని కలిగించే శక్తి నుండి, లేక మనస్సు, ప్రాణికాలకు సంబంధించిన యేదో అహంకారిక అంశం నుండి వస్తుంది. ఆ హానికర శక్తి యిటువంటి సూచన చేసేది, దైవం నుండి తాను పొంద వీలున్న దాన్నంతా పొందడానికే గాని, తనను దైవాని కర్పించుకొనడానికి కాదు. మన యథార్థమైన అస్తిత్వం, మన అంతరాత్మ, అందుకు విరుద్ధంగా దైవం వైపు తిరిగి సమర్పణ గావడానికి యిష్టపడడమే గాక, ఆనందంలో అందుకోసం తహతహ లాడుతుంది.

CWSA 32:140-41

నీ సాధనలో నీవు పురోగమించాలనుకొంటే, నీ విధేయత, నీ సమర్పణ, నిజాయితీగలవై, నిజమైనవై, సంపూర్ణమైనవై వుండాలి. నా ఆధ్యాత్మిక ఆకాంక్షతో, నీ కోరికలను కలిపి వేస్తున్నంత కాలం నీ సాధన ముందుకు సాగదు. అలాగే కుటుంబం, పిల్లలు, ఇతరులపై మమకారం తెంచుకున్నా నీ సాధన ముందుకు సాగదు. నీవు యీ యోగాన్ని అభ్యసించాలనుకుంటే, ఆధ్యాత్మిక సత్యాన్ని స్వీకరించి నీ ఆలోచనలు, సంవేదనలు, కర్మలు, స్వభావం, అన్నింటిలో దానిని వ్యక్తం చేయాలి అనే ఒకే ఒక కోరిక, ఆకాంక్ష నీ కుండాలి. ఏ ఒక్కరితోను సంబంధాలు పెట్టుకొనడానికి నీవు తాపత్రయ పడగూడదు. సాధకునికి సత్యచేతన వుండి, అతడు దివ్యవెలుగులో నివసిస్తుంటే, యితరులతో అతని సంబంధాలు యెలా వుండాలనేది అతనిలో నుండే పుట్టుకురావాలి. దివ్యజీవనం కోసం, దివ్య కర్మ కోసం అతిమానసిక సత్యం ప్రకారం, దివ్యజనని శక్తి, సంకల్పంతో అతని అంతరంగంలోనే ఆ సంబంధాలు నిర్దేశించబడతాయి, అవి అతని మనస్సుచే, అతని ప్రాణిక వాంఛలచే నిర్దేశించబడవు. నీవు గుర్తుంచుకోవలసిన విషయం ఇది.

CWSA 32:141-42

దైవం నీకు ముందుండి నడుపుతాడే గాని, నీ వెనుక నుండి నిన్ను తోలడు. మనిషి అని పిలువబడే ప్రతి మనోమయ జీవికి, దైవ నాయకత్వాన్ని సమ్మతించడానికి, సమ్మతించక పోవడానికి ఆంతరికమైన ఒక స్వేచ్ఛ వుంది —

అలా గాకపోతే, నిజమైన ఆధ్యాత్మిక పరిణామ మేదైనా యెలా జరుగుతుంది?

CWSA 32:144-45

సమర్పణ అంటే దివ్యజనని వంక మాత్రమే చూపు నిలపడం — కోరిక లన్నింటినీ తిరస్కరించి, ఆమె సంకల్పించినది మాత్రమే చేయడం, తన స్వకీయ భావాల మీద, మోజుల మీద పట్టుబట్టక, ఆమె సత్యాన్ని మాత్రమే కావాలని అర్థించడం, ఆమె మార్గదర్శకత్వానికి విధేయమై అనుసరించడం, తనను తెరచుకొని ఆమె దివ్యక్రియాశక్తిని, అది చేసే పనులను గ్రహించి తన స్వభావాన్ని, దివ్యస్వభావంగా పరివర్తన చెందేటట్లు ఆ పనులను అనుకరించడం.

CWSA 32:146

దివ్యజనని వెలుగును, ఉత్తమమైనదానిని నీలో చేయడానికి నీ సమస్తాన్ని నీ హృదయంలో వున్న ఆమె ముందు నైవేద్యంగా పెట్టు.

CWSA 32:147

మానవ ప్రాణికం, తన మీద మరోదాని అదుపును గాని, లేక పెత్తనాన్ని గాని యిష్టపడదు, అని చెప్పాను. అంతేగాక దివ్యజననికి సమర్పణ గావడం కష్టమని సాధకుల కెందు కన్పిస్తున్నదో, దానికి అది కూడా ఒక కారణం అని చెప్పాను. ఎందుకనంటే ప్రాణికం తన భావాలను, ప్రేరణలను, మోజులను సుస్థిరం చేయాలని చూస్తుంది, దాని కిష్టమైనదాన్నే చేయాలనుకొంటుంది. తనకు ముందుండి తీసుకుపోయే లేక వెనుక నుండి నడిపే తన ప్రకృతి శక్తి కన్న మరో శక్తి స్పర్శ నది అంగీకరించ లేదు. దివ్యజననికి సమర్పణ అంటే తన స్వంతమైన యిటు వంటి వాటి నన్నింటినీ వదలుకోవడం అనీ, ఆమె క్రియాశక్తి తనవికాని ఒక ఉన్నత పరమ సత్యమార్గాలలో తనకు మార్గం చూపించడానికి, తనను వెనుక నుండి నడుపడానికి అంగీకరించడమనీ అనుకొంటుంది. అందుకని అది నిరోధిస్తుంది, పరమ సత్యం వెలుగు, దివ్యజనని క్రియాశక్తి తన మీద ఆధిపత్యం వహించడాని కంగీకరించక తన స్వేచ్ఛకై పట్టుబడ్తూ సమర్పణ గాకుండా తిరస్కరిస్తుంది.

CWSA 32:147-48

అందుచేత నీవు చేయవలసిందేమిటంటే 1) నిజాయితీగా, నిరాడంబరంగా, కించిత్తు అహం కూడా లేకుండా పూర్తిగా దివ్యజననికి సమర్పణ గావాలి. 2) బాహ్య అస్తిత్వానికి అలవాటుగా మారిన లోపాలను గ్రహించి వాటిని లేకుండా

contd in P. 26



ఏకాగ్రత వహించడం కంటె, యెక్కువగా హృదయంలో కేంద్రీకరించడం, తన అస్తిత్వాన్ని స్వీకరించడానికి ఆమె శక్తి పనుల చేత చేతనను రూపాంతరీకరించ డానికి, దివ్యజనని సన్నిధిని, శక్తిని పిలువడం కంటె యీ యోగంలో వేరే పద్ధ తంటూ యేం లేదు. శిరస్సులోనూ లేక కనుబొమల మధ్య కూడా కేంద్రీకరించ వచ్చు, కాని చాలామంది కిక్కడ తెరచుకోవడం కష్టం. మనస్సు ప్రశాంతపడి, యేకాగ్రత బలీయమై, ఆకాంక్ష తీవ్రమైనపుడు అనుభవం ప్రారంభమౌతుంది. విశ్వాసం అధికమైనకొద్దీ, ఫలితం త్వరగా లభిస్తుందని చెప్పవచ్చు. తక్కినదాని కోసం అతడు స్వప్రయత్నాల మీద మాత్రమే ఆధారపడకుండా, దైవంతో సంప ర్కం పెట్టుకోవడంలోనూ, దివ్యజనని శక్తిని, సాన్నిధ్యాన్ని స్వీకరించే శక్తిని సాధిం చుకోవడంలో సఫలుడవ్వాలి.

CWSA 29:107

అనువాదం కె. వి. రావు

చేసుకోవాలి. 3) ఈ మసకబారిన భాగాలను వెలుగుకై తెరచి, వాటి నడకను సరి జేయాలి.

ఈ మెలిక — దేన్నీ దాచిపెట్టుకొనకుండా సమస్తాన్నీ వదలి వేయడమనే మానసిక మలుపును దైవశక్తి కొక సమర్పణగా మలచకుండా, నీ దగ్గర కేది వస్తే దాని కల్లా నిన్ను నీవు అర్పించుకోవడంగా అర్థమిస్తారు. అలా వచ్చింది, నిమ్న ప్రాణిక, ప్రకృతి యొక్క ఆపసవ్య కదలిక గల ఒక అపకార శక్తి సైతం అయ్యుం డవచ్చు.

ఈ విధంగా నిమ్మకు నీరెత్తి నట్లుండడం సమర్పణకు అర్థం కాదు, అని నేను పదే పదే చెప్పాను. ఒకే సమయంలో దైవశక్తికి, నిమ్నప్రకృతి కదలికలకు సమర్పణ కాలేవు, ప్రతిదాన్నీ, ఆమె నడకయే అని అంగీకరించడం, యీ యోగ లక్ష్యానికి విరుద్ధం. దివ్యజననికి సమర్పణ అంటే అర్థం, యేయితర శక్తులకూ నిన్ను నీవు అర్పించుకోవడాన్ని నిలిపివేయడం. అందుచేత (అంతరాత్మిక సంవే దన, ఆలోచించే మనస్సుకన్న అధికంగా సచేతన మనస్సుతో) వివేచించడం, తిరస్కరించడం, అనేవి తప్పక చేయవలసి వున్న పనులు, అవి ఆత్మార్పణకు, సమర్పణకు సహాయపడ్తాయి....

CWSA 32:148-49

అనువాదం: కె. వి. రావు

శ్రీమాత చిహ్నము

ప్రశ్న: నేను తరచుగా శ్రీమాత చిహ్నము (చక్రము), దాని ప్రాధాన్యం గురించి ఆలోచిస్తున్నాను. అది నాకు ఈ విధంగా అర్థమయింది: నా భావన సమర్థనీయమేనా?

కేంద్ర వృత్తం — అతీత శక్తి

నాలుగు అంతర పూరేకులు — నాలుగు శక్తులు — అతిమానసం నుండి అధిమానసం వరకు పనిచేసే శక్తులు.

పంద్రెండు వెలుపలి పూరేకులు — నాలుగు పంద్రెండుగా విభజించబడిన శక్తులు
— అధిమానసం నుండి అంతర్బుద్ధి,
మనసు వరకు.

శ్రీఅరవిందులు: ప్రధానంగా (సాధారణ సిద్ధాంతపరంగా) ఈ పంద్రెండు శక్తులు సంపూర్ణ సాక్షాత్కారానికి అవసరమైన స్పందనలు. ప్రారంభంలో ఈ పంద్రెండు శ్రీమాత శిరస్సు పైగా దర్శన మిచ్చాయి. దాని ననుసరించి సూర్యుని నుండి 12 కిరణాలు ప్రసరిస్తున్నాయి, 7 కాదు 12 గ్రహాలు మొదలైనవి

ఇక శక్తుల కచ్చితమైన వివరణ గురించి, నీ ఏర్పాటుకు భిన్నంగా నా కేమీ కనిపించలేదు. ఇది స్థిరంగా నిలుస్తుంది.

CWSA 32:598 *15-4-1934*


ప్రకటన

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన రాజధాని 'అమరావతి' నగర శంకుస్థాపన మహోత్సవం 2015, అక్టోబరు 22 న జరుపబడింది. ఈ సందర్భంగా అనేక రాష్ట్రాల నుండి కొనితేబడిన మృత్తిక, పవిత్ర జలాలు ప్రక్షిప్తం గావించబడ్డాయి.ఈ అరుదైన శుభ సందర్భాన్ని పురస్కరించుకొని శ్రీఅరవింద సొసైటి, పుదుచ్చేరి ప్రతినిధులు ఇద్దరు శ్రీమాతారవిందుల సమాధి వద్ద నుండి మృత్తికను, పవిత్ర సముద్రజలాలను, పూరేకలను ఒక పాత్రలో కొనివచ్చి గౌరవనీయులగు రాష్ట్ర ముఖ్యమంత్రివరేణ్యులకు ఆశీర్వాదపూర్వకంగా అందించారు. వారు పులకితులై అత్యంత గౌరవ ప్రపత్తులతో ఆ పాత్రను శిరస్సుపై ధరించి, ఇతర మంత్రులు, అనుయాయుల దర్శనార్థం దానిని ఉత్సవ వేదికపై అలంకరించారు.

నీవు ధ్యానం చేయలేనప్పుడు ప్రశాంతంగా వుండి శ్రీమాత మహాశక్తిని, శాంతిని ఆహ్వానించు.

CWSA 32:214

— శ్రీఅరవిందులు


మరుగున పడ్డ మార్తాండుడు
అఖిల
అఖిల భారత పత్రిక
మే 2016

ఉదయించని దివ్యవైభవము

ప్రాతః సంధ్యా స్తుతి

అదిగో చూడు, ప్రాతః సంధ్య, దివ్యప్రేమస్వరూపిణి, యౌవనకాంతు లీను తన దివ్యదేహంతో ప్రకటిత మౌతుంది. లక్ష్యం దిశగా చేరే బాటలో పయనిస్తున్న సమస్త జీవరాశిని ఆమె ప్రేరేపిస్తుంది. దివ్యశక్తి సంపన్నుడగు అగ్నిదేవుడు మనిషిలో జ్వలించటానికి ఆవిర్భవించాడు. అరుణోదయము అంధకారాన్నంతటినీ తరిమివేసి లోకాన్ని దివ్యకాంతి మయం గావించుటలో తనను తాను సఫలం చేసుకుంటుంది. ఆమె, ఆ దేవత, తన అభ్యుదయ దృక్కులను ఈ విశాల విశ్వం దిశగా, సర్వజనావళిపై సారిస్తూ లేస్తుంది. దివ్యకాంతి తెరను ఆచ్ఛాదనగా ధరించి తన పరమ సత్యయుక్తమైన ధర్మసూక్తుల స్వచ్ఛమైన ప్రాశస్త్యాన్ని ప్రకటిస్తుంది. పసిడి వన్నెలు చిందిస్తుంది ఆమె దేహచ్ఛాయ, సమస్తమును వీక్షించగల సర్వతోముఖమగు దృష్టి ఆమెది; వాస్తవంగా, సమస్త విషయపరిజ్ఞాన సంపదకు ఆమె మాతృక, మన మంచిరోజులకు సూత్రధారి; తేజోవిరాజమానమగు ఆమె దివ్యాకృతి దర్శనీయము. ఆమె దివ్యమాత, ఆమె సర్వానందమయి: సర్వ దేవాతా కటాక్ష వీక్షణ ద్వారా రక్షణ కల్పించే సూర్యభగవానుడిని తన వెంట కొనివస్తుంది. స్వచ్ఛమైన ఐహిక జీవన యానానికై సమగ్ర దృష్టిగల సారధులను తీసుకొని అరుణకిరణ కాంతులతో ఈ లోకంలో తాను స్వయంగా అభివ్యక్తమౌతుంది. వైవిధ్య భరితమగు దివ్యైశ్వర్యాలతో సుసంపన్నమగు ఆ దివ్యమాతను దర్శించు. అంతటా, అన్నింటా స్వయం వ్యక్తమగు ఆమెను దర్శించు. దివ్యకాంతికేంద్ర మాతృక అగు ఆమెను దర్శించు మనిషికి ఆనందమంతా అంతరంగంలోను, ప్రతికూలమంతా సుదూరంగాను వుంటుంది. ఆమె ఉదయించటంతో ఆ స్థితి నీలో కలుగనీ. సత్య ప్రకాశమానమైన అనంతత్వమను పచ్చని పైరును పండించు, భయరహితమగు ఆనంద నిలయాన్ని నిర్మించు, విభజన మరియు వైరుధ్య భావనను రేకెత్తించే దానినంతా తరిమివేయి, మానవ అంతరాత్మ సౌభాగ్య సంపదనంతా మాకు అందజేయి. సంకల్ప మాత్ర సమృద్ధిని సమకూర్చే ఓ దివ్యమాతా, అపారమైన ఆనందాన్నంతా మా జీవితంలో ప్రసాదించు. ఓ సంధ్యా దేవతా, పరమోత్కృష్టమైన నీ దివ్యకాంతి ప్రసరణ హేలలలో, స్వయంగా నీవు మా హృదయాలలో సాక్షాత్కరించు. భౌతికదేహదారియగు ఈ జీవి చేతనాత్మక

క్రియాశీలతను విస్తృతపరచు. ఓ సర్వైశ్వర్యప్రదాయనీ, మాకు దృఢమైన మానసిక శక్తిని ప్రసాదించు.

ఎవరి సంపద అయితే పరమ సత్య ప్రామాణికమైన ఉజ్వల కాంతిభరితమో, ఎచ్చటనైతే దివ్యజీవనయానంలో అనంతత్వము వైపుగా తరలే తురగాలు బారులు దీరి నిలుస్తాయో, అట్టి అపార సౌభాగ్య సంపదను మాకు ప్రసాదించు. మీపై అచంచలమైన ఆకాంక్షతో నున్న మేము అట్టి సంపదలలో సుసంపన్నులము. ఓ దివ్యమాతా, ఓ సర్వ సంపూర్ణ సంజాతా, బ్రహ్మ మానసపుత్రీ! మా ఆలోచనా తరంగాలతో మీ స్మృతిని మాలో పెంచి పోషించుకుంటాము. అలాగే మీరు కూడా. అపారమైన జ్ఞానసంపదను, అపరిమేయమైన దివ్యానంద సాగరాలను మా హృదయాలలో నిలిపి ఉంచుదురు గాక.

Bengali Writings, p. 7 — శ్రీఅరవిందులు

ప్రభవించని దివ్య చైతన్యము

మనసే అంతా కాదు; ఎందుకనగా మనసుకు ఆవల ఒక ఉన్నత చైతన్యమున్నది; ఒక అతిమానసము, ఒక ఆత్మశక్తి ఉన్నాయి. ప్రకృతిమాత ఎంతో శ్రమకోర్చి జంతువు అగు ఒక ప్రాణిక జీవి నుండి మనిషిని — శాస్త్రాలలో మనువుగా పేర్కొనబడిన ఆలోచనాపరుడగు మనిషిని — రూపొందించినట్లుగా మానసికజీవి యగు ఆ మనిషినుండి ఒక ఆధ్యాత్మిక, అతిమానస లక్షణాలతో కూడిన దైవాంశగల మనిషిని, సత్యచేతనగల ఋషిని, గుర్తింపు పొందిన జ్ఞానిని, వ్యక్తిగత స్వభావములో అతీంద్రియజ్ఞానము, సార్వత్రిక లక్షణము మూర్తీభవించిన మనిషిని రూపొందించటానికి శ్రమిస్తున్నది. మట్టినుండి, లోహమునుండి మొక్కవరకు, మొక్కనుండి జంతువువరకు, జంతువునుండి మనిషివరకు. ఆమె పయనం సాగింది. ఇంకా చాలా దూరం సాగవలసివుంది. ఆశ్చర్యం గొలిపేటంతపెద్దగా అంగవేయవలసివుంది. పదార్థస్థాయినుండి సజీవస్థాయివరకు, సజీవ స్థాయినుండి మానసిక స్థాయివరకు పయనం సాగిన విధంగా ఇప్పుడు మానసిక స్థాయినుండి అతిమానస స్థాయికి, సాధారణమానవ స్థాయినుండి అతిమానవ స్థాయికి ఆమె పయనం కొనసాగాలి, ఈ రెండు స్థాయిల మధ్యనున్న అగాధం దాటడానికి ఒక వంతెనను నిర్మించాలి. ఆమె నిర్వహించవలసిన మహాద్భుత కార్యమిది. అప్పుడు మాత్రమే ఆమె తాను పడుతున్న ప్రయాసను,

అనుభవిస్తున్న అసంతృప్తిని విరమించి దివ్యచైతన్యపు దేదీప్యమానమైన వెలుగులో వైభవోపేతంగా పరివర్తనచెంది, తాను పడ్డ శ్రమతో సంతృప్తి చెంది, విశ్రమించగలదు. ఒకప్పుడు అల్పమానవ లక్షణం ఆమెలో బలీయంగా నుండేది. దాని స్థానంలో మానవలక్షణం చోటుచేసుకొని కాలాన్ని అతిక్రమించి ముందుకు సాగుతున్నది. అయినప్పటికీ, భవిష్యత్ లక్ష్యము, గమ్యము అగు అతిమానసము, అతిమానవుడు ఏవైతే ఇప్పటికీ సిద్ధించని దివ్యచైతన్య ఫలితాలో అవి ఆమె రాకకై నిరీక్షిస్తున్నవి.

CWSA 12: 168

దైవం పనిచేసే విధానాలు, మానవమనసు పనిచేసే తీరుగా కాని మన ఆదర్శాలకు అణుగుణమైనవిగాకాని వుండవు. అందువలన వాటిని విమర్శించటంగాని, దైవం చేయవలసిందేమిటో చేయకూడనిదేమిటో నిర్ణయించడంగాని మనకు సాధ్యపడదు. మనకు తెలిసినదానికన్నా దైవానికి తెలిసింది ఎక్కువ. అసలు మనం దైవమున్నాడని అంగీకరించినట్లయితే, మనకున్న సదభిప్రాయము, భక్తి రెండూ అర్థించేది ఒక్కదానినే, దృఢమైన విశ్వాసమును, సమర్పణా భావమును.

CWSA 31: 5-6,

మనసు, దివ్యచైతన్యము

మనకు ప్రీతిని గొలిపే ఆలోచనలను, వాటిని అనుసరించాలనే ఆసక్తిని, ఎంత తగ్గించితే అతిమానసయోగానికి అంత మేలుచేసినవారమవుతాము. మనసు ఎల్లప్పుడూ ఆలోచనలను పెంచుకుంటూ పోతుంది. అందులో కొన్ని తప్పైనవిగా కొన్ని తప్పొప్పుల మిశ్రమముగా, కొన్ని వాటి స్వంత అంచనా మేరకు సబబైనవిగా తోస్తాయి, కాని అది కొన్ని రంగాలకో లేక కొన్ని పరిస్థితులకో లేక కొందరి విషయాలకు మాత్రమే పరిమితము. మనసు వాటిలో కొన్నింటిపై మక్కువ చూపటమే గాక వాటిని అందరూ పాటించతగ్గ, సార్వత్రికమైన సంపూర్ణ వాస్తవాలుగా లేక సాధారణ ప్రామాణికాలుగా పరిగణించి వాటిని అందరిపై రుద్దాలని ప్రయత్నిస్తుంది. మనసు ఒక కఠినమైన పనిముట్టులాంటిది, కనుక జీవనగతికి, జీవాత్మ స్వేచ్ఛ కదలికలకు ఉండవలసిన నమ్రతకు తగిన విధంగా అది తనను తాను మలచుకొనుట కష్టము. ఈ రెండు సహజశక్తులలో ఏదో ఒక దానిని లేక రెంటిని చేజిక్కించుకొని వాటిని స్వప్రయోజనాలకు సరిపోవువిధంగా మలచుకోవాలని కోరుతుంది. జీవితానికి, జీవా

త్మకు మధ్యవర్తిగా లేక సంధానకర్తగా గుర్తింపుకోసం వెంపర్లాడుతుంది. అయితే, దానికి రెండింటిని గురించిన అవగాహన లేదు; తనను గురించి మాత్రమే తెలుసు. తన జీవితంలో తాను నిర్మించుకున్న ఊహాలోకాల గురించి తన జీవితంలోని లొసుగుల గురించి లేక జీవాత్మ యొక్క అర్థసత్య అవగాహనల గురించి మాత్రమే తెలుసు. అతిమానసమొక్కటే నిజమైన మధ్యవర్తి, సంధాన కర్త. కాని అతిమానస దివ్యకాంతి కావాలని నీవు కోరినట్లయితే నీ మనో విచారాలకు నిన్ను నీవు కట్టేసుకోకూడదు. వాటినుండి వెనక్కు తగ్గాలి. ఆత్మానుగతమైన మౌన స్థితిలో, నిష్పాక్షిక సమదృష్టితో వాటిని గమనించాలి. అతిమానస దివ్యకాంతి ఎప్పుడైతే వాటిని తాకుతుందో, అప్పుడు అది వాటిని యధాస్థానంలో వుంచి, చివరిగా వాటి స్థానే వాస్తవ విషయ పరిజ్ఞానాన్ని నిలుపుతుంది.

CWSA 31:56,

అనంతమైన దివ్యసత్యంయొక్కపునాది

మేధకు ఆవలగానున్న అతిమానస సూత్రం అనంతమైన దివ్యసత్యానికి పునాది. పృథ్వీచేతనలో అతిమానస కార్యాచరణ కూడదు. అయినా అది తెరవెనుక చాలా అరుదుగా మినుకుమినుకుమంటూ కనిపించే మెరుపులా సాగుతుంది. పిరికిది, కుంటిది, మందబుద్ధిగల మనసు మళ్ళీమళ్ళీ దానికై ఎదురుచూస్తుంది, విశ్వ ప్రయత్నాలు చేసినప్పటికీ అది ఛాయామాత్రంగానే కనిపిస్తుంది. కాని ఆ సమగ్ర దివ్యసత్యము యొక్క అచ్చమైన, అనంతమైన, ప్రకాశమానమైన స్వరూపాన్ని మాత్రం గ్రహించలేదు. మనసుయొక్క తెలివితేటలతోబాటు దాని కార్యాచరణ కూడా అలాంటి అసక్తత, అసమర్థత, వైఫల్యతలతో ప్రభావితమౌతున్నది. చిరునగవులు చిందిస్తూ, సునాయాసంగా సాగే దివ్యసత్యనృత్యానికి బదులు శృంఖలా బద్ధమై, సత్యాసత్యము, నీతి అవినీతి, విషము అమృతము, కార్యాచరణ కార్యశూన్యత, అనైతిక కార్యాచరణల లాంటి విడదీయరాని బంధనాలతో నరకయాతన పడుతున్న మహాశక్తి యొక్క, అత్యల్పస్థాయి సంకల్పబలం యొక్క విఫల ప్రయాస చోటు చేసు కుంటుంది. స్వేచ్ఛాయుతము నిస్సంకోచము నిర్వికారము, విజయవంతము, దివ్యానందమ యము, ఆవేశపూరితమగు దివ్యకార్యాచరణ శక్తి ఏకత అను మధువుతో మత్తెక్కి ఉన్నందున సిద్ధించకుండా, ఆగిపోతుంది. నిమ్న స్థాయి ప్రకృతియొక్క

సంకల్పశక్తికి దాని సహజమైన, సులువైన, సార్వత్రిక కదలికలు సాధ్యపడవు.

అసత్యము, పరిమితము అగు వలలో చిక్కుకున్న ఈ భూప్రకృతి ఎప్పటికైనా ఆ అపరిమితమగు దివ్యస్థితిని, అనంతమైన దివ్యచైతన్యశక్తిని, అపారమైన పరమానంద చేతనను పొందగలదనే ఆశవున్నదా? పొందగలిగితే ఏ విధంగా? అందుకు సమర్పణ ఒక్కటే మార్గము. సమర్పణ అర్థం ఆత్మ సమర్పణ, ఆత్మ బలిదానము. నీ స్వ శక్తితో లేక దైవానుగ్రహముతో ఇప్పుడు నీవు ఏమిగానున్నావో, నీవు ఏమి కలిగివున్నావో, భవిష్యత్తులో నీవు ఏమి కాబోతావో, నీ కర్మాచరణ ద్వారా నీవు ఏమి సంపాదించగలవో లేక కూడబెట్టగలవో, అవన్నీ శుద్ధపరచబడిన వెన్నలా దివ్య చైతన్యాగ్నిలో హవిస్సుగా అర్పితమౌతాయి. నీకున్న సమస్తము నుండి కొద్దిపాటి దానిని సమర్పించుటతో నీవు అపారమైన సమస్తాన్ని అందుకుంటావు. సమర్పణలో యోగము అర్థగర్భితమై వున్నది.

Bengali Writings: 47

అతిమానసం యొక్క పొరలు

అతిమానసానికి మూడు పొరలున్నాయి. అవి మనసునకున్న అంతర్ జ్ఞానంతో చేసే త్రివిధ కర్మలను బోలినవి. మొదటిది అంతర్భాస అతిమానసము, అనగా అర్థ వివరణ గావించే అతిమానసము (లేక స్పష్టత నీయగలిగే అతిమానసము). అర్థవివరణ అని ఎందుకన్నానంటే మానసిక స్తరంలో ఏది సాధ్యపడునదిగా కనిపిస్తుందో అదే అతిమానస స్తరంలో కార్యరూపం దాల్చగల శక్తి అవుతుంది. అర్థవివరణ గావించే అతిమానసము కార్యరూపం దాల్చగల సూచన లన్నింటినీ నీ ముందుంచుతుంది. అది భౌతిక స్తరంలో వాస్తవరూపం దాల్చటానికి గల మూల కారణాలను ఎత్తి చూపు తుంది. ఎప్పుడైతే అంతర్బుద్ధి దాని అతిమానస విలువలోకి పరిణామం చెందుతుందో అప్పుడు అది అర్థవివరణ గావంచే అతిమానస మౌతుంది.

రెండవది, 'ప్రాతినిధ్య అతిమానసము' అని అంటారు. అది కార్యరూపం దాల్చే ప్రయత్నాలను సూచించడమే గాక కార్యాచరణలో నున్న వాటిని కూడా తెలియ జేస్తుంది. ఎప్పుడైతే ప్రేరణ భావన దాని అతిమానస విలువలోకి పరిణామం చెందు తుందో అప్పుడది 'సాదృశ్య అతిమానసము' అవుతుంది. అయితే, ఇది ఉత్తమ శ్రేణికి చెందిన అతిమానసం కాదు. కొన్ని క్రియాశీలమైన సంభావ్యతలు చాలా

సందర్భాలలో ఏమి జరుగబోతున్నదో లేక ఫలానా విషయం ఏ విధంగా జరిగిందో లేక ఏ విధంగా జరుగవచ్చునో చెప్పవచ్చును గాని రూఢిగా చెప్పలేవు.

చివరిది 'దైవాధీన అతిమానసము'. అది దివ్యజ్ఞానాన్ని పోలివుంటుంది. ఏదీ దానికి ప్రతిబంధకముగా నిలువ లేదు గనుక అది ఎల్లప్పటికీ సత్యముగా భావించ బడుతుంది. అది స్వకీయ అంతర్నిహిత శక్తితో స్వయంగా సాఫల్యమవగల దివ్య జ్ఞానము.

Evening Talks

యదార్థ భావన

మనసుకు పైగా వున్న స్తరాలలో ఊహామాత్రమైన అంశాలు లేవు, యదార్థాలు, శక్తులు ఉన్నాయి. ఉదాహరణకు, అతిమానసం గురించి నీ మనసులో ఏదో ఊహించు కున్నావు. నీవు అతిమానస స్థాయికి చేరినప్పుడు అది కేవలం ఊహామాత్రమే కాదని తెలుస్తుంది. అది భౌతిక పదార్థానికన్నా దృఢతరమైనది, అతిశయించిన ధారుఢ్యత గలది. అందుకనే దానిని నేను 'యదార్థ భావన' అని, ఒక 'ఊహాజనిత భావన' కాదని అన్నాను. ఆ విధంగా ఆలోచిస్తే దైవాన్ని మించిన దృఢమైనది మరొకటి ఉండదు. మనము స్వచ్ఛమైన మానసిక స్తరములో నున్నప్పటికీ, మనసు అంతకు మించిన దృఢతరమైనది, యదార్థమైనది అని తెలుసుకుంటాము. కాని మనము భౌతిక స్తరములో నున్నందున మనసు ఎక్కువ ఊహాభరితమైనది అని అనుకుంటాము. అతిమానసం ముందు భౌతికం ఒక మబ్బుతెరలా కరిగిపోతుంది.

శిష్యుడు: ఆ దృఢత్వం ఏ విధంగా నుంటుంది?

ఘనీభవించిన పదార్థము, ఒక ముద్ద లేక రాశిలా ఉంటుంది. బహుశా, ఆ కారణంగానే ఏమో వేదం 'అగ్ని వెలుగంత విస్తృతి గలది, పదార్థమంత దృఢమైనది' అని ప్రవ చించింది. అతిమానసం వజ్రానికన్నా గట్టిదైనప్పటికీ వాయువును మించిన చలనం గలది అనవచ్చు..

Evening Talks with A.B. Purani, 15-8-1923, p. 289

శ్రీఅరవిందులు

అతీంద్రియ జ్ఞానము — దివ్యజ్ఞానమని అర్థం, అయితే అది నిజమైన జ్ఞానము; అతిమానస పరిధులను గురించిన జ్ఞానదృక్పథము.

CWM 6:93

శ్రీమాత


అనువాదం: అందుగులపాటి కైలాసపతి

నిన్ను ఊరడించడానికి చెపుతున్నాను. నీవు ఈ సమయంలో నివసిస్తున్న ఒకే ఒక కారణంగా — అది నీకు ఎరుకలో వున్నా లేకపోయినా, దానిని నీవు కావాలనుకున్నా వద్దనుకున్నా కూడా — నీవు పీల్చే గాలితో పాటు, ఇప్పుడు భూవాతావరణంలో వ్యాప్తి చెందుతున్న ఈ నూతన అతిమానస పదార్థాన్ని కూడా నీవు పీలుస్తున్నావు. నీవు అతిమానసం కావాలని దృఢ నిర్ణయం తీసుకోగానే, నీలో తటాలున సాక్షాత్కారించబోతున్న విషయాలను అది సమాయత్తపరుస్తుంది.

CWM 9:337

శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి



మరుగున పడిన మార్తాండుడు

గుప్తనిధి

కాళరాత్రి స్పష్టంగా అంతరంగ అజ్ఞానానికి ప్రతిబింబం. ఉషోదయం కావటంతో దివ్యసత్యాలు కాళరాత్రులనుంచి జయించబడి స్వాధీనం చేసుకోబడతాయి. ఇది అస్పష్టతలో మరుగునపడిపోయిన ఆదిత్యుని పునరుత్థానం — సుపరిచితమైన దేవ తలు మరియు ఆంగీరస ఋషులచేత మరుగున పడిపోయినటువంటి మార్తాందుని తిరిగి స్వాధీనపరచుకొన్న సుస్పష్టభావన — మహాసత్య మార్తాండం, అది ఇప్పుడిక, బంగారు దివ్యప్రకాశంవైపు జ్వలించే తన నాలుకను ఒక్కసారిగా చాపింది. ఎందు వల్లనంటే హిరణ్యం, అనగా సువర్ణం ఉన్నత ప్రకాశానికి నిర్దుష్టమైన ప్రతీక, మహా సత్యస్వర్ణం. ఈ నిధి కోసమే వేద ఋషులు దేవతలను ప్రార్థించేవారు కాని బంగారు నాణాల కోసం కాదు. అంతరంగంలోని అజ్ఞానాంధకారం జ్ఞానకాంతిగా రూపొందే గొప్పమార్పు ఆశ్వినులు, మానసిక, ప్రాణిక శక్తుల సంతోషదాయకమైన చర్యకు ప్రభువులు, వారి ద్వారా మనస్సు, శరీరాలలో పోయబడిన దివ్యా నందంయొక్క అమరత్వ సోమరసంతో సార్థకమవుతుంది. అక్కడ వారు దానిని పానం చేస్తారు. అభివ్యక్తమయ్యే దివ్యవాక్కును వారు మానసికం చేస్తారు. వారు అజ్ఞానాంధకారం ఆవల నున్న స్వర్గమయ పవిత్ర మనస్సులోకి ముందుండి నడిపిస్తారు. ఆ విధంగా దివ్యానంద శక్తులను క్రియాశీలంచేసే దివ్యతలంపుకు చేర్చుతారు. కాని స్వర్గసంబంధ జలాలను వారు దాటి పోయినప్పటికీ, ఎందువల్లనంటే సోమపాన శక్తి వారికి మానసిక నిర్మాణాలన్నింటిని కరిగించివేయటానికి సహాయం చేస్తుంది. ఈ ముసుగును కూడా వారు తొలగత్రోసి, పరిత్యజిస్తారు. వారు మహామనస్సుఆవలకు వెడలిపోతారు. చిట్టచివరకు చేరేదానిని నదీప్రవాహాలను దాటి పోవటంగా వర్ణించబడింది. స్వర్గమయ మగు పవిత్ర మనోమార్గంద్వారా, దివ్యసత్యపథం ద్వారా అవతలివైపుకు యాత్ర. మనం పరమోచ్ఛమగు సర్వోత్కృష్టం, 'పరమపరావత్' ను చేరేదాకా, గొప్పదైన ఆ మానవయాత్రలో మనం చిట్టచివరకు విశ్రాంతి నొందము.

CWSA 15:130

గొంటారు. వారు ఈ జ్ఞానాన్ని విభజించ లేనటువంటి అంతటినీ — ఆలింగనంతో — ఇముడ్చుకొను దృష్టికి మన అధోచేతన అస్తిత్వంలో రహస్యంగా దాచబడిన ఈ దేవతల చక్షువుకు వారు విమోచనం కలిగిస్తారు; వారు అతని తీక్షణమైన కాంతికిరణాలను విడుదల చేస్తారు. వారు దివ్యఉషోదయాన్ని సృష్టిస్తారు. మానవునిలో జన్మించిన దివ్య మనో ఆధిపత్యశక్తి అయిన ఇంద్రుడు, ద్రష్ట-ఇచ్ఛ అయిన అగ్ని, వాక్ ప్రేరణకు ప్రభువైన బృహస్పతి, అమరత్వ దివ్యానందమైన సోముడు ఎత్తైన పర్వతశ్రేణుల బలమైన గట్టి ప్రదేశాలను పగులగొట్టి ముక్కలు ముక్కలు చేసివేయటానికి సహాయం చేస్తారు, దైత్యులు కృత్రిమంగా కల్పించిన అడ్డంకులు భగ్నం చేయటానికి సహాయం చేస్తారు. ఈ సూర్యుడు మన స్వర్గాలలోకి దేదీప్యమానంగా పైకి ఎగబాకి పోతాడు. ఆ విధంగా ప్రవర్ధమానమైన అతడు అతిమానస దివ్యసత్యము నధిరోహిస్తాడు. "దేవతలు ఆయన కోసం ఏ మార్గం తయారు చేశారో దాని గుండా ఒక గ్రద్ద ఏ విధంగానైతే తన ఆహారం కోసమై, ఆకాశాన్ని చీల్చుకుంటూ దానిపై వాలుతుందో, ఆ విధంగా ముందుకు అతడు సాగిపోతాడు, తన మెరుపులీను సప్తాశ్వాలతో అతడు ప్రకాశమాన సాగరమైన ఉన్నతోన్నత స్థితికి చేరతాడు. ఓడలో ఉండి దారి చూపు వారిలాగా ద్రష్టలు అతనికి ముందుండి దారి చూపుతారు. సూర్యుడు, బహుశా ఆ మార్తాండుడే, తనకు తాను బంగారు ఓడ అవవచ్చును, అందులోని వృద్ధినొందించే పూషుడు మనుషులను దుష్టత్వం, అజ్ఞానాంధకారం, పాపత్వాల ఆవలకు, దివ్యసత్య, అమృతత్వాల దిశగా ముందుండి నడిపిస్తాడు.

CWSA 15:478-79

సత్యం, ఋతం, బృహత్

ఈ దివ్యసత్యమే ప్రకాశము, సూర్యుని విశ్వం. అది సత్యం, ఋతం, బృహత్ గా వర్ణించబడింది; స్వరాట్టు యొక్క వెలుగులీను అతిమానస స్వర్గం — "బృహత్ స్వరాట్, మహోన్నత దివ్యసత్యం" — మన స్వర్గము, మన పుడమిల కావలగా గుప్తంగా ఉన్నది; సూర్యుడు, ఆదిత్యుడగు "ఆ దివ్యసత్యము" మనల నుంచి ఉపసంహరింపబడి అధోచేతనా రహస్య గుహలో అజ్ఞానాంధకారంలో మరుగునపడి వసిస్తున్నది. రహస్యంగా దాగి వున్న ఈ దివ్యసత్యమే బృహత్, కారణం, అది, కేవలం ఏక్కడైతే ఉనికి, ఇచ్ఛ, జ్ఞాన, సంతోషాలు పారవశ్యం మరియు హద్దులు

..... సూర్యుడు సృష్టికర్త అయినప్పుడు, కదులుతున్న వాటన్నింటికీ, కదలక నిశ్చలంగా ఉన్నవాటన్నింటికీ ఆత్మ అతడేనని వేదాలు చెపుతున్నాయి. ఈ సూర్యుడు కూడా దివ్యం అయితే, "స్వర్గమున కాధారమైన ధర్మమునందు పాదు కొనియున్నటువంటి విస్తృతంగా జ్వలించు దివ్యసత్యము," అప్పుడు లోకములన్నీ ఆ దివ్యసత్యధర్మమునే అభివ్యక్తము చేయవలసిఉంది. అప్పుడవన్నీ మరెన్నో స్వర్గములు కాగలవు. అటువంటప్పుడు ఈ అనృతము, పాపము, మృత్యువు, బాధలనేవి మన మర్త్యలోకానికెక్కడినుంచి వచ్చినవి? విశ్వతత్త్వమైన అదితి శరీరం నుంచి. విశ్వత్త్వమైన అదితి శరీరంనుంచి ఎనిమిదిమంది పుత్రులు జన్మించారని చెప్పబడింది; ఏడుగురితో ఆమె దేవతలవైపుకు కదిలిపోయింది. కాని, ఎనిమిదవ పుత్రుడు, మర్త్యసృష్టికి సంబంధించిన మార్తాండుడు. అతడిని ఆమె తననుంచి దూరంగా పరిత్యజించింది, ఆ ఏడుగురితో ఆమె దేవతల మూలస్థానం, పరమోత్కృష్ట జీవనంవైపు సాగిపోయింది, కాగా మార్తాండుడు మహా అచేతనలో మర్త్యుల జన్మ మృత్యువుల ఏలుబడికి వదిలివేయబడినవాడు, ఆ మహా అచేతననుంచి బయటకు తిరిగి తీసుకురాబడతాడు.

ఈ మార్తాండుడు లేక ఎనిమిదవ సూర్యుడు నలుపు లేక విషణ్ణమైనవాడు, మరుగునపడి, దాగియున్న సూర్యుడు, దైత్యులు (రాక్షసులు) అతడిని బంధించి, వారి కటిక చీకటిగుహలో బంధించారు. దాని మూలంగా అతనిని అతడి ఉజ్వల కాంతి వైభవం లోనికి, అతడి విమోచనకు దేవతలు, ద్రష్టలు, యజ్ఞశక్తి ద్వారా తప్పక విడుదల చేయవలసి ఉంది. ఇంకా తక్కువ అలంకారిక భాషలో, మర్త్య జీవితం అణచిపెట్టబడిన, దాగియున్న, ప్రచ్ఛన్న మైన, దివ్యసత్యంచేత పరిపాలించ బడుతున్నది. ఏ విదంగా అయితే దివ్య ద్రష్ట ఇచ్ఛయగు అగ్ని మొదట భూమిమీద మానవవాంఛ మరియు స్వయం తనదైన ఇచ్ఛవలన పొగచూరి దాచబడటం లేదా అస్పష్టతను పొందాడో, అదే విధంగా దివ్యజ్ఞానమైన సూర్యుడు రాత్రి మరియు అజ్ఞానాంధకారంలో రహస్యంగా దాచబడి, పొందలేనివాడై, సాధారణ మానవ ఉనికి యందలి అజ్ఞాన, పొరపొచ్చాలతో ఆవరించబడి, ఇమిడిపోయి ఉన్నాడు. ద్రష్టలు వారి ఆలోచనలోని సత్యశక్తి ద్వారా అజ్ఞానాంధకారంలో పడిఉన్న సూర్యుని కను

లేని అనంతంలో కదులుతుంటుందో, నిమ్న అస్తిత్వరూప మైనటువంటి మనో, ప్రాణ, శరీరాల అనేక అడ్డుగోడల ఉనికిలో లాగా పరిమితం కాకుండా, కంచె వేయ బడకుండా ఉంటుందో, అటువంటి అతిమానస తలం మీద మాత్రమే స్వేచ్ఛగా వసిస్తూ, అభివ్యక్తమవుతూ ఉంటుంది. అటువంటి విస్తృతమైన ఉన్నతోన్నత అస్తిత్వంలోకి మనం ఆరోహించవలసి ఉంటుంది; కప్పివేసే మనో, భౌతికములనే రెండు మండలాల కావలగా చీల్చుకుంటూ ఆరోహించవలసి వుంటుంది. దాని అపరిమితమైన వ్యాపకత్వంలో అది స్వేచ్ఛాయుతమైన, విశాలమైన దివ్య ఉనికిగా వర్ణించబడింది; అది విస్తృతం, దానికి అక్కడ అడ్డంకులు కాని, పరిమితిని విధించే ప్రయత్నాలు కాని లేవు; అది ప్రకాశవంతమైన పశువులమంద యొక్క భయభీతులు లేని పచ్చిక బయలు; అది దివ్యసత్యం యొక్క పీఠం, గృహం, దేవతల సొంత ఇల్లు, సౌర ప్రపంచం, ఆత్మ కిసుమంతైనా భయంలేని అసలైన వెలుగు, యే యుగానికీ సంభావ్యత లేనటువంటి బృహత్తరమైన, సమమైన పరమానంద ఉనికి. ఈ అతిమానసపు బృహత్తరం అస్తిత్వం యొక్క మూలసత్యం కూడా. దాని నుంచే క్రియాకారక సత్యం పరిపూర్ణ, దోషరహిత గమనంలోకి సహజసిద్ధంగా ప్రయత్నంతో కూడిన ఏ సంఘర్షణా లేనిదై ఏ లోపం లేకుండా పైకి ఉబికి వస్తుంది. కారణం ఆ ఉన్నతాలలో ఏ విభజనా లేదు, చైతన్యం, శక్తి మధ్య ఏ అగాధమూ లేదు, అస్తిత్వం, దాని చర్యల మధ్య ఏ అసామరస్యతా లేదు; అచట ప్రతిదీ 'సూటిగా' ఉండి, వంచన కేమాత్రమూ సంభావ్యము కాదు. అందువలన బృహత్తరమూ, యదార్థ అస్తిత్వమూ అయిన ఈ అతిమానసతలం విషయాల వాస్తవిక కార్యశీలతగల ఋతం కూడా. అది గమనం, చర్య, అభివ్యక్తాల పరమోత్కృష్ట సత్యం, ఇచ్ఛ, హృదయ, జ్ఞానముల పొరపాటుపడని (నిర్దుష్టమైన) సత్యం, ఆలోచన, వాక్కు, ఉద్వేగాల పరిపూర్ణ సత్యం. అది అప్రయత్నంగా తనంతతానైన దివ్యధర్మం, స్వేచ్ఛాయుతమైన దివ్యన్యాయం, అనృతముల ద్వారా విభజింపబడి వేరైపోయిన చైతన్యం చేత స్పృశింపబడని ఆది దివ్యక్రమం. అది మూల ఏకత్వం నుంచి జన్మించిన బృహత్తరమైన దివ్యం, స్వయం ప్రకాశిత సంయోజనం, దాని ముందు మన అల్ప ఉనికి కేవలం హీనమై, పాక్షికమై, బలహీనమై, ముక్కలు ముక్కలై, వక్రించబడి, విభజించబడినది. వేదకాలంనాటి సూర్యుని ఆరాధన అటువంటిది, అది ప్రజాపతులు ఆకాంక్షించిన

దివ్యానంద లోకప్రకాశము, అదితి మాత పుత్రుడైన సూర్యుని మూలతత్వము, విశ్వము.

CWSA 15:475

వేదాలు, అతిమానస మార్పు

వారెవరైనా (వేద ఋషులు) అతి మానసతలం చేరారని నేను చెప్పలేను, కాని దానికి ఆరోహణ వారి ధ్యేయమై ఉండింది. 'స్వర్' సుస్పష్టంగా మహామనస్సు ప్రకాశమాన క్షేత్రాలు, అతి మానసానికీ మానవమేధస్సుకూ మధ్య సూర్యకిరణాలచే రూపు దిద్దుకుంది. ఉపనిషత్తుల ప్రకారం ఎవరైతే సూర్యుని కిరణాలలోకి ఆరోహిస్తారో వారు తిరిగివస్తారు కాని ఎవరైతే సూర్యునిలోకే ఆరోహిస్తారో వారు తిరిగిరారు. దానికి కారణం అతిమానసానికి ఆరోహణ ఊహించబడింది. కాని అవరోహణ, ఇక్కడి అతిమానసం వ్యవస్థీకరణ మాత్రం (కిరణాల అవతరణను మినహాయించి) ఊహించబడలేదు.

CWSA 29:417

దివ్యసత్య చైతన్యమైన అతిమానసభావన శ్రీఅరవిందుల వివరణ ప్రకారం, ఋగ్వేదంలో ఉంది, అదే విధంగా కొన్ని ఉపనిషత్తులలోనూ ఉంది, కాని ఉపనిషత్తులలో అది జ్ఞానంగా, విజ్ఞానమయ పురుషుడుగా, మనస్సును, ప్రాణాన్ని, భౌతిక అస్థిత్వాన్ని దాటిపోయినదిగా, బీజరూపంలో ఉంది; ఋగ్వేదంలో ఆ భావన ఉంది, కాని కేవలం సూత్రప్రాయంగా మాత్రమే, అది అభివృద్ధి పరచబడలేదు. అలా సూత్రప్రాయంగా ఉన్నదికూడా హిందూ సంప్రదాయంనుంచి అదృశ్యమైపోయింది.

ఈ విషయంలో, హిందూసంప్రదాయంలో ఇతరులతో పోలిస్తే, శ్రీఅరవిందుల సందేశంలో నవ్యత్వం రూపుదిద్దుకుంది. ఈ ప్రపంచం మాయమొక్క సృష్టికాదు, లేక కేవలం దైవంయొక్క లీల కూడా కాదు, లేక మనం తప్పించుకుని పారిపోవలసిన అజ్ఞానమయ జన్మ పరంపర కానేరదు. కాని అది అభివ్యక్తమయ్యే క్షేత్రం, అందులో ఆత్మ మరియు మహాపదార్థంలోని ప్రకృతి క్రమానుగతంగా పరిణమిస్తాయి. మహాపదార్థం నుంచి మహాజీవితం, మహామనస్సు, అక్కడినుంచి మహామనస్సు కావలకు, జీవితంలో సచ్చిదానందం సంపూర్ణంగా బహిర్గతమయ్యే పర్యంతమూ

అది కొనసాగుతుంది. ఇదే యోగానికి పునాది అవుతున్నది, జీవితానికి ఒక నూతన భావన నిస్తున్నది.
CWSA 29:444- 45

వేదాలలో అతిమానసం

శిష్యుడు: ఈ అతిమానసం భావన వేదాలలో ఉన్నదా?
ఉన్నది. అది చాలా స్పష్టంగా ఉంది, అయినప్పటికీ వేదఋషుల ప్రాధాన్యత అంతా పైకి పోవటానికి ఉన్నదే కాని ఆరోహించటం, గెలుపొందుతూ నిమ్న ప్రకృతిని పరివర్తన చెందిస్తూ తిరిగి క్రిందికి వచ్చే గమనంమీద లేదు.
Evening Talks

దైవము- అతిమానసము

మనిషి దైవంతో ఏకత్వం పొందగలడు, మానసికతలంలో. దైవం భూమిపై అభివ్యక్తమవుటకు అతిమానసం అవసరమౌతుంది.

*

దైవం ఉండగలదు. సర్వత్రా ఉన్నదే, ముసుగు వేసుకుని లేదా పాక్షికంగా అభివ్యక్తమై లేదా అన్ని చైతన్య అంతస్తులలోనూ అభవ్యక్తమవటానికి ఆరంభిస్తున్నది; అతి మానసంలో ఏ మారువేషమూ లేకుండా లేదా ఏ ముసుగూ లేకుండా తన స్వ స్వరూపంతో అభివ్యక్తమవ నారంభిస్తున్నది.
CWSA 28:12

రెండు అర్థగోళాల ఉనికి

ప్రాచీన భారతీయ వ్యవస్థలో కేవలం ఒకే ఒక్క త్రిపుటి ఉన్నది. దివ్యమైన సచ్చిదానందం....... లేదా నీవు ఊర్ధ్వగోళాన్ని దివ్యమనేటట్లయితే అక్కడ మూడున్నాయి. సత్యలోకం, చిత్‌లోకం, ఆనందలోకం. అతిమానసాన్ని నాలుగవ దానిగా కలపవచ్చు. ఆ మూడింటినుంచి స్వీకరించినదవటం మూలంగా అది ఊర్ధ్వ గోళానికి సంబంధించినది. భారతీయ దర్శనాలు రెండు విభిన్న ఆధిపత్యశక్తులమధ్య రెండు ఉపరితలాలకు సంబంధించిన చైతన్యానికి గల భేదాన్ని చెప్పవు, ఒక దానిని

మనం ఊర్థ్వమనస్సు అనగలం, రెండవది అసలైన అతిమనస్సు లేదా దివ్య అతీంద్రియజ్ఞానం. అందువలననే వారు మాయవిషయంలో (ఊర్థ్వమనో శక్తి, లేదా విద్య-అవిద్య) తికమకపడి, దానినే సర్వోత్కృష్ట ఆధిపత్యశక్తిగా తలచారు. ఆ విధంగా ఇంకా పాక్షిక- ప్రకాశమైన దాని చెంతనే ఆగిపోయినవారై, వారు పరివర్తనా రహస్యాన్ని పోగొట్టుకున్నారు. వైష్ణవులు, తాంత్రికులు దానిని తడుముకుంటూ తిరిగి తెలుసుకొనటానికి ప్రయత్నించారు. అప్పుడప్పుడు విజయం అంచులవరకు చేరారు. తక్కినవారికి ఇది, క్రియాశీలదివ్యమహాసత్యాన్ని కనుగొనే ప్రయత్నాలన్నింటికీ అడ్డుగోడగా అయింది. ఊర్థ్వ మనోసీమయొక్క మెరిసే ఉజ్జ్వల కాంతులు క్రిందికి దిగటం మొదలుపెట్టగానే అది, ఇదే నిజమైన ప్రకాశమని అంతీంద్రియ ఆత్మ జ్ఞానమని అనుకున్నారు. అలాఅని అనుకోనివారు నా కెవరూ తెలియదు. దాని ఫలితంగా వారు అక్కడ ఆగిపోవటం, ముందుకు వెళ్ళలేకపోవటంగాని జరిగింది లేదా ఇంకొక విధంగా ఇదికూడా కేవలం మాయలేక లీల అని ముగింపు పలికి ఇక చేయవలసిన దొక్కటే, దీనిని దాటి ఆవలకు ఏదో అచలమైన పరమోత్కృష్ట నిష్క్రియ నిశ్శబ్దం లోనికి పోవటమేనని అనుకున్నారు.

CWSA 28:83

పురాణాలలోని ఏడు లోకాలు - అతిమానస లంకె

వేదాలను అర్థంచేసుకోవాలంటే మనం ఈ వేదాలలో ప్రస్తావించిన పోలికలను తప్పక లోతైన అవగాహనతో వశం చేసుకోవలసిఉంది, విశ్వంలోని అంతస్తుల తారతమ్యంతో అవి దేనికి దారితీస్తున్నాయో తెలుసుకోవలసి ఉంది. మనం పురాణాలలోని ప్రతీకల వెనుకనున్న ఈ వ్యవస్థను తిరిగి కనుగొనవలసి ఉంది. అప్పుడే మనం అత్యుత్తమంగా, తేలికగా సుస్పష్టంగా దానిని పట్టికరూపంలో వ్రాయ గలుగుతాం. ఎందువల్లనంటే అక్కడ సత్ కు సంబంధించిన ఏడు ప్రధాన సూత్రాలు, వాటికి సంబంధించిన ఏడు పౌరాణికలోకాలు, వాటికి సరిపడేవిధంగా కచ్చితంగా ఉన్నాయి.

అప్పుడు:—

సూత్రప్రాయకలోకం

ప్రధానసూత్రం	లోకం
1. శుద్ధసత్వం-సత్	అస్తిత్వంయొక్క పరమోన్నత సత్యలోకం (సత్యలోకం)
2. శుద్ధచైతన్యం-చిత్	అనంతఇచ్ఛ,లేక చైతన్యశక్తియొక్క చిత్ లోకం (తపోలోకం)
3. శుద్ధ ఆనందం – దివ్యానందం	సృష్టియొక్క క్రియాశీలమైన ఆనందమయ లోకము (జ్ఞానలోకం)
4. దివ్యజ్ఞానం లేక దివ్యసత్యం లేక విజ్ఞానం	బృహత్ యొక్క విజ్ఞానమయ లోకము (మహర్లోకం)
5. మనస్సు	ప్రకాశమయలోకం (సువర్లోకం)
6. జీవితం (పటిష్టమైన అస్తిత్వం)	అనేకంగా పరిణమించు లోకములు (భువర్లోకం)
7. పదార్థం	భౌతికప్రపంచం (భూలోకం)

పురాణాల్లోఉన్న ఈ వ్యవ్యవస్థ ఇప్పుడు చాలా తేలికగా విశదమవుతూ, తగినవిధంగా ఉంది. వేదాలలో చాలా చిక్కుముడితో అస్పష్టంగా ఉన్నది. అక్కడ మూడు పరమోన్నత లోకాలు మూడు దివ్యసూత్రాలుగా ఒకె ోచోట చేర్చబడి ఉన్నాయి. ఎందువల్లనంటే, అవి త్రిపుటిగా ఎల్లప్పుడూ ఒకేచోట మనుగడ సాగిస్తూ ఉంటాయి. వాటి పరిధి అనంతం, దివ్యానందం వాటి పునాది. అది దివ్యసత్యంయొక్క బృహత్ క్షేత్రాల ఆసరాతో ఉంటాయి. అక్కడినుంచి దివ్యమహాప్రకాశం మన మానసికంవైపు ఇంద్రుని క్షేత్రమైన, మూడు స్వర్గసంబంధిత ప్రకాశమాన లోకాలైన సువర్లోకంలోకి తీక్షణంగా ప్రసరిస్తుంది. మనం నివసించే త్రిపుటివ్యవస్థ, క్రింద వరుసలో ఇవ్వబడింది.

మనకి పురాణాలలో ఉన్న విధంగానే విశ్వంలోనూ అంతస్థులు ఉన్నాయి. కాని అవి వేరు విధంగా వర్గీకరించబడ్డాయి, ప్రధానంగా ఏడులోకాలు, అయిదు ఆచరణాత్మకంగా అయిదు, సాధారణమైన వర్గీకరణలో మూడు.

1. సర్వోత్కృష్ట సత్ -చిత్ - ఆనందం మూడు దివ్యలోకాలు

2. లంకె – అతిమానసలోకం	దివ్యసత్యం, దివ్యఋతం,దివ్యబృహత్ దాని మూడు ప్రకాశమాన స్వర్గాలతో సువర్లోకంలో అభివ్యక్తమైంది.
3. నిమ్నలోక త్రిపుటి	
శుద్ధ - మహామనస్సు...	స్వర్గము (దియాస్,మూడుస్వర్గాలు)
మహాజీవశక్తి...	మహామధ్య క్షేత్రం (అంతరిక్షం)
మహాపదార్థము...	పృథ్వి (మూడుపుడమిలు)

CWSA 15: 372-73

కారణ, హిరణ్యగర్భ, విరాట్టులు

మూడు తలాలు — (1) కారణ (2) హిరణ్యగర్భ (3) విరాట్

ప్రజ్ఞ అధ్యక్షతగా ఉపనిషత్తులలోని విజ్ఞానం లేక కారణ జగత్తులు ఏవైతే సుషుప్తితో సమం చేయబడినవో, అదే విధంగా హిరణ్యగర్భము, స్వప్నము మరియు సూక్ష్మవిషయాలతోటి పోల్చబడింది. కాని అవి నేను చెప్పిన అతిమానసానికి ఏ మాత్రమూ సాటిరావు. కాని సర్వసాధారణ మనస్సుకు ఏమని చెప్పవచ్చంటే, అతిమానసానికి సమీపిస్తున్నా లేక ప్రవేశిస్తున్నా అది ఒక సుషుప్తి స్థితిగా అయిపోతుంది. దీనిని వ్రాసే వ్యక్తి, దానిని అతిమానసం యొక్క అతిచేతనా నిద్ర అంటే — ఎందువల్లనంటే పరివర్తన నొందని మనస్సు అతిమానస స్థితిని స్పృశించినా లేక సందర్శించినా అది అతనికి అతిచేతనా నిద్రలాగా కనపడుతుంది, ఎందువల్లనంటే, అది అనివార్యంగా అటువంటి అతిచేతనా నిద్రలోకి పడిపోతుంది కాబట్టి — అప్పుడు తేడా అనేది లేకుండా పోతుంది.

ఏడు లోకాలు[1]

1. భూ	—	భౌతిక
2. భువః	—	ప్రాణిక
3. సువర్	—	మనో
4. మహత్	—	విజ్ఞాన (అతిమానస)

కాదు. కింద అది మేల్కొనటం, ప్రత్యక్షం కావటం అనేది పైనుంచి వచ్చే స్పర్శకు సమాధానం, అప్పుడు దానికి అనుగుణమైన మూలకాన్ని, ఇప్పుడు దాగియున్న విధంగా, పదార్థం అగాధాలలో దాగి యున్నదానిని బయటకు తీసుకు వస్తుంది.... కచ్చితంగా ఇప్పుడు అదే జరుగుతున్నది. కాని రెండు వారాల క్రితం నేను చెప్పిన విధంగా, భౌతిక ప్రపంచం అది వాస్తవంగా ఏ విధంగా దృశ్యమాన మవుతున్నదో, ఎంత శక్తివంతమైనది, ఎంతగా పూర్తిగా సాధారణ చైతన్యానికి వాస్తవికమైనది అంటే, అది, ఈ అతిమానసిక శక్తి, చైతన్యం అభివ్యక్తమైనప్పుడు, ఏ విధంగా ఉన్నదో అదే విధంగా చుట్టుముట్టి ఆవరించింది. దాని సన్నిధిని కేవలం ఏమాత్రమైనా అస్పష్టంగా చూడాలన్నా, అనుభూతి పొందాలన్నా, ఏదో ఒక విధం గానో, లేక మరింకే విధంగానో గ్రహించాలన్నా చాలా సుదీర్ఘ మైన సంసిద్ధత ఆవ శ్యకమౌతుంది. అ పనే ఇప్పుడు చేయబడుతున్నది.

CWM 9:158-159

అసలైన పునరుత్థానం

అసలైన పునరుత్థానం అంటే, మా విషయంలో పాతచైతన్యం రాలిపోవడం; అది కేవలం పునర్జన్మ కాని కేవలం పునర్జన్మ మాత్రమే కాదు, హఠాత్తుగా ఒక్కసారిగా జరిగే మార్పు. అది ఎటువంటి దంటే గతాన్ని పూర్తిగా తుత్తునియలు చేసేది, అక్కడ దానిలో నీ పాత ఆత్మకూ, నీ నిమ్న బాహ్యప్రకృతికీ మరణించటం మరియు పూర్తిగా సరికొత్త విధంగా మొదలుపెట్టడానికీ మధ్య ఒక విధమైన అవిచ్ఛిన్నత ఉంటుంది. పునరుత్థానం అనుభవంలో, పాత అస్తిత్వాన్ని విసర్జించే గమనమూ, దాని నుంచి నూతన చైతన్యానికి, నూతన బలశక్తికీ పైకి లేవటమూ ఎంతో దగ్గరగా కలిసి ఉంటుంది; దాని వలన విసర్జించినదాని లోని అత్యుత్తమమైనది., దాని తరువాత వచ్చే, కొత్త సృష్టిలోని దానితో ఐక్యం అవుతుంది. పునరుత్థానం అసలైన ప్రాముఖ్యత ఏమిటంటే దివ్యచైతన్యం కిందికి దిగిపోయి, మరుగున పడిపోయినటువంటి ఎరుక లేని స్థితి నుంచి మేల్కొని, దివ్యచైతన్యం తాను మృత్యువు, అజ్ఞానాంధకారం, అస్పష్టతల ప్రపంచంలోనికి అవరోహించి నప్పటికీ తనకు తాను తిరిగి ఒకసారి తనను గురించిన ఎరుక కలిగిన దవుతుంది. ఆ అస్పష్ట ప్రపంచం మన భౌతికరాత్రి కంటే ఇంకా ఎక్కువ గాడాంధకారమయమైనది. దానిలోకి దూకి తిరిగి రాగలిగితే,

5. జన — ఆనందలోకం

6. తపః — చిత్ — తపోలోకం

7. సత్య — సత్యలోకం

సచ్చిదానంద లోకాలు

CWSA 28:38 శ్రీఅరవిందులు

[1]. ఒక విలేఖరి భారతదేశంలోని ప్రాచీన యోగవిధానంలోని లోకాలకు అనుగుణంగా శ్రీఅరవిందుల యోగవిధానంలోని లోకాలను తెలుపమని శ్రీఅరవిందులను అడిగాడు

— ఎడిటర్

ముకుళమై వున్న అతిమానసం

ప్రశ్న: ప్రియమైన మాతా, ముకుళమైయున్న అతిమానసమనగా నేమి? ముకుళించుకోనటువంటిది ఏ విధంగా ఉంటుందో అది దాని లాంటిదే! అది అటువంటిదే! శ్రీఅరవిందులు చెప్పిన విధంగా, దైవం గనక ప్రతిదాని కేంద్రంలోనూ లేని యెడల, ఆయన ఈ ప్రపంచంలో ఎన్నటికీ అభివ్యక్తమవలేడు; అది అటువంటిదే, ఆయన చెప్పినట్లు, అత్యావశ్యకంగా, దాని మూలంలోను, అత్యంత లోతైన దాని నిర్మాణం లోను, సృష్టి దివ్యం, ప్రపంచం దివ్యం. ఆ కారణంగానే ఈ దివ్యత్వం ఒక రోజు అభివ్యక్తం కాగలుగుతున్నది, స్పృశించబడే విధంగా సుస్పష్టమవుతున్నది, ప్రస్తుతం ముసుగులోను, వక్రీకరించుతూ ఉంటున్నటునంటి దాని నంతటి స్థానంలోను పూర్తిగా తనకు తాను వ్యక్తీకరించుకో గలుగుతున్నది....

దాని సారంలోను, ప్రధాన సూత్రంలోను, నవ్యత అప్పటికే ఆవరించి యున్నది, పాత ప్రపంచంలో అది ముకుళమై యున్నది, కనుక, వాస్తవానికి, అది అక్కడే ఉన్నది, లోపల, దాని పూర్తి అగాధాలలో లోపల, దాగి యుండి, అదృశ్యంగా, అతి సూక్ష్మంగా, అవ్యక్తంగా ఉన్నది, కాని దాని సారంలో అది అక్కడే ఉన్నది. అయినప్ప టికీ, పరమోత్కృష్ట ఉన్నతాల నుంచి అతిమానస చైతన్యం, శక్తి, ప్రకాశం ప్రపంచంలో సూటిగా అభివ్యక్తం కాకపోతే, సంవత్సరం, ఆరు నెలల క్రితం జరిగిన విధంగా, ఈ అతిమానసం, భౌతిక ప్రపంచపు అట్టడుగు పునాదిలో ప్రధాన సూత్రంగా అది ఉన్నా కూడా, దాని కెన్నటికీ తనకు తానుగా అభివ్యక్తమవటం ఏమాత్రం సాధ్యం



ప్రశ్న: వ్యష్టి స్వేచ్ఛను అధిమనస్సు గౌరవిస్తుందని మీరు నిన్న చెప్పారు. అలా అతిమనస్సు చేయదనే సూచన మీరు చెప్పిన దానిలో వుందా?

సమా: అవును వుంది. అది (అతిమనస్సు – అను) దైవికమైన పరమ సత్యాన్ని, వస్తువుల సత్యాన్ని మాత్రమే గౌరవిస్తుంది.

నిరోద్ బరన్‌తో ఉత్తరప్రత్యుత్తరాలు: పుట 327

అత్యంత దుర్గ్రాహ్యమైన రాత్రి కాంతివంత మవుతున్నట్లుగా, దివ్యచైతన్యం యొక్క అసలైన దివ్యప్రకాశం వెనుకకు మరలి వస్తున్నట్లుగా, ఏ అస్పష్టతా లేని అతిమానస ప్రకాశంలాగా నీవు చూస్తావు. భౌతిక సూర్యుడు నీకు నల్లగా కనపడతాడు కాని ఆ పరమోత్కృష్ట గాడాంధకార అగాథాలలో సైతం పరమోత్కృష్ట ప్రకాశం దాగి వుంది. నీలో ఆ ప్రకాశం, ఆ చైతన్యం మేల్కొనును గాక, గొప్ప పునరుత్థానం అచట జరుగును గాక.

CWM 3:147 శ్రీమాత

అనువాదం డా. త్రిపురారిభట్ల ప్రసన్న కృష్ణ

ఆధ్యాత్మికం: అతిమానసికం

అతిమనస్సు, అతిమానసికం, అనే పదాలను మొట్టమొదట నేనుపయోగించాను. కాని అప్పటి నుంచి జనం వాటిని పట్టుకొని మనస్సుకు పైన వుండే ప్రతిదానినీ అతిమానసికం అంటున్నారు.

*

ఉన్నత మనస్సు, ప్రకాశ మనస్సు, అంతఃస్ఫూర్తి మనస్సు, అధిమనస్సు, అతి మనస్సు అనేవి ఉన్నత భూమికలు. అంతరాత్మికం, మనస్సు, ప్రాణికం, భౌతికం, సాధారణ సృష్టికి సంబంధించినవి.

CWSA 28:144,158

మనిషి పురోగతి

మనిషి విశాలం గావడమంటే నూతన జన్మ లెత్తడం. ఆకాంక్షించే భౌతికజీవి తనను తాను వత్తిడి చేసుకొనే ప్రాణిక మానవునిగా అవుతాడు. తరువాత అతడు సూక్ష్మ మానసిక, అంతరాత్మిక జీవిగా తనను తాను మార్పు చెందించుకొంటాడు. ఈ సూక్ష్మ ఆలోచనాపరుడు, విశాలమైన బహుముఖమైన విశ్వ మానవునిగా యెదిగి, తన పార్శ్వా లన్నింటినీ, పరమ సత్యం నుండి తనలోనికి ప్రవహించే ప్రవాహాలకు తెరచి పెడ్తాడు. విశ్వాంతరాత్మ, తన కార్యసిద్ధిలో యింకా పైపైకి పోతూ ఒక

ఆధ్యాత్మిక మానవునిలా ఉన్నత శాంతి, ఆనందం, సామరస్యతల కోసం పెనగు లాడుతుంటాడు. ఇవి ఆర్యజాతికి సంబంధించిన అయిదు నమూనాలు లేక వర్గాలు. ఇందులో ప్రతి ఒక్కటీ మొత్తం మానవ స్వభావంలో, తన స్వంతమంటూ ఒక ప్రత్యేక పరగణాను, స్థాయిని ఆక్రమించి వున్న ఒక గొప్ప సమాజం అయింది, కానీ వీటన్నిటినీ జయించుకుంటూ ఆవలకు దాటిపోయి అతీతుడై వాటి నన్నింటినీ సమరసం చేయగలిగి వుండే ఒక పరిపూర్ణ ఆర్యజాతిలా వుంది. ఈ మహనీయ ఆంతరిక రూపమార్పిడికి ఉపకరణం అతిమానసిక సత్యం. అది మనస్తత్వాన్ని తొలగించి దాని స్థానంలో ప్రకాశమయ దృష్టిని, వేల్పుల నేత్రాన్ని నిలుపుతుంది. మర్త్యజీవితం స్థానంలో అనంత సృష్టి క్రియాశక్తి, శ్వాసలను నిలుపుతుంది. అజ్ఞానం, మృత్యు వశవర్తియైన పదార్థం స్థానంలో స్వేచ్ఛామయ అమృత సచేతన — అస్తిత్వాన్ని నిలుపుతుంది. కాబట్టి, కర్మ, అనుభవాల సమస్త కంపనాలను తట్టుకొని నిలబడగల ఒక బలీయమైన వీర్యశక్తి లోనికి, ఒక స్వచ్ఛమైన మానసిక, అంతరాత్మిక పరిశుద్ధత లోనికి, అతడు తనను తాను విశాలం చేసుకోవడం అనేవి, మనిషి ప్రప్రథమ పురోగమనం అయ్యి తీరాలి. తరువాత యీ మానవ వెలుగు, శక్తి, ఒక అనంత పరమ సత్యం, అమృత దివ్యేచ్ఛ లోనికి తనను మించి తాను యెదిగి, రూపమార్పిడి జరుపుకోవాలి

*

అతిమనస్సు: సృష్టి అంతస్తులు

సచ్చిదానంద అంతస్థులకు, నిమ్న సృష్టికి మధ్య అతిమనస్సు వున్నది. అది దైవచేతన, తనకు తానే నిర్దేశించుకొనగల పరమ సత్యం దాని స్వంతం, అలా వుండడం పరమసత్యసృష్టికవసరం. మనః, ప్రాణ, దేహాలకు సంబంధించిన దానితో గూడా సచ్చిదానందాన్ని నిజం చేసుకోవచ్చుననే మాట నిజమే , కాని అప్పుడది అచలమై వుండి, నిమ్నప్రకృతి కాధారంగా వున్నదానిలా మాత్రమే వున్న యేదోగానే గాని, దానిని రూపాంతరీకరించేదిగా సాక్షాత్కారించదు. అతి మనస్సు ఒక్కటే నిమ్న స్వభావాన్ని రూపాంతరీకరించగలదు.

ఆధ్యాత్మికం, అతిమానసికం ఒకటిగాదు. ఉన్నతమనస్సు నుండి, అధిమనస్సు వరకూ గల ఆధ్యాత్మిక అంతస్తులు, పాతసాధనలకు అందుబాటులో వుంటాయి. గనుక యే యిబ్బందీ వుండదు. అవి గనుక అలా అందుబాటులో వుండి వుండక పోయినట్లైతే ప్రాచీన భారతంలో యే యోగమూ వుండి వుండేదిగాదు, యే యోగులు వుండి వుండేవారు గాదు.

*

నా పాఠకులు ఊహించుకుంటారని నీవు చెప్తూ వున్నట్లు ఆధ్యాత్మికం, అతిమానసికం ఒక్కటే అయివుంటే, అప్పుడు అన్ని కాలాలలోని ఋషులు, భక్తులు, యోగులు, అందరూ అతిమానసిక జీవులై వుండేవారు. నేను అతి మనస్సును గురించి వ్రాసినదంతా అనవసరమైనదిగా, నిరుపయోగమైనదిగా, నిరర్థకమైనదిగా అవుతుంది. ఆధ్యాత్మిక అనుభవాలు కలిగిన యే వ్యక్తైనా అప్పుడు ఒక అతిమానసిక జీవే అవుతాడు. ఆశ్రమమంతా అతి మానసిక జీవులతో ఊపిరి సలుపనంతగా కిటకిటలాడిపోతూవుండేది. భారతదేశంలో ప్రతి ఆశ్రమమూ గూడా అలాగే వుండి వుండేది. ఆధ్యాత్మిక అనుభవాలు ఆంతరిక చేతనలో తమనుతాము స్థిరం చేసుకొంటాయి. ఆంతరికచేతనను మారుస్తాయి. నీవు యిష్టపడితే దానిని రూపాంతరీకరిస్తాయి. దైవాన్ని ప్రతిచోటా, ఆత్మలో అన్నింటినీ, అన్నింటి ఆత్మ లోనూ, సమస్తాన్నీ చేస్తున్నది విశ్వజనీన మహాశక్తియేననే సాక్షాత్కారం యెవరైనా పొందవచ్చు. విశ్వాత్మలో, లేక పారవశ్యంకలిగించే భక్తిలో లేక ఆనందంలో లీనమైపోయినట్లనుభూతిని యెవరైనా పొందవచ్చు. కాని యింకా ప్రకృతికి సంబంధించిన బాహ్య చురుకైన భాగాలలో, బుద్ధితో లేక మహా అయితే అంతః స్ఫూర్తి మనస్సుతో ఆలోచిస్తూ, మానసిక సంకల్పంతో సంకల్పిస్తూ, ప్రాణిక ఉపరితలంమీద ఆనంద విషాదాలను సంవేదిస్తూ జీవన సంగ్రామంలో భౌతిక కష్టాలూ, బాధలూ అనుభవిస్తూ, దేహంలో మృత్యువు, అస్వస్థతలతో సంఘర్షిస్తూనే అతడు జీవితాన్ని మామూలుగా సాగిస్తూండవచ్చు. అప్పుడుండే మార్పల్లా, చికాకు పడకుండా, లేదా భ్రమకు లోనుగాకుండా ఆంతరిక ఆత్మ-సంకల్పంతో, ఒక పరిపూర్ణ సమతతో జరిగింది ప్రకృతికి సంబంధించిన అనివార్యభాగంగా స్వీకరిస్తూ, కనీసం ప్రకృతినుండి ఆత్మలోనికి వుపసంహరించుకోనంత కాలం, అనివార్యమని భావించి,

స్వీకరిస్తూండడమొక్కటి మాత్రమే. నేను దర్శించే రూపాంతరీకరణ అదిగాదు. అది జ్ఞానానికి సంబంధించిన మరో ప్రకాశమయ స్వభావం, అతి మానసిక పరివర్తన వల్ల ప్రాప్తించే భౌతిక చేతన మరో తత్వం.

*

(సర్వ వ్యాపకమైవున్న) దైవంతో సంపర్కం వల్ల, లేదా బాహ్యాచలనాలతో స్పర్శించబడని ఆంతరంలోని పరిశుద్ధమైన ఆత్మదర్శనంవల్ల ఆధ్యాత్మిక సాక్షాత్కారాన్ని యే అంతస్తు మీదైనా పొందవచ్చు. అతిమనస్సు, అతీతమైన దానికి సంబంధించినది, ఇంతవరకు యిక్కడలేని ఊర్ధ్వంలోవున్న దాని నుండి క్రిందికి తీసుకురావలసివున్న ఒక క్రియాశీల పరమసత్య చేతన.

CWSA 28: 274

ఉన్నత మానసిక స్థాయిలు, అతి మనస్సు:

ప్రశ్న: కొన్ని సమయాలలో శాస్త్రవేత్తలు మానసిక అంతస్తులు దాటి పోలేరా? హేతుత్వానికి సంబంధించిన యే ప్రక్రియద్వారానో గాకుండా ఒక రకమైన ఆకస్మిక అంతఃప్రేరణద్వారా, ఐన్‌స్టీన్, తన సాపేక్ష సిద్ధాంతాన్ని కనుగొన్నాడని చెప్తారు. ఆ అంతఃప్రేరణకు, అతి మనస్సుకు యేదైనా సంబంధంవుందా?

సమాధానం: ఒక నూతన సత్యాన్ని బహిరంగపరుస్తూ వచ్చే ప్రేరణను పొందిన శాస్త్రవేత్త, దానిని అంతః స్ఫూర్తి మనస్సు నుండి పొందుతాడు. అంతకంటే యింకా బాగా పైనవున్న మరో వెలుగుతో ప్రకాశవంతం చేయబడిన ఉన్నత మానసిక అంతస్తునుండి అందిన ప్రత్యక్ష అవగాహనతో జ్ఞానం లభిస్తుంది. కాని అతిమనస్సు చర్యకు యిటువంటి దానంతటికీ యేమీ సంబంధంలేదు. ఈ ఉన్నత మానసిక స్థాయికి అతిమానసిక స్థాయికి మధ్య యెంతో దూరం వుంది. సగటు స్థాయినుండి కొద్దిగా పైకి వెళ్ళగానే పూర్తిగా దివ్యమైన సీమలలోనికి యెగబ్రాకినట్లు మనుష్యులు నమ్మడానికి తేలికగా మొగ్గుచూపుతారు. సాధారణ మానవమనస్సుకు అతిమనస్సుకు మధ్య అనేక దశలు, అనేక శ్రేణులు, మధ్యలో చొరబడుతుండే అనేక అంతస్తులూ వున్నాయి. ఒక సాధారణ మనిషి యీ మధ్యంతర అంతస్థుల్లో ఒకదానితోనైనా ప్రత్యక్ష సంబంధంలోకొస్తే, అతని కళ్ళు చెదరిపోయి, గ్రుడ్డివాడౌతాడు, దాని అపరిమేయమైన భారంక్రిందపడినలిగిపోతాడు, లేదా సమతూకాన్ని

కోల్పోతాడు. అయినప్పటికీ అది అతిమనస్సు కాదు.

*

వైశ్వస్మృతి: అతిమనస్సు:

ఒక యోగి సమస్త విషయాలనూ తెలుసుకోగలడనీ, సమస్యలన్నింటికీ పరిష్కారం చూపగలడని అనుకొనే సామాన్యభావన వెనుకగల అసలు వాస్తవమేమిటంటే, ప్రతి విషయానికీ సంబంధించిన స్మృతి నిలువచేయబడి, యెల్లప్పుడూ అది నిలిచి వుండే ఒక అంతస్తు మనస్సులోవున్నది. భూలోక జీవితానికి సంబంధించిన సమస్త మానసిక కదలికలు జ్ఞాపకాలుగా మారి యీ అంతస్థులో నమోదై వుంటాయి. అచటకిపోగలిగిన శ్రమ పడదలచుకుంటే, వాళ్ళు యెన్నుకొన్న దానితో చదవవచ్చు, తెలుసుకొనవచ్చు, కాని యీ పరిగణను, అతిమానసిక స్థాయిగా పొరపడకూడదు. అచటకు చేరడానికి కూడా అతడు పదార్థ సంబంధం లేక భౌతిక మనస్సు కదలికలను నిశ్చల నీరవం చేయగలిగి వుండాలి. యింద్రియసంవేదనలన్నింటినీ ప్రక్కనబెట్టాలి. సాధారణ మానసిక కదలిక లన్నింటినీ, అవెట్టివైనా నిలిపివేయ గలగాలి, ప్రాణికం నుండి బయటపడాలి, దైహిక బానిసత్వం నుండి తనకు తాను స్వేచ్ఛ పొందాలి. అప్పుడు మాత్రమే అతడా పరగణాలలోనికి ప్రవేశించి చూడగలడు. ఈ కృషి చేయడానికి చాలినంత ఆసక్తి వుంటే అచటికి చేరి భూమి స్మృతిలో యేం వ్రాసివుందో చదువగలుగుతాడు.

మానసికపథకం: అతిమనస్సు:

నీవు నిశ్చల నీరవత లోతులలోనికి పోయినట్లైతే, నీ ప్రశ్నలన్నింటికీ సమాధానాలు స్వీకరించడం అసాధ్యంకాని ఒక చేతనా స్థాయికి చేరుకొంటావు. అతి మనస్సుకు సంబంధించిన సమగ్ర సత్యానికి గనుక యెవరైనా తెరచుకొని వుండి దానితో నిరంతర సంపర్కం కలిగి వుంటే సమాధానం పొందగల అర్హత గల ప్రశ్నలకు అతడు అతి మానసిక వెలుగునుండి తప్పక సమాధానం యివ్వగలడు. వస్తువుల వెనుక వుండే యదార్థత, సత్యతల కొంత భావం ప్రశ్నలలో వుండాలి. కేవలం మానసిక అమూర్త భావాలతోనూ లేక వస్తువుల భ్రమాత్మక ఉపరితలంమీద కదలాడే వాటితోనూ అల్లి బిల్లిగా అల్లుకొన్న సాలెగూడు లాంటివైన అనేక ప్రశ్నలు, యెంతో

చర్చకు గురైన సమస్యలు అనేకం వున్నాయి. ఇది యదార్థజ్ఞానానికి సంబంధించినవి కావు, అవి జ్ఞాన వికృతులు. వాటి మూలద్రవ్యమే అజ్ఞానం. మనస్సు యొక్క అజ్ఞానం సంధించే ప్రశ్నలకు అతి మానసికజ్ఞానం, ఒక సమాధానాన్ని తన స్వంత సమాధానాన్ని తప్పకుండా యివ్వవచ్చు, కాని మానసిక స్థాయినుండి ప్రశ్నలు అడిగేవారికి అవి యేమాత్రం సంతృప్తి కలిగించక పోవచ్చు, లేక వారికి అర్థంగానివిగా వుండవచ్చు. మనస్సు పద్ధతిలో అతి మనస్సు పనిచేయాలని ఆశించవద్దు. సత్యంలోని జ్ఞానం, అజ్ఞానంలోని మిడిమిడి జ్ఞానంతో తనను కలుపుకొని ఒకటిగా అవ్వగలగాలని అభ్యర్థించవద్దు. మనస్సు పథకం ఒక రకంగా వుంటుంది, కాని అతిమనస్సు పూర్తిగా వేరు. మానసిక పద్ధతి అవసరాలకు అనుగుణంగా తనను తాను సంస్కరించు కుంటే అది ఎంతమాత్రం అతి మానసికం కాలేదు. ఆ రెండింటికీ పొసగదు, వాటిని కలిపి ఉంచలేము.

C.W.M 3: 94 - 95

అతిమనస్సు: అధిమనస్సు

శ్రీఅరవిందుల మహాకార్యం ఒక అనుపమానమైన పృధ్వీ-రూపాంతరీకరణం. మనస్సుకుపైన, సచేతన అస్తిత్వపు అనేక అంతస్తులున్నాయి. వాటిలో నిజంగా యేది దివ్యమైన లోకమో, దానిని, ఆ సత్యలోకాన్ని శ్రీఅరవిందులు అతిమనస్సు అన్నారు. కాని యీ మధ్యలో, వారు అధిమనస్సుగా, విశ్వదేవతల లోకంగా గుర్తించబడిన లోకం వుంది. ఇదిగో యీ అధిమనస్సే యిప్పటి వరకూ మన ప్రపంచాన్ని పాలిస్తూ వచ్చింది. ప్రకాశిత చేతనలో మనిషి యెదిగి చేరుకొనగల అత్యున్నత చేతనా స్థాయి యిది. దానినే పరాత్పరుడగు దైవంగా భావించారు. దానిని చేరుకొన్న వారందరూ తాము యథార్థమైన పరమాత్మను చేరుకొన్నామనే విషయాన్ని క్షణం పాటు కూడా సంశయించ లేదెన్నడూ. ఎందుకనంటే సాధారణ మానవ చేతనకు దాని వైభవాలు మకుటాయమానమైన సత్యత చివరకు యిక్కడ వున్నది అని నమ్మగలిగేటట్లు పూర్తిగా కళ్ళు చెదరి, దిగ్భ్రమకు గురి చేసేటట్లుం టాయి. అయినప్పటికీ వాస్తవమేమిటంటే, యదార్థ దైవానికి చాలా చాలా దిగువున వుంది అధిమనస్సు. అది పరమ సత్యపు అధికార నివాసం కాదు. అది రూపకర్తల పరగణా, మానవ చరిత్ర మొదలైనప్పటి నుండీ, యెవరికైతే మానవులు మోకరిల్లు

తూండేవారో, సృష్టి చేయు ఆ శక్తులు, వేలుపులు వుండే పరగణా అది. యధార్థ దైవం యెందుకని స్వీకరించి భూస్వభావాన్ని రూపాంతరీకరించ లేదు అనే ప్రశ్నకు సరైన సమాధానం, కారణం, అధిమనస్సునే అతిమనస్సుగా పొరపడడం. విశ్వ దేవతలు పూర్తిగా పరమ సత్య-చేతనలో జీవించరు, వారు దానితో సంపర్కంలో మాత్రమే వుంటారు. ప్రతి ఒక్కరు దాని వైభవాలలో ఒక పార్శ్వానికి ప్రాతినిధ్యము వహిస్తారు.

ప్రపంచ చరిత్రలో అతిమనస్సు కూడా పనిచేసిందనడంలో సందేహం లేదు, కాని, అదెప్పుడూ అధిమనస్సు ద్వారానే పని చేసింది. అది పూర్తిగా పరమాత్మ నియమాల ననుసరించి జీవితాన్ని తిరిగి సృజించ గలిగింది కేవలం అతిమానసచేతన, శక్తుల సరాసరి అవతరణ మాత్రమే. ఎందుకనంటే మనం మనుగడ సాగిస్తున్న యీ నిమ్న, మనఃప్రాణదేహాల త్రివిధ ప్రపంచం ప్రారంభం కావడానికి అనుకూలించిన సంభావ్యతల క్రీడ అప్పటికే అధిమనస్సులో వుంది. ఎప్పుడైనా పరమాత్మ అంతర్నిహిత, పరమ సత్యపు, అన్య ప్రమేయం లేని, దోషరహిత కార్యనిర్వహణకు బదులు యీ క్రీడ వుంటుందో, అప్పుడు కృతకత్వం, అజ్ఞానాల బీజం పడుతుంది. అలా అని అధిమనస్సు అజ్ఞాన క్షేత్రం అని కాదు దానర్థం. విభజించడం కోసం గాక పోయినప్పటికీ ఒక ప్రత్యేకత కోసం చూచే వస్తువుల పరమ సత్యం నుండి ప్రక్కదారి పట్టే అవకాశం గల సంభావ్యతల క్రీడకై ఊర్ధ్వానికీ, నిమ్నానికీ మధ్య వున్న సరిహద్దు రేఖ అది. అందుచేత దివ్యస్వభావం లోనికి మానవజాతిని రూపాంతరీకరించే శక్తి అధిమనస్సుకు స్వతహాగా లేదు, దాని అధీనంలో కూడా లేదు. దానికి యేకైక ప్రభా వవంతమైన ప్రతినిధి అతిమానసికమే. గతంలో జీవితాన్ని ఆధ్యాత్మికం చేయడానికి జరిగిన ప్రయత్నాలకు, మన యోగానికి వున్న అసలైన భేదమేమిటంటే, అధిమనస్సు వైభవాలు అత్యున్నత సత్యత కాదని, మనస్సుకు, యధార్థ దైవానికి మధ్య వున్న ఒక మధ్యంతర మెట్టు అని మనం తెలుసుకోవటం.

CWM 3:173-74

అతిమానస సాక్షాత్కారం

చేతన అనేది ఒక నిచ్చెనలా వుంటుంది. గొప్ప సంఘటన జరిగిన ప్రతి సమయంలోనూ, సాధారణ చేతన యెన్నడూ చేరనటువంటి చోటికి చేరే మరొక

మెట్టుకు ఆ నిచ్చెనకు జత చేయగల గొప్ప వ్యక్తి ఒకడుండి వున్నాడు. ఉన్నత స్థాయిని పొంది, పదార్థ చేతన నుండి పూర్తిగా ముక్తుడై పోవడం సాధ్యమే. కాని అప్పుడతడు ఆ నిచ్చెనను వుంచుకోడు. అయినా జగత్తుకు సంబంధించిన గొప్ప సంఘటనలు సాధించిన ఘనకార్యం, భౌతిక జగత్తుతో సంబంధాన్ని కోల్పోకుండానే ఆ నిచ్చెనకు మరో మెట్టును జత చేయగలగడం, అంటే ఉన్నతోన్నతమైన దానిని చేరడం, చేరిన సమయంలోనే, రెండు భిన్న స్థాయిల మధ్య సంబంధం లేకుండా చేసే ఒక విధమైన ఖాళీకి బదులు, శిఖరాన్ని మూలంతో కలుపగల సామర్థ్యం అన్న మాట. పైకి, క్రిందకు వెళ్ళి వస్తూండడం, శిఖరానికి, మూలానికి సంబంధం యేర్పరచడం, సాక్షాత్కారపు మొత్తం రహస్యం, అదే అవతార కార్యం. ఆతడు నిచ్చెనకు మరో మెట్టును జతచేసిన ప్రతిసారీ భూమి మీద ఒక నూతన సృష్టి జరుగుతుంది.... ఇప్పుడు జతచేయబడిన మెట్టును శ్రీఅరవిందులు అతిమానసం అన్నారు. తత్ఫలితంగా, చేతన అతిమానస లోకం లోనికి ప్రవేశించ గలుగుతుంది, అయినప్పటికీ తన వ్యక్తిగత రూపాన్ని, తన వ్యష్టిత్వాన్ని నిలబెట్టుకొని, యిక్కడ నూతన సృష్టిని ప్రతిష్టించ దిగి రాగలుగుతుంది. ఇదే చివరి మెట్టు కాదనేది యథార్థమే. అస్తిత్వానికి సంబంధించి అనేక శ్రేణులు యెంతో దూరాన వున్నాయి, కాని ప్రపంచాన్ని తిరిగి వ్యవస్థీకరించడానికి, ప్రపంచాన్ని తిరిగి యధార్థమైన దివ్య క్రమబద్ధతలోనికి తీసుకురావడానికి యిప్పుడు మనం అతిమానసాన్ని క్రిందికి తీసుకొచ్చే పనిలో వున్నాం. సారతః ఒక క్రమబద్ధతను సృజించడానికి ప్రతిదాన్ని యదార్థ స్థానంలో వుంచడానికి యిప్పుడు పనిచేస్తున్న ప్రధానమైన క్రియాశక్తి, మహాశక్తి, పరిపూర్ణ వ్యవస్థీకరణకు అధిదేవతయైన మహాసరస్వతి .

పైకి, క్రిందకు రాకపోకలు జరుపుతూ, పైనున్న దాన్ని పదార్థంలోనికి అవిచ్ఛిన్నంగా తీసురావడానికి పదార్థంలో అనుమతిని సాధించే కార్యం చేతనలోనే జరుగుతుంది. దానిని చేయడానికి ఉద్దేశించబడినవాడు అవతారం. అతడు చెరలో బంధించబడినప్పటికీ, యెవర్నీ చూడనప్పటికీ, ఎన్నడూ బయటకు కదలనప్పటికీ, అతడా పనిని చేస్తునే వుండగలడు. ఎందుచేతనంటే అది చేతనలో జరిగే కార్యం, అతి మనస్సుకు, పదార్థ అస్తిత్వానికి మధ్య సంబంధాన్ని యేర్పాటుచేసే కార్యం. అందుకతనకి యే విధమైన గుర్తింపు అవసరంలేదు. యీ సచేతన సంబంధాన్ని స్థిరంగా యేర్పాటు చేయగలగడానికి బాహ్యంలో అతనికి అధికారం అవసరంలేదు.

ఏ విధంగా నైనప్పటికీ ఒకసారి యీ సంబంధం యేర్పడితే ఒక నూతన సృష్టి రూపంలో, ఒక నమూనా నగరంతో ప్రారంభమై, ఒక పరిపూర్ణ ప్రపంచంతో సమాప్త మయ్యే బాహ్య రూపంలో దాని ప్రభావం బహిర్గతమౌతుంది.

CWM 3:178-79

అతిమానస అవతరణ

"విజయోపేతమైన భవిష్యత్తు" పుష్పాన్ని నీ కిచ్చినప్పుడు దాని విశిష్టతేమిటో గ్రహించావా? అతిమానసం లోక అవతరణలో నీవు పాలు పంచుకొంటావనే ఆశను కాదు, వాగ్దానాన్ని సైతం అది సూచిస్తోంది. ఎందుకనంటే మన కార్య లక్ష్యసిద్ధి విజయవంతమైనదని ఆ అవతరణ తెలియజేస్తుంది. దాని పూర్ణవైభవం యిప్పటికీ బయటపడలేదు. పడివుంటే, మొత్తం పృథ్వీజీవన ముఖచిత్రమే భిన్నంగా వుండి వుండేది. కొద్దికొద్దిగా, నెమ్మది నెమ్మదిగా అతిమానసం తన ప్రభావాన్ని చూపిస్తోంది. అస్తిత్వంలోని ఒకభాగం యిప్పుడు మరోభాగం తరువాత, దాని దివ్యత్వ స్పర్శను, ఆలింగనాన్ని సంవేదిస్తున్నది. దానికి స్వతహాగా వున్నశక్తి అంతటితోనూ అది క్రిందికి దిగివస్తే, ఒక మహోత్కృష్ట సమూలమార్పుకు (జగత్తును)లోను చేసేది. దాని సంపూర్ణవిజయం సిద్ధించే ఘడియ దగ్గర దగ్గరగా మనం కదులుతున్నాం. ఒకసారి గనుక ప్రపంచపరిస్థితులు తగినవిధంగా తయారైతే అంతకు ముందున్న వాటన్నింటిని భరిస్తూ, పూర్ణ అవతరణ జరుగుతుంది. పొరపడవీలులేని దాని సన్నిధి, దాని క్రియాశక్తి యే నిరోధాన్ని సహించదు. సందేహాలు, యిబ్బందులు నిన్ను యిక నెంతమాత్రమూ బాధించవు. ఎందుకనంటే తన సంపూర్ణ పరిపూర్ణతను తెర తొలగించి చూపుకుంటూ దైవం అభివ్యక్తమై నిలుస్తాడు. మొత్తం ప్రపంచమంతా ఒకే క్షణంలో ఆ సన్నిధిని సంవేదించడం లేక రూపాంతరీకరించబడడం జరుగుతుందని కాదు నా వుద్దేశ్యం.

మానవజాతిలో ఒకభాగమైన, మన యీ చిన్ని ప్రపంచం (ఆశ్రమం అని అమ్మ వుద్దేశ్యం) లోని వారు దాని నెరిగి దాని అవతరణలో పాలు పంచుకొంటారనేదే నా ఉద్దేశ్యం. అచటినుండి రూపమార్పిడి చెందించే దైవకృపకు అత్యంత ప్రభావ వంతంగా బాహ్య ప్రపంచం పై ప్రసరిస్తుంది. ప్రతి స్పందనలేని మానవ స్వభావం దాని దారిలో కలిగించే ఆటంకాలను అన్నింటినీ అధిగమించి, ఆ విజయోపేతమైన

భవిష్యత్తును అదృష్టవశాత్తు ఆకాంక్షాపరులకు సాకారమౌతుంది.

CWM 3:180 *సంభాషణలు 1929-1930*

పూర్ణదైవం

అధిమనస్సుచే, విడివిడిగా అభివ్యక్తం చేయబడిన దైవం పార్శ్వాలు, సృష్టి పార్శ్వాలు అనేకం వున్నాయి. భిన్నపార్శ్వాలు, భిన్న మనస్సులను ఆకర్షిస్తాయి. ప్రతి దానికీ తన స్వకీయ మార్గాన్ని, లక్ష్యాన్ని అనుసరించే స్వేచ్ఛ వుంది, మరో దానికి బంధింపబడలేదు. ఏ పూర్ణదైవంలో సమస్త పార్శ్వాలూ కలిసిపోయి అధి మనస్సుకంటె ఊర్ధ్వాన వున్నదో అది అతిమనస్సు అని దాని నిర్వచనాన్ని బట్టి తెలుసుకోవచ్చు. తమ ధ్యాస మరెక్కడో వుండి వున్నవారికి వారి మానస చేతనను అన్వేషించాలనే ఒత్తిడి వుండదు.

సృష్టి సంక్లిష్టమైనది. అనేక స్థాయిలకు చెందిన జీవులు అందులో వున్నాయి. నిర్వాణం ద్వారా దైవంలో లీనమై పోవాలని ఒక అంతరాత్మ అభిలషిస్తే లేక దేవతల లోకంలో, వైకుఠంలేక గోలోకంలాంటి లోకాల్లో ఆధ్యాత్మిక ప్రయోజనం పొందాలని కాంక్షిస్తే అలా చేయడానికి తన వైఖరి ననుసరించడానికి దానికి పూర్తి స్వేచ్ఛ వుంది.

భూమిమీద ఆధ్యాత్మిక పరిణామానికి అతిమానస ఆవిష్కరణ అతిముఖ్యం. కాలక్రమంలో యిక్కడ అంతరాత్మలు దానిని చేరాలంటే దానినన్వేషించడానికి దైవమే వాటిని పరిణమించజేస్తాడు. అందులో సందేహం లేదు. సరాసరి, తిన్నగా లేక ఒకే దారిలో అవే దశల ద్వారా దానివైపు పురోగమించడం ద్వారా అందరూ దానిని చేరాలని బలవంతపెట్టేదేదీలేదు. మరో మార్గం వెంట వెళ్ళి మధ్యాంతర, పాక్షిక ప్రయోజనంతో సంతృప్తి చెందడం వాళ్ళకు వీలుపడుతుంది. అది వాళ్ళ భవిష్యత్తై వుంటే యింకా దూరాన వున్న అతి మానస స్థాయికి చేర కృషి చేయడానికి తిరిగి రావచ్చు.

CWM 28:274-75

పాత ఆధ్యాత్మిక భావాలు: రూపాంతరీకరణ

ఎప్పుడైనా మనం విజయం సాధించినప్పుడు, మనం చేసేది ఆరంభమే



అతిమానసాన్ని భూమికోసం, భూమిపై జన్మించిన అంతరాత్మల కోసమేగాని నాకోసం నేను కావాలనుకోవడంలేదనేది యదార్థం. కాబట్టి మరెవరైనా అతిమానసాన్ని కావాలనుకుంటే నాకేం అభ్యంతరం లేదు. కాని అందుకు షరతులు యివి. అతడు ఆ మార్గం మీద దైవేచ్ఛను మొదట కోరాలి. అంతరాత్మ సమర్పణను, ఆధ్యాత్మిక సాక్షాత్కారాన్ని(కర్మ, భక్తి, జ్ఞాన, ఆత్మ, సిద్ధి ద్వారా) పొందాలని కోరుకోవాలి.... ఆకాంక్షను నిలుపుకోవటానికి మొదట కావలసింది కేంద్రీయ చిత్తశుద్ధి — ఆ ఆకాంక్ష నెరవేరటానికి ఒక సంపూర్ణ చిత్తశుద్ధి అవసరం.

శ్రీఅరవిందులు

స్వేచ్ఛానువాదం: కె.వి. రావు

అవుతుంది గాని అంతం అవ్వదు. భువిపై ఒక నూతన చేతన కదొక పునాది. అనంతంగా అభివ్యక్తమయ్యే సంభావ్యతలున్న చేతన అది. ఈ సృష్టి లోనే శాశ్వత పురోగతి వున్నది గాని దాని కావల పురోగతి లేదు.

చేతి తొడుగునుండి అంతరాత్మ విమోచనమే లక్ష్య మైనట్లైతే, అప్పుడు అతి మానసీకరణతో అవసరంలేదు. ఆధ్యాత్మిక ముక్తి, నిర్వాణం చాలు. అతి భౌతికస్థాయిల లోనికి లేవడం గనుక లక్ష్య మైనట్లైతే అప్పుడు గూడా అతిమానసీ కరణంతో అవసరం వుండదు.

ఏ స్వర్గం లోని కతడు ప్రవేశించాలనుకొంటున్నాడో ఆ స్వర్గాధిపతికి అంకితం గావడం ద్వారా అందులోనికి ప్రవేశించవచ్చు. అయితే అందులో పురోగతి లేదు. ఇతర లోకాలు, నమూనా లోకాలు, ప్రతీదీ తన స్వకీయ వర్గానికి, నమూనాకు, ధర్మానికీ స్థిరంగా కట్టుబడి వుంటుంది. పరిణామం జరిగేది భూమిమీదే, అందుచేత పురోగతికి సరైన క్షేత్రం భూమియే. ఇతర లోకాల జీవులు ఒక లోకంనుండి మరో లోకంలోనికి పురోగమించలేవు. తమ స్వకీయ నమూనా కవి కట్టువడి వుండిపోతాయి.

*

శుద్ధాద్వైత వేదాంతి, సర్వం బ్రహ్మం, జీవితం ఒక కల, అసత్యం, ఉన్నది కేవలం బ్రహ్మమే అంటాడు. మనిషికి ముక్తి, నిర్వాణం, రెండేవున్నాయి గనుక దేహ పతనం వరకే అతడు జీవించి వుంటాడు. ఆ తరువాత జీవితమనేదేదీ వుండదు అంటాడు.

వాళ్ళకు రూపాంతరీకరణంలో నమ్మకం లేదు. ఎందుకనంటే మనో ప్రాణ దేహస్ఫూర్తి, ఒక అజ్ఞానం, ఒక భ్రమ, ఉన్నది ఒకే ఒక సత్యత, రూపరహిత, బాంధవ్య రహిత, ఆత్మ లేక బ్రహ్మం. జీవితం బాంధవ్యాలమయం. పరిశుద్ధఆత్మలో సమస్త జీవితం, బంధాలు, బాంధవ్యాలు అన్నీ అదృశ్యమౌతాయి. (ఎంతగా రూపాంత రీకరించబడినా) అది భ్రాంతికన్నా మరొకటి కాలేనప్పుడు ఆ భ్రాంతిని రూపాంత రీకరించి నందువల్ల ప్రయోజనమేమిటి? అసలలా రూపాంతరీకరించడం సంభవమా? వాళ్ళకు "నిర్వాణ జీవితం" అనేటటువంటిదేం లేదు. అజ్ఞానాన్ని, జ్ఞానంగా రూపాంత రీక రించడం తప్ప, తక్కిన మెటువంటి రూపాంతరీకరణనైనా లక్ష్యంగా చేసుకొన్న కొన్ని ప్రయోగ విధానాలు మాత్రమే వున్నాయి. రూపాంతరీకరణను అనేక రకాలుగా అర్థం చేసుకొంటారు. కొన్ని సమయయాల్లో ఒక దివ్యజ్ఞానంగా, లేక శక్తిగా లేకపోతే

ఒక దివ్య పరిశుద్ధతగా, లేక ఒక నైతిక పరిపూర్ణతగా లేక దివ్యప్రేమగా అర్థం చేసుకొంటారు.

*

స్వభావమార్పునకు అంగీకరించని అవిద్య కుండే వ్యతిరేకతను అధిగమించాలి. దాని నధిగమించగలిగితే, అపుడు పాత ఆధ్యాత్మిక భావాలు ఒక అడ్డంకి అవ్వలేవు. మానవజాతినంతా అతిమానసీకరించాలని గాదు ఉద్దేశ్యచింది. కాని పృథ్వీ పరిణామంలో అతిమానస చేతన సూత్రాన్ని ప్రతిష్టించడం. అది జరిగితే స్వయంగా అతిమానసశక్తి వల్లనే తక్కిన, అవసరమైనదంతా పరిణమింపచేయబడుతుంది. అందుచేత యీ మహాకార్యం విస్తృతస్థాయిలో జరగాలనేది అంత ముఖ్య విషయం కాదు. ప్రదానవిషయం ఏమిటంటే యెంత తక్కువ మందిలోనైనా సరే ఆ పని జరగడం, అదే యిప్పుడున్న ఒకే ఒక యిబ్బంది.

దేహ రూపాంతరీకరణ పూర్తైతే, అంటే మృత్యువుకు లోబడని స్థితి ప్రాప్తించడం, అంటే యెల్ల కాలమూ అదే దేహాన్ని వుంచుకోగలగడంకాదు దానర్థం. అతడు మార్చుకోవాలనుకొన్నప్పుడు తనకు తాను ఒక నూతన దేహాన్ని సృజించుకొంటాడు. కాని అదెలా జరుగుతుందనేది యిప్పుడు చెప్పలేం. ప్రస్తుతం భౌతిక జన్మ జరిగే పద్ధతి కూడా అవసరం వుందని ఒకానొక సమయం వస్తుందని కొంతమంది రహస్య విధానవాదులు ప్రతిపాదిస్తారు.కాని అతిమానస పరిణామానికే ఆ సమస్య పరిష్కారాన్ని వదిలి వేద్దాం.

C.W.S.A 28: 288-89

దివ్యసాక్షాత్కారం: అతిమానససాక్షాత్కారం

దివ్యసాక్షాత్కారం అంటే అర్థం ఆధ్యాత్మిక సాక్షాత్కారం. మానసిక, ఆధ్యాత్మిక భూమికలపై లేకపోతే అధిమానసిక భూమికపై, ఆత్మ, భగవన్, లేక బ్రహ్మం సాక్షాత్కారం. వేలమంది సాధించినది దానినే (యెలాచూచినా అది మానసిక-ఆద్యాత్మికమైనదే.) కనుక అతిమానసికం అంటే దాన్ని సాక్షాత్కారింపజేసుకోవడమే తేలిక అనేది చాలా స్పష్టం. ఆధ్యాత్మిక సాక్షాత్కారం జరుగకుండా అతి మానసిక ఉపలబ్ది యెవరికీ ప్రాప్తించదు. నిజమైన, చాలా తీవ్రమైన ఉత్సాహం, సాధనలో క్రియాశీలమైన సత్యత వుంటే తప్ప, మొత్తం అస్తిత్వం అంతా ఆ వైపుకు తిరిగితే

తప్ప యే ఒక్కటీ పొందలేమనేది యదార్థం. అతి మానసాన్ని భూమికోసం భూమిపై జన్మించిన అంతరాత్మల కోసమే గాని నాకోసం నేను కావాలనుకొవడంలేదు. అనేది యదార్థం. కాబట్టి యెవరైనా అతిమానసాన్ని తమకు కావాలనుకొంటే నాకేం అభ్యంతరంలేదు. కాని అందుకు కొన్ని షరతులున్నాయి. మొదట అతడు దైవేచ్ఛను కోరాలి. అంతరాత్మలో ఆధ్యాత్మిక సాక్షాత్కారాన్ని సాధనా క్రమంలో కర్మ, భక్తి, జ్ఞాన, ఆత్మసిద్ధి ద్వారా పొందాలని కోరుకోవాలి. ఆ ఆకాంక్షను నిలుపుకోవడానికి మొదట కావలసినది చాలినంత కేంద్రీయ చిత్తశుద్ధి, ఆకాంక్ష నెరవేరడానికి ఒక సంపూర్ణ చిత్తశుద్ధి అవసరం.

C.W.S.A 29: 414

దైవచేతనకు విభిన్న అవస్థలు ఉన్నాయి. రూపాంతరీకరణకు కూడా విభిన్న అవస్థలు ఉన్నాయి. మొదటిది, అంతరాత్మిక రూపాంతరీకరణ, అందులో అంతరాత్మిక చేతన ద్వారా సమస్తం దైవంతో సంబంధం కలిగి వుంటుంది. తరువాత విశ్వచేతనలో సమస్తం అతి మానసీకరించబడి దేనిలో వుంటాయో ఆ అతి మానస రూపాంతరీకరణ అతిమానస మవుతుంది. చివరి దానితో మాత్రమే మనః ప్రాణదేహాల సంపూర్ణ రూపాంతరీకరణ- సంపూర్ణతకు నేనిచ్చే అర్థంలో — మొదలవుతుంది.

మూడవది అతిమానసికరూపాంతరీకరణ. అందులో సమస్తము దివ్యజ్ఞాన చేతనలో అతిమానసం అవుతుంది.

C.W.S.A 29:414

సాధారణ యోగలక్ష్యం ప్రకృతినుండి అంతరాత్మను విడిపించడం లేక బహుశా కొన్ని సమయాలలో ప్రకృతిలోనే అంతరాత్మను ముక్తం చేయడం. మనలక్ష్యం అంతరాత్మను ప్రకృతిని రెండింటినీ దైవంలోకి ముక్తంచేయడం.

C.W.S.A 12:367

శ్రీఅరవిందులు

స్వేచ్ఛానువాదం: కె.వి. రావు

ఏకైక పరమసత్యంయొక్క బహుముఖ పార్శ్వాలు, అంశలు:

యోగం యొక్క ఒకే ఒక్క పరమోత్కృష్టలక్ష్యం: పరిమితమైన, బాధాతప్తమైన మానవ సంబంధితము, ప్రాపంచికము అగు చైతన్యాన్ని అజ్ఞానమునుండి, బలహీనతనుండి శాశ్వతముగా ముక్తంగావించడం. దీనిని రెండురకాలుగా సాధించవచ్చు — దానినుండి పలాయనం చిత్తగించడం ద్వారాగాని లేదా మనోప్రాణ శరీరతత్వాలను మించిన విస్తృతమైన, దివ్యజీవనంలోకి వికసించడం ద్వారాగాని.

అయితే, ఈ ఉన్నత చైతన్యం భిన్న సాధకులచే విభిన్నరీతులలో గ్రహించబడుతుంది. ఎందుకనగా అది మనస్సుకందని మహాఅనంతం. ఒక్కటే అయిన బహుళమైన ఒక్కటి, బహుముఖంగా వ్యక్తపడేది. కొందరికి అది లౌకిక జీవితంనుండి శాశ్వతంగా ఉపసంహరణ లేక ఆత్మను శరీరాన్ని లయం చేసుకొనుటలో దివ్యానందానుభూతిని పొందటం. మరికొందరికి అది నిర్గుణ పరబ్రహ్మం; వ్యక్తిత్వము, విశ్వమహాప్రకృతుల నిర్మూలనము. దానికి మూలము, అనిర్వచనీయమైన ప్రశాంత, నిశ్శబ్దస్థితి దానికి ప్రవేశద్వారము. మరికొందరికి అది ఒక అత్యున్నత బ్రహ్మానందస్థితి, అది అభ్యుదయ పథాలను మించిన అభ్యుదయపథం, ఒక దివ్యజీవన విధానం, ఒక సమగ్ర సంపూర్ణ దివ్యచైతన్యం, ఒక అవధులు లేని దివ్యపారవశ్యకత, ఇతరులకు అన్ని దైవత్వాలను మించిన ఏకైక దైవం ఈ త్రివిధ లక్షణాలు మూర్తీభవించిన పరమపురుషుడు. ఈ విధంగా ఒక ముగింపులేని అధ్యాయంగా దాని ప్రాశస్త్యం కొనసాగుతుంది. మన ఆత్మస్థైర్యం, మన సహజస్వభావ స్థితులకనుగుణంగా మనమా శాశ్వతుడిని, అనంతుని ఊహించుకుంటాం.

ఈ శాశ్వతుడుని, అనంతుని మనం ఏవిదంగా భావించినా, యోగంయొక్క అంతిమ ఏకైకలక్ష్యం అతడే. మరికొన్ని అల్పమైన లక్ష్యాలున్నాయి. వాటిని అనేకమంది సాధకులు అన్వేషిస్తారు. కాని అవి ప్రధాన మార్గంలో కొండగుర్తులు లాంటివి. అప్రధానమైన వికసన దశలు, వాటిపై ఆకర్షణతో వాటిని అనుసరిస్తే దారితప్పి గమ్యానికి దూరంకావచ్చు.

అతిమానస యోగలక్ష్యం, మిగతాయోగలక్ష్యాల మేళవింప; అయితే అది

ఇతర అల్ప లక్ష్యాలను ఉన్నతీకరించి, పరివర్తనగావించి, వాటిని ప్రధానలక్ష్యం యొక్క సమగ్రతలో ఒక భాగం చేస్తుంది.

CWS.A 12:363-64

విశ్వప్రకృతిని వదిలి వేయకుండా పరివర్తన కావించడం

ఏదో ఒక అనిర్వచనీయ నిరాకార స్థితిలో పూర్తిగా ఈ అస్తిత్వాన్ని కోల్పోవడం దీని లక్ష్యంకాదు. విశ్వవ్యాప్తము, అనంతము అగు దానితో తాదాత్యము చెందిన దైవాంశగల వ్యక్తిగా ఎదుగుటకు అహాన్ని త్యజించడం, చేతనను రద్దు పరచడం కాదు. అజ్ఞానానికి బదులుగా, పరమోత్కృష్టమైన, సర్వసంపన్నమైన దివ్యజ్ఞానాన్ని పొందడం; ఆనందాన్ని జీవితంనుండి పూర్తిగా తొలగించడం కాదు, చేయవలసినది దివ్యమైన నిర్విచార ఆనందపారవశ్యతను పొందటానికి మానవమాత్ర ఆనందానుభూతిని వదులుకోవడం; సమస్త సృష్టిని భూతత్వాన్ని వదిలి పెట్టడం కాదు. వాటిని దివ్య అస్తిత్వం యొక్క పరమశక్తిమంతమైన సత్యంలోకి పరివర్తన చేయడం. సన్యసించడం ఈ యోగంయొక్క అంతిమలక్ష్యం గాని ప్రత్యేక విధానం గాని కాదు. అయితే ఆవశ్యకతనుబట్టి స్వీయనియంత్రణను భోగపరాయణతను త్యజించవలసివుంటుంది. మన సంపూర్ణ అస్తిత్వం అనిర్వచనీయమైన దైవంతో ఒక్కటికావడం, అతని అస్తిత్వంయొక్క శక్తి, చేతన, మరియు ఆత్మ సాక్షాత్కార ఆనందం కదలికలు సాక్షాత్కారంలో అభివ్యక్తం కావాలి. మనసు నధిగమించిన దివ్యసత్య చైతన్యంలోకి ఎదగాలి. మానవ లేక ప్రాపంచిక వెలుగులను మించిన వెలుగులు, మానవుల మహాబలంకూడా బలహీనంగా భావించబడే దివ్యశక్తిలోకి ఎదగాలి. ఫలవంతమైన దివ్యసంకల్పసిద్ధి యొక్క ఆధిపత్యంలోనికి మరియు అమోఘమైన ఆత్మజ్ఞానంలోకి ఎదగాలి; ఏ మానవ సుఖసంతోషాలు ఆ పరమానందం ముందు సూర్యుని సర్వవ్యాప్త మహాద్భుత ప్రకాశంముందు క్రొవ్వొత్తియొక్క పగిలిన శకలాల ప్రతిబింబాలవలె వెలవెలపోతాయో అలాంటి పరమానందంలోకి పరివర్తన చెందాలి. కాని ఇదంతా మనకోసం కాక, మన ప్రియతముడైన ఆ దైవంయొక్క ఆనందంకోసం చేయాలి. ఇదే అతిమానసయోగం యొక్కలక్ష్యము, శీర్షాభరణము.

ఈ మార్పు ప్రకృతిలోనే చోటుచేసుకొనే విషయము, ప్రకృతి కావల కాదు. అది సంభవమే కాదు, ఎదిగే ఆత్మకు తప్పనిసరి. మనలోని మహాప్రకృతి ఈ కని

పించే అజ్ఞానం, పొరపాట్లు, బాధ మరియు బలహీనతలగుండా నడిచేది ఈ లక్ష్యం దిశగానే.

CWS.A 12:364

ప్రకృతిని దివ్యీకరించడమే లక్ష్యం

మనం మాట్లాడుతున్న ఈ ప్రకృతి దివ్యీకరణ కేవలం ఒక పరిణామ ప్రక్రియనే గాని అతిమానవత్వంలోకి ఎదగడం కాదు. మన అజ్ఞాన స్థితినుండి, దివ్యప్రకృతియొక్క వాస్తవ స్థితిలోకి పరివర్తన చెందటం. అతిమానవ తత్వానికి చెందిన అసుర, రాక్షస, పిశాచశక్తులు వాటి స్థానంలో, వాటికి ప్రత్యేకమైన తత్వంలో, కదలికలో దివ్యమైనవి, ఉన్నతమైనవి కావు. కారణం, అవి అధిక మనోశక్తి, అధిక ప్రాణశక్తులలో మాత్రమే జీవిస్తాయి, కాని పరమసత్యంలో కాదు. పరమసత్యమొక్కటే దైవాంశగలది.

ఎవరైతే ఆ పరమసత్యచైతన్యంలో నివసిస్తూ, దానిని మూర్తీభవిస్తారో అటువంటి వారే అంతరంగంలో రూపొందించబడినవారు. లేదా దివ్య ఆకృతిగా రూపాంతరం చెందినవారు.

అతిమానసయోగ లక్ష్యం ఈ పరమసత్య-చైతన్యంలోకి పరివర్తన చెందడమే, అయితే ఆ సత్యం మనస్సు పరిధి కావల ఉండేది, ఆ చైతన్యం అత్యంత ఉన్నత మానసిక చైతన్యాన్ని మించినది. ఎందుకనంటే, ఈ మానసికసత్యం ఎల్లప్పుడూ సాపేక్షము, అస్పష్టము, కాని ఉన్నత పరమసత్యం కచ్చితమైనది. సంపూర్ణమైనది. మానసిక సత్యం ఒక ప్రతిరూపం, ఎల్లవేళలా అపరిపూర్ణం చాలాసార్లు తప్పుదోవ పట్టించేదిగా ఉంటుంది. అది ఉన్నది ఉన్నట్టుగా ఉన్నప్పుడు కూడా కేవలం ఒక ప్రతిబింబం మాత్రమే, సత్యంయొక్క నీడయేకాని దాని రూపంకాదు. మనసు పరమసత్యంలో జీవించదు, లేదా దానిని పొందిఉండదు. అది కేవలం దానిని వెతుకుతూ వుంటుంది. మహా అయితే దాని పై వస్త్రం నుండి కొన్ని నూలుపోగులను మాత్రం చేజిక్కించుకోగలదు. అతిమానసం పరమసత్యంలోనే జీవిస్తుంది. అదే దాని మూల పదార్థము, ఆకృతి, అభివ్యక్తి. అది దానిని వెతుక్కోనక్కరలేదు. కాని ఎల్లవేళలా సహజంగా దాన్ని పొందే ఉంటుంది. అది పొంది ఉండేది అదే; ఆ రెండింటి మధ్యనున్న తేడాలోని సారాంశము కూడా అదే. మనసు అతి మానసంగా పరివర్తన చెందేటప్పుడు కలిగే మార్పువల్ల వచ్చే పరిణామం జ్ఞానంలోకాని, జ్ఞానసముపార్జనకై మనకున్న

శక్తిలోగాని అత్యంత విప్లవాత్మకమైనది మాత్రమేకాదు. అది స్థిరంగాను, సంపూర్ణంగాను సంభవించాలంటే అది మన సంకల్పశక్తి. మన ఉద్వేగాలు, మన సంవేదనలు, మన జీవశక్తులు, చివరకు మన శరీరపదార్థం, మన శరీరం పనిచేసే పద్ధతితో సహా దివ్య మైన రూపాంతర పరివర్తన చెందాలి. అప్పుడు మాత్రమే ఈ పృథ్విపై అతి మానసం ఉన్నదని. ఈ భూ పదార్థంలో తన వేర్లను పాతుకున్నదని, నూతన జాతి అయిన దివ్యజీవులుగా రూపొందించినది అని చెప్పగలం. అతిమానసం దాని శిఖరాగ్ర స్థాయిలో దివ్యజ్ఞాన సంపద, దైవం యొక్క దివ్యజ్ఞానము, దివ్యశక్తి దివ్యప్రకాశము, దివ్యానందాల కలయిక. వాటిద్వారానే దైవం విశ్వాన్ని తెలుసుకుంటాడు. విశ్వానికి ఆధారభూతుడవుతాడు, పరిపాలిస్తాడు, ఆనందిస్తాడు.

CWS.A 12:365-66

ఆకాంక్ష, ఉన్మీలన, గ్రహణశక్తి అవసరం

అతిమానసయోగం అనగా ఒకే సమయములో దైవం దిశగా ఆరోహణతోపాటు ఆకృతి దాల్చిన ప్రకృతిలోకి అవరోహణ.

ఆరోహణ సఫలం కావటానికి ఆత్మ, మనసు, ప్రాణం, శరీరాలు ఏకీకృతమై ఏకోన్ముఖమై ఊర్ధ్వముఖంగా ఆకాంక్ష సాగటానికి కేంద్రీకరించబడాలి. అవరోహణ సంభవించటానికి ఆ అనంతశాశ్వతదైవాన్ని సత్తా అంతటితో ఆవాహన చేయాలి. ఈ ఆవాహన, ఆకాంక్షఉన్నప్పుడు, లేదా ఏదోవిధంగా వాటి అంకురార్పణ జరిగి, అవి నిరాటంకంగా పెరుగుతూ ప్రకృతిని పూర్తిగా స్వాధీనంలోకి తీసుకున్నప్పుడు మాత్రమే అతిమానస ఉద్ధరణ మరియు రూపాంతరీకరణ సంభవించగలదు.

పిలుపు మరియు ఆకాంక్ష ప్రాథమిక షరతులు మాత్రమే. వాటితో పాటుగా, వాటి సంఘటిత కృషియొక్క తీవ్రప్రభావంతో మొత్తం అస్తిత్వం తెరుచుకుని, ఆ దైవానికి సంపూర్ణ సమర్పణ జరగాలి. ఈ ఉన్మీలనంలోని ఉద్దేశం స్వభావాన్ని సంపూర్ణంగా అన్ని స్థాయిలలోను అన్ని భాగాలలోను, ఎట్టి మినహాయింపులు లేకుండా ఉన్నత దివ్య చైతన్యాన్ని ఏ అవరోధాలు లేకుండా తనలో గ్రహించడం; అది అప్పటికే మనపైన, మన వెనుక, మన చుట్టూ ఉన్న ఈ మర్త్య అర్థచేతనా స్థితిలో ఉన్నది. దానిని గ్రహించి నిలుపు కోవడంలో ఏ అశక్తత ఉండకూడదు. ఆ విధానంలో మనసు, ప్రాణం లేక నాడీ వ్యవస్థమీద శరీరం మీద కూడా రూపాంతరం

యొక్క ఒత్తిడితో అవరోధం ఏర్పడకూడదు. ఎల్లవేళలా దివ్యశక్తి యొక్క వృద్ధి చెందే బలాన్ని, దాని నిర్దిష్ట కార్యాచరణను భరించడానికి అంతులేని గ్రహణశక్తి వుండాలి. లేనట్లయితే శాశ్వతమైన, గొప్పదైన మార్పుని సాధించలేము. యోగసాధన కుంటుపడుతుంది, లేదా నిష్క్రియాత్మకమై ఆగిపోతుంది, లేదా నిస్సత్తువ ఆవహించడం లేదా ప్రక్రియ కొనసాగుటలో ఓ దురదృష్టకరమైన అర్ధాంతరంగా ఆగిపోయే స్థితి ఏర్పడుతుంది. ప్రక్రియ విఫలంకాకుండా సాగాలంటే అది అప్రతిహతము, సమగ్రము అయివుండాలి.

CWS.A 12:169

క్రమబద్ధమైన - సంపూర్ణ సమర్పణ యొక్క ఆవశ్యకత

ఏ మానవ విధానానికి ఇట్టి అవిరామమైన గ్రహణశక్తి మరియు వైఫల్యంలేని సమర్థత ఉండదు కాబట్టి అతిమానసయోగం విజయవంతం కావాలంటే ఆ దివ్యశక్తి ఈ నిమ్నప్రకృతిలోకి అవరోహించుటలో వ్యక్తి తన శక్తిని పెంచి దివ్యశక్తితోపాటుగా ప్రకృతిలో పనిచేయడానికి పైనుంచి వచ్చే బలప్రమాణంతో సమానపరచాలి. ఇది సంభవం కావాలంటే మనవంతుగా సంపూర్ణంగా, క్రమానుగతంగా మన సత్తా మొత్తాన్ని ఆ దివ్యహస్తాల్లోకి అర్పించుకోవాలి. దానికి తోడుగా సంపూర్ణమైన కుంటుపడని అంగీకారం, ఆ దివ్యశక్తి మనలో తాను చేయవలసిన ఏ పనినైనా చేయడానికి అనుకూలమైన, ఓ ధీరోదాత్తమైన ఇష్టత ఉండాలి. మనిషి కేవలం తన స్వయం కృషివల్ల తనను మించిన వాడుగా ఎదగలేడు. మానసిక జీవికి స్వయంగా అతిమానసికశక్తి గలవానిగా ఎదగగల అసహాయ శూరత్వం లేదు. దివ్యప్రకృతియొక్క అవరోహణ ఒక్కటి మాత్రమే ఈ మానవపాత్రను దివ్యీకరించగలదు.

ఎందుకనగా, మనో, ప్రాణ, శరీరాలయొక్క శక్తులు వాటి వాటి పరిధులకు మాత్రమే పరిమితమైనవి. అవి ఎంత ఉన్నతంగా, ఎంత విస్తారంగా ఎదిగినా, అవి తమ స్వతస్సిద్ధమైన అంతిమ పరిమితులను మించి ఎదగలేవు, విస్తరించలేవు. అయినప్పటికీ ఈ మానసిక జీవి తన కావలనున్న స్థితులకు తెరచుకొని ఒక అతిమానస దివ్యప్రకాశాన్ని , పరమసత్యాన్ని దివ్యశక్తిని తనలో పనిచేయడానికి ఆవాహన చేసి, మనసు సాధించలేని కార్యాన్ని సాధించగలడు. మనసు

ప్రయత్నపూర్వకంగా మనసును మించిన దానిగా ఎదగలేనప్పుడు అతిమానసం అవరోహణ ద్వారా ఆ మనసుని తన స్వీయపదార్థంగా రూపాంతరం గావించగలదు.

మనిషియొక్క వివేచనాత్మక సమ్మతితో జాగృతమైన సమర్పణతో, అతిమానసశక్తిని దాని స్వంత అపారమైన, సూక్ష్మ మైన అంతర్ కృషితో, శక్తితో కార్యాచరణ గావించుటకు అంగీకరిస్తే, అది నిదానంగానో, లేక శీఘ్రంగానో మన ప్రస్తుత అసంపూర్ణ ప్రకృతిలో ఓ దివ్యరూపాంతరీకరణను కలుగజేస్తుంది.

ఎరుకగల సమగ్ర సమర్పణలోనే రక్షణ ఉంది.

ఈ అవరోహణలో ఈ కార్యాచరణలో పతనానికి, ప్రమాదానికి విపత్తుకు తావులేదని, సంభావ్యతలేదని చెప్పలేము. ఆ అవరోహణలోని శక్తిని మానవ మనస్సు లేదా ప్రాణిక కామనలు వశం చేసుకొని, వాటిని తమ పరిమిత భావాలకు లేక తప్పుడు అహంకార పూరిత ప్రేరణలకు అనుగుణంగా ఉపయోగించే ప్రయత్నం చేసినప్పుడు — నిజానికి ఎంతో కొంత వరకు ఇది తప్పనిది — ఈ నిమ్న మానవుడు ఆ వున్నత (పరా) ప్రకృతియొక్క మార్గాన్ని తెలుసుకునేంతవరకు ఈ పడిపోవడాలను తప్పిపోవడాలను, కఠినమైన, అధిగమించలేని అడ్డంకులుగా కన్పించే గాయాలను, బాధలను తప్పించుకోలేడు. చివరికి మృత్యువు లేదా అత్యంత నీచమైన పతనం కూడా అసంభవం కావు.

మనో ప్రాణ శరీరాలు ఆ దైవానికి చేతనాయుతమైన సమగ్ర సమర్పణ గావించడం తెలుసుకున్నప్పుడు మాత్రమే. యోగమార్గం సులువుగా, సూటిగా, వడిగా, సురక్షితంగా ఉంటుంది. ఆ సమర్పణ, ఆ ఉన్మీలన ఒక్క దైవానికి తప్ప మరి దేనికి చెందనిదై ఉండాలి. ఎందుకంటే మనలోని అస్పష్ట మనస్సు, అపవిత్ర జీవనశక్తులు, అసురశక్తులకు దుష్టశక్తులకు స్వాధీనపడే సంభావ్యత ఉంది.

వాటిని దివ్యశక్తులుగా భావించే పొరపాటుకూడా జరుగవచ్చు. ఇంతకన్న ప్రమాద భరితమైన పొరపాటు వుండదు. అందువల్ల మన సమర్పణ గుడ్డిగా, అన్ని ప్రభావాలకు కాని, లేదా ఏదో ఒక ప్రభావానికి గాని, నిరుత్సాహమైన నిష్క్రియతోకూడిన సమర్పణ కాకుండా, నిజాయితీ, ఎరుక, సావధానతతో ఏకైక లక్ష్య మైన ఆ దైవానికి ఆ సర్వోన్నతుడికి మాత్రమే చెందిన సమర్పణగా ఉండాలి.

ఎంత కష్టమైనా సరే ఆ దైవానికి, ఆ దివ్యమాతకి సమర్పణ ఒక్కటే మనకు అత్యంత ఉపయుక్తమైన మార్గంగా ఉంటుంది. అదొక్కటే మనం కట్టుబడి ఉండాల్సిన శరణాగతి స్థావరం. ఆమెకు ఆత్మార్పణ మనగా, మన ప్రకృతి ఆమె చేతిలో పని ముట్టు కావాలి. అంతరాత్మ ఆ దివ్యమాత హస్తాల్లో పసిబిడ్డగా ఉండాలి.

C.W.S.A 12:170-171

అతిమానసయోగంలో ఆత్మసమర్పణ కీలకమైన పదం

అసంపూర్ణ ఎరుకగల మన మర్త్య ఉనికిచుట్టూ మన వెనుక పైన ఉన్న ఆ ఉన్నత దివ్య చైతన్యంలోకి ప్రవేశించాలంటే, దానిని గ్రహించాలంటే, మన పూర్తి ప్రవృత్తిని తెరిచివుంచాలి, సమర్పణ గావించాలి. మన అంతరాత్మ ఆ దివ్య మాత హస్తాల్లో పసిబిడ్డగా మారేవరకు మరింత అధికశక్తితో సదా కార్యాచరణకు ప్రోత్సహించే, ఆ దివ్యశక్తిని భరించడానికి కూడా సమర్థతను పెంపొందించు కోవాలి. మరొక యోగమార్గానికి చెందే విధానాలను సమయానుకూలంగా, ఈ యోగానికి పనికివచ్చినంత మేరకు సహకారసాధనాలుగా ఉపయోగించవచ్చు. అయితే, ఆ పైన చెప్పిన ఉన్నత స్థితులు లేనపుడు అవి నిర్వీర్యమౌతాయి. ఒక్కసారి అనుకూలపరిస్థితులు ఏర్పడితే అవి అవశ్యకం కావు.

చివరిగా అవగాహన కొచ్చేదేమిటంటే, ఈ యోగం ముగింపువరకు సాగాలంటే అది మనోప్రాణశరీరాల కృషివల్ల కాని మానవపరమైన మానసిక, లేదా భౌతిక ప్రక్రియలతో గాని సాధ్యపడదు. ఒక్క పరాశక్తి వల్లనే సాధ్యమౌతుంది. కాని ఆ పరాశక్తిని సమగ్రంగా అనుసరించడానికి మార్గం సూటిగా ఉండదు. బాహ్యపరిస్థితుల్లో సంక్లిష్టమైనదిగాను, అంతకుమించి మానవ మేధతో సూత్రీక రించుటకు వీలు కానిదిగా నుంటంది.

మనిషి తన స్వయంకృషితో మనిషిని మించి ఎదగలేడు. కానీ అతడు ఆ పరమసత్యాన్ని, దాని శక్తిని తనలో పనిచేయడానికి ఆవాహన చేయవచ్చు. ఆ దివ్యప్రకృతి అవరోహణ మాత్రమే ఈ మానవ పాత్రని, దివ్యమయం చేయ గలదు.ఒక దివ్యమైన రూపాంతరశక్తికి ఆత్మ సమర్పణ ఈ యోగంయొక్క కీలకపదం.

CWS.A 12: 365

మన కిష్టమొచ్చినట్లు చేయడానికి మనమిక్కడ లేము, లేదా మనకి నచ్చినట్లు చేయడానికి వీలుగా ప్రపంచాన్ని తయారుచేసుకొనుటకు మనం లేము. మనమిక్కడ ఉన్నది దివ్యసంకల్పాన్ని నెరవేర్చడానికి , మానవ అజ్ఞానంతోను, ప్రాణకామనలతోను, వక్రీకరించబడని లేదా తప్పుగా అనువదించబడని యదార్థస్థితిలో దివ్యసంకల్పం అభివ్యక్తి కాగల లోకాన్ని సృష్టించడానికి ఇక్కడ ఉన్నాం. ఈ అతిమానసయోగ సాధకుడు చేయవలసినది తాను స్వయంగా నిర్ధారించుకున్న షరతుల ప్రకారం చేయవలసిన స్వంతపనికాదు, దివ్యకార్యం ఏదైతే ఆ దైవం ఏర్పరచిన షరతుల ప్రకారం చేయాలో అది నెరవేర్చడానికి. మన యోగం కేవలం మన స్వప్రయోజనం కోసం చేసేదికాదు, అది దైవంకోసం చేసేది. మనం వెతుక్కోవలసింది మన స్వీయ అభివ్యక్తి కాదు, అన్నిబంధాలనించి, అన్ని పరిమితులనించి, వ్యక్తిగత అహంకారం నించి విడుదలపొందిన స్వీయ అభివ్యక్తి కోసంకాదు. దైవం అభివ్యక్తి కోసం సాదన చేయాలి. ఆ అభివ్యక్తిలో భాగంగా, ఫలితంగా మన వ్యక్తిగత ఆధ్యాత్మిక విడుదల, సమగ్రత, పరిపూర్ణత సంభవించాలి తప్ప అది కేవలం మన అహంకారపూరితమైన స్వీయ ఆత్మాన్వేషణ అనే ప్రయోజనాన్ని సాధించతడానికి కాదు. ఈ స్వేచ్ఛ సమగ్రత లేదా సంపూర్ణతలు సాధించడంకూడా మనకోసం కాకుండా, దైవ సాధనకోసమే చేయాలి. సృష్టియొక్క ఈ లక్షణాన్ని నేను నొక్కి చెప్పడం ఎందుకంటే ఈ సాధారణమైన మూల సత్యాన్ని ఎల్లవేళలా మరచిపోవడము, దానిని గురించి పూర్తి ఎరుక లేకపోవడం లేక సగంఎరుకతోనో, లేకదానిని గురించి పూర్తి అజ్ఞానం తో కూడిన గందరగోళ పరిస్థితులలోనో వ్యక్తిగత సాధన పురోగతి కుంటుబడి, అంతరంగిక ఆద్యాత్మిక వాతావరణం ప్రశాంతంగా సాగక పోవటానికి కారణాలయినాయి. గనుక.

CWSA 31: 161-162

శ్రీఅరవిందులు

అనువాదం: డి. సత్యవాణి

శ్రద్ధవాన్ లభతే జ్ఞానం

(ధృఢ శ్వాసంతో జ్ఞానసిద్ధి)



అఖిల

అఖిల భారత పత్రిక — జూన్ 2016



విశ్వాసం తామసికమైనది, నిష్ఫలమైనది కాగలదు. ఉదాహరణకు, "నా నమ్మిక, సర్వము శ్రీమాతయే నెరవేరుస్తారని, అందువలన నేనేమీ చేయను అని. ఆమె కోరినప్పుడు ఆమెయే నన్ను పరివర్తన చెందిస్తుంది," అనే విశ్వాసం పురోగామి కాదు, జడము, అచేతన మైనది,.

CWSA 29, 99-100

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

శ్రద్ధ — దైవంపై విశ్వాసానికి ప్రామాణిక వచనం

మనిషి లోని అంతారాత్మ విశ్వాస కల్పితము

... ఈ దివ్యపురుషుడు, ఈ మనిషిలోని అంతరాత్మ, 'శ్రద్ధ' తో, ఒక విశ్వాసంతో, ఒక సంకల్పంతో తన పైన, తన ఉనికి పైన తన కున్న నమ్మకంతో రూపొందుతాయి. ఆ సంకల్పం, ఆ విశ్వాసం, లేక ఆ నమ్మకం కలిగించేది ఏదైనా అతను అదే అవుతాడు, అదే తాను అవుతాడు. "శ్రద్ధా మయో యాం పురుష యో మచ్ఛ్రద్ధాహ స యేవ సః" ఈ భావ గర్భిత లోకోక్తిని కొంత క్షుణ్ణంగా పరిశీలించినట్లయితే, ఈ ఒక్క పంక్తిలోని కొన్ని శక్తివంతమైన పదాలలో దాదాపు ఆధునిక వాస్తవిక దృష్టి సిద్ధాంతమంతా ఇమిడి వున్నదని తప్పక తేటతెల్లమౌతుంది. ఎందుకనగా ఒక మనిషి గానీ, లేక అతనిలోని అంతరాత్మగానీ అతనిలోనున్న విశ్వాసంతో కూడుకునివున్నదన్న దృష్టితో గమనించినట్లయితే, అప్పుడు అతడు గ్రహించిన సత్యము, ఆ సత్యములో జీవితం గడపాలనే అతడి సంకల్పము, రెండూ అతనికి తన అస్తిత్వపు యదార్థ స్వరూపమని, తనను గురించి తాను స్వయంగా నిర్మించుకున్న లేక నిర్మించుకుంటున్న యదార్థ స్వరూపమని, అది తప్ప తనకు వేరొక సత్య స్వరూపము ఉండబోదని రూఢి అవుతుంది. ఈ సత్యము అతని ఆంతరిక మరియు ఉపరితల చర్యలకు, అతడు తనను తాను మలుచుకుంటున్న విధానానికి, అతని అంతరాత్మ యొక్క గమనాలకు చెందిన విషయం, కాని అతనిలోని లక్షణమేదైతే ఎప్పటికీ మార్పు చెందదో దానికి సంబంధించినది కాదు. అతడు నేడు ఏమై వున్నాడో అన్నది, అతని గత స్వభావ సంకల్పమేదైతే ఎప్పటికీ మార్పు చెందదో దావికి సంబంధించినది కాదు. అతడు నేడు ఏమై వున్నాడో అన్నది అతని గత స్వభావ సంకల్ప మేదైతే అతని ప్రస్తుత సంకల్పబలంతో తెలుసుకోవాలని, నమ్మాలని తన తెలివి తేటలతో, తన ప్రాణిక శక్తితో కొనసాగాలనే సంకల్పం స్థిరంగా నిలచి కొనసాగుతున్నదో దానితో ముడిపడివున్నది. అతని మూలంలో క్రియాశీలమై వున్న ఈ సంకల్పం, విశ్వాసము ఏ కొత్తమలుపును తీసుకొంటాయో ఆ విధంగా భవిష్యత్తులో మార్పు చెందటానికి అతను మొగ్గు చూపుతాడు. మన ఉనికిని గురించిన మన కుండే నిజ భావనను మన స్వంత మనస్సు, జీవితంలో సల్పే చర్యలతోనే ఏర్పరచుకుంటాము. మనలను మన అంతరంగాలను రూపొందించుటకు మనమే కర్తలమని

మరోవిధంగా చెప్పడమంటే, ఇదే.

CWSA 19:482

దైవంపై మనకున్న విశ్వాసం మేరకు మనతో ఆయన అనుబంధం వుంటుంది.

...ప్రార్థించేవారి మనసులో దైవం తనని గురించి ఏవిధమైన చిహ్నం. భావం, రూపం ఉన్నప్పటికీ దానిని ఆతడు అంగీకరిస్తాడు, "యామాం తనుమ్ శ్రద్ధయా అర్చతి" అని చెప్పబడినట్లుగా; తనపై వారిలోనున్న విశ్వాసానికి అనుగుణంగా వారికి సన్నిహితుడు అవుతాడు. శ్రద్ధాసక్తులతో కూడిన మతపరమైన నమ్మకం, ఆచరణ అంతా పరమోత్కృష్టుడు, సర్వాంతర్యామి అగు దైవాన్ని కోరడమే అవుతుందనుట నిజం. ఎందుకనగా దైవం ఎల్లప్పుడూ మనిషి సమర్పణను స్వీకరించి, అపేక్షను అందుకొనుటకు అతను పడే ప్రయాసను, అతనికి తనపైగల ఆకాంక్షను అందుకొని ఆనందించే ఏకైక అధినాయకుడు. మనిషియొక్క ఆరాధనా విధానం ఎంత అల్పమైనది అయినప్పటికీ, దైవంగురించి అతనికున్న అవగాహన, సమర్పణా భావన ఎంత పరిమితమైనప్పటికీ, దైహికమైన స్వభావంతో ఏర్పడిన స్వార్థపూరిత అభిమానం అతని దృక్పథాన్ని తనవరకే పరిమితం గావించినప్పటికీ, అది మనిషి అంతరాత్మను విశ్వాత్మతో సంధాన పరచే సూత్రంగా పనిచేసి ఒక అనుకూల ప్రతిస్పందనకు తావిస్తుంది.

CWSA 19:332

...మేధాజనిత అపనమ్మకముతో చికాకు చెందని విశ్వాసం మనకుండాలి "శ్రద్ధవాన్ లభతే జ్ఞానం" విశ్వాసంలేని అజ్ఞాని, అనుమానంతో కూడిన అంతరాత్మ అధోగతికి దారి తీస్తాయి. ఇహలోకం గాని, పరలోకం గాని, ఎలాంటి సుఖసంతోషాలు గాని అనుమానాలతో నిండిన అంతరాత్మకు చెందవు. నిజానికి విశ్వాసం లేనప్పుడు ఈ లోకంలో నిశ్చయాత్మకమైనది ఏదీ సాధించబడదు, పరలోక ప్రాప్తి కలుగదు. ఏదో ఒక నిశ్చితమైన ఆధారం, ఒక దృఢమైన ఆసరా దొరికినప్పుడే మనిషికి ఇహ లోకంలోగానీ, పరలోకంలోగానీ అనుకూల ఫలితం సంతృప్తి, సంతోషం దక్కుతాయి. కేవలం సంశయాత్మకమైన మనస్సు తనను తాను శూన్యంలో కోల్పోతుంది. అయినప్పటికీ అల్ప జ్ఞాన స్థితిలో కూడా అనుమానానికి, సందిగ్ధతకు, వాటికుండే

ప్రయోజనాలు వాటికుంటాయి. ఉన్నత జ్ఞాన స్థితిలో అవి అవరోధాలవుతాయి. ఎందుకనగా ఆ స్థాయిలో అసలు రహస్యమేమిటంటే, తప్పొప్పుల మధ్య సమతూకం సాధించడం కాదు, సత్యమైన దివ్యజ్ఞాన సముపార్జన కోసం నిరంతరంగా కృషి కొనసాగించటం.

CWSA 19: 204

విశ్వాసం పొందలేని అంతరాత్మ దైవికంలోకి ఎదగలేదు

విశ్వాసం చాలా అవసరం. విశ్వాసం లేకపోతే ఏ వ్యక్తి అయినా, బాహ్య విషయాలతో ప్రభావితమై ప్రవర్తించే విమర్శనాత్మక మేధకు, దివ్యజ్ఞానానికి సంబంధించిన విషయాలపై నున్న అపనమ్మకంతో, వాటిని ప్రశ్నించే కార్యక్రమాలను అప్పగించితే, — కారణం, దివ్యజ్ఞానానికి పైకి కనిపించే ప్రకృతియొక్క విభాజితమైన, దోషభూయిష్టమైన లక్షణాలతో పొంతన కుదరక పోవుటయేకాక, దానిని అధిగమించి మన ప్రస్తుత ఉనికికి ప్రాధమికంగా అనుభవంలోకి వచ్చే విషయాలను అనగా దాని దుఃఖం, దాని బాధ, దాని కీడు, దోషం, అనుచితమైన పొరపాట్లు, తొట్రుపాటు మొదలగు అశుభ సూచకమగు విషయాలకు అతీతంగా మనలను కొనిపోయే సంభావ్యతను సూచిస్తుంది గనుక — ఆ ఉన్నతమైన దివ్యజ్ఞానంలో మనుగడ సాగించడం సాధ్యపడదు. ఉన్నత సత్యము, ధర్మములపై విశ్వాసం పొందలేని అంతరాత్మ మరణానికి, పొరపాట్లకు, దుష్టచర్యలకు ఆలవాలమైన సామాన్య మర్త్య జీవన మార్గానికి తిరిగి వచ్చి తీరాలి: తిరస్కార భావన వున్న దివ్యత్వంలోకి ఎదగలేదు. ఎందుకనగా ఇది జీవితం గడపవలసిన యదార్థ స్థితి — అంతరాత్మ వికసన వెలుగులో జీవించవలసిన స్థితి, మానసిక అంధకారంలో విమర్శించబడే స్థితి కాదు.

వ్యక్తి దానిలోకి ఎదగాలి, దానిగా రూపొందాలి — అదొక్కటే దానిని నిజమని నిరూపించ గలిగే మార్గం. అధోగతికి దిగజారిన ఆత్మను అధిగమించ గలిగినప్పుడే ఎవరైనా దివ్యాత్మగా ఎదగ గలరు, మన ఆధ్యాత్మిక ఉనికి కున్న సత్యశీలతలో జీవించగలరు. పైపైకి సత్యాలుగా కనిపించే ప్రతిరోధకాలన్నీ నిమ్నప్రకృతి యొక్క ప్రతిరూపాలు. దుష్ప్రవృత్తి నుండి, నిమ్నప్రకృతి యొక్క అశుభ సూచకమైన అవలక్షణాల నుండి విముక్తి లభించేది, ఏ ఉన్నత జ్ఞానంలోనైతే ఈ దుష్ప్రవృత్తి మనలోని అజ్ఞానాంధకార జనితం అనే నమ్మకం కుదిరినప్పుడే. కానీ ఈ దివ్య

ప్రకృతి యొక్క స్వేచ్ఛాయుత జీవనం లోకి ఎదగడానికి, మన ప్రస్తుత పరిమిత స్వభావంలో దివ్యత్వం నిగూఢమై వున్నదన్న సత్యాన్ని నమ్మాలి, అందుకు అంగీ కరించాలి. నిరహంకారంగా, పూర్ణ విశ్వాసంతో మనం దేనినైతే నమ్ముతామో, దాని ప్రేరణతో దానిగా వుండాలని సంకల్పిస్తామో, దానిని మనలోని దైవం తప్పక సఫలం గావిస్తాడు. అయితే, ప్రస్తుతం మన జీవితం పైకి ఎంత అహంకారపూరితమైన దిగా కనిపిస్తున్నదో అది ముందు తనకు తానుగా మనలో నిగూఢమైవున్న దివ్యత్వానికి అర్పణ గావించుకోవాలి.

CWSA 309-10

విశ్వాసం మన ప్రాథమిక అవసరం

విశ్వాసం మన ప్రాధమిక అవసరం. దైవంలోను, సృష్టిలోను, దివ్యమైన అస్తిత్వ ప్రాశస్త్యంలోను విశ్వాసం లేనంత వరకు ఆకాంక్షించటానికి, సమర్పించుకొనుటకు కారణం లేదు. అట్టి ఆకాంక్షలో బలం వుండదు, అట్టి సమర్పణలో శక్తి వుండదు. ప్రధానమైన మూలాధారమైన విశ్వాసం వున్నప్పుడు సందేహాలు తలెత్తినా ఫరవాలేదు.

సందేహాలు రావచ్చు కాని అస్తిత్వ కేంద్రంలో దృఢంగా పాతుకొని వున్న కొండలాంటి విశ్వాసం ముందు నిలువలేవు. ఆ కొండ కొద్దిసేపు అనుమానం, అధై ర్యం పొంగుతో కప్పబడవచ్చు కాని తదుపరి దృఢమైనదిగా, అభేద్యమైనదిగా బయటపడుతుంది.

CWSA 12: 347

అడుగడుగునా విశ్వాసం అవసరం

... విశ్వాసం మొదటినుండి చివరి వరకు వేసే ప్రతి అడుగులో అవసరం. ఎందుకనగా అది అంతరాత్మకు ఆవశ్యకమైన అంగీకార సూచన. ఆ అంగీకారం లేనిదే పురోగతి సాధ్యం కాదు. ప్రాధమికంగా మన విశ్వాసం యోగంలో అత్యావశ్య కమైన సత్యశీలతకు, దాని ప్రధాన తత్వానికి స్థిరంగా కట్టుబడి వుండాలి. ఈ విశ్వాసం మన మేధలో అస్పష్టంగా నున్నప్పటికీ, హృదయంలో అధైర్యంతో అణగి వున్నప్పటికీ , ప్రాణికమైన మనస్సు యొక్క తీరని కోరిక నిరంతర నిరాద రణతో, ఓటమితో నీరసించి విసుగు చెందినప్పటికీ, అంతరాత్మ అంతరాలలో

విశ్వాసాన్ని అంటిపెట్టుకొని వున్నది. తిరిగి దానిని చేరుకొనేది ఏదో ఒకటి వుండి తీరాలి, లేనట్లయితే మనం మార్గమధ్యంలో జారిపడవచ్చు, లేదా బలహీనతతో తాత్కాలిక అపజయాన్ని భరించలేని అసమర్థతతో, ఆశాభంగంతో, అధికప్రయాసతో, కీడు వాటిల్లుతుందేమోననే శంకతో దానిని త్యజించవచ్చు. జీవితంలోలాగే యోగంలో కూడా కేవలం మనిషి మాత్రమే నీరసపడకుండా చివరివరకు ఎదురయ్యే ప్రతి ఓట మిని, భ్రాంతిని, ప్రతి బంధకాన్ని, ప్రతికూలమైన పరస్పర వైరుధ్యమైన శక్తులను, సంఘటనలను జయిస్తూ, చివరకు తన విశ్వాసం సమర్థనీయమైనదని తెలుసుకుం టాము. అందుకు కారణం మనిషిలోని అతరాత్మకు, దివ్యశక్తికి అసాధ్యమన్నది ఏమీలేదు.

CWSA 23-24: 273

అందరూ ఈ ద్వారం చేరుకోగలరు, ఈ దేవాలయంలోకి ప్రవేశించ గలరు.

ఒక్కమారు ఈ సమగ్ర ఆత్మార్పణ మనః పూర్వకంగా, సారభూతమైన సంపూర్ణతతో ఒనరించి నట్లయితే, సర్వసమానంగా అందరిలోను వున్న దైవంయొక్క ఉనికి మరే ఇతర ప్రాథమిక నిబంధనలను విధించదు. అందరూ ఈ ద్వారం చేరు కోగలరు, అందరికీ ఈ దేవాలయ ప్రవేశం వుంటుంది. సర్వజన ప్రేమికుడి దివ్యధా మంలో మన మధ్యనున్న ఐహిక వివక్షతలన్నీ మటుమాయమౌతాయి.

ఆ దివ్యసన్నిధిలో నీతిమంతుడికి ప్రాధాన్యత ఈయబడదు, పాపిష్టుడికి ప్రవేశం నిషేదించబడదు. పవిత్రమైన జీవనం గడుపుతూ, ధర్మబద్ధమైన నడవడి గల సద్బ్రా హ్మణుడితో పాటు పాపభూయిష్టము, దుఃఖాక్రాంతమగు గర్భమునుండి కులహీను డిగా పుట్టి ఇతరులచే తిరస్కరించబడిన వాడు సైతం ఈ మార్గంలో జతగా పయ నించి పరమోత్కృష్టమైన ముక్తిని పొందుటకు, శాశ్వతుడి దివ్యధామానికి చేరుటకు సమాన హక్కు వుంటుంది. దైవం ఎదుట స్త్రీ, పురుషులు సమానహక్కులు కలిగి వుంటారు. ఎందుకనగా పరమాత్ముడికి వ్యక్తుల పట్ల గాని, వారి మధ్యనున్న సామాజిక వ్యత్యాసాల పట్లగాని మన్నన వుండదు. అందరూ తిన్నగా మధ్యవర్తి ప్రమేయం లేకుండా, సంకెళ్ళవంటి నియమనిబంధసలు లేకుండా అతనిని చేరవచ్చు. గీతా చార్యుడు అంటాడు: "ఎప్పుడైనా దుష్టస్వభావం కలవాడు ఏకోన్ముఖమైన సంపూర్ణ



పరమోత్కృష్ట విశ్వాసం అనేది అందరిలోను పరమేశ్వరుని చూసేది, దాని దృష్టికి అభివ్యక్తమైనది, అభివ్యక్తం కానిది అంతా ఒకే ఒక్క దైవం. పరిపూర్ణ సంయోగమనేది దైవంతో ప్రతి క్షణం, ప్రతి పనిలో మరియు ప్రకృతి సమగ్రత్వ మంతటితో సమాగమ మవుతుండేది.

CWSA 19:400 అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

ప్రేమతో నా వైపు మరలినట్లయితే, అతడిని ఒక ఋషిగా పరిగణించాలి. కారణం అతనిలోని స్థిరమైన ఉద్యమస్ఫూర్తితో గూడిన సంకల్పం ఉచితమైనది, సంపూర్ణమైనది". అతి శీఘ్రంగా అతడు ఒక ధర్మబద్ధమైన అంతరాత్మ గలవాడుగా పరిణమిస్తాడు, శాశ్వతమైన ప్రశాంత స్థితిని పొందుతాడు.

CWSA 19: 334

అనువాదం: అందుగులపాటి కైలాసాపతి

విశ్వాసం — లక్షణం

విశ్వాసం, అభిప్రాయం, నమ్మకం, దృఢవిశ్వాసం

విశ్వాసం సర్వసాధారణమైన పదం — శ్రద్ధ

దైవం ఉనికి, వివేకం, ఆధిపత్యశక్తి, ప్రేమ, అనుగ్రహాలపై అంతరాత్మ అభిప్రాయం — నమ్మకం, ధృఢవిశ్వాసం అనేవి దృక్పథాలు, దాని నుంచి ఉద్భవించినవి.

నమ్మకం అనేది చిత్తశుద్ధితో పిలిచినప్పుడు దైవం తప్పకుండా వింటాడనే కచ్చితత్వ అనుభూతి. ఆయన సహాయం చేస్తాడని, దైవం చేసేదంతా ఉత్తమోత్తమైన మంచికేనని. ధృఢవిశ్వాసం అనేది దైవంమీద మనస్సు, హృదయాలకుండే పూర్తి నిర్భరత, దాని మార్గదర్శనం, రక్షణమీద పూర్తిగా నిర్భరతతో నుండుట.

*

విశ్వాసం — ఒక క్రియాశీలమైన సంపూర్ణ అభిప్రాయం, ఒప్పుదల

అభిప్రాయం — కేవలం మేధోపరమైన ఒప్పుదల మాత్రమే.

ధృఢ అభిప్రాయం — సరియైన కారణములుగా అనిపించడం వలన కలిగిన మేధోపరమైన అభిప్రాయం.

నిర్భరంగా నుండుట — ఏదో ఒకదాని కోసమై మరియొక దానిమీద ఆదారపడడం ధృఢవిశ్వాసంమీద ఆధారపడినది.

ధృడవిశ్వాసం — కచ్చితంగా వేరొకరు నిస్సంకోచంగా సహాయం చేస్తారనే తలంపుతో కూడిన అనుభూతి, వారి మాట, శీలం, మొదలైన వాటిమీద నిర్భరత.

నమ్మకం — భద్రత సంవేదన, దృఢవిశ్వాసంతో కూడుకున్నది.

CWSA 28: 342

విశ్వాసం అనేది మానసిక అభిప్రాయంకాదు, కాని క్రియాశీలమగు అంతర్బుద్ధినుండి వచ్చిన దృఢ అభిప్రాయం

నేను విశ్వాసం మీద ఎక్కువగా నొక్కి చెప్తున్నానంటే, — కాని ముందస్తుగా తలెత్తే సందేహం, ఖండనలను త్రోసిరాజనడం కంటే గుణాత్మకమైన విశ్వాసాన్ని కూడా కొంత నొక్కి చెప్తున్నానంటే — దానికి కారణం ఈ సందేహం, ఖండనలు, అడ్డంకులు కల్పించే శక్తుల చేతులలో పనిముట్టు అవడం మూలంగా, ఎప్పుడైతే నేను నిన్ను ముందుకు తోయాలని ప్రయత్నిస్తున్నానో, అవి నీ అడుగులను కదల నీయడంలేదు. నీవు వాటిని వదిలించుకోలేకపోతే లేక వదిలించుకోవాలని అనుకోకపోతే ("వదిలించుకోవాలని అనుకోకపోవడం" ఎందువల్లనంటే హేతువుమీద గౌరవం మరియు నిజంకాని విషయాలను విశ్వసించవలసి వస్తుందేమోననే భయంతో, "వదిలించుకోలేక పోవడానికి" కారణం వ్యతిరేకానుభవం), అప్పుడు నేను నీ కోసం అదిలేకుండా ఉండేటట్లుగా కార్యనిర్వహణ చేయాలి. ఆ కార్యం కేవలం సూటైన, పోల్చిచూస్తే తేలికైన దానికి బదులుగా కఠిన కార్యమవుతుంది.

భౌతిక వాదుల ఖండనను నేను ముందస్తు ఖండన అని ఎందుకు అంటున్నానంటే కారణం అతడు తాను ఖండించే దానిని కనీసం పరిగణలోకి తీసుకోవటానికి గాని లేక పరీక్షించటానికి గాని తిరస్కరిస్తాడు, కాని, దానిని ఖండించటంతో మొదలు పెడ్తాడు. లియోనార్డ్ ఉల్ఫ్ అతని "క్వాక్, క్వాక్," అనే అవివేకమైన అరుపులాగా, తన సొంత సిద్ధాంతాలను అది ఖండిస్తుంది. కాబట్టి అందువలన అది సత్యం కాజాలదు. దానికంటే వేరుగా, దైవంలో, దైవానుగ్రహంలో మరియు దివ్యయోగంలో, గురువులో మొదలుగాగల వాటిలో ఉండే విశ్వాసం, ముందస్తుగా ఏర్పడింది కాదు. కారణం అది ఒక బృహత్తరమైన మానవ సముదాయం యొక్క ఎన్నో వేల శతాబ్దాలుగా, లక్షల ఏళ్ళుగా ప్రోగవుతున్న అనుభవం, దానితో పాటుగా అది వ్యక్తిగతమైన అంతఃస్ఫూర్తికూడా. అందువల్లనే అది అంతర్బుద్ధి స్ఫూర్తి, అది వందలు, వేలుగా నాముందు పరీక్షించినవారి అనుభవాలతో దృఢీకరించబడి నటువంటిది.

CWSA 28: 347

విశ్వాసం అంతరంగ అస్తిత్వపు అంతఃస్ఫూర్తి

..... విశ్వాసం బాహ్య ఘటనల మీద ఆధారపడిన మానసిక అభిప్రాయం కాదు, కాని అది ఆధ్యాత్మిక విషయాల మీద అంతరంగ అస్తిత్వపు అంతఃస్ఫూర్తి.... రామకృష్ణులు వాడిన 'అంధ' అనే విశేషణానికి సంబంధించి, దానర్థం నేను చెప్పిన విధంగా, అజ్ఞానంతో తేలికగా నమ్మేది కాదు, కాని మేధస్సు ప్రశ్నలకు కలవరం చెందేది కాదు, బయట తారసపడే ఘటనలకు తన నిశ్చయాన్ని మార్చుకొనేది కాదు. ఉదాహరణకు: ఒకరికి దైవం మీద విశ్వాసం ఉంటుంది, వాస్తవానికి ఇక్కడి ఈ ప్రపంచం లేదా కనీసం మానవ ప్రపంచం దివ్యం కానటువంటి శక్తులచే తరమబడుతున్నదని అనిపిస్తున్నా కూడా. ఒకరికి గురువుమీద విశ్వాసం ఉంటుంది, అతడు వినియోగించే విధానాలను నీ మేధస్సు గ్రహించ లేకపోయినా లేదా ఇప్పటికీ నీకా అనుభవం లోకపోవడంతో వాటిని నిజమని నీవు ఆమోదించలేకపోయినా కూడా (కాని అతని జ్ఞానం, అనుభవం నీకంటే ఎక్కువ కానప్పుడు, నీ వతనిని గురువుగా ఎందుకు ఎంపిక చేసుకుంటావు?) ఒకరికి లక్ష్యానికి చేరుకొనే మార్గంమీద విశ్వాసం ఉంటుంది. అది చాలా దూరంలో ఉండి, దారి పొగతో, మబ్బులతో కమ్ముకుని, మెరుపులతో పిడుగులు పడుతున్నప్పటికీ కూడా. ఆ విధంగా ఎన్నో. ప్రాపంచిక విషయాలలో కూడా విశ్వాసం కనక లేకపోతే మనిషి గొప్పకార్యా లేమీ సాధించలేడు — ఆధ్యాత్మిక క్షేత్రంలో అది ఇంకా ఎక్కువ ఆవశ్యకం.

CWSA 28: 344- 45

విశ్వాసం ముతక మానసిక అభిప్రాయం కాదు

ఆధ్యాత్మిక అన్వేషకుడినుంచి దేనినైనా, ప్రతిదానినీ నమ్మమని కచ్చితంగా కోరబడటంలేదు; అటువంటి విచక్షణారహితమై, మానసిక దుర్భలతతో తేలికగా నమ్మేయడం అనేది కేవలం తెలివిలేని తనమే కాకుండా అధమాధమస్థాయికి చెందిన అనాధ్యాత్మికం. ఆధ్యాత్మిక జీవిత ప్రతిక్షణంలోను ఒకరు సంపూర్తిగా ఆ ఉన్నతోన్నత మైన మహాప్రకాశంలో చేరేవరకు, వారు తమని తాము జాగ్రత్తగా సంరక్షించుకుంటూ, ఆధ్యాత్మిక సత్యాన్ని దాని కపట-ఆద్యాత్మిక అనుకరణాలనుంచీ లేదా దానికి బదులుగా వాటి స్థానంలో మనస్సు, ప్రాణికంనుంచి జనించిన, కోరికలు కల్పించిన ప్రత్యమ్నా

యాలనుంచి వివేచించి వేరుచేయగలిగేలా ఉండాలి. దివ్యసత్యాన్ని అసురశక్తుల అనృతాలనుంచి వేరుచేయగలిగే ఒక ఆధిపత్యశక్తి యోగంలో ప్రధానంగా అత్యావశ్యకం. ఇప్పుడు ప్రశ్న, దానిని అత్యుత్తమ రీతిలో తరచూ అనృతాన్ని చంపేయడంతో పాటు, సత్యాన్ని కూడా అదే పక్షపాత రహితమైన ప్రహరణంతో తిరస్కరించే నకారాత్మకమైన, వినాశకర విధానమైన సందేహంతో చేయడమా లేక ఇంకా ఎక్కువ గుణాత్మకమైనది, సహాయంచేసేది, ప్రకాశవంతంగా అన్వేషించే శక్తి, ఏదైతే దాని అంతర్గత జ్ఞానంతో, సందేహమనే పదునైన బాకుతో, అసలే లేదనేటటువంటి, దుడ్డుకర్రతో సత్యాన్ని, అనృతాన్ని ఒకే గాడిన కట్టూ, నిర్భంధించి ఒత్తిడి చేయనటువంటి ఒక ఆధిపత్యశక్తిని కనుగొన గలగటమా అనేది. భేదం చూపనటువంటి మానసిక అభిప్రాయాన్ని బోధించటం ఆధ్యాత్మికం కాదు, లేక యోగవిధానమూ కాదు. విశ్వాసమని దేన్నయితే అది చెప్తున్నదో అది కేవలం ముతక మానసిక అభిప్రాయంకాదు, కాని తనలో నుంచి మార్గదర్శనంచేసే ప్రకాశానికి ఆత్మ యొక్క విధేయత, ప్రకాశం జ్ఞానంలోనికి నడిపించేవరకు ధృఢంగా కొనసాగవలసిన విధేయత.

CWSA 28: 342

విశ్వాసం అనుభవంమీద ఆధారపడదు

ఏదైతే నీలో లేదని, అనుభవం లేనప్పుడు నీకది ఉండటానికి ఆస్కారం లేదని నీవు చెప్తున్నావో అటువంటి విశ్వాసం గురించి నేను కొంత చెప్పాలనుకుంటున్నాను. మొట్టమొదటగా విశ్వాసం అనుభవం మీద ఆధారపడదు; అది ఏదో అనుభవానికి ముందే అక్కడ ఉండేది. ఒకరు యోగం మొదలుపెట్టినప్పుడు; సాధారణంగా అది వారి అనుభవ బలంమీద ఆధారపడదు కాని విశ్వాసం బలం మీదనే ఆధారపడుతుంది. అది కేవలం యోగంలోను, ఆధ్యాత్మిక జీవితంలో మాత్రమే కాదు, సాధారణ జీవితంలో కూడా అంతే. కార్యధురంధరులు, కొత్త విషయాలను కనిపెట్టేవారు, ఆవిష్కర్తలు, సృష్టికర్తలు విశ్వాసంతోనే మొదలుపెడ్తారు. వాస్తవ నిరూపణం చేయబడేదాకా లేక విషయం పూర్తి చేయబడేదాకా వారు ఆశాభంగం చెందినప్పటికీ, అపజయం పాలైనప్పటికీ, నిజనిరూపణ కాలేకపోయినప్పటికీ, ఖండిచబడినప్పటికీ, సాగిపోతూనే ఉంటారు.కారణం వారిలో ఏదో ఒకటి ఇది సత్యమని, దానిని తప్పక అనుసరించవలసినదేనని, చేసి తీరవలసినదేనని చెప్తుంది కనక. రామకృష్ణులయితే, ఇంకా చాలా

దూరం ముందుకు వెళ్ళి, అంధవిశ్వాసం తప్పుకాదా అని అడిగినప్పుడు ఇల చెప్పారు, ఉండవలసింది కేవలం అంధ విశ్వాసమే, ఎందువల్లనంటే విశ్వాస గుడ్డిదన్నా అవుతుంది లేక అది విశ్వాసమే కాకుండా మరేదో అవుతుంది – హేతువుచే అనుమానించబడింది., దృఢమైన అభిప్రాయంతో నిరూపితమైనటువంటి లేక రూఢికాబడిన జ్ఞానం.

CWSA 29: 92- 94

అనుభవాలు ఆవశ్యకంగా విశ్వాసంవైపు నడిపించవు

విశ్వాసానికి అనుభవం ఆవశ్యకమని, ఏ విశ్వాసమూ అది లేకుండా ఉండ ఆస్కారం లేదని అనటం, మానవ మానసిక విజ్ఞానాన్ని మొత్తానికే ఖండిస్తుంది అనుభవానికి ముందే వేలమంది విశ్వాసాన్ని కలిగి ఉంటారు. ఆ విశ్వాసమే వారికి అనుభవం పొందేందుకు సహాయం చేస్తుంది. "ఋజువు లేక అభిప్రాయంలేదు" అనే సిద్ధాంతీకరణ భౌతిక శాస్త్రానికి వర్తిస్తుంది. ఆధ్యాత్మిక క్షేత్రంలో అది వినాశకారి — చెప్పాలంటే మానవుల కార్యనిర్వహణ క్షేత్రంలో లేదా సాధుపుంగవులు లేక భక్తులు భగవదనుభవం పొందటానికి సుదీర్ఘకాలం ముందునుంచే వారు భగవంతుడిలో విశ్వాసం కలిగి ఉంటారు — కార్యదురంధరులైన మనుషులు తాము ఆశించిన ప్రయోజనం మీద అది విజయ కిరీటం వరించటానికి సుదీర్ఘకాలం ముందునుంచే విశ్వాసం కలిగి ఉంటారు — లేని పక్షంలో వారు ఓడిపోయినా, అపజయం పొందినా మృత్యువు ఎదురైనా పట్టుదలతో పోరాటం సాగించి ఉండేవారు కాదు. నిజమైన విశ్వాసమని కృష్ణప్రేమ్ దేనినంటున్నాడో నాకు తెలియదు. నా ఉద్దేశంలో విశ్వాస మనేది మేధస్సు అభిప్రాయం కాదు, కాని అది ఆత్మయొక్క లక్షణం; ఎప్పుడైతే నా అభిప్రాయం తడబడుతుందో, అపజయం పొందుతుందో, ఆశ ఆరిపోతుందో ఆత్మ మాత్రం దృఢంగా నిలబడి ఉంటుంది. మొండిగ పట్టుదలతో హఠంచేస్తూ, ' మార్గమిదే తప్ప మరొకటిలేదు, నేను ఏ మహాసత్యాన్నైతే సమగ్రంగా అవగతం చేసుకొన్నానో అదే మహాసత్యం, మనస్సు ఏమైనా నమ్మనీ లేక నమ్మకపోనీ" ఇంకొక విధంగా చూస్తే, అనుభవాలు ఆవశ్యకంగా విశ్వాసం వైపే నడిపించవు ఒక సాధకుడు నాకు వ్రాసాడు. "నేను శ్రీమాత అనుగ్రహం నాలో అవతరించడం చూశాను, కాని నేను దానిని నమ్మడంలేదు, ఎందువల్లనంటే అది ప్రాణికం కల్పింతం

కావచ్చు. ” మరొకరికి సంవత్సరాల తరబడి అనుభవాలు కలిగేది, తరువాత లేకుండా పోయినై, కారణం అతడికి, అతడి మాటలలో, “విశ్వాసం పోయింది.” ఇవన్నీ నా మనో కల్పితాలు కావు. అవి యదార్థాలు, అవి తమదైన కథను చెప్తాయి.
CWSA 29: 94-95

విశ్వాసం మరియు జ్ఞానం

మనకి మహాసత్యం తెలిసేదాకా (మానసికంగా కాదు, కాని అనుభవంతో, చైతన్యం మార్పుతో) మనలను నిలబెట్టటానికి, మహాసత్యాన్ని అంటిపెట్టుకుని ఉండటానికి ఆత్మ యొక్క విశ్వాసం అవసరం అవుతుంది. కాని మనం జ్ఞానంలో జీవిస్తుంటే, ఈ విశ్వాసం జ్ఞానంగా మారిపోతుంది.

సహజంగానే, నేను సూటైన ఆధ్యాత్మికజ్ఞానం గురించి మాట్లాడుతున్నాను. మానసికజ్ఞానం విశ్వాసాన్ని భర్తీ చేయలేదు; మానసిక జ్ఞానం ఉన్నంతకాలం విశ్వాసం అక్కర కూడా ఉంటుంది.
CWSA 29: 91-92

విశ్వాసం, సమర్థనలు, అసహనం

.... నా కనిపిస్తున్నది నీవు విశ్వాసాన్ని మానసిక అభిప్రాయాలతో ఏకీభవింపజేస్తున్నావు — కాని అసలైన విశ్వాసం ఒక విధంగా ఆధ్యాత్మికం, ఆత్మ యొక్క జ్ఞానం. నీ జాబులో పేర్కొన్న నీ సమర్థనలు మానసిక అభిప్రాయాల కొరుకుడుపడని సమర్థనలు. పర్యవసానంగా అవి ఒకరి జాతికి, దైవానికి చెందిన తీవ్రమైన సమర్థనలకు దారి తీస్తాయి, కారణం అవి ఒకరికి సొంతమైనవి, అందువల్ల తప్పకుండా ఇతరులకు చెందిన వాటికంటె మహత్తరం — ఆ వైఖరి మానవ ప్రకృతికి, సార్వజనీనమైనది. నాస్తికుడు కూడా ఓరిమిలేనివాడే, కాని మహాప్రకృతి, మహా పదార్థముల పరంగా తనవైన సూక్తులను ప్రకటిస్తూ, కేవలం అవే సత్యమని ఎవరైతే వాటిని నమ్మరో లేదా ఇతరములను నమ్ముతారో వారిమీద అతడు జ్ఞానప్రకాశంలేని మూర్ఖులుగా, మూఢవిశ్వాసపు బుద్ధిహీనులుగా తన తిరస్కారాన్ని కురిపిస్తాడు. ఆ విధంగా నన్ను గురించి భావించడంవలన నేనతని మీద ఎటువంటి కోపాన్ని పెట్టుకోను; కాని నేను చెప్పేదేమంటే, ఈ వైఖరి మతవిశ్వాసానికి మాత్రమే పరిమితం కాదు.



“ఏ భక్తుడైనా నన్ను ఎటువంటి రూపంలోనైనా విశ్వాసంతో ఆరాధించ దలచుకొంటే, నేను వారి విశ్వాసాన్ని ధృఢంగా ఎటూ మరలకుండా చేస్తాను.” అతని భక్తిలోని ఆ విశ్వాసపు శక్తి, ఆరాధనల ద్వారా తన కోరికనూ, ఆధ్యాత్మిక సాక్షాత్కారతనూ, ఆ క్షణాని కతడు దేనికి యోగ్యుడో దానినీ అతడు పొందుతాడు.

CWSA 19: 287

కాని మతవిశ్వాసాలనుంచి దూరంగా స్వేచ్ఛగా ఉండి, దేవతలను లేదా గురువులను నమ్మని వారికి కూడా సహజంగానే సమానం.

CWSA 28: 432

దైవంమీద నమ్మకం సోమరితనానికి సాకుకాదు

దివ్యమహా ఆదిపత్యశక్తికి విశ్వాసం, దైవంమీద నమ్మకం, సమర్పణ, ఆత్మ సమర్పణ అనేవి అత్యవసరం, అనుల్లంఘనీయం.కాని దైవంమీద నమ్మకాన్ని సోమరి తనానికీ, బలహీనతకు, నిమ్నప్రకృతి ప్రేరణలకు ఆధీనం చేసుకోవడానికీ అవశ్యం ఒక సాకుగా మాత్రం చేసుకో కూడదు. అది అవిశ్రాంతమైన ఆకాంక్షతో, దివ్యసత్యం మార్గానికి అడ్డంవచ్చే వాటినన్నింటినీ పట్టుదలతో కూడిన నిరాకరణతో తప్పక కొనసాగుతూ ఉండాలి. దైవానికి సమర్పించుకోవడాన్ని ఒక సాకు, ఒక వేషం లేక తన కోరికలకు నిమ్న గమనాలకు ఒక అవకాశంగానూ లేదా ఒకరి సొంత అహంకారానికి లేదా దివ్యత్వం యొక్క అనృత వేషధారణను ధరించిన అజ్ఞానము, అంధకారముల ఏదో ఒక మహాశక్తికి సమర్పణకు అవకాశంగానూ తప్పక మరల్చకూడదు.

CWSA 29: 87

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

విశ్వాసము — సందేహము

విశ్వాసము, సహనము ప్రధాన ఆవశ్యకతలు

అన్ని యోగాలలోను ప్రాథమిక ఆవశ్యకతలు విశ్వాసము, మరియు సహనము.

మనిషియొక్క ప్రాణిక స్వభావము ఎప్పుడూ తన శ్రమకు తగ్గ ఫలం కోసం ఆశ పడుతుంది. ఒకవేళ ఆ ఫలం లభించడం ఆలస్యమైనా, లేదా ఇంకా అది తనకి దక్కదేమో అనిపించినా, ఆ ఆదర్శంపైన, ఆ మార్గదర్శకత్వంపైన విశ్వాసం కోల్పోతాడు... మనం చీకట్లో దిక్కుతోచక తూలి తడబడినప్పుడు, చాలాకాలం బాధకు గురైనప్పుడు, లేదా మనం ఎంచుకున్న లక్ష్యాన్ని విసర్జించవలసి వచ్చినప్పుడు అన్నింటికన్న మనకి సులభమైనది, మన హృదయంలో దైవనింద చేయడం. “నేను దైవానికి నమ్మకంతో అప్పచెప్పాను. కాని పాపం, పొరపాట్లు బాధతో నేను మోసగించ బడ్డాను.” అని మనం అనుకుంటాము, లేదా “కఠినమైన వాస్తవాల అనుభవాన్ని వ్యతిరేకించి, నిరుత్సాహ పరచే ఆదర్శాలపై నా మొత్తం జీవితాన్ని పణంగా పెట్టాను. సామాన్య అనుభవాన్నిచ్చే పరిధిని అంగీకరించి, గట్టి పునాది మీద నడిచే మామూలు మనుషుల్లా బ్రతికితే బాగుండేది” అని కూడా అనుకుంటాం. అలాంటి సందర్భాలు కొన్నిసార్లు తరచుగాను, కొన్నిసార్లు సుదీర్ఘంగాను, వుంటాయి. ఉన్నతమైన అనుభవం మరచి పోయి, హృదయం తన చేదైన అనుభవంపై ఏకాగ్రత చూపుతుంది. ఇలాంటి చీకటి ఆవరించిన సమయాలలోనే ఈ దైవికమైన శ్రమ నించి శాశ్వతంగా పతనం చెందడం, లేదా పూర్తిగా వెనుతిరిగి పోవడం సంభవిస్తుంది.

ఈ మార్గంలో స్థిరంగా, సుదీర్ఘంగా నడిచినట్లయితే అత్యంత తీవ్రమైన వత్తిడిలో కూడా హృదయంలో విశ్వాసం చెక్కు చెదరదు. ఒక వేళ అది దాగి ఉన్నా, లేక భరించలేనిదిగా కనిపించినా, ఏ మాత్రం అవకాశం దొరికినా అవిశ్వాసం తిరిగి పునరావిర్భవిస్తుంది. ఎందుకనగా ఆ సుదీర్ఘ మైన ఓటమి, అత్యంత దురదృష్టకర తొట్రుబాట్లు సంభవించినా ఈ హృదయాన్ని లేక మేధస్సును మించినదేదో ఒకటి దానిని నిలిపి వుంచుతుంది. అనుభవం గల సాధకునికి కూడా ఇలాంటి తప్పటడుగులు, అస్పష్టతలు, అతడి పురోగతికి అవరోధం కలిగిస్తాయి. ఇక కొత్త అభ్యాసకులకి అవి చాలా ప్రమాద కరం. అందువలన సాధకులు ప్రారంభంనుండి మేధస్సుకు గుడ్డిదిగా కనిపించినా, ఈ మార్గంలో అత్యంత కష్టతరమైన శ్రమను అర్థం చేసుకొని,

విశ్వాసంయొక్క ఆవశ్యకతను గ్రహించాలి. ఈ విధానం మన హేతుపరమైన తెలివికంటే వివేకవంతమైనది.

CWSA 23-24:244-45

సందేహాస్పదమైన, తిరస్కారభావము గల వైఖరి ఈ మార్గంలో అవరోధం

ఆధ్యాత్మికత అన్నది నూతన చైతన్యం. అది పరిణామం చెందాలి, పరిణామం చెందుతోంది. ప్రారంభంలో చాలా కాలంవరకు ఆ సంపూర్ణ ప్రకాశం కొద్దిమందికి మాత్రమే సమకూరుతుందనేది సహజమైన విషయం. మానవజాతి మొత్తంలో కొందరికి అది పాక్షికంగా సమకూరుతుంది. కాని ఏ అనుభవమైతే కొద్ది మందికి లభించిందో దానినే పరిణామ ప్రక్రియలోని ఒకానొక స్థాయిలో పరిపూర్ణం గావించి అందరికి అందుబాటులోకి తేవాలన్నది మా ప్రస్తుత ప్రయత్నం. ప్రకాశం, శాంతి, ఆనందాల కలబోత అయిన ఆ ఉన్నత ప్రకాశాన్ని ప్రశ్నించడం వలన, సందేహించడం వలన పొందలేము. సందేహం మనలను ముందుకు పోనివ్వదు. అసంభవం, అసంభవం అని చెప్తూ ఉంటుంది, గతంలో లేనిది భవిష్యత్తులో ఉండదని తలుస్తుంది. ఇప్పటివరకు పూర్తిగా సిద్ధించనిది భవిష్యత్తులో మరింత సంపూర్ణంగా ఎలా సిద్ధిస్తుంది? అని ప్రశ్నిస్తుంది. అందువల్ల ఓ విశ్వాసం, ఓ సంకల్పం, లేక కనీసం ఓ నిరంతర ప్రోద్బలం, ఆకాంక్ష అవసరం — ఇది తప్ప అన్యమైనదేదీ నాకు తృప్తి నివ్వదు అన్న భావాన్ని లక్ష్యాన్ని చేరేవరకు ప్రోత్సహిస్తూఉండాలి. అందు కే సందేహం, తిరస్కారం అనేవి మార్గంలో అవరోధాలుగా ఉంటాయని చెప్పడం, అవి ఆధ్యాత్మిక అనుభవాలు నిరాటంకంగా వికసించే మార్గంలో అడ్డంకులుగా ఉంటాయి.

CWSA 28: 271

సాధనకు తప్పనిసరిగా కలిగే అవరోధం

యోగ మన్నది మేధోపరమైన వాదానికి, లేక వ్యాస రచనకు సంబంధించిన విషయం కాదు, ఇది మనస్సుయొక్క తర్క వితర్కాలు, లేదా వాదోపవాదాలతో యోగాన్ని గురించి నిజంగా అర్థం చేసుకోవడం లేదా దాన్ని అనుసరించడంకాదు. సందేహించే స్వభావం, "నిజాయితీ గల సందేహం," ప్రతి విషయంలోను మనస్సు సంతృప్తి చెంది నిర్ధారించాలి అనేది బాహ్యంలో చోటు చేసుకొనే మానసిక చర్యలలో

బాగానే వుంటుంది, కాని యోగం అన్నది మానసిక భూమికకు సంబంధించినది కాదు. అక్కడ స్థాపన చేయాల్సిన చైతన్యం మానసికము, తార్కికము లేదా వాదోపవాదానికి సంబంధించినది కాదు. అంతేకాక యోగం మరొక విషయాన్ని స్పష్టంగా మన ముందుంచింది. అది మేధోపరమైన, తార్కికమైన మనస్సుతో సహా మనస్సు మొత్తం నిశ్చలస్థితిని పొంది, తన నిశ్శబ్ద ప్రశాంత స్థితిలో ఆ ఉన్నత గాఢచైతన్యానికి, ఆ జ్ఞాన దృష్టికి తెరచుకొని ఉండేదాకా సాధన తన లక్ష్యాన్ని చేరలేదు. ఆ కారణం చేతనే భారతీయ ఆధ్యాత్మిక సాంప్రదాయం గురువు పట్ల నిస్సందేహ ఉన్మీలనాన్ని కోరుతుంది. ఇంక గురువుని తప్పు పట్టడం, విమర్శించడం, ఎదిరించడం దోషాలుగా ఎంచబడ్డాయి. అవి సాధనకు తప్పని అవరోధాలు.

CWSA 28: 387

సందేహాత్మక, ప్రశ్నార్థక స్వభావం

సందేహం యొక్క యదార్థ కారణాన్ని సంవాదం ద్వారా నివృత్తి చేసుకోగలిగితే, దానిని తార్కిక పద్ధతి ద్వారా తృప్తి పొంద గలిగించి, దానిని రూపు మాపగలిగితే, ఆ పద్ధతిని ఆచరించడంలో కొంత అర్థముంది. కాని సందేహమన్నది కేవలం సందేహించడం కోసమే అన్నప్పుడు అది మనసును తన ప్రత్యేక ధర్మం కోసం పనిముట్టుగా ఉపయోగిస్తుంది. అంతే కాదు, మనసు తన నిఖార్సయిన, అణచలేని సందేహాలకు నిజాయితీతో పరిష్కారం వెతుక్కుంటున్నానని భావిస్తున్నప్పుడు అది మరింత తీవ్రంగా ఉంటుంది. మానసిక స్థితులు ఎప్పుడూ విభేధిస్తాయి. అంతేకాక మనుషులు ఒకరినొకరు ఒప్పించలేక జీవితాంతం వాదించుకోగలరన్నది లోక విదితమే. మళ్ళీ మళ్లీ వచ్చే అదే సందేహాలకు సమాధానం ఇస్తూనే ఉండడం జరుగుతూనే ఉంది. దానివల్ల చాలా కాలంగా ఆశ్రమంలో సాధన కుంటుబడుతోంది. ఇది నిజానికి యోగం యొక్క లక్ష్యాన్ని భంగపరుస్తుంది, యోగంయొక్క కేంద్ర నియమానికి విరుద్ధమైనది. అంతేకాక దానివల్ల ఆధ్యాత్మికంగా కాని, మరేవిధంగా కాని లాభమన్నది లేదు. చైతన్యపెరుగుదల లేదా చైతన్య విస్తృతి వల్ల తప్ప మరేవిధంగాను ఎవరైనా వారి ప్రాథమిక సందేహాలను పోగొట్టుకో లేరు. విచారణ కోసం ప్రశ్నలు వేయడమైతే, అవికూడ తమను తాము నిరూపించుకొనుటకు చేసే వాదన కాకుండా జ్ఞాన పిపాసలో భాగమైనప్పుడు వాటికి సమాధానం ఇవ్వచ్చు.

కానీ 'సందేహాత్మక వైఖరి' ఎన్నటికీ తృప్తి చెందనిది, ఒప్పించలేనిది.
CWSA 28: 337-38

మనసు, ఆత్మ ఒక్కటి కావు

మేధోపరమైన మనస్సును ఆధ్యాత్మిక అనుభవానికి ప్రామాణికంగాను, బేరీజు వేయగల దానిగా భావించి వారిని నేను సూటిగా ఒక సామాన్య ప్రశ్న అడుగుతాను; దైవం మనసు కన్న తక్కువ స్థాయికి సంబంధించినదా లేక గొప్పస్థాయి కలదా? ఎప్పుడు విచారణలో మునిగి అంతులేని వాదోపవాదాలతో, తీరని సందేహాలతో, తలవంచని, నమ్రత లేని తర్కంతో ఉండే మానసిక చైతన్యం దివ్యచైతన్యం కంటె గొప్పదా లేక సమానమైనదా లేక తన కార్యాచరణలో తక్కువ స్థాయికి చెందినదా? అది ఉన్నతమైనదైతే, ఇక దైవాన్ని వెంటాడవలసిన కారణం లేదు. అది దానితో సరిసమానమైనదైనప్పుడు ఈ ఆధ్యాత్మిక అనుభవం యొక్క ఆవశ్యకత లేదు. కాని అది దాని కార్యాచరణలో తక్కువ స్థాయికి చెందినదైతే, అది ఆ దివ్య చైతన్యాన్ని ఏ విధంగా సవాలు చేయగలదు, ఏవిదంగా దానిని బేరీజు వేయగలదు లేదా ధర్మాసనం ముందు దైవాన్ని దోషిగా లేక సాక్షిగా నిలబెట్టగలదు, లేదా పరీక్షాధికారుల ముందు ప్రవేశార్హత కోరే అభ్యర్థిగా నిలువగలదు, లేదా సూక్ష్మదర్శిని క్రింద పరిశీలనకై కీటకంవలె ఉంచబడాలా? ప్రాణికమైన జంతువు తన ప్రాణిక సహజాతాల, సాంగత్యాల ప్రేరణల స్థాయిని నిర్దిష్టమైన ప్రామాణికాలుగా ఎంచి, వాటి ద్వారా మనిషి మనసును విశ్లేషించి, తీర్పుచెప్పి, లోతును కొలవగలదా? అది సాధ్యం కాదు, ఎందుచేతనంటే మనిషి మనసు అత్యంత శక్తివంతమైన సాధనం, విస్తృతమైన, సంక్లిష్టమైన కార్యాచరణ కలది. దానిని జంతువుయొక్క ప్రాణిక చైతన్యం అనుసరించలేదు. అదే విధంగా మానవ మనస్సు కన్న అనంత వ్యాప్తితో మరింత జటిలమై అధిక శక్తులు, ప్రకాశాలు కలిగి సామాన్య మానవ మనస్సుయొక్క అనిర్దిష్టమైన హేతువు, పరిమితమైన మానసిక మిడిమిడి జ్ఞానంతోకూడిన ప్రమాణాలతో విచారణ చేయలేని దివ్యజీవనము వివరించలేదు. దాని లోతులు కొలువ లేదన్నది గ్రహించడం అంత కష్టమైనదా? అతి సాధారణమైన సత్య మేమిటంటే మనసు, ఆత్మ ఒకటే కాదని, మరియు యోగ సాధకుడు తాను శాశ్వతముగా ఆ దైవంతో సంపర్కం మరియు ఐక్యత కోరినపుడు అతడు ఆధ్యాత్మిక చైతన్యంలోకి తప్పక

ప్రవేశించాలి అన్నది. (ఇందులో నేనే మాత్రం అతిమానసం గురించి ప్రస్తావించటం లేదు.) అందువల్ల అది మన మనసును తన పరిమితిని గుర్తించమని, తనను తాను స్థిమిత పరచుకుని, తన విజ్ఞాపనలను వదులుకుని, మరింత ఉన్నత ప్రకాశానికి సంపూర్ణ సమర్పణగా తెరచుకుని ఉండమని ప్రోద్బలం చేసే దైవంయొక్క వింతప్రవర్తన వలె లేదా నిరంకుశత్వంవలె కనిపించదు.

CWSA 28: 341-42

సందేహం మరియు విచక్షణ మధ్యతేడా

ఏది ఏమైనా ఒక్కవిషయంలో నేను సందేహానికి, విచక్షణకు మధ్య తేడా గమనించ గలను. సందేహం అంటే ఓ విషయానికి సంబంధించిన సత్యాన్ని కనుక్కొందుకు ప్రశ్నించడం అయితే, అది విచక్షణలో భాగమవుతుంది గనుక, దానిని అనుమతించవచ్చు. అయితే ఇప్పుడు సందేహం అంటే సామాన్యమైన అర్థం సునిశ్చితమైన, తిరుగులేని నిరాకరణ; అది పరిశోధనతో ఆగదు, వెలుగులో పరిశీలించ ప్రయత్నించదు, విచారణ సాగించదు. కాని ఒక్కసారిగా "ఓహ్, లేదు, నేను దాన్ని సత్యంగా ఎన్నటికీ తీసుకోలేను" అని ఒక్కసారిగా నిర్ధారణకు వచ్చేస్తుంది. ఆ విధమైన సందేహం సామాన్య జీవితంలో చాలా ఉపయోగకారి కావచ్చు, స్థిరపరచబడిన విషయాలను, ఆలోచనలను తుత్తినియలు చేయడానికి ఉపయోగ పడవచ్చు లేక కొన్ని బాహ్యంలోని వైరుధ్య విషయాలలో మన స్థానానికి తప్పక ముప్పు వాటిల్ల చేసేవిగా వుండవచ్చు. అంతే కాని మేధోపరమైన విచారణలో దాని ఉపయోగం అనుకూలమైనదని నేను అనుకోవటంలేదు. అక్కడ అది చేయగలిగింది ఏమీలేదు. నిష్పాక్షిక విచక్షణ చేసే దానికన్నా మించి ఏమీ చేయలేదు. ఆధ్యాత్మిక విషయాల్లో విచక్షణకి చాలా విశాలమైన స్థానం ఉంది, కాని నిరాకరణకు దారితీసే సందేహం సత్యమార్గాన్ని నిరోధించే "ప్రవేశం లేదు" అన్న ప్రకటన పత్రాన్ని పెట్టడమో, లేక సిద్ధాంతపరంగా "ఇంతవరకు చాలు, దీన్ని దాటి వెళ్ళరాదు" అని చెప్పడం తప్ప.

CWSA 28: 345

ఈ మార్గంలో అడ్డు వచ్చే మూడు ప్రధాన అవరోధాలు:

1. విశ్వాసం లేకపోవడం లేక అసంపూర్ణ విశ్వాసం.

2. అహంకారం - తన ఆలోచనలను అంటిపెట్టుకునే మనస్సు, స్వీయ కోరికలను ప్రధానంగా భావించి సత్య సమర్పణను అంగీకరించని ప్రాణశక్తులు, అలవాట్లను పట్టుకు వేళ్ళాడే భౌతికం.

3. చైతన్యంలో తమస్సు, లేక ప్రాథమిక నిరోధం, శ్రమతో కూడుకున్న ప్రయాసనుబట్టి మార్పుకు ఇష్టపడక పోవడం లేదా తన స్వయంశక్తిని, లేదా దైవశక్తిని విశ్వసించకపోవడం, లేదా మరో రకమైన అధోచేతనా సంబంధిత కారణం

CWSA 31: 638

అనువాదం: డి. సత్యవాణి

శ్రద్ద : యోగము

కళ్యాణ శ్రద్ధ:

సిద్ధిని సాధించాలంటే సమత గల హృదయం అవసరం. తటస్థమైన సమర్థతే గాక, సమస్త అనుభవాల వెనుక ఒక దివ్యశక్తి, శుభం కోసమే పనిచేస్తున్నదనే; భావన ప్రపంచంలోని విషాలను అమృతమయం చేయగల ఒక విశ్వాసం, వున్నదనే భావన: శత్రుత్వం వెనుక ఒక సంతసం కలిగించే ఆధ్యాత్మిక ఉద్దేశ్యం వున్నదని, బాధపడటం వెనుక ప్రేమమర్మం వున్నదని, బాధ బీజంలో దైవబలం, సంతసాల కుసుమం వున్నదనే స్పృహ కూడా శాశ్వతంగా ఉండాలి. హృదయం, ఏ మినహాయింపులు లేకుండా మొత్తం చైత్యపురుషుడు, రహస్య దివ్య ఆనందానికి బదులు పలికి తనను తాను యీ యదార్థమైన ఆది అంతస్తత్వంలోనికి మారిపోయేందుకు యీ విశ్వాసం, యీ కళ్యాణశ్రద్ద అవసరం ఉంది. ఈ శ్రద్ధ, సంకల్పంతో పాటు పరిమితీకరించ నలవిగాని విశాలత, గాఢతరప్రేమ నిండిన సమర్థత తోడు కావాలి. ఎందుకనంటే హృదయం ప్రధాన వ్యాపారం ప్రేమను పంచటం. సంపూర్ణ ఐకమత్యానికి, యేకత్వానికి మనకు విధి యిచ్చిన ఉపకరణం అది. ప్రపంచంలో యేకత్వాన్ని బుద్ధితో అర్థం

చేసుకోవడంతో చాలదు. దానిని మనం హృదయంతో, చైత్యపురుషునిలో అనుభూతి చెందాలి. దీనర్థం యేమిటంటే ఆ యేకైకునిలో ఆనందాన్ని, ప్రపంచంలోని సమస్త జీవుల ఆనందాన్ని, భగవంతునిపై ప్రేమను, సమస్త జీవుల ప్రేమను, తనలో అనుభూతి చెందడం.

CWSA 23: 24: 737

ఆధ్యాత్మిక జీవన ధర్మం:

దేన్నైనా సరే, ఒక భావాన్ని గాని, ఒక సంఘటనను గాని, నీకు దైవానికి మధ్య చోటు చేసుకొనడానికి కెందు కనుమతిస్తావు. నీవు పూర్తిగా ఆకాంక్షతో, సంతోషంతో వున్నప్పుడు దేన్ని గురించీ పట్టించుకోవద్దు. దైవం, నీ ఆకాంక్ష తప్ప మరేదీ నీకు ముఖ్యమైనది కాగూడదు. దైవాన్ని త్వరగా సంపూర్ణంగా, సమగ్రంగా పొందాలను కుంటే అవే నీ అన్వేషణకు ప్రాణశక్తి కావాలి. నిరపేక్షమై సమస్తాన్నీ ఆవరించివేసే మరేదీ జోక్యం చేసుకొన గూడని ఆ యేకైక విషయంగా అదే అవ్వాలి.

దైవాన్ని గురించిన మానవ భావాలకు, ఆతడెలా వుండాలి, ఆతడెలా పనిచేయాలి, యెలా పనిచెయ్యగూడదు, అనే మానసిక భావాలకు విలువేముంటుంది — అవి మార్గంలో తటస్థించేవి మాత్రమే సుమా, పట్టించుకోవలసిన విషయం మాత్రం దైవమే. నీ చేతన దైవాన్ని ఆదరణతో అక్కున చేర్చుకున్నప్పుడు దైవం అంటే యేమిటో అప్పుడే తెలుసుకోగలుగుతావు, అంతకు ముందు గాదు. కృష్ణుడు. కృష్ణుడే, అంతేగాని అతడేం చేసాడు, ఏం చేయలేదు అనేది ఎవరికైనా అనవసరం. కావలసిం ది ఆతని దర్శనం, ఆతనిని కలుసుకోవడం, దివ్యతేజం, దివ్యసన్నిధి, దివ్యప్రేమ, మహదానందం ఇవే ముఖ్యం. కాబట్టి ఆధ్యాత్మిక ఆకాంక్షతోనే సదా జీవించాలి. అదే ఆధ్యాత్మిక జీవన ధర్మం.

CWSA 29:56

*

నీకు దైవంలో, దైవకృపలో సాధనా సత్యంలో, సాధనకు ఎదురయ్యే మానసిక, ప్రాణిక, భౌతిక యిబ్బందులపై కాలక్రమంలో సాధించబడే ఆత్మవిజయంలో, మార్గంలో, గురువులో, హెకెల్ లేక హక్సలీ, లేక బెర్ట్రాండ్ రస్సెల్ సిద్ధాంతాలలో వ్రాసిన విషయాలలోనే గాక తక్కిన వాటి అస్తిత్వంలో గూడా విశ్వాసం వుండాలి.

ఎందుకనంటే యివి సత్యంగాకపోతే, యోగానికర్థమే వుండదు.

*

దైవాన్ని పొందాలనుకుంటే

... దైవాన్ని పొందాలనుకుంటే, దైవమే స్వయంగా హృదయాన్ని పరిశుద్ధం చేసే పనిని తీసుకొని, సాధనను అభివృద్ధిచేసి, అవసరమైన అనుభవాలు కలిగిస్తుంది అని చెప్పడంలో నా వుద్దేశ్యం ఏమిటంటే, ఆ వ్యక్తిలో గనక దైవం యెడల నమ్మకం, పరిపూర్ణవిశ్వాసం, సమర్పణకు సంకల్పం వుంటే, నేను ముందు చెప్పిన విధంగా జరుగగలదని, జరుగుతుందని చెప్పడం. ఎందుకనంటే ఆ విధంగా అతనిని దైవం స్వీకరించడంలో, అతని స్వప్రయత్నాల మీద మాత్రమే ఆదార పడకుండా తనను తాను దైవహస్తాల్లో పెట్టుకోవడం అనే అర్థం అందులో యిమిడి వుంది. దైవంలోనూ, క్రమంగా పురోభివృద్ధి చెందే ఆత్మార్పణలోనూ తన దృఢవిశ్వాసాన్ని, నమ్మకాన్ని వుంచాలనే అర్థం కూడా అందులో ఇమిడి వున్నది. వాస్తవానికి అటువంటి సాధనా సూత్రాన్నే నేనూ అనుసరించాను. యోగం కేంద్రీయ అంశంగా నేను దానిని గమనించాను. రామకృష్ణ "మార్జాల కిశోర న్యాయం" అని చెప్పిన దాని అర్థం యిదేయై వుంటుందని నేనను కుంటున్నాను, కాని ఒకేసారి అందరూ దానిని అను సరించలేరు. ఆ దశకు చేరడానికి చాలా కాలం పడ్తుంది. మనస్సు, ప్రాణికాలు ప్రశాంత స్థితికి చేరినపుడు అది అత్యధికంగా పెరుగుతుంది.

CWSA 29:100,70

అవివేకమైన ఆలోచనలు మాని, దివ్యజనని వంక మాత్రమే చూడు

అయోగ్యత, నైరాశ్యతకు చెందిన ఆలోచనలలో యే సాధకుడూ, యెప్పుడూ చిక్కుకో కూడదు. అవి అసంబద్ధ ఆలోచనలు, యెందుకనంటే అతనికి విజయాన్ని అందించేవి దివ్యజనని కృప, శక్తి. ఆమె దివ్య క్రియాశక్తి పనిచేయడానికి కావలసింది ఆతని అంతరాత్మ సమ్మతమేగాని, అతని వ్యక్తిగత యోగ్యత, అర్హత యెంత మాత్రమూ గాదు.

అవివేకపు ఆలోచనలు నుండి మరలి, ఫలితం దక్కలేదనే, కోరిక నెరవేర లేదనే అసహనంతో గాక, దివ్యమాత వైపు దృఢ విశ్వాసంతో, నమ్మకంతో దృష్టి

సారించు. ఆమె పనిచేసే విధానాలు నీకు ప్రశాంతతను, అంతరాత్మిక ఉన్మీలనాన్ని, సాక్షా త్కారం పొందేందుకు తిరిగి పురోగమనం సాగించడాన్ని నీకు ప్రాప్తింప జేస్తాయి. నీవు వెదుకులాడుతున్న విశ్వాసాన్ని, ప్రేమను, నిస్పందేహంగా, తప్పకుండా నీకు కలిగేటట్లు చేస్తాయి.

CWSA 29: 34-35

ఇదిగో ఈ శ్రద్ధనే నీవు పెంపొందించుకోవలసి వుంది

ఇదిగో యీ శ్రద్ధనే అభివృద్ధి చేసుకోవలసి వుంది — అది హేతుబుద్ధికీ లౌకిక జ్ఞానానికీ అనుగుణంగా వుండే శ్రద్ధ — అదేమిటంటే దైవం గనుక వుండి వుంటే అతడు నిన్ను యీ దివ్య మార్గానికి రమ్మని — స్పష్టంగా తెలిసేటట్లు — పిలిస్తే దాని వెనుక దైవకృప తప్పక వుండి వుంటుంది. ఇబ్బందు లెన్ని వున్నా వాటిలో నుంచి పోయి తప్పక చేరుకొంటావు. ఓటమిని సూచించే అపకార శక్తుల మాట వినవద్దు, లేక అసహన ప్రాణిక వేగిరపాటుతో వినిపించే ప్రతిధ్వనులను వినవద్దు. గొప్ప కష్టా లుంటాయి, గెలుపొందడా లుండవు, లేక దైవం యిప్పటి దాకా తనను తాను నీకు చూపుకో లేదు గనుక, ఇహ నెప్పుడూ కన్పించడు అనే మాటలు నమ్మ వద్దు. ఒక గొప్ప, కష్టసాధ్యమైన గమ్యంపైన మనసు పెట్టిన ప్రతి వ్యక్తీ తీసుకొనే దృక్పథాన్నే నీవు తీసుకొని "విజయం సాధించేంతవరకు నేను ముందుకు పోతూనే వుంటాను, విజయం సాధించి తీర్తాను, యిబ్బందులు వేటినీ పట్టించుకోను." దైవంలో నమ్మకం గల వ్యక్తి దైవం వున్నాడు, ఆతడున్నాడు గనుక, నేను ఆతనిని అనుసరించడం నిష్ఫలం కాదు. ఆతనిని కనుగొనేంత వరకు, ప్రతిదానినీ దాటుకుంటూ పోతూనే వుంటాను" అని అదనంగా చెప్తాడు.

CWSA 29:94

ఆంతరిక సమర్పణకు మూలం, దృఢవిశ్వాసం, నమ్మకం

ఈ ఆంతరిక సమర్పణకు కేంద్రం లాంటిది దైవం యెడల దృఢవిశ్వాసం, నమ్మకం. "నాకు దైవమే కావాలి. మరేదీ వద్దు," అనే ధోరణి నవలంభించాలి. దానిని వదిలిపెట్టమని నిన్నడుగుతున్నానని నీ వెందు కనుకుంటున్నావో నాకు తెలియడంలేదు. అదే లేకపోతే, యోగం జరుగదు. "నన్ను నేను పూర్తిగా ఆయనకు

సమర్పించుకోవా లనుకుంటున్నాను. నా అంతరాత్మ అలా చేయాలనుకుంటున్నది గనుక, ఆయనను కలుసుకొనడం, సాక్షాత్కారింప జేసుకోవడంగాక మరొకటి జరుగదు. నన్ను ఆయన దగ్గరకు చేర్చే పనిని నాలో రహస్యంగా గాని లేక బహిరంగంగా గాని, తెరచాటునుండి గాని లేక తెలిసేటట్లుగాని చేయమని తప్ప మరేమి ఆయ నను అడుగను. చేయవలసి వున్నదాన్నంతా ఆయననుకొన్నప్పుడే, అనుకున్న విధంగానే జరుగనివ్వనీ. నాకు ఆయనలో నమ్మకముంది. ఆయన సంకల్పాన్నం గీకరిస్తాను. ఆయన వెలుగు, సన్నిధి ఆనందాల కోసం స్థిరంగా కాంక్షిస్తాను. ఆయన మీద ఆధార పడుతూ, యిబ్బందులు, ఆలస్యాలు, అన్నింటి ద్వారా ఆగకుండా సాగిపోతాను. నా మనస్సు ప్రశాంతి నొంది, ఆయన వైపు మాత్రమే మరలును గాక. ఆయన దానిని తన వెలుగుకు తెరచి పెట్టనీయనీ. నా ప్రాణికం ప్రశాంతినొంది ఆయన వైపు మాత్రమే మరలనీ, ఆయన దానిని తన సుస్థిరత్వానికి, ఆనందానికి తెరచి పెట్టేందుకు వీలుకల్పించు గాక. సర్వమూ ఆయన కోసమే, నేనూ ఆయన కోసమే. ఏం జరిగినప్పటికీ యీ ఆకాంక్షను, ఆత్మార్పణను నిలుపుకొని అది జరిగి తీరుతుందనే పరిపూర్ణ నమ్మికతో సాగిపోతుంటాను. సాధకుడు యెదుగ వలసింది యీ ధోరణిలోనికి. ఎందుకనంటే, మానసిక, ప్రాణిక, చలనాలు మధ్యలో వచ్చి పడ్తూంటాయి గనుక అది ఒక్కసారిగా జరుగదు, పరిపూర్ణంగాదు అనేది యదార్థమే. దాని మీదే సంకల్పాన్ని నిలిపి వుంచితే అస్తిత్వంలో అది పెరుగుతూ వుంటుంది. మిగిలినది మార్గదర్శకత ప్రాప్తి అయినపుడు తన మానసిక లేక ప్రాణిక చలనాలు జోక్యం చేసుకొనకుండా, దానికి విధేయమై వుండడం మీద ఆధారపడి వుంటుంది.

CWSA 29:70-71

యోగానికి అవసరమైన ప్రాథమిక విశ్వాసం

యోగంలో ప్రాథమిక విశ్వాసం అంటే అంతరాత్మలో అంతర్లీనంగా దైవం వున్నాడు, అనుసరించవలసింది దైవం ఒక్కనినే — దానితో పోల్చదగినది, జీవితంలో పొందవలసినది అదే తప్ప మరొకటి లేదు అని చెప్పగల విశ్వాసం. నీలో పెరుగుతున్న యీ విశ్వాసమే నీవు యోగం లోని కొచ్చేటట్లు చేసింది. ఆ నీ విశ్వాసం మరణించ లేదు లేక క్షీణించ లేదు నీ లేఖలలో నీవు చెప్పిన దానిని బట్టి చూస్తే అది మరింత

వత్తిడి కలిగించేదిగా, నిన్నెప్పుడూ యెడబాయనిదిగా తయారైందని తెలుస్తోంది. మనిషిలో అది ఉన్నంత కాలం అతడు ఆధ్యాత్మిక జీవితానికై ప్రత్యేకించ బడతాడు. అతని స్వభావం అవరోధాలతో నిండివున్నా, వ్యతిరేకతలు, ఇబ్బందులతో కిక్కిరిసి పోయి వున్నా, అనేక సంవత్సరాల పాటు సంఘర్షణ కొనసాగినా ఆధ్యాత్మిక జీవితంలో విజయం సాధించడాని కతడు ప్రత్యేకించబడినాడని కూడా నేను చెప్పగలను.

ఇంకా నీకు నిజంగా లేని దేమిటంటే దైవమార్గ దర్శకతలో, అతని సంకల్పం నీకు తెలియడంలో, లేక ఆతనిని నీవు స్వీకరించడంలో ఒక స్థిరమైన విశ్వాసం. ఆంతరిక అనుభవ క్షేత్రం మీద వున్నప్పుడు నీ మెదడులో దేనినో సుస్థిరం చేయాలని వ్యతిరేక శక్తులు దాడులు — యోగంలో తరచుగా అలా జరుగుతాయి — మొదలౌతాయి. వాటికి అక్కడొక స్థిరమైన మానసిక స్థానం ఉండాలని అవి కోరుకుంటాయి. అలా వుంటే యే ప్రయత్నం చేసినప్పుడల్లా భౌతిక మనస్సు యేదో యిబ్బంది వస్తుందని తలపోసి ఓటమి, అశక్తత అనే భావం మీద ఆలోచిస్తూ వుండిపోతుంది. ఆ భావం మనస్సు ముందు భాగంలో వుండకపోయినా, వెనుకన్నా వుంటుంది. దానివల్ల అనుభవం ప్రాప్తించకుండా చేయవద్దని ఆశిస్తుంది. ఇదిగో యిటువంటి మానసిక రచనలను నీవు తప్పక తిరస్కరించాలి. ఎందుకనంటే, లేని అధిక ప్రాధాన్యతను కట్టబెట్టిన ప్రాణిక భంగపాటుల కన్నా అవే చాలా పెద్ద అవరోధాలు.
CWSA 29:93-94

అంతరాత్మ వెలుగుకు, దైవ పిలుపుకు విశ్వసనీయత

అంతరాత్మ వెలుగుకు, దైవపిలుపుకు, విశ్వసనీయత అని నేనన్నపుడు గతానికి సంబంధించిన దేనిని గురించీకాదు లేక నీలోని యే లోటును గురించీ కాదు. ఏ సూచనలనైనా సరే, ఏ ప్రలోభాలనైనా, ఏ ప్రేరణలనైనా వినడాన్ని నీవు తిరస్కరించాలి. సత్యం పిలుపును, పరంజ్యోతి నుండి తిరస్కరించలేని సంకేతాన్ని, వ్యతిరేకించేదాన్నంతా తిరస్కరించడం అన్నది సమస్త సంకట సమయాల్లో, దాడుల్లో సైతం వుండవలసిన గొప్ప అవసరాన్ని నేను కేవలం నొక్కి చెప్తున్నాను. అంతే. "నేను దైవం మనిషిని. నేను ఓడిపోను" అని సమస్త సంశయాస్పద, నైరాశ్య స్థితులలో చెప్పగలిగి వుండాలి. నేను అమృతత్వ పుత్రుడిని, నన్ను దైవం కోరుకొంది, కనుక నేను నాకు, ఆతనికే బద్ధుడనై వుండాలి. విజయం

తథ్యం. నేను పతనమైనా తిరిగి మళ్ళీ తప్పక పైకి లేస్తాను" అని సమస్త అపరి శుద్ధతకు, సమాధానం చెప్పగలగాలి. "ఇది మహనీయమైనది, నాలో వున్న అంత రాత్మను సంతృప్తిపరచ గలిగినది పరమ సత్యం, అదొక్కటే నేను సమస్త పరీ క్షలను, సంక్షోభాలను, దివ్య మహాయానం చివరి వరకు తట్టుకొని బయటపడ్తాను" అని పెడదారి పట్టించే అల్ప ఆదర్శానికి ప్రయోజనం కలిగించే ప్రత్యుత్తర మీయ గలిగి వుండాలి. పరంజ్యోతికి దివ్య పిలుపుకు విశ్వసనీయత అని నేను అనడంలోని అర్థం యిది.

CWSA 29:99

విశ్వాసాన్ని పొందే మార్గం

విశ్వాసాన్ని తదితర సమస్తాన్నీ పొందడానికి, వాటిని కావాలని పట్టుబట్టాలి. వాటిని పొందేవరకు నిరుత్సాహాన్ని నిరాశనూ లేక వదిలి వేయాలనే భావాన్ని దరిచేరనీయగూడదు. చింతించే, ఆకాంక్షించే జీవులను యీ కష్టాల ప్రపంచం పొందటం మొదలు పెట్టినప్పటి నుండి ఈ మార్గం ద్వారానే అది ప్రతిదాన్ని పొందింది. అంటే నిరంతరం పరంజ్యోతికై ఉన్మీలనమై వుంటూ చీకటికి వెన్ను చూపాలి. నిరవధికంగా పట్టు సడలకుండా "నీ వల్ల కాదు, నీవలా చేయవద్దు. నీవు అశక్తుడివి. నీవు కలలో కన్పించే ఒక ఆటబొమ్మవు" అని అరచే గొంతులను వినకుండా, తిరస్కరించాలి. ఎందునకనంటే అవి శత్రు గొంతుకలు, అవి అతను అందుకోబోయే ఫలితాన్ని భరించలేని ఘోరమైన రొదతో అందుకోనీయకుండా చేస్తాయి. చేసి, ఆతరువాత కలిగే శూన్య ఫలితాన్ని తమ సిద్ధాంతానికి ఋజువుగా చూపిస్తాయి. కృషిలో యిబ్బంది వుంటుందనేది తెలిసిన విషయమే, కాని ఇబ్బంది అంటే అసాధ్యం అని కాదు గదా — యిబ్బంది అనబడిందే సదా సాధించబడింది. ఇబ్బందులను జయిస్తూ పోబట్టే భూమిచరిత్రలో జరిగిన విలువైన వన్నీ నెరవేర్చబడ్డాయి. ఆధ్యాత్మిక కృషిలో కూడా తప్పకుండా జరిగేదిదే.

CWSA 29:100

దృఢమైన విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలి

ఏ విధమైన నిరాశనూ దగ్గరకు రానీయవద్దు. అలాగే దైవకృపయందు

అపనమ్మకాన్ని కలుగనీయ వద్దు. నీకు బయట యెటువంటి యిబ్బందులు ఎదురైనా నీలో యెటువంటి బలహీనతలున్నా, నీ విశ్వాసం మీద, నీ ఆకాంక్ష మీద నీకు పట్టు వుంటే, రహస్య దివ్యశక్తి నిన్ను అన్నింటినుండీ సురక్షితంగా కొనిపోయి తిరిగి యిక్కడికి చేరుస్తుంది. వ్యతిరేకత, యిబ్బందులు నిన్ను అణగద్రొక్కినా, నీవు తడబడినా, నీకు దారి మూసుకుపోయినట్లు కన్పించినా, నీ ఆకాంక్షపై పట్టును వదలవద్దు. కొంతకాలం పాటు విశ్వాసంపై మబ్బు క్రమ్మినా, మనస్సు హృదయాల్లో యెల్లప్పుడూ మా వైపు తిరిగివుంటే ఆ మబ్బు తొలగిపోతుంది.

CWSA 29:101

కష్టకాలంలో దైవరక్షణకై, ఆ రక్షణకై పిలుపుపై విశ్వాసముండాలి. దైవం సంకల్పించిన దేదో అదే ఉత్తమ మైనదనే విశ్వాసం యెల్ల కాలాల్లోనూ ఉత్తమోత్తమ మైనది.

CWSA 29:101

ఈ యోగానికంతటికీ గల సూత్రం

దైవ ప్రభావానికి తెరచుకొని వుడడం అనేది ఈ యోగాని కంతటికీ వర్తించే సూత్రం. అది నీ పైననే వుంది. దాని ఎరుక ఒకసారి నీకు కలిగితే, అప్పుడు దానిని నీ లోనికి ఆవాహన చేయాలి. అది మనస్సు, దేహాల లోనికి దివ్యశాంతి, దివ్యవెలుగుగా, పనిచేసే దివ్యక్రియాశక్తిగా సారాంశమైన లేక నిరాకారమైన దైవ సాన్నిధ్యంగా, మహదానందంగా అవతరిస్తుంది. ఈ యెరుక కలగడానికి ముందు అతనికీ విశ్వాసం ఉండాలి, తాను ఉన్మీలనం కావాలని ఆకాంక్షించాలి. ఆకాంక్ష, పిలుపు, ప్రార్థన ఒకే విషయం యొక్క భిన్నరూపాలు, అన్నీ ప్రభావం చూపేవే. నీకేం లభిస్తుందో లేక నీకేది అత్యంత తేలికో దాన్ని తీసుకో. మరో మార్గం యేకాగ్రత. నీ చేతనను నీ హృదయంలో (కొంతమంది దానిని శిరస్సులోనూ, శిరస్సుపైనా) కేంద్రీకరించి దివ్యజననిని ధ్యానిస్తూ, ఆమె నచటికి రమ్మని పిలవాలి. అతడు ఏదో ఒకటైనా చేయవచ్చు, లేదా రెంటిని భిన్న సమయాల్లో చేయవచ్చు. ఆ క్షణంలో నీకేది సహజంగా వస్తుందో లేక చేయాలనిపిస్తుందో దాన్ని చెయ్యి. ప్రత్యేకించి ప్రారంభంలో అత్యంత గొప్ప ఆవశ్యకత ఏమిటంటే మనస్సును ప్రశాంత పరచడం. సాధనకు సంబంధంలేని ఆలోచనలు, చలనాలను ధ్యాన సమయంలో తిరస్కరించడం. ప్రశాంత

మనస్సులో అనుభవం పొందటానికి తగిన పురోగమనాత్మక సన్నద్ధత వుంటుంది. అంతా ఒక్కసారిగా జరుగనంత మాత్రాన నీవు అసహనం చెందవద్దు. మొత్తం ప్రశాంతతను మనస్సులోనికి తీసుకు రావాలంటే సమయం పడ్తుంది. నీ చేతన సంసిద్ధమయ్యే దాకా నీవలా చేస్తూనే వుండాలి.

CWSA 29:106

వ్యక్తి ఉన్ముఖత మీదే అంతా ఆధారపడివుంటుంది

హృదయంలో యేకాగ్రత వహించి, దివ్యజనని సన్నిధిని, శక్తిని తన అస్తిత్వాన్ని స్వీకరించమని, ఆమె క్రియాశక్తి క్రియలచేత తన చేతనను రూపాంతరీకరించాలని పిలువడం కంటే యీ యోగంలో మరో విధానమంటూ లేదు. శిరస్సులో లేదా కను బొమలమధ్య కూడా కేంద్రీకరించవచ్చు, కాని చాలామంది కిది చాలా కష్టంతో కూడిన ఉన్మీలనం అవుతుంది. మనస్సు నిశ్చల నీరవ మైనప్పుడు, యేకాగ్రత బలీయమైనప్పుడు, ఆకాంక్ష తీవ్రతరమైనప్పుడు అనుభవం ఆరంభమౌతుంది. విశ్వాసం యెంత యెక్కువైతే ఫలితం అంత త్వరగా వచ్చే అవకాశం వుంటుంది. మిగతా దానికి అతడు తన స్వప్రయత్నాల మీదే ఆధారపడకుండా దైవంతో సంపర్కాన్ని నెలకొల్పుకోవడంలో దివ్యజనని శక్తిని, సాన్నిధ్యాన్ని స్వీకరించడంలో సఫలీకృతుడవ్వాలి.

CWSA 29:107

విశ్వాసం, అపకార శక్తులు

నిమ్నప్రకృతి యెంతగా తెలెత్తినా, లేక అపకార శక్తులు దాడి చేసినా, నీకు జయం లభిస్తుంది, రూపాంతరీకరణ ప్రాప్తిస్తుంది — నీవు విశ్వాసం నిలుపుకుంటే.

*

పరంజ్యోతి విజయం మీద విశ్వాసం వుంచి, విశ్వపదార్థ, మానవ వ్యక్తిత్వ రూపాంతరీకరణ కుండే నిరోధాలను ఒక ప్రశాంత సమతతో యెదుర్కోవాలి.

*

ఎంత అంధకారం వున్నప్పటికీ — ఈ ప్రపంచం, మానవ భౌతిక స్వభావం పూర్తిగా అంధకారంతోనే నిండి వుంది — కాలక్రమంలో ఒక యథార్థ పరంజ్యోతి కిరణం, పదింతల అంధకారానికి వ్యతిరేకంగా నిలబడ గలుగుతుంది. దాన్ని నమ్మి, దానికే సదా అంటిపెట్టుకొని వుండు.

CWSA 29:101-102

గురువు యందు విశ్వాసం

ఆధ్యాత్మిక మార్గదర్శి నుండి పూర్తి ప్రయోజనం పొందాలాంటే శిష్యునికి మూడు షరతు లున్నాయి:

మొదటిది: తనను యే విరుద్ధమైన లేక రెండో ప్రభావానికి లోను చేసుకోకుండా ఆయనకు మాత్రమే, పూర్తిగా ఆయనకు మాత్రమే విధేయుడై వుండాలి.

రెండోది: గురువు యిచ్చిన సూచనలను తప్పకుండా అంగీకరించి, స్థిరంగా, పూర్ణ విశ్వాసంతో, పట్టుదలతో తన అత్యుత్తమ ఆధ్యాత్మిక సామర్థ్యానికి వీలైనంతగా, వాటిని ఆచరించాలి.

మూడోది: అతడు తనను తాను గురువుకు తెరుచుకొని, గురువు శిష్యుని మనస్సుకు బోధించేదాని కంటె అధికంగా స్వీకరించాలి. అంటే అతడు ఆధ్యాత్మికంగా యేమిటో, అవైన ఆతని ఆధ్యాత్మిక చేతన, జ్ఞానం, వెలుగు, శక్తిని తన లోనికి స్వీకరించడం ద్వారా, తన చేతన స్వభావం, తన స్వకీయ దివ్య సంభావ్యత లోనికి యెదగడానికి తనకు సహాయపడే ఆతని దివ్యత్వాన్ని స్వీకరించడం అన్నమాట.

*

సాధకునికి గురువు యేం చేయగలడనేది, యే విధమైన సాధనా పద్ధతి మీదగాని, నియమంపై గాని, గాక సాధకుని స్వీకరించే శక్తి మీద ఆధారపడి వుంటుంది. చేతనకు సంబంధించిన కొన్ని మనోవైజ్ఞానికి స్థితులకు స్వీకరించే శక్తిని పెంచుకొనే ధోరణి వుంది. ఉదా: గురువు యెడల వినమ్రత, భక్తి, విధేయత, దృఢనమ్మకం, అతని ప్రభావాన్ని స్వీకరించే సహనశీలత. వీటికి వ్యతిరేక విషయాలు స్వేచ్ఛ, విమర్శనాత్మక వైఖరి, ప్రశ్నించడం, అతనిని మరోదారి పట్టించి గురువుకు, పరోక్షంగా లేక, తెర వెనుక నుండి సహాయం చేయవలసిన అవసరాన్ని కలుగజేస్తాయి. కాని ప్రధాన విషయ మేమిటంటే, స్వీకరించాలనే సంకల్పం, సరైన ధోరణి సహాయంతో లభించే లేక తనను తాను వృద్ధి చేసుకొనే ఒక విధమైన అంతరాత్మిక ఉన్ముఖత. అది గనుక ఉన్నట్లైతే గురువు నుండి లాక్కోవలసిందేమీ వుండదు, కేవలం ప్రశాంతంగా స్వీకరించడమే వుంటుంది.

CWSA 29:190-91

అంతరాత్మ వెలుగు బాట

అంతరాత్మికమైనది సదా లేక మామూలుగా ముందుంటే, లేక సహజమైన విశ్వాసం, సమర్పణోత్సాహం వుంటే, లేక అలవాటుగానే అతని మోము సూర్యుని వైపు తిరిగి వుంటే లేక అంతరాత్మికం వైపు తిరిగి వుంటే (ఉదా: తన ఆధ్యాత్మికత భవితవ్యం యెడల విశ్వాసం) లేక అంతరాత్మికం వైపు తిరగడాన్నతడు సాధించుకొని వుంటే, వాళ్లు మాత్రమే వెలుగుబాటను అనుసరించగలరు. అంటే ఆ వెలుగుబాటలో నడిచే మనిషికి యిబ్బంది లుండవని గాదు, అతని క్కూడా అనేకం వుండవచ్చు, కాని వాటి నతడు ఆనందంతో "అంతా రోజు వారీ పనిలో భాగంగానే చూస్తాడు. అతడి మీద ఘోరంగా దెబ్బలు పడినా, అదొక తమాషా పద్ధతి, దైవం నిజంగానే తమాషా వైఖరిలో వున్నాడు, అతడు పనిచేసే విధానం అదే అయితే, అది సరైనదే అయి వుంటుంది, నేనే తమాషా వ్యక్తినై వుండవచ్చు, నన్ను సరైనవానిగా చేయడాని కదొక్కటే ఉపాయమై వుంటుందనుకొంటున్నాను" అని చెప్పగలవాడవుతాడు. కాని ప్రతి వ్యక్తీ అలా వుండలేడు. అది కష్టతరం అందువలన సరైన ధోరణిలో వుంచగల సమర్పణపై మేమూ పట్టుబట్టడం లేదు. కొంచెంతో మొదలు పెట్టి క్రమంగా తర్వాత పెరుగుతున్నా మేం సంతృప్తి చెందుతాం.

CWSA 31:618

దైవం పనిచేసే పద్ధతి

"ఈ మార్గంలో కావలసినవి విశ్వాసం, సమర్పణ, ధైర్యం. అహంతో బద్ధుడైన వ్యక్తికి యివి వుండడం అంత తేలిక గాదు. అహంకారిక మనస్సు కోరుకొనే లేక అనుమతించే విధానం కాదు, దైవం పనిచేసే విధానం.ఎందుకనంటే అది సత్యాన్ని తెలుసుకోవాలంటే తప్పిదాన్ని, ఆనందాన్ని పొందడానికి బాధను, పరిపూర్ణతను చేరడానికి అపరిపూర్ణతను ఉపయోగిస్తుంది. తానెక్కడికి నడుపబడుతోందో అహం గమనించ లేదు. తనను నడిపే నాయకత్వంపై తిరుగుబాటు చేస్తుంది, నమ్మకం కోల్పోతుంది, ధైర్యం కోల్పోతుంది. ఈ భంగపాట్లను మనం పట్టించుకోవలసిన పని లేదు. ఎందుకనంటే లోపలి దివ్య మార్గదర్శకుడు మన తిరుగుబాటుకు నొచ్చు కోడు, మన విశ్వాసలేమితో అతను నిరాశ చెందడు, లేదా మన బలహీనత చూచి

మనల్ని యేవగించుకోడు. ఆతనికి, మాతృదేవత కుండే నిండైన ప్రేమ వుంది, గురువు కుండే అనంత సహనం వుంది. కాని ఆయన మార్గదర్శకత నుండి మనం మన సమ్మతి నుపసంహరించుకొనడం ద్వారా, మనం చేతనను యెట్టి సందర్భం లోనూ, సంభవించదగిన దాన్ని గాకుండా, సంభవించిన దాన్ని మొత్తంగా కాకపో యినా, దాని ప్రయోజనాన్ని కొంత కోల్పోతాం. తన ఆత్మను తెలుసుకోవడానికి సన్నద్ధం గావడంలో, అతడు తన నిమ్నప్రకృతి నుండి ఉన్నత ఆత్మను వివేచించ లేకపోయి నందువల్ల సమ్మతి నుపసంహరించుకొంటాం. ప్రపంచంలో లాగానే మనలో కూడా, ఆయన పనిచేసే విధానాల వల్ల భగవంతుని చూడలేం. ముఖ్యంగా ఆతడు మనలో మన ప్రకృతి ద్వారానే పని చేస్తాడు గాని, సంశయాస్పద మహిమల పరంపర ద్వారా కాదు. తనకు విశ్వాసం కలగడానికి మనిషి కావాలంటాడు, తాను చూడగలగడానికి కళ్ళు మిరుమిట్లు గొల్పే కాంతి కన్పించాలంటాడు. ఈ అసహనం, ఈ అజ్ఞానం, ఒక పెద్ద ప్రమాదంగా, పెను విపత్తుగా మారవచ్చు. దైవ నాయకత్వానికి వ్యతిరేకంగా మనం చేసే తిరుగుబాటు వలన మన ప్రేరణలకు, కోరికలకు సంతృప్తి కలిగించే మరో విధ్వంసకర క్రియాశక్తిని ఆవాహన చేసి మనల్ని నడిపించమని దాని నడుగుతాం, దానికో దేవుని పేరుపెడ్తాం.

CWSA 23-24:64

సర్వకాల సర్వావస్థలలోనూ దైవం మన చేయిపట్టుకొనే వుంటాడు

వేద ఋషులు సైతం, తరచుగా "వెలుగునుండి సుదీర్ఘ బహిష్కరణలు" అని వాపోయిన అజ్ఞాన పరీక్షలను అనుసరించే వారు చాలానే వుండవచ్చు. ఇవి చాలా దట్టంగా కూడా వుండవచ్చు. అంతరాత్మ పై పరచుకొన్న చీకటి రాత్రి అంత నల్లగా వుండవచ్చు. విశ్వాసం మనల్ని పూర్తిగా విడచి వెళ్ళిపోయినట్లు అన్పించవచ్చు. కాని అ సందర్భాలన్నింటిలో లోపలి ఆత్మ శక్తి, కనుపించకుండా దాన్ని పట్టును నిలిపే వుంచుతోంది. అంతరాత్మ ఒక నూతన బలంతో గ్రహణం మాత్రమే పట్టివున్న ఆరిపోని తన ఆత్మ విశ్వాసాన్ని తిరిగి పొందుతుంది. ఎందుకనంటే ఆంతరిక అంతరాత్మ తెలుసుకొని తీర్మానించుకొన్నందున అది ఆరిపోదు. అన్నింటినుండీ దైవం మన హస్తాన్ని పట్టుకొని నడుపుతాడు, అతను మన చేతిని వదిలివేసినట్లు కన్పించినా మనల్ని తిరిగి ఉన్నతంగా ఉద్ధరించడానికే అలా చేస్తాడు.

రక్షించడానికి ఆతడు తిరిగి రావడం అనేది తరచుగా మనకు అనుభవ మౌతూనే వుంటుంది. తత్ఫలితంగా సంశయాల తిరస్కారాలు, కాలక్రమంలో అసాధ్యాలౌ తాయి. ఒకసారి సమతా పునాది స్థిరంగా యేర్పడి నపుడు ఇంకా అధికంగా దివ్య జ్ఞానభాస్కరుడు తేజరిల్లినపుడు సంశయం చనిపోతుంది. ఎందుకనంటే దాని మను గడకు కారణం ప్రయోజనం అంతమయ్యాయి....

అదే సమయంలో మనం అపరిపూర్ణత, అజ్ఞానాలనుండి వెలుగు, పరిపూర్ణతల వైపు నడుస్తూన్నామనే విషయాన్ని యెల్లపుడూ గుర్తుంచుకోవాలి. మన కృషి రూపాలు, మన సాక్షాత్కార దశల పరంపరపై మనకెటువంటి మమకారం లేకుండా మనం స్వేచ్ఛ కలిగి వుండాలి. మనలో నుండి వెలికి దీసి అవతల పారవేయడానికి బలంగా తలపైకెత్తేది వుండటం మాత్రమేగాక అజ్ఞాన నిమ్నప్రకృతి శక్తులకు వాటిని తొలగించి, వాటి స్థాన మాక్రమించే ఉన్నత శక్తులకు మధ్య పోరుకూడా వుంది. కాని అనుభవాలు, ఆలోచన, అనుభూతి స్థితులు, సహాయపడే సాక్షాత్కార రూపాలను మార్గంమీద అంగీకరించాలి. అవి తాత్కాలికంగా ఆధ్యాత్మిక చివరి దశలుగా కన్పిం చేవి, తదుపరి మార్పుకు సంబంధించిన అడుగులుగా తెలుస్తాయి. వీటిని అధిగమించి పోతే, వాటికి ఆధారమైన తాత్కాలిక విశ్వాసం, మరింత మహనీయమైన వాటికి చోటిస్తూ, లేక మరింత సంపూర్ణమైన సాక్షాత్కారాలకు అనుభవాలకు చోటిస్తూ, వాటి కనుకూలంగా ఉపసంహరించుకొంటుంది. ఈ మహనీయ విషయాలు, సమగ్ర సాక్షాత్కారాలు వాటి స్థానాన్ని ఆక్రమిస్తాయి. లేక సంపూర్ణం గావించే ఒక రూపాం తరీకరణ లోనికి వాటిని తీసుకోవడం జరుగుతుంది.

CWSA 23-24:775-76

దైవజ్ఞానంలో దృఢ నమ్మకం వుండాలి.

నేను బలాన్ని మరియు దైవకృపను గురించి చెప్పిన దాన్లో అర్థం కానిదంటూ ఏమీ లేదు. ఆధ్యాత్మిక సాక్షాత్కారం జరగడంలో బలానికి విలువ వుంది, కాని ఆ సాక్షాత్కారం బలంవల్ల మాత్రమే జరుగుతుందని, యితర, మరే ఆలంబనాల వల్ల కాదని చెప్పడం శ్రుతి మించిన అతిశయోక్తి అవుతుంది. దైవకృప అన్నది క్రొత్తగా కనుగొన్నది కాదు. ఆధ్యాత్మిక అనుభవపు ఒక వాస్తవికత అది. బలవంతులచే, పండితులచే, యెందుకూ పనికిరాని వాళ్ళుగా పరిగణించబడిన వాళ్ళుకూడా

దైవకృప వల్ల ఉద్ధరించ బడ్డారు. నిరక్షరాస్యులు, మానసికశక్తి లేక శిక్షణలేనివాళ్ళు, శీలానికి సంబంధించిన "బలం" లేక సంకల్పం లేనివాళ్ళయినప్పటికీ ఆకాంక్షించారు. ఆకస్మికంగా లేక వేగంగా ఆధ్యాత్మిక సాక్షాత్కారం పొందే స్థితికి ఎదిగారు. ఎందుకనంటే వాళ్ళకు విశ్వాసం వుంది, లేక చిత్తశుద్ధి వుంది. ఆధ్యాత్మిక చరిత్రలో వాస్తవాలైన, యీ వాస్తవాలను, సాధారణ ఆధ్యాత్మిక అనుభవ వాస్తవాలను అవి కేవలం ఊహాజనితాలని చర్చించి, వాదించి, యెందుకని తిరస్కరించబడ్డాయో, నాకు తెలియదు. బలం ఆధ్యాత్మికమైనదైనట్లయితే ఆధ్యాత్మిక సాక్షాత్కారానికి ఒక శక్తి అది, అంతకంటే గొప్ప శక్తి చిత్తశుద్ధి, అన్నింటికంటే మహాగొప్ప శక్తి దైవకృప. ఒక మనిషి చిత్తశుద్ధి గలవాడైతే యెంతో ఆలస్యంగానైనా, ముంచెత్తి వేసే కష్టాలనైనా అతడు దాటి పోతాడు అని నేను పదేపదే చెప్పాను. దైవకృపను గురించి తిరిగి తిరిగి చెప్తూనే వున్నాను. గీతలో ఉన్న యీ చరణాన్ని నేను అనేకసార్లు ఉటంకించాను.

"అహం త్వా సర్వ పాపేభ్యో మోక్ష యిష్యామి మాశుచః"

సమస్త పాపాలనుండి విడిపించి నీకు నేను మోక్షం యిస్తాను. విచారించకు.


CWSA 29-172

అనువాదం కె. వి. రావు

యోగంబాట చాలా పొడవైనది. ఎంతో నిరోధానికి వ్యతిరేకంగా నేల మీది ప్రతి అంగుళాన్ని జయించుకొంటూ పోవాలి. సమస్త కష్టాల నుండి, ఆలస్యాల నుండి, అపజయాలుగా కన్పించే వాటి నుండి సాగిపోవడానికి స్థిరంగా వుండే విశ్వాసంతో నిండిన సహనం, ఒకే దృష్టి గల పట్టుదలకంటే సాధకునికి అధికంగా అవసరమైన మరో లక్షణం యేదీ లేదు.

CWSA 29:110

స్వేచ్ఛానువాదం: కె.వి.రావు


అఖిల
అఖిల భారత పత్రిక
జూలై 2016
దైవంపై విశ్వాసం వెల్లివిరియా

విషయసూచిక

"అజ్ఞానాంధకారం అలుముకొన్న సమయాల్లో దైవంపై విశ్వాసం నిశ్చితమైన మార్గ దర్శి". అది గమ్యాన్ని మన దృష్టికి తేవటానికి అంతరాత్మలో నుండి పెల్లుబికి ఒక జ్యోతిగా ఎగసిన గుప్తజ్ఞానం; మన అస్తిత్వంలోని భాగాలు కొన్ని మనలను అక్రమ మార్గం దిశగా అడుగేయ పురిగొల్పినా, సక్రమ మార్గానుసరణను ఒక దిక్సూచిగా దృష్టికి తెచ్చి, సరియైన విధంగా మనలను తీర్చిదిద్దుతుంది. ఇతర శక్తులు నిరోధించబడి మరుగున పడినప్పటికీ, దైవంపై విశ్వాసం మనలను కాపాడి, సహకరించే శక్తిలా ఉపకరిస్తుంది. మనం సర్వం కోల్పోయినప్పటికీ అది మన జీవితాన్ని పునరుద్ధరించ గలదు. అది దైవానుగ్రహంతో ప్రసాదించబడిన బహుమానము, సర్వదా హృదయపూర్వ కంగా కాపాడుకోవలసిన అరుదైన నిధి. ప్రాపంచిక జీవితంలో ఒక అంతర్నిహిత విశ్వాసంపై ఆధారపడి సాధారణ మనుగడ కొనసాగించటానికి గాని యౌగిక జీవనంలో ఎదురవుతుండే అనూహ్యమైన కొత్త కొత్త అవరోధాలను అధిగమించుటకు గాని విశ్వాసం లేకుండా మనిషి ఏమీ చేయలేడు. యోగానికి పునాది లాంటి ఈ విశ్వాసానికి శ్రీఅరవిందులు, శ్రీమాత అమితమైన ప్రాధాన్యత నిచ్చారు. గత సంచికలో (జూన్, 2016) దైవంపై విశ్వాసం గురించి శ్రీఅరవిందుల దీప్తివంతమైన ప్రవచనా లను ప్రస్తావించాము. ఈ సంచికలో దైవంపై విశ్వాసం గురించి, దానిని అలవరచుకొని పెంపొందించుటతో పాటు దానిని మన పురోభివృద్ధి కోసం కాపాడుకొని ఉపయోగించు టకు శ్రీమాత సూచించిన ఆచరణాత్మక మార్గదర్శకాలను ప్రస్తావించడమైనది.

అనువాదం: అందుగులపాటి కైలాసపతి



పరిస్థితులన్నీ విషమ స్థాయి నుండి మరింత విషమ స్థాయికి చేరుతున్నట్లుగా కనిపించిన క్షణాన, వెంటనే ఒక మహత్తరమైన విశ్వాసాన్ని కూడ గట్టుకోవాలి, దైవానుగ్రహం మనల నెప్పటికి ఆపేక్షించదు అనే ఎరుకను పెంచుకోవాలి.

CWM 15: 169

దైవంపై విశ్వాసమే దివ్యజ్ఞానం

విశ్వాసం అంతరాత్మ యొక్క స్వయంప్రేరిత జ్ఞానం

బాహ్య చేతన యొక్క గ్రహణశక్తి మానసిక గ్రహణశక్తిని నిరాకరించవచ్చు, కానీ మానసిక శక్తిలోనే నిజమైన జ్ఞానం, సహజ సిద్ధమైన అంతఃస్ఫూర్తి వున్నాయి. "నాకు తెలుసు, కారణం చెప్పలేను కాని నాకు తెలుసు" అని మానసిక శక్తి అంటుంది. ఎందుకనగా దాని జ్ఞానం, అనుభవ సిద్ధమైనది గాని, యదార్థమని నిరూపించ బడినది కాదు. అది నమ్మటానికి నిరూపణలు అవసరం లేదు. విశ్వాసం ఒక అంతరాత్మ ప్రేరణ. అంతరాత్మ యొక్క జ్ఞానం సహజసిద్ధమైనది, సూటిగా సమకూరేది, గురి తప్పనిది. ప్రపంచమంతా తిరస్కరించి వ్యతిరేకంగా వేనవేల నిరూపణలు చూపించినప్పటికీ, ఒక అంతర్ జ్ఞానంతో, ప్రతి నిరోధాన్ని ఎదిరించి నిలబడి ఒక వాస్తవాన్ని గుర్తించగల గ్రహణశక్తితో అది తెలుసుకో గలదు. మానసిక జ్ఞానం దృఢమైనది, స్వర్శవేద్యమైనది, ఒక ఘనీభవించిన ముద్ద లాంటిది. నీవు దానిని నీ మనో ప్రాణ శరీరాల లోనికి కొనితేవచ్చు. అప్పుడు నీ కొక సమగ్ర విశ్వాసం కలుగుతుంది — అది నిజంగా కొండలను కదపగలదు, కానీ అస్తిత్వంలో ఏది కూడా ఈ మార్గంలో అడ్డు తగల కూడదు, 'ఆ విధంగా కాదు' అని అన కూడదు, ఒక పరీక్షను కోరకూడదు. విశ్వాసం ఏ కొద్దిపాటి అసంపూర్ణమైనప్పటికీ, విషయాలు చెడతాయి. విశ్వాసం సమగ్రమైనది, అచంచలమైనది కానప్పుడు దైవం ఎలా స్వయం వ్యక్తమవగలడు? విశ్వాసం స్వయంగా ఎల్లప్పుడూ అచంచలంగా నిలువగలగేది, అది దాని తత్వం, అలా కాకపోతే అది అసలు విశ్వాసమే కాదు — అయితే, మనస్సుగాని, ప్రాణికంగాని, భౌతికంగాని మానసిక కదలికను అనుసరించక పోవటం జరగవచ్చు. ఓ వ్యక్తి ఒక యోగి వద్దకు వచ్చినప్పుడు అతడు తనను తన గమ్యానికి చేర్చగలడనే విశ్వాసం హఠాత్తుగా అతనిలో కలుగవచ్చు, కానీ ఆ యోగికి అందుకు తగ్గ జ్ఞానమున్నదో లేదో తెలియదు. అతడు తన గురువును కలుసుకున్నాననే మానసిక ఉద్వేగానికి లోను కావచ్చు. ఆ నమ్మకం అతనికి ఒక సుదీర్ఘ మానసిక పరిశీలన జరిపిన పిమ్మటనో లేక అనేక అలౌకిక అద్భుతాలను చూచిన పిమ్మటనో ఏర్పడదు. ఇదొక్కటే విలువగల

విశ్వాసం. వాదించటం మొదలుపెడితే నీ భవితను కోల్పోతావు.

CWM 3:152

విశ్వాసం వంచించదు

నిజానికి గుడ్డి నమ్మకం అనేది మనుషులను వంచించదు. "నేను ఫలానా మనిషిని నమ్మాను, అతను నన్ను వంచించాడు" అని అనటం పరిపాటి. కాని యదార్థమేమిటంటే, చెప్పిన వానిది తప్పు కాదు, నమ్మని వాడిదే తప్పు. అతని లోని ఏదో బలహీనత అందుకు కారణం. అతడు తన విశ్వాసాన్ని చెదర కుండా నిలద్రొక్కుకున్నట్లయితే, మనిషిని మార్చ గలిగేవాడు. అతడు అదే విశ్వాసపూరిత చేతనను నిలుపుకోనందున తాను వంచించబడ్డాడు, మనిషిని తాను కోరుకొన్న విధంగా మార్చలేక పోయాడు. అతనికి సమగ్రమైన విశ్వాసం ఉండి ఉన్నట్లయితే, మనిషిని మార్పు చెందుటకు బద్ధుడిని చేయగలిగేవాడు. ఎల్లప్పుడూ విశ్వాసంతోనే అద్భుతాలు జరుగుతాయి. ఒక మనిషి మరొకని వద్దకు చేరగానే అతనికి దైవిక ఉనికితో సంపర్కమేర్పడిన భావన కలుగుతుంది. అతడు ఆ భావనను పవిత్రంగా, చెదరకుండా నిలుపుకోగలిగితే, అది దివ్య చేతనను అత్యంత భౌతికపరమైన వాటిలో కూడా అభివ్యక్తమగుటకు ఒత్తిడి చేస్తుంది. కానీ అదంతా నీ స్వీయ మానసిక స్థాయి పైన, శ్రద్ధాశక్తి పైన ఆధారపడి వుంటుంది. నీవు దైహికంగా ఎంత అధికంగా సంసిద్ధుడవై వుంటే, అంత ఎక్కువగా నీవు సరియైన మూలస్థానానికి, సరియైన గురువుకు చేరువ కాగలవు. చైత్య పురుష సత్తతో పాటు దాని విశ్వాసం ఎల్లప్పుడూ నిర్వ్యాజమైనవిగానే వుంటాయి, కానీ నీ బాహ్యస్థితి మోసపూరితముగా నున్నట్లయితే, నీవు ఆధ్యాత్మిక జీవనానికి బదులు వ్యక్తిగత శక్తులను ఆశిస్తున్నట్లయితే, అది నిన్ను పెడదారి పట్టించగలదు. నిన్ను పెడదారి పట్టించేది అటువంటి అవలక్షణం కాని నీ విశ్వాసం కాదు. స్వయంగా స్వచ్ఛత కలిగి వున్న విశ్వాసం అస్తిత్వంలోని అధమ స్థాయి కదలికలలో చిక్కుకు పోయినప్పుడు, అప్పుడు నీవు వంచించబడతావు.

CWM 3:152-53

మానసిక ప్రభావ పరిధి నుండి విశ్వాస ప్రభావ పరిధిలోకి తరలి పోవాలి

తాను క్షేమంగా కార్యాచరణ గావించ గలగటానికి మనిషి మానసిక ప్రభావ పరిధినుండి విశ్వాస ప్రభావ పరిధిలోకి లేక ఒక ఉన్నత చేతనామయ పరిధిలోకి తరలిపోవాలి. శరీరాన్ని ప్రభావితం చేయగల శక్తివంతమైన మార్గం విశ్వాసం అనుట సుస్పష్టం. అతి సంక్లిష్టమైన మనస్సు గాక, ఒక సామాన్య హృదయం గల మనుషులు సాధారణ జనం, ఎవరైతే అతి గొప్పదైన అతి సంక్లిష్టమైన మానసికోన్నతిని పొందక పోయినప్పటికీ ప్రగాఢమైన విశ్వాసం కలిగి వుంటారో, వారు వారి శరీరాలను ప్రభావితం చేసే గొప్ప శక్తిని కలిగి వుంటారు. ఆ కారణంగా వ్యక్తి కొన్ని సమయాల్లో అత్యాశ్చర్యానికి గురి కాబడతాడు. "ఇక్కడ గొప్ప సిద్ధిని పొందిన అసాధారణ వ్యక్తి ఒకడున్నాడు. కాని అతడు అల్పమైన భౌతిక విషయాసక్తుల కన్నింటికీ బానిస; అదే సమయాన ఈ వ్యక్తి అతి సామాన్యుడైనప్పటికీ, ఎంతో మొరటుగా కనిపించి నప్పటికీ, ప్రగాఢ విశ్వాసంతో ఉన్నాడు. అతడు కష్టాలనుండి, అవరోధాలనుండీ ఒక విజేతగా బయట పడతాడు."

గొప్ప సంస్కారవంతుడైన వ్యక్తి విశ్వాసం కలిగి వుండడు అని నేననను. ఎందుకనగా అతనిలో ఎల్లప్పుడూ ఈ మానసిక మూలకం ఒకటి వుంటుంది. ప్రతి విషయాన్ని ఖండించడం, చర్చనీయం గావించడం, అర్థం చేసుకొనుటకు ప్రయాస పడడం, ఒప్పించుటను కష్టతరం గావించడం, నిరూపణలను అర్థించడం దాని నైజం. అందువలన అతడి విశ్వాసం లోపభూయిష్టం. అలాంటి తరుణంలో పరిణామ పురోగతిలో ఒక ఉన్నత స్థాయికి ఎదగటం, మానసిక పరిధినుండి ఆధ్యాత్మిక పరిధిలోకి సాగిపోవటం ఆవశ్యక మవుతుంది. అప్పుడు సహజంగానే విశ్వాసం ఒక అత్యున్నత శ్రేణికి చెందిన లక్షణాలను అలవరచుకుంటుంది. కాని నా ఉద్దేశ్యంలో దైనందిన జీవితంలోను, సాధారణ జీవితంలోను ప్రగాఢ విశ్వాసంతో నున్న అతిసామాన్య వ్యక్తి తన శరీరంపై ఒక ఆధిపత్యం కలిగి వుండగలడు. ఆ "ఆధిపత్యం" నిజంగా ఒక కచ్చితమైన అధికారం కాదు, అది కేవలం ఒక సహజమైన ప్రేరణ. ఒక అత్యున్నత

అభివృద్ధిని సాధించిన వ్యక్తికి తన శరీరం పైవున్న నియంత్రణ శక్తి కన్నా ఎన్నో రెట్లు అధికమైనది.

CWM 9: 126

వ్యక్తి యొక్క నిశ్చయత అతని లోనే గోచరిస్తుంది.

శ్రీఅరవిందులు అనేక మార్లు అన్నారు. తాను ఏమి చెప్పారో, భవిష్యత్తులో ఏమి జరుగుతుందని తాను సూచించారో, అది నెరవేర్చబడే వరకు దాని యదార్థత నిరూపించ బడదు అని. అంతా నెరవేర్చబడి నప్పుడు మాత్రమే అంతవరకు నమ్ముటకు సమ్మతించని వారు వారి పొరపాటును గుర్తించగలుగుతారు. కాని, బహుశా గుర్తించటానికి వారు జీవించి వుండ లేరేమో! అందుకని చేయవలసింది ఒక్కటే, వారి నమ్మికను దృఢ విశ్వాసాన్ని స్థిరంగా నిలుపుకొనుటకు వారు ఎంచుకొన్న మార్గాన్నే అనుసరించటం మరియు వివాదాస్పద వ్యాఖ్యలను, తిరస్కార భావనలను బేఖాతరు చేయడం. తాము హాయిగా నెమ్మదిగా వుండటానికి ఇతరుల ఆసరా, నమ్మిక, దృఢవిశ్వాసాలపై ఆధారపడటం అవసరమయ్యే వారుంటారు. వారెప్పుడూ అసంతుష్టులుగానే వుంటారు. ఎందుకనగా వారికి తప్పకుండా ఎల్లప్పుడూ నమ్మకం లేని మనుషులే తటస్థ పడుతూంటారు. ఆ కారణంగా వారు కలవరపడుతుంటారు ఇబ్బంది పడతారు. ప్రతివ్యక్తి తన నిశ్చయతను తనలోనే గుర్తించాలి. ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఆ నిశ్చయతను నిలుపుకోవాలి. ఎంతటి శ్రమకైనా ఓర్చి చివరిదాకా తన దారిలో తాను నడవ గలగాలి. అమితమైన ఓర్పు గలవారిదే విజయం. ఎన్ని వ్యతిరేకతలు ఎదురైనప్పటికీ సహనం సడలకుండా వుండాలంటే, ఆధారం స్థిరమైనదిగా వుండాలి. ఒకే ఒక ఆధారం స్థిరమైనది, అదే వాస్తవమైన అస్తిత్వం, పరమ సత్యం.

వేరొక దానిని వెతుక్కోవటం నిష్ప్రయోజనం. ఎప్పుడూ ఉపేక్షించనిది ఇదొక్కటే.

CWM 9: 255

విశ్వాసం ఒక దైవానుగ్రహ ప్రసాదిత మగు బహుమానం

విశ్వాసం అనేది మనకు నిశ్చితంగా దైవానుగ్రహంతో ప్రసాదించబడిన ఒక

బహుమానం. నిత్యసత్య దర్శనం కోసం తటాలున తెరచుకున్న ద్వారం లాంటిది. దాని గుండా మనమా శాశ్వత సత్యాన్ని దర్శించగలం, దాదాపు స్పర్శించగలం కూడా.

అన్ని విషయాలలో మాదిరిగానే మానవ జాతి పురోగతి చెందే క్రమంలో అత్యావశ్యకమైనది ఒకటి ఉన్నది. ముఖ్యంగా ప్రాథమిక దశలో అది వ్యక్తిగత ప్రయత్నం. కొన్ని అసాధారణ పరిస్థితుల్లో, మన మేధకు అంతు చిక్కని కారణాల వలన, విశ్వాసం ఇంచుమించు యాదృచ్ఛికంగా, అనూహ్యంగా, అయాచితంగా కలుగ వచ్చు, కానీ తరచుగా అది పరితాపానికి, ఒక అవసరానికి, ఒక ఆకాంక్షకు, జీవిలోని ఏదో అభిలాషకు, తపనకు, సమాధానంగా కలుగుతుంది — చైతన్యవంతమైన, క్రమబద్ధమైన రీతిలో సమకూరక పోయినప్పటికీ. ఏవిధంగానైనా విశ్వాసం ప్రసాదించ బడినప్పుడు, వ్యక్తిలో ఈ ఆకస్మిక జ్ఞానదీప్తి ఏర్పడి నప్పుడు, క్రియాశీల చేతనలో దానిని చెదరకుండా, శాశ్వతంగా నిలుపుకొనుటకు , వ్యక్తిగతప్రయత్నం అనివార్య మౌతుంది. వ్యక్తి తన విశ్వాసానికి కట్టుబడి వుండాలి, తన విశ్వాసాని కై సంకల్పించాలి, దానికై అర్థించాలి, దానిని పెంచి పోషించాలి, అలవరచుకోవాలి, కాపాడుకోవాలి. మానవుని మనస్సులో ఒక అనారోగ్యకరమైన దుఃఖభాజితమైన అనుమానించే వాదానికి తలపడే, దేనినీ విశ్వసించలేని అలవాటు ఒకటుంది. మానవ ప్రయత్నం ప్రయోగించ బడవలసింది, ఇక్కడే. ఆ అలవాట్లను నీలో ప్రవేశించనీయకుండా వాటికి చెవి యొగ్గ కుండా, అంతకు మించి వాటిని అనుసరించకుండా తిరస్కరించటానికి మానవ ప్రయత్నం అవసరం. అనుమానము, అవిశ్వాసములతో మానసికంగా ఆటాడుకోవడం కన్నా ఆపత్కరమైనది మరొకటిలేదు. అవి నీకు శత్రువులే కాదు, భీకరమైన లోతుల్లో నిన్ను పడద్రోసేవి. ఒక్కసారి వాటిల్లో పడిపోయి నట్లయితే నీకు పైకి లేవటం చాలా కష్టమౌతుంది. కొందరు ఊహలతో ఆటలాడటం, వాటిని చర్చనీయం చేయడం, వాటిలోని విశ్వాసాన్ని వ్యతిరేకించడం ఉన్నతమైన అభిరుచి అని అనుకుంటారు. ఇది ఒక శ్రేష్టమైన వైఖరి ప్రదర్శనగా వుంటుందని, ఆ విధంగా వారు గుడ్డినమ్మకాలకు, అజ్ఞానానికి, తలొగ్గని వారమౌతామని వారనుకుంటారు. అనుమానాస్పదము, విశ్వాస రహితమునగు సూచనలకు చెవి యొగ్గినట్లయితే నీవు దట్టమైన అజ్ఞానాంధకారంలో పడిపోతావు, సరైన మార్గం నుండి తప్పిపోతావు, గందరగోళంలో, పొరపాట్లలో దిక్కుతోచని వైరుధ్య భావన లలో మునిగిపోతావు. .. వాటినుండి విముక్తి పొందగలననే

భావన నీలో ఎప్పుడూ స్థిరంగా నిలవదు. నీ అంతరంగ వాస్తవికత నుండి ఎంత దూరంగా తొలగిపోతావంటే, నీ దృష్టికి అది అందనంత దూరంగా. కొన్ని సమయాల్లో నీకు నీ అంతరాత్మతో సాధ్యపడిన సంపర్కాన్ని సైతం కోల్పోతావు.

CWM 9: 351-52

విశ్వాసము, ప్రగాఢ నమ్మకము

ప్రశ్న: మనిషికి దైవంపై విశ్వాసంతో పాటు ప్రగాఢమైన నమ్మకం కూడా వున్నట్లయితే విశ్వాసానికి, ప్రగాఢ నమ్మకానికి మధ్యన వున్న తేడా ఏమిటి?

విశ్వాసం అత్యధిక సమగ్రతతో కూడి వుంటుంది — శ్రీఅరవిందులు వ్రాసినది అదే — ప్రగాఢమైన నమ్మకాని కన్నా విశ్వాసం మరింత సమగ్రమైనది. చూడు, నీకు దైవంపై ప్రగాఢమైన నమ్మకం ఉంది. ఆ సంవేదన ఎలాంటిదంటే, దైవం నుంచి నీకు సంక్రమించేదంతా నీకు మేలు కలిగిస్తుందనే నమ్మకాన్ని కుదిరిస్తుంది. దైవనిర్ణయం గాని, దైవం నీకు కలిగించే అనుభవంగాని లేక అతను కల్పించే పరిస్థితులు గాని ఎటువంటివైనప్పటికీ అవి నీకు ఎల్లప్పుడూ గొప్ప మేలు కలిగించేవి గానే వుంటాయి, అని నమ్ముతావు. ఇది ప్రగాఢమైన నమ్మకం, కాని విశ్వాసం దైవం ఉనికిని గురించిన ఒక అచంచల నిశ్చయత లాంటిది, అస్తిత్వాన్ని యావత్తూ స్వాధీన పరచుకుంటుంది. అది కేవలం మానసికమైనది, చైత్యపురుషసంబంధమైనది లేక ప్రాణికమైనది మాత్రమే కాదు, అది అస్తిత్వమంతా పూర్తిగా విశ్వాసంతో నిండినది. విశ్వాసం తిన్నగా అనుభవానికి దారి తీస్తుంది.

CWM 6:121-25

శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

దివ్యానుగ్రహం మనతోనే ఉంటుంది. దృశ్యమాన జగత్తు అంతటా చీకట్లు అలుముకున్నప్పటికీ అది మనలను విడనాడదు.

CWM 14: 88

మహా ఆధిపత్యశక్తి లాంటి విశ్వాసం

నిజంగా సజీవంగా ఉండేటటువంటి విశ్వాసం యొక్క శక్తి

ప్రతి క్షణం ముందుగా కాంచని దంతా, ఊహించని దంతా, తెలియనిదంతా మనముందున్నది. ప్రతిక్షణం ఈ విశ్వం పూర్తిగా దాని ప్రతి ఒక్క భాగంలోనూ కొత్తగా సృష్టి అవుతున్నది. మాకు నిజంగా సజీవమైన విశ్వాసం గనక ఉంటే, మాకు పూర్తిగా నీ సర్వశక్తిత్వం మీద, నీ ఒకే ఒక్క వాస్తవికత మీద ధృఢవిశ్వాసం గనక ఉంటే, నీ అభివ్యక్తత ఎంతగానో సుస్పష్టమవుతుంది. దానితో విశ్వం అంతా పరివర్తన చేయబడుతుంది. కాని మా చుట్టూ ఉన్న ప్రతి దానికీ, మాకంటె ముందు వెళ్ళిపోయిన దానికీ మేము ఎంతగా బానిసలైపోయామో, మేము అభివ్యక్తమైన మొత్తం సంకలనానికి ఎంతగా ప్రభావితమై పోయామో, మా విశ్వాసము ఎంత బలహీనంగా ఉన్నదంటే, ఇప్పటికీ మేము రూపపరివర్తనమనే ఆ మహాద్భుతంలో, నడుమ వచ్చే వాటి లాగా ఉండలేక పోతున్నాము..... కాని, ఓ ప్రభూ, నీకు తెలుసు, అటువంటి ఒకరోజు తప్పక వస్తుంది. నాకు తెలుసు, మా చెంతకు ఏతెంచిన వారందరినీ నీవు పరివర్తన చేసే టటువంటి ఆ ఒక రోజు తప్పక వస్తుంది. నీవు వారందరినీ ఎంత ఆమూలాగ్రంగా మార్పు చెందిస్తావంటే గతంనుంచి వారు పూర్తి విమోచనం పొందినవారై వారు నీలో పూర్తిగా కొత్త జీవితాన్ని, కేవలం నీ తోనే తయారైన జీవితాన్ని, దానికి నీవే సర్వోత్కృష్టమైన ప్రభువుగానూ, జీవించటం ఆరంభిస్తారు. ఈ విధంగా అన్ని ఆరాటాలు సంక్షోభ రహితంగా మార్పు చెందుతాయి, పరితాపాలన్నీ ప్రశాంతతను పొందుతాయి, సందేహాలన్నీ కచ్చితాలవుతాయి, అసహ్యమైనదంతా సామరస్యమైపోతుంది, స్వార్థపూరిత అహంకారమంతా ఆత్మ-సమర్పణలోకి పోతుంది, బాధంతా మార్పు నొందని సంతోషమై పోతుంది. కాని ఇప్పటికే రమణీయమైన ఈ అద్భుతాన్ని నీవు చేయడం లేదా? దానిని నేను మా చుట్టూ ప్రతిచోటా వికసించటం చూస్తున్నాను!

సౌందర్యము, ప్రేమల ఓ దివ్య ధర్మమా, పరమోత్కృష్ట విమోచనకారుడా, నీ మహదాధిపత్య శక్తికి ఏ ఆటంకమూలేదు, కేవలం మా అంధత్వం మాత్రమే నీ నిరంతర విజయమును సౌఖ్యాన్నిచ్చే మా దృష్టికి కనబడకుండా చేస్తున్నది.

నా హృదయం సంతోషమయమైన ఒక స్తుతిని గానం చేస్తున్నది. నా తలంపులు



నీవు ఒంటరిగా లేవనే సంగతి ఎన్నడూ మరవద్దు. దైవం సహాయం చేస్తూ, మార్గదర్శనం చేస్తూ నీతోనే ఉన్నాడు. అతడు నిన్ను ఎప్పటికీ వీడని సహచరుడు, ఎవరి ప్రేమైతే సుఖాన్ని, బలాన్ని ఇస్తుందో అటువంటి స్నేహితుడతడు. విశ్వాసం ఉంచు. అతడు నీ కోసం ప్రతిదీ చేస్తాడు.

CWM 14:9

శ్రీమాత

అనువాదం డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

హర్షంతో ప్రకాశమాన మయినాయి. నీ అతీతమైన ఆశ్చర్యకరమైన ప్రేమయే ప్రపంచమునకు సర్వోత్కృష్ట ప్రభువు.

CWM 1: 54-55

ఒక పవిత్ర విశ్వాసము ఒకవిధంగా సర్వశక్తిమంతము, ప్రబలము..... ఒకరి కెవరికైనా గనక సంపూర్ణంగా ఒక పవిత్రమైన విశ్వాసం, వీటన్నింటి వలనా మాలిన్య మంటని ఒక నిజమైన విశ్వాసం ఉంటే, మనం నిజమైన విశ్వాసమనే అందాం, అటువంటప్పుడు అసాధ్యమనేదేదీ ఉండదు. ఒకరు ఒక్క రాత్రిలో పరివర్తన చెంద గలరు, ఒక్క క్షణంలో అతిమానసాన్ని కిందికి తీసుకురాగలరు. ఒకరు.... దేనినైనా, ఒకరికి విశ్వాసముంటే గనక దేనినైనా చేయగలరు. కాని అది మట్టుకు తప్పక పవి త్రమైనదై ఉండాలి. అది ఎటువంటి వ్యక్తిగత ప్రతిక్రియలతోనూ లేదా వ్యక్తిగత ఇచ్ఛతోనూ కలిసిపోయినది అవకూడదు.

ఒక పవిత్ర విశ్వాసం ఒక విధంగా సర్వశక్తిమంతము, ప్రబలము. ఒకరు తరచుగా సర్వశక్తిమంతము, ప్రబలము నగు విశ్వాసమును పొంది ఉండలేరు. దానర్థం అది ఏ మాత్రమూ పవిత్రం కాదు. ప్రశ్నను ఈ విధంగా వేయవచ్చు; మనలో ప్రతివారికీ విశ్వాసం ఉంది, ఉదాహరణకు, ఒక దానిలో విశ్వాసం, చెప్పాలంటే మన అంతరం గంలోని దివ్యసన్నిధిలో విశ్వాసం. మన విశ్వాసం పవిత్రమైనదైతే మన అంతరంగంలోని దివ్యసన్నిధి ఒక్కసారిగా ఎరుక లోకి వస్తుంది. ఈ ఉదాహరణ చాలా తేలికగా అర్థ మవుతుంది. నీకు విశ్వాసం ఉంది, అది అక్కడ ఉంది, కాని నీకు అనుభవంలేదు. ఎందువల్ల? కారణం విశ్వాసం పవిత్రంగా లేదు. విశ్వాసం గనక పూర్తిగా పవిత్రంగా ఉంటే, తక్షణమే విషయం జరిగిపోతుంది. ఇది పరమసత్యం. కనుక, నీకు దాని గురించిన సాక్షాత్కారం ఒక్కసారిగా అందకపోతే, నీవు దృష్టి సారిస్తావు: “ కాని అది ఎందువల్ల సాక్షాత్కరించటంలేదు. నా విశ్వాసంలో ఏమన్నా లోటుందా?” నీవు అదే చిత్తశుద్ధితో చూడటం మొదలుపెడితే, అందులో ఎన్నో చిన్న విషయాలు, ఎన్నో చిన్న విషయాలు - ఎంత పెద్దవో కాదు, ఇంత పెద్దవి, జుగుప్స కలిగించేవి, చిన్న విషయాలు. చాలామార్లు, ఒక చిన్న దాపరికం పొడసూపుతుంది, తరువాత ఒక కోరిక, అదేమీ చాలా ఉగ్రమైనదేమీ కాదు, అది తనను తాను చాలా ఎక్కువగా

చూపించుకోదు. అది నీకు ఇచ్చే ప్రాముఖ్యత, అది నీకు ఒసంగే ఆదిపత్యశక్తి, అది నీకు ఒసంగే సంతృప్తి....

CWM 15: 320

దైవసహాయంలో నిజమైన నమ్మకం కలిగి ఉండు.

ఎంత ప్రశాంతంగా ఉంటే, అంతగా నీవు దృఢమైనవాడి వవుతావు. ఆధ్యాత్మిక ఆధిపత్యశక్తి కంతటికి ధృఢమైన ఆధారం సమత్వం. నీవు నీ నిశ్చల మనస్కతను కలవర పరచే దానిని దేనినీ కూడా అవశ్యం ఆమోదించకూడదు. అప్పుడు నీవు నీ మీద దాడి చేసే ప్రతిదానినీ నిరోదించగలవు. దానితో బాటుగా, నీకు వలసినంత విచక్షణ కూడా ఉంటే, దుష్టసూచనలను వచ్చినవాటిని వచ్చినట్లుగా చూడగలిగి, పట్టుకో గలుగుతావు. అప్పుడు నీకు వాటిని నెట్టివేయడం చాలా తేలిక అవుతుంది. కాని అప్పుడప్పుడు అవి చడీచప్పుడు లేకుండా తెలియకుండా వస్తాయి. అప్పుడు మట్టుకు వాటితో యుద్ధం చేయడం చాలా కష్టం. అది జరిగినప్పుడు, నీవు ప్రశాంతంగా కూర్చుని, ప్రశాంతతను మరియు లోతైన అంతరంగ నిశ్చలతను క్రిందికి పిలవాలి. నిన్ను నీవు దృఢంగా ఉంచుకుని నమ్మకంతోటి, విశ్వాసంతోటి పిలవాలి. నీ ఆకాంక్ష పవిత్రంగా, నిలకడగా ఉంటే, నీవు కచ్చితంగా సహాయాన్ని అందుకుంటావు. వైరి శక్తులనుంచి దాడులు తప్పనిసరి. వాటిని నీ మార్గంలో నీకు పరీక్షలుగా తలంచి ఆ అగ్నిపరీక్షల నుంచి ధైర్యంగా ముందుకు పోవాలి. పోరాటం చాలా కఠినంగా ఉండవచ్చు, కాని దాని నుంచి బయట పడినప్పుడు నీవు కొంత లాభపడతావు. దుష్టశక్తుల ఉనికి అవసరం కూడా ఉంది. అవి నీ నిర్ణయాన్ని ఇంకా దృఢంగా చేస్తాయి. నీ ఆకాంక్షకు ఇంకా స్పష్టతను కలిగిస్తాయి. ఏది ఏమైనప్పటికీ ఇది మట్టుకు నిజం. అవి ఉంటున్నాయంటే కారణం, అవి ఉండటానికి నీవు అవకాశం ఇచ్చావు. నీలో వాటికి సమాధానం ఇచ్చేదేదో ఉన్నంతకాలం, మధ్యలో వాటి

నేను నొక్కి చెప్పేదేమంటే, విషయాలు ఎంత కష్టంగా ఉంటాయో, అంతకంటే ఎక్కువగా నీవు ప్రశాంతంగా తప్పక ఉండిపోవాలి. అంతకంటే ఎక్కువగా నీకు తొణకని బెణకని విశ్వాసం ఉండాలి. విషయాలన్నింటిలోకి అది అత్యంత ముఖ్యమైనది.

CWM 6:453

శ్రీమాత

జోక్యం కచ్చితంగా న్యాయసమ్మతమే. నీలో ఏదీ ప్రతిస్పందించక పోయినప్పుడు, నీ ప్రకృతిలోని ఏ భాగంలోనూ వాటికి ఎటువంటి పట్టూ లేనప్పుడు, అవి చతికిల పడిపోయి నిన్ను వదిలి పోతాయి. ఏది ఏమైనా అవి నీ ఆధ్యాత్మిక పురోగతిని ఆపటం లేదా అడ్డుకో వలసిన అవసరం లేదు.

వైరి శక్తులతో యుద్ధంలో అపజయం పొందటానికి కారణం దైవ సహాయంలో నిజమైన నమ్మకాన్ని కలిగి ఉండక పోయిన మాత్రం చేతనే. ఆకాంక్షలో చిత్తశుద్ధి ఎల్లప్పుడూ ఆపదలో కావలసినంత సహాయాన్ని క్రిందికి తీసుకువస్తుంది. ఒక నిశ్చలమైన పిలుపు, ఒక దృఢ నమ్మకం, సాక్షాత్కారం వైపు నీవు చేసే ఆరోహణలో నీవు ఒక్కడవే నడవటంలేదని, ఎప్పుడెప్పుడు సహాయం అవసరం కలిగినా అది అక్కడ ఉన్నదనే విశ్వాసం నిన్ను దానిగుండా, ముందుకు తేలికగా భద్రంగా నడి పిస్తుంది.

CWM 3: 33-34

ప్రయత్నంలో పట్టుదల, తొణకని విశ్వాసం అవసరం

.... విశ్వాసం అనేది ఒక సిద్ధాంతంలో లేదా ఒక మతంలో అభిప్రాయంకాదు, అది ప్రభువు బోధలో విశ్వాసం ఉండడం కూడా కాదు; అది ఒకరి సొంత సాధ్యాలమీద విశ్వాసం, ఎటువంటి కష్టాలైనా, ఎటువంటి అవరోధాలైనా, ఎటువంటి అపరిపూర్ణతలైనా అస్తిత్వంలో ఖండనలు సైతం ఉన్నప్పటికీ దృఢవిశ్వాసం ఉండటం, ఒకరు సాక్షాత్కారం కోసం జన్మించారు, ఒకరు సాక్షాత్కారం పొంది తీరుతారు. ఇచ్ఛ ఎన్నడూ తప్పక తడబడకూడదు. ప్రయత్నం పట్టుదలతో కూడినదై ఉండాలి, విశ్వాసం తొణకనిదై ఉండాలి. అప్పుడు సాక్షాత్కారం పొందటానికి సంవత్సరాలు శ్రమించటానికి బదులుగా ఒక వ్యక్తి తాను పొందవలసిన సాక్షాత్కారం కొన్ని నెలలలో పొందగలుగుతాడు. ఒక్కొక్కప్పుడు కొన్ని రోజులలో దానికి వలసిన తీవ్రత ఉన్నట్లైతే గనక, కొన్ని గంటలలోనే చేయగలుగుతాడు. అనగా చెప్పేదేమంటే నీవు నీ అంతరంగంలో ఒక సుస్థిరమైన స్థానంలో కుదురుకోవాలి. ఏ దుష్ట ఇచ్ఛా నీ సాక్షాత్కారం మీద దాడి చేయలేదు. దానికి నీ మీద ఎటువంటి ఆధిపత్యశక్తి ఉండదు. ఏ విధంగా అయితే తుఫానుకు కొండమీద ఉండదో అదే విధంగా. దాని

తరువాత, మార్గం ఎంత మాత్రం కఠినతరం కాదు. అది అసాధారణంగా, ఆసక్తి దాయకంగా అయి పోతుంది.

CWM 3: 189

ధైర్యంతో కష్టాన్ని ఎదుర్కో, అనుగ్రహంలో విశ్వాసం ఉంచు

చాలా సహజంగానే, బాధ మనలను ఎటువైపు తీసుకు వెడుతుందనే దాని రహస్యాన్ని మనల్ని మనం అడుగుతుంటాం. పైపైన, అపరిపూర్ణమైన అవగాహనతో, ఆత్మ బాధను కోరుకుంటుందని ఒకరు అభిప్రాయపడవచ్చు. అటువంటిదేమీ లేదు. ఆత్మయొక్క అసలైన ప్రకృతి నిరంతరమైన హెచ్చుతగ్గులు లేని, నిబంధనలులేని, పారవశ్యపూరితమైన దివ్యానందం. కాని ఇది మట్టుకు నిజం, ఒకరు బాధను ధైర్యంతో, ఓరిమితో, దివ్యానుగ్రహంతో అచంచలమైన విశ్వాసంతో ఎదుర్కొనగలరు. కష్టం వచ్చినప్పుడు ఒకరు గనక దానిని తప్పించుకొని దూరంగా పారిపోయేకంటే ఈ ఇచ్ఛతో, ఈ ఆకాంక్షతో దానిలో ప్రవేశించి, ప్రకాశమాన సత్యాన్ని, విషయాలన్నింటి కేంద్రస్థానంలోని హెచ్చుతగ్గులు లేని ఆనందాన్ని కనుగొనాలి. తరచుగా, బాధ అనే ద్వారం సంతృప్తి లేదా పరితృప్తులకంటే ఎక్కువ సూటిగా, ఎక్కువ వెనువెంటనే ఫలితాన్నిస్తుంది. నేను సుఖం గురించి మాట్లాడటంలేదు. కారణం, సుఖం నిరంతరం చాలామట్టుకు పూర్తిగా సమృద్ధి అయినటువంటి దివ్యానందం నుంచి మరలి పోతుంటుంది.

సుఖం అనేది మోసపూరితమైనటువంటి, పెడదారి పట్టించే మారువేషం. అది మన లక్ష్యంనుంచి మనల్ని దూరంగా మరల్చివేస్తుంది. సత్యాన్ని తెలుసుకోవాలనే ఉత్సుకత మనకు ఉంటే మనం కచ్చితంగా సుఖం కోసం వెతక కూడదు. సుఖం మనిషిని ఆవిరి చేస్తుంది. అది మనల్ని మోసం చేస్తుంది. సక్రమ మార్గంనుంచి మనల్ని ప్రక్కదార్లు పట్టిస్తుంది. బాధ తప్పనిసరిగా మనచేత దానిని భరించేందుకు ఏకాగ్రత వహించేటట్లు, మనల్ని అణగద్రొక్కే దానిని ఎదిరించగలిగేటట్లు చేసి, లోతైన సత్యానికి తిరిగి వెనుకకు తీసుకువస్తుంది. బాధలోనే ఒక దృఢమైన వ్యక్తి చాలా తేలికగా తన నిజమైన ధృఢత్వాన్ని తిరిగి పొందుతాడు. బాధలోనే ఒక వ్యక్తి చాలా తేలికగా నిజమైన విశ్వాసాన్ని, ఏదో ఒక దానిలో విశ్వాసాన్ని, ఏదైతే

బాధనంతటినీ మించి, ఆవలగా అందనంత దూరంలో ఉంటుందో అటువంటి దానిని తిరిగి పొందుతాడు.

CWM 9: 41-42.

భయానికి చికిత్స

నీకు విశ్వాసం ఉండి దైవానికి సమర్పించుకుని ఉంటే, అప్పుడు చాలా తేలిక మార్గం ఒకటుంది. ఈ విధంగా చెప్పాలి, "నీ ఇచ్ఛయే జరుగును గాక, నన్ను ఏదీ భయపెట్టలేదు. కారణం నా జీవితానికి మార్గదర్శనం నీవే చేస్తున్నావు. నేను నీకు చెందియున్నాను. నీవు నా జీవితానికి మార్గదర్శనం చేస్తున్నావు." అది తక్షణమే పని చేస్తుంది. అన్ని ఉపాయాలలోకి అది చాలా అమోఘమైనది: వాస్తవానికి అదే సత్యం, అనగా ఒకరు భగవంతునికి నిజంగా సమర్పించుకుని ఉండాలి. ఒక రికి అది ఉంటే, అది తక్షణమే పని చేస్తుంది; భయమంతా ఒక స్వప్నంలాగా వెను వెంటనే మాయమై పోతుంది. చెడు ప్రభావంతో ఉన్న అస్తిత్వం కూడా స్వప్నంలాగా భయంతో పాటుగా అదృశ్యమైపోతుంది. అది పూర్తి వేగంతో పారిపోవటాన్ని నీవు చూడవచ్చు. హుష్ కాకి!

CWM 5:117-18

...భయపడేవాళ్ళు ప్రతి చోటా భయపడుతుంటారు, అదే విశ్వాసం ఉన్న వ్యక్తి ప్రతి చోటా భద్రంగా ఉంటాడు.

*

అత్యుత్తమ రక్షణ దైవానుగ్రహమందు ఒక అచంచలమైన విశ్వాసం.

*

రక్షణ క్రియాశీలంగానూ, సమర్థవంతంగానూ, కేవలం నీ వైపు నుండి సంపూర్ణమైన, నిరంతరమైన విశ్వాసం కలిగి ఉండటంలో మాత్రమే ఉంటుంది.

CWM 15:46-47

శరీరంలో విశ్వాసం

శరీరంలో కూడా, ఉదాహరణకు, ఎప్పుడైనా ఒక విధమైన దాడి, ఒక ప్రమాదం జరగాలని, ఒక జబ్బు రావాలని ప్రయత్నిస్తుంటే, ఒక విధంగా శరీరం మీద దాడి జరిగినప్పుడు శరీరాన్ని గనక దాని మానాన దాని సహజమైనటువంటి, అప్రయత్న పూర్వకమైన హఠాత్ చలనంతో జరిగే చర్యకు వదలిపెడితే, అప్పుడది ఒక ప్రేరణతో, ఒక ఆకాంక్షతో, అప్రయత్నంగా తటాలున పొడసూపే ఒక ఇచ్ఛతో సహాయంకోసం పిలుస్తుంది. కాని అది తలను చేరిన వెనువెంటనే అది ఆ వ్యక్తికి అలవాటైన రూపాలను తీసుకుంటుంది. అంతే, అంతా చెడిపోతుంది, కాని, శరీరాన్ని ఉన్నదానిని ఉన్నట్లుగా, దానిలోనే చూడడం జరిగితే, అందులోనుంచి హఠాత్తుగా ఏదో మేల్కొని, సహాయం కోసం పిలుస్తుంది. అది ఎటువంటి విశ్వాసంతో ఉంటుందంటే, ఎంత తీవ్రతతతో ఉంటుందంటే, చాలా చిన్న పసికూన తన తల్లిని పిలిచినట్లు, తెలిసిందా — లేదా, అక్కడ ఎవరున్నప్పటికీ, అది మాట్లాడలేని పక్షంలో ఏమీ అనదు. కాని మనస్సు యొక్క ఇటువంటి నిరంతరమైన కార్యక్రమం ఏదీ దాని మీద లేకుండా శరీరాన్ని దాని మానాన దానిని వదిలివేస్తే.... అప్పుడు, దానిలో ఇది జరుగుతుంది. ఏదైనా కలవరానికి గురైన వెనువెంటనే, తక్షణమే దానిలో ఒక ఆకాంక్ష, ఒక పిలుపు, సహాయం కోసం వెదికే ప్రయత్నం పొడసూపుతుంది. ఇది చాలా శక్తివంతమైనది. ఏదీ జోక్యం చేసుకోని పక్షంలో అతి చాలా శక్తిమంతమైనది. అది ఏ విధంగా ఉంటుందంటే, కణాలు తమకు తాము ఆకాంక్షతో ఉబికి పైకి తన్నుకు వచ్చినట్లు, ఒక పిలుపు.....

శరీరాన్ని దాని మానాన దానిని వదిలివేస్తే, అసాధారణం, ఎందువల్లనంటే, కేవలం అది సమతౌల్యం కోసం, క్షేమంగా ఉండటానికి ఆకాంక్షించటం మాత్రమే కాకుండా, అది పూర్వపు స్థిరత్వాన్ని తిరిగి స్థాపించగల సమర్థత కలిగింది. ఒకరు తన ఆలోచనల న్నింటితోను, ప్రాణిక ప్రతిక్రియ లన్నింటితోను, క్రుంగుబాటు లన్నింటితోను ఇంకా ఏదో తెలుసుకునే జ్ఞానం, మానసిక నిర్మాణాలు, భయాలతో జోక్యం చేసుకోకుండా శరీరాన్ని దాని మానాన్న దానిని వదిలివేస్తే, ఒకరు తన శరీరాన్ని దాని మానాన్న దానిని వదిలివేస్తే, అప్రయత్నంగా తనకు తానుగా తనను సరిచేయటానికి ఏది అవసరమో, దానిని చేస్తుంది. శరీరం దాని సహజస్థితిలో సమతౌల్యతను కోరుకుంటుంది, సామరస్యతను కోరుకుంటుంది. అస్తిత్వపు ఇతర

భాగాలు మాత్రమే ప్రతీదానిని చెడగొడతాయి.

CWM 6: 139-14

విశ్వాసం రక్షించే రక్షరేకు

ప్రశ్న: మేము ఏదైనా ఉంగరంలో లేదా నగలో మీ ప్రతిబింబం వేసుకుంటే అది మాకు రక్షణ నిస్తుందా?

అన్నింటినీ మించి నీవు దాని గురించి ఏమి ఆలోచిస్తావు అనే దానిమీద అది ఆధారపడి ఉంటుంది. నేను స్వయం నా చేతులతో నీకు ఏదో ఇస్తాను. అప్పుడందులో నేను ఏదో ఉంచుతాను; కాని నీ ఎంపికతో నీవు ఏదో ఉంగరాన్ని లేదా ఒక చిత్ర పటాన్ని, ఏదో ఒక దానిని నీవు ధరిస్తావు...... నీకు దాని మీద ప్రగాఢమైన నమ్మకం ఉంటే, అది నిన్ను రక్షిస్తుందనే విశ్వాసం ఉంటే, అది నిన్ను రక్షిస్తుంది. నేను ఇచ్చి నప్పుడు, నేను ఆ వస్తువుతో నీకు పూర్తిగా భిన్నమైన దానిని ఏదో ఒక దానిని అందులో ఉంచి ఇస్తాను. నేను దానిలో పెట్టినప్పుడు మాత్రమే, ఆ వస్తువు దానిని కలిగి ఉంటుంది. నేను పెట్టకపోతే, దానిలో అది ఉండదు. నీకు తెలుసా, శ్రీఅరవిందుల చెప్తూ ఉండేవారు, ఆయన చిత్రంతో ఉంగరం ధరించి, అది నిన్ను రక్షిస్తుందని అనుకుంటే అది మూఢనమ్మకం! ఆయన నీకు అది మూఢనమ్మకం అని చెప్తారు అనగా నీవు దాని గురించి ఏమని ఆలోచిస్తావు అనే దానిమీద అది ఆధారపడిఉంటుంది ఆయన నీకు ఒక ఉంగరం ఇస్తూ, " అది వేసుకో, నా శక్తి నీతో ఉంటుంది." అని చెప్తే, అప్పుడది పూర్తిగా వేరైన విషయమై పోతుంది, హస్తిమ శకాంతరం తేడా

CWM 6:23

మధ్యవర్తిత్వం నెరపమని కోరే ప్రార్థనల్లోని విశ్వాసం

ఒక విధమైన ప్రార్థన ఉంది. ఒకేసారి అప్రయత్నమైనది, నిస్వార్థమైనది, అది ఒక మహత్వ పూర్ణమైన పిలుపు, సాధారణంగా వ్యక్తిగతంగా తనకోసం కాదు కాని దైవం మధ్యవర్తిత్వానికై ఒక విధమైన పిలుపు. అది అత్యంత శక్తిమంతమైనది

విశ్వాసం కలిగి ఉండు: దైవానుగ్రహంతో నయం కాని వ్యాధి అంటూ ఏదీ లేదు.

CWM 15:15

ఇటువంటి తరహా ప్రార్థనలతో చాలా మట్టుకు తక్షణమే సాక్షాత్కారం పొందిన సందర్భాలు నా విషయంలో లెక్కలేనన్ని ఉన్నాయి. అది ఒక గొప్ప విశ్వాసాన్ని చూపిస్తుంది, ఒక గొప్ప ఆరాధనను, ఒక గొప్ప చిత్తశుద్ధిని, ఒక గొప్పహృదయ నిరాడంబరతను కూడా చూపిస్తుంది. అది ఎటువంటి లెక్కలూ వేయనిది, ఎటువంటి ముందస్తు ప్రణాళికాలేనిది, ఎటువంటి బేరసారాలు ఆడనిది. ఒక దానికై మరొకటి ఆశించి ఇచ్చేది కాదు. కాని చాలా ఎక్కువ శాతం మంది ఒక చేత్తో ఇచ్చి, తామి చ్చిన ఏదో ఒకదానికి మరొక చేతిని చాపుతారు. చాలా ఎక్కువ సంఖ్యలోని ప్రార్థ నలు ఆ రకానికి చెందినవే. కాని నేను వివరించిన ప్రార్థన రకాలు కొన్ని ఉన్నాయి. కృతజ్ఞతలు తెలిపేవి, ఒకవిధమైన గీతం, అటువంటివి చాలా మంచివి.

CWM 5: 141-142

నైతిక స్థితి అతి ముఖ్యం

నీకు తెలుసుకదా, కొంతమంది సాధువు లుంటారు. సాధుత్వం ద్వారా వారు అపరిశుభ్రమైన జీవన స్థితిగతులను ఆమోదిస్తారు. వారు ఎన్నడూ స్నానమాచరించరు. శుభ్రత పరంగా దేనినీ ఆచరించరు. వారు నిజమైన అపరిశుభ్రతలో జీవిస్తారు. వారు జబ్బులన్నింటినుంచి విముక్తులు. బహుశా వారికి విశ్వాసం ఉండవచ్చు. వారు దానిని ఉద్దేశపూర్వకంగా చేస్తారు. వారి ఆత్మశుద్ధి అద్భుతం. నేను చిత్తశుద్ధితో ఉన్నవారి గురించి మాట్లాడుతున్నాను, అంతేకాని నటించేవారిని గురించి కాదు. వారికి విశ్వాసం ఉంటుంది. వారి శరీరం గురించి వారు ఆలోచించరు. వారు వారి ఆత్మ జీవితం గురించి ఆలోచిస్తుంటారు. వారికి ఏ జబ్బూ ఉండదు. కొంత మంది కఠోరమైన భంగిమతో ఒక స్థితిలోకి చేరుకుంటారు. అందులో వారి ఒక చేయి లేదా ఒక కాలు లేదా శరీరంలో ఏదో ఒక భాగం పూర్తిగా కొయ్యబారిపోతుంది. వారు ఎంత మాత్రం కదల లేరు. ఇంకొకరెవరైనా అయితే ఆ పరిస్థితుల్లో చనిపోతారు; వారు జీవిస్తూనే ఉంటారు. ఎందువల్లనంటే వారికి విశ్వాసం ఉంటుంది. వారది ఉద్దే శ్యపూర్వకంగా చేస్తారు. కారణం దానిని వారు వారి మీద బలవంతంగా రుద్దు కున్నారు. కనుక భౌతిక స్థితికంటే నైతిక స్థితి చాలా ఎక్కువ ముఖ్యమైనది. అపరి శుభ్రంగా ఉన్న ఆ పరిస్థితులలో నీవు కొన్ని రోజులుంటే, అక్కడ స్నానం చేయకుండా మూడు రోజులుంటే నీవు జబ్బు పడతావు. ఇది నేను స్నానం చేయనక్కరలేదనే

దానిని మాత్రం చెప్పటంలేదు. కారణం మనం సాధువులం కావాలనుకోవటం లేదు, మనం యోగులం కావాలనుకుంటున్నాము. కనుక అది అర్హతను కలిగి ఉండటానికి ఏది ఆవశ్యకమో దానిని చేయవలసిందే. అయినప్పటికీ కేవలం ఇది నేను ఎందుకు చెపుతున్నానంటే, నైతిక స్థితి భౌతిక స్థితికంటే చాలా ఎక్కువ ముఖ్యమైనదని తెలియ జెప్పటానికే.

CWM 5: 170

దివ్యశక్తిని అందుకోవటంలో అసమర్థత

నీకు చెప్పబడింది, " నిన్ను నీవు తెలుసుకో, నీవు మహాశక్తిని అందుకో గలవు." ఇది కూడా నీకు చెప్పబడింది. "విశ్వాసం ఉంచు, దయాళువై ఉండు, నీవు రక్షించ బడతావు." దాని కణుగుణంగా నీవు మహాచైతన్యంలో స్నానమాచరించావు, మహాశక్తిలో స్నానమాచరించావు, మహారక్షణలో స్నానమాచరించావు, నీకు విశ్వాస మున్నంత వరకు తెరుచుకున్నావు, దానినంతా అందుకున్నావు. అది నీ యోగ్యతను పట్టి ఉంచటానికి, చిన్నపాటి అంతరంగ కలవరాలను నిరాకరించటానికి అవి వచ్చినప్పుడు పరిస్థితిని తిరిగి సుస్థిర పరచటానికి, చిన్నచిన్న దాడులనుంచి లేదా జరగబోయే ప్రమాదాలనుంచి నీకు రక్షణ కల్పించటానికి సహాయం చేసింది. కాని నీ అస్తిత్వంలో ఏదో ఒక చోట నీ శరీరంలో కాని నీ ప్రాణికంలో లేక నీ మనస్సులో కాని అనేక భాగాలలో కాని లేక కనీసం ఒక భాగంలో కాని, — క్రిందికి దిగివచ్చే మహాశక్తిని అందుకోవడానికి అసమర్థత గనక ఉంటే, అది యంత్రంలో ఇసుక రేణువు లాగా పనిచేస్తుంది. నీకు తెలుసు కదా, ఒక చక్కని యంత్రం, పూర్తిగా చక్కగా పనిచేస్తున్నది, ప్రతిదానితోను సవ్యంగా ఉంటున్నటువంటిది, అటువంటిదానిలో నీవు కొద్ది ఇసుకను వేస్తే, (ఎక్కువ కాదు, కేవలం ఒక రేణువును మాత్రమే), హఠాత్తుగా అంతా పాడయిపోతుంది, యంత్రం ఆగిపోతుంది.ఎక్కడో ఒక చోట ఒకింత అందుకో లేని పరిస్థితి, మహాశక్తిని అందుకో లేని ఏదో ఒక అసమరథ్థత, అది పూర్తిగా మూసుకు పోతుంది. (ఒకరు దానివంక పరిశీలించి చూసినప్పుడు, ఎక్కడో ఒకచోట ఒక నల్లటి మచ్చ అనిపించేటట్లుగా మారి ఉంటుంది, చాలా చిన్నది. గట్టి రాయిలాంటిది, మహాశక్తి అందులోకి ప్రవేశించ లేదు. అది అందుకోవడానికి నిరాకరిస్తుంది. అది అందుకొన గలగలేక పోవటంగాని లేక అందుకోవటానికి నిరాకరించటం గాని, తక్షణమే

అది ఒక గొప్ప అసమతౌల్యతను కలిగిస్తుంది. అది పైపైకి పోతున్నది, అది ఎంతో అద్భుతంగా వికసిస్తున్నది, తనను తాను వ్యాధి బారిన పడినట్లు తెలు సుకుంటుంది. అప్పుడప్పుడు వాస్తవంలో నీవు సాధారణ సమతౌల్యంలో ఉన్నప్పుడు; నీవు మంచి ఆరోగ్యంతో ఉంటావు, ప్రతీది సవ్యంగా గడచిపోతుంటుంది. నీకు దేని గురించీ ఫిర్యాదు చేయవలసిన అవసరం ఉండదు. ఒకరోజు నీవు క్రొత్త విషయాన్ని గ్రహించి నప్పుడు, ఒక క్రొత్త ప్రేరణను అందుకున్నప్పుడు, నీకు ఒక గొప్ప ఆకాంక్ష కలిగినప్పుడు, ఒక గొప్ప శక్తిని అందుకున్నప్పుడు, ఒక అద్భుతమైన అనుభవం పొందినప్పుడు, ఒక అందమైన అనుభవం నీ అంతరంగ ద్వారాలను తెరుస్తున్నప్పుడు, అది నీకు ఇతః పూర్వం లేని ఒక జ్ఞానాన్ని ఇస్తున్నప్పుడు. అప్పుడు నీవు ప్రతీదీ చక్కగా జరిగిపోతుందని కచ్చితంగా అనుకుంటావు..... మరుసటి రోజు నీవు జబ్బు పడతావు. అప్పుడు నీవు అంటావు: ఇంకా అది? అది అసాధ్యం! అది జరగ కూడదు. కాని అది కేవలం పూర్తిగా ఇప్పుడు నేను మీకు చెప్పినదే, ఒక ఇసుకరేణువు. అందుకోలేని దేదో అక్కడ ఉంది. తక్షణమే అది అసమతౌల్యతను తీసుకు వస్తుంది. అది ఎంత చిన్న దైనప్పటికీ చాలు, నీవు వ్యాధి గ్రస్తుడ వవుతావు.

CWM 5:176

వ్యాధిని నయం చేయటంలో విశ్వాసం

ఒకరు తమ విశ్వాసం మరియు ధృఢ నమ్మకం దేనితో దట్టించ బడినవో తప్పక తెలుసుకోవాలి. ఎందువల్లనంటే, ఉదాహరణకు, నీవు సాధారణంగా జీవిస్తుంటే, పూర్తిగా సాధారణ పరిస్థితులలో — ఎటువంటి మితిమీరిన భావాలకూ, కుంగుబాటుకూ లోను చేసేటటువంటి విద్యను పొంది ఉండకుండా ఉండి ఉంటే — అప్పుడు నీ యుక్త వయస్సు అంతా, సాధారణంగా నీకు ముప్పై వచ్చేవరకు, నీకు జీవితంమీద సంపూర్ణంగా దృఢమైన నమ్మకం ఉంటుంది. ఒకవేళ, ఉదాహరణకు, నీకు పడిశం పట్టగానే, ఆందోళనతో వైద్యుని వద్దకు పరుగులు తీసి, నీకు మందులు ఇచ్చే జనులు నీ చుట్టూ పరివేష్టించి లేకపోతే, ఒకవేళ నీవు సాధారణ పరిసరాలలో ఉండి, ఏదైనా నీకు జరిగిన పక్షంలో — ఒక ప్రమాదం లేక స్వల్పంగా ఒక అనారోగ్యం — నీ శరీరంలో కచ్చితత్వానికి సంబంధించింది ఇది ఉంటుంది. అంతా చక్కగా జరిగిపోతుంది అనే ఈ దృఢమైన నమ్మకం: "అది ఏమీ లేదు, అంతా సవ్యంగా

జరిగిపోతుంది, అది కచ్చితంగా పోతుంది. రేపు గాని లేక కొద్ది రోజులలో గాని నేను బాగయిపోతాను. అది కచ్చితంగా నయమవుతుంది." ఎటువంటి వ్యాధి పట్టుకున్నా కాని. వాస్తవానికి శరీరంలో అది సర్వ సాధారణ స్థితి. ఒక సంపూర్ణమైన దృఢమైన నమ్మకం, జీవితం అంతా తన ముందున్నదని, అంతా మంచిగా జరిగి పోతుందని. ఇది అపరిమితంగా సహాయం చేస్తుంది. పదింట తొమ్మిది వంతుల ఒకరికి స్వస్థత చేకూరుతుంది. ఈ నమ్మకంతో ఒకరు త్వరగా అనారోగ్యం నుంచి ఆరోగ్యాన్ని పొందుతారు: "ఇది ఏమీ లేదు, అసలు ఏముందని? వాస్తవానికి కేవలం ఒక ప్రమాదం మాత్రమే, అది దాటిపోతుంది, అది ఏమీ లేదు." కొంతమంది జనులున్నారు, వారు దానిని చాలా కాలం నిలుపుకుంటారు, చాలా కాలం, ఒక విధమైన నమ్మకం — వారికి ఏమీ కాదు. వారి జీవితమంతా వారి ముందుంది సంపూర్ణంగా, వారి కేమీ కాదు. వారికి జరిగింది ఏ మాత్రం ప్రాముఖ్యమైనది కాదు: అంతా సవ్యంగా జరిగిపోతుంది, తప్పనిసరిగా; వారి జీవితమంతా వారి ముందుంది. సహజంగానే, నీవు వ్యాధి భావాలున్నటువంటి పరిసరాలలో, ఎక్కడైతే జనులు గొప్ప విపత్తులు, సర్వం నాశనం చేసే దుర్ఘటనల గురించి వివరంగా చెప్పుకొంటూ తమ సమయాన్ని గడుపుతూ, ఒకే చోట నివసిస్తూ ఉంటే, అప్పుడు నీవూ చెడ్డగానే ఆలోచిస్తావు. నీవు చెడ్డగా ఆలోచిస్తే, అది నీ శరీరం మీద పనిచేసి ప్రభావం చూపుతుంది. లేని పక్షంలో, శరీరం ఈ నమ్మకాన్ని నలభై లేదా ఏభై సంవత్సరాల వరకు ఉంచుకో గలుగుతుంది — అది మనుషుల మీద ఆధారపడి వుంటుంది — కొంతమందికి ఒక సాధారణమైన సమతౌల్యంతో కూడిన జీవితాన్ని జీవించడం తెలుసు. కేవలం ఆలోచన మాత్రమే ఏతెంచితే, అది అన్ని రకాలైన వ్యాధికారకమైన, అనారోగ్యకరమైన ఊహలను తీసుకువస్తుంది; నేను చెప్పిన విధంగా, అది ప్రతిదానినీ మార్చివేస్తుంది. నేను అటువంటి సందర్భాలు చూశాను: చిన్న పిల్లలు పరుగెడుతూ, ఆడుకుంటూ ఇటువంటి చిన్న ప్రమాదాల బారిన పడుతుంటారు వారు వాటిని గురించి కనీసం ఆలోచన కూడా చేయరు.


క్రియాశీలమైన విశ్వాసం

ఇప్పుడు నీవు క్రియాశీలమైన విశ్వాసం గురించి మాట్లాడుతున్నావు. క్రియా శీలమైన విశ్వాసం ఒక విధంగా వేరైనది. ఒకరికి గనక అంతరంగంలో దివ్యానుగ్రహం

మీద విశ్వాసం ఉండి, ఆ దివ్యానుగ్రహం తనను పైనుంచి కనిపెట్టి చూస్తున్నదని అనుకుంటే, ఏది జరిగినప్పటికీ, ఆ దివ్యానుగ్రహం ఉన్నది కాబట్టి, అది అతనిని పై నుంచి కనిపెట్టి చూస్తుంటుంది. ఒకరు ఈ విశ్వాసాన్ని జీవితకాలమంతా, ఎల్లప్పుడూ ఉంచుకోవచ్చు. దీనితో ఒకరు అన్ని అపాయాల నుంచి బయటపడవచ్చు, అన్ని ఇబ్బందులను ముఖాముఖి ఎదుర్కొనవచ్చు. ఏదీ నిన్ను కదిలించదు, ఎందువల్లనంటే నీకు విశ్వాసం, దివ్యానుగ్రహం ఉన్నాయి. అది అపరిమితంగా ఎక్కువ దృఢమైనది, ఎక్కువ ఎరుక కలిగింది, ఇంకా ఎక్కువ శక్తి కలిగినది, అది నీ భౌతిక నిర్మాణ స్థితిగతుల మీద ఆధారపడదు, అది దివ్యానుగ్రహం మీద తప్ప మరింకేదాని మీద ఆధారపడదు, అందువలన అది మహాసత్యం మీద వాలి ఉంటుంది, దానినేదీ కదిలించ లేదు. అది చాలా వేరైనది.

CWM 5:296-97

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ



గురువెవరైనా, సందర్భా లన్నింటిలో అతనినే విశ్వసించాలి. నీ వెంత వరకు వెళ్ళ గలవో, అంత దూరం ఆయన నిన్ను నడిపిస్తాడు. కాని దైవమే గురువయ్యే అదృష్టమే నీకు లభిస్తే నీ జ్ఞాన సిద్ధికి పరిమితంటూ వుండదు.

CWM 12:63

శ్రీమాత

అనువాదం: కె. వి. రావు

విశ్వాసమనే వారధి నెలా నిర్మించాలి?

దైవం వున్నాడని ఋజువు చేయడానికి యీ ప్రపంచ ఉనికే చాలు

ఒక విధమైన పరిపూర్ణతకు, బహుశా తనను తానధిగమించటానికి, తానిప్పు డేమైవున్నాడో, దానికంటె యేదో ఔన్నత్యానికి చేరాలని మనిషి తపిస్తాడు. అతడు పరుల మంచిని కోరే వాడైతే, మానవజాతి యిప్పుడున్న దానికంటె యింకా సుఖంగా వుండాలనీ, లేక అసంతుష్టి తగ్గుముఖం పట్టాలని, కష్టాలు యింకా తక్కువగా వుండాలని, దుఃఖం కూడ బాగా తక్కువగా వుండాలనీ, అటువంటివే మరెన్నింటినో కోరుకొంటాడు. అందుకోసం అతడు యోగసాధన చేయవచ్చు. అయితే దానిని నమ్మకం అనలేం. దైవం లేకుండా ప్రపంచం నిలువలేదు, ప్రపంచ అస్తిత్వమే దైవం వున్నాడనడానికి ఋజువు అనే విశ్వాసం ఉంటే, అతనికి నమ్మకం వుంది అనవచ్చు. అది కేవలం "నమ్మకం" కాదు, అది అతను ఆలోచించగా యేర్పడినది గాదు, లేక బోధించగా యేర్పడినది గాదు, అటువంటిదేం గాదు. దైవం ఉన్నాడని ఋజువు చేయడానికి ప్రపంచ ఉనికే చాలు అనేది ఒక సజీవ జ్ఞానం, సంపాదించుకొనగా కలిగిన జ్ఞానంకాదు. దైవం లేకుండా ప్రపంచం లేదు. ఇది ఎంతో స్పష్టం. మరోరకంగా ఆలోచించవచ్చు గదా అని అనుకుంటే, ఆతడు కొంచెం మందబుద్ధి అని చెప్పవచ్చు. "లక్ష్యం," లేక "గమ్యం," లేక "అంత్యం" అనే అర్థంలో కానటువంటి "దైవం" ప్రపంచం ఉన్నదాన్ని ఉన్నట్లుగా తీసుకున్నా, అది దైవాన్ని ఋజువు చేస్తుంది. ఎందుకనంటే అది దైవం యొక్క ఒక పార్శ్వం, కొంత వక్రీకరించబడినది కావచ్చు, అయినాసరే...

నాకైతే ప్రపంచం అంతకంటె బలమైనది. నేనొక గులాబీ పూవు వంక చూచినపుడు, దేని మీదా ఆధారపడిలేని, కేంద్రీకృతమైన సౌందర్యం గలదిగా కన్పిస్తుంది. మానవ తయారీ గానటువంటి సహజ సౌందర్యం ఒక వికాసం అది. దైవం ఉన్నాడని నిర్ధారించు కోవడానికి దాని వంక చూస్తేనే చాలు. అదొక నిశ్చితత్వం. ఎవరూ కాదనలేరు, నమ్మకుండా వుండడం అసాధ్యం. ప్రకృతిని అధ్యయనం చేసేవాళ్ళు అయినా సరే దైవం ఉన్నాడనే పరిపూర్ణ నమ్మకం లేకుండా అది ఎలా పని చేస్తుంది, ఎలా రూపొందింది, ఎలా మనగలుగుతున్నది అనే విషయాలను ఈ విధంగా అధ్యయనం చేయగలరు. మనం దైవం అని పిలిచే దైవం చాలా చిన్నది! (అమ్మ నవ్వుతారు)

నాకు మాత్రం సృష్టి అనేది దైవం ఉన్నాడనే దానికి యెదురు లేని ఋజువు... "తత్" తప్ప మరేంలేదు, అనే దానికి యెదురులేని ఋజువు. మనం పేరు పెట్ట లేని, నిర్వచించ లేని, వర్ణించ లేనిదేదో, కాని దేనిని అనుభూతి చెందగలమో దేనిలా అధికాధికంగా తయారు కాగలమో అది దైవం. పరిపూర్ణత లన్నింటి కన్నా అధిక పరిపూర్ణమైన, అందాలన్నింటి కన్నా అధిక అందమైన, అద్భుతాలన్నింటి కన్న అధిక అద్భుతమైన, సృష్టిలో వున్నదంతా కలిసినా దేనినీ వ్యక్తం చేయ లేని దివ్యమైనదేదో అది "తత్" గాక మరేం కాదు. ఆ "తత్" గాక మరేం లేదు. శూన్యంలో తేలి యాడుతున్నదేదో గాదది, "తత్" గాక మరేం లేదు, కాదు.

CWM 16:341-42

బలమైన కోరికతో కళంకితమైన విశ్వాసం:

ప్రశ్న: అమ్మా! బలమైన కోరికతో, కళంకితమైన అహంకారయుతమైన విశ్వాసం అంటే అర్థమేమిటి?

చాలా పలుకుబడి గల వ్యక్తి నవ్వాలని ఎవరైనా అనుకుంటే, పెద్ద హోదా కావాలనుకుంటే లేక తనచుట్టూవున్న వాళ్ళనుండి ప్రశంస లందుకోవాలనే ఆకర్షణకు లోనైతే, ఒక గొప్ప సాధకుడు, గొప్ప సన్యాసి, గొప్ప యోగి వగైరా.... అవ్వాలను కొంటే, చాలా ప్రముఖ వ్యక్తి నవ్వాలనుకుంటే, దానిని బలమైన కోరికతో నిండిన విశ్వాసం అంటారు. ఇది జరగాలనే విశ్వాసం నీ కుంటుంది, దైవంలో విశ్వాస ముంటుంది, కాని అది నీ వ్యక్తిగత అల్ప ఆత్మ స్తుతి కోసం అవుతుంది. ఇదెంతమాత్రం పరిశుద్ధమైనది, చిత్తశుద్ధి కలది, యదార్థమైనది అవ్వదు, పూర్తిగా వ్యక్తి లాభానికి సంబంధించిన దవుతుంది. సహజంగానే యిందులో ఆత్మార్పణకు సంబంధించిన దేదీ వుండదు. నీవు వీలైనంత అధికంగా శక్తులను కూడబెట్టుకొన్నదంతా యిందుకోసమే వాడుకొనడానికవుతుంది. అంటే యదార్థ నడకకు పూర్తిగా వ్యతిరేక నడక అన్నమాట. అనుకొన్నదానికంటే చాలా ఎక్కువసార్లే, యిలా జరుగుతుంది. ఈ బలమైన కోరిక అనేది సరిగ్గా నీ అస్తిత్వపు లోతుల్లోనే దాగి వుండి, యిలా వెనుకనుండి నిన్ను ముందుకు నెడుతూ వుంటుంది. నీవు ముందుకు పోతూ ఉండడానికి

అది నిన్ను కొరడాతో చెళ్ళుమనిపిస్తూ వుంటుంది. అదొక రకమైన కనుపించని గర్వం.

CWM 6:237-38

ఏమి జరిగినా ఎప్పుడూ మన మంచికే జరుగుతుందనే విశ్వాసం

ప్రస్తుతానికి అది ఉత్తమమైన విషయం అని అనిపించడం లేదు, ఎందు కనంటే, మనం అజ్ఞానులం, పైగా గ్రుడ్డివాళ్ళం గూడా, విషయాల పర్యవసానా లను, తరువాత జరిగే వాటిని మనం చూడలేం. అది అలా జరగాలనుంటే, మనం దైవాన్నే నమ్ముకొని వుంటే, మనపై అధికారాన్ని పూర్తిగా ఆయనకు అప్పగిస్తే, మన కోసం ప్రతి విషయాన్ని ఆయన నిర్ణయానికే వదిలి వేస్తే, జరిగేదంతా, ఎప్పుడూ మన మంచికే అనేది మనం తెలుసుకోవాలి. ఇది పూర్తి వాస్తవం. నీవు ఎంతవరకు సమర్పణ అవుతావో అంతవరకు నీకు మంచి జరుగు తుంది. ఇది నీ ఇష్టానికీ, అభిలాషకు, కోరికకు తగినట్లుగా వుండకపోవచ్చు. ఎందుకనంటే ఇవి గ్రుడ్డివి, కాని ఆధ్యాత్మిక దృష్టితో చూస్తే శుభం కలిగించేవే. అవి నీ పురోగతికి, నీ అభివృద్ధికి, నీ ఆధ్యాత్మిక యెదుగుదలకు, "యదార్థ" జీవి తానికి శుభం కలిగించేవి. అసలు సంగతి యెప్పుడూ అదే. ఈ విశ్వాసాన్ని నీవు నిలబెట్టుకోవాలి. ఎందుకనంటే దైవం ఎడల నీకున్న దృఢ నమ్మకాన్ని, దైవానికి నీవు చేసే పూర్తి ఆత్మార్పణను, వ్యక్తం చేసేది విశ్వాసం. అలా నీవు చేసిన ప్పుడు, అదొక అద్భుత విషయం అవుతుంది. అదొక వాస్తవం. ఇవి కేవలం మాటలు కాదు, అర్థమైందా, అదొక వాస్తవం. నీవు వెనక్కు తిరిగి చూస్తే అవి సంభవించి నప్పుడు నీవు అర్థం చేసుకో లేకపోయిన సమస్త విషయాలూ, అవ సరమైన పురోగతిని సాధించటానికి నీ మీద ఒత్తిడి కలిగించడానికి "సరిగ్గా" అవ సరమైనవే అని నీవు గ్రహిస్తావు. ఒక్కటి కూడా మినహాయింపు లేకుండా అన్నీ "యెల్లప్పుడూ" అందుకే సంభవించాయి. ఆ విషయాలను మనం చూడలేని విధంగా మనలను తయారుచేసింది మన గ్రుడ్డితనమే.

CWM 6: 349

యోగం స్వీకరించినపుడు, నీ మానసిక రచనలన్నింటినీ, నీ ప్రాణిక సరంజామా నంతా, ముక్కలు, చెక్కలు చేసి, చెల్లాచెదురు చేయడానికి నీవు సంసిద్ధుడవై

వుండాలి. నీకు ఆధారంగా నీ విశ్వాసం తప్ప మరే ఆధారమూ లేకుండా గాలిలో వ్రేళ్ళాడినట్లు వ్రేళ్ళాడడానికి సంసిద్ధుడవై వుండాలి. నీవు నీ గతాన్ని, అప్పటి యిష్టాయిష్టాలను అన్నింటినీ నీ చేతనలో నుంచి పెకలించి వేయటానికి ఏ విధమైన బాదరబందీ లేని సర్వ స్వతంత్రునిగా తిరిగి క్రొత్త జన్మ తీసుకోవలసి వుంటుంది. గతంలో నీవేమిటో ఆలోచించవద్దు, కాని నీ వేదిగా అవ్వాలని ఆకాంక్షిస్తున్నావో దానినే ఆలోచిస్తూ వుండాలి. నీవు దేనిని సాక్షాత్కారింప జేసుకోవాలనుకొంటున్నావో దానిలోనే పూర్తిగా జీవించు.

చనిపోయిన గతాన్నుండి వెను తిరిగి తిన్నగా భవిష్యత్తు వైపు దృష్టి సారించు. నీ మతం, దేశం, కుటుంబ జీవితం, అంతటినీ అక్కడే వదిలెయ్యి. ఉన్నది, నీకు ఉన్నది దైవం ఒక్కడే.

శ్రీమాత


CWM 3: 83-84

ఎల్లప్పుడూ విశ్వాసం కలిగి ఉండాలి

ప్రశ్న: "ఎల్లప్పుడూ లోపాలను, అపసవ్య కదలికలను గమనిస్తూ వుంటే అది క్రుంగుబాటుకు దారి తీస్తుంది, విశ్వాసాన్ని నిరుత్సాహ పరుస్తుంది." అది విశ్వాసాన్ని ఎలా నిరుత్సాహ పరుస్తుంది.

ఇంతకు ముందు ప్రస్తావించబడిన విశ్వాసం దైవకృపయందు విశ్వాసం గురించి, ప్రారంభించిన పని అంతిమ విజయం యెడల విశ్వాసం గురించి, నీ యోగాన్ని చివరి వరకు సాధించుకుంటూ పోతుంటాననే విశ్వాసంతో నీవు యోగాన్ని ప్రారంభించావు. నీవు అందులో పురోగమించకుండా నిన్ను ఆటంక పరచే వాటన్నింటి మీదా దృష్టి నిలుపుతూ కాలాన్ని వెచ్చిస్తుంటే చివరకు "విజయం సాధించలేను! అది సాధ్యం కాదు. ఇలాంటి నడకతో పోతుంటే నేనక్కడికి చేరలేను" అంటావు. దీన్నే విశ్వాసాన్ని కోల్పోవడం అంటారు. అందుచేత తప్పకుండా విజయాన్ని సాధిస్తాను అనే విశ్వాసాన్ని ఎప్పుడూ నిలుపుకో గలగాలి.

అనేక మంది ఆరంభిస్తారు. కొంతకాలం జరిగాక "నేను కొనసాగించలేక పోతున్నాను. అనేక యిబ్బందులున్నాయి." అంటారు. దీని అర్థం విశ్వాసం లేకపోవడం. ఎవరైనా సరే, మొదలుపెట్టే గమ్యాన్ని చేరతాననే విశ్వాసంతో మొదలు పెడ్తారు.



[శత్రుమూకల్ని] చెల్లా చెదరు చేయు బలం ఆత్మ విశ్వాసం, దైవం యెడల విశ్వాసం గల నవ్వుకు మాత్రమే సాధ్యం. అది శత్రు శ్రేణులను కకావికలు చేస్తుంది, శత్రు వరుసలలో గుబులు పుట్టిస్తుంది, నిన్ను విజయోపేతంగా ముందుకు తీసుకు పోతుంది.

CWM 3: 139

శ్రీమాత

ఈ విశ్వాసాన్ని చిట్టచివరి వరకు నిలుపుకోవాలి. విశ్వాసాన్ని నిలుపుకొంటేనే గమ్యాన్ని చేరతారు. కాని మార్గం మధ్యలో వెనక్కు తగ్గి "లేదు, నా వల్ల కాదు," అంటే నీవు గమ్యాన్ని చేరలేవనేది స్పష్టం. కొంతమంది బాట మీద కొస్తారు. కొంతకాలం జరిగాక అది వాళ్ళకు భారమైన నడకలా, అలసట కలిగించేదిగా, యిబ్బందికరంగా కన్పించి అడుగులు సరిగ్గా పడలేవు. వాళ్ళ పాదాలకు నొప్పి పుట్టడం మొదలౌతుంది, వగైరా జరుగుతాయి. వాళ్ళు "ముందుకు వెళ్ళడం చాలా కష్టం" అంటారు. నేను మొదలుపెట్టాను, కనుక ముందుకే పోతాను. అనడానికి బదులు, చేయవలసిందా ఒక్క పనినే, అక్కడ నిలబడి పోయి, ఆగిపోయి, విచారిస్తూ, "నేనెప్పుడూ గెలుపొంద లేను" అని చెప్పి బాటనుంచి వైదొలుగుతారు. వాళ్ళు బాటను వదిలితే, వాళ్ళెప్పటికీ జయించ లేరనేది స్పష్టం. దాన్నే విశ్వాసం కోల్పోవడం అంటారు.

"సరే, కష్టాలున్నా నేను పోతూనే వుంటాను" అని చెప్పగలిగే విశ్వాసం వుండాలి. నిరాశ, నీ కాళ్ళను విరగొట్టే దదే. విరగ్గొట్టి నిన్ను ఆపేస్తుంది. "నా పని అయిపోయింది. ఇహ నే నేమాత్రం ముందుకు పోలేను" అని చెప్పే స్థితిలో పడ వేస్తుందది. నిజానికంతే, అంతా అయిపోయినట్లే. నీవు అనుమతించ గూడనిది దానినే, ఆ స్థితినే, ఆ నిరాశనే.

నీవు మొదలుపెట్టావు. గనుక చివరికంటా వెళ్ళిపోవాలి. కొన్ని సమయాల్లో నా దగ్గరకు ఉత్సాహంతో వచ్చే వాళ్ళకు (యోగాన్ని స్వీకరిస్తానంటూ వచ్చే వాళ్ళకు) "కొద్దిగా ఆలోచించు, అది తేలికైన మార్గం కాదు, నీకు సమయం కావాలి, నీకు సహనం వుండాలి, ఎంతో శక్తి నీ కుండాలి, కష్టాలెదురైనా పట్టు వీడకుండా వుండాలి, ధైర్యం వుండాలి, అలుపెరుగని సత్సంకల్పం వుండాలి. దీనికి కావలసిన సామర్థ్యం నీకున్నది అని గ్రహించిన పిమ్మటే ఆరంభించు. కాని ఒకసారి మొదలు పెట్టాం. అంతే సంగతులు, ఇహ వెనక్కు పోవడమంటూ వుండకూడదు, చివరిదాకా పోవలసిందే" అని చెప్తాను.

CWM 6:440-41

గొప్పలు చెప్పుకో వద్దు ఎప్పుడూ

ఎవరైనా, ఎన్నిసార్లు చెప్పుకుంటారో... అది చిన్నపిల్లల వ్యవహారం లాగా వుంటుంది.... ఎవరైనా దేనిగురించైనా గొప్పలు చెప్పినప్పుడు, " దాన్ని గురించి

నాకు కచ్చితంగా తెలుసు. నేనెప్పుడూ ఆ తప్పు చేయను" అన్నప్పుడు వెంటనే అదొక అపకారం కలిగించే రూపంతో నాకు కన్పిస్తుంది. గొప్పలు చెప్పుకొన్నందువల్ల కలిగిన చిన్న బెజ్జం ద్వారా అది అతనిలో అలా ప్రవేశిస్తుంది, అలా లోపలకు పోతుంది, చొచ్చుకుపోయి నీవేది చేయగూడదనుకొంటావో దానినే కచ్చితంగా నీవు చేసేటట్లు నిన్ను తయారుచేస్తుంది. కాని ఇదో వినోదం. నీవు పురోగమించటానికి, సహాయం చేయటానికి మాత్రంకాదు, అనేది స్పష్టం (అమ్మ నవ్వుతారు) కాని దాన్నెలా స్వీకరించాలో నీకు తెలిస్తే, అది నీవు పురోగమించడానికి సహాయపడ్తుంది. "మంచిది, ఇంకోసారి గొప్పలు చెప్పను" అనుకొంటావు.

ఈ శక్తులు మానసిక ప్రాణిక భూమికలపై చాలా ఎరుకతో వుంటాయి, గనుక, మాటలలో వ్యక్తపరచవలసిన అవసరం కూడా వుండదు. ఉదాహరణకు, దేన్నైనా సరి చేయడానికి నీవు బాగా పని చేసినట్లైతే, ఒక చెడ్డ అలవాటు లేక బలహీనత యేదైనా కావచ్చు, దానిని సరిచేయడానికి నీవు బాగా శ్రమపడితే, శ్రమించావు గనుక కొంతవరకు విజయం సాధిస్తావు. అప్పుడు విజయాన్ని సాధించానని నీవు కేవలం మానసికంగా అనుకున్నా తదుపరి క్షణంలోనే అది మళ్ళీ ఆరంభ మవుతుంది. అంటే నీవు కనీసం ఆలోచనను గూడా రానీయ గూడదన్న మాట. అది చెప్పడంతో మాత్రమే వచ్చే సమస్య కాదు. ఆలోచించినా ఆ సమస్య వస్తుంది. "ఇంతకు ముందలా యెందుకుంది? ఇప్పుడిలా అయిందేమిటి? సరే మంచిదే" అని అనుకొన్నా అంతే సంగతులు, తదుపరి క్షణంలోనే అది మళ్ళీ ఆరంభ మౌతుంది.

CWM 7:18-19

మన స్వభావంలోని భిన్న భాగాలలో విశ్వాసం

... మీలో ప్రతి ఒక్కరిలో యే భాగంలో దైవానుగ్రహంపై అత్యంత మహోన్నత విశ్వాసం వుంది? అది భౌతికంలో కావచ్చు. ప్రాణికంలో కావచ్చు, అంతరాత్మలో కావచ్చు, యీ భాగంలో గావచ్చు, ఆ భాగంలో గావచ్చు, యీ పనిలో గావచ్చు, ఆ పనిలో గావచ్చు. పూర్తిగా మానసిక రీతిలో నిజంగా దైవకృప స్పర్శను పొందిన వాళ్ళున్నారు, దైవకృపయందు విశ్వాసం కలవాళ్ళున్నారు. వాళ్ళు ప్రాణికంలోకి లేక భౌతికంలోకి రాగానే, ఏమాత్రం దాని ప్రభావం వుండ దక్కడ. అలా ఉండక పోగా దానికి విరుద్ధంగా భౌతికంగా కూడా వాళ్ళ దేహంలో ... బహుశా మానసిక

జ్ఞానం పెద్దగా లేనివాళ్ళు, కానీ వాళ్ళ భౌతిక చేతనలో దైవకృపయందు పరిపూర్ణ విశ్వాసం, సంపూర్ణ దృఢనమ్మకం కలవాళ్ళు, యీ విశ్వాసం, దృఢనమ్మకంలోనే అలా నివసిస్తూంటారు. కేవలం వాళ్ళ ప్రగాఢ అనుభూతులలో మాత్రమే అలా వుండ గలిగే వారు యింకొంత మంది వుంటారు. వాళ్ళ ఆలోచనలు పరిపరి విధాలుగా వుంటాయి. ఇంకొంతమంది ప్రాణిక విశ్వాసం సైతం కలవాళ్ళున్నారు — వీళ్ళు చాలా అరుదు, కాని వున్నారు. దైవకృపయందు యెల్ల వేళలా జరిగేది కేవలం మంచేననే విశ్వాసం కలవాళ్ళు ఉన్నారు. శక్తివంతులమని చెప్పుకో దగినంత స్పృహ కలవాళ్ళు ఉన్నారు.

CWM 7: 114-115

ప్రశ్న: కొన్ని సమయాల్లో తనలో ఒక అనుభూతి వుండి, యితర వేళల్లో అది ఒక ఆలోచనగా మాత్రమే వుండడం అనేది జరుగుతుందా?

ఇది వేరే వ్యవహారం. అంటే దైవకృపయందు యీ విశ్వాసం యీ దృఢనమ్మకం, అంతరాత్మిక స్థాయిలో వుంటుంది. వెనుక అక్కడ అంతరాత్మికంలో అలా వుంటుంది, ఎల్లప్పుడూ వుంటుంది. కాబట్టి కొన్ని సమయాల్లో అది అనుభూతి, కొన్ని సమయాల్లో ఆలోచన, కొన్ని సమయాల్లో అంతరాత్మికమైన దానితో దేహం సైతం సంపర్కం కలిగి వుంటుంది. తనకు తెలియకుండానే అది అంతరాత్మిక ప్రభావం క్రింద వుంటుంది. ఆ క్షణంలో ఈ విధమైన దృఢ నమ్మకం ఏర్పడి యిది జరుగుతుంది. ఉదాహరణకు, నీవొక అతి పెద్ద కష్టంలో వున్నప్పుడు, లేక అతి పెద్ద భౌతిక ప్రమాదంలో పడినప్పుడు, అప్పుడు యీ అనుభూతి ఆకస్మికంగా కలిగినప్పుడు, ఈ శక్తి, యీ విశ్వాస శక్తి, నీకు సహాయం చేసే దైవకృప యందుండే దృఢ నమ్మకానికి ఉండే శక్తి నీలోనికి వస్తున్న అనుభూతి కలుగుతుంది. దానర్థం, అతనికి అతని అంతరాత్మతో నిరంతర సంపర్కం వున్నదని, అది అతనికి సహాయం చేయడాని కొస్తుందని అనుభూతి కలుగుతుంది. అది అతనికి ప్రసాదించబడిన దైవకృప. అత్యంత తరచుగా యిక్కడ వుండి తీరవలసిన స్థితి అది. ఎందుకనంటే యీ సంపర్కం యెల్ల వేళలా, సచేతనంగా, కావాలనే, ప్రతివానిలో నెలకొల్పబడివుంది. కాబట్టే ఈ స్థితి చాలా తరచుగా యిక్కడ వుండి తీరాలి. అది చాలా మామూలు విషయం అనగా ఇక్కడ చురుకుగా యే భాగం వుంటుందో ఆ క్షణంలో దానికుండే ఆవశ్యకతను బట్టి అది యిక్కడ, లేక, అక్కడ, లేక మరోచోట వుంటుంది. ఆకస్మికంగా నిన్ను వశంచేసుకొని రక్షణ కల్పించే

యీ దృఢ నమ్మకాన్ని నీవు అనుభూతి పొందుతావు. అదీ విషయం.
CWM 7:115-116

విశ్వాసానికి యెదురయ్యే మూడు అవరోధాలు

దైవం యెడల అచంచల విశ్వాసమున్నదని చెప్పుకొనే వాళ్ళు "దైవమే ప్రతి దానినీ చేస్తున్నాడు, ఆయనగాక ప్రతిదీ చేయగలిగేదెవరు, నాలో యితరులలో ప్రతిచోట జరిగేదంతా దైవకార్యమే, కేవలం దైవం ఒక్కరి కార్యమే," అని కూడా అంటారు. వాళ్ళు దీన్ని గనుక ఒకవిధమైన తర్కాన్ని ఆధారంగా చేసుకొంటూ పోతుంటే కొంత కాలం జరిగాక ప్రపంచంలో జరిగే అత్యంత భయంకర తప్పిదాలన్నింటికీ దైవాన్నే నిందిస్తారు, ఆయన్నొక నిజమైన క్రూర, భయంకర రాక్షసునిగా చేస్తారు — వాళ్ళకు దృఢ నమ్మకం లేకపోతే.

వాళ్ళకు విశ్వాసం వుందనుకుందాం, కాని వాళ్ళు "నాకు దైవం యెడల విశ్వాసం వుంది, కాని యీ ప్రపంచం అదేమిటో నాకు బాగా తెలిసి వస్తోంది! అన్నింటికంటె ముందు, నేను బాధపడ్తున్నాను, కాదంటారా? నాకే సుఖమూ లేదు. నా యిరుగు పొరుగు అందరికంటె నేనే యెంతో అసౌఖ్యంగా వున్నాను" అని తమను గురించి చెప్పుకుంటారు. ఎందుకనంటె అతని చుట్టుప్రక్కల వారి కంటె అతడే యెంతో యెక్కువ అసౌఖ్యంగా వుంటూ "నాకు చాలా అసౌఖ్యంగా వుంది. జీవితం నా యెడల నిజంగా కర్కశంగా వుంది, దైవం దివ్యమే, అతడే సర్వశుభం, సర్వ ఉదారత, సర్వసామరస్యత అయినప్పుడు నేనెందు కింత అసౌఖ్యంగా వున్నాను? అతనికి శక్తి లేకపోవచ్చు, కాకపోతే అతడంత మంచివాడై వుండీ నన్నెందుకింత బాధపడమని వదిలేశాడు?" అనుకొంటాడు. ఇది రెండో అవరోధం.

ఇహ మూడో అవరోధం: వక్రబుద్ధి గల, అతి మర్యాద, అతి వినయం గల వాళ్లు, "దైవం నన్ను బయటకు గెంటివేశాడనేది తేలిపోయింది. నేనెందుకూ పనికిరాను, నాతో ఆయనకేం పనిలేదు. నాకు మిగిలిందల్లా క్రీడ నుంచి వైదొలగడమే. ఆయనను పొందే అర్హత నాకు లేదని ఆయననుకొన్నాడు." అని వాళ్ళకు వాళ్ళు అనుకొంటారు. కాబట్టి విశ్వాసం యెడల, దైవకృప యెడల, ఒక సమగ్ర,

సంపూర్ణ, దృఢ నమ్మకాన్ని జత చేయక పోతే, యిబ్బందు లొస్తాయి. అందు చేత రెండూ అవసరమే.

CWM 8: 38-39

బాటపై నడిచేందుకు

దివ్యరక్షణకుండే ప్రభావాన్ని, దివ్యబాటమీద రక్షణను, జనం సందేహిస్తారు, ఎందుకనంటే యితరులు ప్రక్కదారి పడ్తారు. చాలినంత పరిశుద్ధత నిజాయితీ కలిగిన జాగ్రత్తను అవసరమైనంతగా తీసుకొనకుండా, యోగం బాట పట్టిన వాళ్ళను బెదిరించే చిన్న లేక పెద్ద విపత్తు లన్నింటికీ కారణ మేమిటో యీ సాయంత్రం యింతకుముందే చదివి వినిపించినట్లు, తమకు తాము చెప్పుకోవ టానికి బదులు, వాళ్ళహంకారంలో వాళ్ళుండి, భయంతో గడగడలాడుతారు. అనివార్యమైన పరిశుద్ధతను తిరస్కరించే వాళ్ళను, యే రక్షణా, యే దైవకృప కాపాడలేదు. నేను దీనికీవిధంగా మరికొంత కలిపి చెప్తాను. భయం ఒక అపరిశు ద్ధత, అత్యంత గొప్ప అపరిశుద్ధతలలో ఒకటి అది. భూమి మీద దైవకార్యాన్ని సర్వనాశనం చేయాలనుకొని దైవ వ్యతిరేక శక్తుల నుండి సరాసరి వచ్చేవాటిలో ఒకటి అది. నిజంగా యోగం చేయాలనుకొనే వాళ్ళ ప్రప్రథమ విధ్యుక్త ధర్మ మేమంటే, వాళ్ళు వాళ్ళ సమస్త శక్తితోను, సమస్త నిజాయితీతోనూ, వాళ్ళకున్న సామర్థ్య మంతటితోనూ, సహించే శక్తితోనూ తమ చేతనలోనుండి భయం ఛాయ కూడా లేకుండా తొలగించి వేసుకోవాలి. మార్గం మీద నడవటానికి, అతను నిర్భ తుడై, సాహసియై వుండాలి. ఆ అల్ప, చిన్న, బలహీన, నికృష్టమైన కృంగు బాటును కలిగించే భయానికి లోను గాకూడదు.

ఒక అజేయమైన ధైర్యం, ఒక పరిపూర్ణ చిత్తశుద్ధి, నిజాయితీ గల ఆత్మార్పణ వుంటే, అతడు లాభనష్టాలను బేరీజు వేసుకోడు లేక బేరమాడడు, దేన్నో ప్రతి ఫలంగా అందుకునేందుకు యివ్వడు, రక్షణ లభిస్తుందని దృఢ నమ్మకం పెట్టు కోడు, ఋజువుల కోసం అడిగే విశ్వాసం పెట్టుకోడు. ఇదిగో యిదే మార్గం మీద నడవడానికి అనివార్యంగా కావలసింది, ఇదిగో యిదే నీకు సమస్త ప్రమాదాలనుండి ఆశ్రయం యిచ్చేది (మౌనం)

CWM 8: 260-61

విశ్వాసం కోసం ఆకాంక్షించాలి

అన్య ప్రేరణ లేని విశ్వాసం గల అదృష్టవంతులు చాలా కొద్దిమందే వున్నారు. ఆంకాంక్ష చిత్తశుద్ధి గలదైతే విశ్వాసం లభిస్తుంది. ఆకాంక్ష చిత్తశుద్ధి గలదైతే, నిరంతరంగా నిలిచి వుంటే, అది ప్రతీదాన్ని ప్రాప్తింప జేస్తుంది. అది అతని తల్లిదండ్రులు చెప్పినదాన్లో గావచ్చు, లేక అతడు చదివిన పుస్తకాల్లో వున్నదానిపై గావచ్చు. ఎంతో కొంత విశ్వాసం, ప్రతివానిలో యెల్లప్పుడూ వుంటుంది. నీ విద్యాభ్యాసమంతా యీ విధమైన విశ్వాసం, ఆధారం మీదే సాగింది. నీకు చదువు చెప్పిన వాళ్ళు కొన్ని విషయాలు నీకు చెప్పి వుంటారు. నీవు చాలా చిన్న వాడివి, అనుభవం లేదు గనుక వాటిని ఋజువు చేసుకొనడానికి నీకు ఉపాయాల్లేవు, కాని వాళ్లు చెప్పిన దాని మీద నీకు విశ్వాసం యేర్పడింది. ఆ విశ్వాసం ఆధారంతో ముందుకు పోతావు. కాబట్టి ప్రతివానిలో ఒక అత్యల్ప విశ్వాసం వుంటుంది. దాన్ని వృద్ధి చేసుకొనేందుకు తన ఆకాంక్షను అతడు ఉపయోగించాలి.

CWM 6:394

విశ్వాసానికి షరతులు

తనకేదైనా అవసరమైనపుడు, తాను అడగక పోయినా, అది తనకు తప్పక లభిస్తుందనే నిష్కపటమైన పసిబిడ్డ కుండే దృఢనమ్మకం అతని కుండాలి. ఇదిగో యిది, యిటువంటి దృఢనమ్మకం — నిజానికిది అత్యున్నత, అత్యంత ప్రాముఖ్యం గల షరతు.

ఆకాంక్షించడం అనివార్యం. కొంతమంది తమలో విశ్వాసం వుడడం, విశ్వాసం లేకపోవడం అనే దృఢ నమ్మకం, విజయం తథ్యం అనే ఆశావాదానికి విపత్తెప్పుడు సంభవిస్తుందో అని తనలోనే అనుకొనే తనలో కోరుకొనే నిరాశా వాదానికి మధ్య

దైవకృప కోసం, సహాయంకోసం ఆకాంక్షించేవారికి అవెప్పుడు అందుబాటులోనే వుంటాయి. వాటిని విశ్వాసంతో, నమ్మకంతో స్వీకరించినప్పుడు వాటి శక్తి అపరిమిత మౌతుంది.

CWM 13:111

ఘర్షణతో ఆకాంక్షింస్తారు. ఇటువంటి ఘర్షణ అతని అస్తిత్వంలో వుంటె, ఆకాంక్షించినా ఫలితం దక్కదు. అప్పుడతను, "ఆకాంక్షించాను కాని యేమీ ప్రాప్తించలేదు." అంటాడు. అదెందుకు జరుగుతుంది అంటే అతని ఆకాంక్షను, అతని నమ్మకంలేని తనంతో, అతడే యెప్పుడూ చెడగొట్టుకుంటున్నాడు. కాని నిజంగా అతనికి దృఢ నమ్మకం వుంటే.... పిల్లలను వాళ్ళ మానానికి వాళ్ళను వదిలివేస్తే, పెద్దవాళ్ళు వాళ్ళను పాడుచేయకపోతే, అంతా మంచే అనే ఒక గొప్ప దృఢనమ్మకం వాళ్ళ కుంటుంది.ఉదా: వాళ్ళ కేదైనా చిన్న దుర్ఘటన జరిగితే, అదేదో తీవ్రరూపం దాలుస్తుం దని వాళ్ళెపుడూ అనుకోరు. అది త్వరలోనే చక్కబడుతుందని అప్రయత్నంగానే నమ్ముతారు. అదంతా మామూలు స్థితికి చేరడానికి యీ అప్రయత్న నమ్మకమే యెంతో శక్తివంతంగా సహాయపడ్తుంది.

సరే, దివ్యక్రియాశక్తికై ఆకాంక్షిస్తే, దైవాన్ని సహాయం చేయమని అర్థిస్తే, అది తప్పకుండా లభిస్తుందనే అచంచల మైన నమ్మకంతో అర్థిస్తే, అది జరగకపోవడం అసాధ్యం, అది తప్పకుండా ప్రాప్తిస్తుంది. ఈ విధమైన... అవును, ఆంతరిక దృఢ నమ్మకం కలిగి వుండడం అనేది యదార్థంగా ఒక ఆంతరిక వ్యవహారం. కొంతమంది నిరంతరం ఈ స్థితిలో వుంటారు. ఏదైనా స్వీకరించవలసినప్పుడు దాన్ని స్వీకరించ డానికి సిద్ధంగా వుంటారు. ఇంకా కొంతమంది వున్నారు. వాళ్ళు ఏదైనా పొందవలసి వుంటే, ఒక శక్తి దిగి వస్తుంది, వాళ్ళు ఆ సమయానికి అక్కడ వుండరు, వాళ్ళా క్షణంలో ఎప్పుడూ మూసుకుపోయే వుంటారు. పసివాళ్ళకు ఉండేటటువంటి దృఢనమ్మకం గలవాళ్ళు, యెప్పుడూ సరైన సమయంలో తయారుగావుంటారు.

అదొక విచిత్రం కాదా? బయటకి ఏమీ తేడా కనిపించదు. వాళ్ళందరికీ కచ్చి తంగా ఒకే విధమైన సత్సంకల్పం వుండవచ్చు, ఒకే విధమైన ఆకాంక్ష వుండవచ్చు, మేలుచేయాలనే ఒకే విధమైన కోరిక వుండవచ్చు. ఎవరికైతే, యీ నమ్మకం లోపల వుంటుందో, తాము ఆశించింది, ఆకాంక్షించినది తమకు దక్కుతుందా లేదా అని ప్రశ్నించుకోరు. దైవ సంకల్పం బదులు పలుకుతుందా లేదా అనే ప్రశ్న ఉత్పన్నం కాదు.... "నాకు అవసరమైనది నాకివ్వ బడుతుంది. నేను ప్రార్థిస్తే, నాకు సమాధానం వస్తుంది. నేనేదైనా యిబ్బందిలో వుండి సహాయాన్నర్థిస్తే, సహాయం అందుతుంది. అది అందడమేగాదు, వచ్చి చేయవలసి వున్న దాన్నంతా చేసి పెడ్తుంది." అనేది లోపల అర్థమైపోతుంది. అప్రయత్నంగా, నిష్కపటంగా ప్రశ్నించ

కుండా దృఢనమ్మకం గనుక వుంటే, యితరమైనదేదీ చేయలేనంత బాగా అది పనిచేస్తుంది. ఫలితాలు అద్భుతంగా వుంటాయి. మనస్సులో చెలరేగే వైరుధ్యాలు, సందేహాలతో వున్న వ్యక్తి సమస్తాన్ని చెడగొట్టుకుంటాడు. ఒకడు కష్టాలలో వున్నప్పటికీ, "ఓహ్! ఇది సాధ్యంకాదు. నేను దానిని సరిదిద్ద లేను. అదింకా పెరిగితే, నేనున్న స్థితిలో, నేను దేన్నైతే వద్దనుకుంటానో అదే యింకా నికృష్టంగా తయారైతే, నేను యింకా యింకా దూరానికి జరిగిపోతుంటే, తుంటే, తుంటే, తుంటే, తుంటే", అనుకుంటుండే ఆలోచనలో పడిపోతే, అతడు తనకూ, తాను స్వీకరించాలను కొంటున్న క్రియాశక్తికీ మధ్య గోడ కట్టినట్లే. చైత్యపురుషునికి యీ దృఢ నమ్మకం వుంటుంది. అది అద్భుతంగా యే మాత్రం నీలినీడ లేకుండా, ఎటువంటి వాదనకూ తావులేకుండా, వైరుధ్య మేమీ లేకుండా వుంటుంది. అదలా వున్నప్పుడు సమాధానం లభించని ప్రార్థనంటూ వుండదు, సార్థకంగాని ఆకాంక్ష అంటూ ఏదీ ఉండదు.
CWM 6: 403-04

విశ్వాసాన్ని భద్రంగా నిలుపుకోడానికి అవసరమైన స్వప్రయత్నం

తన విశ్వాసాన్ని భద్రంగా నిలుపుకోడానికి, దాన్ని లోలోపల పెరగనివ్వడానికి, తప్పకుండా యెవరైనా సరే, ప్రయత్నించాలి. తరువాత, చాలా కాలం గడిచాక ఒక రోజు వెనుదిరిగి గతం లోనికి చూస్తే జరిగిందంతా మనకు అత్యంత నికృష్టంగా అప్పట్లో కన్పించినదంతా, మనం మార్గం మీద ముందుకు పోయేటట్లు చేసిన దైవకృపగానే మనం చూడగలుగుతాం. అప్పుడు తెలుస్తుంది మనకు, మన స్వప్రయత్నం కూడా దైవకృప ఫలితమేనని. కాని ఆ స్థితికి చేరే ముందు, అతడు చాలా దూరం ప్రయాణించాలి, చాలా పెనగులాడాలి, కొన్ని సమయాల్లో యెంతో బాధ కూడా పడవలసి వుంటుంది.

జడప్రాయ తటస్థ స్థితిలో చతికిలబడి "నాకు విశ్వాసం వుండాలంటే అదే వస్తుంది, దైవమే దాన్ని ప్రసాదిస్తాడు" అని అనుకోవడం సోమరితనపు అచేతన, దాదాపు, దుస్సంకల్ప ధోరణి అవుతుంది. ఆంతరిక అగ్ని జ్వలించాలంటే దానికి ఇంధనం అందించాలి, దానిని గమనిస్తూ వుండాలి, తాను వదలించు కోవాలనుకుంటున్న దోషాలన్నింటినీ, పురోగతిని అడ్డుకొంటున్న దాన్నంతటినీ, మార్గాన్ని చీకటిమయం చేసేదాన్నంతటినీ అందులో సమిధలుగా విసరివేయాలి. ఆ అగ్నికి

ఇంధన మందించకపోతే, అది అతని అచేతనత్వం, తమస్సుల బూడిద క్రింద కుమిలి పోతుంటుంది. అప్పుడు గమ్యాన్ని చేరడాని కతనికి సంవత్సరాలు కాదు, జన్మల, శతాబ్దాల కాలం పడ్తుంది. అనంతంగా విలువైన జన్మ తీసుకొం టున్న దేనికో కావలి కాస్తూ గమనిస్తున్నట్లు అతడు తన విశ్వాసాన్ని చూచు కొంటూ కావలి కాయాలి. దాన్ని నాశనం చేయగల ప్రతిదాన్నుండీ దానిని చాలా జాగ్రత్తగా రక్షించుకోవాలి. ఆరంభపు అజ్ఞానాంధకారాలతో పోరాడడానికి దైవశక్తి, విశ్వాస రూపంలో, అత్యంత ప్రత్యక్షంగా తనను వ్యక్తం చేసుకొంటుంది.
CWM 9:351-52

విశ్వాసాన్ని పెంపొందించుకోవడం యెలా?

ప్రశ్న: అమ్మా! విశ్వాసం దేని మీద ఆధారపడి వుంటుంది?
బహుశా దైవకృప మీద. కొంతమంది కది అప్రయత్నంగానే లభిస్తుంది, మరి కొంత మంది వున్నారు, వాళ్ళు దాన్ని పొందడానికి యెంతో కృషి చేయాలి.

ప్రశ్న: విశ్వాసాన్ని పెంచుకోవడం యెలా?
ఆకాంక్ష ద్వారా అని అనుకొంటున్నాను. కొంత మంది కది అప్రయత్నంగానే వుంటుంది.... విశ్వాసం లేకపోతే ప్రార్థించడం కష్టం. తన విశ్వాసాన్ని పెంచు కొనే ఉపాయంగా అతడు ప్రార్థిస్తే, లేక ఆకాంక్షిస్తే, అకాంక్ష వుంటే, విశ్వాసం కలగాలనే ఆకాంక్ష వుంటే... వీటిలో చాలా లక్షణాలకు ప్రయత్నించడం అవసరం. ఒక వస్తువు అతనికి లేకపోతే, కావాలని అతడనుకొంటే, దాన్ని పొందడానికి కతడు నిలకడగా గొప్ప ప్రయత్నాలతో పాటు, ఒక నిరవధిక ఆంకాంక్ష, నిరాసక్త తకు తావీయని సంకల్పం, ప్రతిక్షణం చిత్తశుద్ధితో వుండడం అవసరమౌతాయి. అపుడు ఏదో ఒక రోజున యిది లభిస్తుందని దృఢం చేసుకోవచ్చు — అది క్షణంలో కూడా రావచ్చు. అది వున్న వాళ్ళు వున్నారు. తరువాత దాన్ని ఎదు ర్కొని దాడి చేసే విరుద్ధ కదలికలున్న వాళ్ళున్నారు. వాళ్ళ సంకల్పంలో నిజా యితీ వుంటే, అధి వాళ్ళ విశ్వాసాన్ని కవచంలా రక్షిస్తుంది, దాడులను త్రిప్పి కొడుతుంది. ఇంకొంతమంది వున్నారు, వాళ్ళు సందేహాన్ని పెంచుకుంటూ వుంటారు. ఎందుకనంటే అదొక రకమైన చాపల్యత లేక ఆటకాయితనం — అంతకంటే ప్రమాదకరమైంది మరొకటి లేదు. అది పండులోనికి పురుగును దూర

నివ్వడం లాంటిది. ఆ పురుగు కాలక్రమంలో పండునంతా తినివేస్తుంది. ఇటువంటి కదలిక అతనిలో కలిగినపుడు, మామూలుగా అది ముందుగా మనస్సులో జరుగుతుంది. మొట్టమొదట చేయవలసిన పని దృఢంగా నిర్ణయించుకొని దానిని తిరస్కరించాలి. ఏం జరుగుతుందో చూద్దాం అనుకుంటూ ఆనందిస్తూ కూచోవటం అనేది యేరకంగానూ జరుగకూడదు. ఆ విధమైన ఉత్సుకత ప్రమాదం. నిరాడంబరంగా, చిత్తశుద్ధితో, ముక్కుసూటిగా పోయేవాళ్ళు, మేధోపరమైన సమస్యలేవీ లేని వాళ్ళకంటె, విశ్వాసం కలిగి వుండడం బహుశా మేధావంతులకే యెక్కువ కష్టమనుకొంటాను. మేధావంతునికి గనుక విశ్వాసం యేర్పడితే అది చాలా శక్తివంతమైన దౌతుంది.

యదార్థంగా చాలా అద్భుతాలు చేయగలిగినంత శక్తివంత మైనదౌతుంది.

CWM 6:121

మూలం: శ్రీమాత

స్వేచ్ఛానువాదం: కె.వి.రావు



నా బిడ్డా! ఓర్చుకో! అప్పుడే పుట్టిన బిడ్డలాగా, అతి సరళంగా పురుషోత్తముని యందు విశ్వాసంతో ఆయన హృదయంలో ఒదిగిపో. చివరకు అపరిమేయ మహదానంద స్థితికి చేరుకొంటావు.

(అమ్మా నీవలా చేప్పావు *6.12.65*)

పురుషోత్తముని శక్తి అనంతం. మన విశ్వాసమే అత్యల్పం.
CWM 13: 88

దైవంలో విశ్వాసంపై ధ్యానములు

కచ్చితంగా ఉండి తీరవలసిన రెండు విషయాలు: సహనము, చెక్కుచెదరని విశ్వాసము. సంపూర్ణ ప్రతికూల స్థితుల్లోనైనా, లేక బాధ ననుభవిస్తున్నప్పుడైనా, భరించలేని యాతనలోనైనా (శారీరకమైన బాధ), నీవు బాగా అలసట చెందినపుడైనా, అప్పుడు పట్టు విడువకూడదు. విశ్వాసాన్ని చివరివరకు అంటిపెట్టుకొని వుండాలి, సహనం కలిగి వుండాలి.

CWM 11:1

నీ ప్రగాఢమైన విశ్వాసానికి అర్థం, నీ విశ్వాసం తీవ్రతరం కావడంలోని అర్థం దైవం తాను సూచించిన విషయం నెరవేరి తీరాలని అతను అంతకు పూర్వమే నిశ్చయించుకున్నాడని కాబోలు. చెదరని విశ్వాసం దివ్యసంకల్పం యొక్క ఉనికికి గుర్తు, జరగబోయేదానికి సాక్షి.

CWM 3:97

ఏ ఒక్క మినహాయింపూ లేకుండా అన్ని విషయాల్లోనూ, ఏది జరిగినా, ప్రశాంతతను, నిశ్చల శాంతిని, దివ్య కృపలో పరిపూర్ణ విశ్వాసాన్ని నీలో కలిగి ఉంటే, నీ క్షేమానికి భంగం వాటిల్లదు. నీకు అనుభవాలు కావాలంటే ఇవన్నీ నీలో ఉండి తీరాలి. ఎందుకనంటే అవి లేనప్పుడు కలిగే అనుభవాలు మంచివి కావు, కాని వీటితో అవి శ్రేష్టతరమౌతాయి.

CWM 7: 82

గతంలో కొందరు ప్రవక్తలు ఈ రకమైన అలౌకిక దర్శనాన్ని పొంది ఉన్నారు. కాని సామాన్యంగా ఎప్పుడూ జరిగినట్టే విషయాలు కలగూరగంపలా కలసిపోయాయి. వారికి వారి అలౌకిక దర్శనంతోపాటు, ఈ భౌతిక ప్రపంచాన్ని రూపాంతరం గావించి, మానవజాతిని ఉద్ధరించ గలిగిన అతిమానస ప్రపంచ ఆవిర్భావ దర్శనం వారికి లభించలేదు. అందువల్ల ఎవరైతే, ఈ వక్రించిన మానవచైతన్య స్థితిలో జన్మించారో, వారిలో ఆశను కలిగించటానికి, విశ్వాసం ద్వారా నిష్కృతిని పొందటం బోధించారు. భౌతిక పదార్థంలో దైవం ఉనికిపై విశ్వాసం వున్నవాళ్ళు అప్రయత్నంగానే రక్షింపబడతారు. మరో లోకంలో వాళ్ళు అమాయకులైనా, అర్థం చేసుకునే జ్ఞానం లేకపోయినా, ఒక్క విశ్వాసంతోనే మరో ప్రపంచంలో రక్షించబడతారు. వాళ్ళు

అతిమానస ప్రపంచాన్ని గాని, భౌతిక పదార్థం లోని దైవ ఉనికి దైవికమైన అంతర్లయమని గాని, అది చివరికి పదార్థంలో పరమాత్మ యొక్క సంపూర్ణ అద్భుత దర్శనంగా పరాకాష్ట చెందాలన్నది గాని వారు గ్రహించలేదు.

CWM : 300-301

నిరాశ అన్నది ఎన్నడు పురోగతికి ఆవశ్యకత కాదు, అది ఎల్లప్పుడూ బలహీనతకు, తమస్సుకు గుర్తు. అది తరచుగా దుష్టశక్తుల ఉనికిని సూచిస్తుంది, అనగా అది పనిగట్టుకుని సాధనకు ప్రతికూలంగా పనిచేస్తుంది. అందువల్ల నీ జీవితంలో అన్ని సందర్భాలలోను, ఎప్పుడూ ఏ నిరాశకు లోనుకాకుండా, జాగ్రత్తగా నిన్ను నువ్వు కాపాడుకోవాలి. నిరుత్సాహంగా, విచారంగా, నిరాశగా ఉండడమనే అలవాటు జరుగుతున్న సంఘటనలమీద ఆధారపడినది కాదు. అది నీ స్వభావంలో విశ్వాసం లోపించడం మీద ఆధారపడి ఉంటుంది. విశ్వాసం ఉన్నట్లయితే, కనీసం తనమీద తనకు విశ్వాసమున్నా సరే, అన్ని కష్టాలను, అన్ని పరిస్థితులను, అతి తీవ్రమైన వాటితో సైతం, నిరాశ, నిరుత్సాహాలకు లోను కాకుండా ఎదుర్కోగలడు. అతడు చివరి వరకు ఒక పురుషుడిగా పోరాడుతాడు. ఏ స్వభావాలలో విశ్వాసం లోపించిందో వాటిలో సహనము, ధైర్యము, కూడా లోపిస్తుంది.

CWM 10: 56

అంతా ఆ పరాత్పరుని చేత నడిపించబడుతోందన్న విశ్వాసం మనలో ఉండి, అతడితో మనం ప్రత్యక్షంగా సంబంధం కలిగి ఉండడం సంభవమేనని విశ్వసించినపుడు ప్రకృతియొక్క నియమాల్లో ఎదుర్కోలేనివి, మార్పు చెందనివి ఏవీ ఉండవు. ఈ శరీరమనే జైలును అనాదిగా అంటిపెట్టుకొని ఉన్న ఆ అలవాట్లనించి మనం బయటపడడం తెలుసుకొని, ఏమీ దాచుకోకుండా, అతడి సంకల్పానికి మనలను మనం అర్పించుకుంటే, స్వభావంలో మారనిదేదీ ఉండదు.

CWM 10:241

మనుషులు సామాన్యంగా పిలిచే గుడ్డి విశ్వాసం అన్నది నిజానికి, నిజమైన జ్ఞానాన్ని తెలుసుకోగల తెలివి అభివృద్ధి చెందని వారికి, కొన్నిసార్లు దివ్యకృప ఇచ్చిన వరం. అందువల్ల గుడ్డి విశ్వాసం అన్నది ఒకవిధంగా అత్యంత గౌరవప్రదమైనది.

అయితే, నిజమైన జ్ఞానాన్ని పొంది వున్నవారు మరింత ఉన్నతస్థాయికి చెందివుంటారు అనునది యదార్థం.

CWM 10: 288

ఎవరి హృదయాలు పవిత్రంగా వుంటాయో, ఎవరిలో చెక్కు చెదరని విశ్వాసం ఉంటుందో, వారికి అత్యంత ప్రబలమైన ఓటమి సంభవించినా, అది నిజానికి తెరచాటున ఉన్న విజయ పథానికి చేర్చేమార్గమే అవుతుంది.

CWM 10: 309

నీ విశ్వాసం నిన్ను సర్వశక్తిమంతుడైన ఆ పరాత్పరుని రక్షణలో ఉంచుతుంది.

CWM 12: 309

ఓ ధీరోదాత్తుడి అంతరాత్మగల వారిదే భవిష్యత్తు. మన విశ్వాసం ఎంత తీవ్రమైనదిగా, ఎంత చిత్తశుద్ధితో కూడినదిగా వుంటుందో, మనం అందుకునే సహాయం కూడా అంతటి శక్తిని, ప్రభావాన్ని కలిగివుంటుంది.

CWM 13: 17

నీ ఆకాంక్షను బట్టి దైవం నీతో ఉంటాడు. దాని అర్థం అతడు నీ బాహ్యప్రకృతి ఆడే నాటకాలకు తలొగ్గుతాడని కాదు. ఇక్కడ నే చెప్పేది నీ అస్తిత్వ సత్యం గురించి. అయినా ఒకోసారి అతడు నీ బాహ్య ఆకాంక్షలకు తగినట్లుగా మలచుకుంటాడు. నీవు కూడా భక్తులందరి లాగే ఒకసారి కలయికని, ఒకసారి ఎడబాటుని, పారవశ్యతను నిరాశను అనుభవిస్తుంటే, నిజానికి నీ నమ్మకానికి అనుగుణంగా దైవం కూడా కలుస్తూ, విడిపోతూ ఉంటాడు. అందువల్ల నీ దృక్పథం చాలా ముఖ్యం, బాహ్య దృక్పథం కూడా. విశ్వాసం ఎంత ముఖ్యమైనదో, ఎంత అద్భుతమైనదో, ఎంతటి అద్భుతాలను చేస్తుందో మనుషులకు తెలియదు. నీవు అనుక్షణం దైవసాన్నిధ్యం వైపు ఉద్ధరించబడాలని అనుకుంటే, దైవం నిన్ను ఉద్ధరించడానికి వస్తాడు — అత్యంత సన్నిహితుడుగా అతి చేరువగా, అతి చేరువగా...

CWM 13: 76

ప్రతిక్షణం మనకు ముందుగా తెలియనివి, అనుకోనివి, మన ముందుంటాయి. అందువల్ల మనకేం జరుగుతుందన్నది మన విశ్వాసంయొక్క పవిత్రత, గాఢత మీద ఆధారపడి ఉంటుంది.

CWM 14: 80

దైవకృపయొక్క సర్వశక్తి మయత్వంపై మనకున్న విశ్వాసం, అసలైన ఆ కృపయొక్క శక్తితో ఎన్నటికీ తులతూగనిది.

జూలై 1956

దైవకృప మీద సంపూర్ణ విశ్వాసం, నమ్మకమే అంతిమ విశ్లేషణలో పరమార్థమైన దివ్యజ్ఞానము.

ఆగస్టు 15, 1956

ఈ పైకి కనిపిస్తున్న గందరగోళ స్థితిలో నుండే ఒక నూతనమైన, శ్రేష్టమైన జగత్తుయొక్క తీరు తెన్ను ఏర్పడగలదు. అయితే దివ్యకృపపై విశ్వాసమున్నప్పుడే దానిని దర్శించగలం. ఉత్సాహంతో ఉండండి.

*

సర్వం కోల్పోతున్నట్లు కనిపించినప్పుడే, అంతా రక్షించబడ గలదు. నీకు నీ స్వయంశక్తిపై నమ్మకం పోయినప్పుడు, నీకు దివ్య కృపమీద విశ్వాసం ఉండాలి.

CWM 14: 89-90

దివ్యకృపపై చెదరని నమ్మిక, విశ్వాసంతో, సంపూర్ణమైన శాంతి, నిశ్చలతతో ఉన్నప్పుడే, నీవు నీ పరిస్థితులు ఎంత చక్కగా వుండగలవో అంత ఉండేటట్టు చేసుకోగలవు. దైవంపైన, ఒక్క దైవంపైనే సంపూర్ణ విశ్వాసం ఉంచిన వారికి ఎల్లప్పుడూ అత్యంత మంచే జరుగుతుంది.

CWM 14:94

ఎన్నడూ అసంతృప్తితో గొణగకు. నీవు గొణుగుతుంటే అన్ని రకాల శక్తులు నీలో ప్రవేశించి, నిన్ను క్రిందికి లాగుతాయి. నవ్వుతూ ఉండు. నేను అన్ని సమయాల్లో పరిహాస మాడుతున్నట్లుగా కనబడతాను, కాని అది కేవల పరిహాసం కాదు, అది చిత్తంలోనుంచి పుట్టిన విశ్వాసం. దైవానికి విరుద్ధంగా ఏదీ నిలువలేదని, అన్నింటికి సక్రమమైన ముగింపు ఉంటుందన్న విశ్వాసాన్ని ప్రకటిస్తుంది మందహాసము.

CWM 14: 221

శ్రీమాత

అనువాదం: డి. సత్యవాణి

అఖిల

అఖిల భారత పత్రిక

ఆగష్టు 2016



శాశ్వత జన్మ

దివ్యకాంతి

ఉషోదయాన ఆకాశాన్ని అలముకొని వున్న చిరుచీకటి గర్భం నుండి భానుడు దిగంబరంగా మసకబారిన కాంతితో బయల్పడే వరకు, నేను (వెలుగు) ఆ విరాట్ పురుషుని విశాల వక్షస్థలానికి సరిపడు వస్త్రాన్ని జరీపోగు ల్లాంటి స్వర్ణ కాంతులీను నా శిరోజాలతో నేసాను. వాయుగత స్తంభాలపై నీలాకాశాన్ని కప్పె గలిగే టంతటి విశాలమైన పందిరి వేయబడినప్పుడు, దాని సాటిలేని నీలి ఛాయ లను కుంచెతో రంగరించి, దాని చుట్టూ ఛమక్కుమని మెరిసే తారలను అలం కరించాను.

భగవంతుని ఆద్యసృష్టి యగు ఆదాము, అవ్వల పూదోట పొదరింటి పుష్పా లను, జీవంతో తొణికిసలాడే పచ్చని ఆకులను చిత్రీకరించాను. ఆ ఆనంద నిల యానికి రాణి యగు పాపపంకిలా లంటని కన్యామణి నేత్రాలలో వాటి రంగులే చిందాయి. ఆమె సత్యశీలమైన గుండెపై సైతాను తన మోసపూరితమైన పట్టును బిగించినప్పుడు, ఆమె కంటి నుండి రాలిన ప్రథమ కన్నీటి బొట్టుతో స్తంభించి పోయిన వాతావరణంలో కంపిస్తున్న పృథ్వీతలంపై నేను వాలిపోయాను.

సృష్టి లయమొందే కాలంలో శాపగ్రస్తమైన భూలోకంపై, ఆగ్రహోదగ్రమైన కడలి కెరటాలు ఉప్పెన లాగా ఎగసి శీఘ్రంగా సర్వాన్నీ ముంచెత్తినప్పుడు, మృత్యుముఖంలో నున్న జనావళి నుండి ముందు కొచ్చిన కొందరు, పరీక్షింప బడి, సత్యశీలురుగా నోవా నౌకను అధిరోహించగల అర్హత గలవారుగా నిరూపించ బడినవారిలో నెలకొనివున్న భీతి అంతమొందాలని నూతన వధువు యొక్క వెలు గులు జిమ్మే చూపులతో ఆదేశించాను. ఆ తుఫాను భయానక చీకటి తెరపై భగవంతుని శాంతి సందేశాన్ని ప్రకటించాను.

బెత్లెహేము పచ్చిక బయళ్ళపై గొర్రెలు కాసే పిల్లలు రాత్రి వేళల్లో ఒంట రిగా కాస్తున్నప్పుడు, వారి చుట్టూ వున్న వాతావరణం, శవదహన సంస్కారం జరిగే సమయాన నెలకొనే విషాద ఛాయలను బోలి వున్నది; స్పర్శ జ్ఞానం నశిం చిన ఛాతీపై చెదరకుండా పరచబడిన వస్త్రాన్ని తలపిస్తున్నది. ఎప్పుడైతే దేవ లోకంలో రూపొందించబడిన విమోచన పథకాన్ని వారి దృష్టికి ఒక మెరుపులా అందించానో, వారు ఆ ఉదయాన తమ నుద్ధరించే రక్షకుడు జన్మించాడని

స్తోత్ర గీతాలను ఆలపించారు. సమాజం చిన్న చూపు చూపిన మనిషికి ఇక ఆనందమే ఆనందం!

కులీనుల పైన, అల్పుల పైన నేను సమానమైన ఆదరణను, అనుగ్రహాన్ని కనబరుస్తాను. ధర్మాచరణ పరాయణుల పైనే గాక, అధర్మాన్ని ఆశ్రయించి మనుగడ సాగించేవారి పైన, అజ్ఞానాంధకారంలో గ్రుడ్డివారై దుఃఖభాజితమగు జీవితం గడిపేవారిపై సైతం నా కరుణా కటాక్ష కాంతి ప్రసరిస్తుంది.

నా చిరునవ్వు చిందించే మధురానుభూతి సుఖాన్ని అనుభవించు. అది స్నేహపూర్వక శుభాశీస్సులు అందించే మందహాసం; కాదు, నా ప్రేమానురాగాలతో పరిపుష్టి చెందిన బీడుబారిన నేలలో, మహారాజుల నందనోద్యానంలో పుష్పించిన గులాబీలా వికసించిన కుసుమం. అండాకృతి నుండి పిండాకృతి చెందే పరిణామ సమయాన్ని బోలిన చీకట్లను చీలుస్తూ వెలుగులు విలసిల్లే సమయాన, ఉల్లాసంగా రెపరెప లాడే రంగు రంగుల సీతాకోక చిలకల రెక్కలలా దర్శనమిచ్చే నన్ను చూడు!

కటిక చీకటి ఉదయారుణ కాంతిగా వికసనమొందే దశ నుండి చీకటిని పారద్రోలమని, మరియు యౌవనంలో నున్న వేకువను ఉషాకన్య కరకమలాలకు అందివ్వమని, కాంతిమంతమైన ప్రాతః సంధ్యా సమయాన్ని నేను ఆదేశించే వరకు, ఒంటరిదైన ఉషోదయం తన ఆడంబరాన్ని తనలోనే అణచి వుంచుతుంది. ప్రకాశమానంగా ఎదుగుతున్న ప్రాతః సంధ్య ఉల్లాసవంతుడైన యువకుడు తనకు ప్రియురాలు కాదగిన అందమైన యువతిని అన్వేషించి, సేద తీర్చుకొనుటకు ఆమె వెచ్చని ఒడిలో వాలి, మందమారుతంలా వీస్తున్న చల్లని పడమర గాలిలో విశ్రాంతి నొందుతున్నట్లుగా, పడమర దిశగా సాగుతున్న అతని గమనాన్ని ఆపి అతను నెమ్మదిగా నిద్రలోకి జారుకొనుటకు వీలుగా గులాబి, నారింజ రంగులు జిమ్మే అరుణకాంతి పరదాలతో కప్పుతాను.

దట్టమైన చీకటిలో మునిగిన సముద్రంలో నావికుడికి దిశా నిర్దేశం చేసే ధృవతార ఆకాశంలో కనుమరుగైనప్పుడు, కాపలా కాసే స్థానం నుండి రెప్ప వాల్చకుండా దృష్టిని సారించి చూచాను. తుఫాను తాకిడికి అల్లకల్లోలమై దయాహీనంగా తయారైన కడలిలో తోడు లేకుండా, కటిక చీకటిలో మునిగి తేలుతున్న

అతడు పయనించే చిన్ని నావను రేవులో నున్న స్వగృహానికి భద్రంగా చేర్చ టానికి అతనికి దారి చూపించాను.

రాలిన మంచు బిందువులతో తళతళ మెరుస్తున్న పొదరింటిలోని పుష్పా లను, పచ్చని ఆకులు, తీగలతో కమ్ముకొని వున్న గూళ్ళలోని పక్షులను మేల్కొ లిపాను. ప్రాతఃకాలపు వెలుగుల్లో పర్వతాలు, పచ్చిక బయళ్ళు తిరిగి కాంతు లీనుతూ, అందా లొలికిస్తూ, లేత ఎండ చిరు వెచ్చదనాన్ని ఆనందంగా అనుభ విస్తున్నాయి. అల్పకాలం పాటు భూమిపై నిలిచిన నా ఉనికి, అనిత్యము, చంచల మైనప్పటికీ, అంతటి సంతోషభరిత వాతావరణాన్ని అందీయగల యోగ్యత గలదైతే, దివ్యమందహాసంతో, సర్వదా సముజ్జ్వలమైన ఆనందోత్సాహాలతో వెలు గొందే దైవానుగ్రహ పాత్రులైన వారి గృహాలు ఎంతటి దివ్యైశ్వర్యాలతో విల సిల్లాలి!

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

(1883 వ సం. లో ప్రచురితమైన ఈ ఆంగ్ల పద్యం, శ్రీఅరవిందులు వారి పదవ యేట వ్రాసి ప్రప్రథమంగా ప్రచురించబడిన కవిత. అంత్యప్రాస నియతితో, ఛందోబద్ధంగా ఆంగ్లభాషలో రచింపబడిన ఈ కవితను, తెలుగులో పద్యరూపేణా అనువదించే ప్రయత్నంలో దాని మూలంలోని భావం వక్రీకరించబడే ప్రమాద మున్నందున, వచన రూపంలో అనువదించ బడింది.)


ప్రశ్న: ఎవరైనా లేక ఏదైనా శ్రీఅరవిందులకు సహాయపడగలదా?
సమా: ఆయనే సహాయపడువాడు, ఆయనకు సహాయ మందించబడదు!

CWM 12:27 శ్రీమాత

అనువాదం అందుగులపాటి జానకి

మన మధ్యనున్న దైవ సన్నిధి

దైవికమైన విషయాన్ని వ్యక్తపరచే దేనినైనా ఒప్పుకొనుటకు మనుషులు ఇష్ట పడరు, కానీ తప్పులెంచటానికి, పైకి కనిపించే లోపాలను ఎత్తి చూపటానికి సర్వదా సంసిద్ధులై వుంటారు. అందుచేత వారి మానసిక స్థాయి కన్నా మించిన స్థాయికి చెందిన దేనినైనా తమ స్థాయికి దిగజారుస్తారు. వారి ఇచ్ఛను అతిక్ర మించితే సహించలేక ఆగ్రహంతో రెచ్చిపోతారు, పైకి లోపాలుగా కనిపించే వాటిని పసిగట్టగలిగితే అమితానందం పొందుతారు. కానీ వారు గ్రహించలేని దేమిటంటే, భూమిపై దైవ ఉనికి ఉన్నప్పుడు, అది వారికి ముఖాముఖి ఎదురై నప్పటికీ, వారి అపరిణిత భౌతిక మనస్సుతో అపరిణితమైన ఫలితాన్నే పొందుతా రనే కచ్చితమైన విషయాన్ని మరుస్తారు. వారు దేనిని తేరిపార చూడటానికి అసమర్థులో లేక ఇష్టపడరో దానిని చూడాలని ఎలా ఆశిస్తారు? పైకి కనిపించే కార్యాచరణతో దైవిక చర్యను అంచనా వేయాలనుకుంటే దైవంపై తప్పుడు అభిప్రాయం తప్పక ఏర్పడుతుంది. ఎందుకనగా పైకి కనిపించే లక్షణాలు మానవ సహజమైనవిగా కనిపించినా, వాస్తవానికి అందుకు భిన్న మైనవి. అవి మానవ సంబంధం కాని అలౌకిక మూలం నుండి ఉద్భవించినవి. కానీ, మనుషులు స్వాభా వికంగా తమ నిమ్న స్థాయితో సంతృప్తి చెంది, దానినే అంటిపెట్టుకొని వుండ టానికి మొగ్గుచూపుతారు, ఒక ఉన్నత స్థాయికి చెందిన వాస్తవికతను అంగీక రించుటకు గాని, దానికి లోబడుటను గాని సహించరు. ఏది ఉన్నతమైన వాస్తవికత అని వారి అంతరాత్మ గుర్తించి తెలుపుతుందో, దానిని విమర్శించి తప్పు లెన్నాలనే అసూయపూరిత భావన ఏర్పడటం మానవజాతి కున్న ప్రత్యేక లక్షణం — మానవజాతి నైజాన్ని నిర్ధారించే ముద్ర. అలా కాకుండా, ఎక్కడ సత్యమైన, సుందరమైన, ఉన్నతమైన లక్షణాలపై సహజ సిద్ధమైన మెప్పు ఏర్పడుతుందో అక్కడ దివ్యత్వం అభివ్యక్త మవుతుంది. నీవు నిశ్చయంగా తెలుకోవలసిన విషయ మేమిటంటే, దేనినైతే నీవు దైవాంశ సంభూతమైనదిగా తలుస్తావో, దానిని ఆరాధించాలని, అభినందించాలని నీ హృదయం ఎగిరి గంతేసినప్పుడు, నీ



శ్రీఅరవిందులలో నీవు ఆరాధించేది దివ్యత్వం

భౌతిక చేతనతో సంపర్కం కలిగేది నీ చైత్యపురుష సత్త, నీ అంతరాత్మ అని.
CWM 3:158-59

శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

15 ఆగష్టు యొక్క ప్రాముఖ్యత

శ్రీఅరవిందుల జననానికి గల ప్రాముఖ్యత

నేను శ్రీఅరవిందుల జన్మను గురించి వాడిన వాక్యశైలి ప్రశ్నార్థక మయింది — అది ఆయన జన్మదిన సందర్భంగా జరిగింది. నేను దానిని "శాశ్వత జన్మ" అని అన్నాను. "శాశ్వతము" అనటంలో నా ఉద్దేశమేమిటి అని నన్నడిగారు....

భౌతికపరమైన అర్థం: ఈ జననం యొక్క పర్యవసానాలు లోకాంతం వరకు కొనసాగుతాయని, ప్రపంచ ఉనికి కొనసాగినంత కాలం శ్రీఅరవిందుల జన్మ పర్యవసానాల అనుభూతి కలుగుతూ వుంటుంది అని.

అందుకని నేను దానిని "శాశ్వతము" అని అన్నాను — కొంత కవితా ధోరణిలో!

మానసికపరమైన అర్థం: ఈ జన్మ యొక్క జ్ఞాపకాలు శాశ్వతంగా నిలిచి వుంటాయని, యుగాల తరబడి. శ్రీఅరవిందుల పుట్టుకతో సంభవించిన పర్యవసానాలతో సహా, స్మృతిపథంలో నిలుస్తాయని.

చైత్యపురుష పరమైన అర్థం: ప్రపంచ చరిత్రలో, ప్రతి యుగంలో, నియమిత కాలానుగుణంగా ఈ జన్మ స్వయం వ్యక్తమవుతుంది, అనగా, ఈ జన్మ పునరారంభ మవుతుంది, పునరావృత మవుతుంది, పునరుజ్జీవింప బడుతుంది — ప్రతి దఫా, బహుశా అధికంగా, మరింత సంపూర్ణంగా — సమగ్రంగా. అయితే ఇది ఐహిక దేహధారణతో జరిగే పుట్టుక, అవతరణ, సాక్షాత్కారం.

ఇక చివరిగా, పూర్తిగా ఆధ్యాత్మిక దృష్టిలో, అది భూలోకంలో శాశ్వతుడగు భగవంతుని జననం అనవచ్చు. ఎందుకనగా, ప్రతిసారీ అవతారం ఒక దైహికా

కృతి దాల్చినప్పుడు, అనంతుడగు భగవంతుడు స్వయంగా జన్మించినట్టుగా వుంటుంది.

ఇదంతా ఈ రెండు పదాలలో ఇమిడి వుంది, "శాశ్వత జన్మ"....

CWM 8:178-79

అనువాదం: అందుగులపాటి జానకి

ఒక మలుపు: భవిష్యత్ కార్యక్రమానికి ప్రణాళిక

ఆగష్టు 15 వ్యక్తిగతంగా నాకు సాధనలోగాని లేక జీవితంలో గాని సాధారణంగా ఒక మలుపు, లేదా గుర్తుండే రోజు — ఇతరులకు కేవలం పరోక్షంగా మాత్రమే. ఈ సారి అది నాకు చాలా ముఖ్యమైన దినం. బహుశా నా అంతరంగ సాధనను రూఢి పరచేటటువంటి చిట్టచివరి ముద్రను అందుకుందని చెప్పుకోవచ్చు. అది ఏదో ఒక విధంగా సుదీర్ఘంగా సాగిన సాక్షాత్కారం మూలంగాను, ఎన్నో గంటలు పరబ్రహ్మమందు నివసించడం మూలంగాను పరిపూర్ణతను పొందింది. అప్పటి నుంచి అన్నమయ ఆత్మలో తప్ప నాలో అంతటా అహంకారం నశించింది. భౌతిక ఆత్మ గతంలో వేరైన ఉనికిని అప్పుడప్పుడు చూడడానికి వెడుతూ ఉండటం లేదా బాహ్యస్పర్శలను పొందుతూ ఉండటం అనే వాటి నుంచి పూర్తిగా విమోచనం పొందడానికి ముందు ఇంకా ఎక్కువైనటువంటి మరి ఒక సాక్షాత్కారానికి అది నిరీక్షిస్తున్నది.

భవిష్యత్తులో నా సాధన జీవితానికీ, ఆచరణాత్మక జ్ఞానానికీ, శక్తికీ సంబంధించి ఉంటుంది — ఆవశ్యకమైన జ్ఞానం లేదా దానికదే అయినటువంటి శక్తి కోసం కాదు, దానిని నేను ఈ వరకే పొంది ఉన్నాను — కాని, అదే భౌతిక ఆత్మలో నెలకొని ఉన్న జ్ఞానశక్తులు జీవితంలో నా కార్యానికి సూటిగా నిర్దేశించబడిన వాటి కోసం. నా కిప్పుడు నేను చేసే ఆ పని మీద స్పష్టత నెలకొంటున్నది. దానిలో కొంత భాగాన్ని నీకు నేను అందించగలను; ఎందువల్లనంటే, నీవు నన్నే కేంద్రంగా నా వైపే చూస్తున్నావు గనక, ఆ కేంద్రం నుంచి బహుశా ఏ కాంతి కిరణాలు అన్ని వైపులా ప్రసరిస్తాయో నీకు తెలియాలి.

1. సనాతన ధర్మాన్ని దాని అన్ని విభాగాలలో తిరిగి మానవ మేధస్సుకు తెలియ జెప్పాలి, అదీ నూతన దృక్పథంతో. ఆ పని ఇప్పటికే మొదలయింది, దానిలో మూడు వంతులు స్పష్టం చేయబడ్డాయి. శ్రీకృష్ణుడు నాకు వేదాల అసలైన అర్థాన్ని చూపించాడు, కేవలం అది మాత్రమే కాకుండా, కొత్త భాషా శాస్త్రానికి సంబంధించిన విజ్ఞానాన్ని చూపించాడు. దానిలో మానవ భాషకు సంబంధించిన ప్రక్రియనూ, మూలాలనూ చూపించాడు, దాని మూలంగా ఒక కొత్త నిరుక్త రూపాన్ని (వేదాంగాలలో ఒక భాగం, శబ్దార్థ విశేషం) ఇవ్వగలగ టానికీ, దాని మీద ఆధారపడి వేదాలకు కొత్త భాష్యాన్నివ్వటానికీ వీలవుతుంది. ఇంకా ఆయన నాకు భారతీయులు గాని లేక ఐరోపావాసులు గాని అర్థం చేసుకో లేకపోయి నటువంటి ఉపనిషత్తు లన్నింటిలో ఉన్న అర్థాన్నంతా కూడా చూపిం చాడు. కనుక, నేను మొత్తం వేదాంతాన్ని, వేదాలను తిరిగి వివరంగా తెలియ జెప్పవలసి ఉంది. అది ఏ విధంగా నంటే, మతాలు ఏ విధంగా వాటి నుంచి ఆవి ర్భవించాయో ననే విషయం, ప్రతి చోటా అది ఒక్కటే ననే విషయం. ఈ విధంగా ప్రపంచంలో మతనిష్ఠతో జీవితం గడపటానికి భారతదేశం కేంద్రమని, సనానతన ధర్మం ద్వారా దానిని ఉద్ధరించటానికి విధిచే అది నియుక్త మైనదని ఋజువు చేయబడుతుంది.

2. వేదజ్ఞానం ఆధారంతో యోగసాధనను నెలకొల్పటం, ఫలితంగా అది ఆత్మకు విమోచనం కల్పించటమే కాకుండా, పరిపూర్ణ మానవజాతిని తయారు చేసి, సత్యయుగం తిరిగి నెలకొనటానికి సహాయం చేస్తుంది. ఆ పని ఇప్పుడు ప్రారంభం కావాలి, కాని అది కలియుగాంతం వరకూ పూర్తి కాదు.

3. భారతదేశమే కేంద్రం కాబట్టి, ప్రపంచంలో సరియైన ఆమె స్థానాన్ని తిరిగి నెలకొల్పటానికి పని చేయడం; కాని ఈ విధంగా తిరిగి నెలకొల్పటమనేది పైన చెప్పిన పనిలో భాగంగా తప్పక క్రియాశీలం కావలసి ఉంది — మానవ కార్యసాధనాల మీద, ఉపకరణాల మీద ,యోగాన్ని సాధనంగా ఉపయోగించడం ద్వారా, మరి వేరే విధంగా అయితే కాదు.

4. పరిపూర్ణ మానవజాతిని లక్ష్యంగా పెట్టుకున్న సమాజానికి కొత్త ఆకృతిని

కల్పించి, దాని మూలంగా అది పరిపూర్ణతను కలిగి ఉండటానికి యోగ్యమైన దానినిగా చేయడం.

CWSA 36:177-78 (From a letter to Barin August 1912 or after)

చిట్టచివరి అవతారము — పదార్థమును దివ్యం గావించుట

ప్రశ్న: కాథలిక్ క్రైస్తవుల చర్చిలో మేరీ కన్యను స్వర్గంలోకి స్వీకరించే వార్షిక పండుగకూ, శ్రీఅరవిందుల జన్మదినానికీ ఏమైన సంబంధం ఉందా?

సమా: ఉంది. అది ఆయన స్వయంగా చెప్పారు కూడా. మేరీ కన్య[1] స్వర్గారోహణం అనేది మహాపదార్థాన్ని దివ్యం చేయడం. అదే చిట్టచివరి అవతార లక్ష్యం[2].

CWM 8:267-68

శ్రీఅరవిందులు

అనువాదం: త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

---

[1] కాథలిక్ చర్చిలోని ఒక వర్గం ఆగష్టు 15 ను మేరీ మాత శరీరంతో స్వర్గారోహణ చేసిన దినంగా పండుగను జరుపుకుంటారు.

[2] శ్రీమాత కూడా శ్రీఅరవిందులను "చిట్టచివరి అవతారం" గా ప్రకటించారు. కాని, బహుశా మానవ శరీరంలో వచ్చే చిట్టచివరి అవతారం కావచ్చు.

CWM 10: 253

ఆగష్టు 15 దర్శనము

(గొప్ప అవరోహణలు చోటు చేసుకోవటమే కాక పెద్ద అడ్డంకులు ఏర్పడే కాలం)

ప్రశ్న: ఈ దర్శన మప్పుడు దివ్యానందం, దివ్యశక్తి లేక దివ్యకాంతికి బదులు తీవ్ర నిరుత్సాహానికి లోనయినాను.

సమా: ఆనందము లేక శక్తి లేక కాంతి దిగిరావటమో లేక అడ్డంకి ఏర్పడటమో, నీ మానసిక స్థితిపై ఆధారపడి వుంటుంది. నీలో ఉద్భృతమైనది అజ్ఞానంతో కూడిన, అస్పష్టంగా నున్న సాధారణ భౌతిక చేతన యొక్క నిరోధక శక్తి అని తోస్తున్నది. 15 వ తేదీ గొప్ప అవరోహణలే గాక తీవ్ర అడ్డంకులు కూడా ఏర్పడే కాలం. ఈ 15 వ రోజుకు మినహాయింపు లేదు.

దర్శన దినం ఆసన్నమయ్యే కొలది ప్రతికూల శక్తులు మనపై దాడి చేయుటకు గుమికూడటం తరచుగా జరుగుతుంది. ఆ శక్తులు ఒక్కొక్కటిగా దాడి చేయవచ్చు లేదా మూకుమ్మడిగా దాడి చేయవచ్చు. అనుగ్రహం పొందవలసిన వారు పొందకుండ, అవరోహించవలసిన శక్తులను దిగి రానీకుండా అడ్డుకుంటాయి. దర్శన దినం తర్వాత కూడా బలమైన దాడి తరచుగా వుంటుంది. ఎందుకనగా అంత వరకు సాధించినదానిని నాశనం చేయాలని, పురోభివృద్ధి నొందకుండా అడ్డుకోవాలని. నాకు తెలిసినంత వరకు ఏ వ్యక్తి కూడా ఈ దాడికి గురి కావలసిన అవసరం లేదు. దాని తత్వాన్ని ఎరిగినట్లైతే దానికి తగు విధంగా ప్రతిస్పందించి, ప్రక్కకు నెట్టేయవచ్చు. ఆ దాడి అలాగే కొనసాగితే సంకల్పాన్ని, విశ్వాసాన్ని ధృఢతరం చేసి అధికంగా ఉన్మీలనం చెంది, వినూత్న పురోభివృద్ధితో, తాత్కాలిక అడ్డంకుల నుండి బయడపడ వచ్చు.

Correspondence with Nirodbaran:57

శ్రీఅరవిందులు

అనువాదం: ఆకుల కృష్ణ

ఆగష్టు దర్శనం కోసం సరైన వైఖరి

ప్రశ్న: ఎవరో అన్నారు, ఆగష్టు 15 దర్శనానికి ఇంకా 10 రోజులే మిగిలి ఉన్నాయని. వారితో "ప్రతి రోజూ 15 ఆగష్టు దర్శన దినంలానే భావించాల్సి ఉంటుంది" అని అన్నాను.

సమా: అదే సరైన వైఖరి. ప్రతి దినాన్ని ఉన్నత చేతన మనలో అవతరించి, దానితో మనం సంబంధం నెలకొల్పుకో గలిగే దినంగా భావించి ఆ దృష్టితోనే చూడాలి. అపుడే 15 నాటి దర్శనం మరింత విజయవంతం అవుతుంది.

*

ఇంక ఆగష్టు 15 దర్శనానికొస్తే ఆ రోజు కోసమే అంతగా ఎదురు చూడాల్సిన అవసరం లేదు. అదేదో వైయక్తంగా గొప్పదైనట్లు గాక సర్వ సాధారణమైన దినం. అంతరంగంలో ఆ సంబంధం ఏర్పడిన ప్రతిదినం 15 తో సమానమైనది గానే భావించాలి. ఆ విధంగానే సాధన కొనసాగాలి.

CWSA 36:523

శ్రీఅరవిందులు

*

శ్రీఅరవిందుల శతజయంతిని జరుపుకో దలచిన వారు వారి ఉనికి మరింత క్రియాశీలం, ప్రభావశీలంగా ఉండేదిగా ప్రయత్నించాలి. కానీ ఎవరైతే ఎల్లవేళలా వారితో సంబంధం నెలకొల్పుకొని ఉంటారో వారికి ఇదేమంత ప్రత్యేకంగా ఉండదు.

శ్రీవారి సమాధి ముందు కూర్చొని కొందరు ఇదే వైఖరి కలిగి ఉంటారు. "ఆయనెపుడూ మనతోనే ఉన్నారు." అయితే మన పిలుపునకు తగినట్లుగానే వారి సమాధానం క్రియాన్వితమై వుంటుంది.

CWM 17:372

శ్రీమాత

*

ఎవరైనా సరే శ్రీఅరవిందుల ఆశీస్సుల స్పర్శ పొందారో వారు ఆ ఆనందాన్ని — ఇతరులతో వృధా ప్రసంగాలతో చెదిరిపోకుండా — అంతరంగంలో ఆ

సన్నిధిని, ఆనందాన్ని నిలుపుకొని ఉండటం ఎంతో శ్రేష్టం.
CWM 16:86

శ్రీమాత
స్వేచ్ఛానువాదం: కొంగర భాస్కర రావు

ఈ విశ్వం ఇంకా సిద్ధంగా లేదు

చూడగా, నిజమైన లోకం శూన్యం నుంచి సృజింప బడలేదనిపిస్తుంది. అది పూర్తిగా సిద్ధంగానే వుంది. అది మన లోకాన్ని చుట్టే వున్నది. అంతా తానుగా వున్నది. ఆ స్థితిలో చాలా హాయిగా నేను రెండు రోజులు ఉండిపోయాను. సంపన్నంగానే వున్నాను. ఆ సమయంలో శ్రీఅరవిందులు పూర్తిగా నాతో నడిస్తే నడిచి, కూర్చుంటే కూర్చుని, యథాతథంగా తోడై వున్నారు.

ఆగష్టు 15 దర్శన దినం పూర్తిగా వారు నాతోనే వున్నారని ఎవరికి తెలుసు? ఎవరూ చూచి వుండరు. బహుశా ఒకరిద్దరికి భావన గలిగిందేమో. శ్రీఅరవిందు లకు నేను ఇచటి సాధనా క్షేత్రంతో సహా మన వారందరినీ చూపగా సమీపంలో వున్న తావున నిత్య సత్య జగత్తు తన స్వస్వరూపాన్ని ఆవిష్కరించి, ఈ అసత్తు గల జగతిని ఎప్పుడు గ్రహిస్తుందని అడగ్గా వారి సమాధానం అది సిద్ధంగా లేదని మాత్రమే చెప్పారు.

అయినా క్రమంగా అది కొద్దిగానైనా ఈ అసత్య లోకం మారగలిగితే సత్య లోకం సంభావ్యమే. ఒక్క క్షణం, ఒక్క ఘడియే చాలు, ఒక చిన్న అంతఃకరణ పరివర్తన తారుమారైతే చాలు, సాధ్యమే. ఆ విషయం ఏమని చెప్పడం. సాధా రణ చైతన్యాని కది అగోచరం. నాణ్యతతో అంతఃకరణ కొద్దిగా మారినా చాలు.
Conversation with a disciple Oct 6, 1959

*

అనుయాయులు అవశ్యం ఆశ్రమంలోనే వుండ నక్కర లేదు. చాలామంది శిష్యులు ఆశ్రమం బయటే వున్నారు. ఆశ్రమ జీవనానికి గల నియమాలు పాటిస్తూ చక్కని ఆరోగ్యంతో అచటి కట్టుబాట్లు పొందగలగాలి. ఆహారం వగైరా ఇతర

సేవలు ప్రత్యేకంగా ఏమీ వుండవు. పర్యాటకులకు మాత్రం కాలపరిమితితో అందిస్తారు. కారణాంతరాల వలన శాశ్వత ప్రాతిపదికగా చేయటం వీలు కాదు.
CWM 17:188

శ్రీమాత

అనువాదం: టి. ఎస్. రామచంద్రరావు

అత్యద్భుత దర్శనము

మేము 15 వ తేదిన సుమారు పది గంటలకు ధ్యానానికి ఇక్కడ కూర్చున్నాము. అప్పుడు పావు తక్కువ పది అయింది. నేను ఈ మేజా బల్ల దగ్గర మౌనముద్రలో మునిగి యున్నాను. విచిత్రంగా శ్రీఅరవిందులు ప్రత్యక్షం అయినారు. వారెపుడూ వారి సూక్ష్మభౌతిక రూపంలో ఇక్కడ ఉంటారనేది అందరికీ తెలిసినదే! కాని ఆ రోజు వారు నిజంగా భౌతికంగా వున్నట్లనిపించింది. కాని వారెంతో పొడవుగా కన్పించారు. మఠం వేసుకొని కూర్చొని ఉన్నారు. చూట్టానికి వారు ఈ ఆవరణ అంతా ఆవరించి యున్నట్లు అనిపించింది. ఆయన దాన్ని దాటి పైకి కూడా వ్యాపించి యున్నట్లు కనపడింది. ఆయన పైన ఉన్నారు, ఆవరణ క్రింద వున్నది! అక్కడి వారంతా ఆయనలో అంతర్భాగం అయిపోయారు. ఆయన మాత్రం అలానే కూర్చొని వున్నారు — వాళ్ళ తలల మీద కాదనుకోండి!

నాకు వారి సూక్ష్మదేహం యొక్క భౌతిక స్పర్శ తెలుస్తూనే వుంది, కాని అది కేవలం వారి సూక్ష్మభౌతికానిదే. అది నేను గమనించాను. (నేను ఎప్పుడూ స్థూలభౌతిక దేహంగానే ఉంటాననుకోకండి) నాకు వారు సమున్నతంగాను, పొందిక కలిగిన రూపధారిగాను కన్పించారు. నెమ్మదిగా వారు క్రిందకు దిగు తున్నపుడు ఆ చలనం వలమ కలిగిన స్పర్శ తీవ్రత తెలిసింది. ఎవరికీ ఏమాత్రం కుదుపు కలుగకుండా వారు క్రిందకు దిగారు. తరువాత అరగంటకు పైగా నిల కడగా కూర్చున్నారు. అందరినీ నిలకడగా పరికించారు. అక్కడ వున్న వారంతా వారిలో అంతర్భాగం అయినట్లే కనిపించారు.

నేను మాత్రం చిరునవ్వుతో ఇక్కడే కూర్చొని వున్నాను. నిజంగా నాకు

నవ్వు కూడా వచ్చింది. (మీరు కూడా వారిని ఆ రూపంలో గమనించవచ్చు: ఆ అనుభూతిని పొందవచ్చు). శ్రీఅరవిందులు అంతటా నిండి యున్నారు. అదే ప్రశాంతత, అదే బలం, అదే శక్తి!

అట్టి క్షణాల్లో శాశ్వతము, బృహత్తరము, పరిపూర్ణము ఐన భావన మన అనుభవంలో చోటు చేసుకుంటుంది. అంతా అనుకున్నట్లు జరిగిందనిపిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే మనకు అమరత్వ భావన కలుగుతుంది.

కొద్ది సేపటి తర్వాత వారు ఉన్న ఫళంగా అంతర్ధానం అయినారని అనుకోకండి. కర్పూరంలా మెల్లగా ఆ రూపం కనుమరుగు అయింది. తర్వాత పరిస్థితి యథాతథంగానే కొనసాగింది. ఎక్కడ పనులు అక్కడ జరిగిపోయాయి. అదే శ్రద్ధతో, అదే ఏకాగ్రతతో.

నా వరకు నేను శ్రీఅరవిందులను వారి అతిమానస దీప్తితో తరచు చూస్తూనే వున్నాను. వారు కూడా అదే విధంగా తరచు దర్శనం ఇస్తూనే వుండేవారు. సమాధి వద్ద కూడా ఒక్కొక్కసారి అలానే జరిగేది. తరచుగానే; తన బృహత్తర రూపంతో అలా వారు ఆ ఆవరణ అంతా ఆక్రమించారా అనేటట్లు కూర్చునేవారు. ఆయన భౌతిక రూపంలో వున్నట్లే వుండేవారు. అది నిజమేనని తోచేది — ధైర్యము, నిశ్చలత, నమ్మకము కలిగించేలా తోచేది.. అంతా సవ్యంగా జరిగిపోతుందన్న ధైర్యం కలిగేది. జరుగవలసిన వాటిని గురించిన ఆందోళన, ఉద్రిక్తత ఉండేవే కావు.

అదే వారు మనకు ఇచ్చిన చక్కని కానుక.

శ్రీఅరవిందులు స్థూలదేహంలో ఉన్నప్పటి కంటె సూక్ష్మభౌతికంలో మరింత స్పష్టంగా, మరింత బలంగా వున్నారనిపించింది.

C0nversations with a disciple, Aug 18

శ్రీమాత

అనువాదం కె. ఆర్ . ఎల్. నరసింహారావు

శ్రీ అరవిందుల జన్మదిన ప్రసంగములు
(సేకరించబడినవి)

అసహనము కలిగి యుండకు. నిరాశ నిస్పృహలు వద్దు, విశ్వాసము కోల్పోవద్దు

నా బాల్యము నందు, బుద్ధి కుశలతలు పూర్తిగా వికసించనపుడు, నా చేతన లోని ఒక బలమైన మానసిక ప్రేరణ గురించి ఎరుక కలిగింది. అదేమిటో అపుడు నాకు తెలియదు. నా వయసుతో పాటు బలంగా ఎదిగింది. నేను పెరిగి పెద్దయిన కొలది భయం, స్వార్థం లాంటి బలహీనతలు నా మనసు నుండి తొలగిపోయాయి. నా జన్మభూమికి నేను తిరిగి వచ్చిన రోజు నుండి ఆ ప్రేరణ అత్యంత శక్తివంతంగా ఉత్తుంగ తరంగాలలా ఎగిసిబడుతున్నది. దైవభక్తి, నాకు నిర్దేశించబడిన లక్ష్యము. నా శ్రద్ధ, నాకు కలిగిన శోధనలు, వేదనలు మరింతగా దృఢ పరచబడుతున్నాయి. దైవానుగ్రహంతో సంప్రాప్తమైన దివ్యశక్తి తనంతట తానుగా మానవుల యందు అభివ్యక్తమైనపుడు, అభివృద్ధి దిశగా చేయు ప్రయత్నములో, జాతీయ జీవన మందున ఒక నూతన శక్తి సమకూరుతుంది. నీ మాత పాదాల వద్ద నిన్ను నీవు సమర్పణ చేసుకోవలసి వస్తుంది. కాబట్టి, నీవు దృఢ విశ్వాసముతో, భక్తిశ్రద్ధలతో, సంపూర్ణ హృదయ సమర్పణ చేసుకొని ఆమె సేవకు అంకితము కావాలి. మాతృభూమి సేవ చేయడం అత్యుత్తమ తక్షణ కర్తవ్యము. ఇది ఈ కష్టకాలంలో మనమంతా నిర్వహించవలసిన విధి. ప్రస్తుతం కఠినమైన ఇనుప సంకెళ్ళతో మన తల్లి బంధించబడిన స్థితిలో మన శక్తియుక్తులను కూడగట్టుకొని సన్నద్ధము కావలసిన సమయము. అసహనము మన దరికి రానీయకండి, నిరాశనిస్పృహలు వద్దు. విశ్వాసమును కోల్పోవద్దు. ప్రస్తుత పరిస్థితుల్లో అలసట, సోమరితనము కలగటం సహజము. ప్రతి దేశ చరిత్రలో ఈ విధమైన సంక్లిష్ట పరిస్థితులు తటస్థ బడతాయి. ప్రతి ఒక్కరము తమ శక్తినంతా కూడ గట్టుకొని, ఒక నూత్న ఉత్సాహముతో, కొత్త ఆశలను చిగురింప చేసుకొని మన మాతృమూర్తిని ఆరాధించడానికి సంసిద్ధులము కావాలి. దైవశక్తి ఆవహించబడిన మన దేశము ఒక నూతన శక్తిగా ఆవిర్భవిస్తుంది. ఆ దివ్యశక్తితో ప్రబోధించబడిన మన దేశం నూతన శక్తి సామర్థ్యాలను సంతరిచుకున్నది. ఒక రోజున ఈ శక్తి దేశాన్ని

ఒక మహోన్నత స్థాయికి పెంచుతుంది.

(శ్రీఅరవిందుల 37 వ జన్మదినమున 15 ఆగష్టు 1909 లో కలకత్తా నగరము నందు వారి నివాసంలో చేసిన ప్రసంగము)

CWSA 8:179

అనువాదము: జి. వి. యస్. వి. ప్రసాదరావు

అతిమానస సత్యావతరణ సంకేతము

మునుపు నా భౌతిక జన్మదినాన్ని మనం ప్రాణిక స్థాయిలో జరుపుకొనే వారం. దానిలో ఆంతర సత్యం యొక్క బీజం ఉన్నప్పటికీ ఆవిష్కరణ మాత్రం ప్రాణికం గానే ఉండేది. ఇకపై ఆ రోజును పాటించితే, ఆ రోజు ఏ సత్యానికి సంకేతమో, దానికి అనుగుణంగా వుండాలని నా అభిలాష.

మన జీవితాలలోకి దిగి రావలసిన అతిమానస సత్యం గురించి మీ అందరికీ తెలుసు. ఈ రోజున ఆ పరమ సత్యం గుర్తించబడింది. కానీ ఆ అతిమానస అవ తరణ మార్గంలో ఎన్నో అడ్డంకులు ఉన్నాయి. అక్కడ మనస్సు, మానసిక మయిన ఆలోచనలు దివ్యమైన ఊర్ధ్వస్థాయి నుండి దిగివచ్చే పరమ సత్యాన్ని గ్రహించి తమ స్వప్రయోజనానికై వినియోగించుకోవాలని ప్రయత్నిస్తాయి. ఉదాహరణకి ప్రాణిక చేతన లేక ప్రాణశక్తి ఆ అవతరించే ఉన్నత శక్తిని కబళించి అపవిత్రమైన కార్యాలకై వాడుకో జూస్తుంది. క్రిందికి దిగివచ్చే పరమ సత్యం మానసిక మయినది కాదు. అది అతిమానసం. అది తన పనిని సక్రమంగా కొనసా గించాలంటే నిమ్నమయిన ఉపకరణాలన్నీ అతిమానసీకరించ బడాలి. నిమ్నశక్తులు ఈ ఉన్నత సత్యాన్ని తమ సామాన్యమయిన కార్యకలాపాలను తృప్తిపరచటానికి వాడుకోవాలని ప్రయత్నిస్తాయి. ఒక వ్యక్తి జీవిత సౌఖ్యాలను ఆస్వాదించేటపుడు లేదా స్వార్థపరమైన కోర్కెల అన్వేషణలో జీవితాన్ని గడపాలనుకున్నప్పుడు, ఈ విశ్వశక్తులే అతని ద్వారా అతనిలోనే ఆ ఆనందాన్ని పొందుతాయి.

ఈ ఉన్నత శక్తి తన పవిత్రతతో పని చేయగలగాలంటే వ్యక్తి ఊర్ధ్వంగా ఉన్న మహత్తరమైన శక్తికి తెరుచుకొని, తనను తాను సమర్పించుకొని, ఆ

ఉన్నత సత్యపు మార్గానికి అవరోధమయినదాని నంతటినీ తొలగించి వేయాలి. ఈ మూడు విషయాలలోనే సమర్పణా సామర్థ్యం ఇమిడి ఉంటుంది.

ఎన్నో ఏళ్లుగా నేనీ అడ్డంకులను ఎదుర్కొని, వాటిని తొలగించి మీకు మార్గం సుగమం చేయటానికి, వాటి వలన మీ కార్యం కష్టతరం కాకూడదని ప్రయత్నిస్తున్నాను, కానీ ఆ కార్యనిర్వహణలో నా సాయం అందుకో గలగటం, దానిని స్వీకరించటం మీ సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది. మీరు స్వీకరించ గలిగినంత ఎంతైనా నేను యివ్వగలను. నిజమైన ఆధ్యాత్మిక సమర్పణ అనేది వేరే విషయం. కానీ మీలో ఒక్కరయినా దానిని లేశమాత్రమైనా, అనుభూతి చెంది ఉంటే, దానిని గురించి కనీసం కొంత మాత్రమైన ఆలోచించి వుంటే, ఆగష్టు 15 యొక్క ఉద్దేశ్యం నెరవేరినట్లే.

Evening talks with Sri Aurobindo by A. B. Purani, p. 297, 15 Aug 1923

అనువాదం: డా. సరోజా ప్రసాద్

దివ్యప్రేమను, దివ్య సౌందర్యాన్ని, దివ్యానందాన్ని దివి నుండి భువికి రప్పించడమే నిజానికి శిరసాయమానమైన మన యోగ సారం. కాని, అది నాకువెప్పుడూ అసాధ్యంగానే తోస్తుంటుంది; ఆసరాగా, పునాదిగా, రక్షణగా దివ్యసత్యం, దాని దైవికశక్తి — దాన్నే నేను అతిమానసం అంటాను — సహాయకారిగా అందు బాటులోకి వస్తే తప్ప అది సాధ్యం కాదు.

CWSA 35:837

శ్రీఅరవిందులు

అనువాదం: నాగరాజు రామస్వామి

భూమి లోనికి 'త్రవ్వట'

అతిమానసాన్ని[1], భౌతిక చైతన్యంలోకి పదార్థం లోపలి విభాగాలలో వరకు కొని తెచ్చే పనిలో, ప్రస్తుతం నేను నిమగ్నమై ఉన్నాను. స్వభావ సిద్ధంగా భౌతికం జడమైనది, తాను చైతన్యవంతంగా మార్చబడాలని అది కోరుకోదు, తీవ్రంగా నిరోధిస్తుంది, ఎందుకంటే దానికి మార్పు ఇష్టం లేదు.

వేదాలలో చెప్పినట్లు, మనకు ఇది 'భూమిని త్రవ్వటం' లా అనిపిస్తుంది. అక్షరాలా చెప్పాలంటే, పైనున్న అతిమానసం నుండి దిగువ నున్న అతిమానసం వరకు త్రవ్వటంలా ఉంటుంది. సత్తా చైతన్యం పొందింది, అందుచే నిరంతరం ఎగువ నుండి దిగువకు కదలికలు (గుంజులాట) కొనసాగుతుంటాయి. వేదాలు దీనిని రెండు కొసలు, తల, తోక, రాక్షస బల్లి[2] యొక్క తల, తోకగా అభివర్ణించాయి. ఇది మన చైతన్యాన్ని, సంపూర్ణంగా ఆవరిస్తుంది.

పదార్థం సంపూర్ణంగా అతిమానసీకరింప[3] బడనంత వరకు మానసిక[4] ప్రాణికం[5] కూడ సంపూర్ణంగా అతిమానసీకరింపబడ జాలవని, నేను కనుగొన్నాను. అందుచే భౌతికం అనుమతించబడి, పరివర్తన చెందించబడాలి. ఇది జన్మ తరువాత జన్మల ప్రతీ స్థరం[6] లోను జరగాల్సిన సంక్లిష్టమైన ప్రక్రియ. అధిమానసం లోని అత్యున్నత పొరను, భౌతిక చైతన్యంలోకి తేవడానికి నేను ప్రయత్నిస్తున్నాను.

అంతరజ్ఞాన బుద్ధి[7] యొక్క మూడు చర్యలకు అనుగుణంగా అతిమానసంలో మూడు పొర లున్నాయి. వీనిలో మొదటి దానిని అతిమానస విశ్లేషణ బుద్ధి[8] అని నేనంటాను.

ఎందుకంటే, ఏదైతే మానస స్థరంలో ఒక అవకాశం[9] గా ఉంటుందో, అది — అతిమానస స్థరంలో ఒక సాఫల్యశక్తి[10] గా మారుతుంది. విశ్లేషణ అతిమానసం అన్ని అవకాశాలను మీ ముందుంచుతుంది. భౌతిక స్థరంలో వాస్తవం కావలసిన సంఘటనల మూల కారణాలను అది (విశ్లేషణ అతిమానసం) చూపుతుంది. అంతర జ్ఞానం దాని అతిమానస విలువలోకి మారినపుడు, అది విశ్లేషణ అధిమానసం అవుతుంది.

తరువాత వచ్చేదానిని ప్రాతినిధ్య అతిమానసం అని నేనంటాను. ఇది వర్త

మానంలో ఉన్న అవకాశాల కదలికలను, ఏమి జరుగుతున్నదో అనే దానిని తెలుపుతుంది. ఉత్సాహం, ఉద్వేగం, అతిమానస స్థాయిని పొందినపుడు అది ప్రాతినిధ్య అతిమానసం అవుతుంది. ఇది అత్యున్నత అతిమానసం కాదు. ఇక్కడ నీకు తెలుస్తుంది, కొన్ని అవకాశాలు పని చేస్తున్నట్లు; ఏమి జరుగబోదోంది కొన్ని విషయాలు ఎలా జరగాయి, ఎలా జరుగగలవు అనేది, కాని ఏదీ నిశ్చయం కాదు.

చివరగా ఉన్నది దర్శన అతిమానసం[11]. ఇది దర్శనం[12] లేదా సాక్షాత్కారానికి పోలినది. ఇది ఎప్పుడూ సత్యమే. దానికేదీ ఎదురు నిలువ జాలదు. అది విజ్ఞానం, తనకు తానుగా తన సహజ శక్తితో సాఫల్యం పొందగలిగేది.

నేను వీటన్నిటి మధ్య తారతమ్యాలు తెలియజేయాలి. దర్శన అతిమానసాన్ని భౌతికంలోకి తెచ్చే ప్రయత్నం చేయాలి. ఈ విధంగా, ఎగువకు, దిగువకు ఒక స్థిరమైన త్రోపులాట ఉంటుంది. ఇప్పుడు సత్తా అంతా చైతన్యవంతం కాబడింది. కాని, కావల్సిందేమిటంటే, ఏ శక్తీ కూడా, భౌతికంపై దాడి చేయగలగ కూడదు. రెండవ దేమంటే — దర్శన అతిమానసాన్ని లోపలి విషయాలపై ప్రయోగించాలి. మూడవది — దర్శన అతిమానసాన్ని, బాహ్య విషయాలపై ప్రయోగించడం. ప్రస్తుతం అతిమానస శక్తి భౌతికంపై దాడి చేసే ఏ శక్తినైనా పారదోలగలదు. ఈ ప్రక్రియ పూర్తి అయినపుడు,ఏ ఎరుకగల శత్రుశక్తి అయినా, భౌతికంపై ఏమాత్రం దాడి చేయజాలదు.

ఈ సందర్భంగా నేను పాండిచ్చేరి వచ్చినప్పుడు, నా కివ్వబడిన ఒక ప్రణాళికను అనుసరిస్తున్నాను.

Ibid, pp. 298-300, 15-8-1923

అనువాదం: యస్. వై. సోమయాజులు

---

1. Supramental 2. Dragon 3. Suprmentalisation 4. Mental 5. Vital 6, Plane 7. Intutive mind 8. Interpretative mind 9. Possibility 10. Potential 10 A. Representa tive Supermind 11. Imperative Supermind 12. Revelation

యోగ లక్ష్యం — నియమాలు

శ్రీఅరవిందులు: ఈ రోజు నా నుండి ఒక సందేశాన్ని ఆశించడం మీ కొక సంప్రదాయంగా మారింది. నిశ్చల నీరవ దివ్యచేతన ద్వారా దాన్నందించడానికే నేనెక్కువ యిష్టపడతాను. ఎందుకనంటే మాట ద్వారా అయితే అది మనస్సుకు చెప్పినట్లవుతుంది., కాని నిశ్చల నీరవ దివ్యచేతన ద్వారా అయితే అదింకా లోతుకు చేరవచ్చు. యోగం పేరుతో చలామణీ అవుతున్న యితర పద్ధతుల కన్నా భిన్నమైన కొన్ని అత్యావశ్యకాంశాలపై మేము కలిసి సాధన చేస్తున్నాం. పాత పద్ధతి ప్రకారమైతే పురుషుడు ప్రకృతి మధ్య, సచేతన అంతరాత్మ ప్రకృతికి మధ్య, తారతమ్యం తెలుసుకోడానికి బుద్ధిని, భావావేశాన్ని లేక సంకల్పాన్ని యెంచుకోవాలి. తద్వారా అనంత జ్ఞానం దగ్గరకు, సర్వ ప్రేమికుని, సర్వ సుందరమైన పురుషోత్తముని దగ్గరకు లేక ఒక అనంత నిర్వ్యక్తిక దైవేచ్ఛ దగ్గరకు లేక మన మనస్సుకు, భావావేశ అస్తిత్వానికి, లేక దైవేచ్ఛ, లేక మన వ్యక్తిగత పురుషుని కావలగా వున్న నిశ్చల నీరవ బ్రహ్మం దగ్గరకు చేరతాం.

మన యోగం ఒక నిర్వ్యక్తిక అనంత జ్ఞానం, దివ్యేచ్ఛ లేక మహదానందాలను లక్ష్యంగా చేసుకోదు. పరిమితమైన అనంత మానవ జ్ఞానానికి ఆవలగా వున్న పురుషోత్తముని అనంత దివ్యజ్ఞానాన్ని, మన వ్యక్తిగత సంకల్ప మూలమైన అనంత దివ్యశక్తిని, భావావేశాల ఉపరితల కదలికలచే చిక్కించుకొనలేని మహదానందాన్ని సాక్షాత్కారం పొందడాన్ని మన యోగం లక్ష్యంగా చేసుకుంది.

మనం సాక్షాత్కరింప జేసుకోవాలనే యీ పురుషోత్తముడు నిర్వ్యక్తిక అనంతత కాదు; అతడొక దైవమూర్తి. ఆయనను సాక్షాత్కరింప జేసుకొనడానికి మనం మన యథార్థ మూర్తిత్వాన్ని యెరుగ గలిగేటట్లు యెదగాలి. నీవు నీ స్వీయ ఆంతర అస్తిత్వాన్ని తెలుసుకోవాలి. ఈ దివ్య మూర్తిత్వం, ఆంతర మానసికం, ఆంతర ప్రాణికం, ఆంతర భౌతిక అస్తిత్వం, దాని చేతనగా అనేక సార్లు పొరపాటుగా వర్ణించబడింది కాదు. కాని, ఉన్నతోన్నతమైన దానితో ప్రత్యక్ష సమాచార సంబంధం కలిగి వున్నదేదో అది. ప్రకృతిలో మనిషి క్రమానుగత యెదుగుదల వల్ల అతిమనస్సులో వున్న తన స్వంత దివ్యమూర్తిని ప్రతి వ్యక్తీ సాక్షాత్కరింప జేసుకోవాలి. సారతః ప్రతి వ్యక్తీ దైవంతో యేకమయ్యే

వున్నాడు., కాని స్వభావరీత్యా ప్రతివ్యక్తీ పురుషోత్తముని పాక్షిక అభివ్యక్తి.

మన యోగ లక్ష్యం అటువంటిదైనందున మనం తిరిగి జీవితంలోకి వచ్చి దానిని రూపాంతరీకరించాలి. పాత యోగాలు జీవితాన్ని రూపాంతరీకరించడంలో విఫలమైనాయి. ఎందుకనంటే, అవి మనస్సు దాటి ఆవలకు పోలేదు. అవి మానసిక అనుభావాలనే చిక్కించు కొనడాని కలవాటు పడి, వాటిని జీవితాని కన్వయించే టప్పటికి అవి మానసిక సూత్రాలుగా కుంచించుకు పోయాయి. ఉదాహరణకు, అనంతత్వపు మానసిక అనుభవం, లేక విశ్వజనీన ప్రేమ సూత్రం అన్వయం.

అందుచేత మనం మన అస్తిత్వపు అన్ని భూమికల పైన సచేతనులం కాగలిగేటట్లు ఉన్నత వెలుగును, శక్తిని, ఆనందాన్ని, జీవితానికి సంబంధించిన అత్యంత బాహ్యమైన చిన్న చిన్న విషయాలను గూడా శాసించడానికి క్రిందికి తీసుక రాగలిగేటట్లు యెదగాలి. మనల్ని మనం వీటి నుండి విడదీసుకొని ప్రకృతిలో జరిగే దానంతటినీ గమనించ గలగాలి. ఒక చిన్న కదలికైనా, బాహ్యానికి సంబంధించిన అత్యంత సూక్ష్మ విషయమైనా మన దృష్టి దాటి పోగూడదు. ఈ ప్రక్రియ మానసిక, ప్రాణిక భూమికలపై తేలిక. కాని భౌతిక — ప్రాణిక, భౌతిక భూమికలపై అజ్ఞాన శక్తులు తమ ఆధిపత్యాన్ని, పాలనను పూర్తి వత్తిడితో కొనసాగిస్తున్నాయి. తాము నమ్మినదే శాశ్వత ధర్మాలని గట్టిగా పట్టుక్కూర్చొంటాయి. అవి ఉన్నత వెలుగును అడ్డుకొంటూ తమ జెండానే ఎగుర వేస్తాయి. అక్కడ అంధకార శక్తులు తిరిగి, తిరిగి, అస్తిత్వాన్ని కప్పివేస్తుంటాయి. భౌతిక-ప్రాణికం తెరుచుకొన్నప్పుడు గూడా అజ్ఞాన మూలకాలు భౌతిక అస్తిత్వపు క్రింది అంతస్తులలో నుంచి పైకి వస్తాయి. వాటితో వ్యవహరించడమనేది యెంతో గొప్ప సహనం వుంటేనే గాని కాని పని. భౌతిక-ప్రాణికం మరియు భౌతిక సత్త ఉన్నత ధర్మాన్ని అంగీకరించకుండా, పట్టుదలతో వుంటాయి. మేధోపరమైన, తదితర సమర్థనల ద్వారా తమ పట్టుదలను, తమ క్రీడను సమర్థించుకొంటాయి. అవి సాధకుడిని వివిధ మారువేషాలతో మోసగించ ప్రయత్నిస్తాయి.

సాధారణంగా ప్రాణిక అస్తిత్వం బాగా అసహనంతో వుంటుంది. భౌతిక-ప్రాణిక, భౌతిక భూమికలపై పనులు త్వరగా జరిగిపోవాలని కోరుకొంటుంది. ఇలా కోరుకొనడం వల్ల చాలా తీవ్రమైన ప్రతిచర్యలు జరుగుతాయి. అందుచేత

మానసిక, ప్రాణిక అస్తిత్వాలు, ఉన్నత వెలుగును, శక్తిని చిక్కించుకొనడానికి బదులు అవి తమంత తాముగా ఉన్నత శక్తికి సమర్పణ అవ్వాలి. పాక్షిక రూపాంతరీకరణంతో మనం సంతృప్తి చెందకూడదు. ఉన్నత శక్తిని భౌతిక భూమికకు, క్రిందికి తీసుకు వచ్చి దానితో జీవితానికి సంబంధించిన బాహ్య అల్పాంశాన్ని గూడా శాసించ గలగాలి. మనస్సు వాటిని నియంత్రించ లేదు. మన ప్రస్తుత స్వభావాన్ని రూపాంతరీకరించడానికి మనం ఉన్నత వెలుగును, శక్తిని, ఆనందాన్ని క్రిందికి ఆవాహన చేయాలి. ఇందుకు అస్తిత్వపు ప్రతి భాగంలోనూ, అత్యంతావశ్యకమైన సంపూర్ణ చిత్తశుద్ధి వుండాలి. కేవలం పరమ సత్యాన్ని గాక మరి దేనినీ కాంక్షించని, పరమ సత్యాన్ని మాత్రమే కాంక్షించే ఆ చిత్తశుద్ధే అస్తిత్వంలో జరిగేదాన్నంతా స్పష్టంగా గమనించ గలుగుతుంది.

అతిమనస్సులో వున్న తన దైవమూర్తిత్వాన్ని యెరుగ గలిగేటట్లు యెదిగి జీవితపు అత్యంత సూక్ష్మ విషయాన్ని కూడా శాసించాలనేది క్రిందికి దిగి వచ్చే దివ్య వెలుగు రెండవ నియమం.

అనుభవాలతో సంతృప్తి పడే ధోరణి కొన్ని సమయాల్లో సాధకుడిలో వుంటుంది. కేవలం అనుభవాలతో సంతృప్తి పడి వుండిపో కూడదు.

మరో విషయ మేమిటంటే ఇక్కడ మనం ఉన్నాం గనుక, మనందరం ఒకే పరమ సత్యాన్వేషణలోనే యెప్పుడు కూడా ఒక విధంగా సంఘటితమై వున్నందున, మనమంతా పరస్పరం సహాయం చేసుకోగలం, లేక పురోగతిని మందగింపజేయగలం.

మనల్ని మనం ఉన్నత వెలుగుకు తెరచుకోవడం, దానికి పరిపూర్ణంగా సమర్పణ గావడం అనేవి అస్తిత్వ రూపాంతరీకరణకు నియమాలు. పూర్తిగా ఆవశ్యకమైన చిత్తశుద్ధిని దివ్యవెలుగుకు తెరచి సమర్పించడం, అన్ని భూమికలపై క్రమంగా చేతన వృద్ధి చెందడం వల్ల, నీవు యీ యోగానికి ఒక ఆదర్శవంతమైన సాధకుడిగా తయారు చేసే రూపాంతరీకరణను కొని తెస్తావు.

ibid., 305-7, August 15, 1924

ప్రపంచ క్రియాశక్తుల జ్ఞానం అవసరం

శిష్యుడు: ప్రపంచంలో పని చేస్తున్న క్రియాశక్తులను గురించిన జ్ఞానం

యోగంలో అత్యవసరం అని మీరు భావిస్తారా?

శ్రీఅరవిందులు: అవును! నీవు ప్రపంచ క్రియాశక్తులతో వ్యవహరించవలసి వుంటుంది. ఎందుకనంటే అవి తమను తాము, ముఖ్యంగా అపకార శక్తులు వున్నాయని చూపుకొంటాయి. అలాగే నీకు సహాయం చేసే శక్తుల్ని గూడా నీవు తెలుసుకోవలసి వుంది. వ్యక్తిగత సాధన చేస్తున్నప్పటికీ విశ్వజనీన శక్తులు తామున్నామని నీకు తెలియ జేసుకొంటాయి. నీవు అభివృద్ధి చెందిన కొద్దీ వాటి లక్షణం మారుతుంది. ఈ ప్రపంచ క్రియాశక్తుల కదలిక నిమ్న భూమికలపై ప్రారంభం కాదు. అది చాలా ఊర్ధ్వాన జరుగుతుంది. నిర్ణయాలన్నీ ఊర్ధ్వాన యెక్కడో పైన జరుగుతాయనేది యధార్థమే, కాని అవి యే భూమికలకు చెంది నవో, ఆ విషయం తెలియనివ్వకుండా ఒక తెర వుంటుంది. ప్రతి భూమికకు తన నిర్ణయం తాను తీసుకొనే స్వేచ్ఛ వుంటుంది. పోటీ పడుతున్న క్రియాశక్తుల నిర్ణయానికే పెనగులాట వదలివేయ బడుతుంది. ఒక నిర్ణయాత్మక మలుపు తిరిగి నప్పుడే అత్యున్నతమైన నిర్ణయం తెలుస్తుంది. తక్కువ దానికి సంబంధించిన జ్ఞానాన్ని తెలుసుకొనడానికి ప్రయత్నించడం ద్వారా మాత్రమే నీలో మహనీయ జ్ఞానం పెరగడానికి సహాయపడ గలవు....

ఆ ప్రయత్నానికి యేకీకృత ఆకాంక్ష చేత నీవు సహాయం చేయగలుగు తావు. ఈ ఆదర్శాన్ని ఫలప్రదం చేయడంలో అడ్డుగా నిలిచే దాన్నంతటినీ నీవు తిరస్కరించాలి, కాని అలా చేయడానికి బదులు, అపకార శక్తుల సూచనలను సమ్మతిస్తూ పోతుంటే నీకు గాని, యితరులకు గాని అది సాధ్యం కాదు అనే భావాన్ని కలిగించే వాటి మంత్రాలను జపిస్తుంటే, వాటి కప్పుడు సహాయం చేసిన వాడవవుతావు.

Ibid : 323; August 15, 1925

అనువాదం: కె. వి. రావు

మరణము, అమరముల మధ్య సమస్య

శిష్యుడు: సాధన స్థాయిలో మృత్యువు పై తమరి అభిప్రాయమేమిటి?

శ్రీఅరవిందులు: నా స్వవిషయంలోనా?

శిష్యుడు: అవును.

శ్రీఅరవిందులు: నా విషయంలో మృత్యువు మూడు రకాలుగా రావచ్చు.

1. హఠాత్తుగా సంభవించే ఆశ్చర్యకర విషయం మరియు ప్రమాదము

2. వయసు ప్రభావం.

3. నా స్వీయ ఎన్నిక, ఇప్పుడు ఈ సమయంలో కుదరదు అని భావించడం, లేదా ఇప్పుడు జరిగే అవకాశం లేదని నిరూపించే విషయం నా దృష్టికి తేబడి నందువలన.

శిష్యుడు: ప్రాణికంలో ప్రశాంతి, శక్తి, ఆనందాలు నెలకొన్నప్పుడు కొన్నిసార్లు ఈ శరీరం కూడా అమరమైనదిగా భావిస్తాం.

శ్రీఅరవిందులు: అది ప్రాణికము తన ప్రకాశ ప్రభావాలన్నిటినీ భౌతిక శరీరంపై ఆపాదించటం వల్ల జరుగుతుంది. ప్రాణిక పురుష యొక్క అమరత్వం శరీరంపై అమరత్వ భావనను సృష్టిస్తుంది. అయితే, అది వాస్తవమైన విజయం కాదు. స్వామి బ్రహ్మానంద (ఛంధోడ్ నివాస్) వయసు ప్రబావం పడకుండా 300 ఏళ్ళు జీవించారు, అయితే ఓ రోజు తుప్పు పట్టిన చిన్న మేకు గుచ్చుకుని, ఆ చిన్న గాయం కారణంగా మరణించారు. భౌతిక స్తరంలో మనం ఇంకా సాధించని దేదో ఎదురై విజయం సంపూర్ణం కాలేదని చూపిస్తుంది. అందువల్ల ప్రక్రియ అంత సుదీర్ఘంగా కొనసాగుతుంది. నీవు ఉన్నత చైతన్యాన్ని నీ శరీరంలోని ప్రతి అణువులోను స్థాపించాలి, లేనట్లయితే, నిన్ను భౌతికంలో దాగి, నీ దృష్టి నించి తప్పించుకున్నవి, దుష్టశక్తులకు తెలిసినవి, నీవు బలహీనస్థితిలో ఉన్న ప్పుడు అదను చూసి దాడి చేయగలవు. అవి ప్రత్యేక సందర్భాలను సృష్టించి, నీవు ఎదుర్కొలేని సంఘటనలను సృష్టించి, నీవు వాటిని నిరోధించే ముందుగానే అవి నీ అదుపు తప్పించుకుంటాయి. అలాంటి స్థితిలో అవి నిన్ను నాశనం చేయ గలవు.

శిష్యుడు: భౌతికం ఎందుకు అంత మొండిగా అస్పష్టంగా ఉంటుంది?

శ్రీఅరవిందులు: సరే! అది స్వాభావికం. అది ఒక నియామకం. భౌతికం ఆ విధంగా ఉండకపోతే ఆ పని చాలా సులభంగా ఏనాడో సాధించి ఉండేవాళ్ళం. ఈ విధంగా కల్పాలు, మన్వంతరాలు పట్టేది కాదు. అప్పుడు సాధన చాలా సులభ సాధ్యం అయిఉండేది. కాని దైవం అంత సుళువుగా అది జరగాలని కోరదు.

శిష్యుడు: అది ఎప్పటికి పూర్తవుతుంది?

శ్రీఅరవిందులు: భవిష్యవాణిని చెప్పమంటున్నావా? అది పూర్తిగా నా మీద ఆధారపడదు. కాలం గురించి చివరిదాకా ఎవరికి తెలియదు. దానికి పరిమితి నిర్ణయించడం దానిని పొడిగించడ మవుతుంది. "స్వరాజ్యం ఒక్క సంవత్స రంలో" అనడం లాంటిది. దానితో పాటు కార్యాచరణలో భాగం పంచుకొనే యోగికి ఆ పరాత్పరుడు అన్ని విషయాలు చూపడు. విశ్వస్థితులు తయా రుగా ఉన్నప్పుడే అన్ని విషయాలు అతడికి చూపబడతాయి. స్వార్థం విడనాడిన వారు మరింత ఎక్కువుగా అన్నింటిని దర్శించ గలరు. విశ్వ పరిస్థితులు సానుకూలం గాకముందుగానే దైవం ప్రతి సూక్ష్మ విషయాన్ని నిర్ణయించడు, ఒక ఆవశ్యక నిర్ణయాన్ని మనపై విధించడు. ఈ మధ్యలో అంతా ప్రకృతి శక్తుల కార్యాచరణ. దైవాని కిదంతా తెలియనిది కాదు. విశ్వస్థితులు తయారయ్యేదాకా అతడు మధ్యలో కలుగ జేసుకోడు. విశ్వస్థితులు రూపొందించే నిర్ణయమే దైవ నిర్ణయం కూడా.

శిష్యుడు: భౌతికానికి సంబంధించి విశ్వస్థితులు ఫలించాయా?

శ్రీఅరవిందులు: భౌతిక చైతన్యం విషయంలో సాధారణ స్థితులు ఫలించాయి, కాని అత్యంత భౌతిక స్థాయికి చెందినవి ఇంకా అలాగే వున్నాయి. అదే అత్యంత ప్రమాదభరితమైనది.

శిష్యుడు: ఎందుకది అంత ఎక్కువ ప్రమాదకరం?

శ్రీఅరవిందులు: ఎందుచేతనంటే అది దృఢమైనది, సంక్లిష్టమైనది, తన స్వీయ పదార్థాన్ని వదిలివేయగలదు, తిరస్కరించగలదు. అది హేతువుకు లొంగదు. దాని మీద పని చేయాలంటే అతి ఉన్నతమైన దివ్యశక్తి కావాలి. అదీకాక విశ్వంలో సంస్కారం మొత్తం స్థిరపడిన భావన నీ కృషికి విరుద్ధంగా పనిచేస్తుంది. పైనించి

ఏదో ఒక అవరోహణ జరిగి ఆ అవరోధాన్ని తొలగించాలి.

ibid, p. 311, August 15, 1924

అనువాదం: డి. సత్యవాణి

అతిమనస్సు— అపోహలు

జీవితకాలంలో అతిమానస అస్తిత్వం, అతిమానస ప్రపంచం, అతిమానసస్వభావం, వీటి ఆవిష్కరణను దర్శించడమే మన యోగం యొక్క ఆశయం. అయితే, ఈ లక్ష్యసాధనలో తలెత్తే కొన్ని సామాన్యమైన అపోహల నుండి మనలను మనం కాపాడుకోవాలి. కొందరు అనుకొంటారు, అణిమ, గరిమ లాంటి సిద్ధులు లేక శారీరక ధర్మాలను వశపరచుకొనుట, వ్యాధులను నయం చేయుట లాంటి శక్తులను పొందడం శారీరక అతిమానసీకరణ సాధ్యమవుతుందని. చాలావరకూ ఎవరైతే, తెలిసో తెలియకనో తమను తాము అవచేతనా అస్తిత్వముతో — ఈ శక్తులు నిక్షిప్తమై వున్న చోట సంపర్కమొందుతారో వారికి ఈ శక్తులు సమకూరుతాయి.అయితే అసలు అతిమానసం గురించి గాని, యోగం గురించి గాని, ఏ మాత్రం అవగాహనలేని వారిలో కూడా ఈ శక్తులు సిద్ధించిన సందర్భాలు కోకొల్లలు.

గతంలో ఈ యోగసాధన లెక్కలేనన్ని సార్లు ప్రయత్నించబడిందని, దివ్య కాంతి దిగివచ్చిందని, కానీ మళ్ళీమళ్ళీ అది వెనుకకు మరలి పోయిందనే ఒక నమ్మకం వుంది. ఇది వాస్తవ మనిపించుటలేదు. తరచి తరచి చూసినా అతిమానస శరీరం క్రిందికి కొనితేబడినట్లుగా నాకు కనిపించదు. అదే జరిగివుంటే, అది తప్పక ఇక్కడ వుండేది. అందువలన మనం మన ప్రయత్నాన్ని చులకన చేసి దానిని సాధించే మార్గంలో ఆటంకములు సృష్టించరాదు.

అంతిమంగా తుది పరిణామం ఏ విధంగా నుంటుందో వివరించడానికి తగు సమయం ఆసన్నం కాలేదు. సనాతన యోగులు వారి జీవితకాలంలో సాక్షాత్కరింప జేసుకొన్నది చాలా మట్టుకు శారీరక ధర్మాలకన్నా మించి ప్రాణికసత్తపై పట్టు సాగించడం వలన. ఇలాంటి ప్రాణిక సిద్ధి కాదు మన లక్ష్యం — మన లక్ష్యం ప్రాణిక శక్తి ద్వారా భౌతిక పదార్థంపైనా, దాని ధర్మాలపైనా నియంత్రణ

సాధించటం. మన ప్రయత్నమంతా మన అస్తిత్వం యావత్తూ, దాని భూమిక లన్నింటి యందలి ఆవిష్కారములను సైతం పరిపూర్ణంగా రూపాంతరీకరించడం. ప్రాచీన సాంప్రదాయాలలో లక్ష్యం భౌతిక సత్తను రూపాంతరీకరించటం గాని లేక దానిపై విజయం సాధించటం గాని కాదు. అవి భౌతిక సత్తపై ఎలాంటి పట్టును కలిగి వుండలేదు.

సమస్తము ఒకటేననే భావన ఉన్నది. అందుచేత మనం చేయవలసింది ఆ ఏకైక దివ్యచేతన అనుభూతిని పొందటం, అటుపైన మన అస్తిత్వపు అనేక భూమికలపై దాని అనుభవాన్ని కొంత పొందటం. వేదాంత సూత్రాల భ్రాంతితో మనం ప్రభావితుల మైనందున ఈ భావన పొరపాటు. ఒకే ఒక దివ్యచేతన వున్నదని దానిని మనం దర్శించి తీరాలనుకొనుట యదార్థమే అయినప్పటికీ ఆ మాత్రపు గ్రహింపుతో మన మాగి పోగూడదు. నేనిప్పుడు చెప్పినట్లు మన పూర్తి సత్తను రూపాంతరీకరించాలి.

మనయోగం సచేతనంగా సాగించే పరిణామ యత్నమనే భావన కూడా వున్నది. ఇక్కడ జీవాత్మ పదార్థముతో ముడిపడి వున్నది, దానికి లోబడినట్లుగా కనిపిస్తుంది. పరిణామప్రక్రియద్వారా ప్రాణిక, మానసిక సత్తలు ఇక్కడ తమ ఉనికిని చాటుకున్నాయి. కాబట్టి మనస్సును అతిమనస్సుగా ఎదగనీయాలనటమే మన ప్రయత్నమంతా....

తైత్తరీయోపనిషత్తు అంటుంది: భౌతికము ప్రాణికం లోనికి, అది మానసికం లోనికి తిరిగి అదే అతిమానసం లోనికి, దివ్యానందచేతన లోనికి, ఇముడ్చికోబడింది అని. మరో ఉపనిషత్తు అంటుంది: అతిమానస సిద్ధిపొందిన వ్యక్తి సూర్యుని ద్వారం గుండా తప్పించుకుంటాడని. అతిమానస స్థాయికి ఎదిగిన పిమ్మట జీవితం లోనికి ఆత్మ చైతన్యం తో కూడిన అవరోహణ గురించిన భావన వుండదు....

మన సాధనలో ఆరోహణ కదలిక ఏర్పడినట్లుగా గమనిస్తాము. అయితే దానితో సాధన పూర్తి అయినట్లు కాదు. కేవలం ఆరోహణతో తృప్తి చెంది విశ్రమించ కూడదు. మనం తిరిగి క్రిందికి దిగి రావాలి. చేతనా పూర్వకంగా అతిమానస వెలుగును, పరమసత్యాన్ని, సామరస్యతను కూడా క్రిందికి కొనిరావాలి. వాటితో మన స్వభావాన్ని — అనగా మన మనో ప్రాణ శరీరాలను — నియంత్రించాలి, పరిణమింపజేయాలి.

ప్రతి ఒక్కరు ఈ సాధన చేయగలరనే భావన ఒకటి వున్నది, కాని అది కేవలం పాక్షిక సత్యం. అందరికీ ఈ యోగసాధన చేయడానికి పిలుపు రాదు. అందరిలోను ఈ యోగసాధనచేసే సామర్థ్యం నిద్రాణమై వున్నదని అనవచ్చు, కానీ అది వారిని యోగసాధనకు సమాయత్తపరచేవరకు మాత్రమే ఉపకరిస్తుంది. మానసిక స్థాయిని విస్తృతపరచటం కష్టమైన, సుదీర్ఘ మైన, శ్రమతో కూడుకున్నది. నిమ్నస్థాయి కదలికలను, ప్రాణిక స్వభావాన్ని తిరస్కరించడం, అంతకన్నా కఠినతరమైన భౌతికసత్తలో మార్పును కలిగించడం లాంటి పనులను నిర్వహించడం అందరికీ సాధ్యపడదు. మనకు ముందుగా కావలసింది మన అస్తిత్వాన్ని యావత్తూ అతిమానస స్వభావంలోకి మార్చడం. దానితో అంతా అయిపోయినట్లు కాదు. మనమా మహాశక్తిని క్రిందికి ఆహ్వానించి దానిని మన బాహ్య జీవితంపై ప్రయోగించి, పరమసత్యాన్ని, సామరస్యతను అచ్చట కూడా నెలకొల్పాలి. నేను ఇంతకు ముందే వివరించినట్లుగా చిట్టచివరి రూపాంతరీకరణ రూపు రేఖలు ఏ విధంగా నుంటాయో తేల్చి చెప్పే సమయం ఇంకా ఆసన్నం కాలేదు. ఆ సమయం వచ్చినప్పుడు దానంతట అదే తేటతెల్లమవుతుంది. నీ నుండి అపేక్షించబడినది ఏమంటే నిన్ను నీవు పరమసత్యానికి అధికంగా ఉన్మీలుడవై వుండాలని. మిగతాదంతా పరమేశ్వరుని సంకల్పం మేరకు తనంతట తానుగా నెరవేరుతుంది.

ibid, p. 31, Aug. 1925

అనువాదం: దామెర.వెంకటేశ్వరరావు

నాది ఏకాంత యోగ సాధన కాదు.' యోగము దాని లక్ష్యములలో' యోగోద్దేశాలపై, మానవతను గూర్చి నేను వెలిబుచ్చిన సాభిప్రాయాల వెనుక, అవి ఎంతగానో నిరసించబడినప్పటికీ, సత్యత ఉన్నది. నా యోగం కేవలం మానవాళి కొరకు కాదన్నది సత్యమే కాని ఇతరులకు మార్గదర్శకం కావడం ముఖ్యం. నేను నా స్వీయ పరిపూర్ణతను, నా స్వంత విముక్తిని కోరుకొనివుంటే, అది ఏనాడో అంత రించి ఉండేది.

శిష్యుడు: ఆ దిశగా, భౌతిక భూమికలమీద పూర్వం ఎవరూ యత్నించినట్లు లేదని కదా మీ రన్నది.

శ్రీఅరవిందులు: లేదు. గతంలో అలాంటి ప్రయత్నాలు జరుగలేదని నేను అనలేదు. జరిగిన యత్నాలవల్ల భౌమ్యస్తరాలలో ఎలాంటి స్థిరత్వం సిద్ధించలేదనీ, ఏ మౌలికతా పాదుకొనలేదనీ నేనన్నది. సాధించింది అంగీకరించినట్లయితే, అది ఎంత అల్పమైన దైనా, ఎంత పాక్షికమైనదైనా, ఎంతటి అసంపూర్ణమైనదైనా, అది మానసిక, ప్రాణిక స్థాయిలలో ప్రతిఫలించి అవగాహనలోకి వచ్చేది. కానీ భౌతిక భూమికలలో అలాంటి దేదీ సంభవించలేదు.

శిష్యుడు: అంటే, అతిమానస చేతస్సును అవనికి దించడానికి అనువైన వాతావరణాన్ని సృష్టించడం తక్షణ కర్తవ్యమని భావించవచ్చా?

శ్రీఅరవిందులు: అవును. ఈ సారి అది సాధ్యం కావాలంటే పరిపూర్ణ ప్రయత్నం ద్వారా ఆ స్థితిని కల్పించాలి. (తనను చూపించుకొంటూ) కేంద్రం ఇక్కడున్నది. దాని నుంచి నీవు గైకొనవచ్చు. విజయం సాధించాలంటే మనమంతా కలసికట్టుగా వుండాలి. ప్రతికూల సూచనలకు తావిస్తే, అవి నీ ప్రగతిని నిరోధించడమే గాక, సార్వత్రిక పురోగతినికూడా అడ్డగిస్తవి.

శిష్యుడు: మరి, ఈ భౌతిక అవరోధాన్ని అదుపుజేయడం ఎలా?

శ్రీఅరవిందులు: అందుకు సమీకృత సమగ్ర ఆకాంక్ష అవసరం. ఒక్కోసారి సాధనలో మానసిక మాంద్యము, వ్యాకులతతో క్రుంగిపోవడం సంభవిస్తుంటుంది. ఔన్నత్య ఉనికి మరుగున మడుతుంది, జ్ఞానం మసక బారుతుంది. అలాంటప్పుడే అవసరమయ్యేది ఆకాంక్ష, విశ్వాసం — దీనినే "అంధవిశ్వాసం" అన్నారు రామ

కృష్ణులు. నిజానికి, ఆ అంధవిశ్వాసం ఆత్మ పాలిటి స్మృతి. అది సహాయకారిగా వుండి విచలిత హృదయానికి అండగా నిలుస్తుంది. మనోగత జాడ్య నివారణకు విశ్వాసం అవసరమైతే, అతిమానస చేతస్సును నేలకు దించడం దానికి అనివార్యం.

Evening Talks with Sri Aurobindo, recorded by A.B. Purani, pp. 329, Aug 15 1925

అనువాదం: నాగరాజు రామస్వామి

ప్రపంచ స్థితిగతుల సంసిద్ధత లక్షణాలు

శిష్యుడు: ఇంతకు ముందుకన్నా ప్రస్తుతమున్న విశ్వపు స్థితిగతులు ఎలా అతిమానస అవతరణకు సంసిద్ధంగా ఉన్నాయి?

శ్రీఅరవిందులు: మొదటిది, భౌతిక ప్రపంచపు విజ్ఞానం ఎంతగా విస్తరించిందంటే అది తన అవధులను తానే దాటి పోతుంది.

రెండవది, విశ్వవ్యాప్తంగా బాహ్య, అంతర మనస్సు; బాహ్య, అంతర ప్రాణికం; బాహ్య-అంతర శరీరాల మధ్య తెరను ఛేదించే ప్రయత్నం జరుగు తుంది. మనుషులు మరింత చైత్యపురుష చేతనను కలిగి ఉంటున్నారు.

మూడవది, ప్రాణికచేతన శరీరంపై ఇంతకు ముందెప్పుడూ లేనంత నియం త్రణ కలిగి ఉండటానికి ప్రయత్నిస్తుంది. ఉన్నత సత్యం దిగివచ్చే ముందు ఈ విముఖ ప్రాణిక చేతనను ఉపరితలం మీదకు విసిరి వేయడం అనేది ఒక సంకేతం. దీని వలన ఎన్నో విపరీతమయిన, అసాధారణమైన, ప్రాణిక ఆవిష్కరణలు కనిపి స్తాయి. ఎక్కువమంది మతిభ్రంశం చెందటం, భూకంపాలు రావటం మొదలయి నవి. అధునాతన శాస్త్రి పరిశోధనల వలన ప్రపంచం మరింత ఏకం అవుతుంది, విమానాలు, రైలు మార్గాలు, దూర తంత్రీవార్తలు మొదలయినవి. అటువంటి ఐక్యత ఉన్నత సత్యం దిగిరావటానికి తగిన స్థితి. అదే మనకు కష్టం కూడా.

నాలుగవది, అసంఖ్యాకంగా జనులను ప్రాణికంగా అత్యంత ప్రభావితం చేయగల వ్యక్తుల ఆవిర్భావం. ఇవన్నీ ప్రస్తుత విశ్వస్థితి మరింత సంసిద్ధంగా ఉన్న దూచెప్పే లక్షణాలే. మనకు పూర్వపు ప్రయత్నాల గురించి ఏ మాత్రం

తెలియదు. ప్రస్తుతం మనం చూస్తున్న దానిని బట్టి, యిప్పుడున్న పరిస్థితులు ప్రయత్నానికి అనుకూలంగా ఉన్నాయి.

Evening Talks with Sri Aurobindo, A.B.Purani, P.23, Aug 15, 1925

అనువాదం: డా. సరోజా ప్రసాద్

భాగాలన్నీ చురుకుగా సహకరించుకొనవలసిన అవసరం

ఈ రోజు ఆగష్టు 15 ను గురించి కొద్ది మాటలు చెబుతాను. ఆ యోగలక్ష్యం ఏమిటి, ఆ యోగం ఏమిటి. అవి సూత్రప్రాయంగా నీకు తెలుసు. భువిపై సాధారణ మానవుని సంతృప్తిపరచే చేతన గాక యితరమైన ఒక దివ్యచేతన, ఒక దివ్యశక్తి, ఒక దివ్య వెలుగు, ఒక దివ్య సత్యతను క్రిందికి తీసుకురావటం. భువి చేతనను ఉద్ధరించి యిక్కడ ఉన్న ప్రతిదానినీ రూపాంతరీకరించే విధి నిర్దేశిత ఒక దివ్యచేతన, ఒక దివ్యశక్తి, పరమసత్యపు వెలుగు, ఒకదివ్య సత్యతను క్రిందికి తీసుకురావడం.

ఊర్ధ్వంలో నిర్ణయం జరక్కపోతే, అదిక్కడ చోటు చేసుకోదు. భువి చేతనే స్వయంగా, దానిలో ఒక భాగమో ఈ నిమ్న భూమికలపై నివసించేవారిలో కొంత మంది దానిని స్వీకరించుటకు సిద్ధంగా వుంటే తప్ప అది జరగదు. ఒకసారి యీ దివ్యచేతన, దివ్యశక్తి అవతరిస్తే, అదంటే యిష్టపడేవారికి, దానిని స్వీకరించదగిన వారికోసం యెల్లకాలమూ, ప్రతిరోజు అదిక్కడే వుండిపోతుంది. అయితే మనం ఈ రోజుకొక ప్రత్యేక ప్రాముఖ్యతను కట్టబెట్టాం. అది సంకేతపరంగా తెలియజేసే పరమసత్యపు వెలుగులో మనం నివసించినపుడు అది సమర్థనీయమౌతుంది. వ్యక్తి పురోగతి సాధారణ పురోగతి దశకు యీ ఈరోజును ఒక గుర్తుగా పెట్టుకోవచ్చు. ఒక సమర్పణా దినంగా, ఆత్మ పరిశీలనా దినంగా, భవిష్యత్తులో వేయబోయే ముందడుగుకు సన్నాహకంగా, సాధ్యమైతే, పురోగమన కార్యాన్ని ముందుకు తీసుకుబోయే ఒక విశిష్ట దివ్యశక్తిని స్వీకరించే దినంగా గుర్తింపు పొందవలసిన రోజు అది. అతడు యదార్థ వైఖరిని స్వీకరించి, సరైన స్థితులలో ఆ రోజున నివసిస్తే, అప్పుడు వ్యక్తిగతంగానే ప్రతివ్యక్తిలోనూ జరుగుతుంది. నేనా రోజున మాట్లాడిన దాన్లోని అర్థం యిదే. ఈ అర్థంలో దానినొక నిశ్చయాత్మక

దినంగా చేయగలిగిన వాళ్ళం మనమే. అది సఫలం అవడానికి సహాయంచేసే వాళ్లమూ మనమే.

మొదటినుంచి వుండవలసింది సమర్పణ. మనం యెంతవరకు చేరు కొన్నాం, మనలో యేది సంసిద్ధంగా వుంది, మనలో యింకా మార్పు చెందని దేమిటి? మార్పు చెందవలసింది ఏమిటి? సంపూర్ణ రూపాంతరీకరణకు వెనుకగా నిరీక్షిస్తున్న దేమిటి? యేది ఇంకా నిరోధిస్తోంది, యింకా అస్పష్టంగా వున్నదేమిటి? అని అంతరంగం లోపలి వైపుకు చూచుకోవడం వుండాలి. ఆకాంక్ష తప్పక వుండాలి. మనం అవసరం అని తెలుసుకొన్న మార్పు జరగడానికి ఆ దివ్యశక్తిని క్రిందికి పిలువడం వుండాలి.

ఈ రోజున మనల్ని మనం బయటకు నెట్టుకొంటుంటే యిదంతా చేయలేం. కాని ఒక తీవ్రమైన ఏకాగ్రతతో ఆంతర అస్తిత్వం సంసిద్ధమై దివ్యవెలుగును స్వీకరించ గలిగితే అది చేయగలం. ఆ కదలికను మనం యెంతగా అనుమతి స్తామో అదే నిష్పత్తిలో ఉన్నతమైనది మనలో పనిచేయడాన్ని చెడగొడతాము. ఆంతరిక పరివర్తన కార్యానికి అవసరమైన ఊర్జాన్ని దుబారా చేస్తాం. ఇతర సాధారణ దినాల్లో చేసేదాని కంటే, యితరమైనదేది చేసినా అది కదలికలో భాగంగా, లేక అస్తిత్వపు శివార్లలో నిలిపి వుంచబడినదానిగా, ఆంతరిక కదలికను చెడగొట్టని దానిగా చేయాలి. ఆ రోజున జరిగే సాంప్రదాయకమైన వాటి నన్నిం టినీ, పురోగమనానికే ఉపయోగించాలి.

మీరు యీ ఉదయం నా దగ్గర కొచ్చారంటే, అది ఒక సంప్రదాయాన్ని పాటించడానికి గాక, మీ అంతరాత్మలతో, మనస్సులతో స్వీకరించటానికి సిద్ధమై వచ్చారన్నమాట. ఇప్పుడు నేను చెప్పినదానిని విన్నప్పుడు అది కేవలం మీ మానసిక ఆసక్తిని స్పృశించి, మానసిక ఆసక్తిని సంతృప్తి పరచడం మాత్రమే జరి గితే, నేను మాట్లాడకుండా మౌనంగా వున్నదాంతో సమానం. కాని అది ఆంతరిక అస్తిత్వంలో యెక్కడో అంతరాత్మను తాకితే, అప్పుడే యీ రోజుకొక ఉప యోగం వున్నట్లు, లేక ఒక కార్యం వున్నట్లు అవుతుంది. ధ్యానం కూడా అటువంటి పరిస్థితులను నెలకొల్ప గలిగితే, నిశ్చయాత్మకమైనదేదీ దిగిరాకపోయినా, కొంత

చొరబాటు వుంటుంది. దాని ఫలితాలు తరువాత లభిస్తాయి. మన యోగం దృష్ట్యా ఆగస్టు 15 కున్న యేకైక అర్థం అదే.

శ్రీఅరవిందులు

స్వేచ్ఛానువాదం: కె.వి.రావు

పనిని అంచనా వేయడం

కార్యనిర్వహణలో నీవెంత వరకు వచ్చావు, పని ఎంత మేర సాగింది మొదలగు వాటిని పరిశీలించడంలో కొన్ని విషయాలు జ్ఞాపకం ఉంచుకోవాలి.

అవి నువ్వు మనసుతో తెలుసుకుంటావు.

ప్రథమంగా, మిగిలిన యోగాలన్నింటికీ ఏవి లక్ష్యాలో అవి మనకి ప్రాథమిక స్థితులు లేక మొట్టమొదటి నియమాలు అని జ్ఞాపకం ఉండాలి. ఇదివరకటి యోగ మార్గంలో సాధకులు బ్రహ్మ చైతన్యం లేదా విశ్వ చైతన్యం లేదా ఏదో ఒక దివ్య శక్తి, దివ్య ప్రకాశాల అవరోహణ, శాశ్వతమైన దాని గురించిన సూచన..... వీటిని పొందడంలో తృప్తి పడేవారు.

మానసికమైన కొన్ని ఆధ్యాత్మిక అనుభవాలు కలిగితే చాలని అభిప్రాయపడి, పాక్షిక రూపాంతరీకరణ చెంది ప్రాణిక అస్తిత్వ స్పర్శతో తృప్తి పడ్డారు.

ఓ స్థిరమైన స్థితికోసం వాళ్ళు అన్వేషించి, విమోచన తుది గమ్యమని, అంతిమ లక్ష్యమని భావించారు.

ఇవన్నీ సాక్షాత్కరింప జేసుకొనుటకు ఆ అనంత విశ్వశక్తికి ఉన్మీల్యమై వాటి సూచనలను గ్రహిస్తూ, అనుభవాలను పొందుతూ, అహాన్ని సంపూర్ణంగా అధిగమించి విశ్వమనస్సును, విశ్వాత్మను, విశ్వశక్తిని సిద్ధింపజేసుకోవటం ఈ యోగంలో ప్రథమ నిబంధన.

మనం ఆ మహాచైతన్యాన్ని సూటిగా ప్రాణిక, భౌతిక, అస్తిత్వాల్లోకి దిగి వచ్చేలా పిలుపు నివ్వాలి, ఆకాంక్షించి ఆహ్వానించాలి. ఆ విధంగా పైనించి క్రిందిదాకా ఆ పరమోత్కృష్ట నిశ్చలత, విశ్వభావన నెలకొంటుంది.

ఇది సాధించకపోతే, రూపాంతరీకరణ యొక్క ప్రథమ నిబంధన ఫలించదు.

మనం తెలుసుకోవలసిన, గుర్తుంచుకోవలసిన రెండవ విషయం; అంతా

పరిపూర్ణంగా జరిగితే గాని, ఏదీ పూర్తిగా జరిగినట్లు కాదు. మనో ప్రాణిక సత్తాలను తెరచిఉంచి, శరీరాన్ని దాని అస్పష్టతకు వదిలివేయడం చాలదు.

అందువల్ల రూపాంతరంలో కూడా ప్రాణిక సత్తా రూపాంతరం చెందితే కాని మనసు రూపాంతరం చేయబడదు. ప్రాణికం రూపాంతరం చెందకపోతే దేనిని సాధించలేము. ఎందుకంటే ప్రాణిక అస్తిత్వమే పరివర్తనను సిద్ధింప చేసుకోగలదు. అందుచేత మనసు పాక్షికంగా మాత్రమే పరివర్తన చెంది, ప్రాణిక సత్త ఉన్మీల్యమైనా పాక్షికంగా మాత్రమే పరివర్తన చెందినపుడు, అది మన ఆశయ సిద్ధికి సరిపోదు. భౌతిక అస్తిత్వం కూడా ఉన్మీలనమై, పరివర్తన చెందితే తప్ప, ప్రాణిక అస్తిత్వ స్థితులన్నింటిలో మార్పు సాధించడం సాధ్యంకాదు. తనకు సరిపడని జీవన వాతావరణంలోకి ఆ దివ్యప్రాణశక్తిని సాక్షాత్కరింపచేసుకోవడం సంభవం కాదు.

బాహ్యంలో మనిషి రూపాంతరం చెందకపోతే, ఆంతరంగిక భౌతికసత్త పరివర్తన సాద్యపడదు. ఆంతరంగిక భౌతిక సత్త పరివర్తనకు అది సరిపోదు. ఈ యోగమార్గ ప్రక్రియలో ఒక సంపూర్ణ పూర్ణత్వం అన్నది ఉంది. దాన్ని పొందాలంటే ప్రతి స్థితి మరొక స్థితిపై ఆధారపడుతుంది. అందుచేత ఒకచోట ఆగిపోవడం బహుశా మరో జీవితానికి పరిస్థితులను తయారు చేసుకోవడం కావచ్చు కాని అది విజయం కాదు. ఏదైనా శాశ్వతంగా పరివర్తన చెందటానికి ముందు అంతా పరివర్తన చెందాలి. జ్ఞాపకం ఉండాల్సిన మూడోవిషయం; అంతా మార్పు చెంది సాధన సంపూర్ణంగా ఫలించాలంటే సంపూర్ణమైన సమర్పణ ఉండాలి. దాని అర్థం అస్తిత్వంలోని ఏ భాగంలోనూ మినహాయింపులు ఉండకూడదు. గత సాంప్రదాయ ఆలోచనలతోను మామూలుగా మనుషులు ఆచరించే పద్ధతులతోను రాజీ వడకూడదు. ఎక్కడైనా, ఏదైనా మినహాయిస్తే, దాని అర్థం సత్యాన్ని సంపూర్ణంగా అంగీకరించలేదని పాక్షిక విజయాన్ని పాక్షిక రూపాంతరాన్ని గత మార్గాలలో సాధించే తప్పు చేయడం అవుతుంది. మనం అజ్ఞానంలో మునిగి తృప్తిపడటానికి ఏ భూమికలను వదలకూడదు.

మనకు అలాంటి సూత్రాలు ఉండవు. సత్యానికి అసత్యానికి, పరాప్రకృతికి నిమ్నప్రకృతికి మధ్య ఏ విధమైన రాజీ లేదు.

ఇవన్నీ జ్ఞాపకం ఉంచుకుంటూ మనం మన సాధనని, కార్యాచరణని అంచనా

వేయాలి. ఇది ఒక అద్భుతంగా సాధించబడే విషయం కాదు. ఇది కష్టంతో కూడిన సుదీర్ఘ మార్గం. నిరాశాభావంతో కాకుండా చేయవలసిన దాని మీద దృష్టి పెట్టాలి. ఒక మహత్తరమైన, పరిపూర్ణమైన ఉద్యమ స్ఫూర్తితో సాధించ వచ్చు. ప్రతి అడుగు ఒక ఆనవాలుగా, అతీతం వైపు వేసే ఒక అడుగుగా, ప్రోత్సాహంగా బావించాలి. ఓ వైపు నిశ్చయం కుంటుపడకూడదు, విజయం సాధించి తీరాలనే ఉత్సాహం ఉండాలి, మరోవైపు అసహనంతో, నిస్పృహతో కూడిన కంగారుపడటం వుండకూడదు. దివ్యసంకల్పం కోసం ప్రశాంతతో కూడిన స్పష్టత, "అది మాలో జరగాలి అన్న నిశ్చల సంకల్పం", మరియు "అది మాలో జరగాలి, ఆ రీత్యా ప్రపంచంలో సంభవించాలి." అన్న ఆకాంక్ష ఉండాలి.

ibid, 326, August 15, 1925

అనువాదం: డి. సత్యవాణి

భౌతిక ప్రపంచంలో ఉన్న అవరోధము

సాధకుడు: ఈ సందర్భంగా మా ప్రయత్నాల సాఫల్యతను గురించి ఏమి సూచిస్తారు?

శ్రీఅరవిందులు: నేను చెప్పగలింగిదల్లా ఒక్కటే. నేను 'నైతికం' విషయంలో నమ్మకంతోనే వున్నాను. కాని ఆచరణలోనే అనుమానంగా వున్నది. ఎందుకంటే భౌతిక ప్రపంచంలో ఇంకా ఇంకా పశ్చాత్తాపం కలుగలేదు. ఇదే పెద్ద అవరోధం కదా మరి!

సాధకుడు: "పశ్చాత్తాపం కలుగలేదు" అనటంలో మీ ఉద్దేశ్యం ఏమిటి?

శ్రీఅరవిందులు: భౌతిక ప్రపంచం దివ్యత్వం గురించి కానీ దివ్యజీవనాన్ని గురించి గాని, పట్టించుకోవటమే లేదు అనేది సత్యం.

సాధకుడు: "భౌతికప్రపంచం యొక్క అవరోధం" అంటే మీ ఉద్దేశ్యం ఏమిటి?

శ్రీఅరవిందులు: భౌతికం దాని పరిధిని దాటి పైదిశగా చూడలేదు. తన అనుభవంలో లేని దానిని అవగాహనలోనికి తెచ్చుకోలేదు. మానలవుకు స్పష్టత లేదు. పైగా బుద్ధి మాంద్యం కూడా వుంటుంది. "వస్తుప్రపంచం (భౌతికం) కలిగించే అవరోధం"అని నేను అన్నానంటే, నేను బాహ్యప్రపంచాన్ని మాత్రమే దృష్టిలో

పెట్టుకోలేదు. సూక్ష్మ భౌతికమే నా దృష్టిలో వుంది. ఇది కూడా సత్యాన్ని అంగీక రించ లేదు. మనసూ అంతే!

దేహంలో ప్రతి జీవకణానికీ తనదైన చేతన ఉంటుంది. అది సత్యాన్ని అంగీక రించాలి. ఆ వైపుగా వికసించాలి. సాధారణమైన భౌతిక మనస్సు దివ్యత్వపు దిశగా పరిణామం చెందటాన్ని గాని, అట్టి అవకాశం ఉంటుందని కాని నమ్మలేదు. అందుకే నేను ఇదివరకే చెప్పినట్లు ఏదైనా సంపూర్ణంగా నెరవేరిన నాడే, అది సాధ్యపడిందని అనుకోవాలి.

సాధకుడు: మీరు "నైతికత" విషయంలో నమ్మనట్లు ఎలా చెబుతారు?

శ్రీఅరవిందులు: భౌతిక వాతావరణం లోనికి దివ్యశక్తి యొక్క ఆవిర్భావం గమని స్తున్నాను. క్రమేణా భౌతికం రూపాంతరంచెందుతున్న సూచనలు గోచరిస్తు న్నాయి కూడా!

Evening Talks with Sri Aurobindo, Recorded by A.B.Purani, P.325, Aug 15, 1925

అనువాదం: కె. ఆర్.ఎల్. నరసింహారావు

యోగం యొక్క లక్ష్యం జీవితాన్ని తిరస్కరించడం కాదు, జీవిత పరమార్థాన్ని ఈడేర్చడం

(ఒక సాధకుడు మోతీబాబుతో అన్నాడు: శ్రీఅరవిందులు శంకరాచార్యుల వారికి చేరువ అవుతున్నట్లుగా కనిపిస్తున్నది, ఆ సాధకుడు 1923 ఆగష్టు 15 న పాండిచ్చేరిలో శ్రీఅరవిందులను దర్శించినప్పుడు వారు అన్నారు, జీవితాన్ని ఉపేక్షించుటకు మనం అంగీకరించ కూడదని, సాధారణ జీవితం అజ్ఞాన భరితమై నందున దానిని తిరస్కరించటమే పరిష్కారమని శంకరాచార్యులవారు బోధిం చారు గనుక, శ్రీఅరవిందులు శంకరాచ్యులవారికి దగ్గరగా నున్నారు, అందు వలన వారినుండి కొత్తగా నేర్చుకోవలసింది చాలా తక్కువ అని)

శ్రీఅరవిందులు: ఈ భావన నా యోగానికి పూర్తిగా పెడార్థాన్నిస్తుంది.నా యోగ లక్ష్యం జీవితాన్ని తిరస్కరించటం కాదు, జీవితాన్ని సాఫల్యం చేయడం. సహజం గానే సాధారణ జీవితం అజ్ఞానమయం, అయితే, అజ్ఞానం లేకుండా జీవించడం

అసాధ్యమేమీ కాదు. నిజానికి చైతన్య భరితమైన జీవితమే పరిణామక్రమంయొక్క పరమార్థం. భౌతిక ప్రపంచంలోను, జీవితంలోను తెలియనిది అవిద్య అనబడేది ఒకటున్నది. చైతన్యవంతమైన జీవితం దిశగా సాగే మన పురోగమన బాటలో అది తీవ్రమైన అవరోధాలను సృష్టిస్తుంది. ఈ అవరోధాలను అతిమానస మార్గాల ద్వారా అధిగమించాలి. పైనుండి, క్రిందినుండి ఎన్నో మలుపులు, వక్రగతులు ఎదురవుతుంటాయి. వాటిని అర్థం చేసుకోవాలి. సాధారణ జీవిత శైలిని మార్చటా నికి వాటిని ఉపయోగించాలి. విజ్ఞానాన్ని శంకరాచార్యులవారు ఒక ఉన్నతమైన మానసిక చేతనగా భావించారు. అది మానసికం మాత్రమే అయినందున ఆ విజ్ఞానాన్ని వారు తిరస్కరించారు.శ్రీశంకరాచార్యులవారికి స్వయం వ్యక్తమగు సాక్షాత్కారంపై నమ్మకం లేదు, ఎందుకనగా వారి ప్రకారం అది మహామాయ. స్వయం వ్యక్తమయ్యేది దైవశక్తి యొక్క వాస్తవికత. దానిని అంగీకరించి తీరాలి. ఆ శక్తియే మనలో పని చేస్తుంది. ఆ శక్తితో ఏకమవటం మనకు సాధ్యం. ఆ విధంగా ఈ భూలోకంలో దైవసాక్షాత్కార కార్యంలో మనం భాగస్వాములం కావచ్చు. కొంత కాలం వరకు నేను కూడా ఆ విజ్ఞానాన్ని అర్థం చేసుకోలేక పోయాను. ఉన్నత మానసిక చేతన విజ్ఞానమని పొరపడ్డాను.

ధ్యాన మార్గంలో ఉన్నత చేతనను సిద్ధింపచేసుకోవడం చాలదు. దాని ఉనికిని సాధారణ జీవిత కార్యనిర్వహణలో సైతం అనుభూతి చెందాలి. అయితే అచ్చ మైన అతని మానసమే దివ్య చైతన్యం. ఈ ప్రపంచం యొక్క కదలికలను ఏర్ప రచి నడిపించేది అదే. ఈ చైతన్యం మన సహజ స్వభావం కావాలి. అది అవత రించి మన మనో ప్రాణ శరీరాలను రూపాంతరీకరించుటకు అనుమతించాలి.

మానవ ప్రయత్నం నిష్ప్రయోజనం. ఉన్నతతర శక్తి క్రిందికి దిగివచ్చి పని చేయాలంటే, సంపూర్ణ సమర్పణ అవసరం. అతిమానస చైతన్యం సిద్ధింప జేసు కోవడం కష్టమేమీ కాదు. కానీ దానిని క్రియాశీలం చేయటం అతి కష్టం. అందు వలన ఎందరో మహాత్ములు ఈ చైతన్యాన్ని బడసిన తరువాతనే మనస్సు ద్వారా కృషి సల్పి, దానిని మానసిక పరిమితులకు లోబడునట్లుగా మలిచారు. అందు వలన వారు అతిమానస చేతన దాని నిజలక్షణాలతో జరిపే కార్యాచరణను అను

భవించలేకపోయారు. ఈ కొత్త ప్రక్రియను ఎవ్వరూ ఇంతవరకు ప్రయత్నించి చూడలేదు.

Champaklal Treasures, P. 220-21.

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

ఆగస్టు 15, 1947 — భారతదేశానికి ఒక సందేశం

పాతశకం ముగింపు, క్రొత్తయుగం ఆరంభం

ఆగస్టు 15వతేదీ స్వతంత్ర భారతదేశానికి జన్మదినం. ఇది ఆమె పాత శకాంతానికి, కొంగ్రొత్త యుగారంభానికి చిహ్నం. దీని ప్రాముఖ్యత మనకు మాత్రమే కాదు, ఆశియా ఖండానికి, యావత్ ప్రపంచానికీ కూడా వర్తిస్తుంది. ఇది మానవజాతి ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సామాజిక, రాజకీయ భవిష్యత్తుని నిర్ణయించడంలో గొప్ప పాత్రను పోషించగల అనిర్వచనీయ సామర్థ్యాలతో కూడుకొన్న ఒక వినూత్న శక్తి గల్గిన ప్రపంచదేశాల సౌజన్యం లోనికి ప్రవేశిం చడాన్ని సూచిస్తుంది. ఈ తేదీ వ్యక్తిగతంగా సహజంగానే సంతోషాన్ని కల్గించే సందర్భమే. ఇది నేను మాత్రమే నమోదు చేసుకో దగిన విశేషం. ఎందుకంటే, జీవితానికి సంబంధించిన నా ప్రబోధాన్ని అంగీకరించిన వారి ద్వారా ప్రతి సంవ త్సరం వేడుకగా జరుపుకునే నా జన్మ దినం ఇది. ఆధ్యాత్మిక జీవనుడిగా, ఈ సందర్భాన్ని ఏదో కాకతాళీయంగా లేదా యాదృచ్ఛిక ఘటనగా నేను తీసుకో వడం లేదు. నా జీవితాన్ని ఏ కార్యంతో మొదలుపెట్టానో ఆ దిశగా నేను వేసే అడుగుల్ని మార్గనిర్దేశం చేసిన దివ్యశక్తి యొక్క అనుజ్ఞగా, ఒక రాజముద్రగా నేను భావిస్తాను. నిజంగానే నా జీవితకాలంలో సఫలమైతే చూడాలని కోరుకున్న అన్ని ప్రపంచ ఉద్యమాలు, అప్పటికవి సాధ్యపడని కలలుగానే కనిపించినా, ఇప్పుడు ఈ రోజున ఫలించడానికి చేరువలో ఉన్నట్లుగా లేదా ఇప్పుడు మొదలు కొని ఫలించే త్రోవలో ఉన్నట్లుగా నేను గమనించ గల్గుతున్నాను. ఈ గొప్ప సందర్భాన్ని పురస్కరించుకొని నన్నొక సందేశమివ్వమనడం జరిగింది. కానీ ఇప్పుడు బహుశా నాకు ఇవ్వలేని స్థితి. కానీ నేను చేయగల్గినదంతా నా బాల్యం

లను, నా యవ్వనంలో నేను తలచిన ధ్యేయాలను, లక్ష్యాలను గురించి, నా వ్యక్తిగత ప్రకటన నివ్వగలను. ఆ లక్ష్యాలు ఇప్పుడు నెరవేరడం ప్రారంభమై నటుల గమనించాను. ఎందుకంటే అవి ప్రస్తుత భారత స్వాతంత్ర్యానికి తగినవిగా వున్నాయి. నేను విశ్వసించిన భారత భవిష్యకార్యంలో భాగాలుగా వున్నాయి. ఆ కార్యంలో ఆమె తప్పక ఒక నాయిక స్థానాన్ని తీసుకు తీరాలి. భారతదేశం మేల్కొంటుంది. అది ఆమె స్వంత భౌతిక ప్రయోజనాలకోసం, విస్తరణ, ఘనత, అధికారం, సంపదలను సాధించడం కోసం మాత్రమేగాదు. అయినా వీటిని కూడా ఆమె నిర్లక్ష్యం చేయకూడదు. అది కచ్చితంగా ఇతర దేశాలు పరాయి వాళ్ళపై ఆధిపత్యం సంపాదించుకొన్నట్లు కాదు. దైవం కోసం, ప్రపంచం కోసం, యావత్తు మానవజాతి కోసం ఒక సహాయకురాలిగా, ఒక నాయకురాలిగా జీవించడం కోసం. ఆ లక్ష్యాలు, ఆదర్శాలు వాటి సహజ క్రమంలో ఇలా వుంటాయి. భారతీయ స్వాతంత్ర్యాన్ని, ఆమె ఐక్యతను సాధించే ఒక విప్లవం ఆసియా విముక్తి. ఆమె పునర్జీవనంతో మానవ నాగరికతా వికాసంలో ఆమె పోషించిన మహోన్నత పాత్రను తిరిగి పోషించడం; మానవజాతికై ఒక కొత్త, ఘనమైన, జ్వాజ్వల్య మానమైన మహోన్నత ఉత్థానాన్ని పూర్తిగా సాక్షాత్కరింప జేసుకోవడం; బాహ్యంగా వేరువేరు మానవుల అంతర్జాతీయ ఏకీకరణ పై ఆధారపడి, వారు తమతమ జాతీయజీవనాన్ని రక్షించుకొంటూ, పదిలపర్చుకుంటూ, ఏకత్వాన్ని సిద్ధింప జేసుకోవడంలో ఒకరినొకరు అధిగమించుకొంటూ ఒక్కటిగా కలిసి రావడం తన ఆధ్యాత్మిక జ్ఞానాన్ని సమస్త జీవితాన్ని ఆధ్యాత్మీకరించే తన సాధనా సంపత్తిని భారతదేశం యావత్తూ మానవ జాతికి బహుమానంగా అందించడం చివరగా, చైతన్యాన్ని ఒక ఉన్నత స్థాయిలో ఉద్దీపింప జేయడం ద్వారా పరిణామంలో ఒక క్రొత్త అడుగు వేయడం, మానవజాతిని చిక్కుల్లో పడేసిన, వేధించిన దాని అస్తిత్వానికి సంబంధించిన ఎన్నో సమస్యలకు పరిష్కార ప్రారంభం. ఆ విధంగా మానవులు వ్యక్తిగత పరిపూర్ణత గూర్చి, ఒక పరిపూర్ణమైన సమాజాన్ని గూర్చి ఆలోచించడం, దానికై కలలు కనడం అప్పటికే మొదలు పెట్టారు.

శ్రీఅరవిందులు

అనువాదం: సి.హెచ్ . హర్షవర్ధనరాజు

భారతదేశం స్వాతంత్ర్యమును మాత్రమే సంపాదించింది, సమగ్రతను ఇంకా సాధించలేదు.

భారతదేశం స్వాతంత్ర్యమును సంపాదించింది కానీ సమగ్రతను సాధించలేదు. ఆ స్వాతంత్ర్యం కూడా బీటలు బారి, ముక్కలు చెక్కలు అయినది. ఒక్కోసారి అనిపిస్తుంది, బ్రిటీష్ వారు ఆక్రమించకపూర్వం వున్న వేర్వేరు రాజ్యాలతో అస్తవ్య స్తంగా నున్న స్థితికి తిరిగి చేరుకుంటుందేమోనని. అదృష్టవశాత్తూ, అట్టి దుర దృష్ట స్థితి పునరావృతం కాదనే గట్టి సంభావ్యత ఇప్పుడు ఏర్పడింది.

రాజ్యాంగ విధాన సభ ఎంతో వివేకవంతంగా, తక్షణ ఫలితం ఇవ్వగల కార్యాచరణ విధానం రూపొందించుటతో అణగారిన వర్గాల వారి సమస్య చీలిక లకు తావీయకుండా పరిష్కరించబడుతుంది. కానీ మతపరంగా గతంలో జనిం చిన హిందూ, ముస్లిమ్ విభజన భావన కరుడుగట్టి దేశాన్ని ఒక రాజకీయ ప్రాతిప దికపై శాశ్వతంగా చీలుస్తుందేమోనని అనిపిస్తుంది. ఈ నిర్ధారణను కాంగ్రెస్ గాని, భారతజాతిగాని ఒక తాత్కాలిక కార్యసాధక ఉపకరణంగా మాత్రమే ఒప్పు కొని అంతకు మించి ఒక శాశ్వత పరిష్కార సూత్రంగా అంగీకరించరని ఆశిద్దాం.

ఎందుకనగా ఈ విభజన విధానం కొనసాగితే భారతదేశం బలహీనపడుతుంది, కకావికల మవుతుంది. సమాజంలో అంతఃకలహాలు కొనసాగే సంభావ్యత ఏర్ప డుతుంది .దేశంపై దాడి కూడా జరుగవచ్చు. విదేశీదురాక్రమణకు దారి తీయవచ్చు. ఆవశ్యకమైనట్టి సమిష్టిగాను, వేర్వేరుగాను ఇరు వర్గాలు చేపట్టే కార్యాచరణ ద్వారా ఉద్రిక్తత క్రమంగా సద్దుమణిగి, ప్రశాంతత పెరిగి, శాంతి సామరస్యతలు నెలకొనాలనే అవగాహన కలిగి, గత్యంతరం లేని స్థితిలో ఒడం బడికల ద్వారానైనా దేశవిభజన అంతం కావాలి. ఈ విధంగా సమైక్యత ఏదో రూపంలో ఏర్పడవచ్చు. అది ఏ విధంగా నుంటుందనేది అంతముఖ్యం కాదు కాని దానికి ఆచరణాత్మక ప్రాశస్త్యం వుంటుంది. ఏ మార్గంలోనైనా గాని విభజన మాత్రం పోవాలి. తప్పక పోతుంది. లేనిచో భారతదేశ భవిష్యత్తు తీవ్రంగా కుంటు బడవచ్చు, దేశం బలహీనపడవచ్చు. దేశానికి భంగం వాటిల్లవచ్చుకూడా. అలా జరగకూడదు.

అనువాదం: డా. దామెర వెంకటేశ్వరరావు

ఆసియాలో భారతదేశం పాత్ర, మానవాళి ఏకీకరణ

[ఇది ఆగష్టు, 15, 1947 న భారతదేశం స్వాతంత్ర్యం పొందిన సందర్భంగా ఆకాశవాణి, తిరుచ్చినాపల్లి కేంద్రం నుంచి ఆగష్టు 14 న ప్రసారమైన సందేశము]

ఆసియా మేల్కొంది, దాని విశాల ప్రాంతాలన్ని విముక్తి చేయబడ్డాయి లేదా ప్రస్తుత కాలంలో విముక్తిని పొందబోతున్నాయి. ఇంకా పరాయి పాలనలో వున్న దాని ప్రాంతాలు ఒక విధమైన పోరాటంతో స్వాతంత్ర్యం దిశగా ముందుకు సాగిపోతున్నాయి. ఇంకా కొంత మాత్రమే చేయవలసి ఉంది. అది నేడో రేపో జరుగుతుంది. అందులో భారతదేశం తన వంతు పాత్ర పోషించాల్సి ఉంది. దాని బలశక్తి, దక్షతలతో మొదలుపెట్టబడినటువంటి ఆ ప్రక్రియ ఇప్పటికే దాని సాధ్యాసాధ్యాల పరిమాణాన్ని, వివిధ దేశాల ప్రతినిధుల సలహా సంఘంలో అది తీసుకోగల స్థానాన్ని తెలియజేస్తున్నది.

మానవజాతి ఏకీకరణ కొనసాగుతున్నది. అది కేవలం అసమగ్రంగా ప్రారంభించబడి నప్పటికీ, వ్యవస్థీకరించబడి ఉన్నది, కాని అది అనేక భయాందోళనలు కలిగించే ఇక్కట్లతో పెనుగులాడుతున్నది. అయినప్పటికీ, ఒక ఉరవడి ఉంది. చరిత్ర నేర్పిన అనుభవాలను మార్గదర్శకంగా తీసుకోగలిగితే, అది గెలిచి తీరే వరకు తప్పకుండా అనివార్యంగా ఉధృత మవుతుంది. ఇక్కడ కూడా భారతదేశం ఒక ప్రముఖ పాత్ర పోషించడం మొదలుపెట్టింది. ఆమె కనుక విస్తృతతర రాజకీయ చతురతను పెంపొందించుకొంటే, ఇప్పుడున్న వాస్తవ పరిస్థితులకూ, వెనువెంటనే నెరవేరగలిగే వాటికీ పరిమితమై పోకుండా, భవిష్యత్తులోకి దృష్టి సారించి దానిని అత్యంత సమీపంగా అందుబాటులోకి తీసుకురాగలిగితే, నెమ్మదిగానూ పిరికితనంతో కుంచించుకుపోయే పురోభివృద్ధికీ, ధైర్యంగా, వేగవంతంగా పురోభివృద్ధిని పొందేదానికీ తేడాను బహుశా ఆమె ఉనికి తెలియజేస్తుంది. ఇంత మట్టుకు జరుగుతున్న దానిని బహుశః ఒక దుర్ఘటన జోక్యం చేసుకోవటం, అడ్డగించడం లేదా నాశనమూ చేయవచ్చు, అయినప్పటికీ అంతిమ విజయం తథ్యం. ఎందుకనగా ఏకీకరణ అనేది ప్రకృతి మాత విధానంలో అనివార్యం, తప్పనిసరైన గమనం; దాని సఫలతను ఏ అతిశయోక్తి లేకుండా నిరభ్యంతరంగా

ముందే చెప్పవచ్చు. అది దేశాలకు కూడా అవసరమనేది సుస్పష్టం. ఎందువల్ల నంటే అది జరగని పక్షంలో చిన్నదేశాల మనుగడ ఇక ముందు ఎన్నటికీ క్షేమకరం కాదు, అంతే కాక, పెద్దవి, శక్తివంతమైన దేశాలు కూడా వాస్తవానికి సురక్షితంగా ఉండలేవు. భారతదేశం, ఆమె విభజన కనక ఇదే విధంగా కొనసాగినట్లైతే, ఆమె తనకు తానుగా తన భద్రత గురించి కూడా కచ్చితంగా ఉండలేదు. అందువల్ల అందరి ప్రయోజనాన్ని అనుసరించి తప్పక ఐక్యత జరిగి తీరాలి. కేవలం మాన వుల బుద్ధిహీనత, మూఢత్వం మాత్రమే దానిని అడ్డుకోగలుగుతాయి. దానికి వ్యతిరేకంగా, దేవతలుసైతం గట్టిగా ప్రయత్నించి విఫలమవుతుంటారని చెప్ప బడింది; కాని అది ఎల్లకాలం ప్రకృతి మాతకు ఆవశ్యకమైనదానికీ, దైవేచ్ఛకూ ఎదురొడ్డి నిలువలేదు.అప్పుడు దేశభక్తి తనకు తానుగా సుసంపన్నం అవుతుంది. అంతర్జాతీయ స్ఫూర్తి, దృక్పథం, తప్పక వృద్ధి చెందాలి. అదే విధంగా అంత ర్జాతీయ రూపాలు, సంస్థలు, అభివృద్ధి చెందాలి; రెండు లేక అనేక దేశాల పౌర సత్వాల లాంటివి, ఇంకా సంస్కృతుల ఐచ్ఛిక సమ్మేళనంకూడా మారుతున్న విధానంలో కనపడవచ్చు. దానికి తోడుగా దేశభక్తి స్ఫూర్తి తన పోరాటకాంక్షను విడనాడిన తరుణంలో ఈ విషయాలు సమగ్రమైనటువంటి దాని సొంత దృక్పథా నికి పరిపూర్ణంగా సరిపోతుందనవచ్చు. ఒక నూతన ఏకత్వ స్ఫూర్తి మానవ జాతిని వశపర చుకొంటుంది.

ప్రపంచానికి భారతదేశం అందించవలసిన ఆధ్యాత్మిక కానుక, అది ఈ వరకే మొదలయింది. భారతదేశ ఆధ్యాత్మికత ఐరోపాలోను అమెరికాలోను పరిమా ణంలో ఎప్పటికంటే ఎక్కువవుతూ ప్రవేశిస్తోంది. అది ఇంకా వృద్ధి చెందుతుంది. కాలగమనంలో వచ్చే ఎన్నో విపత్తుల మధ్య ఎంతోమంది ఆశావహదృక్కులతో భారతదేశంవైపు మరలి చూస్తున్నారు. అంతేగాక, ఆమె బోధల కోసం మాత్రమే కాకుండా, ఆమె చైత్య, ఆధ్యాత్మిక ఆచరణ కోసం కూడా ఆమె ఆశ్రయం కోరే వారి సంఖ్య అంతకంతకూ ఎక్కువవుతున్నది. మిగిలినది ఇక నా వ్యక్తిగత ఆశా వహం, ఒక భావం, ఒక ఆదర్శం. ఇది భారతదేశంలోను, పశ్చిమదేశాలలోను, భవిష్యత్తు వైపు దృష్టి సారించిన వారందరి మస్తిష్కాలను ప్రభావితం చేయడం మొదలుపెట్టింది. ఏ లక్ష్యసాధనలోనూ లేని దుస్సాధ్యమైన అడ్డంకులు ఈ దారిలో ఉన్నాయి. కాని అడ్డంకులనేవి తొలగించబడటానికే ఉన్నాయి. పరమాత్మ ఇచ్ఛ

గనక ఉంటే తప్పక అధిగమించవచ్చు. ఇక్కడ కూడా, ఈ పరిణామం గనక జర గవలసి వుంటే అది తప్పకుండా ఆత్మ పురోభివృద్ధితోనూ అంతరంగ చైతన్యం తోనూ తప్పక ముందుకు పోవలసి ఉంటుంది. కాబట్టి దానికి చొరవ భారతదేశం నుంచే రాగలదు. దాని పరిధి విశ్వవ్యాపకమైనప్పటికీ ప్రధాన ఉద్యమం ఆమెదే కాగలదు.

ఇదీ భారతదేశ విమోచన దినమున నేను చెప్పదలచుకొన్న సారాంశము; ఈ సంధాన ప్రక్రియ అసలు జరుగుతుందా అనేది లేదా ఎంతకాలంలో ,లేదా ఎంత తొందరగా సుసంపన్నం అవుతుందనేది ఈ నవీన, స్వతంత్ర భారతదేశం మీద ఆధారపడి ఉంటుంది.

CW SA 36: 474-477

శ్రీఅరవిందులు

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

అతిమానసంతో పాటు దాని రెండు భూమికల (జడము, సక్రియము) సిద్ధికి గల సంభావ్యతను శ్రీకృష్ణుడు ఆచరణాత్మకం గావించాడు. బుద్ధుడు మానసికస్థాయి నుండి నేరుగా పరమోత్కృష్టమగు నిర్వాణ స్థాయిలో లీనమగుటకు ప్రయత్నించాడు. వారి తరువాత ఆదిశంకరులు మరో మార్గంలో పరంబ్రహ్మలో లయమొందే ప్రయత్నం సలిపారు. ఇరువురు కూడా ఒక నిర్గుణ నిరాకార పరబ్రహ్మలో లీనమొందే మార్గంలోని మధ్యంతర దశలను విస్మరించి, వాటిని అధిగమించుటకు ఏకాభిప్రాయం కనబరిచారు. దానికి మారుగా శ్రీకృష్ణుడు క్రమానుసారంగా సాగే సహజ పరిణామ ప్రక్రియ మార్గాన్ని అనుసరించారు. ఆ మార్గంలో వేసే తరువాతి అడుగు నిర్గుణ, నిరాకార పరంబ్రహ్మ దిశగా పడదు, అది అతిమానసస్థాయి దిశగా పడుతుంది. మధ్యంతర దశలను అధిగమించే ప్రయత్నంలో ఆదిశంకరుల లాగే బుద్ధుడు కూడా విమోచనకున్న సక్రియాత్మక మార్గాన్ని పూర్తిగా విస్మరించి పొరపాటు చేసారని నే ననుకుంటాను. అందువలన ఆ దిద్దుబాటు 'కల్కి' వలన జరగాలి.

CWSA 28:458

శ్రీఅరవిందులు

అనువాదం: తుమ్మల లక్ష్మి

భారతమాతకు ప్రార్థన

ఓ, మా మాతా, ఓ భారతావని ఆత్మా, కుంగుబాటుతో కూడిన అత్యంత చీకటిరోజులలో కూడా, నీ వాక్కునుంచి దూరంగా మరలిపోయి, ఇతర ప్రభువులను సేవిస్తూ, నిన్ను ఖండించినప్పటికీ కూడా ఎన్నడూ నీ పిల్లలను విడిచిపెట్టని ఓ మాతా, ఇప్పుడు వారు మేల్కొన్నారు. ఇప్పుడు నీ విమోచన ఉషోదయం వెలుగు నీ ముఖంమీద కాంతులీనుతున్నది. ఇటువంటి మహత్తరమైన ఘడియలో మేము నీకు వందనం సమర్పిస్తున్నాము. మా ముందు వెల్లడవుతున్న స్వతంత్ర వినీలాకాశం భవిష్యత్తులో కూడా నిజమైన గొప్పతనపు వినీలాకాశంగా, దేశాల సమాఖ్యలో నీ నిజ జీవనమై ఉండే విధంగా మాకు మార్గదర్శనం చేయి. మేము ఎల్లప్పుడూ మహత్త్వపూర్ణమైన ఆదర్శాలవైపే ఉండిపోవాలని, మానవులకు నిజమైన నీ వైఖరినీ, ఆత్మశక్తి జీవన ప్రవంతిలో ఒక నాయకత్వ పాత్రనూ, ప్రజలందరకు ఒక స్నేహితుడిని, ఒక సహాయకుడినీ చూపించేటట్లుగా మాకు మార్గదర్శనం చేయి.

CWSA 13: 352

శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

నేను అతిమానస స్థాయిలోనే నిలబడి, అతిమానసాన్నే సాధనంగా ప్రపంచం మీద పనిచేస్తున్నట్లయితే, ప్రపంచం మారిపోయేది లేదా చాలా ఎక్కువ తీవ్రతతో మారుతూ ఉండేది, ఇప్పుడు జరుగుతున్న దానికంటే వేరుపద్ధతిలో. ప్రస్తుతం నా ప్రయత్నం నేను ఏదో ఎంతో ఎత్తున, దూరంగా అతిమానసస్థాయిలో నిలబడి అక్కడినుండి ప్రపంచాన్ని మార్చడం కాదు, కాని దానికి చెందిన దానినేదో కిందికి ఇక్కడకు తీసుకురావడం, దానిమీదే నిలబడటం, దాని ద్వారా పనిచేయడం. కాని ప్రస్తుతం జరుగుతున్న విషయం, ఊర్ధ్వమనస్సును క్రమానుసారంగా అతిమానసీకరణ గావించడ మనేది నేను నిమగ్నమై వున్న తక్షణ కార్యక్రమం. రెండవది బలంగా అడ్డగించే మహా అచేతననూ, ప్రపంచాన్నీ మార్చాలనుకొనే ఏ ప్రయత్నానికైనా లేదా స్వయం తమకు తాము మార్పు చెందాలనుకొనే వారికి కూడా ఎల్లప్పుడూ ప్రధాన ఆటంకంగా ఉంటూ మానవ అజ్ఞానానికి అది ఇచ్చే తోడ్పాటును తెలికపరచటం.

ఎప్పుడూ నేను చెప్తూనే ఉన్నాను, నేను యుద్ధంలాంటి మానవ వ్యవహారాల మీద పెట్టే ఆధ్యాత్మిక శక్తి అతి మానసిక శక్తి కాదు, కాని అది ఊర్ధ్వమనోశక్తి. భౌతికప్రపంచంలో పనిచేసేటప్పుడు అది ఎంతగానో నిమ్న ప్రపంచశక్తులతో విడదీయలేకుండా కలసి పెనవేసుకొనిపోయి ఫలితాల నిస్తుంటుంది. అది ఎంత బలమైనదైనప్పటికీ లేదా తక్షణ లక్ష్యానికి అది ఎంతగా సరిపోయినదైనప్పటికీ తప్పకుండా అనివార్యంగా అది పాక్షికమే అయి తీరుతుంది. అందువలననే ఆగష్టు 15 స్వతంత్ర భారతావనిగా నా పుట్టినరోజు బహుమతిగా నాకు వస్తున్నది. కాని రెండు స్వతంత్ర భారతాలుగా సంక్లిష్టమై అది ఇవ్వబడుతున్నది: ఇది ఒక ఉదారత; నేను దీనిని లేకుండా చేయగలిగి ఉండేవాడినే, ఒకే ఒక్క స్వతంత్ర భారతం ముక్కలుకాని మొత్తంగా సమర్పించి ఉంటే అది నాకు సరిపోయేది.

CWSA 35:367-68 — శ్రీఅరవిందులు

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

ఆధ్యాత్మిక పతాక పటము

ఐక్యభారత ఆధ్యాత్మిక పతాకం

(వెండిఛాయ లీను నీలవర్ణ పతాక మధ్యన స్వర్ణకాంతితో మెరుస్తున్న ఆమె చిహ్నం గల "శ్రీమాత పతాకం"). అది భారతదేశ ఆధ్యాత్మికోద్యమ పతాకం. ఆ ఉద్యమం సఫలం గావడంలోనే భారతదేశ ఐక్యత సాఫల్యమవుతుంది.

CWM 13: 352

శ్రీఅరవిందులు "ఐక్యభారత ఆధ్యాత్మిక పతాక" అని పేరిడిన పతాకం మనకున్నది. దాని చతురస్రాకార నమూనాకు, దాని రంగుకు, దాని నమూనాలోని ప్రతి అంశం యొక్క వివరానికి ఒక సంకేతాత్మక అర్థం వుంది. 1947 ఆగష్టు 15 న, భారతదేశం స్వాతంత్ర్యం పొందిన రోజున అది ఎగురవేయబడింది. ఇప్పుడు 1954 నవంబరు 1 న, ఈ వలస రాజ్యాలు భారతదేశంలో విలీనమయ్యేరోజున, అది ఎగురవేయబడుతుంది. భవిష్యత్తులో ఎప్పుడైనా భారతదేశం తనవైన ఇతర భాగాలను తిరిగి స్వాధీన పరచుకున్నప్పుడు అది ఎగుర వేయబడుతుంది. అఖండ భారతం ప్రపంచంలో ఒక ప్రత్యేకమైన ఉద్యమాన్ని ఈడేర్చవలసివుంది. శ్రీఅరవిందులు తమ జీవితాన్ని దాని కోసమే త్యాగం చేసారు. అదే చేయడానికి మనం సంసిద్ధులమై వున్నాము.

CWM 13:354

మన సంచిక పై పేజీపై కనిపిస్తున్న స్వర్ణ కమలానికి సరిగ్గా దాని మధ్యన కేంద్ర స్థానంలోని వెండి - నీలవర్ణపు చతుర్భుజాకారం చుట్టూ దాని పూరేకులు రెండువరుసలలో, నాలుగు దాని అంతర్భాగంలో, పంద్రెండు దాని బహిర్భాగంలో అమర్చబడి వున్నాయి. ఆ నీలం అంతరాత్మ యొక్క నీలవర్ణం. ఆ స్వర్ణం జగజ్జనని అగు శ్రీమాత దేహచ్ఛాయ. అట్టపై పతాకం చుట్టూ ఉన్న ఎరుపు ప్రదీప్త భౌతిక చేతనను సూచిస్తుంది.


శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి


అఖిల
అఖిలభారత పత్రిక
సెప్టెంబరు 2016
రక్షణ

విషయసూచిక





దైవకృప, రక్షణ నీ కెల్లప్పుడు వుంటాయి. అంతరంగంగా లేక బాహ్యంగా ఎటువంటి కష్టము, సంకటం కలిగినా కృంగిపోకు. నీకు రక్షణగా నున్న దైవశక్తిని ఆశ్రయించు. విశ్వాసంతో, చిత్తశుద్ధితో ఆ విధంగా చేస్తే, నీలో ఏదో వికసనం మొదలైనట్లుగా గ్రహిస్తావు. ఎన్ని అలజడులు రేకెత్తి నట్లనిపించినప్పటికి నీలో నిశ్చల నీరవత నెలకొంటుంది.

CWM 14: 226

శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

మీరే పరిపూర్ణ జ్ఞానం, సమగ్రచైతన్యం. ఎవరు మీతో ఏకమవుతారో, వారు సర్వజ్ఞులు- ఆ ఐక్యత నిలిచినంత కాలం. కానీ ఈ స్థాయిని అందుకోక ముందుగానే ఎవరైతే తమ మొత్తం అస్తిత్వపు చిత్తశుద్ధితో తమకు తాముగా, తమ చేతనా పూర్వక ఇచ్ఛతో మీ దివ్యప్రేమతత్వం తమలోను, తాము ప్రభావితం చేయగల పరిధి అంతటా అభివ్యక్తమై, సాఫల్య మొందుటకు అవసరమైన ప్రయత్నాలన్నింటినీ చేయటానికి తీర్మానించుకొంటారో వారు తమ జీవిత విషయాలన్నీ మార్పుచెంది, మీ తత్త్వాన్ని వ్యక్తపరచి, తమ సంపూర్ణ అర్పణకు తోడ్పడటం మొదలయిందని గమనిస్తారు. వారికి అది శ్రేష్టమైన, అన్నివేళలా జరిగే అత్యుత్తమమైన పరిణామం. అప్పటికీ, వారి అవగాహనలో ఏదో అస్పష్టత, ఏదో ఒక అజ్ఞాన జనితమైన కోరిక మిగిలిపోయి, వారిలో చోటు చేసుకొంటున్న ఆ ఉత్తమ పరిణామాన్ని వెంటనే గ్రహించుటను ఆటంక పరచినా, త్వరలోనే లేక కొంతసమయం గడిచిన పిదపనైనా ఒక ఉపకారిక శక్తి వారిని వారి అజ్ఞానం నుండి రక్షించి, వారి మానసిక వికసనానికి, పరివర్త నకు, వారిలో సమగ్ర మార్పుకు ఆ పరిణామాలను సద్వినియోగ పరచుటకు అనువైన పరిస్థితులను ఏర్పరుస్తుంది. ఎవరైతే దానిని గురించిన ఎరుకను పొంది దానికి సమ్మతించి నప్పుడు భవిష్యత్ పరిస్థితుల గురించిగాని, సంద ర్భాలు ఎలాంటి మలుపులు తిరుగుతాయో అనిగాని వ్యాకుల పడనవసరం వుండదు. స్థిమితంగా తాము చేసేపని ఏదైనా అది అత్యుత్తమ మైనదిగానే వుంటుందని, దక్కబోయే ఫలితంకూడా తప్పక అత్యుత్తమ మైనదిగానే వుంటుందని అనుక్షణం అనుకుంటూ గట్టి నమ్మకం కలిగి వుంటారు — మన పరిమిత తార్కికతకు ఆ ఫలితం మనం ఎదురు చూచినది కానప్పటికీ.

అందుకనే, ఓ ప్రభూ, మా హృదయం తేలిక పడింది, మా ఆలోచన నెమ్మ దించింది. అందుకనే మేము సంపూర్ణ విశ్వాసంతో మీ వైపుగా మరలి ప్రశాంత చిత్తులమై అంటున్నాము:

మీ ఇచ్ఛ నెరవేరుగాక, దానితో సర్వహితమైన సామరస్యత సిద్ధించుగాక.

CWM1:102 శ్రీమాత

Prayer: March 19, 1914.

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

వ్యాధి సోకకుండా రక్షణ

స్థూలదేహమే ఒక రక్షణ

మానవజీవి స్థూలదేహంలోనే కులాసాగా, భద్రంగా వుండగలడు. దేహమే అతని రక్షణ కవచం. కొందరు వారి దేహాన్ని హేయమైనదిగా భావిస్తారు. మరణానంతరం దేహము లుప్తమైన స్థితిలో విషయాలు మరింత మెరుగౌతాయని వారు అనుకొంటారు. కానీ నిజానికి నీ దేహమే నీకు కోటలాంటిది, నీకు ఆశ్రయం. నీవు అందులో బసచేసి వున్నప్పుడు ప్రపంచంలోని ప్రతికూల శక్తులకు నీపై ప్రత్యక్ష ప్రభావం కనబరచడం దుర్లభమౌతుంది. నిద్రావస్థలో నున్నప్పుడు భయ భావన కలిగి గుండె భారమైనట్లనిపించడ మేమిటి? అది నిద్రావస్థలో నీవు ప్రాణిక ప్రపంచంపై దాడి సల్పినందులకు కలిగిన బాధ. ఆ స్థితిలో చిక్కుకున్నప్పుడు నీవు చేసే ప్రథమ ప్రయత్నమేమిటి? నీవు దేహంలోనికి శీఘ్రంగా ప్రవేశించి, సహజ దైహిక చేతనను పొందటానికి నిన్ను నీవు కుదుపుకుంటావు. కానీ, ప్రాణిక శక్తుల లోకంలో నీవొక పరాయివాడివి. నీకు ఆ లోకం ఒక రేఖాపటం లేని సముద్రంలా వుంటుంది. దానిలో నీకు దిక్సూచి గాని చుక్కాని గాని ఉండవు. ఎటుపోవాలో ఎలాపోవాలో తెలియదు; వేయవలసిన ప్రతి అడుగుని దానికి విరుద్ధంగా వేస్తావు. తిన్నగా, ఈ ప్రపంచంలోని ఏ ఇలాకాలోకి ప్రవేశించినా అక్కడి జీవులు నిన్ను చుట్టుముట్టి, నీ వద్దనున్న దానినంతా కొల్లగొట్టి, ఆహారంగా వేటాడబడిన జంతువుగా చూస్తారు. నీలోనుండి ఓ ప్రకాశమానమైన వెలుగు, శక్తి ప్రసరించకపోతే, నిన్ను నీవు అక్కడి అతి శీతల వాతావరణంనుండి రక్షించుకొనుటకు ఒక ఆచ్ఛాదనగాని, తలదాచుకొనుటకు ఒక ఇల్లుగాని, కనీసం నీ శరీరాన్ని కప్పివుంచే చర్మంగాని లేకపోతే, నాడీ వ్యవస్థ అంతా నగ్నంగా బహిర్గతమై నీ దేహాన్ని కోల్పోయి అచ్చట సంచరిస్తావు. ఈ విధంగా వగచేవారు కూడా వుంటారు. "ఈ దేహంలో నేనెంత అసౌఖ్యంగా నున్నాను," వారు మరణాన్ని ప్రాపంచిక కష్టనష్టాలనుండి తప్పించుకొని పారిపోవడంగా భావిస్తారు. కానీ మరణానంతరం కూడా అవే ప్రాణాధారమైన పరిసరాలు ఉంటాయి. జీవితంలో ఏ ప్రతికూల శక్తులైతే నీ దీనస్థితికి కారణమైనాయో, వాటినుండే ప్రమాదం పొంచి వుంటుంది. నీనుండి విడిపోయిన దైహిక శక్తులను నీవు

ప్రాణికలోకం లోని బహిరంగ ప్రదేశాలలో పడవేస్తావు. ఇక నీకు రక్షణ అంటూ వుండదు, రక్షణకై తలదాచుకొనుటకు స్థూలదేహ ముండదు.

CWM 3: 47

అంతరంగ స్థితి — వ్యాధి సోకుట

నీ అంతరంగ స్థితి వ్యాధి సోకటానికి ఎప్పుడు కారణ మౌతుందంటే, దానిలో ఒక నిరోధక శక్తి లేక విముఖత వున్నప్పుడు, లేదా నీలోని ఏదో ఒక పార్శ్వం రక్షణకు స్పందించక పోయినప్పుడు. అంతేగాక దానిలో ఇచ్ఛాపూర్వకంగా, కావాలని ప్రతికూల శక్తులను స్వాగతించే తత్వమేదైనా వుండవచ్చు. ఈ విధమైన స్వల్ప కదలిక కలిగినా చాలు, ప్రతికూల శక్తులు వెంటనే నీపై విరుచుకు పడతాయి. ఆ దాడి తరచు వ్యాధిరూపం దాలుస్తుంది.

వ్యాధి సోకే సంభావ్యతలు నీ శరీరంపైనా, నీ చుట్టూ, ఎల్లప్పుడూ వుంటాయి. నీలో ప్రతి వ్యాధి యొక్క బీజములను, సూక్ష్మ క్రిములను మోసుకు తిరుగుతుంటావు, లేక అవి గుంపులు గుంపులుగా నిన్ను ఆవరించి వుంటాయి. సంవత్సరాల తరబడి నీకు అంటని వ్యాదికి ఎందుకని ఉన్నట్టుంది హఠాత్తుగా నీవు లోనుకావలసి వస్తుంది? అందుకు కారణం ప్రాణికశక్తి మందగించటం అని నీవు అనవచ్చు. అయితే, ఆ మాంద్యం ఎక్కడినుంచి వచ్చింది? అది అస్తిత్వంలో సామరస్యత లోపించటం వలన, దైవిక శక్తులను గ్రహించనీయని అశక్తత వలన సంభవిస్తుంది. ఎప్పుడైతే, నిన్ను కాపాడి, పోషించేశక్తి నుండి, ప్రకాశం నుండి నిన్ను నీవు వేరు చేసుకున్నావో, అప్పుడు ఈ మాంద్యం — వైద్యశాస్త్రంలో పేర్కొనబడినట్లుగా— "అనుకూలమైన వాతావరణం" సృష్టించబడింది. ఆ పరిస్థితిని ఏదో ప్రతికూలశక్తి తనకు లాభసాటిగా మార్చుకుంది. అనుమానం, విచారం, అపనమ్మకం, స్వార్థప్రయోజనార్థం నీ అంతరాత్మ ప్రబోధనకు వ్యతిరేకంగా నడుచుకోవడం లాంటి లక్షణాలు నిన్ను దివ్యప్రకాశం నుండి, దైవిక శక్తి నుండి వేరుచేస్తాయి, ప్రతికూలశక్తి దాడికి దోహద పడతాయి. నీవు వ్యాధిన పడటానికి కారణం ఇది,, సూక్ష్మజీవులు కాదు.

CWM 3: 55-56

గ్రహించుటకు, జీర్ణించుకొనుటకు దేహానికి సమయ మివ్వాలి

మానవుని సాధారణ జీవితంలో స్థితిగతుల మార్పు ఒక విధిగా జరుగుతుంది. మనిషియొక్క మానసిక, ప్రాణిక, అస్తిత్వాలు విశ్వశక్తుల గమనాలను, వాటికి చేతనైనంత శ్రేష్టంగా అనుసరిస్తాయి. ప్రపంచంయొక్క అంతర్గత రూపాంతరీకరణ మరియు పరిణామ స్రవంతి వాటిని కొంతమేరకు కొనిపోతాయి, కానీ పూర్తిగా భౌతిక తత్వానికి కట్టుబడివున్న దేహం వాటిని అనుసరించటంలో నెమ్మదిగా అడుగులేస్తుంది. కొన్ని ఏండ్ల తరువాత, డెబ్భయ్యో లేక వందో రెండొందల ఏండ్ల తరువాత— బహుశా అది గరిష్ట పరిమితి కావచ్చు — దాని స్థితిలో మార్పు ఎంత తీవ్రతరమౌతుందంటే, బాహ్య అస్తిత్వం తునా తునకలై పోతుంది. అభ్యర్థనకు, సమాధానానికి మధ్య దూరంపెరగటం దేహంయొక్క పెరుగుతున్న అశక్తత, ప్రతి స్పందనశక్తి కుంటుబడుట, మరణమనే సంఘటనకు దారి తీస్తాయి. యోగం వలన సృష్టిలో నిరంతరం నెమ్మదిగా కొనసాగుతున్న అంతరంగ రూపాంతరీకరణ ప్రక్రియ తీవ్రతర మౌతుంది, వేగవంత మౌతుంది. కానీ, బాహ్య రూపాంతరీకరణ గమనం ఇంచుమించుగా సాధారణ జీవితంలో లాగే కొనసాగుతుంది. తత్ఫలితంగా యోగాభ్యాసం చేసే వారిలో అంతరంగ మరియు బాహ్య అస్థిత్వాల మధ్య అసమతౌల్యత అధికం కావచ్చు — దేహం అంతరంగ గమనాన్ని వీలైనంత కచ్చితంగా అనుసరించ ఉపకరించటానికి తగిన జాగ్రత్తలు తీసుకొని రక్షణ కల్పించితే తప్ప అప్పుడుకూడా, నిన్ను ఆ పని చేయకుండా ఆపటం దేహం యొక్క నైజం. ఆ కారణంగానే మనం చాలామందికి ఇలా చెప్పవలసివస్తుంది. "లాగుకోవద్దు, తొందరపడవద్దు; అనుసరించటానికి నీ దేహానికి సమయమివ్వు." కొందరిని యోగాభ్యాసం ఎక్కువగా చేయకుండా లేక ఆ మార్గంలో పురోగతి శీఘ్రగతిన చెందకుండా ఆపవలసి వస్తుంది — కొన్నేండ్లవరకు కూడ కావచ్చు. కొన్ని అసమతౌల్యతలు చోటుచేసుకోకుండా ఆపడం అసాధ్యమౌతుంది. అప్పుడు నీలో ఒక అలజడి జనించ వచ్చు. దాని హెచ్చుతగ్గుల్లో మార్పు, అలజడికి కారణమైన నిరోధకశక్తి లక్షణాన్ని బట్టి నీవు తీసుకున్న జాగ్రత్తయొక్క పరిణామాన్ని బట్టి, నీవు చూపిన నిర్లక్ష్యతను బట్టి జరుగుతుంది. అభివృద్ధిని సాధించటానికి గట్టి ప్రయత్నం చేసిన ప్రతిసారి

వెనువెంటనే ఒక స్తబ్దమైన స్థితి ఏర్పడడటానికి అది కూడా కారణం కావచ్చు. అలాంటి అవాంతరం ఏర్పడ బోతున్న దని ముందుగా హెచ్చరింపబడని వారికి, అది ఒక చురుకుదనం కుంటుబడిన, మందగించబడిన నిరుత్సాహపూర్వకమైన కాలంగా అనిపించి, అభివృద్ధి యావత్తూ ఆగిపోయినట్లు తోస్తుంది. అప్పుడు వారు ఆతృతచెంది "ఏమిటి విషయం, నా సమయం వృధా అవుతున్నదా, ఏ వీ జరగటంలేదే" అని ఆరాటపడతారు. కానీ, యదార్థమేమిటంటే, అది విషయాలను జీర్ణించుకొనటానికి అవసరమైన సమయం; శరీరానికి తనను తాను అధికంగా తెరచుకొనుటకు, విషయాలను గ్రహించుటకు, అంతరంగ చేతన అందుకొన్న స్థాయికి చేరువ అగుటకు, ఒక తెరపి, తాత్కాలిక విరామం ఇవ్వ బడినట్లన్న మాట.

CWM 3: 87-88

సూక్ష్మ దైహిక ఆచ్ఛాదన

ఒక వ్యాధికి కారణమేమైనా కానీ — భౌతికము, లేక మానసికము, బాహ్యము, లేక అతర్గతము — భౌతిక దేహాన్ని వ్యాధిగ్రస్తం చేసేముందు, అది తప్పక అస్తిత్వాన్ని ఆవరించి రక్షణ నిచ్చే మరొక పొరను తాకవలసి వుంటుంది. ఈ సూక్ష్మ మైన పొర వేర్వేరు ఉపదేశాలలో నానా విధములైన నామాలతో పిలువబడింది. — గాలిలా తేలికైన దేహమని, నాడీమయమైన ఆచ్ఛాదన అని. అది ఒక సూక్ష్మ శరీరమైనప్పటికీ, కంటికి కనిపిస్తుంది. సాంద్రతలో అది అధిక ఉష్ణోగ్రతతో పొగలు గ్రక్కే వస్తువు చుట్టూ జ్వాలా ప్రకంపనలు విరజిమ్ముతు న్నట్లుగా వుంటుంది. అది భౌతిక శరీరంనుండి వెలువడి దానిని పూర్తిగా కప్పి వుంచుతుంది. బాహ్యప్రపంచంతో కొనసాగే సంభాషణలు ఈ మాధ్యమం ద్వారా జరుగుతాయి. దేహం వ్యాధి బారిన పడకముందు అతిక్రమించ వలసినది, ఛేధించ వలసినది ఈ ఆచ్ఛాదననే. ఈ ఆచ్ఛాదనగనక దృఢమైనది, చెరగనిదిగా ఉంటే, ప్లేగు, కలరా లాంటి తీవ్రరోగాలు వ్యాపించిన ప్రదేశాలలోకి సైతం నీవు నిర్భయంగా ప్రవేశించగలవు, వాటి బారిన పడకుండా రక్షణపొందగలవు. అది సమగ్రమైనదిగా అఖండమైనదిగా నుండి దాని నిర్మాణం యుక్తమైనదిగా, దాని ప్రధాన అంశాలన్నీ సమన్వయ పరచబడి వున్నంతకాలం వ్యాధిసోకే సమస్త


సంభావ్యతలనుండి అది నిన్ను కాపాడగలదు. ఈ శరీర నిర్మాణం ఒక వైపు దైహిక పదార్థానికన్నా పదార్థలక్షణాలు గల భౌతిక పునాదిపైన, మరొక వైపు మన మానసిక స్థితులు కలుగజేసే ప్రకంపనలపైన ఆధారపడి వుంది. ప్రశాంతత, సమచిత్తము, దృఢ నమ్మకం, ఆరోగ్యము, అలజడి లేని విశ్రాంతి, ఆహ్లాదభరిత స్థితి, సముజ్వల సంతోషం ఈ ఆచ్ఛాదన యొక్క మూల పదార్థాలు.అవే దాని బలం మరియు సారాంశం. అది అత్యంత నేర్పుగల తక్షణ ప్రతిస్పందన లక్షణాలు గల సున్నితమైన మాధ్యమం. అన్ని విధముల సూచనలను అది నిస్సంకోచంగా స్వీకరించుటవలన అవి దాని రూపురేఖలను మార్చి దాదాపు ఒక క్రొత్తరూపం కలుగజేస్తాయి. ఒక చెడు సలహా దానిని చాలా తీవ్రంగా ప్రభావితం చేస్తుంది, అలాగే ఒకమంచి సలహా అదే తీవ్రతతో వ్యతిరేక ప్రభావం కనబరుస్తుంది. కృంగుబాటు, నిరుత్సాహం దానిపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. ఒకవిధంగా అవి దాని మూలంలో ఇక్కట్లను కలుగజేసి, వాటిని ఎదుర్కోలేకుండా బలహీనపరచి, శత్రు దాడులకు మార్గం సులభతరం చేస్తాయి.....

CWM 3: 89-90

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

సూక్ష్మ మైన ప్రాణికమగు ఆచ్ఛాదనకు హాని కలుగకుండా ఉంచుట

ప్రాణమయకోశం భౌతికశరీరాన్ని ఒకలాంటి ఆచ్ఛాదనతో కప్పి వుంచుతుంది. అత్యంత వేడిగా వున్న రోజున మనం గ్రహించ గలిగేటంత వేడిమి యొక్క స్పందనలకుండే సాంద్రతను ఆ ఆచ్ఛాదన కలిగివుంటుంది. ఈ ఆచ్ఛాదన సూక్ష్మశరీరానికి, ప్రాణమయ శరీరానికి మధ్యవర్తిగా వుంటుంది. ఇది శరీరాన్ని అన్ని రకాల అంటురోగాలు, అలసట, నిస్సత్తువ, ఆఖరికి అనూహ్యంగా జరిగే ప్రమాదాల నుండి కూడా కాపాడుతుంది. కాబట్టి ఈ ఆచ్ఛాదన గనుక ఏ హానికర ప్రభావాలకు లోనవకుండా ఉంటే అది నిన్ను అన్నింటినుండీ కాపాడుతుంది, కానీ చిన్న దైనప్పటికీ బలమైన ప్రకంపనం కొద్దిపాటి అలసట, కొద్దిపాటి అసంతృప్తి లేదా ఒక భయంలాంటి దేదైనా అది ఎంతో బలంగా ఆచ్ఛాదనను చీల్చడానికి సరిపోతుంది. ఆ చిన్న చీలిక ఎట్లాంటి చొరబాటుకైనా సందు



నిస్తుంది. ప్రస్తుతం వైద్యవిజ్ఞానం కూడా గ్రహిస్తున్నట్లుగా — నీవు గనుక పరిపూర్ణమైన ప్రాణిక సంతులనంతో వుంటే ఎలాంటి రుగ్మతకు గానీ, అంటు వ్యాధికి గాని లోనుకాని రోగనిరోధక శక్తిని కలిగి వుంటావు. నీలో ఈ సమతౌల్య స్థితి, ఈ ఆంతరికమైన సామరస్యత వున్నట్లయితే అది నిన్ను అన్నిటినుండీ కాపాడుతుంది. కొంతమంది అతి సామాన్య జీవితం గడుపుతుంటారు. వాళ్ళకి ఒక మనిషి అసలు ఎలా ఆహారాన్ని తినాలో, ఎలా నిద్రించాలో బాగా తెలుసు. వాళ్ళల్లో ఈ సూక్ష్మ ఆచ్ఛాదన ఎంత దృఢంగా వుంటుందంటే, అది వాళ్ళను ఎలాంటి ప్రమాదాల బారిన పడకుండా ఏమి పట్టనట్లుగానే .... సురక్షితంగా దాటిస్తుంది. ఇది ఒక వ్యక్తి తనకు తానుగా తనలో సమకూర్చుకోగల సామర్థ్యం. వ్యక్తి తన సూక్ష్మ ఆచ్ఛాదనలో ఎక్కడైనా దుర్భలమైన ప్రదేశాన్ని పసిగట్టినప్పుడు కొద్ది నిముషాల పాటు ఏకగ్రచిత్తుడై శక్తిని ఆహ్వానిస్తే, తద్వారా ఏర్పడిన ఆంతరిక ప్రశాంతత అక్కడి దుర్భల పరిస్థితిని చక్కబెడుతుంది, ఆగడ్డు సమస్య అంతరించిపోతుంది.

CWM 4: 63

శ్రీమాత

అనువాదం: సి.హెచ్. హర్షవర్ధనరాజు

మానసిక పరమైన రక్షణ

మానసిక సంబంధమైన వాతావరణం

నిజానికి నా వరకు నేను మంచిచేయడం, న్యాయంగా, సూటిగా, నీతిగా ఉండటమన్నది మనం నిశ్చలంగా ప్రశాంతంగా ఉండటానికీ, మన ఆదుర్దాను తగ్గించటానికి ఉత్తమమైన మార్గం. దానితోపాటు, నిర్వ్యామోహంగా నిరాసక్తంగా ఉంటూ వ్యక్తిగత అహంకారం నుండి, అభీష్టాలనుండీ విడివడగలిగితే అప్పుడు నిజంగా సంతోషంగా ఉండడమన్నది సాధ్యమౌతుంది.

నీవు నీ చేష్టల ద్వారా సృష్టించిన వాతావరణం నీతోను, నీలోను, నీ చుట్టూతా వుంటుంది. నీవు చేసేది అందంగా, మంచిగా, సమరస భరితంగా ఉంటే నీ వాతావరణం కూడా సుందరంగా, మంచిగా, సమరస భరితంగా

వుంటుంది. అలాకాకుండా, నీచమైన స్వార్థచింతనతో, అధర్మాచరణకు జంకని స్వార్థంతో కర్కశమైన దుష్టసంకల్పంతో వున్నట్లయితే, నీ జీవితంలోని ప్రతిక్షణం దానిని నీవు పిలుస్తుంటావు. అదే నీ దుఃఖానికి, నిరంతర అశాంతికి కారణమౌతుంది, అనగా అందవిహీనత స్వయంగా తన కురూపాన్ని చూసుకొని నిరాశ చెందినట్లుగా వుంటుంది.

ఈ దేహాన్ని వదిలిపెట్టేయడంతో ఆ వాతావరణం నుండి విముక్తుడవుతావని నమ్మకం పెట్టుకోవద్దు. దీనికి భిన్నంగా ఈ శరీరం ఒక రకంగా బాధ తీవ్రతను తగ్గించగల ఒక నిశ్చేతనమైన ఆచ్ఛాదనం. పూర్తి భౌతిక పరమైన ఈ ప్రాణమయ జీవితంలో ఈ శరీరమనే రక్షణ లేకుండా ఉంటే బాధలనేవి మరింత తీవ్రతరమై దేనిని రూపాంతరీకరించాలో, దేనిని సరిచేయాలో తత్ సంబంధిత అవకాశాన్ని కోల్పోతాయి. అట్లాగే ఉన్నతమైన, ఆనందభరితమైన, ఉజ్వలమైన జీవనానికి చైతన్యానికి నిన్ను నీవు తెరిచిపెట్టుకొనే అవకాశం ఇక నీకు చిక్కదు. ఇక్కడే నీ పనిని పూర్తి చేయడానికి త్వరపడాలి, ఎందుకనగా ఇక్కడే, ఈ భూమిపైన మాత్రమే ఆ పనిని నెరవేర్చగలవు.

చావు నుండి ఏమీ ఆశించకు. జీవితంలోనే నీ పరిష్కారం వున్నది. జీవితంలోనే నిన్ను నీవు పరివర్తన గావించుకోవాలి. ఈ భువిపైనే నీవు పురోగమించాలి. ఈ పృథ్విపైనే నీవు సిద్ధింపజేసుకోవాలి. ఈ శరీరంలో వుండే విజయం పొందగలవు.

భయం రుగ్మతకి ద్వారం తెరుస్తుంది

నాకు తెలిసిన మనిషి కేవలం భయంతోనే కలరా బారిన పడ్డాడు. కలరా ప్రక్క ఇంట్లో వారికి సోకింది. దానిని చూచి ఇతను భయానికి లోనయ్యాడు. అంతే, అది ఇతనికి సోకింది. అంతకుమించి మరోకారణం లేదు. కేవలం భయం కారణం గానే అది జరిగింది. ఇది చాలా మామూలుగా జరిగే విషయం. అధికశాతం అంటురోగాల విషయంలో ఇదే జరుగుతుంది. భయంవల్లనే తలుపు తెరచుకుంటుంది, దానితో నీవు రోగం బారిన పడతావు. ఎవరు నిర్భయంగా వుంటారో వారు హాయిగా, స్వేచ్ఛగా, మామూలుగా వుంటారు. వాళ్ళకే జాడ్యమూ ఉండదు. అయినప్పటికీ నేను ఇంత క్రితం చెప్పినట్టు నీ మనస్సులో

భయం లేకపోవచ్చు, నీ ప్రాణికంలోను భీతిలేకపోవచ్చు, కానీ శరీరంలో భయం అనేది లేకుండా ఎవరుంటారు? చాలా కొద్దిమంది మాత్రమే. శరీరాన్ని భయంనుండి విముక్తి చేయటానికి కఠోరమైన క్రమశిక్షణ అవసరం. కణాలు తమంతట తామే కంపిస్తాయి. క్రమశిక్షణ ద్వారా, యోగసాధన ద్వారా మాత్రమే మనిషి ఈ భయాన్ని అధిగమించగలడు. యదార్థంగా భయం ద్వారానే దేనికైనా గురికాగలడు. ఆఖరికి ప్రమాదాన్ని సైతం ఆహ్వానించగలడు. ఒకానొక నిర్దిష్టమైన దృక్కోణం నుండి పరికించితే ప్రతిదీ స్పర్శమాత్రంచేత సంక్రమించేదే. ఒక గాయపడిన వ్యక్తి నాకు తెలుసు. వేరొకరి గాయాన్ని చూసిన భయంతో అతనికి గాయమయింది, నిజంగా గాయమయింది.

కోరికల బారిన పడకుండా నిజమైన రక్షణ

ఒకానొక వ్యక్తికి ఈ సూక్ష్మ భౌతికావరణం ఏ విధమైన కలుషితాలకు లోనుకాకుండా వుంటే, అది అతడిని ప్రమాదాలు, రోగాలనుండి రక్షించవచ్చు.అదే సమయంలో అతడు పూర్తిగా కోర్కెల పుట్టగా కూడా వుండవచ్చు. ఎందుకంటే కోర్కెలనేవి వేరే అవస్థకు చెందినవి. కోరిక అన్నది దైహికమైనది కాదు, అది ప్రాణికానికి చెందినది. ఈ ఆవరణ ప్రాణికానికన్నా అధికంగా భౌతికపరమైనది. అది ప్రాణికాన్ని ప్రాణిక లోకాల్లోకి ప్రవేశింపచేసి అక్కడనుండీ దానికి కావలసిన స్పందనలను స్వీకరించకుండా ఆపు చేయలేదు. సహజంగా ఎవరు తమపై తాము అదుపును సాధించారో, ఎవరైతే తనలోని చైత్యపురుషణ్ణి కనిపెట్టారో, ఎవరైతే ఈ చైత్యపురుషుని సత్తలో సుస్థిరంగా జీవిస్తున్నారో, ఎవరు ఒక సమగ్రమైన బాంధవ్యాన్ని స్థాపించారో, లేక ఆంతరిక దైవ సన్నిధితో నిరంతర సంబంధం ఏర్పరచుకున్నారో వారు జ్ఞానమయమైన, ప్రకాశవంతమైన, సుందరమైన, స్వచ్ఛమైన వాతావరణంతో ఆవరించ బడతారు. ఇదే కోర్కెలనుండి రక్షించబడటానికి అన్నింటికంటే ఉత్తమమైన రక్షణ. అయినప్పటికీ, తనకు తాను అప్రమత్తుడుగా నుండకపోతే కోరికలన్నవి జారబడటానికి అవకాశమున్నది. ఎందుకంటే కోరికలన్నవి బయటనుండే ప్రవేశిస్తాయి. ఒకవ్యక్తి తనలోని కోరికలను అధిగమించి వుండవచ్చు, అయినా అది బయటనుండీ అంటువ్యాధిలా లోనికి రావచ్చు. కానీ ప్రకాశవంతమైన, జ్ఞాన

భరితమైన, శుద్ధమైన ఆవరణం ద్వారా ప్రవేశించినందున అది బలహీనపడి, వున్నట్టుండి గ్రుడ్డిగా, ఆకస్మికమైన స్పందనను పురిగొల్పే ప్రకంపనం లాగా రావటానికి బదులు వ్యక్తికి అతనిలో ఏమి జరుగుతున్నది, ఎట్లాంటి శక్తి అతనిలోనికి ప్రవేశించాలనుకొంటున్నది అన్న విషయం తెలుపుతుంది. అప్పుడు అతడు ఎంతో నిశ్చలంగా — అది అవాంఛనీయమైనదయితే — అది తనలోకి ప్రవేశించకుండా ఒక ఆంతరిక కదలికతో దానిని నిరోధించ వచ్చు. ఇదొకటే నిజమైన రక్షణ, ఒక జాగృతమైన చేతన, శుద్ధమైనది, చురుకైనది. ఇంకా చెప్పాలంటే అది నిదురించనిది. విషయాలు ఏమిటని తెలియకుండా వాటిని లోనికి అనుమతించదు.

CWM 4: 323-24 శ్రీమాత

అనువాదం: సి. హెచ్. హర్షవర్ధనరాజు

ఆలోచనా శక్తి

నైపుణ్యవంతంగా ప్రయోగించబడిన ఒక నిలకడగల ఆలోచన అంధకారం ఆవరించి వున్న ఎన్నో మనసులకు అనుసంధించుటతో వారిని చైతన్యంలోకి మేల్కొల్ప గలదు. ఆ విధంగా ప్రగతిశీలమైన పరిణామ మార్గంలో వారిని నడిపించగలదు. అస్వస్థులైన వారికి అవసరమైన ప్రాణశక్తులను వారివైపు లాగటానికి ఒక మాధ్యమికంగా ఉపయోగపడగలదు. ఒక ప్రియమైన మిత్రుణ్ణి కనిపెట్టి ఉండి ఎన్నో ప్రమాదాలనుండి రక్షణ నీయగలదు. మానసికమైన అనుసంధానంతో, అంతః స్ఫృహతో లేదా ప్రమాదకరమైన దానిపై సూటిగా పనిచేయడంతో హెచ్చరించి అలా చేయగలదు.

దురదృష్టవశాత్తు దీనికి వ్యతిరేకమైనది జరగటం కూడా సత్యమే. చెడు ఆలోచనలకు కూడా యిదే విధమయిన శక్తి ఉండకపోదు. చెడు ఆలోచనలను స్వీకరించటం, వాటిని ప్రసరింపచేయటం వలన కలిగే అపకారాన్ని మనం ఊహించలేము. తత్ఫలితంగా కలిగే ద్వేషం, పగ, అసూయ, శత్రుత్వం, కీడుతలపెట్టే భావనలు, కఠినమయిన తీర్పులు, కులమత విభేదాలు, ఉబుసుపోని కబుర్లు వినటం, తిరిగి చెప్పటం అనేది ఎంత హానికరమో మనకు తెలుసు.

కేవలం మాటలను నిగ్రహిస్తే సరిపోదు, ఆలోచనలను కూడా నిగ్రహించాలి.
CWM 2: 94-95

విద్య, సంస్కారం రక్షిస్తాయి

ఒక పద్ధతి ప్రకారం యింద్రియాలకు ఉద్దీపించబడిన రీతిలో శిక్షణ నిచ్చినప్పుడు, కొద్ది కొద్దిగా ఒక పిల్లవాడిలో సావాసంతో సంక్రమించే అసభ్యత, మొరటుతనం, చౌకబారుతనం తొలగిపోతాయి. ఈ విద్యాబోధన వారి వ్యక్తిత్వంపై కూడా శ్రేయోదాయకమైన ప్రభావాలను కొనితెస్తుంది. నిజమైన సంస్కారవంతమైన అభిరుచిని పెంపొందించుకున్నప్పుడు, ఆ సంస్కారం వలన మొరటుగా, మూర్ఖంగా అసభ్యంగా ప్రవర్తించలేరు. ఈ సంస్కారం, ఈ నిజాయితీ ఉంటే అది వ్యక్తికి ఒక ఉదాత్తతను, ఉదారతను తెచ్చి, అప్రయత్నంగా అతని ప్రవరనలో వ్యక్తమై అతనిని ఎన్నో నిమ్నమైన, వక్రమైన చర్యలనుండి కాపాడుతుంది.
CWM 12: 21

ఎలా జీవించాలో నేర్చుకోవాలి

ఉదాహరణకు మీరొక ఆట ఆడుతున్నప్పుడు ఇలా ఉంటుంది. (శ్రీమాత సంజ్ఞ చేస్తారు) ఆ పైన అది ఒక బిందువు కంపించినట్లు ఉంటుంది. అది పెరుగుతూపోతూ హఠాత్తుగా కూలిపోతుంది, ప్రమాదం జరుగుతుంది. అదొక సామూహిక వాతావరణం, మనం వచ్చి చూస్తూవుంటాం, ఆట మధ్యలో ఉంటాం. బాస్కెట్ బాలో, ఫుట్‌బాలో, మరో ఆట ఏదో జరుగుతూ వుంటుంది. మనం దానిని అనుభూతి చెందుతూ చూస్తాం. అది మీచుట్టూ ఒక పొగలాంటి దానిని తయారుచేస్తుంది. (వేడి, ఆవిర్లు వస్తాయి. అలాంటిదే) అది ఒక ప్రకంపనను ప్రారంభిస్తుంది. ఇంకా, ఇంకా, ఇంకా... ఇంకా... హఠాత్తుగా అక్కడ సమతుల్యత విచ్ఛిన్న మౌతుంది. ఎవరిదో కాలు విరుగుతుంది, క్రిందపడిపోతాడు. పెదవిపైన బంతి తగులుతుంది. అలాంటప్పుడు ఎవరైనా ముందుగానే యిలా జరుగుతుందని చెప్పగలుగుతారు కానీ ఎవరికీ దాని ఎరుక ఉండదు.

అంత విషమంకాని పరిస్థితులలో కూడా ప్రతి ఒక్కరిలో వ్యక్తిగతంగా మీ చుట్టూ స్వంతమయిన, ఒక ప్రశాంతమయిన ఆచ్ఛాదన ఉంటుంది. అది

మిమ్మల్ని మీరు స్వీకరించ ఇష్టపడని వాటన్నింటినుండి పరిరక్షిస్తుంది. నా ఉద్దేశ్యంలో మీ గ్రహణ శక్తి స్వచ్ఛందము, చైతన్యవంతమూ అవుతుంది, లేకపోతె, మీరేమీ గ్రహించలేరు. ఈ చైతన్య పూరితమైన, అత్యంత ప్రశాంతమయిన వాతావరణం — ఆంతర్యంలో నుండి వచ్చినప్పుడు (అది బయటనుండి వచ్చేది కాదు) అది అలా ఉన్నప్పుడే భద్రంగా జీవితంలోకి, అందరిలోకి ఏ పరిస్థితులలోనైనా అడుగుపెట్ట గలదు. లేకపోతే ఏదో ఒకటి పట్టుకుంటుంది. కోపం, భయం, అనారోగ్యం, ఏదో చికాకు అలాంటిదేదో మిమ్మల్ని తప్పకుండా బాధిస్తుంది. అలా చేయడం మొదలుపెట్టాక పిలిచినట్లుగా అటువంటి ప్రకంపనలన్నీ వచ్చి మిమ్మల్ని పట్టుకుంటాయి. ఆశ్చర్యం కలిగించే దేమిటంటే మనిషి ఎంత అచేతనంగా జీవితంలోకి కొనసాగుతాడనేది. వాళ్ళకి చైతన్యవంతంగా ఎలా జీవించాలో తెలియదు. పిల్లలకి ముందుగా నేర్పించవలసినది అదే, ఎలా జీవించాలి అనేది.

CWM 7:145- 46

మానసిక వాతావరణమే ప్రధానం

ఎవరు హృదయపూర్వకముగా దైవానికి విధేయులై వుంటారో, ఎవరు నిజమైన సాధనమార్గంలో జీవితం గడుపుతారో, ఎవరు వారి చేతనను పూర్తిగా దైవంపైన, దైవసేవపైన నిలుపుతారో, దానినే తమ ప్రధాన కర్తవ్యంగా పాటిస్తారో వారికి మాత్రమే, దైవం రక్షణ నీయగలదు. ఉదాహరణకు కోరిక, అపేక్ష, వెసులుబాటు , డంభాచారం, మోసం, అసత్యం ఇత్యాది వాటిపై మోజు దైవరక్షణ లభించే మార్గంలో గొప్ప అవరోధాలు . నీవు దైవంపై నీ ఇచ్ఛాసంకల్పాలను మోపాలని ప్రయత్నిస్తే, అది ఒక బాంబును నీపై పడటానికి ఆహ్వానించినట్లుగా వుంటుంది. విషయాలు తప్పక ఈ విధంగానే జరుగుతాయని నేననను, కానీ మనుషులు, ఒక ఆధ్యాత్మిక సాధకుడి కుండవలసిన మానసిక చేతనతో జాగరూకులై కార్యాచరణ గావించకపోతే, ఆవిధంగా జరగటానికి ఆస్కారం అధికంగా నుంటుంది. ఒకవేళ వారి మానసిక వాతావరణం బాహ్యప్రపంచంలో నున్న మాదిరిగానే వున్నట్లయితే, అసురిక శక్తులు కలిగించ ప్రయత్నిస్తున్న

వినాశనము, బాధ, అపాయముల తాకిడినుండి కాపాడగల దృఢమైన గోడలాంటి కచ్చితమైన రక్షణ లభించదు.

CWM 13: 121

వ్యసనాలనుండి రక్షణ

ఎవరైనా అంటువ్యాధులు ఉన్న వ్యక్తుల సహవాసాన్ని మనం యిష్టపడం, వాళ్ళనుండి జాగ్రత్తగా తప్పించు కుంటాం. సాధారణంగా ఆ వ్యాధి వ్యాపించకుండా ఉండటానికి వాళ్ళను వేరు చేసి ఉంచుతారు. కాని వ్యసనాలు, దుష్ప్రవర్తన, అసత్యం, దుష్టత్వం, అధమమయిన ఈ అంటువ్యాధులకన్నా ప్రమాదకరమైనవి. వీటిని చాలా జాగ్రత్తగా నివారించాలి. ఎటువంటి చెడు లేదా అసహ్యకరమైన పనిచేయటానికి యిష్టపడమని చెప్పే వారినే నువ్వు మంచి మిత్రుడుగా భావించాలి. నిమ్నమయిన ప్రలోభాలనుండి నిగ్రహించుకోగల ధైర్యాన్నతడు యిస్తాడు. అతడే నిజమయిన స్నేహితుడు. నువ్వు అతని తోనే సావాసం చెయ్యాలి. అంతేకానీ నీతో సరదాలలో పాలుపంచుకొని, నీలోని దుష్ట ప్రలోభాలను బలపరిచే వారితో కాదు. అంతే, ఇంక ఈ విషయాన్ని పొడిగించ వద్దు. నేను మనసులో అనుకున్నవారికి నేను చెప్పినది అర్థం అయిందని అనుకుంటున్నా. నీకైనా తెలివైనవారినే మిత్రులుగా ఎంచుకోవాలి., ఎవరి సాంగత్యం మిమ్మల్ని ఉదాత్తమయిన వారిగా చేస్తుందో, మీ పై మీరు ఆధిపత్యాన్ని సాధించటానికి సహాయపడుతుందో, ప్రగతి చెందటానికి మరింత మెరుగుగా ప్రదర్శించటానికి, మరింత స్పష్టంగా చూడటానికి ఉపయోగపడుతుందో, వారినే స్నేహితులుగా ఎంచుకోవాలి. చివరగా, నిజానికి ఉత్తమమయిన స్నేహితుడు భగవంతుడుకాదా? అతనితో అన్నీ చెప్పు కోవచ్చు, దాపరికం లేకుండా అన్నీ విప్పి చెప్పుకోవచ్చు. అక్కడే ఆప్యాయత యొక్క మూలం ఉండేది, ఏ దోషాన్నయినా చెరిపివేయగల శక్తి ఉండేది, అదే నిజమైన ఆత్మ సాక్షాత్కారానికి మార్గాన్ని తెరిచేది. ఆయన మాత్రమే అందరినీ అర్థం చేసుకోగలడు, అందరికీ స్వస్థత చేకూర్చగలడు. మీ మార్గంలో సాయం చేసేవాడు, మీరు విఫలం కాకుండా సాయపడేవాడు, మీరు తప్పులు చేయకుండా, క్రిందపడకుండా మీ గమ్యం వైపు సూటిగా నడిపించేవాడు ఆయనే.

ఆయనే నిజమైన స్నేహితుడు. రోజులు మంచివయినా, చెడువయినా మిత్రుడతడే. మిమ్మల్ని అర్థం చేసుకొని మీ గాయాలు మాన్పి, మీకు అవసరమైనప్పుడు ఎప్పుడూ మీ తోడై ఉండేవాడు అతడే. నీవు హృదయ పూర్వకంగా పిలిస్తే, నిన్ను నడిపించటానికి, నీకు ఆసరాగా నిలువటానికి ఎప్పుడూ సంసిద్ధుడై వుంటాడు, నిజంగా నిన్ను ప్రేమించటానికి కూడా.

CWM 9: 57

అనువాదం: డా. సరోజాప్రసాద్

సరియైన దృక్పథం యొక్క శక్తి

ప్రస్తుతం ఏర్పడబోయే పరిస్థితులలో నీవు సాధ్యమైనంత ఉన్నత దృక్పథం తీసుకోగలిగితే — దీని అర్థం నీవు నీ చైతన్యాన్ని నీకు అందుబాటులో ఉన్న అత్యున్నత చైతన్య స్పర్శలో ఉంచినపుడు— నీకు అవకాశండున్న అత్యున్నతమైనది జరుగగలదని నీవు పరిపూర్ణంగా విశ్వసించవచ్చు. కానీ ఈ చైతన్య స్థితినుండి, దిగువ స్థితికి పడిపోయిన వెంటనే నీకు జరుగవలసినంత మంచి జరుగదనేది స్పష్టం. దీనికి కారణం నీవు నీ ఉన్నత చైతన్య స్థితిలో లేకపోవడమే. నేనింకా ఎంతవరకు నొక్కి చెప్పగలనంటే, నిన్ను ప్రభావితం చేసే ఆవరణలో నీవున్నప్పుడు సరియైన దృక్పథం ఎంతశక్తివంతమైనదంటే, నీ ప్రతి పరిస్థితిని నీ కనుకూలంగా మార్చడమే కాకుండా, ఆ పరిస్థితినే మార్చివేయగలదు. ఉదాహరణకు, ఒక వ్యక్తి నిన్ను చంపటానికి వచ్చినప్పుడు, నీవు నీ సాధారణ చైతన్యస్థితిలో ఉండి విపరీతంగా భయపడ్డప్పుడు వాడు బహుశా, తాను ఏ పని చేయటానికి వచ్చాడో ఆపని చేయవచ్చు. నీవు కొంచెం ఉన్నత చైతన్య స్థితికి వెళ్ళి నీవు భయపడ్డప్పటికీ దైవసహాయంకోరితే, వాడు గురితప్పి చిన్నగాయమే చేయగలడు. కానీ నీవు సరియైన దృక్పథంలో ఉండి, నీ చుట్టూ దైవం ఆవరించివున్నాడనే చైతన్య స్థితిలో వుంటే వాడు తన చేతివేలిని కూడ నీపైకెత్తలేడు. ఈ సత్యమే పరివర్తన సమస్యకు కీలకమైన తాళంచెవి వంటిది. ఎప్పుడూ దైవసాన్నిధ్యంతో స్పర్శకలిగి ఉండు, దానిని దిగువకు తెచ్చే ప్రయత్నం చేయి, అప్పుడు ఎల్లప్పుడూ అత్యున్నతమైనదే జరుగుతుంది. కాని ప్రపంచం ఒక్కమారుగా మారకపోవచ్చు. అయితే అది ఎంత వేగంతో

ముందుకు పోగలదో అంత వేగంతో పోతుంది. యోగ మార్గంలో సూటిగా ముందుకు పోతున్నప్పుడు మాత్రమే ఇలా జరుగుతుందని మరువవద్దు. కానీ నీవు దారితప్పి నిస్సహాయంగా కారడవిలో అటు ఇటు తిరుగుతున్నట్లుగా తిరిగితే, ఇలా జరుగదు.

CWM 13: 154

శ్రీమాత

ఆధ్యాత్మిక మరియు గుప్తశక్తి మార్గాల ద్వారా రక్షణ

ప్రత్యేక దైవరక్షణలో నుండుట, మనుషుడు దానిని పోగొట్టుకొనుట

రక్షణలో ఉండడం అంటే అర్థం అవుతోందా? రక్షణ పోగొట్టుగోవడమంటే అర్థమవుతోందా? నీవొక దైవ విరుద్ధమైన పని చేసినపుడు ఉదాహరణకు, నీవు దైవరక్షణలో ఉన్నప్పుడు క్షణంపాటు ఏదైనా ఒక సందేహం కలిగినపుడు, లేదా ఒక అశుభ ఆలోచన, లేదా ప్రతీకారేచ్ఛ కలిగినపుడు, వెంటనే నీవు రక్షణ నుండి తప్పించ బడతావు. నీవు రక్షణలో ఉన్నప్పుడు, రక్షణ పని చేస్తూ ఉంటుంది. దుష్టశక్తులు నీపై పడకుండా ఉండేందుకు లేదా ఒక ప్రమాదం నీకు జరుగకుండా వుండేందుకు, అనగా నీవు చైతన్యం పోగొట్టుకున్నప్పటికీ నీవు రక్షణలో ఉండడం వల్ల వెంటనే దుష్టఫలితాలు నీకు వాటిల్లవు. కానీ నీవు రక్షణలో లేనప్పుడు అన్ని వేళలా అప్రమత్తంగా ఉండకపోతే దుష్టశక్తులు నీపై దాడి చేస్తాయి, లేదా ప్రమాదాలు సంభవిస్తాయి.

ప్రశ్న: చైతన్యంలో లేనివారి సంగతి ఏమిటి?

స: చైతన్యంలో లేని వారా? ఆ సందర్భంలో కూడా చెప్పాను. నేను సాధారణ మనుషుల గురించి మాట్లడటం లేదు అని.

అట్టివారు ఒక ప్రత్యేక రక్షణలో ఉండరు. సాధారణ మనుషులు సాధారణ పరిస్థితులలోనే వుంటారు. నిరంతరం పర్యవేక్షించే ప్రత్యేక రక్షణలో వారుండరు. వారు సాధారణ జీవన సూత్రాలు అన్నీ పాటిస్తారు. ఈ విధంగా విషయాలను

వారికి చెప్పలేము. నీవు అందరి మనుష్యుల గురించి ఆలోచిస్తూ అందరికీ అలాగే వుంటుందని అనుకుంటున్నావు. అవునా? నేను యోగం చేసే వారి గురించే మాట్లాడుతున్నాను. అందరి గురించి కాదు.

CWM 5/165

శ్రీమాత

దూరముగా ఉన్నవారికి సాయపడుట:

నేను అనేక మార్లు చెప్పాను. ఒకరు స్పష్టంగా, శక్తివంతంగా ఆలోచన చేస్తే, నీవు ఒక మానసిక నిర్ణయం తీసుకుంటావు అని. ప్రతి మానసిక నిర్ణయానికి, దానిని తీసుకున్న వారితో సంబంధం వుండదు, దానికి తనదైన ప్రత్యేక జీవితం వుంటుంది. మానసిక ప్రపంచంలో అది తన ధ్యేయాన్ని నెరవేర్చుకొనే ప్రయత్నం చేస్తుంటుంది. నీ భౌతిక నేత్రాలతో దానిని చూడలేక పోయినప్పటికీ మానసిక ప్రపంచంలో దాని ఉనికి వుంటుంది, దానికి స్వతంత్ర అస్తిత్వం ఉంటుంది. నీవు కచ్చితమైన ధ్యేయంతో ఒక ఆలోచన చేస్తే, అది కొనసాగినంతవరకు దానిని నెరవేర్చే ప్రయత్నం చేస్తూ ఉంటుంది. అందువలన నీవు దూరంలోఉన్న ఒకరికి సాయంచేయాలని తలిస్తే, నీవు ఎలాంటి సాయం చేయదలిచావో, ఎలాంటి ఫలితం కలగాలనుకుంటున్నావో నిర్ణయిస్తే చాలు, అది ఫలిస్తుంది. మానసిక ప్రపంచంలో ఇట్టి ఆలోచనలు అనేకం. ఒకదానితో మరియొకటి పోటీ పడుతుంటాయి. అందుచేత ఆ నిర్ణయం సఫలం అవుతుందని అనలేము. అందుచే మిక్కిలి బలమైన, సర్వదా నిలచి వుండగల, ఆలోచనే ఉత్తమ ఫలితాలివ్వగలదు.

అయితే, దేనివల్ల ఈ మానసిక రూపాలకు ధ్యేయాన్ని అంటిపెట్టుకొనే గుణం, బలము వస్తాయి?

అది ఉద్వేగం, ఇచ్ఛ వలన ఈ మానసిక రూపాలకు ఉద్వేగం, అభిమానం, సున్నితత్వం, ప్రేమ, ఇచ్ఛాతీవ్రత, క్రియాశీలత ఎలా అందించాలో నీకు తెలిస్తే, వాటికి లక్ష్యాన్ని సాధించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇది మొదటి పద్ధతి. ఎలా ఆలోచించాలో తెలిసినవారు, అందులోను ఎలా ప్రేమించాలో కూడా తెలిసిన వారు, ఇది చేయగలరు. కాని నేనిదివరకు

చెప్పినట్లుగా ఈ మానసిక ప్రపంచంలో పోటీ ఎక్కువగా ఉండడం వల్ల, వీని శక్తి పరిమితము.

అందువలన ఒకరికి ఈ విషయాలపై ఏమాత్రం జ్ఞానం లేనప్పటికీ, దైవకృప పై నమ్మకముంటే, ఈ ప్రపంచంలో దైవకృప అనేది ఒకటి ఉన్నదనే విశ్వాసముంటే, ఆ ఒకటి ఏదో నీ ప్రార్థనకు, అభ్యర్దనకు, ఆకాంక్షకు జవాబివ్వ గలదు. అందుచే ఒకరు తన మానసిక నిర్ణయానికి వచ్చిన తరువాత దానిని దైవకృపకు సమర్పించి, దైవకృపపై నమ్మకముంచితే, ఈ విషయమై దానిని కల్పించుకోమని కోరితే, అది తప్పక కల్పించుకుంటుందని నమ్మితే, అతనికి విజయావకాశం తప్పక ఉంటుంది.

CWM 8/253

శ్రీమాత

అజేయమైన స్థితిని పొందు

తప్పుదారి పట్టించబడిన , వక్రించబడిన గుప్త విద్య శక్తి ఒకటున్నది. దానిని దుష్ఫలిత ప్రయోజనమని, మాంత్రికవిద్య అని అంటారు. అది ఎవ్వరూ, ఎప్పుడూ స్పృశించకూడనిది. కాని దురదృష్టవశాత్తు కొందరు కేవలం రాక్షసత్వం వల్ల, దీనిని ప్రయత్నిస్తారు. అది ఒక మాయ అని, మూఢవిశ్వాసమని మీరు నమ్మకూడదు. అది వాస్తవం. ఇంద్రజాలం తెలిసినవాళ్ళు, చేసేవాళ్ళు, కొందరున్నారు. దీనితో వారు చాలా అసహ్యకర ఫలితాలు సాధిస్తారు. ఎప్పుడైతే భయంలేకుండా, రక్షణ పొంది, వున్నావో అప్పుడు కాపాడబడతావు అనేది సర్వ విదితమే. కాని, 'ఎప్పుడైతే', అనే షరతు ఒకటి వుంది. ఆ షరతు పాటించక బడక పోతే అత్యంత దుష్ఫలితాలు సంభవింపవచ్చు. నీవు పవిత్రంగా, శక్తివంతంగా అనగా ఒక అజేయమైన స్థితిలో నున్నంతవరకు నీకు వ్యతిరేకంగా ఏదైనా జరిగితే— ఒక టెన్నిస్ బంతి గోడకు కొట్టితే తిరిగి వెనుకకు వచ్చి తగిలినట్లుగా— ప్రయోగించిన వారికే తిరిగి తగులుతుంది.

వారి రాక్షసత్వానికి వారు మరింత అధికంగా శిక్షించబడతారు. కాని, ఇదంతా, ఎవరిపై ప్రయోగం జరుపబడిందో వారి అంతరంగ బలం, స్వచ్ఛతపై ఆధారపడివుంటుంది. ఇటువంటి సందర్భాలు నాకు ఎదురైనాయి. ఇట్టి

సందర్భాలను నిరోధించటానికి నేను చెప్పినట్లు ప్రాణికంలో ఒక యుద్ధవీరుడిలా అంటే, ఆధ్యాత్మిక ప్రాణికంలో యుద్ధవీరుడు అయి వుండాలి. నిజాయితీగా యోగంచేసే వారందరు తప్పనిసరిగా అలా అవాలి. అలా ఉంటే, వారు రక్షణ పొందుతారు, సంపూర్ణంగా. అలా అవటానికి ఒక షరతు ఏమంటే, ఎవరి పైన దురాలోచన గాని, దురభిప్రాయం గాని, దుష్టకోరిక గాని, కలుగరాదు, లేకపోతే నీవు కూడా వారి స్థాయికి దిగజారుతావు, భంగపడతావు.

CWM 5/178-79 శ్రీమా

అనువాదం: ఎస్.ఎమ్. సోమయాజుల

రాళ్ళు శక్తి నిక్షేపాలు

రాళ్ళు శక్తిని చిరకాలం దాచి వుంచగలవు. కొన్ని రాళ్ళు సంధాన కర్తలుగా ఉపకరి స్తాయి. కొన్ని శక్తిని నిలువ వుంచటానికి ఉపయోగ పడతాయి. కొన్ని రక్షణ నీయగల శక్తిని కలిగి వుంటాయి. అది ఎంత వింతైన విషయంకదూ 'అమెథిస్ట్' అనబడు పద్మరాగమణి వంటి రాళ్ళకు రక్షణ కల్పించే శక్తి వుంటుంది దానిని ధరించే వారికి అది రక్షణ నిస్తుందనుట వాస్తవం, అత్యాసక్తికర విషయం నా అనుభవం కూడా. రక్షణ నీయగల శక్తివంతమైన ఇలాంటి రాయిని కలిగియున్న ఒకరు నాకు తెలుసు. అతను దానిని ధరించినప్పుడు అద్భుతంగా నుండేది... జోస్యం చెప్పటానికి ఉపకరించే రాళ్ళున్నాయి. జరగబోయే సంఘటనలను వాటిద్వారా గ్రహించే నేర్పు గలవారున్నారు. అవి శక్తిని దాచివుంచటానికి ఉపయోగపడతాయి. గనక శక్తి యొక్క మూలాధారం సైతం వాటిలో ఇమిడి వుంటుంది. అలాకాకపోతే, వాటికి ధారణశక్తి వుండేది కాదు. అవి రూపొందుతున్న ఆరంభ దశలో ఈ విధమైన శక్తియే స్ఫటికాల్లో మాదిరిగా, పరిపూర్ణ పొందిక గల సుందరమైన ఆకృతులు దాల్చుటకు మూలమై వుంటుంది. ఇది జరగటానికి గల ఒకే కారణం దివ్యశక్తి వాటి కేంద్ర స్థానంలో వుండటమే. అంతరంగ ఇంద్రియ సంవేదన లేనందున మనిషి ఇది గ్రహించలేక పోతున్నాడు. ఒక్కసారి విషయాల వెనుకనున్న ప్రేమతత్వశక్తుల గురించిన ప్రత్యక్ష జ్ఞానం కలిగిందంటే, అంతటా అవే శక్తులు నెలకొని వున్నాయని బోధపడుతుంది. నిశ్చితంగా రూపొందిన

వాటిలో కూడా, అవి నిర్వచించేదేమిటో అర్థమవుతుంది.

CWM 5: 229

మరణానంతర ప్రస్థాన సమయంలో రక్షణ

సాధారణంగా దేహత్యాగం చేసే సమయమందు వ్యక్తి పొందే అత్యంత భౌతికమైన ప్రాణిక స్థితిని "మరణావరణస్థితి" అంటారు. జీవితంలోని ఈ అంకం వ్యక్తపరచటం ఎలా? మామూలుగా జీవితమంతటిలోకి అత్యంత చైతన్యవంత్వ మైన దశ మరణాసన్న సమయాన సంభవిస్తుంది. (బహుశా 'చావుతెలివి' అనేది అదేనేమో!) ఆ స్థితి, ఆ భౌతికమైన ప్రాణిక లోకం, కటికచీకటి మయం హానికర కోర్కెలు, సంకల్పాలు, కేంద్రీకృతమైన ప్రతికూల మనోభావాలతో నిండి వుంటుంది. అవి క్షణకాలం నిలిచివుండే ప్రకృతి సహజమైన అస్తిత్వం కలిగి వుంటాయి. రక్తం త్రాగే భూతాలవంటివి. మానవ జీవుల అవశేషాలను పీక్కు తినేవి, అందువలన ఆ క్షణంలో మరణిస్తామన్న భయంతో కొద్దిమంది మాత్రమే భయంలేకుండా, సచేతనంగా, సంపూర్ణ అవగాహనతో మరణిస్తారు. మామూలుగా వారికి అది ఒక ఊహించని దుస్సంఘటన, చిట్టచివరి దుస్సంఘటనలా వుంటుంది. మరణిస్తున్నామన్న భయం కలుగగానే ఆ ప్రతికూల మనోభావాలు వెడలిపోతున్న ప్రాణిక శక్తిపై విరుచుకపడి దానిని కబళిస్తాయి. వ్యక్తి జీవించి వున్నంతకాలం అవి అతనిని తాకలేవు. మనకందరికీ నిద్రలో ఒక ప్రమాదభరిత సంఘటన తటస్థించినపుడు గుండె బరువెక్కి హఠాత్తుగా మేల్కొంటాము, తిరిగి దేహంలోకి ప్రవేశిస్తాము. కారణం నీ దేహమే నీకు ఆశ్రయం గనుక. దేహంలో నున్నంతవరకు అవి నిన్ను ఏమీ చేయలేవు. కాని దేహంనుండి పూర్తిగా బయట పడినప్పుడు (నేను ఇదివరలో పేర్కొన్న బంధం కూడా నీవు బయల్పడినప్పుడు కొంతమేరకు రక్షణ నిస్తుంది.) ఆ బంధం తెగిపోయి, నీవు నీ దేహాన్ని పూర్తిగా కోల్పోయినప్పుడు, ఉదాహరణకు మరణించే వారిని ప్రేమించేవారు ఇంకా జీవించి వుంటే, ఆ సమయంలో వారు తమ ఆలోచనలను ప్రేమను అతనిపై కేంద్రీకరించితే, అతనికి దానిలో ఆశ్రయం లభిస్తుంది. ఇది అతనికి ప్రతికూల భావాలనుండి పూర్తి రక్షణనిస్తుంది. కానీ ఒక వ్యక్తి ఆ సమయాన తాను హాని

కలిగించినందున తనపై ప్రత్యేకమైన మమకారంగాని, ప్రేమగాని లేనివారు
లేక పూర్తిగా అచేతనా స్థితిలో నున్నవారు తన చుట్టూ వున్నట్లయితే, అతను
ఆ ప్రతికూలశక్తులకు బలి కాబడతాడు.

అయితే ఇదంతా సాధారణంగా చోటుచేసుకొనే పద్ధతి. ఇలాంటి
ప్రమాదాలనుండి తప్పించుకొనటానికి ప్రాణిక ప్రపంచంలో కొన్ని వంతెనల లాంటి
రక్షిత మార్గాలు నిర్మించబడ్డాయి. దేహత్యాగం చేసినవారికి ప్రవేశమిచ్చి
ఆశ్రయు మిచ్చి, రక్షణ నొసగే పరిసరాలున్నాయి. ఎన్నో రకాల ఇతర
పరిస్థితులున్నాయి. నేను ఇప్పుడు చెప్పినదంతా సామాన్య మానవుడిగా
మరణించే వారికి మామూలుగా లభ్యమయ్యే స్థితి, కానీ కొంత ఉన్నత శ్రేణికి
చెందిన వారి విషయంలో ఈ స్థితి మారుతుంది. జీవిలో ఒక విశిష్టమైన పరిణతి
చోటు చేసుకుంటే తప్ప, మామూలుగా అందరికీ కలిగే స్థితిలో మార్పు ఉండదు
కొందరికి వారి అస్తిత్వంలో వివిధ అంశాల అనుసంధానం ఎంత దృఢమైనదిగా
నుంటుందంటే వారు ఏ మాత్రంకూడా దేహంపై ఆధారపడి ఉండరు— అది
వున్నా, లేకున్నా.

CWM 6: 56

మరణించినవారికి రక్షణ

ఈ దృష్టితో పరిశీలించితే, ఒకవేళ నీకు మరణించిన వాడితో గాఢమైన
చిత్తశుద్ధితో కూడిన ప్రేమానుబంధం వుండి, నీవు స్వతస్సిద్ధంగా ప్రశాంత
చిత్తుడివై, తగినంత శక్తివంతుడివైనట్లయితే, ఆ మరణించిన జీవి నీ
ప్రేమానురాగ భరితమైన వాతావరణంలో ఎంతో కొంతకాలం ఆశ్రయం
పొందటానికి ఇచ్ఛగించవచ్చు. ఈ పరిమాణం యొక్క అర్థం, వారిద్దరి మధ్య
చాలా దగ్గర సంబంధం వున్నదని, అది చాలా సన్నిహితమైనదని తెలుస్తుంది
మరణించిన వారిని గురించి మానసిక సంవేదన వీలుపడదు అనే దృఢనమ్మకం
నీకు లేనంతవరకు, అతనితో నీవు మానసిక స్థాయిలో సంబంధమేర్పరుచ
కోవచ్చు, సమాచారం ఇచ్చి పుచ్చుకోవచ్చు. అయితే అది ఒక అసాధారణ
స్థితి అయి వుంటుంది. ఎందుకనగా మామూలుగా నీ స్థితి అతనికి యదార్థమైన
రక్షణ నొసంగగల ప్రశాంతత, శక్తి గలదైనట్లయితే, దేహత్యాగం చేసిన వ్య

గాఢమైన విశ్రాంతిని పొందటానికి ఆ వాతావరణంలోకి ప్రవేశిస్తాడు. అతని విశ్రాంతిని భంగపరచడం మంచిదికాదు. నీవు చేయగలిగిన మంచి ఏమిటంటే అతనికి నీ ప్రేమానురాగాల ఆదరువు నిచ్చి, అక్కడ ప్రశాంతంగా వుండ నీయడమే.

CWM9: 362

ఒక సంరక్షక వాతావరణం

దీనిలోని భావమేమిటంటే, ఒక వ్యక్తి పరమ సత్య తత్వానికి చేరువకాగానే, అన్ని విధములైన మోసపూరిత చేష్టలనుండి, కపట వేషాల నుండి, అసత్య వాతావరణం నుండి సురక్షితంగా నుంటాడు. దీనిని గురించి నాకు లెక్కలేనన్ని నిర్ద్వంద్వంగా నిజమైనవని నిరూపించబడిన రుజువులున్నాయి. అందువలన ఎవరైనా నిజమైన అతీంద్రియ శక్తులు కలిగి వున్నారంటే అదే సమయాన వారిలోని ఆంతరిక సత్య బలంతో ఎలాంటి మంత్రవిద్య ప్రయోగాన్నైనా — అది నిరపాయమైనది, గాని హానికరమైనదిగాని — కేవలం ఆ సత్యశక్తియొక్క ఒక్క బొట్టుతో త్రిప్పి గొట్టగల బలం పొందుతారని నిష్కర్షగా చెప్పవచ్చు. ఆ శక్తిని నిరోధించగలిగిన దేదీ లేదు. మంత్రవిద్య నభ్యసించేవారికి ఈ విషయం బాగా తెలుసు. అన్ని దేశాల్లో, ప్రత్యేకంగా భారతదేశంలో, వారు ప్రయోగాలను యోగులపైన, సాధువుల పైన ప్రయుత్నించకుండా జాగ్రత్తపడతారు, ఎందుకనగా అత్యల్పమైన యాంత్రికమైన శక్తిగల మాంత్రిక ప్రయోగాలు, బంతి గోడకు తాకి, తిరిగి వారిపైనే బడునట్లుగా , ప్రయోగించిన వారికే హాని కలుగజేస్తాయి. యోగి గాని, సాధువుగాని ఏమి చేయనక్కరలేదు. తనను తాను రక్షించుకోవాలని కూడా కోరుకోడు. రక్షణ అయాచితంగానే లభిస్తుంది. అతను ఒక చేతనావృతమైన ఆంతరిక శక్తిగల స్థితిలో నుంటాడు. అది అతనికి నిమ్న స్థాయికి చెందిన దాడులనుండి రక్షణ కల్పిస్తుంది. సహజంగానే, అతడు తన శక్తిని ఇతరులను రక్షించటానికి కూడా మనః పూర్వకంగా వాడగలడు. చెడు సంకల్పాలను తన వాతావరణం నుండి వెనక్కు త్రిప్పి కొట్టగలశక్తి తనంతటతానే అతనిని రక్షిస్తుంది. ఒకవేళ ఆ చెడు సంకల్పం అతడు రక్షిస్తున్న లేక అతని రక్షణ కోరిన వారి పైన ప్రయోగించబడినప్పుడు అతడు తన వాతావరణం

యొక్క, తన తేజస్సుయొక్క ప్రభావంతో వారిని రక్షించవచ్చు. ఇక ఆ ప్రయోగం త్రిప్పికొట్టబడి దానిని ప్రయోగించిన వారిపైనే దాడి చేయడం యధావిధిగా జరిగి పోతుంది. కానీ ఇట్టి సందర్భాలలో ఆ యోగి, లేక సాధువు యొక్క చేతనా పూర్వక సంకల్పం అత్యావశ్యకం. జరిగిందేమిటో అతనికి తెలియ చేయాలి. ఆ పైన అతను జోక్యం చేసుకోవాలని నిశ్చయించుకోవాలి.

CWM 9: 392

అనువాదం: నాగరాజు రామస్వామి

అంతర్గత ఇంద్రియాలు

ఇట్లాంటి అనుభవాలు నేనెన్నింటినో చూశాను. ఉదాహరణకు, నేను పర్వత శ్రేణులలో నడుస్తున్నప్పుడు సంభవించిన విషయం చెపుతాను. నేను ఒక ఇరుకైన దారివెంట పర్వతం ఎక్కుతున్నాను. ఆ దారిలో ఒకరు మాత్రమే నడిచే వెసులుబాటు వుంది. ఒక ప్రక్క ఎత్తైన శిఖరం, రెండో ప్రక్క లోతైన లోయ! నేను ముందు నడుస్తున్నాను. నా వెనుక ముగ్గురు పిల్లలు కూడా వస్తున్నారు. వాళ్ళతోపాటు సామానులు మోసుకువచ్చే వాడూ ఉన్నాడు. దారి శిఖరం అంచునే వుంది, ఎటుపోతున్నామో తెలియటంలేదు. కాలు జారితే అఖాతంలో పడటమే!

అడుగులు జాగ్రత్తగానే వేస్తున్నా. ఆ పరిస్థితిలో నాకు ఒక పాము ఎదురుగా దారిలో కనబడింది. నా చర్మచక్షువులకు కాదనుకోండి. అతి జాగ్రత్తగా ఒక్క అడుగు ముందుకు వేశాను. నిజంగానే అవతల పాము ఎదురుచూస్తున్నది. నేను సంభ్రమాశ్చర్యాలకు లోను కాలేదు, కారణం నేను దానిని అదివరకే గమనించాను గనుక. నేను స్పష్టంగా కళ్ళతో చూశాను. నాకు భయంగాని ఆశ్చర్యం గాని కలుగలేదు. కాబట్టి "జాగ్రత్త, నిశ్శబ్దం, కదలవద్దు" అని పిల్లలను హెచ్చరించాను. ఉన్నట్టుండి అదిరిపడితే ఏ ప్రమాదమైనా జరిగేదేమో! ఆ పాముకు మా సవ్వడి తెలిసినట్లుంది. చుట్టచుట్టకొని దాని పుట్టముందు ఆత్మరక్షణకు సిద్దపడ్డట్టుగా వుంది. అది తల ఆడించటం మొదలుపెట్టింది. అది కట్లపాము అని మేము గ్రహించాము.

ఈ సంఘటన ఫ్రాన్స్‌లో జరిగింది. మాకు ఏ ఆపదా రాలేదు. అదిరిపడి

కంగారు పడితే ఏ ప్రమాదమైనా జరిగేదేమో! ఇట్లా నాకు ఎన్నో అనుభవాలు ఎదురైనాయి. వందలసార్లు! ప్రతీసారీ ఆకరి క్షణంలోనే ప్రమాదపుటంచున ఉన్నానని గ్రహించేదాన్ని.

రక్షణయొక్క కాంతి వలయం

ఒకసారి ఫ్రాన్స్ లో నేను "సెయింట్ మైకేల్ వీధి" దాటుతున్నాను. అది నేను నిర్ణయానికి వచ్చిన చివరి రోజులలో జరిగింది. నా నిర్ణయం ప్రకారం కొన్ని మాసాలలోనే అతీంద్రియ మానసిక శక్తి ద్వారా నేను అంతర్గత దివ్యత్వాన్ని చేరుకోవాలి. అది మాత్రమే నా మనస్సులో వుండేది. ఇక ఏ విషయాన్ని పట్టించుకునే దాన్ని కాదు. నేను ఆ రోజుల్లో 'లగ్జెంబర్గ్' ఉద్యానవనం సమీపంలో ఉండే దాన్ని. ప్రతి సాయంత్రం ఆ పార్కులో నడిచేదాన్ని కూడా. కాని ప్రతిక్షణం నా అంతరంగంలోనే మునిగివుండేదాన్ని. ఆ ప్రదేశంలో ఒక చోట రెండు రోడ్లు కలిసిన కూడలి వుండేది. పరధ్యాసగా వుంటే దాన్ని దాటటం ఏమంత సులభం కాదు. అది దృష్టిలో పెట్టుకొని దాన్ని దాటాలి. ఒకసారి పరధ్యాసగా అట్లా దాటుతుంటే ఉన్నట్టుండి అదిరిపడ్డాను. ఏదో వెనుకనుండి కొట్టినట్లు అనిపించింది. అప్రయత్నంగా వెనుకకు దూకాను. ఒక్క క్షణంలో ఒక ట్రాము బండి నాముందునుండి దూసుకొని వెళ్ళింది. ఎంత మూరెడు దూరంలో ఇది జరిగింది. నన్ను రక్షణగా ఆవరించి ఉన్న కాంతి వలయం దాన్ని తాకింది కూడా. అప్పుడు నాకు రక్షణ కాంతివలయం కూడా బలంగా వుండింది. అదీగాక రహస్య విద్యాభ్యాసంలో నిమగ్నమై ఉన్నాను. అందువలన ఆ తాకిడిని నేను భరించ గలిగాను. నా దేహంపై దాడి చేయబడి నేను వెనుకకు త్రోయబడినట్లుగా వుండింది. ఆ అనుభూతి అవసరం, అది నీ శక్తిసామర్థ్యాన్ని పెంచుతుంది. నాకు అతీంద్రియ విద్య నేర్పినవారు కూడా దీన్ని నాకు వివరించారు. నేను నిత్యజీవితానికి అత్యంత ఉపయుక్తమైన భౌతిక ఇంద్రియ సంవేదనలను పోగొట్టుకుంటున్నానట. ఇది పరమసత్యం. మన ఇంద్రియ జ్ఞానంతో మామూలుగా తెలుసుకోగల విషయాలకన్నా ఎక్కువగా తెలుసుకోగలం. అవి మానసికమైనవే కాదు, శారీరకమైనవి, ప్రాణికమైనవి కూడా అని వారన్నారు.

CWM10: 339

రక్షిత వాతావరణంలో సుదూరంలో వుండటం

నీ చుట్టూ ఓ గోడలాంటి రక్షణ వలయాన్ని ఏర్పరచగల ఒక అత్యంత ప్రశాంతమైన స్పందన అనుభూతి పొందటం ఎలా అని తెలుసుకోగలిగితే, నిన్ను నీవు ఒక రక్షితవలయంలో ఉంచుకోగల విధానం ఒకటుంది. కాని ఎప్పుడూ బయట ప్రపంచంనుండి ఆ స్పందనను భంగపరిచే స్పందనలు వస్తూనే వుంటాయి. నీవు గనుక ఆ విషయం గ్రహించ గలిగితే ఇలా, ఇలా, ఇలా బయటనుండి వచ్చే వాటికి ప్రతిచర్య జరుగుతూ వుండటం కూడా నీకు తెలుస్తూనే వుంటుంది. (శ్రీమాత చేతివ్రేళ్ళతో సంజ్ఞలు చేస్తారు)ఎప్పుడూ నీ అంతరంగంలో నుండి ఉత్పన్నమయ్యే ఒక ప్రశాంత వాతావరణం నిన్ను ఒక ఆచ్ఛాదనలా చుట్టుకొని వుంటుంది. నీవు ఏ దిశగా వెళ్ళాలన్నా, బయటనుండి వచ్చే స్పందనలు నిన్ను గాని, నీ వాతావరణాన్ని గాని, ఏమీ చేయలేవు. (శ్రీమాత చేతితో సంజ్ఞ చేస్తారు)

CWM 7: 144

నిద్రించే ముందు ప్రార్థించు

ఇది నీవు చేయగలిగినదే. నిద్రించే ముందు ఏకాగ్రతతో అన్ని వత్తిడులను, ఆదుర్దాలను ప్రక్కన పెట్టి విశ్రాంతిగా వుండే ప్రయత్నం చెయ్యి. నీ శరీరం ఒక దుప్పటిలా నీ ప్రక్కమీద ఉన్నట్లు నీవు భావించాలి. అది కండరాలు బిగుసుకు పోయి మెలికలు తిరిగే స్థూల శరీరమని భావించవద్దు. ఇక ప్రాణికం విషయానికి వస్తే దానిని వీలయినంత ప్రశాంత పరచు. మానసిక సంవేదనలు విషయంలో కూడా అంతే. ఏ కార్యక్రమముపై ధ్యాస పెట్టవద్దు. మెదడు శాంతపడాలి. దానికి వీలయినంత నిశ్శబ్దత రావాలి. ఏ ఆలోచనలూ రానివ్వ వద్దు, ఏ ప్రయత్నం గురించి తలపోయవద్దు. వీలయినంత నిశ్శబ్దాన్ని, విశ్రాంతిని అనుభవంలోనికి తెచ్చుకోవాలి.

ఇలా చేసిన తరువాత నీకు ఇష్టమైన లేక అలవాటైన ఏదైనా ప్రార్థననో, ధ్యేయాన్నో దీనికి జోడించి వ్యతిరేక శక్తులనుండి, దైవానుగ్రహంతో రక్షణ కోరుతూ నిద్రకు ఉపక్రమించవచ్చు. అట్టి నిద్రలో మీకు రక్షణ వస్తుంది. దాని

వలన మీ ఏకాగ్రత పెరుగుతుంది. బాగా నిద్రపోవడం అంటే ఇదే. ఇక జరగబోయేది నీ అంతర్గత స్పందనలపై ఆధారపడి వుంటుంది. ఇలా నిరంతరం చేయగా చేయగా కొన్నాళ్ళకు దాని ప్రభావం చూపుతుంది.

CWM 7: 66

నిజాయితీయే రక్షణ

ప్రశ్న: ఆధ్యాత్మిక జీవనానికి అవసరమైన ప్రాథమిక సద్గుణం ఏమిటిమాతా?
జ: నేను ఈ విషయం గురించి ఇదివరలో ఎన్నోసార్లు చెప్పాను. మళ్ళీ చెప్పటం ఒక అవకాశంగా భావిస్తున్నాను. నిజాయితీయే ఆ ప్రాథమిక సద్గుణం. అట్టి నిజాయితీ పరిపూర్ణము, నిరపేక్షము అయి వుండాలి. కేవలం నీలోని నిజాయితీయే ఆధ్యాత్మిక మార్గంలో నీకు రక్షణ. నిజాయితీ లేకపోతే ఈ మార్గంలో తొలిమెట్టులోనే దెబ్బతింటావు. నీ మార్గానికి అన్ని రకాల దుష్టశక్తులు, ప్రభావాలు అవరోధంగా నిలుస్తాయి. నీ నిజాయితీ ఏమాత్రం లోపించినా అవి నీపై విజృంభించి నిన్ను నీ ప్రయత్నాన్ని చిత్తు చేస్తాయి.

కాబట్టి ఏది చెయ్యాలన్నా, దేన్ని ప్రారంభించాలన్నా కనీసం ప్రయత్నించాలన్నా, నిజాయితీ ప్రాథమిక అవసరం. అంతేకాదు ఆ నిజాయితీని ఇంకా ఇంకా పెంచుకోవాలనే ఆకాంక్ష కూడా వుండాలి. అదే నీ ముందుండి నిన్ను కాపాడగల ఒక రక్షణ కవచం.

CWM 8: 247

సత్యమే రక్షణ

నాకు తెలిసిన ఒక సన్యాసి తనకు శిష్యుడుగా ఉండనందుకు ఒకానొక వ్యక్తిపై విరుచుకు పడ్డాడు. అట్లాంటివాడు అహంకార మమకారాలను జయించిన నిజమైన సన్యాసి అవుతాడా? పైగా అతనికి ప్రతీకార వాంఛ కూడా ఉన్నది. అతనికి కొన్ని అతీంద్రియశక్తులు వున్నాయి. తనను కాదన్న వ్యక్తిని చంపాలని నిర్ణయించు కున్నాడు. ఏదో కారణాలవల్ల ఆ సన్యాసి శ్రీఅరవిందులను కలవటం, తన కథ వారికి చెప్పటం సంభవించింది. ఆ వివరాలు శ్రీఅరవిందులు నాకు చెప్పారు. అదే ఈ కథ.

చివరకు జరిగిందేమిటంటే ఆ సన్యాసికి గల మంత్రశక్తులు ఆయనకే ఎదురు తిరిగి తానే చివరకు ప్రాణాలు కోల్పోయాడు. సత్యమే చివరకు విజయం సాధించింది. ఇక అతను చేయగలిగింది ఏమీ లేదు.

ఈ కథలోని నీతి ఏమిటంటే, ఎవరైనా నటించకూడదు. తనేమిటో తానుగానే ఉండాలి. సంపూర్ణ చిత్తశుద్ధి కలిగి ఉండాలి. తన ఇష్టాఇష్టాలను సున్నితమైన సిద్ధాంతాలతో కప్పి పుచ్చకూడదు.

ప్రశ్న: అమ్మా! ఇట్లాంటివాళ్ళకు అలాంటి శక్తులు అసలు వుంటాయా?

జ: ఉంటాయి. కొందరికి అధికంగా వుండవచ్చు. కాని ఈ శక్తులు కేవలం ప్రాణికంలోనే ఆవిర్భవిస్తాయి. వాటికి ప్రాణికమైన ఉనికి మాత్రమే ఉంటుంది. శక్తులు అనేక రకాలు. దివ్యశక్తి ముందు నిలబడలేనివి ఎన్ని వుంటే ఏమి? కాని వాటికి సాధారణ మానవులను లోగొనటానికి తగిన బలం వుంటుంది.

ప్రశ్న: అప్పుడు అవి మనకు హాని చేస్తాయేమో?

జ: అవును, తప్పక చేస్తాయి కూడా. చాలా హాని చేస్తాయి. చాలామంది అట్లాంటి సన్యాసుల బారినపడి చాలా నష్టపోయారు. అవును చాలామంది. ఇది అంతా మిమ్మల్ని భయపెట్టేందుకు చెబుతున్నది కాదు. మీకు రక్షణ వున్నది. కాని ఇది యదార్థమైన విషయం. ఇట్లా జరిగిన సందర్భాలు అనేకం వున్నాయి. ఇలాంటి వారికి జరిగిన ఉపదేశం ప్రాణికసత్తాకు మాత్రమే చెందినది అయి వుంటుంది. ఇది చాలా ప్రమాదమైనది. అలాగని అన్నీ ఇలాంటివే అనికూడా చెప్పలేను. కాని ఇలాంటివి చాలా జరిగాయి. అంతే.

నిజాయితీ ఒకటే ఈ ప్రపంచంలో చాలా అరుదైన సద్గుణం. అది తారసపడినప్పుడు దాని ముందు ఎవరైనా మోకరిల్ల వలసిందే. నిజాయితీ అంటే పరిపూర్ణ ఋజువర్తనం. అది పూర్తిగా పారదర్శక మైనది. అందులో దాచవలసినది నర్మగర్భంగా చెప్పేవి, కపట బుద్ధితో చేసేవి ఏమీ ఉండవు.

శ్రీమాత

పాదసూచిక:

ఇదంతా ఎవరైతే తమ తీవ్ర వాంఛలను సాధారణంగా గౌరవించబడే కాషాయవస్త్రాల మాటున కప్పివుంచ ప్రయత్నిస్తారో వారికి సంబంధించినది.

స్వచ్ఛమైన హృదయం కలిగి, ఆధ్యాత్మిక జీవితానికి సమగ్ర సమర్పణ చేసుకొనిన దానికి బాహ్యచిహ్నంగా వస్త్రధారణ వుంటుందో, వారి విషయంలో సమస్య తలెత్తదు.

CWM 8: 72

అనువాదం: కె.ఆర్. ఎల్. నరసింహారావు

దైవరక్షణ

మహాపదార్థమును ఉన్నతోన్నతమైన దివ్యశక్తికి శీఘ్రంగా గ్రహించేటట్లు చేయడం

నేను ఈ విధమైన ముగింపుకు వచ్చాను. నేను దర్శించాను, నేను పరిశీలించాను. మరి వేరేపదం లేకపోవడం మూలంగా మనం "అతిమానసం" అని పిలిచే దానిని నేను చూశాను. ఈ దివ్య అతిమానసం సృష్టిని ఉన్నతోన్నత దివ్య ఆధిపత్య శక్తిని ఇంకా ఎక్కువగా చేస్తుంది. దివ్యం అని అంటారు. ఇంకా ఎక్కువగా సున్నితం కావిస్తుంది. మనం ఉన్నతస్థితితో పోలిస్తే, అది దివ్యం, కాని ..... అది ఒక విధమైన దేదో (అవరోహణ, ఒత్తిడిని సూచించే సంజ్ఞ) మహాపదార్థమును తప్పక ఇంకా సున్నితత్వం కావించాలి. ఇంకా ఎక్కువ ..... దివ్యశక్తికి "ప్రత్యుత్తరమిచ్చేది"గా చేయాలి. దానిని చెప్పటం ఎట్లా? ప్రస్తుతం దృశ్యమానం కానిది లేక ఇంద్రియ గ్రాహ్యం కానిది మనకు అవాస్తవం (నేను చెప్పేదాని అర్థం సర్వసాధారణ మానవజాతికి అని) మనం "నిర్దుష్టంగా ఉన్నవాటిని యదార్థ వస్తువులని " అంటాం. ఆ విధంగా లేనివనీ అంటాం. కాని భౌతికం కానటువంటి ఈ దివ్య దార్ఢ్యత, ఈ దివ్య ఆధిపత్యశక్తి భూమిమీద ఎక్కువ నిర్దిష్టతతో వాస్తవంగా భూసంబంధమైన భౌతిక విషయాలకంటే శక్తివంతంగా తయారవుతుంది. అవును. అది అటువంటిది.

ఇదే రక్షణ, దీని ద్వారానే అతిమానస అస్తిత్వాలు తమను తాము ఆత్మ రక్షణ చేసుకుంటాయి. చూడటానికి అదేమి భౌతికమైనది కాదు, కాని మహాపదార్థం మీద భౌతిక వస్తువులకంటే చర్యను జరపడానికి ఎక్కువ

ఆధిపత్యశక్తిని కలిగినది. ఇది రోజురోజుకు, గంటగంటకు ఎక్కువగా పరిణమిస్తున్నది. ఈ దివ్యశక్తి మనం "దివ్యం" అనిదేనినైతే పిలుస్తామో, దానివలన సూటిగా నిర్దేశించబడి నప్పుడు అది నిజంగా, నిజంగా దానిని చేయగలదు — నీ కర్థమవుతుం దనుకుంటున్నాను. అది మహాపదార్థమును కదిలించగలిగిన ఆధిపత్యశక్తి కలిగినది, అది ఒక భౌతిక దుర్గటనను కలిగించగలదు. అది పూర్తిగా భౌతిక విషయాల పర్యవసానాలను తుడిచిపెట్టి వేయగలదు. అది మహాపదార్థకంటే చాలా బలిష్టమైనది. ఇది పూర్తిగా నూతనం, అగ్రాహ్యం; అందువలన అది జనుల సాధారణ చైతన్యంలో అల్ల కల్లోలాన్ని కలిగిస్తుంది. అవును, అది అటువంటిది. అది ఎలా ఉందనిపిస్తున్న దంటే..... అది ఇప్పుడు ఇంతకు మునుపు ఉన్నట్లుగా లేదు. నిజంగానే అది ఏదో ఒక విధమైన వినూత్నం — గతంలో అది ఉన్నట్లుగా ఎంతమాత్రమూ లేదు.

CWM11: 315-16

ఆదర్శవంతమైన వైఖరి

కాని అటువంటి అనుభూతి, కేవలం నీకు జీవించటానికి ఒకే ఒక్క కారణం ఉందంటూ, ఒకే ఒక్కలక్ష్యం, ఒకే ఒక్క ఉద్దేశం మాత్రమే కలిగి పూర్తిగా, పరిపూర్ణంగా సమగ్రంగా భగవదర్పణం గావించి, అదీ ఎంతవరకంటే, ఆయన నుంచి నిన్ను నీవు ఏ మాత్రం వేరుపరచుకోలేక ఎటువంటి వ్యక్తిగత ప్రతిక్రియా జోక్యం చేసుకోకుండా, పూర్తిగా సమగ్రంగా మొత్తంగా ఆయనే అయిపోవడం అనేది యేదయితే ఉన్నదో, అదే ఆదర్శవంతమైన వైఖరి. అంతే కాకుండా, కేవలం అది మాత్రమే జీవితంలో, నీ క్రియా కలాపాలలో ముందుకు పోవటానికి సాధ్యం అయేటట్లు చేస్తుంది. ప్రతిదానినుంచి సంపూర్తిగా రక్షణనిచ్చి, అన్ని ప్రమాదాలలోకి నీకు అత్యంత ప్రమాదకారి అయినటువంటి నీనుంచి నీకు రక్షణ నిస్తుంది. తన సొంత ఆత్మకంటే ఎక్కువ ప్రమాదకారి మరోటిలేదు. (నేను స్వార్థపూరిత ఆత్మను సొంత ఆత్మగా వాడాను)

CWM 7:190

కేవలం దైవం ఉనికినే అన్నింటా చూడటం

ఈ చైతన్యానికి ప్రతిదానిని కలకాలం పారవశ్యంతో ఉండేటట్లుగా మార్చగలిగిన సామర్థ్యం ఉంది. ఎందువల్లనంటే, ఒకరు విషయాలను వాటిలో కనబడే వైషమ్యాలతో చూడకుండా, కేవలం దైవం ఉనికిని, దివ్యమహ దేచ్ఛను, దివ్యానుగ్రహమును మాత్రమే ప్రతిచోటా చూడటం జరుగుతుంది; ప్రతి ఘటనా, ప్రతి మూలకం, ప్రతి పరిస్థితి, ప్రతిరూపం ఒక స్థితిలోకి మార్పుచెందుతుంది. ఒకరు దానిని సూక్ష్మంగా పరిశీలించటం ద్వారా ఎక్కువ సన్నిహితంగా, గాఢంగా, దైవానికి ఇంకా ఎక్కువ దగ్గరగా కదల గలుగుతారు. వైషమ్యాలు అదృశ్యమై పోతాయి. హేయమైనవి అంతరించిపోతాయి. అక్కడ ఇప్పుడు కేవలం అన్నింటియందు దివ్యప్రేమలో వెలుగొందే వైభవం మాత్రమే ఉంటుంది.

ఈ రకమైన పౌరాణిక చరిత్రలు లేక గాథలు లెక్కలేనన్ని ఉన్నాయి. ఉదాహరణకు, అటువంటి వాటిలోనిదే, ప్రహ్లాదుని కథ, మనం ఈ మధ్యనే ఆ సినిమాను చూశాం, అవి మనకు ఆ చైతన్య స్థాయిని కళ్ళకు కట్టినట్లుచెప్తాయి.

నేను దానిని కేవలం నమ్మటం మాత్రమే కాకుండా, నాకుగా నాకు పూర్వం అటువంటి వాస్తవికమైన అనుభవండుంది. ఒక వేళ ఎప్పుడైనా ప్రమాదం లేదా ఒక శత్రువు లేదా ఒక దుష్ట సంకల్పం ఎదురైనప్పుడు, నీవు గనక ఈ స్థితిలో ఉండగలిగి, అన్ని విషయాలయందు దైవాన్ని చూస్తే, అప్పుడు ప్రమాద ప్రభావం ఏమీ ఉండదు. దుష్ట సంకల్పం నిన్నేమీ చేయలేదు. శత్రువు పరివర్తన చెందటంగాని లేదా పారిపోవటంగాని జరుగుతుంది. అది పూర్తిగా కచ్చితం.

కాని నేను దీనికి తప్పకుండా ఒక మాటను కలపాలనుకుంటున్నాను, అది చాలా ముఖ్యం. నీవు ఈ చైతన్యాన్ని ఏ ఉద్దేశ్యంతోటి అన్వేషించకూడదు. లేక రక్షణకోసం గాని లేక ఒక సహాయాన్ని ఆశించి గాని అన్వేషించకూడదు. నీవు తప్పక దానిని చిత్తశుద్ధితో, అప్రయత్నంగా, నిరంతరం కలిగి ఉండాలి. అది తప్పక సర్వసాధారణంగా, ప్రకృతి సహజంగా, ప్రయత్నరహితంగా అస్తిత్వం ఉండే పద్ధతి. అప్పుడది అమోఘంగా ఉంటుంది. కాని నీవు అల్ప ప్రమాణంలో నైనా ఒక ఫలితాన్ని ఆశించే భావనతో ఆ గమనాన్ని అనుకరించాలని ప్రయత్నిస్తే, నీవు సఫలీకృతుడవు కావు. ఆ ఫలితం అసలు ఏ మాత్రం రానె

రాదు. అప్పుడు నీవు నీ అజ్ఞానంలో బహుశా ఇట్లా అంటావు, "ఓహ్, వాళ్ళు దానిని నాకు చెప్పారేకాని, అది నిజంకాదు!" దానికి కారణం ఎక్కడో ఒకచోట కాపట్యం ఉంది. అలాకాక, నీవు నిజంగా చిత్తశుద్ధి కలవాడివైతే, అనగా, అది ఒకవేళ సమగ్రమైన, అప్రయత్నమైన అనుభవం అయినట్లయితే, అది సర్వ-శక్తివంతమే. ఒకరి కనులలోకి నీవు చూస్తూ, దానిలో అప్రయత్నంగా తటాలున దైవం ఉనికిని చూడగలిగితే, అత్యంత నికృష్ట గమనాలు సైతం మాయమైపోతాయి, అత్యంత దారుణమైన ఇబ్బందులు అదృశ్యమైపోతాయి. అనంత హర్షాతిరేకంతో కూడిన ఒక జ్వాల మేల్కొంటుంది. అప్పుడప్పుడు అవతలవారిలోనూ, వారితో పాటుగా తమలో తమకూ. అవతలి వ్యక్తిలో కనీస సంభావ్యత లేదా అతని దుష్ట-బుద్ధిలో అల్పమాత్రంలోనైనా కొద్దిగా చీలిక వాస్తవంగా ఉన్నా, ఆ జ్వాల కాంతులీనుతుంది.

*CWM 8: 22*2-4

దివ్యానుగ్రహం - కర్మ పర్యవసానాలు

ఒక పని చేస్తే, దానికి ఎల్లప్పుడూ పర్యవసానాలుంటాయి. ఈ పర్యవసానం తనతోపాటు మరొకదానిని, అది ఇంకొకదానిని, ఆ విధంగా అది కొనసాగిపోతూ ఉంటుంది. ఇది పూర్తిగా ఏ మాత్రం తప్పించుకో లేనటువంటిది. ఇది సార్వజనీన న్యాయం. నీ కొక చెడ్డ ఆలోచన వచ్చింది. దానికి ఫలితం ఉంటుంది. దాని ఫలితం మరొకదానికి కారణం అవుతుంది. నీవు దానినుంచి తప్పించుకో లేవు. కేవలం దివ్యానుగ్రహం జోక్యం ద్వారా తప్ప. దివ్యానుగ్రహమన్నది కచ్చితంగా ఏదో ఒకటి ఉంది, దానికి దానినంతనూ మార్చ గలిగిన ఆధిపత్య శక్తి ఉంది. కాని కేవలం దివ్యానుగ్రహం మాత్రమే. దానిని మార్చ గలదు. అది ఎంతో బలీయమైన న్యాయం, ఎంతో భయానకం, ఒకరు దానిలో ప్రవేశిస్తే, మరి దాని నుంచివారు బయటపడలేరు. ఒకరు భూమి మీద ఉన్న మరుక్షణం, వారు దానిలో ప్రవేశిస్తారు. మొత్తం భూమండలం ఉనికే ఆ విధంగా ఉంది, ఆ విధంగా నిర్మాణం చేయబడింది. ఒకరు చేసే ప్రతిదానికీ, ఒకరు మాట్లాడే ప్రతి మాటకూ, ఒకరు ఆలోచించే ప్రతిదానికీ, ఒకరు అనుభూతిచెందే ప్రతిదానికీ పర్యవసానం ఉంటుంది. ఈ పర్యవసానం మరొక దానిని తెస్తుంది. అది అలా సాగిపోతూ

ఉంటుంది. ఇప్పుడు ఒక రెవరైనా ఆచరణాత్మక దృక్పథంతో చూడ దలచు కుంటే,, వారు ఉదాహరణలతో, "నీవు ఇది చేస్తే, అది యాంత్రికంగా ఈ ఫలితాన్నిస్తుంది." అని చెప్పవచ్చు. ఉదాహరణకు, మానవులు వ్యవస్థీకరించినటువంటి సమాజాలలో, నీవు ఒక అపరాదం చేస్తే, ఆ అపరాధానికి నీవు దండించబడతావు. స్వయం నీ చేతనలోనే, నీవు ఒక తప్పుచేస్తే, నీవు చేసిన ఆ తప్పుకు బాధపడతావు. మనిషి రూపొందించిన న్యాయ వ్యవస్థలో, ఎల్లప్పుడూ ఒకమాట చెప్పబడింది. న్యాయం గురించి తెలియదనడం క్షమార్హం కాదు. నీవు న్యాయం గురించిన అజ్ఞానంలో ఉంటే, నీవు దండించబడతావు. నీవు ఒక తప్పును, అది తప్పని తెలియకుండా చేసినపుడు అది నిన్ను రక్షించదు. నీవు శిక్షించబడతావు. ప్రకృతిలో కూడా అదే విధంగా ఉంది. నీవు విషాన్ని అది విషమని తెలియకుండా నీలోనికి తీసుకుంటే, అది నిన్ను విషమయం చేసివేస్తుంది. అర్థమయ్యిందా? .... దివ్యానుగ్రహం జోక్యం చేసుకొంటే తప్ప. దివ్యానుగ్రహం సర్వశక్తివంతమయినదవడం మూలంగా అది ప్రతిదానినీ మార్చగలదు. దానినే నేను సవిరంగా చెప్పాను. కాని దివ్యానుగ్రహం లేకపోతే ఏ ఆశాలేదు. అందువలనే కచ్చితంగా అజ్ఞానమే మానవజాతిలో స్థిరంగా ఉండే నిరంతర లక్షణం.

CWM5: 361-62

అంతరంగ దేవత మనల్ని కాపలాకాస్తూ కనిపెట్టుకుని ఉండి రక్షిస్తుంది.

మన ప్రేరణలకూ, మన కోరికలకూ, మన పరితాపాలకూ, మన దౌర్జన్యాలకూ మన బాధలకూ, మన సంఘర్షణలకూ, ఏం విలువఉంది? ఈ అంతరంగ అవ లక్షణాలు ఎటువంటి తీరుతెన్నులు లేకుండా సాగిపోయి మన ఊహలచే అధికాధికంగా నాటకీయంచేయబడతాయి. మన తప్పులను దిద్దుతూ, మన గాయాలను మాన్పుతూ, మొత్తం మన అస్తిత్వాన్ని తనయొక్క పునరుద్దీపనం చేసే ప్రవాహాలతో, మన అస్తిత్వ అంతరంగ అగాధాలనుంచి మనమీద వంగి వున్న, గొప్పదైన, ఈ మహనీయమైన, దివ్యప్రేమ ముందు వాటికి ఏం విలువ ఉంది? ఎందువల్లనంటే, ఈ అంతరంగ దేవత తనకు తానుగా తన ప్రభావమును

ఎన్నడూ రుద్దదు, హక్కుగా ఆమె దేనినీ ఆశించదు సరికదా భయపెట్టదు కూడా, ఆమె నివేదన చేస్తుంది. తనకు తాను సమర్పించుకొంటుంది. అందరి అస్తిత్వాలు మరియు విషయాల హృదయాలలో ఆమె దాగి ఉండి, తనను తాను మరచి పోతుంది; ఆమె ఎప్పుడూ దూషించదు, ఆమె న్యాయ నిర్ణయం చేయక పోవడమే కాకుండా, శపించడం లేక ఖండించడం కూడా చేయదు. కాని, ఎటువంటి నిర్భంధాలు లేకుండా పరిపూర్ణంచేస్తూ, వేలెత్తి చూపి మందలించకుండా చక్క బరుస్తూ, అసహనం లేకుండా ప్రోత్సాహ మిస్తూ, ప్రతివారు అందుకోగలిగినంత సంపద నంతటితో వారిని సంపన్నులను చేయటానికి అవిశ్రాంతంగా పనిచేస్తూ ఉంటుంది; ఆమె ప్రేమఫలాలతో పుష్టిని కలుగజేస్తుంది. కనిపెట్టుకుని కాపలా కాస్తూ ఉంటుంది. రక్షణనిస్తుంది, సలహాలనిస్తుంది, ఓదారుస్తుంది, కారణం ఆమె ప్రతిదానినీ అర్థం చేసుకుంటుంది. ప్రతిదానినీ సహిస్తుంది, ప్రతిదానినీ మన్నిస్తుంది, క్షమిస్తుంది, ప్రతిదానినీ ఆశావహదృష్టితో సంసిద్ధపరుస్తుంది. తనలో ప్రతిదానినీ కలిగినదై, అందరికీ చెందని దానిని తనదనుకోదు, అన్నింటిమీదా ఆమె శాసనం చేస్తున్న దవటం మూలంగా, అందరికీ ఆమె సేవకురాలు; అందువలననే ఆమెతో రాజులవాలని, ఆమెలో దేవతలవాలని అనుకునేటటువంటి పెద్దలు, చిన్నలు అందరూ ఆమెలాగా పరిణమిస్తారు, నిరంకుశులుగా కాకుండా తమ సోదరుల మధ్య సేవకులుగా తయారవుతారు.

CWM 2:42-43

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

సృష్టిలో దైవ సన్నిధి

ప్రతివానిలో ప్రాథమిక దశలో గూడా యీ ఆధ్యాత్మిక సన్నిధి, యీ ఆంతరిక జ్యోతి వున్నది... వాస్తవంగా అది ప్రతిచోటా వుంది. కొన్ని జంతువులలో గూడా నేను దాన్ని చాలాసార్లు చూచాను. అది ఒక విధమైన నియంత్రణకు, రక్షణకు ఆధారభూతమై, అర్థ-చేతస్సుగల వాటిలో సైతం తిరిగి చక్కదిద్దలేని విపత్కార స్థితులు సర్వసాధారణం గానీయకుండా ఒక విధమైన సామరస్యత సాధ్యమయ్యే టట్లు చేసే, ప్రకాశవంతమైన ఒక బంధువు. ప్రాణిక తీవ్రవత్తిడులు, తీవ్రావేశాలచే సృజించబడే అశాంతి, యీ సన్నిధి గనుక లేకపోయినట్లైతే యే క్షణంలోనైనా

ప్రకృతి పురోగతిని అడ్డుకొనేంత గొప్ప సార్వత్రిక విపత్తుగా, ఒక విధమైన విధ్వంసకారిగా తయారవుతుంది. ఆ సన్నిధి, ఆ ఆధ్యాత్మికవెలుగు — దాన్ని ఆధ్యాత్మిక చేతన అని దాదాపుగా అనవచ్చు — ప్రతి జీవిలోను, సమస్త వస్తువుల లోనూ వుంది. దానివల్ల యెంతగా వైషమ్యత, తీవ్రత, హింస వున్నప్పటికీ ప్రకృతికార్యం నెరవేరేటట్లు చేసే కనీస సాధారణ సామరస్యత నెలకొని వుంటోంది. ఈ సన్నిధి మానవ జీవిలో, చాలా ప్రాథమిక స్థాయిలోవున్న మానవునిలో సైతం, చాలా స్పష్టంగా కన్పిస్తుంది. చాలా రాక్షసిక ప్రవృత్తిగల మానవునిలో ఒకభూతం, ఒక రాక్షసుడు అనే భావం కలిగించే వానిలో సైతం అతని లోపలినుండి అతడు ఆపలేని విధంగా, అతడిని అదుపు చేస్తూ వున్నదొకటి వుంది— అత్యంత నికృష్టునిలో సైతం చేయడం అసాధ్యమయ్యేవి కొన్ని వున్నాయి. ఈ సన్నిధి లేకుండా కేవలం యిబ్బందులు కలిగించే శక్తుల చేతనే, ప్రాణిక శక్తుల చేతనే జీవి నియంత్రణ జరుగవలసివస్తే, యీ అసాధ్యత వుండదు. ఈ రాక్షసిక, శత్రుశక్తుల ఒక తరంగం భూమిని చుట్టబెట్టిన ప్రతిసారీ, అస్తవ్యస్థ స్థితి భయానకస్థితి విస్తరించకుండా యేదీ ఆపలేదని అనిపిస్తుంది. ఎప్పుడూ ఒకానొక సమయంలో, అనూహ్యంగా, యిదీ అని చెప్పలేని విధంగా, ఒక నియంత్రణ జోక్యం చేసుకొంటుంది. ఆ తరంగం ఆపబడుతుంది, విపత్తు సంపూర్ణం అవ్వదు. దీని క్కారణం దివ్యసన్నిధి పదార్థంలోవున్న ఆ దివ్యసన్నిధే.
CWM 9 :339-40

ఏకైక నివారణోపాయం

ప్రపంచ ప్రస్తుత స్థితిలో, పరిస్థితులు యెప్పుడూ యిబ్బందికరంగానే వుంటాయి. అభివ్యక్తం కావాలను కొంటున్న సత్యానికి, వెలుగుకు సంబంధించిన క్రియాశక్తులకు, మార్పు కంగీకరించని గతంలోనే స్థిరపడిపోయిన, గట్టిపడి పోయిన, వదలి పోవడాని కంగీకరించని దానంతటికీ మధ్య పోరు, సంఘర్షణల స్థితిలో మొత్తం ప్రపంచ మంతా వుంది. ప్రతివ్యక్తీ సహజంగానే తన స్వంత యిబ్బందు లతో బాధపడ్తుంటాడు. అవే ఆటంకాలను యెదుర్కొంటూవుంటాడు. అతని కుండే దొకటే దారి. అది సంపూర్ణ, సమగ్ర, బేషరతు సమర్పణ. కర్మలను, కార్యా లను, అభిలాషలను సమర్పించడం మాత్రమే గాక అతని సమస్త

సంవేదనలు, అంటే అతను చేసేదంతా అతడేమైవున్నాడో అదంతా కేవలం దైవానికొక్కనికే అర్పించడం అని దానర్థం. అలా అయినప్పుడు చుట్టూ వున్న మానవ ప్రతిచర్యలకు పైన వున్నట్లు వాటికి పైన వుండడమేగాక, దైవకృప అనే ఒక గోడ చేత వాటినుండి కాపాడబడుతున్నట్లు అతడు అనుభూతి చెందుతాడు. ఒక్కసారి గనుక నీకు కోరికలు లేకుండా పోతే, మమకారాలు నశిస్తే, మానవుల దగ్గరనుండి వాళ్ళెవరైనప్పటికీ, ప్రతిఫలాన్ని పొందవలసిన ఆవశ్యకతను నీవు వదిలించుకొంటే పొందితే ప్రయోజనం వుండే, నిన్నెప్పుడూ భంగపాటుకు గురిచేయని యేకైక ప్రతిఫలం పురుషోత్తముని దగ్గరనుండి లభించేదేననే అవగాహన కలిగి — ఒకసారి బాహ్యంగా వున్న జీవులు, వస్తువులన్నింటి యెడల మమకారాన్ని వదిలించు కొంటే — అదే క్షణంలో యెల్లప్పుడూ నీతోనే వుండే యీ దివ్య సన్నిధిని యీ దివ్య క్రియా శక్తిని యీ దివ్యకృపను నీ హృదయంలో అనుభూతి చెందుతాడు.

మరోమందులేదు. ప్రతి ఒక్కరికీ, యెవరినీ మినహాయించకుండా అదొక్కటే మందు. బాధపడేవారందరికీ చెప్పవలసిందిదే. బాధకలగడమంటే సమర్పణ సమగ్రం కాలేదని. నీలో ఒక "ధడెల్"మనే ధ్వనిలాంటిదాన్ని అనుభూతి చెందినప్పుడు "ఓహ్, ఇది మంచిది కాదు "లేక" ఇది యిబ్బందికర పరిస్థితి" అని అనుకొనడానికి బదులు, "నా సమర్పణ పరిపూర్ణంగాలేదు" అని అనుకోవాలి. అప్పుడంతా చక్కబడుతుంది. అప్పుడు నీకు సహాయంచేసే, నిన్ను ముందుండి నడిపించే, దైవకృపను నీవనుభూతి చెందుతావు, ముందుకు సాగుతావు, ఏదీ నిన్ను భరించలేని శాంతిలోనికి ఒకరోజున చేరుకొంటావు. నీవు సమస్త విరుద్ధ శక్తులకు, విరుద్ధ చలనాలకు, దాడులకు, అపార్థాలకు, దుస్సంకల్పాలకు, దైవకృపయందుండే పరిపూర్ణ నమ్మకంనుండి ఉద్భవించే అదే చిరునవ్వుతో సమాధాన మిస్తావు. బయట పడే దారి అదొక్కటే, మరొకటిలేదు.
CWM 15:398

చనిపోయిన తర్వాత దివ్యజనని రక్షణ

ప్రతిరాత్రి ఒకే సమయంలో— కేవల ఇహలోక వాతావరణానికి అంతరాత్మిక వాతావరణానికీ మధ్య — ప్రాణికం ఆవలకు ఒక సురక్షితమైన దానిని

నిర్మించటానికి శ్రమిస్తున్నాను. అలా చేసినందువల్ల ప్రాణికం దాని యెరుక వుండీ దాని జ్ఞానం లేనివాళ్ళకు దానిలో నడవటం చాలా కష్టం. వారు నరక సదృశ్యంలో నుంచి వెళ్ళకుండా వుండటానికి నేను ఈ దారిని నిర్మించడాన్ని, యీ పని చేయడాన్ని, (1903, 1904 ప్రాంతంలో అనుకొంటాను, సరిగా గుర్తులేదు) నెలల తరబడి కొనసాగించాను. ఆ కాలంలో అసాధారణమైన అనేక అనుభవాలు కలిగాయి. ... అసాధారణమైనవి, వాటిని గురించి పెద్దపెద్ద కథలే చెప్పగలను..

తరువాత నేను లెమ్సెన్ వెళ్ళినప్పుడు, ఆ విషయం మేడమ్ థియోన్ కు చెప్పాను. "అవును నీవు భూమిమీద చేయడానికొచ్చిన పనిలో భాగమే అది అంతరాత్మికం కొద్దిగానైనా మేల్కొన్న వారెవరైనా నీ దివ్యవెలుగును దర్శించగలిగిన వారు, వాళ్ళెక్కడ చనిపోతున్నా, చనిపోయేటప్పుడు నీ వెలుగు దగ్గరకు వస్తారు. వాళ్ళు అనాయాసంగా వెళ్ళిపోయేందుకు నీవు సహాయంచేస్తావు" అని చెప్పింది. ఇది నిరంతరం జరుగుతుండే పని నిరంతరం. దేహాన్ని విడిచిపెడుతున్నప్పుడు యేం జరుగుతుందో అనే దాని గురించి అది నాకు చెప్పుకోదగిన అనేక అనుభవాలను కలుగజేసింది. సకల విధాల అనుభవాలు నాకున్నాయి, ఉదాహరణలు అన్ని రకాలవీ ఉన్నాయి. అది చాలా ఆసక్తికరంగా వుండే విషయం.

చనిపోయిన తర్వాత శ్రీఅరవిందుల రక్షణ

ఈమధ్యనే "యమ్" తోబుట్టువు చనిపోయింది. (మానసిక స్థితి దృష్ట్యా ఆమె చాలా భయంకర స్థితిలో వుంది. ఆమెకు విశ్వాసం లేదు.) ఆమె చనిపోతున్న రోజున, నాకు తెలియగానే, అపుడు నేను పైనున్న స్నానాల గదిలో శ్రీఅరవిందులతో ఒక విధంగా సంభాషిస్తున్నప్పుడు (అలా చాలా తరచుగా జరుగుతూవుంటుంది.)"అటువంటి వాళ్ళు ఆశ్రమంలో చనిపోయినప్పుడు వాళకేం జరుగుతుంది?" అని వారినడిగాను. "చూడు" అంటూ సమాధానం చెప్పారు. ఆమె చనిపోతూండడం నేనూ చూశాను. అప్పుడొక దట్టమైన బంగారు కాంతితో (ఆ కాంతి బాగా ప్రకాశించడం లేదుగాని, చాలా బలంగా వుంది) ఆమె నుదుటిపై శ్రీఅరవిందుల సంకేతాన్ని చూచాను. అదక్కడ ఉంది. ఈ సంకేతం అక్కడుంటే, ఆమె అంతరాత్మిక స్థితి లేక మానసికస్థితి

పెద్ద పట్టించుకోవలసిన విషయంగాదు. ఆమెనేదీ తాకలేదు. ఆమె ప్రశాంతంగా, నిష్క్రమించింది. అప్పుడు శ్రీఅరవిందులు ఇలా చెప్పారు. "ఆశ్రమంలో నివసించి, అక్కడే చనిపోయే వాళ్లందరకు వాళ్ళ ఆంతరిక స్థితేదైనప్పటికీ అదే రక్షణ లభిస్తుంది." నాకు ఆశ్చర్యం కలిగిందని చెప్పలేను గాని, అంతిమ యాత్రలో అత్యంత సహాయం చేసే బలమైన శక్తి నివ్వడానికి కేవలం యిక్కడ నివసించడం, చనిపోవడం అనే చిన్న వాస్తవికత చాలు. అనే సంగతిని ప్రసంసించ కుండా వుండలేక పోయాను.

దివ్యజనని ధవళతేజం

బిడ్డా! ఈ వెలుగు ఆవహించిన వ్యక్తికి ప్రతి దానినుండి ఒక రక్షణ వుంటుంది. ఈ తేజం ఆవరించిన వ్యక్తి కదొక ప్రత్యేక విషయం. వ్యక్తి ఆశించ గలిగిన అత్యుత్తమ రక్షణ అది. ప్రతిచోట సమంగా పనిచేసే ప్రాణిక రక్షణ అది. అంతకంటే మేలైన రక్షణ అతనికి లభించదు. అదే చిట్ట చివరి రక్షణ. ఈ తేజంతో రక్షించబడే వ్యక్తి, అన్నీ వున్న వానిలా సంతోషంలో సాగిపోతూంటాడు. అతనిని గురించి జాగ్రత్త వహించేది దైవకృపయే. అదొక అపురూప విషయం. అతడు స్వేచ్ఛలో చరిస్తుంటాడు, ఎందుకనంటే అతని నేదీ తాకలేదు. అతని దారి నడ్డు కోవాలని చూచే వ్యతిరేక శక్తులు, అజ్ఞాన శక్తులు, అతని దగ్గరకు చేరలేవు. ఎందుకనంటే అతడు పూర్తిగా నా తేజంతో కప్పబడి వుంటాడు. ఏదీ చొర వీలులేని ఒక తేజపు పొర అతనిని కాపాడుతుంటుంది. యదార్థంగా అదొక సంపూర్ణ రక్షణ.

ఎక్కువ మంది దానిని నిలుపు కోలేరు. ఈ తేజాన్ని నిలుపుకోగల సామర్థ్యం చాలా కొద్దిమందికే, చాలాచాలా కొద్ది మందికే వుంటుంది. ఈ తేజాన్ని నిరంతరం నిలుపుకోవడం చాలా కష్టం. రేబవళ్ళు దానిని నిలుపుకోగల శక్తి నీకుంటే, యీతేజం నిన్ను కప్పివుంచుకోగల శక్తి నీకుంటే, అదొక అసదృశ విషయం. ఎందుకనంటే ప్రపంచంలో లభించే అత్యుత్తమ రక్షణ నీకుంది. ఈ తేజం ఒక పరిపూర్ణ ప్రశాంత స్థితిలో, అచంచల విశ్వాసంలో మాత్రమే మనగలదు. ఒక్కసారి గనుక మనం మరో ప్రక్కకు వాలడం జరిగితే అది అదృశ్యమౌతుంది. అందుచేతనే దాన్ని నిలుపు కోవడం కష్టం అని చెప్పడం.

నీవు ప్రశాంతంగా వుంటే, దీన్ని నిలుపుకోగలుగుతా వనడంలో సందేహం లేదు. ప్రయత్నిస్తే విజయం లభిస్తుంది.

నిన్ను సమస్త దుష్ట శక్తులనుండి రక్షించే నా ప్రాణికపు తేజం యిది. లోపలి వస్తువులు బయటకు కన్పించే ఒక మంచుతో తయారైనపెట్టెలో ఒదిగి పోయి వున్న అతడు తనను తాను అనుభూతి చెందుతాడు. ఈ మంచు మృదువుగా, శాంతియుతంగా వుంటుంది. మనల్ని రక్షించే మార్గం చూపించే, మన నమ్మకాన్ని పెంచే, ఒక తేజం, చుట్టూ ఆవరించి వున్నట్లు ఒక ఆనందకర యింద్రియానుభూతి వుంటుందతనికి. ఎందుకంటే ఈ తేజం అతన్ని ఆవరించి వున్నంతకాలం ప్రాణికానికి లేక మరే యితరమైన దానికి సంబంధించిన దాడులనుండైనా అతనికి రక్షణ వుంటుంది.

ఈ విధంగా ధవళ తేజంగా అయ్యేంతవరకు, ఉన్నతోన్నతంగా పెరుగుతూపోయే వెలుగుల వరుస నాకుంది. ఆ తేజం తెల్లగా కాగితంలా వుంటుంది. (బల్లమీదవున్న కాగితాన్ని అమ్మ చూపిస్తారు.) అది శుద్ధ తెలుపు, ఘనిష్టమైన తెలుపు, ఇది నా స్వకీయ తేజం, తెల్లని తేజం, దీనికి అసాధారణమైన శక్తి వుంది. ఇటువంటి తేజాన్ని పొందటం చాలా కష్టం. అదెంతో, యెంతో దూరాన వుంది. అచటకి చేరాలంటే దశల తర్వాత దశలు దాటిపోవలసి వుంటుంది. ఇది యదార్థమైన తేజం. ఈ తేజంలో ఆశ్రయం పొందగలిగితే —నా ధవళతేజంలో— అతనికి రక్షణ, లేక అనుపమానమైన సహాయం లభిస్తుంది. తననేదీ తాకను కూడా తాకకుండా ప్రతిదాన్నీ జయించగలడు. ఎందుచేతనంటే యీ తేజం వుంటే అపకార శక్తులు. ఆ తేజంతో సంపర్కం లోనికి వచ్చీ రాగానే, వెనువెంటనే అదృశ్యమైపోతాయి. ఒక్కటంటే ఒక్క విరుద్ధ శక్తి కూడా యీ ధవళ తేజంలో నిలువ లేదు. అతడు దైవహస్తాల్లో వున్నట్లే, ఆతనిలో ఆవరించి వేయబడినట్లే. సాధ్యంకాగల అత్యున్నతమైన తేజం అది....

అతనికి గనుక విశ్వాసం వుంటే, ఇక్కడ నుండి (హృదయంనుండి) వెలువడే విశ్వాసం వుంటే అప్పుడు ఆ తేజం అంతర్ధానంకాదు, నిలిచి వుంటుంది. ప్రశాంతంగా వుండి, యీ విశ్వాసమనే ఆయుధంతో, స్పృశించ నలవిగాని ఒక ఖడ్గంలాంటి విశ్వాసంతో (అమ్మ తమ హస్తంతో దీనిని చూపిస్తారు) యిటూ, అటూ కదలకుండా తిన్నగా తడబాటు లేకుండా పైకి పోతుండే విశ్వాసంతో

వుంటే, దీనితో, నా తేజంతో, యెల్లప్పుడూ ఆవరించబడి వుంటాడు. అది అతని నెప్పుడూ విడిచిపుచ్చదు, ఎందుకనంటే, వుండవలసిన రీతిగా వున్న ఒక సాను కూల వాతావరణం దాని కక్కడ లభించింది గనుక.

బిడ్డా! దీనిని, యీ విశ్వాసాన్ని నీవు అభివృద్ధి చేసుకోవాలి, అప్పుడంతా శుభప్రదంగా సాగిపోతుంది. నా సర్వోన్నత రక్షణ క్రింద వుండడమనేది ఒక అద్భుత విషయం.

Blessings of the Grace: P.13, 17 July 1967

హృదయంలోని దైవసన్నిధి నుండి యదార్థమైన బలం, రక్షణ లభిస్తాయి. నీలో యీ సాన్నిధ్యాన్ని సదా నిలిపి వుంచుకోవాలని నీవనుకొంటే, మాటలో, నడతలో, కర్మలో అసభ్యత చోటు చేసుకోకుండా జాగ్రత్త పడాలి.

CWM 12:54

సర్వశక్తివంతుడైన పురుషోత్తముని రక్షణక్రింద నిన్ను నీ విశ్వాసం నిలబెడుతుంది.

CWM 12: 309

నిజమే, దివ్యరక్షణ మనచుట్టూ వుంది, కాని మనం నివారించలేని ప్రమాదాలలో చిక్కుకొన్నప్పుడు మాత్రమే అది పూర్తిగా పనిచేస్తుంది. అంటే, దైవంకోసం మన మేదైనా పనిచేస్తున్నప్పుడు మార్గంలో ఆకస్మికంగా ప్రమాదాలు యెదురైనప్పుడు ఆ రక్షణ బహు ఉత్తమంగా పనిచేస్తుంది. సంభవించబోయే దుష్పరిణామాలనుండి మనలను రక్షించటానికి దివ్యరక్షణ వున్నదిలే అనుకుంటూ, అనివార్యం యెంతమాత్రం కానటువంటి, కచ్చితంగా, ప్రయోజనకరమైనవి గాకపోయినా అపాయకరమైన యేదో పనిని తీసుకొని చేయకూడదు. ఎందుకనంటే యిది దైవానికి ఒక సవాలు విసరడం లాంటి దవుతుంది. దైవం దాన్నెప్పుడూ అంగీకరించడు.

CWM 14: 325

అసూయ, స్వార్థంతోకూడిన అసంతృప్తి, గాయపడ్డ గర్వం, అనేవి దైవ రక్షణనుండి నిన్ను వెలికి లాగడం ద్వారా, చేతన ద్వారాలను అపకార శక్తులకు తెరచి పెడ్తాయి.

CWM 15: 20

దైవానికి సంపూర్ణ సమర్పణతో సమస్త కోరికల నశింపుతో మాత్రమే భౌతిక రక్షణ సాధ్యమౌతుంది.

CWM 15:47

నీవు జనం మధ్యలో వున్నప్పుడు, దైవాన్ని నీకు, జనానికి మధ్య నిలుపుకో. అలాచేస్తే, నీ మొత్తం అస్తిత్వం రక్షణ పొందుతుంది. నీవు ఆతని రక్షణలో, ఒక పట్టు పురుగు, తన సిల్కు దారపు గూడులో సురక్షితంగా వున్నట్లు, నీవు ఆతని రక్షణలో వుంటావు. నీ అస్తిత్వం లోనికేదీ చొరబడలేదు.

Mother you Said So 17: 267

నీ కనుభవమైన, దైవ నామానికుండే శక్తి, రక్షణ, నీకున్న విశ్వాసం లాంటిదే వుండి, దాని నుపయోగించే వారందరికీ కలిగే అనుభవమే. హృదయంనుండి రక్షణకోసం ఆక్రందించే వారి నది ఓటమి పాలు గానీయదు.

CWSA : 25-308

శత్రు శక్తులను దూరంచేసేందుకు ఒక మంత్రం

నా దేవునిపేర
నా దేవుని కోసం
నా దేవుని ఇచ్ఛతో
నా దేవుని శక్తిచే
మమ్ములను యిబ్బంది పెట్టడం మానెయ్యి.

చంపక్‌లాల్ పెన్నిధులు

బ్లెస్సింగు ప్యాకెట్ పై వ్రాసి యున్నది.

లోపల కొన్ని పూరేకులున్నాయి, అవి క్రియాశక్తి పూరకాలై వున్నాయి. నీవు వాటిని నీ దేహంపై వుంచుకొంటే, నాతో సంపర్కం కలిగిస్తుంది. లోలోపలకు దానిని పంపిస్తే, సంపర్కాన్ని ప్రతిష్ఠించుకోగలిగి, సమాధానాన్ని సైతం పొందుతావు.

శ్రీమాత

ఈ కవరును తన జేబులో పెట్టుకొని, కుంగుబాటుకు లోనైనప్పుడల్లా దానిపైవున్న చిత్రం వంక చూడాలి.

ఆశీస్సులు

శ్రీమాత: చంపక్ లాల్ పెన్నిధులు

స్వేచ్ఛానువాదం: కె.వి.రావు

చిత్ర ప్రాధాన్యత

(ప్రీతి ఘోష్ చే చిత్రించ బడినది)

'8' సంఖ్య 'అతీంద్రియమైన ఆకృతి' కే గాక 'రెండింతల ఆవరణ' (అంతరంగ మరియు బాహ్య శత్రువుల నుండి రక్షణ) కు సంకేతం.

CWM 15: 36

అట్టపై నున్న రెండు హంసలు దివ్యమాతతో మనకుండే సంబంధాన్ని గుర్తు చేస్తాయి. పైకి చూస్తున్న హంస ఆత్మ. అది ముందుకు తీసుకుపోబడుటతో పాటు మన పయనాన్ని కాపాడుతూ, తేజోమయం గావించే మాతృమూర్తి దివ్యహంస.

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

అఖిల

అఖిలభారత పత్రిక

అక్టోబరు 2016



దివ్యప్రేమ గురించిన ఆలోచనలు

సంపాదకీయం: సృష్టి నిర్మాణ కార్యంలో తోడ్పడ్డ శక్తులన్నింటిలోకి దివ్యప్రేమ అతి శక్తివంతమైనది. దివ్యప్రేమ వినా సృష్టి లేదు. దివ్యప్రేమ వినా సృష్టి దానిని ఆవరించివున్న అంధకారం నుండి వెలికి తీయబడదు. అయితే, దివ్యప్రేమ అసలు ఏమిటి? సమస్త విషయాలలో కదలిక తేగల ఈ శక్తివంతమైన సాధనం ఏమిటి? అది అద్భుతాలన్నింటిలోకి మహాద్భుతము, మహోన్నత రహస్యము. శ్రీమాతారవిందుల దీప్తివంతమైన మాటల ఆసరాతో దివ్యప్రేమ వైఖరిపై ఆలోచించుటకు, మనసును లగ్నము చేయుటకు ఈ సంచికను సమర్పిస్తున్నాము. శ్రీమాత ఒక శిష్యునితో మే నెల 16,1960, నాడు జరిగిన సంభాషణలో ఈ విధంగా మన జ్ఞప్తికి తెస్తారు:

"అది అతి గొప్ప దేవరహస్యం; యదార్థమైన దానికి, కాని దానికి వెనుక, వ్యక్తిగతమైన దానికి, ప్రత్యేకమైన దానికి వెనుకనున్నది — దివ్యప్రేమ. రెండు ప్రాణుల మధ్యనో, ఇద్దరు వ్యక్తుల మధ్యనో నున్న ప్రేమ కాదు.... సమస్తము ఇమిడియున్న ప్రేమ..... అత్యాశ్చర్యకరమైన దేమిటనగా, అనుక్షణం దివ్యకృప, దివ్యానందం, దివ్యతేజం, దివ్యప్రేమ నిరంతరంగా వర్షించుట ఆగకపోవటం - స్వార్థము, అవమానము, లజ్జ, అయోగ్యత భావాలు ప్రబలివున్నప్పటికీ."

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

నిన్నటి ఉదయాన నేను 'దైవప్రేమ' పూరేకులను పంచిపెట్టాను. గతరాత్రి ఇచ్చట సంవత్సరంలోకల్లా గాఢమైన చీకటి నెలకొని వుండింది. అయితే భారతదేశంలో గొప్ప పండుగ వాతావరణం ఉంది. ఇందులో గమనార్హమైన విషయ మేమిటనగా దైవప్రేమ స్వయం వ్యక్తమగు సృష్టి అంతటి మూలం లోను, కేంద్రం లోను వున్నదనుట - ఎచ్చటనైనా , అది పూర్తిగా అచేతనమైనదిగా తోచినప్పటికీ

CWM 14: 117 శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

అట్టమీద పుష్పం — రోజా పూవు. సాధారణంగా రోజాపూవు దైవప్రేమ పుష్పంగా పరిగణించబడుతుంది. శ్రీమాత ఇచ్చిన ఆధ్యాత్మిక ప్రాశస్త్యం: సర్వ సాధారణంగా వేర్వేరు రకాలు దైవంపై గల ప్రేమ యొక్క వేర్వేరు లక్షణాలును ప్రతిబింబిస్తాయి.



ఓ నా ప్రియతమ నాయకా, ఎంత మనః పూర్తిగా నా ప్రేమ మిమ్ములను అపేక్షిస్తున్నది .... నేను మీ దివ్యప్రేమను తప్ప మరేమీ కానట్లు, ప్రతి జీవిలోను ఈ ప్రేమ శక్తి వంతంగా, విజయవంతంగా అంకురించునట్లు అనుగ్రహించు.

నేను ఈ పుడమినంతా కప్పి వుంచే విశాలమైన పచ్చదమును కానీ, నేను అన్ని హృదయాలలో ప్రవేశించనీ, ప్రతి చెవిలో మీ శాంతి, విశ్వాసాల దివ్య సందేశాన్ని మృదుమధురంగా వినిపించనీ.

CWM 1:137 — అనువాదం: అందుగులపాటి కైలాసపతి

చాలా కాలం, క్రితం నేడు అరేబియాగా పిలువబడుతున్న, ఒకప్పుడు ప్రేమాను రాగాలు కొరవడిన, అనావృష్టి పీడిత దేశంలో దివ్యప్రేమ తత్త్వాన్ని చిగురింప చేయటానికి ఒక పవిత్ర ప్రాణి అవతరించింది. అనుకున్నట్లుగానే మనుషులు దానిని వేధించారు, అపార్థం చేసుకొన్నారు, అనుమానించారు, వెంటబడి తరి మారు. తన పనిని నిర్వర్తించే క్రమంలో జరిగిన దాడిలో చావుదెబ్బలు తిని, తీవ్రంగా గాయపడి, ఏకాంతంలో ప్రశాంతంగా తనువు చాలించాలనే కోరికతో ఆ విశాలమైన ఎడారిలో పరుగెడుతుండగా, హఠాత్తుగా ఒకచోట దానికి దానిమ్మ చెట్టు పొద ఒకటి కనిపించింది. ప్రేమాంకురాన్ని నాటుటకు అవతరించిన ఆ ఉద్ధారక జీవి ప్రశాంతంగా దేహత్యాగం చేయదలచి ఆ చెట్టు లోతట్టు కొమ్మల క్రిందకు దూరింది. వెంటనే అత్యాశ్చర్యకరంగా ఆ చెట్టు విస్తరించుకొంది, గుబు రుగా దట్టంగా పెరిగింది. ఎంత దట్టంగా వ్యాప్తి చెందిందంటే, తరుముతున్నవారు దాని ప్రక్కగానే పోతున్నప్పటికీ, వారికి తాము వెంటాడుతున్న జీవి అక్కడే నక్కి వున్నదన్న అనుమానం లేశమాత్రం కలుగలేదు. వారి దారిన వారు దానిని గమనించకుండానే సాగిపోయారు.

ఆ జీవి గాయాలనుండి రక్తం బొట్లు బొట్లుగా రాలి నేలను సారవంతం గా విస్తున్నట్లుగా తడిపేస్తుంటే, ఆ చెట్టునుండి దట్టమైన పూరేకులు గల ఎఱ్ఱని అద్భుతమైన పుష్పాలను బోలు నెత్తుటి చుక్కలు అసంఖ్యాకంగా నేల రాలాయి. దివ్యప్రేమ తత్త్వాన్ని తమలో నిక్షిప్తం గావించి అభివ్యక్త పరచే పుష్పాలు ఇవే. *CWM 7: 373*

ప్రశ్న: మధురమయిమాతా! మీరు వ్రాసిన ఆ చాల్డియా దేశ కథకు, కాళీమాత పూజకు ఏమైనా సంబంధమున్నదా?

సమా: ఉన్నది. కారణం, కాళీపూజా దినాన నేనెప్పుడూ "దైవప్రేమ" పుష్పాలను పంచుతాను. ఎందుకనగా మహాశక్తి యొక్క అన్ని అంశలలోకి కాళీమాత అత్యంత ప్రేమాస్పదమైన అంశ. దానిలో మహాశక్తిమంతమైన దివ్యప్రేమ వ్యక్త మవుతుంది. ఆ కారణంగానే నేను ప్రతి కాళీమాత పూజా దినాన దైవప్రేమ పుష్పదళాలను పంచుతాను. ఎందుకని దైవప్రేమను పంచటానికి ఈ పుష్పాలను

ఎన్నుకున్నానో విశదీకరించటానికి ఈ వివరణ సరిపోతుంది.

ప్రశ్న: శ్రీమాతా! మీరు ప్రస్తావించిన ఈ మనిషి ఎవరు?

సమా: అది ఒక పురుషుడని ఎవరు అన్నారు? పురుషుడా, స్త్రీయా అని నేననలేదే. దానిని కేవలం 'పవిత్రజీవి' అని జాగ్రత్త పడ్డాను.....

అది చరిత్రకన్నా పూర్వకాలానికి చెందిన గాథ. అందువలన దానిని గురించి ఏ విధమైన సమాచారం ఎక్కడా దొరకదు, ఎక్కడా వ్రాయబడలేదు, వ్రాత పూర్వక దాఖలాలు లేవు.

పవిత్రము, నిస్వార్థము అగు ప్రేమ

పవిత్రమైన నిస్వార్థప్రేమ. అదే మీ ప్రేమ. దానిలోనే మీ ప్రేమను దర్శించి వ్యక్తపరచ గలుగుతున్నాము. అదే మిమ్ములను కోరే అందరి హృదయ కవాటాలను తెరువగల సాధనం. మేధోపరమైన మార్గము ననుసరించే వారికి నిజమైన జీవితం గురించి, మీతో ఏకమైన జీవితం గురించి ఒక ఉన్నతమైన, యదార్థమైన సమగ్ర సమాచారం లభించ వచ్చు కానీ దానిని వారు తెలుసుకో లేరు. ఆ జీవితం గురించిన అంతరంగ అనుభవం వారికి లేదు. మీతోటి సాంగత్యం గురించిన అవగాహన అంతకన్నా లేదు. ఇలాంటివారి కున్న జ్ఞానం ఏదైతే మేధాపరమైనదో, వారి కార్యాచరణ ఏదైతే అత్యుత్తమమైనదనే భావనకు వారు కట్టుబడి వుంటారో, అటువంటి వారిని మార్చడం చాలా కష్టం. దైవం గురించిన చేతనను మంచి సద్భావన గల వ్యక్తిలో కన్నా అట్టివారిలో అంకురింపచేయడం దుస్సాధ్యం. ప్రేమ ఒక్కటే ఈ అద్భుతాన్ని సాధించగలదు. ఎందుకనగా ప్రేమ అన్ని ద్వారాలను తెరువగలదు, అడ్డుగానున్న ప్రతి గోడను ఛేధించగలదు, ప్రతి ఆటంకాన్ని తొలగించగలదు. నిజమైన ప్రేమ కొద్దిమాత్రం అయినప్పటికీ, అత్యంత మనో రంజకమైన ప్రవచనాల కన్నా మిన్నగా ఉపకరించగలదు.

ప్రభూ, ఈ పవిత్ర ప్రేమ పుష్పం నాలో వికసించనీ, దాని పరిమళం మా దరి కొచ్చేవారందరికీ అందనీ, ఆ పరిమళం వారిని నిష్కల్మషం గావించనీ.

ఈ ప్రేమలో సర్వశక్తికీ, సమస్త జ్ఞాన సిద్ధికి సారభూతమైన శాంతి, ఆనందాలు పెల్లుబుకుతాయి. అది నిర్దుష్టమైన సర్వరోగ నివారిణి, ఊరటను కలిగించే సర్వ శ్రేష్ఠ మాధ్యమం, గొప్ప విజేత, దైవ సమానమైన గురువు.

ఓ ప్రభూ, నా ప్రియతమ ఆచార్యవర్యా, నేను మౌనంగా ఆరాధించే మీరు, నన్ను నేను సంపూర్ణంగా సమర్పణ గావించుకున్న మీరు, నా జీవితాన్ని శాసించే మీరు, నా హృదయంలో మీ పవిత్ర ప్రేమ జ్యోతిని వెలిగించండి, అది ఒక అగ్నిగుండాన్ని రగిలించి, దానిలో అహంకార మనబడే సమిథలు, అజ్ఞానమనబడే నల్లని బొగ్గులు వాటితోబాటు సమస్త కళంకాలు వ్రేల్చబడి కాంతులు విరజిమ్ముతూ, సేద తీర్చే వెచ్చదనాన్ని ఇచ్చు విధంగా పరివర్తన చెందునట్లు అనుగ్రహించండి.

ఓ ప్రభూ, ఆనందమయము, పవిత్రము అగు ఆరాధనా పూర్వక చిత్తముతో మీ దిశగా మరలి మిమ్ముల‌ను ప్రార్థిస్తున్నాను:

మీ ప్రేమ ప్రకటితమగు గాక,

మీ పాలన నెలకొను గాక,

మీ ప్రేమ ప్రపంచాన్ని పరిపాలించు గాక.

CWM 1: 40 - 41

మీ ప్రేమ ప్రపంచాని కన్నా విస్తారమైనది

ఓ ప్రభూ, ఎవరి గురించైతే నేను ఎరుక కలిగి, నా సూక్ష్మ జీవకణాలలో సైతం అనవరతం అవగాహన కలిగి వుంటానో, ఎవరినైతే నన్ను నేను తెలుసుకున్నంతగా తెలుసుకొని వారినే అన్నింటిలో చూస్తానో, ఎవరైతే ఏకైక వాస్తవమో, సృష్టికి ఏకైక కారణము గమ్యమో, అట్టి మీరు, నేను పూర్తిగా ప్రేమమయమగునట్లు గాను, స్వయంగా మీ ప్రేమయే అగునట్లుగాను, తత్కారణంగా మీ పై నా ప్రేమ ఎల్లప్పుడూ వృద్ధి చెందునట్లు గాను అనుగ్రహించండి. ఆ కారణంగా నేను మీ ప్రేమ స్వరూపమైనందున, మీతో సమగ్రంగా ఐక్యమొందునట్లుగా అనుగ్రహించండి. ఈ ప్రేమ మరింత అధికమై, తీవ్రమై, సంపూర్ణమై, ప్రకాశవంతమై, శక్తివంతమగు గాక. ఈ ప్రేమ మీ దిశగా మరలుటకు ప్రబలమైన ప్రేరణగా, మీ అభివ్యక్తికి అజేయమైన సాధనమగు గాక. ఈ నా అస్తిత్వములోని సర్వస్వము పవిత్రమైన, అపారమైన, నిస్వార్థమైన దివ్యప్రేమ మయమగు గాక. కొలువలేని అగాధపు లోతులనుండి బాహ్య ప్రపంచపు అతి భౌతిక పదార్థం వరకు, దేహధారియై సాక్షాత్కరించే దైవం, సమస్త జ్ఞానసంపదకు

ఆధారభూతము, దానిని గ్రహించగలది అగు మీ సంపూర్ణమైన ఉన్నత ప్రేమ మయ పదార్థము నుండి మలచ బడును గాక. ఆలోచనా సరళి మీ ప్రేమతో నిర్మలమై, క్రమబద్ధమై, జ్ఞానమయమై పరివర్తింపబడును గాక. జీవశక్తులన్నీ కేవలం మీ ప్రేమతో పరిపుష్టినొంది, మలచబడి దానినుండి ప్రబలమైన పవిత్ర తను, ఎడతెగని శక్తిని, ఓ జస్సును, ఆర్జవాన్ని అందుకొనును గాక. నీరసించిన ఈ మధ్యంతర జీవి తన బలహీనతను, ఆసరాగ తీసుకొని తనను తాను, మీ ప్రేమతో పూర్తిగా మలచబడిన మూల పదార్థాలతో పునర్వ్యవస్థీకరింపబడు గాక. మండుతున్న ఇప్పటి ఈ శరీరం దాని ప్రతి రోమకూపం నుండి మీ దివ్యమైన, నిస్వార్థమైన, స్వచ్ఛమైన, ఉన్నతమైన, ప్రశాంతమైన మీ ప్రేమను ప్రసరించు గాక.. మొదడు మీ ప్రేమతో పునర్నిర్మితమగు గాక. చివరిగా, మీ ప్రేమ స్వయంగా తనదైన శక్తి, వైభవం, మాధుర్యం, సామర్థ్యంతో సమస్త వస్తుగణాన్ని వెల్లువలా ముంచెత్తి, వాటిలో ప్రవేశించి, రూపాంతరీకరించి, నూతనోత్సాహాన్ని నింపి, సచేతనం గావించు గాక. మీ ప్రేమ శాంతిమయం, మీ ప్రేమ ఆనంద మయం, మీప్రేమలో మీ పరిజనుల కార్యాచరణను ఉత్తేజపరచే మీట వుంది. మీ ప్రేమ ప్రపంచాని కన్నా విస్తృత మైనది, యుగాంతాలను మీరి నిలిచేది. అది అనంతం, శాశ్వతం, అది స్వయంగా మీరే. నేను మీరుగా ఎదగాలని నా కోరిక; అయితే, నేను అదే అయి వున్నాను, ఎందుకనగా అది మీ అనుశాసనం, అది మీ సంకల్పం కాబట్టి.

CWM 1: 154

జయప్రదమైన దివ్యప్రేమ శక్తి

జయప్రదమైన ఓ దివ్య ప్రేమశక్తీ, నీవు ఈ విశ్వానికి సార్వభౌమాధికారివి, నీవు దాని సృష్టికర్తవు, రక్షకుడవు, నీవు దానిని అవ్యక్త స్థితి నుండి బయల్పడుటకు అవకాశ మిచ్చావు, ఇప్పుడు దానిని తన శాశ్వత గమ్యాన్ని చేరుటకు ముందుకు నడిపిస్తున్నావు.

అంత అణకువ గలది మరొకటి లేదు గానీ దానిలో నీవు ఉత్తేజితుడవై వున్నావు. నీ సంకల్పానికి అంతగా వ్యతిరిక్తమైనట్లుగా కాదు కానీ అందులోనే సజీవంగా

వుండి, కార్యాచరణ గావిస్తూ, నీవు వ్యాప్తి చెందుతున్నట్లుగా నాకు అనుభూతి కలుగుతున్నది.

ఓ నా మధురాధినాథా, దివ్యప్రేమ సారాంశమా, నేను నీ హృదయాన్ని. నీ ప్రేమ ప్రవాహాలు ప్రచండంగా ఆ అస్తిత్వమంతటి నుండీ పయనించి, నీ ప్రేమను అన్నింటిలోను మేల్కొల్పుటకు లేక అన్నింటినీ ఉత్తేజపరిచే నీ ప్రేమ చేతనకు స్పందించునట్లు చేస్తాయి. నిన్ను గుర్తించని వారందరినీ, నిన్ను ఎరగని వారందరినీ నీ ధార్మిక నియమావళికి ముఖం చాటేసే వారందిరిని నా ప్రేమానురాగభరిత చేతులలోకి తీసుకొని, నా హృదయానికి హత్తుకొని, నీ దివ్యకాంతి పుంజాలకు ఎదురుగా నిలుపుతాను. ఆ విధంగా అత్యద్భుత దివ్యకాంతులు వారిలో చొరబడినందున, వారు బహుశా నీ దివ్య వరప్రసాద లబ్ధికి అనుగ్రహ పాత్రులుగా మారవచ్చు.

ఓ దివ్యమైన, దేదీప్యమానమైన దివ్యప్రేమా, నీవు చీల్చుకొని పోగలవు, నీవు అందరినీ ఉన్నతులుగా రూపొందిస్తావు.

CWM 1:163 *అనువాదం: అందుగులపాటి కైలాసపతి*

దివ్యప్రేమయే భక్తి పూర్వక దైవారాధన

అన్ని విధముల ప్రేమ వాస్తవానికి, ఒక పూజ్యభావన. దాని వెనుక ఒక ఆధ్యాత్మిక శక్తి వున్నది. అది అజ్ఞానంతో అర్పించబడినా, ఏదో ఒక ప్రత్యేక విషయానికే పరిమితమైనా, దాని కర్మాచరణ ఎంత పేలవంగా నున్నా, ఫలితాలు అల్పమైనవే అయినా, ఆ దివ్య వైభవోపేత లక్షణం దానిలో ప్రతిబింబిస్తుంది. ఎందుకనగా ప్రేమ అనబడే పూజ్యభావనలో అపేక్ష, ప్రయత్నం, రెండూ కూడి వున్నాయి. దాని శక్త్యుత్సాహాలు పరిమితమైనప్పటికీ, అజ్ఞానంతో అలమటిస్తున్న వారిలో సైతం ఒక గుడ్డి నమ్మకాన్ని, ఒక సాక్షికమగు జ్ఞానసిద్ధిని, నామ మాత్రమైనవే కావచ్చు, గానీ అత్యాశ్చర్యకర రీతిలో కలుగజేస్తాయి. ఎందుకనగా ఓ రెప్పపాటుకాలం మనలో మనంకాదు, మనలను ప్రేమించేవాడు, మనచే ప్రేమించబడువాడు అగు పరాత్పరుడుండే క్షణాలు కొన్ని వుంటాయి. ఈ దివ్యప్రేమ, దివ్యప్రేమకుడి దర్శనం క్షణికమైనప్పటికీ మానవసహజమైన భావోద్రేకం సైతం ఉద్ధరింపబడి మహిమాన్వితం కాబడగలదు. ఈ కారణంగా దైవారాధన, విగ్రహ పూజ ఏవైతే మానవుడిని అయస్కాంతంలా ఆకర్షిస్తాయో,

మానవునికి ఆదర్శనీయమో, అవి తృణీకరించబడకూడదు. ఎందుకనగా అవి అనంతుడగు పరమాత్ముని పరమానంద భరిత పారవశ్యత దిశగా మానవజాతి అడుగేయటానికి అనుసరించవలసిన విధివిధానాలు. అవి పరిమితం చేయబడిన ప్పటికీ, మనమేస్థాయిని అందుకున్నామో అర్థం చేసుకొని, ఇంకా మనం పాటించ వలసిన ఈ నిమ్న స్థాయికి చెందిన విధానాలేవైతే మహాప్రకృతి నిర్థారించిందో వాటిని అజ్ఞానంతో దర్శించలేకపోయిన మన దృష్టికి తెస్తాయి. భావప్రేరితమగు మన మనోమయ అస్తిత్వ అభివృద్ధికి కొన్ని అర్చనా విధులను పాటించడం అని వార్యం. ఆ విధంగా చేయకపోతే, విషయాలపై అవగాహన గల వ్యక్తి తొందర పాటుతో ఎప్పుడైనా తన హృదయంలో నిలుపుకొన్న పరమాత్మ స్వరూప స్థానంలో అది ప్రతిబింబించే పరమసత్యతను ప్రతిష్ఠించితే తప్ప ఆ నిలుపుకున్న స్వరూపాన్నిచెదరగొట్టవచ్చు. అంతేగాక అర్చనా విధులకు ఈ శక్తి ఉంది. ఎందు కనగా వాటిలో ఆ స్వరూపాకృతులను మించిన దేదో ఒక మహత్తు వుంది. దైవా రాధనలో అత్యుత్తమమైన యోగ్యతను పొందిన స్థితి కూడా దానికి కట్టుబడి వుంటుంది, దాని కొనసాగింపుగా నుంటుంది. దాని విశ్వజనీనమైన సంపూర్ణ త్వంలో, ఒక భాగమౌతుంది. సర్వ స్వరూపాలను, సాక్షాత్కారాలను అధిగమిం చిన ఆ 'తత్ ' ను మనం తెలుసుకోగలిగినప్పటికీ, మనం ప్రాణిలోను, వస్తువు లోను, మనిషిలోను, గుణగణాలలోను, జంతువులోను, వృక్షంలోను, పుష్పం లోను, మన కరములు చేసే కర్మాచరణలోను, మహా ప్రకృతి దివ్యశక్తిలోను భగ వంతుని ఉనికి వున్నదని విశ్వసించనంతవరకు, మన జ్ఞానం దోషభూయిష్టం గానే వుంటుంది, మన ప్రేమ అసంపూర్ణమైనదిగానే వుంటుంది. ఆ విశ్వాసం ఏర్పడితే అవి మనకు భౌతికమైన యంత్రాల యాంత్రికచర్యలా గాక విశ్వవ్యాప్త మగు దైవశక్తి ముఖవైఖరిగా, దక్షతగా అర్థమౌతాయి. ఎందుకనగా వాటిలో కూడా ఆ శాశ్వతుడి ఉనికి వున్నది కాబట్టి.

SWSA 23: 159

ప్రేమ సత్యము, నిత్యము, నిస్వార్థము, నిరపేక్షము, నిర్మలము, నిర్వికారము, నిరంజనము, నిరాకార నిర్గుణ పరంబ్రహ్మతత్వ సారాంశము. కేవల ప్రేమయే ఇంతటి విశేషలక్షణ సమన్వితమయినది అయితే, దివ్యప్రేమ ఎంతటి విశ్వ జనీనము, విలక్షణము, వైభవోపేతమైనదో గదా! నేడు ఏ హేతువాద ప్రభావిత



"ఓ పరమేశ్వరా, ఏకైక ఆంతరంగిక మిత్రమా, మేము మీకు నివేదించాలనుకున్న దంతా మీకు ముందుగానే తెలుసు, ఎందుకనగా దానికి మూలం మీరే!

"ఓ పరమేశ్వరా, ఏకైక మిత్రమా, మీరు మమ్ములను ఏ విధంగా నున్నామో ఆ విధంగానే స్వీకరించటానికి, ప్రేమించటానికి, అర్థం చేసుకోవటానికి అంగీకరిస్తారు, ఎందుకనగా మమ్ములను ఆ విధంగా రూపకల్పన చేసింది మీరే కాబట్టి!

"ఓ పరమేశ్వరా, ఏకైక మార్గదర్శీ, మా అత్యున్నత సంకల్పాన్ని ఎప్పుడూ అసత్యమని అనని మీరు, అలా అనక పోవటానికి కారణం దానిలో నున్నది మీ సంకల్పమే కాబట్టి!

"విని, అర్థం చేసుకొని, ప్రేమించి, నడిపించే వారిని మీలో గాక మరొకరిలో వెతకటం అవివేకమౌతుంది, ఎందుకనగా మా పిలుపునందుకొనుటకు సర్వ సన్నద్ధులై వున్నవారు మీరే; మీరు మమ్ములను ఎప్పుడూ ఉపేక్షించరు!

CWM 1: 375 — *అనువాదం: అందుగులపాటి జానకి*

ఆలోచనలు ప్రజానీకంలో సనాతన వైదిక సాంప్రదాయ బద్ధమైన దేవతార్చనా పద్ధతుల పట్ల హేయభావనను కలిగిస్తున్నాయో, అవిసైతం మానవాళిని పరమాత్ముని పరమానంద పారవశ్యత దిశగా కొనిపోయే సాధనాలని, నిరసించబడకూడదని శ్రీమాత ఉటంకించారు.

శ్రీమాతారవిందుల దివ్యప్రవచనాలలో, రచనలలో దివ్యప్రేమ ప్రాభవం విలక్షణంగా వివరించబడింది. దాని అవగాహన, అనుసరణ మానవజాతి మనుగడను ఆనందమయం గావించి, దివ్యీకరించి, దైవార్పితంగా తీర్చిదిద్దగల వారి సందేశాలను, సూచనలను కొంత వరకు ఈ సంచికలో పాఠక లోకానికి పరిచయం చేయ, ప్రయత్నించడ మైనది.

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

దివ్యప్రేమ అన్నింటా, అంతటా అభివ్యక్తం కావాలి

అన్నింటినీ పరిత్యజించుటతో అనుభవజ్ఞానం, చైతన్యం సహా, మీరు మీ హృదయాన్ని దానికి నిర్దేశింపబడిన పాత్రను నిర్వహించుటకు సమాయత్త పరచ గలిగారు. వాస్తవానికి అది ఏ మాత్రం ప్రతిఫలం పొందలేని పాత్ర — భూమి నుండి ఊటగా ఉబికే జలము అందరికీ అందుబాటులోకి వచ్చే విధంగా ధారాళంగా ప్రవహించినప్పటికీ, ఆ ఊటను చేరటానికి తిరిగి రానట్లుగా. అది దాని అక్షయమైన బలాన్ని దానిలో లోతుల నుండే తోడుకుంటుంది గానీ బాహ్యంనుండి ఏమీ ఆశిం చదు. కానీ, ఈ అక్షయమైన ప్రేమ విస్తృతితో పాటు కలిసివచ్చే

> పురుషుని ప్రేమ, స్త్రీ ప్రేమ, ఇతర ప్రాణుల ప్రేమ ఇరుగు పొరుగు వారి ప్రేమ, దేశప్రేమ, జంతుప్రేమ, మానవజాతి ప్రేమ, అన్నీ దైవ ప్రేమకు చెందినవే. ఆ దైవ ప్రేమయే ఈ సజీవ ప్రతిరూపాలలో ప్రతిబింబిస్తున్నది. అందువల్ల ప్రేమించు, అన్నింటినీ ఆనందంగా అనుభవించటానికి, అందరికీ సహాయపడటానికి, సదా ప్రేమించటానికి శారీరకంగా, మానసికంగా వృద్ధిచెందు.
>
> *CWM 10: 346* — శ్రీమాత
>
> అనువాదం: అందుగులపాటి కైలాసపతి

మహదానందాతిరేకాన్ని మీరు ఇదివరకే అనుభూతి పొంద గలిగారు. ఎందు కనగా ప్రేమ తనంతట తాను సంతృప్తి చెందుతుంది కానీ ప్రతిఫలం ఆశించదు. వ్యక్తిగతమైన ప్రేమ విషయంలో ఇది వాస్తవం. అలాంటప్పుడు అనంతుడగు దైవాన్ని ఎంతో సమున్నతంగా ప్రతిబింబించే దివ్యప్రేమ విషయంలో ఇంకెంత వాస్తవమౌతుంది!

"అన్నింటిలోను, అంతటా, ఈ ప్రేమ ఎల్లప్పుడూ వర్థిల్లాలి — మరింత విస్తృతంగా, మరింత తీవ్రంగా విశ్వమంతా ఏకకాలంలో మీ ప్రయోజనం, మీ భాగ్యం, మీ కార్యాచరణ, మీ ఆక్రమిత క్షేత్రం కావాలి. అస్తిత్వ విస్తరణకు అడ్డుగా నున్న చిన్న చిన్న అవరోధాలను తొలగించటానికి, చివరన మిగిలిన అనుమానాస్పద విషయాలేవైతే ఇప్పటికే మీ దివ్యజ్ఞానకాంతి ప్రసరణతో వెలుగు లోకి వస్తున్నాయో వాటిని స్పష్ట పరచటానికి పోరాడు, వశపరచుకొనటానికి, విజయం పొందటానికి పోరాడు. నేటివరకు అడ్డుగానున్న దానినంతా అధిగమించ టానికి, వినూత్నమైన దివ్యకాంతి తక్షణం వెల్లి విరియడానికి, లోకమంతా నిరీ క్షిస్తున్న దివ్యదృష్టాంతం అభివ్యక్త పరచటానికి పోరాడు. అంతరంగ మరియు బాహ్య అవరోధాలను అంతమొందించటానికి పోరాడు. మీ దివ్య సాక్షాత్కారం కోసమై ఇది మేము చెల్లించే అమూల్యమైన పరిహారం."

CWM 1:337 *అనువాదం: అందుగులపాటి కైలాసపతి*

బాధకు మూలం

కేవలం బాధను అనుభవించినవారు మాత్రమే ఇతరుల బాధను తెలుసుకోగలరు, దానిని అర్థం చేసుకోగలరు, దానితో భాషించగలరు, దానినుంచి వారికి విముక్తి నివ్వగలరు. ఓ దివ్య ఉపశమనుడా, మహనీయ మహాబలీ, నాకు అర్థమయింది, మా సంకటములనుంచి మమ్ములను ఆదుకోటానికి, మానసిక వ్యథలనుంచి ఉప శమనం కలిగించటానికి, ఈ పుడమి బాధలు, ఈ మనిషి బాధలు సమస్తమూ ఏ మినహాయింపులు లేకుండా నీవు అవశ్యం తెలిసి ఉన్నవాడవు, అనుభవించి ఉన్న వాడవు.

అటువంటప్పుడు, నిన్ను పూజిస్తున్నామని చెప్పుకొనే వారిలో, కొందరు నిన్ను క్రూరత్వంతో శిక్షలకు గురిచేసే వాడుగా, దయలేని న్యాయ నిర్ణేతగా,

క్లేశాలను సహనంతో సాక్షిమాత్రుడవై చూస్తూ ఉండేవాడిగా లేదా వాటిని నీ ఇచ్ఛతో కల్పించేవాడుగా కూడా ఏ విధంగా అనుకోగలుగుతున్నారు?

లేదు, ఇప్పుడు నేను గ్రహిస్తున్నాను, ఈ బాధలు కేవలం మహా పదార్థపు అపరిపూర్ణతనుంచే వస్తున్నాయనీ, దాని అస్తవ్యస్తతతో, మొరటుదనంతో నిన్ను అభివ్యక్తం చేయ గలిగిన యోగ్యత దానికి లేదనీ; దాని మూలంగా మొదట బాధ ననుభవించేవాడవు నీవే, దుఃఖపడినవాడవు నీవే, దాని అస్తవ్యస్తతను క్రమపద్ధతిగా, బాధను సంతోషంగా, వైషమ్యాన్ని సామరస్యతగా మార్చడానికి తీవ్ర ఉత్సుక తతో కూడిన కోరికతో మొదటగా శ్రమించేవాడవూ నీవే, పోరాడే వాడవూ నీవే.

బాధ తప్పనిసరైనదేమీ కాదు. లేదా కోరదగింది కూడా కాదు, కాని అది మాకు సంప్రాప్త మైనప్పుడు అది ఎంత సహాయకారి అవుతుందో కదా!

మా హృదయం ముక్కలు చెక్కలయే అనుభూతి కలిగే ప్రతిసారి, మా కోసం కొత్త సీమలను, ఇంకా సమృద్ధమైన గుప్త నిధులతో బహిర్గతంచేస్తూ, లోతైనటువంటి ఒకద్వారం తెరచుకుంటుంది. నాశనపుటంచులలో ఉన్న శరీరగత ప్రాణికి వాటినుంచి వచ్చే బంగారు ప్రవాహాలు మళ్ళీ ఒకసారి నూతనమైన, తీవ్రోత్సాహ భరితమైన జీవితాన్ని తీసుకువస్తాయి.

ఆ విధంగా ఇటువంటి క్రమానుగతికమైన అవరోహణల ద్వారా, మేము నిన్ను బయల్పరచే ముసుగును చేరగా, అది పైకెత్త బడినప్పుడు, ఓ ప్రభూ, మొత్తం అస్తిత్వమంతటిలోనూ చొచ్చుకుపోయే తీవ్రమైనటువంటి మహా జీవి తాన్ని, వరద ప్రవాహంతో దానిని ముంచెత్తే, కనులు మిరుమిట్లు గొలిపే ఆ దివ్యప్రకాశాన్ని, శాశ్వతంగా దానిని పరివర్తన చేయగల దివ్యప్రేమ మహనీయ తను వర్ణించ గల వారెవరు!

CWM 2: 21

దివ్యప్రేమ అట్టడుగు పాతాళ లోకాలను చేరుతుంది

నా ముద్దుబిడ్డా, విను, ఈ రోజు నీవు నైరాశ్యానుభూతికి లోనయావు, బహుశా బాగా పతనమై పోయావు, నీ కంటూ ఏమీ మిగలలేదు, నీ దైన్యాన్ని దాచగలిగింది ఏదీ లేదు, నీ ఆభిజాత్యానికి అనుకూలించేది ఏదీ లేదు: ఇంత గొప్పగా నీవు ఇంతకుముందెన్నడూ లేవు! ఎవరైతే అగాధాలలో మేల్కొంటారో,

వారు శిఖరాగ్రాలకు ఎంతో దగ్గరగా ఉంటారు, ఎందుకనగా అగాధం ఎంతగా లోతైనదైతే, అంతగా ఉన్నతోన్నతాలు తమకు తాము బహిర్గతం చేసుకో గలవు!.....

అగ్నిపరీక్ష లేక అపరాధం నిన్ను కూలదోస్తే, నీవు బాధల అగాధాల అట్టడుగు లలో కూరుకుపోతే, శోకించ వలదు, ఎందువల్లనంటే దివ్యప్రేమ అక్కడ వాస్తవంగా ఉన్నటువంటి, పరమానుగ్రహం నిన్ను చేరగలదు! కారణం, నీవు శుద్ధి చేసే శోకాల కొలిమి ద్వారా పయనించావు గనుక మహిమాన్వితమైన ఆరోహణలు నీవే.

నీవు ఎడారిలో ఎటూ పాలుపోని స్థితిలో ఉన్నావు: అటువంటప్పుడు నిశ్శబ్దపు వాణులను ఆలకించు. ఉబ్బితబ్బిబ్బుకు గురిచేసే మాటల కోలాహలం, బాహ్య కరతాళ ధ్వనులు నీ వీనులకు విందు చేశాయి, కాని నిశ్శబ్దపు వాణులే నీ ఆంతరికతను సంతోషపెడతాయి, అంతరాంతరాళాల ప్రతిధ్వనులను, దివ్య సామరస్యత ఉచ్చారణలను నీ అంతరంగంలో మేల్కొల్పుతాయి!

గాఢ నిశీధి అగాధాలలో నీవు నడుస్తున్నావు: అటువంటప్పుడు ఆ నిశీధిలోని నిధులను పోగుచేసుకో. మెరిసే సూర్యకాంతిలో మేధోమార్గాలు స్పష్టంగా వెలుగులీనుతాయి, కానీ రాత్రివేళ తెల్లని చంద్రకాంతిలో పరిపూర్ణతా దారుల, ఆధ్యాత్మిక సంపదల రహస్యాలు దాగి ఉంటాయి. నీవద్దనున్న ప్రతిదీ లాగివేయబడి నీవు నగ్నం కావించబడ్డావు. అది సమృద్ధి వైపుకు సాగిపోయే పద్ధతి. నీ దగ్గర ఏమీ మిగలక పోతే, ప్రతిదీ నీకు ఇవ్వబడుతుంది. కారణం, ఎవరైతే చిత్తశుద్ధిని నిజాయితీని కలిగి ఉంటారో, అత్యంత చెడునుంచి అత్యంత మంచి సంప్రాప్తిస్తుంది.

పృథ్వీమీద నాటబడిన ప్రతి ధాన్యపు గింజ నేలలో ఉత్పత్తిని చేస్తుంది ప్రతి శోకపు రెక్కల రెపరెప వైభవోపేతమైన ఎంతో ఎత్తుకు తీసుకుపోయేది కాగలదు. ప్రత్యర్థి అయినవాడు మనిషిని కనికరం లేకుండ వెంటాడుతూ తగులు కొంటే, ఆ మనిషిని నాశనం చేయటానికి చేసే ప్రతిదీ కేవలం అతడిని ఇంకా ఉన్నతోన్నతుడిగా చేసివేస్తుంది.

CWM 2: 44- 45

దాతృత్వం ప్రేమకు వ్యక్తీకరణగా

ప్రతిదీ మనకు ఆపాదించుకొనే అలవాటునుంచి ఎంతగా బయట పడగలిగితే, అంతగా అప్పుడు మనం నిజమైన దాతృత్వాన్ని సమర్థవంతంగా నిర్వర్తించ గలుగుతాం, ప్రేమభరిత దాతృత్వం.

దానితో పాటుగా ఒక పరాకాష్ఠ ఉంటుంది, అక్కడ విశిష్టగుణాలన్ని పరస్పర సౌభ్రాతృత్వంతో కలుస్తాయి: ప్రేమ, మంచితనం, దయ, ఓర్పుకోవటం, దాతృత్వం అన్నీ ఒక్కటే, వాటి అంతస్సారంలో అన్నీ సమానమే.

ఈ కోణంనుంచి పరికిస్తే, దాతృత్వాన్ని స్పష్టమైన, ఆచరణాత్మకమైన ప్రేమ సుగుణాలను వినియోగించడం మూలంగా నిర్ణయించబడిన బాహ్య కార్య క్రమంగా పరిగణించవచ్చు.

ఎందువల్లనంటే, అందరికీ పంచగలిగిన శక్తి ఒకటి అక్కడ ఉంది, అది ఎల్లప్పుడూ ఉన్నదే, అదీ ఎప్పుడంటే, దానిని అత్యుత్తమ రీతిలో పూర్తిగా వ్యక్తిగత స్పృహలేని విధంగా ఇవ్వబడిన పక్షంలో మాత్రమే: ఇదే ప్రేమ, ఆ ప్రేమ తనలో వెలుగును, జీవితాన్ని కలిగి ఉంటుంది, అనగా, మేధస్సు, ఆరోగ్యం, వికసనముల యొక్క అన్నింటి సంభావ్యతలను కలిగి ఉంటుంది.

అవును, ఒక మహనీయమగు దాతృత్వం ఉంది, ఒక సంతోషదాయకమైన హృదయంనుండి, ఒక నిర్మలమైన ఆత్మనుంచి పైకి వచ్చేటటువంటిది.

ఎవరైతే అంతరంగ ప్రశాంతతను జయించి ఉంటారో అతడు ఎక్కడెక్కడికి వెళ్ళినా రక్షణ కల్పించటంలో అందరికంటె ముందుంటాడు, అతడు ఆశను, హర్షాన్ని మోసుకువచ్చేవాడు. దీన, బాధాతప్త మానవజాతి అన్నింటినీ మించి కోరుకునేది ఇదికాదా?

అవును, కొంతమంది మనుషులున్నారు, వారి ఆలోచనలు ప్రేమతో నిండి ఉంటాయి. వారు ప్రేమను అన్ని వైపులా ప్రకాశింపజేస్తారు. కేవలం వారి ఉనికి మాత్రమే దాతృత్వమై అన్నింటికంటే ఇంకా ఎక్కువ కార్యశీలతను, ఇంకా ఎక్కువ వాస్తవికతను సంతరించుకుంటుంది.

వారు ఏ మాటా మాట్లాడకపోయినప్పటికీ, ఎటువంటి భావ వ్యక్తీకరణా చేయ కపోయినప్పటికీ, వ్యాధిగ్రస్తులు కుదుట పడతారు, పీడితులు ఉపశమనం పొందు

తారు, అజ్ఞానులు జ్ఞాన ప్రకాశం పొందుతారు, దుష్టులు శాంతించ బడతారు, ఎవరైతే బాధ ననుభవిస్తుంటారోవారు ఓదార్పు నొందుతారు. ఆ విధంగా అందరూ ఇటువంటి లోతైన పరివర్తనను పొందుతారు, అది వారికి నూతన సీమ లను తెరుస్తుంది. పురోగతి వైపు వేసే అనంత పథంలో ముందుకు ఒక అడుగు వేయగలిగేటట్లుగా చేస్తుంది. కాని అది నిశ్చయాత్మకమైనదిగా ఉంటుందనటంలో సందేహం ఇసుమంతైనా లేదు.

ఈ వ్యక్తులు ప్రేమతో తమకు తాము అందరికీ సమర్పించుకుంటారు, వారు అందరికీ సేవకులవుతారు, పరమోత్కృష్ట దాతృత్వానికి సజీవ ప్రతీక లవుతారు.

CWM 2: 105- 06

అంతరంగ సామీప్యత

ఒకవేళ మనం దివ్యజీవితపు అద్భుతమైన లోతులను అందుకోలేకపోయి నప్పటికీ కూడా, దాని గురించి కేవలం చాలా అరుదుగానే వ్యక్తులు నిరంతరం ఎరుకలో ఉంటారనే విషయం వాస్తవమైనా, ఆలోచనాక్షేత్రంలో ఇప్పటికే మనం కాలము, ప్రదేశముల ధర్మాలను తప్పించుకొని పోయాం.

ఒకరిని గురించి ఆలోచించటం జరిగితే వారి సామీప్యంలోనే ఉన్నట్లు. ఎక్కడెక్కడైనా ఇద్దరు వ్యక్తులు తమకు తాము ఉంటున్నప్పుడు, ఒకవేళ వారు వేల కిలోమీటర్లు దూరంలో విడిగా ఉన్నా, వారు ఒకరిగురించి మరొకరు ఆలో చిస్తే, వాస్తవంలో వారు ఒకరి దగ్గర మరొకరు కలసి ఉన్నట్లే. మనం మన ఆలో చనను కావలసినంతగా ఏకాగ్రం చేయగలిగినట్టైతే, మన ఆలోచనలో కావలసినం తగా ఏకాగ్రుల మయినట్లైతే, మనం ఆలోచించే దానితో మనం సమగ్రంగా ఎరుక లోకి రాగలం. వారు మనిషి గనక అయినట్లైతే, ఒక్కొక్కప్పుడు వారిని దర్శించగలం లేదా వారిని వినగలం - ఏదైనా కాని అతని ఆలోచన తెలుస్తుంది.

కనుక విడివడి ఉండటం అనేది ఎంతమాత్రం సంభవంకాదు, అది భ్రమా త్మకం.

అది ఫ్రాన్సు కాని, అమెరికా కాని, పర్షియా కాని, చైనా కాని, మనం ప్రేమించే వారికి, మనం ఆలోచించే వారికి ఎల్లప్పుడూ సమీపంలోనే ఉంటాం.

కాని ఈ విషయం మనం ఉన్న స్థితిలోనైతే ఇంకా ఎక్కువగా వాస్తవం, ఇక్కడ మనం ప్రధానంగా క్రియాశీలమైన, ఎరుక కలిగిన ఆలోచనతో సంబంధం పెట్టుకోవాలనుకుంటాం. ఒక ఆలోచన, అది అనంతమైన ప్రేమను ఊహించుకుని, అభివ్యక్తమౌతుంది. ప్రేమతో కూడి, పితృసంబంధంతో ఎవరైతే దానికి తమను అధీనం చేసుకొంటారో, కేవలం వారికి మాత్రమే ఎంతో సంతోషంతో సహాయం చేయటానికని వచ్చే ఆలోచన, అది మొత్తం భూమినంతా చుట్టి ఆవహించి వేస్తుంది. ఈ మానసిక సంసర్గాన్ని అనుభవించు, అప్పుడు నీవు ఎటువంటి దుఃఖానికి అవకాశం లేదనే విషయం తెలుసుకొంటావు.

CWM 2: 114- 115 *అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ*

నీవు ఒంటరిగా ఉన్నావనే అనుభూతికి కారణం, నీవు ప్రేమించబడాలనే ఆవశ్యకతానుభూతిని పొందుతున్నావు. ఎటువంటి అపేక్షలు లేకుండా ప్రేమించటం నేర్చుకో, కేవలం ప్రేమించే ఆనందం కోసమే ప్రేమించటం నేర్చుకో, (ప్రపంచంలోని అత్యంత అద్భుతమైన ఆనందం!), అప్పుడు నీవు మరలా ఎన్నడూ ఒంటరిగా ఉన్న అనుభూతిని పొందవు.

CWM 14: 141

శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

దివ్యప్రేమ మార్గము

భగవంతుని ప్రేమించటం అంటే సర్వం భగవత్ స్వరూపంగా భావించ గలగటమే. దీన్నే ఆకాంక్షించాలి. ఇదే మనం భావిస్తున్న పరిపూర్ణ పరంజ్యోతి. ఇదే శాశ్వతమైన న్యాయం. ఇట్టి దివ్యత్వానికి మనకు మనం సమర్పించు కోవటం మన చేతల ద్వారానే సాధ్యం అవుతుంది. పూర్తి సమర్పణ సాధించిన తరువాత వ్యక్తులు కేవలం పనిముట్లుగానే అయిపోతారు. వారు నమ్రత గలిగిన విశ్వాస పాత్రులైన పరికరాలే. పరమాత్మ ఒక్కడే అన్నిటికీ యజమాని. ఆ స్థితిలో ఎవ్వరికీ దివ్యత్వం మినహా మరేదీ భావనలో వుండదు. అప్పుడే అది పరిపూర్ణ ఏకాగ్రత కూడా అవుతుంది.

"అంతకుమించి ఉన్నతస్థితికి ఎదగటం అసాధ్యమేమీ కాదు. ఎందుకంటే

ఎంత పరిపూర్ణ ప్రేమ అయినా అది దివ్యప్రేమకు, సాధకునికి మధ్యవున్న మేలి ముసుగువంటిదే." అదొక గుర్తింపు మాత్రమే. ఇక మూడవది సర్వమానవ ప్రేమ.

మానవులు పడుతున్న కష్టాలు, బాధలు స్పష్టంగా చూడగలిగితే వారికి కొంత ఊరట కలిగించాలని అనిపిస్తుంది. ఈ దిశగా మనం చేసే ఆలోచనలు, సహాయ సహకారాలలో (అవి ఎంత కొద్దివైనా సరే) "మనం చేస్తున్నాము" అనే భావనను రానివ్వకూడదు. "మనము కేవలం పరికరాలము మాత్రమే" అనే భావనతో పని చేయాలి.

"దయతో పొంగి, పొరలుతున్న హృదయంతో బాధాతప్తమగు ప్రపంచం లోనికి వెళ్ళండి. ధీనులకు సన్మార్గాన్ని బోధించి, వారి హృదయాలలో వెలుగు నింపండి. ఎక్కడైతే అజ్ఞానాంధకారం రాజ్యం ఏలుతుందో, అక్కడ ఈ జ్యోతిని వెలిగించండి."

మీ కార్యక్రమం నాలుగు విధాలుగా వ్యక్తం కావచ్చు. ఇవి నాలుగు రకాల దానాల వంటివి. అవి వస్తురూపంలో గాని, మేధాపరంగా గాని, విజ్ఞానరూపంలో గాని, ఆధ్యాత్మిక రూపంలోగాని, ఉంటాయి. ఆధ్యాత్మికంలో అది సుందరం గాను లయబద్ధంగాను, సామరస్య సాధనగానూ, ఉంటుంది. నాలుగవది పరిపూర్ణ త్వము. ఇది పై మూడుమార్గముల పర్యవసానము, వాటి సమ్మేళన ఫలితము; శాశ్వత సత్యమును అనుగ్రహించే నమూనా; ఇది తనను తానే మరచి పోతుంది. మనము ఆ శాశ్వత దివ్యభావన లోనే ఉండటం వలన మనకు దివ్యత్వం సిద్ధించిన సంగతి కూడా తెలియదు.

CWM 2: 130- 131

ప్రేమ విశ్వజనీనము, శాశ్వతము

ప్రేమ ప్రపంచంలో ఒక గొప్ప శక్తి. దానికి ఏ ఇతర కారణాలు,, కోరికలు లేకపోయినా తనకు తానుగా అది వ్యక్తం అవుతుంది. అది నిరపేక్షము. ఎక్కడ దానికి కొద్దిగా అవకాశం వుంటుందో అక్కడ అది ప్రభవిల్లుతుంది. మీరు వ్యక్తి గతము అనుకున్న ప్రేమ కూడా ఈ విశ్వజనీన ప్రేమయే. కాని అది మీద్వారా ప్రకటితం అవుతున్నది. అంతే కాదు, ఏది విశ్వం మొత్తానికీ సంబంధించినది అది ఎన్నడూ అచేతనం కాజాలదు. అది సమున్నత చేతనాశక్తి. ఈ ప్రపంచంలో

అది ప్రకటితం కానున్న సందర్భాలలో తనకు అనువైన వ్యక్తులను, పరిస్థితులను అదే కల్పించుకుంటుంది. తన స్పందనలను స్వీకరించగల వ్యక్తులను ప్రభావితం చేసి వారి ద్వారా తన లక్ష్యాన్ని నెరవేర్చుకుంటుంది. అందుకు అనువుగా లేని వ్యక్తులను విడిచిపెట్టి తగిన వారిని వెతుక్కుంటుంది. దాని అన్వేషణ అలా కొన సాగిస్తుంది.

మానవులు ఉన్నట్లుండి ప్రేమలో పడ్డట్టు భావిస్తారు. ఆ ప్రేమ పెరిగి, పెరిగి కొంత కాలానికి కనుమరుగు ఔతుంది కూడా! కొందరిలో అది మరికొంతకాలం కొనసాగవచ్చు. అది ప్రేమ యెడల వారికి వుండే భావన కాదు. ప్రేమకు వారిపై ఉండే నమ్మకం. వారు ప్రేమచే ఎన్నుకోబడ్డ పరికరాలు. వారి ప్రేమానుభవం కేవలం వారి భ్రమలాంటిదే అనుకోవచ్చు. నిజానికి అది విశ్వ ప్రేమయొక్క ఒకానొక వీచిక. ప్రేమ ఎవరి గొప్పతనం కాదు. అది విశ్వ ప్రేమయే, మనలో ప్రతిఫలించింది, అంతే.

ప్రేమ ఎల్లప్పుడూ ప్రభవిస్తూనే వుంటుంది. అది అంతటా అదే విధంగా ప్రక టితమౌతుంది. ప్రేమ ఒక దివ్యశక్తి. మనకు కనపడేదాని వికృత స్వరూపాలు మన స్వయం కృతాపరాధాలే. ప్రేమ కేవలము మానవులకు మాత్రమే సంబంధిం చినది కాదు. అది విశ్వమంతా వుంటుంది. మొక్కలలోను రాళ్ళలోను కూడా వుంటుంది. జంతువులలో అది స్పష్టంగా తెలుస్తుంది. ప్రసరిస్తున్న మాధ్యమాల లోని స్పష్టతా లోపం వల్లగాని, ప్రేమికుల సంకుచిత స్వభావంవల్ల గాని కొన్ని దుష్ఫలితాలు కలుగవచ్చు.

CWM 3: 69-70

ప్రేమకు కోరికలు వుండవు

ప్రేమ శాశ్వతశక్తి అయినందున అది అన్ని సందర్భాలలో వుంటుంది. దానికి కోరికలూ, స్వలాభాలూ వుండవు. ఇది కావాలని, అది కావాలని ప్రేమ కోరదు. పరిశుద్ధమైన ప్రేమ దివ్యత్వంలో ఏకం కావాలని మాత్రమే కోరుతుంది. మరే ప్రయోజనాన్నీ అది ఆశించదు. దివ్యప్రేమ ఇచ్చేదే కాని, పుచ్చుకునేది కాదు. మానవులు మాత్రం ప్రేమను ఒక దూరంగా వుంచాల్సిన, జుగుప్సా కరమైన భానంగా మార్చివేశారు.

ప్రేమ మొదట్లో పవిత్రంగానే ప్రారంభం అవుతుంది. ప్రేమికులు ఆ ప్రేమలో తన్మయులౌతారు. ఆ ప్రేమ వారిలో అనిర్వచనీయ దివ్యత్వ భావనను మాత్రమే కలిగిస్తుంది. ప్రపంచం అంతా సుందరంగా అద్భుతంగా కనిపిస్తుంది. తర్వాత నిదానంగా, క్రమంగా మానవ ప్రవృత్తి ద్యోతకమౌతుంది. అన్నీ అపవిత్ర భావనలే చోటు చేసుకుంటాయి. అప్పుడు ప్రేమ ప్రతిఫలాన్ని కోరటం ప్రారంభిస్తుంది. చివరకు అదొక వస్తుమార్పిడి విధానంగా మారిపోతుంది. తన స్వలాభాన్ని మాత్రమే నిరంతరం ఆశిస్తూ, దివ్యత్వ భావనను క్రమంగా భ్రష్టు పట్టిస్తుంది.

దివ్యప్రేమ ఆవిర్భావము

దివ్యప్రేమ ప్రతిఫలించాలంటే దాన్ని పొందగల అర్హత సాధించాలి. సహజంగా దివ్యత్వపు భావనలను అర్థం చేసుకో గలిగిన వారే ఇందుకు తగిన వారు. వారిలో ఎంత విశాల దృక్పథము, స్పష్టమైన భావనలు ఉంటాయో అది వారిలో అంతగా ప్రకటితమౌతుంది. అట్లే ఎక్కడ మానవులలో నిమ్న భావాలు బలంగా వుంటాయో అక్కడ దివ్యప్రేమ కూడా అంతగా భ్రష్టత్వాన్ని సంతరించుకుంటుంది. సత్య స్వరూపమైన ప్రేమయొక్క నిజ స్వభావాన్ని ఎవరు అర్థం చేసుకోలేరో వారు దివ్యత్వాన్ని సమీపించ లేరు. జ్ఞానులు కూడా ఈ దిశగా కొంత వరకే ముందుకు వెళ్ళగలరు. ఇంకా ముందుకు వెళ్లగలిగితేనే ఈ ప్రేమయే జ్ఞానజ్యోతి అనికూడా వారు తెలుసుకుంటారు. జ్ఞానమే అసలైన దివ్య జ్యోతి, ప్రేమయే దాని హృదయం.

ఈ ప్రపంచాన్ని రూపాంతరీకరించి దాన్ని దివ్యత్వంతో నింపాలని అవతరించిన వారు దివ్యప్రేమను పూర్తిగా తమ నిత్యజీవితాల్లో నిరూపించారు. అయినా కొందరు అజ్ఞానులు వారిని అపార్థం చేసికొని అనేక ఇబ్బందులకు గురి చేశారు. కాని ఆ జ్ఞానుల దివ్యప్రేమ చెక్కుచెదరలేదు. దివ్యప్రేమ దివ్యప్రేమగానే ఉండిపోయింది. మానవ ప్రేమగా మారలేదు.

ఎవరైనా మానవ ప్రేమ గురించి మాట్లాడారంటే అందులో భావ ప్రకోపాలు, మానవ దౌర్బల్యాలు ఉండక తప్పవు. దివ్యప్రేమకు ఉండవలసిన స్వార్థ రాహిత్యము, పరిపూర్ణ త్యాగభావము, నిరవధికత్వము, నిరపేక్షత, మానవ

ప్రేమకు ఉండజాలవు. దివ్యప్రేమ నిష్కామము అనేది చాలామందికి తెలియదు. ఎప్పుడైతే ప్రేమ కోరికలకు అతీతంగా వుంటుందో, అది కఠినంగాను, స్తబ్ధుగాను ఉన్నట్లు అనిపిస్తుంది. అట్లాంటిదాన్ని అత్యున్నత ప్రేమగా చాలామంది గుర్తించనే లేరు.

మార్పు కోరవలసినదే కాని అణచివేత కాదు

నేను వర్ణిస్తున్న దివ్యప్రేమ ఈ భౌతిక పదార్థాన్ని కూడా దివ్యత్వంతో నింపగలదు. దానికి ఏ మానవ బలహీనతలు ఉండవు. ప్రాణికం అనేది దాని ఆవిష్కరణకు ప్రాథమిక అవసరం. దేనికైనా ప్రాణికం ఆధార పీఠమే, కాని ప్రతికూల శక్తులు ఈ విలువైన ప్రాణికాన్ని అడ్డుకుంటున్నాయి. దానిలో దాగివున్న చైతన్యం మాత్రమే జడపదార్థాన్ని చైతన్యవంతం చేయగలదు. కొన్ని దుష్టశక్తులు దీన్ని పాడుచేశాయి. హింసాత్మకంగా స్వలాభ సాధనంగా మార్చివేశాయి. దీన్ని కోరికల మయంగా చేసి, దివ్యత్వ కార్యక్రమాన్ని జరుగకుండా చేశాయి. ఇక చేయాల్సిందంతా ఒక్కటే: దాన్ని రూపాంతరీకరించి, మార్పుచేయటం. అణచివేసి నాశనం చేయటంకాదు.

ప్రాణికం లేకుండా ఎక్కడా తీవ్రత ఉండదు. మనలో వున్న ప్రాణికం క్రమంగా బలహీన పడవచ్చుకూడా. దేనికి అన్నింటినీ స్వాధీనం చేసుకోవాలని వుంటుందో దానికి అన్నిటినీ వదిలించికోవాలని కూడా వుండవచ్చు. నిజమైన ప్రాణికచేతన సుందరమైనదే, కాని అది వికృతము, జుగుప్సాకరము అవుతున్నది. అయినా ఎక్కడ పవిత్రప్రేమ జనిస్తుందో అక్కడ లేశమాత్రంగానైనా దివ్య ప్రేమ జనిస్తుంది. దానికి సత్యము, సౌందర్యము వచ్చి చేరుతాయి. అట్టి క్షణం ఎక్కువ సేపు నిలువకపోవచ్చు. ఇట్టి ప్రేమ కేవలం ఇద్దరి మధ్య జనించే పరస్పర వ్యామోహం కాదు. అది వాంఛించేది సర్వజీవులు దైవంతో ఏకం కావాలని.

CWM 3:73 *అనువాదం: కె. ఆర్. యల్. నరసింహారావు*

దివ్యప్రేమ మహా ప్రళయం

ప్రేమ ఒక అత్యున్నత శక్తి. తన నుండే వెలువడిన ఈ శక్తిని విశ్వ చైతన్యం కనుమరుగైన దిగువనున్న చీకటి ప్రపంచంలోకి పంపింది. దీనివల్ల ఈ ప్రపంచాన్ని,

అందరి జీవులను తిరిగి తన వద్దకు తేవచ్చునని భావించింది. పదార్థ ప్రపంచం తన అజ్ఞానాంధకారాలలో దైవాన్ని మరచింది. ప్రేమ చీకటిలో ప్రవేశించింది. అది నిద్రించిన వారినందరిని మేల్కొలిపింది. మూయబడిన వారి చెవులను తెరచింది. గుసగుసలాడింది. "మేల్కోడానికి, జీవించటానికి, యోగ్యమైన దొకటి ఉన్నది. అదే ప్రేమ" అని. వారు ప్రేమకు మేల్కోడంతో, తిరిగి వారు దైవం వద్దకు, ఈ ప్రపంచంలో వచ్చే అవకాశం ఏర్పడింది. సృష్టి అంతా ప్రేమతో పైకెగసింది, దైవం వద్దకు. దీనికి సమాధానంగా దివ్యప్రేమ, దివ్యకృప సృష్టిని కలుసుకోవడానికి దిగువకు వాలాయి. ఈ ఇచ్చి పుచ్చుకోడాలు, ఈ విధమైన ప్రేమానుబంధం, ఐక్యత లేనిదే ప్రేమ తన స్వచ్ఛమైన అందంతో నిలువ జాలదు. తన సహజశక్తిని, మహదానందాన్ని నిలుపుకో లేదు. దివ్యప్రేమ భూమిపై అవతరించి, పదార్థాన్ని జీవంవైపు, ప్రేమవైపు మేల్కొలిపింది.

అప్పటివరకు, ఈ ప్రపంచమంతా ఒక జీవములేని పదార్థంగా ఉండేది జీవానికి దైవమూలం యొక్క అన్వేషణను పదార్థం ప్రారంభించినప్పటి నుండి దారి తప్పిన ప్రతిమారు, తప్పు చేసిన ప్రతిసారి అది చీకటిలో అటుఇటు దిక్కు తోచకుండా తిరిగేది. సృష్టిలో అధికభాగం, తన రహదారిపై తెలియనిదాని కోసం గ్రుడ్డి వారివలె అన్వేషిస్తోంది. అది చేరిన గరిష్ఠ గమ్యం మానవుల కర్థమయే ప్రేమ, దాని అత్యున్నత రూపంలో, అతి స్వచ్ఛమైన ఏమీ బదులు ఆశించని బిడ్డపై తల్లిప్రేమ వంటి ప్రేమ.ఈ మానవ ప్రేమ కదలికలు ఇంకా మరిదేనికోసమో ఇంకా కనుగొనని దానికోసం రహస్యంగా అన్వేషిస్తున్నాయి. అదెలా ఉంటుందో ఎక్కడ వెదకాలో తెలియని దానికోసం అన్వేషిస్తున్నాయి. ఏక్షణంలో మానవ చైతన్యం దివ్య ప్రేమకు మేల్కొంటుందో మానవ రూపాల్లో ప్రకటితమైన దేని తోను సంబంధం లేని స్వచ్ఛమైన దివ్యప్రేమకు మేల్కొంటుందో ఆ క్షణంలోనే అతడు తెలుసుకుంటాడు, దేని కోసం ఇంతకాలం తన హృదయం పరితపి స్తుందో. ఇదే ప్రారంభం ఆత్మ ఆకాంక్షకు. ఇదే తెరుస్తుంది, దారిని చైతన్యం మేల్కొడానికి, దైవంతో సమాగమం కోసం పరితపించడానికి.

CWM 3: 74

ప్రపంచంలో దివ్యప్రేమ వ్యక్తమవడం, ఒక గొప్ప ప్రళయం. అత్యుత్తమ ఆత్మా ర్పణం. పరిశుద్ధ చైతన్యం తాను పదార్థ అచేతనలో ఇముడ్చుకోబడటానికి



అనుమతించడం, తత్ఫలితంగా దాని అచేతనలో చైతన్యం మేల్కొల్పబడు తుంది. దివ్యశక్తి క్రమంగా పెరుగుతుంది. వ్యక్త ప్రపంచం అంతా దివ్యశక్తి, దివ్యప్రేమల ప్రకటన అవుతుంది. ఇదే అత్యుత్తమ ప్రేమ. తన అత్యున్నతస్థితిని, తన అత్యున్నత కలుషరహిత చైతన్యాన్ని, దైవత్వాన్ని, అనంతజ్ఞానాన్ని, పోగొ ట్టుకుందుకు, తద్వారా పరిపూర్ణ అచేతనలో కలిసేందుకు, అజ్ఞానాంధకార ప్రపం చంలో సంచరించేందుకు అనుమతించడం, కాని బహుశా ఎవరూ దీనిని ప్రేమ అని పిలువరు. ఎందుకంటే అది అట్టహాసంగా తానొక త్యాగం చేశానని ప్రకటించు కోదు. తాను చేసిన దానికి బదులు కోరదు. ఈ దివ్య ఉద్యమాన్ని స్వచ్ఛంగా స్వీకరించి స్వచ్ఛంగా ప్రదర్శించే చైతన్యాల కోసం ప్రపంచంలో ప్రేమశక్తి అన్వేషిస్తోంది. ప్రేమ వైపు సత్తాల ఈ పరుగు, నిలువరింప జాలని ఈ ఊపు, ప్రపంచ హృదయం వెనుక, అందరి హృదయాల వెనుక ఉన్నది ఈ దివ్యప్రేమే. ఇదే మానవ ఆకాంక్ష పరితాపము వెనుక ఉన్నది. ఇదే లక్షలాది మానవ పని ముట్లను తానెప్పుడూ ఓడుతున్నా, స్థిరంగా స్పృశించుచున్నది. ఈ స్థిర స్పర్శే హఠాత్తుగా ఒక రోజున ఆ పనిముట్లను సమాయత్త పరుస్తుంది. వాటిలో ఆత్మ సమర్పణా సామర్థ్యం, ప్రేమించే సామర్థ్యాలను మేల్కొలుపుతుంది.

CWM 3: 71-72

దివ్యప్రేమ సోపానాలు

1. మొదట్లో వ్యక్తి తాను ప్రేమింపబడినప్పుడు మాత్రమే ప్రేమిస్తాడు.

2. తరువాత వ్యక్తి యథేచ్ఛగా ప్రేమిస్తాడు, అయినప్పటికీ తన ప్రేమ అనుమతింపబడాలని కోరతాడు.

3. తను ప్రేమింపబడనప్పటికీ ప్రేమిస్తాడు, కాని ఇంకా తన ప్రేమ అను మతింపబడాలని కోరుతాడు.

4. చివరిగా ప్రేమించడమనే ఆనందం తప్ప, ఏ ఇతర ఆనందం అవసరం లేకుండా, నిష్కల్మషంగా, నిరాడంబరంగాప్రేమిస్తాడు.

ఇంకొక ప్రేమ ఉన్నది. దీనిలో దైవంపై క్రమంగా పెరిగే ప్రేమోద్వేగం, స్వీకృతి, ఐక్యత, ఉంటాయి. దైవంనుండి తాను గ్రహించినది ఇతరులకు వెద జల్లటం ఉంటుంది, కాని ప్రతిఫలమేది నిజంగా ఆశించదు. ఇలా నీవు చేయగలిగితే

అదే అత్యంత సంతృప్తికరమైన మార్గం, ప్రేమించడానికి.

CWM 14: 122 — శ్రీమాత

దైవప్రేమ కొరకు భౌతికంలో ఆకాంక్ష

ఇక్కడ ఉన్నది ఒక పుష్పం, దానిపేరు 'దైవ ప్రేమ కొరకు భౌతికంలో ఆకాంక్ష.' 'భౌతికం' అనటంలో నా అర్థం భౌతిక చైతన్యం అని, అంటే బాహ్యంలోకి పోతూ ఉండే చైతన్యం, ఎక్కువమంది మానవుల సాధారణ చైతన్యం. అది సుఖంకొరకు, మంచి ఆహారం కొరకు, మంచి దుస్తుల కొరకు సుఖప్రద మానవ సంబంధాలు మొదలగు వాటి వైపు మొగ్గుచూపే చైతన్యం, ఉన్నత విషయాల బదులు సాధారణ భౌతిక విషయాల వైపు పోయే చైతన్యం, దైవప్రేమ కొరకు భౌతికంలో ఆకాంక్ష, దైవం తననెలా ప్రేమిస్తాడోనన్న అనుభూతిని తప్ప, ఇంక దేనిని భౌతికం కోరకపోవుట. భౌతికం తెలుసుకుంది, అన్ని బాహ్య విషయాలిచ్చే సంతృప్తి పూర్తిగా అసంపూర్ణమని, వీటి మధ్య రాజీ ఎన్నటికీ కుదరదని — భౌతికానికి దైవప్రేమ కావాలంటే, దానిని మాత్రమే అది కోరాలని, మరియు ఇలా అనకూడదని "నేను దైవ ప్రేమనుతప్పక పొందుతాను కాని అదే సమయంలో, ఇతర అనుబంధాలు, సంతోషాలు అవసరాలు అలాగే ఉంచుకుంటాను."

మన దేహంలో ఏ భాగంనుండి ఈ ఆకాంక్ష వ్యక్తమవుతుందో అదే ప్రాణిక కేంద్రం. భౌతికంలో ఆకాంక్ష అని నేను చెప్పినప్పుడు అది స్వచ్ఛందంగా భౌతిక సుఖాల వెనుక పరుగెత్తే చైతన్యమే, కాని అది ఇతర ఉన్నత భాగాల బలవంతం లేకుండా, తనకు తానుగా ప్రత్యేకంగా దైవప్రేమను మాత్రమే కోరాలి. దీనికి సాధారణంగా దివ్య వెలుగును చూపాలి. ఇతర ఉన్నత భాగాల ద్వారా, ఇది తప్పక జరగాలి తరచుగా, తప్పకుండా. లేకపోతే భౌతికం ఎన్నడూ దీనిని నేర్చుకోజాలదు. తనకు తానుగా నేర్చుకొనేందుకు ప్రకృతియొక్క జన్మ పరంపరా వలయంలో అనేక జన్మలు పడ్తుంది. నిజంగా ప్రకృతి వలయ ఉద్దేశ్యం నీకన్ని రకాల సంతృప్తులను చూపి, వాటిని పూర్తి చేయుట ద్వారా నిజమైన సంతృప్తిని ఇవేవి నీకు కల్పించజాలవని నీకు నచ్చచెప్పడమే. అది అన్వేషిస్తున్న దాని మూలం దివ్య సంతృప్తే.

ప్రకృతి యొక్క ఈ నెమ్మది ప్రక్రియ యోగంలో వేగవంతం చేయ

బడుతుంది. భౌతిక చైతన్యం బలవంతం చేయబడుతుంది, సత్యాన్ని తెలుసు కొనుటకు గుర్తు పట్టుటకు కాని దానికి సత్యాన్ని చూపటం ఎలా? అది చీకటి గది లోకి దీపాన్ని తెచ్చినట్లే. నీ ఉన్నత భాగాల అంతర జ్ఞానం, ఆకాంక్షల వెలుగును మళ్ళీ దానిని ప్రకాశవంతం చేయడం ఇలా మళ్ళీ మళ్ళీ చేయటం సాధారణ వస్తువులపై ఆకలి లేదా వాంఛ ఎంత నిరర్థకమైనదో దానికి తెలిసే దాకా; దాని దృష్టి సత్యం వైపు యధేచ్ఛగా మళ్ళేవరకూ అలా జరిగితే నీ జీవితం అంతా మారుతుంది. ఈ అనుభవం తప్పు పట్టలేనిది, స్పష్టమైనది.

CWM 3: 130-131 అనువాదం: ఎస్.వై. సోమయాజులు

ప్రేమకు ప్రతిగా ప్రేమను పంచి ఇవ్వాలి

ప్రపంచం మారడానికి ద్వేషానికి బదులు ప్రేమను తిరిగి ఇవ్వాలి అనుకున్న ప్పుడు ప్రేమకు ప్రతిగా ప్రేమను పంచి ఇవ్వడం ఇంకా అత్యంత సహజం కాదా?

ప్రజలు వారు ఉన్నట్లుగా వారి జీవితాలను, పనులను, మనసులను తరచి చూస్తే, ఏ భగవత్కృప యొక్క అమితమైన ప్రేమ ఈ ప్రపంచం మీద అను క్షణం పనిచేసి దాన్ని ఆ దివ్యానందం దిశగా నడిపిస్తోందో ఆ ప్రేమకు బదులు మానవ హృదయంలో దాని యెడల కలిగే అల్పమైన ప్రతిస్పందన, ద్వేషము, అలక్ష్యము అంతేకాక ఉపేక్ష చూసి ఆశ్చర్యపడక మానరు.

కాని ప్రజలు దుష్టమైన, న్యూనమైన, జరుగకూడని, ఫలప్రదంకాని పరాజ యాల యెడల మాత్రమే జాలి చూపుతారు; అది నిజంగా చెడ్డతనాన్ని, పరా జయాన్ని ప్రోత్సహించడమే అవుతుంది.

ఈ సమస్య దిశగా కొంచెం ఎక్కువగా ఎవరయినా ఆలోచిస్తే బహుశా ద్వేషానికి బదులు ప్రేమని తిరిగి ఇవ్వాలనే అవసరాన్ని నొక్కి వక్కాణించే అవ సరం అంతగా ఉండదు. కారణం, మానవ హృదయం పూర్తి త్రికరణశుద్ధితో తనపై కురిపించబడే ప్రేమని అర్థం చేసుకొని, అభినందించి, సహజంగా పెల్లుబికే కృతజ్ఞతా భావంతో జవాబుదారి అయినప్పుడు ప్రాపంచిక విషయాలన్నీ అతి త్వరగా మార్పు చెందుతాయి.

CWM 3: 186- 87

కొంతమంది మనుషులు ఏదో ఒకరోజున ఒకానొక భావము కలవారై నిదురలేచి "ఓహ్! ఆ దివ్యప్రేమయొక్క చేతన కలిగి ఉండాలని నేనెంతగా కోరుకుంటున్నాను, దివ్యప్రేమని విశదపరచుకోవాలని నేనెంతగా అభిలషిస్తున్నాను..." అని అనుకుంటే చాలని నమ్ముతారు. గుర్తు పెట్టుకోండి, తనలో కలిగిన ఒక చిన్న మానవ నైజము యొక్క కదలిక మాత్రాన కోటానకోట్లసార్లు తాను దివ్యప్రేమను కలిగి ఉన్నానని గొప్పపనులు చెయ్యగలనని విశ్వసించి అంటారు కదా! "నేను ప్రయత్నించి దివ్యప్రేమను పొందుతాను, అప్పుడు మనం ఫలితం తప్పక చూస్తాము" అని. ఇది చాలా దుస్సాధ్యమైన మార్గము. కారణం అనుభవ ప్రాప్తి అనబడే దశ స్పృశించడానికి ముందే, ప్రారంభంలోనే, దాని ఫలితాన్ని నువ్వు నాశనం చేశావు. నువ్వు నీ అన్వేషణను నిష్కళంకమైన అభిలాషతోను, సమర్పణా భావంతోను మొదలు పెట్టాలి. ఇవి రెండూ పొందడం కష్టమే. ఈ ప్రేమను పొందడానికి, అభిలషించడానికి సన్నద్ధమయ్యే ముందుగానే నీ గూర్చి నువ్వు చాలా శ్రమించి తరచి చూసుకోవాలి. నువ్వు నిజాయితీగా, నిష్కపటంగా నిన్ను నీవు చూసుకున్నప్పుడు దివ్యప్రేమ గూర్చి ఆలోచించడం మొదలిడిన వెంటనే నీ అంతరంగంలో చిన్న సంక్షోభం ప్రారంభమౌతుంది. నీలోని ఆకాంక్ష అంతటికీ కొన్ని కదలికలు కావాలి. భౌతిక సారాన్ని, ప్రాణమయ కదలికలను, ప్రేమయెడలగల నీ దృష్టినుండి విడదీయడం, యోగమార్గంపై ప్రగతి పథంలో చాలా దూరం పయనిస్తే తప్ప అసంభవమనే చెప్పవచ్చు. నేను చెప్పేది మానవుల శ్రద్ధాపూర్వక అనుభవం మీద ఆధార పడ్డది. సరే, నీకోసం, నువ్వు ఉన్న స్థితిలో, నువ్వు ఉన్న విధంగా, నువ్వు పవిత్ర దివ్యప్రేమతో సంబంధం కలిగి ఉంటే, అది నీకు మంచుకన్నా చల్లగా లేక సుదూరంగా, ఎంత ఎత్తులో అంటే నువ్వు ఊపిరికూడా పీల్చుకో వీలు లేనంతగా, అనిపిస్తుంది. అది ఒక ఎత్తయిన పర్వత శిఖరంలా, దానిపై నువ్వు గడ్డ కట్టుకుపోయి, శ్వాస తీసుకోవడానికి కూడా కష్టపడేటంతగా, సాధారణంగా నువ్వు అనుకునే దానికన్నా అత్యంతదూరంగా ఉన్నట్టు అనిపిస్తుంది. దివ్యప్రేమ మానసిక లేక ప్రాణిక కదలికతో ముడివడినప్పుడు మన దృష్టికి, అగుపడడం కష్టం. దివ్యకృపయొక్క సుదూర, ఉన్నత, పవిత్ర, నిస్వార్థ అనుభూతిని ఎవరయినా పొందవచ్చు. అవును, దివ్యకృప

యొక్క అనుభూతి మాత్రమే, కాని కష్టించి మాత్రమే వారు దివ్యప్రేమను అనుభవింప గలరు.

CWM 4: 244- 45

దివ్యప్రేమకోసమే గల ఆర్తిని ఏ మానవ సంబంధమూ తీర్చలేదు. భగవంతుని ప్రేమ మాత్రమే ఆ దాహాన్ని తృప్తి పరుస్తుంది.

*

ప్రేమయొక్క హక్కుల్ని గురించి ఎప్పుడూ మాట్లాడుతారు, కాని ప్రేమయొక్క ఒకే ఒక్క హక్కు తనకి తానుగా ఆత్మార్పణ గావించుకోవటం.

*

ఆత్మార్పణ లేనిదే ప్రేమన్నది లేదు. కాని మానవ ప్రేమలో అంతా స్వార్థమూ, కోరడము మాత్రమే, తనను తాను సమర్పించుకోవడమన్నది అత్యంత అరుదు.

CWM 14: 121 శ్రీమాత

మానవత, నిజమైన ప్రేమ

"నువ్వు నన్ను ప్రేమిస్తే, నేను నిన్ను ప్రేమిస్తాను, నువ్వు నన్ను ప్రేమించకపోతే, నేను నిన్ను ప్రేమించను." మానవ ప్రేమాభివ్యక్తి ఎక్కువగా ఇలాగే వుంటుంది. అది ఇంకా చాలా దూరం తీసుకువెళ్ళి భగవంతుని ప్రేమకు కూడా దానిని జత చేస్తారు. వారు భగవంతునితో అంటారు. "నేను అడిగింది నువ్వు చెస్తే, నువ్వు నన్ను ప్రేమిస్తున్నావని, నేను నిన్ను ప్రేమిస్తానని అంటాను. కాని, నేనడిగింది నువ్వు చెయ్యకపోతే, నువ్వు నన్ను ప్రేమిస్తున్నావని నేను అనుకోనే అనుకోను, సరికదా, నేను నిశ్చయంగా నిన్ను ప్రేమించను కూడా", అది అలా ఉంటుంది. దాని అర్థం అది వాణిజ్యపరమైనది అవుతుంది.

ఒకరు ప్రేమించబడుతున్నారా, లేదా అన్నది అనుకోకుండా ఉండడం ఇంకా మంచిది. దాని యెడల పూర్తిగా అలక్ష్యం చూపాలి. అదే నిజమైన ప్రేమకి ప్రారంభం అవుతుంది. ప్రేమ కోసమే ప్రేమించాలి, కాని తన ప్రేమకి బదులు లభిస్తుందనో లేక ఇతరులు ప్రేమిస్తున్నారనో కాదు.ఆ షరతులన్నీ ప్రేమ అనిపించుకోవు. ఎవరైనా ఎందుకు ప్రేమస్తారంటే ప్రేమించడం తప్ప ఇంకేదీ వారు చెయ్యలేరు గనుక. ప్రేమకి కారణం ప్రేమ మాత్రమే కావాలి. ఏమి

జరగబోతుందన్నది లెఖ్ఖ చెయ్యక, తన ప్రేమానుభూతిలోనే పూర్తి సంతృప్తిని పొందాలి. ప్రేమ ప్రేమ కోసమే.

మిగతాదంతా బేరం మాత్రమే. అది ప్రేమ కాదు. అంతేకాక ఒక విషయం మాత్రం నిశ్చయం. నిజమైన ప్రేమానుభూతిని అనుభవించిన క్షణాన ఎవరూ ఎంతమాత్రం ఎటువంటి ప్రశ్న అడగరు. ఇలా ప్రశ్నించడం తెలివిమాలిన తనము, పరిహాస ప్రదము మరియు నిరర్థకము అవుతుంది. వాస్తవిక ప్రేమానుభవం పొందిన క్షణం వ్యక్తికి సంపూర్ణ ఆనందము మరియు అనుభవ ప్రాప్తి కలిగి ఎటువంటి బదులు లభించాలనే అవసరం ఉండదు. దివ్యప్రేమ, అదంతే. ప్రేమ యొక్క సంపూర్ణమైన తృప్తి అప్పుడే కలుగుతుంది. అప్పుడు బదులు లభించ వలసిన అవసరమే ఉండదు.

నేనంటాను, మనస్సులో ఈ లెఖ్ఖలు వేసుకున్నన్నాళ్ళు, భావములు, స్మరణ ఉన్నన్నాళ్ళు దానిని ఎంతోకొంత అంగీకరించినంతవరకు అది బేర మాడటం అవుతుంది తప్ప ప్రేమ అనిపించుకోదు.

ప్రజలు పిలిచే ఈ "ప్రేమ" అనే దానినుండి "సత్యపరప్రేమ" చేరుకోవ డానికి చాలా... చాలా... దూరం పయనించవలసి ఉంది.... బహుదూరం.

CWM5: 237-38 — *భావానువాదం: డా. విజయలక్ష్మి*

మానసికమైన ప్రేమయొక్క నిస్వార్థ, నిరపేక్ష ప్రేరణ

నిస్వార్థము, నిరపేక్షము అగు మానసిక ప్రేరణ ప్రపంచమందు వ్యక్తమయ్యే చైత్యపురుష చేతన యొక్క మనోజ్ఞమైన రూపాలలో ఒకటి. మానసిక కార్యాచ రణ క్రమంలో ఉన్నత శ్రేణులకు ఎదిగిన కొద్దీ ఆ ప్రేమమయ ప్రేరణ కరువవు తుంది.

ఎందుకనగా తెలివితేటలతో బాటు నైపుణ్యం, చాతుర్యం, అవినీతి, ప్రయో జనం పొందాలనే ఆకాంక్ష కూడా ఉత్పన్న మౌతాయి. ఉదాహరణకు, ఓ రోజా పుష్పం వికసించిందంటే, అది ఎంత సహజంగా, అన్యప్రేరణ లేకుండా కేవలం సుందరంగా కనిపించుటలోను, మధుర పరిమళాలను వెదజల్లుటలోను, జీవిం చుటలోనున్న సంతోషాన్ని వెలిబుచ్చుటలోను గల ఆనందాలను అందించాలనే గాని ఏదో ప్రయోజనం పొందాలని కాదు, లాభపడాలని కాదు; ఉనికి కలిగి

ఉండడంలోను, జీవితం గడుపుటలోను వుండే ఆనందానుభూతిని అయాచితంగా పొందాలని. అలాంటి పుష్పానికి బదులు ఒక మానవ జీవిని తీసుకుంటే, అతి కొద్ది సందర్భాలు మినహా, అతని మనస్సు క్రియాశీలమైన క్షణంనుండి తన సౌంద ర్యం తోను, చురుకుదనం తోను ఏదో ప్రయోజనం పొందాలని ప్రయత్నిస్తాడు, ఆ లక్షణాలు తనకేదో సమకూర్చాలని ఆశిస్తాడు. అది ఇతరులనుండి ప్రశంసలు గావచ్చు లేక తుచ్ఛమైన లాభాలు కావచ్చు. పర్యవసానంగా, మానసిక దృక్కో ణంలో రోజా పుష్పం మానవజీవి కన్నా శ్రేష్టమైనదనిపిస్తుంది.

కొంత ఉన్నత స్థాయి కెదిగి, రోజా పుష్పం ఏ పనినైతే ఎరుక లేకుండా చేసిందో, అచేతనంగా చేసిందో అదే పనిని నీవు చేతనా పూర్వకంగా చేసినట్ల యితే, అప్పుడది మరింత మనోరంజకంగా ఉంటుంది. కాని ఆ పని ఆవిధంగానే చేయబడాలి, అనగా అన్యప్రేరణ, లేకుండా వికసించే పుష్పంలా, ప్రయోజన మాశించకుండా, ఉనికిలోని ఆనందానుభూతిని కోరకుండా. చిన్నపిల్లలు కొన్ని సార్లు ఈ విధంగా చేస్తుంటారు. (కొన్నిసార్లు, ఎప్పుడూకాదు) దురదృష్టం కొద్దీ, చిన్నతనంలోనే తల్లితండ్రులు మరియు పరిసరాల ప్రభావంతో ఫలితాన్ని దృష్టిలో నుంచుకొని పని చేయడం నేర్చుకుంటారు.

కానీ ఈ విధమైన కోరిక — తనవద్ద నున్న దానితోనా లేక తాను చేసే పని తోనో ప్రయేజనం పొందాలనే కోరిక — నిజానికి ప్రపంచంలో కల్లా అత్యంత నికృష్టమైన, హేయమైన లక్షణం. అయితే ఈ తరహా వైఖరి బహుళ వ్యాప్తమైనది ఎంతగానంటే అది మనిషిలో దాదాపు స్వతస్సిద్ధంగా, అతి సహజంగా ఏర్పడు తుంది. దివ్యప్రేమను బడయుటానికి విముఖత కనబరచడంలో దానిని మించినది లేదు — ప్రయోజనం పొందాలి, లాభపడాలి అనే కోరికను మించినది.

CWM5:240- 41 *అనువాదం: అందుగులపాటి కైలాసపతి*

ప్రేమయొక్క ధర్మము

ప్రశ్న: వాస్తవంగా ప్రేమించాలంటే, వ్యక్తి యొక్క స్వభావము తప్పక పరిణ మము చెందవలెనా?

సమా: నీ ప్రేమ యొక్క స్థాయి, స్వచ్ఛతలు నీ చేతన పొందు పరిణామము పైననే ఆధారపడి యుండును. అవగాహన ఉండాలి. ఇది చిన్న పిల్లలకు సైతం


అర్థమయ్యేటంత సామాన్య విషయం. నీకు ఉన్నది జంతు చైతన్యమువంటిదే అయితే, నీవు కూడా జంతువు వలె ప్రేమిస్తావు. ఒక సామాన్యుని చైతన్యము వంటిదే నీలో ఉంటే, ప్రేమయొక్క స్థాయికూడా సామాన్యంగానే ఉంటుంది. ఒక ఉన్నత స్థాయికి చెందిన చేతన ఉంటే, నీవు ఉన్నత ప్రమాణమునకు చెందిన ప్రేమను చూపించగలవు. ఇక దివ్య చేతనగల చేతనను పొంది ఉంటే నీ ప్రేమించ గలిగే స్థాయి, అదే శ్రేణికి చెందుతుంది అందుకని ప్రగతికొరకై తీవ్ర ఆకాంక్షతో గట్టి ప్రయత్నము చేసినచో అంతరంగ పరిణామముతో పాటు ఉత్తమ స్థాయి చైతన్యమును సాధించగలవు. తరువాత నీ చేతన పెరుగుతూ విస్తరించును. అదే మాదిరి నీకు కలిగే ప్రేమానుభవము కూడా గొప్పదగును. విషయం స్పష్టమైనదికదా!

స్ఫటిక రాళ్ళమధ్య నుండి ప్రవహించే జలమును ఒక పెద్ద కలశంలో పట్టు. ఎక్కువో, తక్కువో బురద అందులో చేరిందనుకో, అప్పుడు స్ఫటిక రాళ్ళ మధ్యన నుండి వచ్చిన నీరు ఇదీ ఒకటే అవవు. వాస్తవానికి రెండూ ఒకటే. అయితే అదే కలశంలో నున్న నీటిలో ఏదేదో కలిపి వేసావు. ప్రేమ కూడా మూలములో అదే రీతిలో స్వచ్ఛమైనదే, స్ఫటిక జలము వంటిదే! మానవుని చేతనయందు మాత్రము కొంత మేరకు బురద కలపడమైంది. ఆ మేరకు ఆ జలము బురదమయమైంది.

CWM 6:102- 03

ప్రేమను తెలుసుకోవాలంటే తొలుత దైవాన్ని ప్రేమించాలి

మరొకర్ని అందుకు ప్రేమించాలా? అది అసాధ్యమని అప్పుడే అన్నాను. ప్రేమంటే ఏమో అర్థము చేసుకోవాలంటే, దైవాన్ని తప్పక ప్రేమించవలసినదే నని, ఆ విధంగా ఒక అవకాశం లభిస్తుందని. ఒకర్ని ప్రేమిస్తున్నాననే భావన ప్రేమలో పడ్డట్టే అనే తలంపు పొటమరిస్తుంది. క్రమేణా దైవాన్ని ప్రేమించటం ద్వారా, ఒక ప్రయత్నం ద్వారా ఆ నాటి కానాటికి, దైవము మాదిరి తను కూడా ఎదుగుతాడు. తదుపరి దివ్యప్రేమతో సరిపోల్చుకోగా, అది ఏమిటో అనే అవగాహన కుదురుతుంది, లేకపోతే మాత్రము ఏమీచేయలేడు, ఇక్కడ ఇరువురు వ్యక్తులమధ్య నలుగుతున్న ప్రేమ ఎటువంటిదైనా కావచ్చు. అది అజ్ఞానము, అవగాహన కుదరకపోవుట, బలహీనతల వలన, ఎవరికివారేలే, అను ఒక భయంకర


Sri Aurobindo

వేర్పాటు వాదనల వలన కలిగిన భావన. అది ఎలా ఉంటుందంటే, వ్యక్తికి ఒక వైభవోపేత సన్నిధిని చేరుకోవాలనే కోరిక కలగటంతో మొట్టమొదట చేసిన పని ఏమైందంటే, ఒకటో, రెండో లేక మూడు తెరలను వ్యక్తి మరియు వైభవముల నడుమ దించటంలా ఉంటుంది. దానితో ఒక అస్పష్టమైన చిత్రం ఏర్పడటం మాత్రమే జరుగుతుంది. అసలు చూడవలసినదేదో కనిపించలేదు. మొదలు చెయ్యవలసిందంతా ఆ తెరలనన్నింటినీ తొలగించాలి. తను ముందుకు వెళ్ళి ఆ వైభవమూర్తి సన్నిధిలో తన్ను తాను నిలుపుకోవాలి. ఆ వైభవం ఏమిటో అప్పుడు తెలుస్తుంది. అంతేగాని నీకు ఆ వస్తువుకు మధ్య తెరమీద తెరను తొడుగుటవలన, అదేమిటో నీవు చూడలేవు. "ఓహ్, అక్కడ ఏదో ఉన్నట్లు అని అనిపిస్తోంది" అని ఒక అస్పష్టమైన భావన కలుగుతుంది తప్ప సామాన్యంగా గొప్ప దనాన్ని గాని, ఘనతను గాని, గుర్తించినవారు తక్కువమందే ఉంటారు. వారు ఎటుపడితే అటు ఒక ప్రేరణకు స్పందిస్తూ చెదిరిపోతారు. వారు ఏదో కొంతగా మాత్రము సంస్కరింపబడిన జంతువుల వంటివారు.వాళ్ళ గురించి ఇక్కడ ప్రస్తావించనక్కరలేదు. అది అంత ప్రధాన విషయం కాదు. వాళ్లకి ఇష్టమైన విషయాలను వారినే చేసుకోమని వదిలివేద్దాము. మనల్ని వారు ప్రభావితం చెయ్యరు. ఈ విషయాన్ని నేను వారి గురించి వ్రాయలేదు.

CWM 5:101- 02

దైవప్రేమ తరువాత అంతటి పారవశ్యతను కలుగ జేసేది మానవులలోనున్న దైవప్రేమ; అక్కడ కూడా వ్యక్తికి బహుళత్వము వలన ఆనందము కలుగును.

శ్రీమాత

ప్రేమించుట ఆనందంగా ఉండటానికే!

అందువలన, ప్రేమ ఏ రూపంలో కలిగినా, దాన్ని దాని యొక్క బాహ్యరూపము ద్వారా ప్రయత్నపూర్వకంగానే లోనికి చొచ్చుకొని పోవాలి. అలా తన అస్థిత్వా నికి కారణభూతమైన దివ్యసూత్రమును దర్శించాలి. స్వాభావికంగానే అది వ్యూహాలతోను కష్టాలతోను చుట్టుకొని ఉంటుంది. అయినా, అది ప్రభావ పూర్వక మైనది, అంచేత అసలు ప్రేమించటాన్నే మానివేయమనుటకు బదులుగా, ఎందు

కనగా ప్రేమించటమనే క్రియను అపమార్గంలో నిర్వహిస్తారు కనుక ఋజు మార్గంలో ప్రేమిస్తావని కోరుకో.

అందుచేత, మాటకీ, మానవులమధ్య నడిచే ప్రేమస్వరూపాన్ని కనుక గమనించి చూస్తే, అంటే తల్లితండ్రులు పిల్లల పట్ల చూపే ప్రేమ, పిల్లలు తల్లి తండ్రులపట్ల చూపే ప్రేమ, అప్పచెల్లెళ్ళు అన్నతమ్ముల మధ్య ప్రేమ, ప్రేమికులు మిత్రులుమధ్య ప్రేమను విచారించి చూస్తే, అజ్ఞానము, స్వార్థము, మానవుని సహజ లోపముల వలన ప్రేమ మరక పడినట్లు కనుపించును. కనుక అసలు ప్రేమించటమే తప్పని, ఆ క్రియ జోలికి పోకుండా ఉండటం, శ్రీఅరవిందులు చెప్పినట్లు అది కేవలం కష్టము మాత్రమే గాక హృదయాన్ని మార్చివేసి ఎందుకూ పనికిరానిదిగా చేస్తుంది. అంత ఆమోద యోగ్యం కాదు. అంతకన్నా మెరుగుగా ఎలా ప్రేమించాలో నేర్చుకోవడం మంచిది: అంటే భక్తితో ప్రేమించుట, ఆత్మ సమర్పణ చేయుట, ఆత్మత్యాగము వంటివి చేస్తూ, ప్రేమ పోరాటం చేయవచ్చు, అంటే ప్రేమను ఎదిరించే ఘర్షణ కాదు. వికృతము చేయబడిన ప్రేమ రూపాలను ఖండించటం ఎంతో కాలంగా ప్రేమ మార్గములను గుత్తాధిపత్యముగా అనుసరించటము, బంధములను అడ్డుపెట్టుకొనుట, వశ పరచుకొనుట, ఈర్ష్యను రగుల్కొల్పి వెంటబడుట వంటి పద్ధతులను తప్పించాలి. వశపరచుకోవాలని కోరుట, అధికారం చెలాయించుట, ఇష్టాయిష్టాలను రుద్దుట, చాపల్యమును, కామనలను చూపుట, ఎదుటివారి నుండి ఏదో రాబట్టాలనుకొనుట, స్వీకరించుటను, ప్రేరేపించుటను, బదులివ్వకపోవుట, ఎదుటివారిస్పందనలను పట్టించుకోకపోవుట, తనకు కలిగిన ప్రేమాభిమానములతో తృప్తిచెందుట, తన కార్యములపట్ల మాత్రము మక్కువచూపుట, తన కోర్కెలు ముందు తీరాలనుకొనుట కూడదు. తను పంచుకున్న ప్రేమాభిమానములను పంచియిచ్చుట, ప్రతిస్పందనలను ఆశించకపోవుట, ఏమైనా, ప్రేమించుటలో ఆనందమును గ్రహించాలి;

ఆ విధంగా మీరు ఎరుకతో ఆచరించగలిగితే, మీరు ఒక పెద్ద ముందడుగు వేసినట్లే. ఈ విదమైన వైఖరితో ముందడుగు వేస్తే, అభివృద్ధి సాధించినట్లే. ఒక నాటికి మీ అవగాహన పెరిగి, ప్రేమ అన్నది వ్యక్తిగతమైనది కాదని, విశ్వజనీనమైన భావన అని, అది మీ ద్వారా ఆవిష్కరింపబడుతుందని, అతి సున్నితమైనదని,

చివరకు ఒక మాటలో చెబితే, అది ఒక దివ్యమైన పవిత్రాంశమని అర్థమవుతుంది.
CWM 8:301- 02

స్వార్థమును విడుచుటయే ప్రథమ కర్తవ్యము

స్వార్థమును విడిచిపెట్టుటయే ప్రథమ కర్తవ్యము. ప్రతి వారికి ఇది వర్తించును. యోగసాధన చేయువారికే ఇది నియమము, అని అనుకోరాదు. నిత్యజీవితములో కూడా ఈ షరతు అనివార్యము: ప్రేమించుట ఎట్లు అను విషయము తెలుసుకోవాలంటే, ముందుగా తన్ను తాను స్వార్థ బుద్ధితో ప్రేమించు కొనరాదు. ప్రతిఫలముగా, ప్రేమించబడు వారినుండి, అపేక్షించరాదు. తన్ను తాను అర్పించుకోవాలి. నిన్ను నీవు అధిగమించాలనుకుంటే ఈ క్రమశిక్షణను అలవరచుకోవాలి. అటుపైన ఒడుదుడుకులతో కలసి ఉన్నా జీవితము సాగిపోతుంది. ఇది ఒక ప్రాథమిక సూత్రము.

ఇక యోగజీవితం కావాలనుకుంటే మరికొన్ని విషయాలను దానికి జోడించాలి; నేను మొదట చెప్పినట్లుగా; పరిమితమైన ఈ మానవ ప్రేమ గుండా దూసుకుపోయి దాని వెనుక వున్న దివ్యప్రేమయొక్క సూత్రమును దర్శించాలి. అలా గనక జీవన సరళి సాగితే ఫలితము తప్పక కనిపించును. ఇది హృదయాన్ని నిర్జీవము చేసేకంటే అన్ని విధాలా మేలైన ఆలోచన. ఇది కొంత కష్టసాధ్యమే అయినా అన్ని విధాలా ఉత్తమమైనది. అహంకారము, స్వార్థములతో ఇతరులను బాధించేకన్నా, వాళ్ళమట్టుకు వారిని ప్రశాంతతతో విడిచి పెట్టుట మంచిది. మరొకరి మీద మన తత్త్వాన్ని రుద్దుట కన్న, మీకుగా మీరు పరిణామము చెందుటకు ప్రయత్నించాలి. ఇటువంటి ప్రయత్నం సామాన్య జీవితం గడిపే వారికి కూడా ఒక ఉన్నత సమరస జీవితమునకు చక్కని బాట.

CWM 8: 301- 02

ఎటువంటి ప్రతిఫలాపేక్ష లేని ఆత్మ సమర్పణ, పరిపూర్ణ విధేయత, సమర్పణలే దైవముపట్ల చూపే నిజమైన ప్రేమ. ఎటువంటి హక్కును గాని ఒక షరతును విధించుట గాని, బేరసారములను గాని, అహింసను గాని, అసూయనుగాని, అహంకారమునుగాని, కోపమునుగాని అది సమర్థించదు. ఈ విశ్లేషణము

లేవియును ప్రేమయొక్క కూర్పునందు చేర్చబడలేదు.

శ్రీమాత

అనువాదం: డా. దామెర వెంకటేశ్వరరావు

నిస్వార్థతే తొలిమెట్టు

మొదటి మెట్టు స్వార్థ రహితంగా ఉండటం. కేవలం యోగ మార్గంలో ఉన్నవారికే కాక సాధరణ జీవితం గడిపే అందరికీ అది సమానంగా వర్తిస్తుంది. ఎలా ప్రేమించాలో తెలుసుకోవాలంటే ముందుగా స్వార్థంతో తమను తాము ప్రేమించటం మానుకోవాలి. ప్రతిఫలంగా ఏమీ ఆశించకుండా ప్రేమ అనే తత్వానికి తమను తాము సమర్పించుకోవాలి. వ్యక్తి తనను తాను అధిగమించటానికి, కేవలం నీతి బాహ్యం కాని జీవితం గడపటానికి ఈ సాధన ప్రాథమికం.

యోగానికి సంబంధించి దీనికి మరికొంత జత చేయవలసి ఉంటుంది. నేను ప్రారంభంలో చెప్పినట్లుగా పరిమితమైన, మానవీయమైన ప్రేమను ఛేదించగల సంకల్పాన్ని కలిగి దాని వెనుక ఉన్న దైవప్రేమ సూత్రాన్ని కనుగొనాలి. అప్పుడు కచ్చితంగా ఫలితాన్ని పొందవచ్చు. ఇది హృదయాన్ని రాగ రహితంగా చేసుకోవటం కన్నా మెరుగైన పద్ధతి. కొంత కష్టతరమైనా యిదే అన్ని విధాలా ఉత్తమమైన మార్గం. అహంకారంతో ఎదుటివారిని బాధించే బదులు, వారిని ప్రశాంతంగా వారి కార్యాచరణకు వదిలి, తమ సంకల్పాన్ని అభిప్రాయాలను ఎదుటివారిపై రుద్దకుండా, తమను తాము పరివర్తన చెందించుకోవటానికి ప్రయత్నించాలి. ఇది సాధారణ జీవితంలో కూడా ఉన్నవారికి మరింత సామరస్యంగా జీవించటానికి ఒక సోపానమవుతుంది.

CWM 8:302

భగవంతుని పట్ల నిజమైన ప్రేమ, ఏ షరతులూ, కోరికలూ పరిపూర్ణమయిన నివేదన, సమర్పణతో కూడిన ఆత్మార్పణ. అది ఏమీ కోరదు, ఏ నిబంధనలూ విధించదు. ఏ విధమైన బేరసారాలు చెయ్యదు, హింస, అసూయ, గర్వం, క్రోధాలను రానివ్వదు. ఎందుకంటే దాని సంకలనంలో యివి లేవు.

CWM 8:302

ఈ భావనలు... వీటిని ఏమనాలి? వాటికొకవిధమైన ప్రకంపన ఉంటుంది. వాటి అంతర్భాగపు కేంద్రంలోను పై పొరలలోను అత్యావశ్యకమయిన దేదో ఉంటుంది. వాటిలో అత్యంత ప్రధానమైన ప్రకంపన ఒకటే ఉంటుంది. అది తనను తాను వ్యక్తపరచుకోవటానికి పరివ్యాపించినప్పుడు అపార్థం చేసుకోబడుతుంది. బాహ్యంగా చాలా సందర్భాలలో ఈ ప్రకంపన అంతరంగికమైన స్పందనకు పూర్తి భిన్నంగా ఉండటం ప్రేమ విషయంలో విదితమే. ఎందుకంటే అది తన లోకి తాను వెనుకకు మరలి, ముడుచుకొనిపోయి సొంతం చేసుకోవాలనే అహం కారిక చలనంతో తనవైపు లాక్కోవాలని చూస్తుంది. మీరు ప్రేమించబడాలను కుంటారు, 'నేనా వ్యక్తిని ప్రేమించాను' అంటారు. కానీ అదే సమయంలో మీరు కోరుకొనేది మరొకటి ఉంటుంది. "నేను ప్రేమించబడాలి" అనే భావనగా అది రూపొందుతుంది. అందువలన ఈ వక్రీకరణ, ద్వేషం వక్రీకరించబడినంత చేటుగా, ఏ విధంగానంటే మీరు ప్రేమించే దానిచే బంధింపబడకుండా ఉండటా నికి దానిని నశింప చేయాలనుకొనటంలా వుంటుంది. ఎందుకనగా మీరు ప్రేమిం చిన దాని నుండి మీరు ఆశించినది పొందలేక పోయినప్పుడు దానిని నాశనం చేసి దాని నుండి విముక్తులు కావాలను కుంటారు. వేరొక సందర్భంలో మీరు లోలోపల కోపాగ్నిలో రగిలి నలిగి పోతారు. ఎందుకంటే మీరు ప్రేమించిన దానిని పొందలేక పోయారు, మీరు దేనిని ప్రేమించారో దానిని హరించుకోలేక పోయారు. నిజానికి (శ్రీమాత నవ్వుతారు) అంతర్ సత్యం యొక్క దృష్టిలో ఇందులో ఏమంత వ్యత్యాసం లేదు. ప్రధానమయిన ప్రకంపన స్వచ్ఛంగా ఉన్న పుడు, తన తొలి స్వచ్ఛతతో వ్యక్తీకరించునపుడు మాత్రమే అది పూరేకులు విచ్చుకోవటం లాంటిది — దానిని ఏమనాలి — అది ఒక కాంతి ప్రసరణ, అద్భు తంగా వ్యాపించే ప్రకంపన, అది వికసించటం, ఒక తేజోమయమయిన వికాసం అప్పుడది సత్యమై నిలుస్తుంది. భౌతికంగా అది ఆత్మ సమర్పణగా, తనను తాను మరచి పోవటంగా, ఆత్మ ఉదారతగా అనువదించ బడుతుంది. అదే నిజ మైన స్పందన. కానీ సాధారణంగా ప్రేమ అని పిలువబడేది నిజమైన ప్రేమ యొక్క ప్రధానమయిన ప్రకంపనలనుండి ఎంతో దూరంగా తొలగించబడు

తుంది. ద్వేషంలాగ - ఒకవ్యక్తి వెనక్కు తగ్గి, ముడుచుకుపోయి ఘనీభవిస్తాడు, మరొకడు దెబ్బతీస్తాడు. వ్యత్యాసం ఆవిధంగా నుంటుంది.

CWM 10: 214- 215

దివ్యప్రేమ ఎల్లప్పుడూ ఉంటుంది.

దివ్యప్రేమ తన గాఢత అంతటితో ఎల్లవేళలా పరిఢవిల్లుతుంది. అదొక అనంతమయిన శక్తి, కానీ తొంభైశాతం వ్యక్తులు ఏ మాత్రమూ దానిని అనుభూతి చెందలేరు. కేవలం వారు ఏమిటి అనే దానికి అనుగుణంగానే వారి అనుభూతి ఉంటుంది. వారి స్వీకరణ సామర్థ్యాన్ని అనుసరించి, దివ్యప్రేమలో ప్రతిస్పందిస్తున్న పరిసరాల్లో వారు స్నానమాడుతున్నారని ఊహించుకుందాం. మీకు దాని స్పృహ ఏ మాత్రం ఉండదు. కొన్ని సార్లు కొన్ని చాలా అరుదైన సందర్భాలలో అకస్మాత్తుగా కొన్ని క్షణాలపాటు మీకు ఏదో అనుభూతి కలుగుతుంది.

అపుడు మీరనుకుంటారు. ఓహ్, భగవత్ప్రేమ నా వద్దకు వచ్చింది అని. ఎంత హాస్యాస్పదంగా ఉంది కదూ! అది కేవలం ఏదో ఒక కారణం వలన మీరు ఎంతో కొంత తెరచుకోవటం చేత దానిని అనుభూతి చెంద గలిగారు. కానీ ఆ దివ్యప్రేమ, దివ్యచైతన్యం మాదిరిగా ఎప్పుడూ అక్కడ నిలిచే ఉంది. అది ఒకటే. సర్వకాల సర్వావస్థలలో ప్రగాఢంగా ఉంటుంది. అయితే ఎవరికీ కనీసం దాని స్పృహ కూడా ఉండదు. లేదా ఆగుతూ ఆగుతూ కలుగుతుంది, లేదా హఠాత్తుగా ఎప్పుడైనా ఒకమంచి స్థితిలో ఉన్నప్పుడు ఒక వ్యక్తి ఎంతో కొంత అనుభూతిని పొంది "ఓహ్! దివ్యచైతన్యమూ, ప్రేమ నావైపు, నా వద్దకు వచ్చాయి!" అనుకుంటాడు. నిజానికి అసలు అలా ఉండదు. వ్యక్తిలో చిన్నగా ఏదో తెరుచుకుంటుంది. ఎంత చిన్నగా అంటే ఒక గుండుసూది మొన అంత. సహజంగా శక్తి దానిగుండా లోపలికి ప్రవహిస్తుంది. ఎందుకంటే అది ఒక చైతన్యవంతమయిన వాతావరణం. స్వీకరించబడగల సాధ్యత కలగగానే స్వీకరించబడుతుంది. అన్ని దైవ ఘటనలూ యిలాగే జరుగుతాయి. అవి అక్కడే ఉంటాయి కానీ ఎవరూ స్వీకరించరు. ఎందుకంటే దేనితోనో మూయబడి, నిరోధించబడి వారు చాలావరకు ఇతర కార్యాలలో మునిగి ఉండటంవలన, ఎక్కువ సమయం తమ స్వవిషయాలలోనే మునిగి ఉండడం వలన మరి దేనికీ అక్కడ

చోటు ఉండదు. వ్యక్తి యితర కార్యకలాపాలతో (నవ్వుతారు) తలమునకలై ఉంటాడు. ఎంతగా యితర విషయాలతో నిండి ఉంటాడంటే అక్కడ భగవంతునికి స్థానం లేనంతగా, కానీ ఆయన అక్కడ ఉంటారు.

CWM 6: 135-36

జీవితంలో ఎదురు దెబ్బలు - దివ్యప్రేమ

దివ్యమైన పరిపూర్ణతకై ఆకాంక్షించే వారందరికీ తెలుసు. భగవంతుడు తన అనంతమయిన ప్రేమ, కృపతో మనపై వేసే దెబ్బలు మనలను వేగంగా, కచ్చితంగా ప్రగతి మార్గంలో నడిపించేందుకే అని. ఈ దెబ్బలెంత బలంగా ఉంటే వారు దివ్యప్రేమ యొక్క మహిమను అంతగా అనుభూతి చెందుతారు.

సాధారణ మానవులు, అందరూ విరుద్ధంగా, భగవంతుణ్ణి సాఫీ అయిన, ఉల్లా సమయిన, , విజయవంతమయిన జీవితం కావాలని కోరుకుంటారు. ప్రతి వ్యక్తి గతమయిన సంతృప్తిలో వారు దైవ కృపయొక్క సంకేతాన్ని దర్శిస్తారు. కానీ అందుకు వ్యతిరేకంగా జీవితంలో దురదృష్టమో, దుఃఖమో, ఎదురైనప్పుడు నీకు నాపై ప్రేమలేదు, అని భగవంతుడికి ఫిర్యాదు చేస్తారు.

ఈ విధమైన అజ్ఞాన, అనాగరిక వైఖరికి భిన్నంగా శ్రీఅరవిందులు ప్రియతమ దైవంతో "కొట్టు, మరింత గట్టిగా కొట్టు నీ ప్రేమయొక్క గాఢతను నన్ను అనుభూతి చెందనీ" అంటారు.

మనం ఆశించినది, కోరుకొన్నది, మనం అనుకున్నదానికి భిన్నంగా సంభవించినపుడు, మన కోరికకు వ్యతిరేకంగా సంభవించినప్పుడు మనం అజ్ఞానంతో వాటిని దురదృష్టం అనుకొని రోదిస్తాం. కానీ కొంత తెలివిగా ఉండి, ఈ సంఘటనల లోతైన పరిణామాలను పరిశీలించినట్లయితే, యివన్నీ మనలను త్వరితంగా భగవంతునివైపు నడిపిస్తున్నాయని తెలుసుకుంటాం. సులభమూ, సుఖవంతమయిన పరిస్థితులు మనం మార్గంలో కాలయాపన చేసేటట్లు దారిలో ఎదురయ్యే ఆనందానుభూతిని కలిగించే పూలను సేకరించటానికి ఆగి, మన బలహీనత వలననో, నిజాయితీ లోపించటం వలననో గట్టిగా తిరస్కరించ లేక పోతాం. అలా కాకుండా ఉంటే మన ప్రయాణం ఆలస్యం కాదు. విజయాలను ఎదుర్కోటానికి, అది తెచ్చే చిన్న చిన్న ఆనందాలకు తావివ్వకుండా ఉండటానికి ఒక వ్యక్తి

చాలా దృఢంగా ఉండాలి. అలా చేయగలిగిన వారు, చాలా శక్తివంతులయిన వారు, విజయం కోసం పరుగు తీయరు, కావాలని కోరుకోరు, వచ్చినప్పుడు ఉదాసీనంగా అంగీకరిస్తారు. ఎందుకంటే వారికి దురదృష్టాలు, దుఃఖాలు దెబ్బల విలువ తెలుసు. వాటి విలువను వారు అభినందిస్తారు. చివరగా మనం గమ్యానికి దగ్గరగా ఉన్నామనటానికి సంకేతం, ఋజువు, సరియైన వైఖరి పరిపూర్ణమయిన సమత. అవి మనలను విజయాన్నైనా, ఓటమినైనా, అదృష్టాన్నైనా, దురదృష్టా న్నైనా, ఆనందాన్నైనా, దుఃఖాన్నైనా మనలను అదే ప్రశాంతమయిన ఆనం దంతో స్వీకరింపజేస్తాయి. ఎందుకనగా యివన్నీ ప్రభువు తన అనంతమయిన కరుణతో మనపై వర్షించిన అమూల్యమయిన అద్భుతమైన కానుకలు గనుక.

CWM10: 57-59 *అనువాదం: డా. సరోజాప్రసాద్*

దివ్యప్రేమ రూపాంతరీకరణ సర్వోత్తమ శక్తి

నీవు చేయవలసింది దైవకృపకు నిన్ను నీవు అర్పించి వేసుకోవడం. ఎందుకనంటే ప్రప్రథమంగా జరిగిన అంతర్వలనం (తనలోనికి తాను ముడుచుకుపోవడం) సుప్రతిష్టితమైన తర్వాత, దివ్యకృప, దివ్యప్రేమ, రూపంలో దిగివచ్చి జగతు నుద్ధరించడానికి దైవం అంగీకరించింది. దైవప్రేమకు రూపాంతరీకరణ శక్తి వుంది. రూపాంతరీకరణ కోసం తనను తాను ప్రపంచాని కర్పించి వేసుకొని యెల్లెడలా అభివ్యక్తమైంది గనుక దాని కాశక్తి సంప్రాప్తించింది. ప్రపంచాన్ని తిరిగి తన పరమసత్యంలోనికి తీసుకురావడానికి అది మనిషిలో మాత్రమే గాక అత్యంత అజ్ఞానాంధకారమయమైన విశ్వపదార్థపు సమస్త అణువులలోనూ తనను తాను చొనుపుకుంది. భారతీయ పవిత్ర గ్రంథాలలో యీ అవతరణనే మహా బలిదా నంగా అభివర్ణించారు. కాని అవి మానవ దృక్పథానికే మహా బలిదానం. అటువంటి మహాకార్య మేదైనా చేయవలసివచ్చినప్పుడు మానవ మనస్సు దాని నొక బ్రహ్మాండమైన బలిదానంగా భావిస్తుంది. కాని నిజంగా దైవం ఆ బలిదానం వల్ల క్షీణించదు, యెటువంటి బలిదానాలు యెన్ని జరిగినా దాని అనంత సారతత్త్వం యెప్పుడూ అనంతతను కోల్పోయి, అల్పమైనదిగా అవ్వదు.నీవు దివ్యప్రేమకై తెరచుకొన్న క్షణంలోనే దానినుండి రూపాంతరీకరణ శక్తిని కూడా పొందుతావు. కాని దానిని యింత, అంత అని పరిణామరీత్యా కొలిచి చెప్పలేవు. దానితో

అసలు సంపర్కం కలగడమే ప్రధానం. అసలు విషయమేమిటంటే దానితో సంపర్కంలోనికి రావడం. నీ మొత్తం అస్తిత్వాన్నంతా తక్షణమే దానితో నింపి వేసుకోవడానికి ఆ యదార్థమైన సంపర్కం కలిగితే చాలని తెలుసుకుంటావు.

CWM 3: 171-72

అంతరాత్మకు భర్తగా ప్రపంచాన్ని, దివ్యప్రియునిగా శ్రీకృష్ణుని చేసి, యిచటి జీవన విధానాన్ని భగవంతుడు ఏర్పాటు చేసాడు. మనం ప్రపంచానికి చేయవలసిన సేవను బాకీ పడి వున్నాము. ఒక ధర్మంతో వత్తిడి కలిగించే అభిప్రాయంతో, బాధ, ఆనందాల ఒక సర్వ సామాన్య అనుభవంతో బందీయై పోయి వున్నాం. కాని మన హృదయారాధన, మనస్స్వేచ్ఛ, రహస్య ఆనందాలు మాత్రం మన దివ్యప్రియునితోనే.

CWM 14: 340 శ్రీమాత

రూపాంతరీకరణ అత్యంత బలీయమైన శక్తి దివ్యప్రేమ

ఈ రూపాంతరీకరణను సాధించగల, లేక తీసుకురాగల దివ్యక్రియాశక్తి లేక దివ్యశక్తి స్వభావాన్ని తెలుసుకోవాలన్నా లేక అర్థం చేసుకోవాలన్నా - ముఖ్యంగా కీడు, కొంతవరకు అందవిహీనతలు వున్న సందర్భంలో — ఆ ప్రేమ శక్తులన్నింటి కంటె స్పష్టంగా అత్యంత బలీయమైన, సమగ్రమైన శక్తి అని తెలుసుకొంటావు. అన్ని సందర్భాలలోనూ ఇది వర్తిస్తుందనే అర్థంలో, సమగ్రమనే పదాన్ని తీసుకోవాలి. సమస్త దుస్సంకల్పాన్ని నిర్వీర్యం చేసేది, శత్రుశక్తులను శాసించేది అనిపించే పరిశుద్ధతాశక్తి కంటె అధికతర శక్తివంతమైనది దివ్యప్రేమ. కాని (పరిశుద్ధతాశక్తి) రూపాంతరణను సాధించగల ప్రత్యక్ష శక్తి గాదు. తరువాత రూపాంతరీకణ జరిగేందుకు అనువుగా పరిశుద్ధతాశక్తి మొదట నిర్వీర్యంచేసి, వేస్తుంది. మరింత ఉత్కృష్టమైన రూపాన్ని సృజించటాని కది అదివరకున్న రూపాన్ని, రూపు మాపుతుంది. కానీ రూపాంతరీకరించటానికి ప్రేమ ధ్వంసం చేయదు. సరాసరిగా రూపాంతరీకరించగల శక్తి ప్రేమకు వుంది. ఒక అగ్నిలా, ప్రేమ, కఠినమైన దానిని సమనీయంగా, మృదువుగా మార్చగలదు. ఆ మృదువైన దానిని ఒక విధమైన, పవిత్రీకరించబడిన ఆవిరిగా ఉన్నతీకరించగలదు కూడా. అది ధ్వంసం చేయదు, రూపాంతరీకరిస్తుంది. సారతః మూలంలో ప్రేమ ఒక

జ్వాల లాంటిది. సమస్త నిరోధాలను అధిగమించగల ఒక ధవళాగ్ని జ్వాల. దీని అనుభవం నీకూ కలుగుతుంది. నీ అస్తిత్వంలో ఏ ఇబ్బంది ఉన్నా, సంచిత దోష భారం, అజ్ఞాన భారం, అసమర్థత, దుస్సంకల్పాల భారం యేదున్నప్పటికీ యీ పరిశుద్ధ, సారభూత, సర్వోత్తమప్రేమ, దానినంతా తన అగ్నిలో క్షణంలో కరి గించి వేస్తుంది. ఒకే ఒక్క క్షణంలో గతాన్నంతా నామరూపాలు లేకుండా చేస్తుంది. దాని సారాంశాన్ని స్పర్శించిన ఒకే ఒక్క క్షణంలో భారమంతా మటు మాయమై పోతుంది.

CWM 10:72-73 శ్రీమాత

అహం వున్నంతకాలం ప్రేమించలేడు. దివ్యప్రేమ మాత్రమే ప్రేమిస్తుంది, దివ్యప్రేమ మాత్రమే అహాన్ని జయిస్తుంది.

CWM 14:121 శ్రీమాత

జీవనం కంటే మహత్తరమైన, మరణం కంటే బలీయమైన, అందం అంతరించినా, ఆకర్షణ అంతమైనా జీవించి వుండగల, ప్రేమించబడే వస్తువు వల్ల కలిగే అత్యంత బాధను, ఛీత్కార్యాన్ని కూడా పట్టించుకొనకుండా, వ్యవహరించగల, తనకంటే యెంతో యెంతో క్రింది స్థాయిలో వున్నదానిపై ఒక గొప్ప ఉన్నత మేధస్సు నుండి తరచుగా గ్రుమ్మరిల్లే ఆ ప్రేమ యెచటినుండి వస్తుంది? ఏ ప్రేమ కన్నా యేదీ అధికమైనది కాదో ఆ స్త్రీ ప్రేమంటే యేమిటి? నిర్లక్ష్యానికి గురైనా ఛీత్కార, కర్కశత్వాలకు లోనైనా నిలిచి వుండగల, చితాగ్ని కీలలకన్నా పైపైకి యెగసి పోగల, నీతో పాటు స్వర్గానికి రాగల, నిన్ను నరకం నుండి బయటకు తీసుకురాగల ఆ స్త్రీ ప్రేమ సంగతేమిటి? ఈ ప్రేమ యిచట లేదనీ, యిక్కడ ఉన్నదంతా ప్రాకృతిక వాంఛ మీద, స్వాతిశయంమీద , స్వప్రయోజనం మీద, లేక స్వార్థపూరిత సుఖానుభూతిమీద ఆధారపడిందేనని, రాముడు, సీత, రురుడు, సావిత్రి, కేవలం కలలు, ఊహలు, అని అనవద్దు. తన దివ్యత్వపు ఎరుక గల మానవ స్వభావం ఆ అభియోగాన్ని ఛీత్కరిస్తూ, త్రిప్పి కొడుతుంది. కవనం ఆశీర్వదిస్తుంది. ఆ తీర్పుకు చరిత్ర తథాస్తు పలుకుతుంది. దివ్యప్రేమ అంటే ఆత్మ, ఆత్మను అస్పష్టంగా గాని, లేక స్పష్టంగా గాని గుర్తించడం, కాబట్టి యేకత్వాన్ని, ఏకత్వపు ఆనందాన్ని, నిజం చేసుకోవటం కోసం తపించడం. మరి మిత్రుని విషయమేమిటి? దైహిక సుఖాన్ని నేను నా మిత్రుని దగ్గర్నుండి

ఆశించననేది ఖాయం, లేక అతను చూడడానికి బాగున్నాడని నేనతనిని కావాలను కోను. అభిరుచులు, అభిలాషలు, ఒకే విధంగా ఉండాలని మిత్రునిగా వుండే వానిలో ఆశించను. బహుశా ఒక శిష్యుడిని ప్రేమించినట్లు అతడు నన్ను ప్రేమిస్తున్నాడు, మెచ్చుకొంటున్నాడు, అని అతనిని ప్రేమించను. అతడు నాకు ఒక తెలివిగల సహాయకుడు, లేక బోధకుడు మాత్రమే అనే వుద్దేశ్యంతో అతని నుండి తప్పనిసరిగా ఒక ప్రజ్ఞావంతమైన మనస్సును కోరడం లేదు. ఈ భావా లన్ని వుంటాయి, కాని అవి మిత్రత్వానికి కేంద్రం కావు. ఇందుకు స్త్రీ ఒక కారణం చెప్తుంది, అది వన్నె తగ్గని సుభాషితం. అతను నా మరో ఆత్మ. ఇదిగో ఇదే ప్రేమకు అసలు కారణం, మూలం.

CWM 17:139-140 — *శ్రీఅరవిందులు*

సూత్రాలు

నీకు సంతోషం కలిగించేది నీపై మరొకరు చూపే ప్రేమకాదు. నీవు ఇతరులపై చూపే ప్రేమే నీకు సంతోషం కలిగిస్తుంది. ఎందుకనంటే, శాశ్వతంగా, ఏమరు పాటు లేకుండా నిన్ను ప్రేమించే దైవంనుండి నీవితరులపై చూపే ప్రేమను స్వీకరిస్తుంటావు.

*

అతడు స్వీకరించే ప్రేమగాక, అతడిచ్చే ప్రేమే అతడిని ధన్యుడిని చేసి, ప్రకాశ మయం చేసే యథార్థ ప్రేమ. పరమోత్కృష్ట దివ్యప్రేమ, యే విధమైన ప్రత్యేక లక్షణమూ లేని ప్రేమ. ప్రేమ ప్రేమించడం యెందుకని చేస్తుందంటే, ప్రేమిం చడం తప్ప మరేం చేయలేదు గనుక.

*

ఉన్నది ఒకే ఒక్క ప్రేమ అది దైవ ప్రేమ. ఆ దైవ ప్రేమ లేకుండా సృష్టి లేదు. దైవప్రేమ వల్లనే సమస్తం మనుగడ సాగిస్తోంది. లేనేలేని మన స్వకీయ ప్రేమను కనుగొన ప్రయత్నిస్తే, ప్రేమను యేకైక దైవప్రేమను, సమస్త సృష్టిలో చొచ్చు కొనిపోయి వున్న దైవప్రేమను, మనం అనుభూతి చెందలేం.

*

ఒకడు తాను ప్రేమిస్తున్న దానిలాగా తయారౌతాడని చెప్పారు. కాని దైవం విష

యంలో, భగవంతుని వలె ఉండే స్థాయికి యెదిగినప్పుడు మాత్రమే ఒకరు అతనితో సదా వుండగలుగుతాడు అనేది కూడా యదార్థమే.

*

ఓ ప్రభూ! నీ ప్రియునికి, ప్రపంచ దూషణలు తీయని తేనియలు, మూకలు అతనిపై విసరేరాళ్ళు అతని దేహంపై కురిసే వేసవి జల్లులు, ఎందుకనంటే దూషించేది, రాళ్ళు రువ్వేదీ నీవు కాదా, అతనికి తగిలే, గాయపరచే రాళ్ళలో వున్నది నీవుగాదా?

*

ఎందుకూ కొరగాని క్రిమినీ, అత్యంత నీచుడైన నేరస్థుడినీ నీవు ప్రేమించలేకపోతే, సర్వాత్మనా నీవు భగవంతుడినే సర్వస్వమని భావించానని నీవెలా నమ్మ గలవు?

ప్రపంచాన్ని మినహాయించి భగవంతుడిని ప్రేమించడమంటే, ఆతని యెడల ఆరాధన తీవ్రమైనదేగాని అది అపరిపూర్ణ ఆరాధన.

*

భగవంతుడు దేన్ని నా కందకుండా చేసినా, దాన్నతడు తన ప్రేమ, విజ్ఞతలతోనే అలా చేసాడనేది నేను గమనించాను. నేనప్పుడే దానిని గ్రహించివున్నట్లైతే యెంతో మంచిదనిపించిన దాన్ని గూడా యెంతో విషతుల్యంగా చేసి వుండేవాడిని. అయినప్పటికీ, మనం పట్టుబట్టినప్పుడు, ఆయన మనకు త్రాగటానికి విషాన్నిస్తాడు. జ్ఞానంతో దాన్ని తన అమృతంగా మార్చి రుచిచూచి త్రాగడం నేర్చుకోవాలని.

*

బోధకుడైన భగవంతునికి శిష్యరికం, తండ్రైన భగవంతునికి పుత్రత్వం, తల్లియైన భగవంతుని కోమలత్వం, దివ్యస్నేహితుని కరచాలనం, మన దివ్యస్నేహితునితో దివ్యక్రీడా సహచరునితో కేరింతలు, ఆటలు, దివ్యగురువైన భగవంతునికి ఆనంద పూర్వకసేవ,మన దివ్య ప్రియుని ప్రహర్ష పూర్వక ప్రేమ, అనేవి దేహంలోని సప్త జీవనానంద స్థితులు. వీటన్నింటిని ఒకే ఒక్క సర్వోత్కృష్ట, ఇంద్రధనస్సు వర్ణాలు గల బాంధవ్యంగా యేకం చేయలేమా? చేస్తే నీ కప్పుడు యే స్వర్గంతోనూ అవసరముండదు. అద్వైతుని విమోచనా స్థితిని కూడా దాటి పోతావు.

*

నా ప్రియుడు, పాపం అనే నా దుస్తులను లాగి పారేసాడు. అతడలా చేయడాన్ని ఆనందంగా అంగీకరించాను. తరువాత అతడు పుణ్యం అనే దుస్తులనూ తీసి పారేసాడు, కాని నేను సిగ్గుపడ్డాను, భయపడ్డాను, అతడిని అడ్డుకున్నాను. అతడు బలవంతాన ఆ దుస్తులు లాగు కొనేంతవరకు, నా అంతరాత్మ నా నుండి యెలా దాగివుందో నేను చూడలేక పోయాను.

*

నా పొరుగు వానిని నేను ప్రేమించేది అతడు మంచి పొరుగు అనికాదు. ఎందుక నంటే, పొరుగులో, దూరంలో యేముంది? అతడు నా సోదరుడని మతాలు చెప్పినందువల్లా కాదు. ఎందుకంటే ఆ సోదరత్వానికి మూలం యెక్కడుంది? కాని నేను ప్రేమించేది అతడు నేనే అని, పొరుగు దేహం వరకే, హృదయం వాటికతీతంగా దూరం పోతుంది. సోదరత్వం, రక్తానికి లేక దేశానికి లేక మతానికి లేక మానవీయతకు సంబంధించినది, కాని స్వార్థం గగ్గోలు పెట్టినప్పుడు యీ సోదరభావం యేమౌతుంది? భగవంతునిలో నివసించడం వల్ల అతని సార్వత్రిక యేకతా ప్రతిరూపంగా అయ్యేటట్లు మనస్సు, హృదయం, దేహాలను మళ్ళిం చడం ద్వారా మాత్రమే ఆ ప్రగాఢమైన, అనాసక్తమైన, యెట్టి దుష్ప్రభావాలకు లోనుగాని ప్రేమ సంభవమౌతుంది.

*

అత్యున్నత మహదానంద స్థితిని చేజిక్కించుకొన్న అంతరాత్మకు, జీవితం హాని కరం కాదు, లేక ఒక విషాదకర భ్రాంతీ కాదు, కాకపోగా, ఒక దివ్య ప్రేమికుని, దివ్యక్రీడా సహచరుని గిలిగింతులు గొలిపే ప్రేమగా జీవితమంతా తయారవు తుంది.

*

తనను సేవించువానిలోని రెండు పనులు భగవంతునికి పరిపూర్ణ సంతసాన్ని కలిగిస్తాయి. ఆతని ఆలయ ప్రాంగణాన్ని మౌన ఆరాధనాభావంతో ఊడ్చడం, శుభ్రం చేయడం, మానవతతో తన దివ్య లక్ష్యసాధనకై ప్రపంచ రణరంగంలో పోరాడడం, అవి.

*

మానవులకు యేకించిత్తైనా మంచి చేసినవాడు, ఆతడెంత నికృష్టుడైన పాపి

యైనప్పటికీ, అతనికి భగవంతుడు తన ప్రియుల, సేవకుల మధ్య స్థానమిస్తాడు. అతడు తప్పకుండా శాశ్వతుని మోము దర్శిస్తాడు.

CWM 14

*

నీ బలహీనతలవల్ల మతి చెడిన వాడా! భయమనే ఒక తెరతో భగవంతుని మోమును మరుగు పరచవద్దు. ఒక యాచకునివలె జంకుతో ఆయన దగ్గరకు పోవద్దు. అటు చూడు! ఆయన మోముపై ఒక పాలకునికి ఒక న్యాయాధికారికుండే గాంభీర్యతను గాక, ఒక దివ్య ప్రియుని ధరహాసాన్ని దర్శిస్తావు.

*

వికార రూపంలో, చెడులో భగవంతుని సౌందర్యాన్ని, మంచితనాన్ని, సంవేదించి, ప్రేమించటానికి, దాని వికారాన్ని, చెడును చక్క దిద్దడానికి కేవల ప్రేమతో తపించడమనేది నిజమైన సుగుణం, నైతికత అవుతుంది.

CWSA :12 స్వేచ్ఛానువాదం: కె.వి. రావు

*

ప్రేమ అనంతమగు అమరలోకాల, అతులిత వైభవం

అనంత అమరలోకాల అతులిత వైభవం ప్రేమ.
క్షుద్ర శక్తులు దాని నామ రూపాలను కుదిపి
ఆనంద పారవశ్యాల నపహరించి, కించపరచినా,
పూర్ణ పరివర్తన తేగల అధి దైవతం.

*

అచేతనా వస్థలో మార్మిక మొకటి మేల్కొంటుంది,
జీవిత పునరుద్ధారక పరమానందం పుడుతుంది,
ఆత్మ వికసన మందే క్షణం కోసం మనలో
ముకుళిత పద్మంలా ప్రేమ నిరీక్షిస్తుంటుంది,
లేక మైమరచిన నిద్రలో ఆలోచన తరంగాల మధ్య
తన్ను తాను వెతుక్కుంటూ తిరుగాడుతుంది,
దివ్యబాలుడి కేళీ హేలలా తచ్చాడుతుంది.

అనేక హృదయాల్లో, మనసుల్లో, సజీవాకృతుల్లో,
ఓ పలుకు, ఓచూపు, ఓ స్పర్శ, ముఖవైఖరిలాంటి,
ఓ సుపరిచిత సంజ్ఞ కోసం తారాడుతుంది.
అది అందగానే అన్యాలోచన వినా మేల్కొంటుంది.

*

మసక బారిన భౌతిక మనసామె పరికరం.
నాటి అంతర్ దృష్టిని నేడు మరచినందున
సృష్టి సూచనల సమ్మర్ధాల మధ్య దారికోసం
బాహ్యమందలి సంజ్ఞనోదానిని అనుసరిస్తుంది,
పరమ సత్యాలను పుడమి రూపాలలో పరికిస్తుంది,
దివ్య తత్వాభివ్యక్తికై ఆకృతి నాకాంక్షస్తుంది,
ఆకృతికి అక్షయ లక్షణాల నాపాదిస్తుంది,
దేహాన్ని అంతరాత్మ శిల్పాకృతిగా భావిస్తుంది......
దైవానికి దూరమైనా ఆతని సత్యత నర్థిస్తుంది
జీవితమంధకారమయమైనా, ఇంద్రియాలు మోసగించినా,
దిగజార్చుటకు క్షుద్రశక్తులు ఉద్యమించినా,
దైవదర్శనం సిద్ధిస్తుంది, పరమానందం లభ్యమౌతుంది.

*

దైవావిష్కరణను భరించగల జీవి ఎంత అరుదో
ప్రేమామృత పానీయ కలశం అంత అరుదు.
వెయ్యేళ్ళుగా సిద్దపరచబడుతున్నది అంతరాత్మ
అది దైవాంశ సంభూతమగు సజీవ మూస.

సావిత్రి: 398

*

ప్రేమ — దూరానవున్న విశ్వాతీతుడు అంపిన దేవత

మట్టిలో పుట్టి మింటిలో ముగుస్తుంది,
నాడు పశువాంఛగా నున్న ప్రేమ అంతా
ఆనందమయ హృదయమందొక మధురోన్మాదంలా,
ఉల్లాస భరిత మానస మందొక మహా స్నేహ బంధంగా,
విశాల ఆధ్యాత్మికాకాంక్ష క్షేత్రంగా మారుతుంది.

ఒంటరిదగు అంతరాత్మ ఒంటరియగు దైవానికై తపిస్తుంది
మనిషిని ప్రేమించే హృదయం దైవప్రేమకు పులకిస్తుంది
దేహమాతని గేహం, దివ్యధామం అవుతుంది.

జీవి అపుడు ప్రత్యేకత పంజరం నుండి ముక్తుడవుతాడు,
అన్నీతానే, అంతా నవ దివ్య చైతన్యమనే అనుభూతి చెందుతాడు.

హృదయమందిర ద్వారంనుండి దివ్యప్రేమికుడు తొంగి చూచి
అవనినంతా హృదయంలో పొదువుకుంటాడు.
మహా నిశీధి, మృత్యుదేవతల పని ఇక ముగుస్తుంది.

ఏకత్వం సిద్ధించి, పోరాటం అంతమై, అంతా విదితమై,
దివ్యప్రేమ కౌగిలిలో అంతా కరిగి పోయినప్పుడు
అజ్ఞానం, బాధపైపు మరలే వారెవరు?

సావిత్రి: 632, 33

భువిపై జీవించాలంటే ప్రేమ అంతమవకూడదు.
దివిని భువికి జోడించే తేజోమయ బంధమది,
దూరాన వున్న విశ్వాతీతుడు అంపిన దేవత అది,
సర్వసంపూర్ణుడగు దైవంపై మానవుని హక్కు అది.

సావిత్రి: 633

మహర్షీ! ప్రేమ, ఐక్యతల అనుభూతితో జీవించుటయే జీవితం,
హృదయమందు మెదిలి కనువిప్పు గావించిన పరమార్థం
మాలో అమూల్యమైన మార్పుకు మూల మంత్రం,
ఇదే నేను కోరిన , నాకు తెలిసిన మహాసత్యం.

సావిత్రి: 724

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

ఓ నా దైవమా, అందరూ అంటారు. నాకు పిచ్చి అని, ఎందుకనగా నాకు మీలో దోషం కనిపించదు. కానీ నిజంగా నాకు మీ ప్రేమ పిచ్చిగనక పట్టినట్లయితే, నా మానసిక స్వార్థతను తిరిగి పొందాలని కోరను.

CWM10: 337

శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

అఖిల

అఖిల భారత పత్రిక
నవంబరు 2016



శ్రీకృష్ణుడు శాశ్వత దైవము



శ్రీకృష్ణుడు దివ్యానందముయొక్క శాశ్వతముయొక్క మహా వ్యక్తిత్వము; ఆయన కారణంగానే, ఆయన క్రీడ కారణంగానే, ఆయన ఆనందం కారణంగానే, ఆయన మాధుర్యం కారణంగానే సృష్టి సాధ్యమైంది.

బ్రహ్మ మహా అమరత్వం, విష్ణువు మహా శాశ్వతత్వం, శివుడు మహా అనంతత్వం, శ్రీకృష్ణుడు ఆత్మ — వశవర్తి అయిన, ఆత్మ — బహిర్గతం చేసే, ఆత్మ — అభివ్యక్తమయే, ఆత్మ శోధించే పరమేష్ఠియొక్క శాశ్వతత్వము, అనంతత్వము, అమరత్వము.

CWSA 12:208-09 అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

విజయ కిరీటము నొసగే ఈ యోగంయొక్క సాక్షాత్కారత

నీవు ఈ మొత్తం ప్రపంచమును అనంత దివ్య వ్యక్తిత్వము యొక్క వ్యక్తీకరణగా, మహా లీల లేదా క్రీడగా ఎరుక పొందినప్పుడు, వ్యక్తిత్వరహిత సత్ ఆత్మ కాకుండా అభివ్యక్తమైన ఉనికికి ఆధారముగా ఎరిగినప్పుడు – నీవు ఆ జ్ఞానమును పోగొట్టుకొనక పోయినప్పటికీ – శ్రీకృష్ణుడే సర్వ అభివ్యక్తముగాను, అభివ్యక్తము కాని ఉనికిగాను ఏక కాలంలో అయినవాడుగా, ఆధారముగా, అతీతముగా, (అవ్యక్తో వ్యక్తత్ పరః), నీవు సమస్తంలో చూసినప్పుడు అది ఈ యోగంయొక్క విజయ కిరీటము నొసగే సాక్షాత్కారత. ఈ సదాత్మ వెనుక అసత్ యొక్క నిశ్శబ్దం ఉంటుంది, దానినే బౌద్ధ శూన్యవాదులు శూన్యంగా సాక్షాత్కరించుకొన్నారు, ఆ నిశ్శబ్దం ఆవల ఉండేది పరాత్పర పురుషుడు (పురుషోవరేణ్యా ఆదిత్య వర్ణాస్ తమసః పరస్తాత్). అతడే తన అస్తిత్వం నుంచి ఈ విశ్వాన్ని దానిలో సర్వవ్యాపియై యుండి దానికి ఆసరాగా అపరిమిత-పరిమిత పరమేశ్వరుడిగా, అనంతుడిగా, సర్వము తానైనవాడుగా, శివుడిగా, నారాయణుడిగా తయారు చేశాడు. లీలామయుడైన శ్రీకృష్ణుడు తన ప్రేమతో మనల నందరినీ తన వైపుకు లాగుకొనేవాడు, తన గొప్ప చాకచక్యాలతో మనల నందరినీ బలవంతం చేసేవాడు. తన శాశ్వత క్రీడయొక్క సంతోష, బల, సౌందర్యాలతో బహుముఖాలైన ఈ విశ్వంలో క్రీడిస్తాడు.

ఈ ప్రపంచం కేవలం అతని అస్తిత్వం, జ్ఞానం, ఆనందం, సత్ , చిత్ , ఆనందముల క్రీడాక్షేత్రం. మహాపదార్థం తనకు తానుగా కూడా భౌతికం కానిదిగా, పదార్థం కానిదిగా, కాని చైతన్యంయొక్క రూపంగా (గుణం), ఇంద్రియ-జ్ఞానం ద్వారా గ్రహించిన అస్తిత్వం యొక్క లక్షణం ఫలితంగా, ఒక రోజు నీ కది వాస్తవంగా వెల్లడవుతుంది. ఘనాకృతి తనకు తానుగా కూడా కేవలం గుణాల కలయిక మాత్రమే. సంహతి మరియు ధృతి, అంటిపెట్టుకోవడం, స్థిరంగా ఉండటం, చేతనా అస్తిత్వం యొక్క ఒక స్థితి, అంతకంటె మరేమీ కాదు. పదార్థము, ప్రాణము, మనస్సు, మనస్సు కావల నున్నది, సమస్తం శ్రీకృష్ణమయం. అనంత-గుణ పరబ్రహ్మం విశ్వంలో సచ్చిదానందంగా క్రీడిస్తున్నాడు. మనకీ సాక్షాత్కారం కలిగినప్పుడు, మనం దానిలో భద్రంగా, శాశ్వతంగా వసించినప్పుడు దుఃఖం, పాపం, భయం,

మతిభ్రమ, అంతరంగ వైరుధ్యాల వైరాలు మరియు బాధల సంభావ్యతలన్నీ మన అస్తిత్వం నుంచి బలిష్టమైన శక్తితో నెట్టివేయ బడతాయి.

CWSA 13: 76-77 *అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ*

శాశ్వత దైవము

శ్రీకృష్ణుడు సమస్తంలోను వసిస్తున్నాడు

శ్రీకృష్ణుడు సమస్తంలోనూ వసిస్తున్నాడు. కేవలం జీవించే వాటిలోనే కాకుండా జీవం లేనివాటిలో కూడా మనం శ్రీమన్నారాయణుని తప్పక దర్శించాలి, మహాశివుని అనుభవించాలి, మహాశక్తి చుట్టూ మన చేతులతో చుట్టేయాలి. మహాపదార్థ భావనతో ఇప్పుడు అంధకార బంధురమైపోయిన మన కనులు, ఆ పరమోత్కృష్ట ప్రకాశానికి తెరచుకున్నప్పుడు, జీవం లేనిదిగా మనం దేనినీ చూడం, కాని సమస్తమూ ఇమిడి పోయి ఉన్నదే, వ్యక్తంగా లేదా అవ్యక్తంగా, ముకుళించుకొని లేదా వికసించి, గుప్తంగా లేదా అభివ్యక్తమై లేదా అభివ్యక్తమయ్యే క్రమంలో, అన్నం లేదా మహాపదార్థం అని మనం చెప్పుకొనేటటువంటి కేవలం ఆ ముకుళించుకొని ఉన్న ఆ చైతన్యస్థితి మాత్రమే కాకుండా, జీవం, మనస్సు, జ్ఞానం, ఆనందం, దివ్యశక్తి, అస్తిత్వం — ప్రాణ, మనస్, విజ్ఞాన, ఆనంద, చిత్ , సత్ గా కూడా. అన్నింటిలోనూ స్వయం-ఎరుక కలిగిన భగవంతుని వ్యక్తిత్వం దీర్ఘమగ్న మై, తన గుణాల ఆనందాన్ని పొందుతుం టుంది. పుష్పాలు, ఫలాలు, మట్టి, చెట్లు, ఖనిజాలు, అన్నింటిలో ఒక సంతోషం ఉంది. దానిని నీవు ఎరుగ గలవు, కారణం అన్నింటిలో శ్రీకృష్ణుడు వసిస్తున్నాడు (ప్రవిష్య), వాటిలో ప్రవేశించిన తర్వాత, మూలపదార్థంగా లేదా భౌతికంగా కాకుండా, — కారణం, అటువంటిదేమీ లేదు కనక, మహాప్రదేశము మరియు మహాకాలాలు లోకసంప్రదాయాలు, ఇంకా, విషయగ్రహణమునకు పెట్టుకున్న అమరికలు, అంతా భగవానుని యొక్క సృజనాత్మకమగు మహాకళాకౌశలంలో దృశ్యమాన చిత్రకళ — కాని అతని అస్తిత్వ దివ్య ఎరుక మటుకు చిత్ ద్వారా మాత్రమే.

CWSA 13:78

దేవుడు ఒక్కడే కాని ఆయన తన ఏకత్వానికి పరిమితమైపోడు. మనం ఇక్కడ ఆయనను, ఏకం ఎల్లప్పుడు అనేకంగా అభివ్యక్తమవటంలా చూస్తున్నాం. దానికి ఆయన వివశుడైపోవడం కారణం కాదు, కాని ఆయన ఆ విధంగా ఇచ్ఛగించాడు కనక. సృష్టికి ఆవల ఆయన అనిర్దేశ్యం, ఇదమిత్థమని చెప్పలేనిది, ఏకమా లేక అనే అని వర్ణించలేనివాడు. దానినే ఉపనిషత్తులు, ఇంకా ఇతర పవిత్ర గ్రంథాలు నిరంతరం బోధిస్తున్నాయి; ఆయన ఏకమేవా ద్వితీయం, ఉన్నది ఒక్కటే మరి ఇతరము లేదు. అయినా కూడా, పర్యవసానంగా ఆయన "ఈ మనిషి, కనుచూపు దూరంలో స్త్రీ, ఆ నీలి-రెక్కల పక్షి, ఈ సింధూరవర్ణపు కనుగవ గలవాడు." అతడు సర్వస్వము (సాంత), అతడు ఆనంతుడు, జీవుడూ అతడే. శ్రీకృష్ణుడు గీతలో చెప్తున్నాడు, "నేను అశ్వత్థ వృక్షమును, నేను మృత్యువును, నేను అగ్ని వైశ్వా నరుడను, నేను అన్నమును జీర్ణం చేసే అగ్నిని, (జఠరాగ్నిని) నేను వ్యాసుడను, నేను వాసుదేవుడను, నేను అర్జునుడను". సమస్తమూ ఆయన అనంత అస్తిత్వంలో ఆయన చైతన్యక్రీడ, ఆయన అభివ్య క్తాలు, కనుక అన్నీ వాస్తవమే. మాయ అంటే పరబ్రహ్మము యొక్క స్వేచ్ఛ తప్ప మరేమీ కాదు, — పరిస్థితుల ననుసరించి తనను తాను వ్యక్తపరచుకొనేవాడు. అతడు దాని వలన ఏ విధంగాను మనం చూస్తున్న విధంగా లేదా ఆలోచిస్తున్న విధంగా పరిమితమైనవాడు కాదు. అటువంటి ఆ మహామాయ నుంచే మనం తప్పక తప్పించుకొని బయటపడాలి, అజ్ఞానంయొక్క మహామాయ విషయాలను వేరుగా ఉన్నవాటిగా, దైవికం కానివిగా, చైతన్యం లేని వాటిగా, వాస్తవానికి పరిమితమైనదానిని అపరిమితమైనదానిగా, స్వేచ్ఛను హద్దుల మధ్య ఉన్నదానిగా నిర్ధారిస్తుంది. శ్రీకృష్ణ, గోపికల కథ నీకు గుర్తుందా, అందులో నారదుడు వెళ్ళిన ప్రతి గృహంలోనూ శ్రీకృష్ణుడు అనేక విధాలైనటువంటి ప్రవృత్తిలో ఉండటం, ప్రతి గోపిక వద్ద వేరే శరీరంలో ఉండటం, అయినప్పటికీ అదే శ్రీకృష్ణుడు! ఆ కథలో నీకు తెలిసినటువంటి భక్తిపరమైన తాత్పర్యాన్ని పక్కకు పెడితే, అది ఆయన విశ్వలీలకు సరి అయిన భావం. అతడే సర్వం, ప్రతి ఒక్కడు, తన వాస్తవికమైన వేరైనటువంటి దివ్యప్రకృతిగల అతడు ఒక మహాపురుషుడు. కార్యం అతడే, అయి నప్పటికీ అదే సమయంలో అతడు పరాప్రకృతి అయిన రాధతో ఉన్న పురుషోత్తముడు.

అతడు ఇచ్ఛగించినచో వీటన్నింటిని అతడు తనలోకి ఉపసంహరించుకో గలడు, తిరిగి ఇచ్ఛగించినప్పుడు బయటపెట్టనూగలడు. ఒక దృష్టికోణంలో అవన్నీఆయనతో ఒక్కడిగానే ఉన్నాయి, మరొక దృష్టికోణంలో అతనికి వేరుగా ఉన్నట్టుగా ఉన్నాయి, మరింకొక దృష్టికోణంలో ఎల్లప్పుడూ వేరుగానే ఉన్నవిగా ఉన్నాయి, కారణం అవన్నీ ఎల్లప్పుడూ ఉన్నవే, ఆయనలో గుప్తంగా లేదా వ్యక్తంగా, ఆయన ఇష్టం మేరకు. ఈ దృక్పథా లన్నింటితో విభేదించినందు వలన వచ్చే లాభమేమీ లేదు. భగవంతుని దర్శించే వరకు నిరీక్షించు. నిన్ను నీవు, ఆయనను, తెలుసుకో, అప్పుడు వాగ్వివాదాలు, తర్కవితర్కాలు అనవసరమైపోతాయి.
CWSA 13:89-90

శ్రీకృష్ణుం౦ు — దివ్యపురుషుడు

ఆ ప్రశ్నకు సమాధానం (బృందావన కృష్ణుడు, ఆయన లీలాగాథలు అనేవి నిజమైనవా లేక కేవలం గాఢమైన ఆధ్యాత్మిక ప్రతీకలా), ఒకరు ఆధ్యాత్మిక అనుభవానికి, మార్మికమైన, తాంత్రికమైన అనుభవానికి ఎటువంటి విలువను ఇస్తారనేదాని మీద ఆధారపడి ఉంటుంది, అనగా, భౌతికం కంటె ఇతర అంతస్తుల విషయాలకు, అదే విధంగా విశ్వచైతన్యానికి, మనిషికి చెందినటువంటిది మరియు సమిష్టి చైతన్యాలకు మధ్య ఎటువంటి లాక్షణికి సంబంధం ఉంటుందనే దాని మీద కూడా ఆధారపడి ఉంటుంది. ఆధ్యాత్మిక, తాంత్రిక మహాసత్యాల దృష్టికోణంలో, మనిషి చైతన్యంలో రూపుదిద్దుకొనేదంతా, కష్టసాధ్యమైన మాధ్యమంలో, ఉన్నతోన్నతమైవాటి విషయాలకు సంబంధించిన ప్రకాశం, ఆధిపత్యశక్తి, సౌందర్యం లేదా వాటి శక్తి పరిధిలో విశ్వచైతన్యం నుంచి దానికి వచ్చి చేరేవి, అది కూడా పరిమితమైన మనిషిలో, ప్రస్తుతం అతడున్న పరిణామ, స్థితి, ఇంకా అజ్ఞానమయ భూమిక అయిన దానిలో, ఒక ప్రతిబింబం, ప్రత్యేకంగా ఒక విధమైనటువంటి ఆకృతిని దాల్చేది.

కృష్ణచైతన్యం ఒక వాస్తవం, కాని అక్కడ కృష్ణుడే లేకపోతే గనక, అక్కడ కృష్ణచైతన్యం అనేది ఉండబోదు. నిర్హేతుకమై అప్రత్యక్షమైన దార్శనిక మైనటువంటి వాటి విషయాలలో తప్ప చైతన్యవంతమైన ఒక మహా అస్తిత్వం లేకుండా చైతన్యం ఉండే అవకాశం లేదు. వ్యక్తి మాత్రమే వ్యక్తిత్వానికి విలువను, వాస్తవికతను ఇచ్చేవాడు. అందులో అతడు తనను తాను వ్యక్తీకరించుకుంటాడు, దాని వలన ఏర్పడేవాడు

కాదు. కృష్ణుడు ఒక అస్తిత్వం, ఒక వ్యక్తి, మనం ఒక దివ్యపురుషుడుగా అతనిని కలుసుకుంటాం, అతడి వాణిని వింటాం, అతడితో మాట్లాడుతాం, అతడి సన్నిధిని అనుభూతి పొందుతాం. కృష్ణుని చైతన్యాన్ని గురించి కృష్ణుని కంటె ఏదో వేరుగా చేసి మాట్లాడట మనేది మనోదోషం; అది ఎల్లప్పుడూ వేరు చేయడానికి సాధ్యంకాని దానిని వేరు చేస్తూ చూపుతుంది, దానిని వ్యక్తిత్వరహితమైన దానినిగానే చూడటానికి మొగ్గు చూపుతుంది, కారణం అది గూఢమైనది కనుక. గొప్పదిగా, ఎక్కువ వాస్తవిక మైనదిగా, వ్యక్తికంటె ఎక్కువ కాలం మన్నేదానిగా చూస్తుంది. అటువంటి విభజనలు మనస్సుకు దాని సొంత ఉద్దేశాల పరంగా ఉపయోగ కారకాలే, కాని అది అసలైన సత్యం కాదు; అసలైన సత్యంలో అస్తిత్వం లేదా వ్యక్తి, దాని వ్యక్తిత్వరహిత స్థితి లేదా అస్తిత్వస్థితి ఒక్క యదార్థానికి చెందినవే.

CWSA 28:481-82

రాధాకృష్ణుల ప్రేమ

ఆత్మ భగవంతుని కోరుకుంటుంది, దానిని, ఆ రాధాకృష్ణుల ప్రేమచక్రాన్ని, గేయ కావ్యరూపం మనిషిలోని మహాప్రకృతి ఆత్మను, దివ్యాత్మను ప్రేమ ద్వారా అన్వేషిస్తూ, ఆయన సౌందర్యంలో పట్టుబడి, అధీనమైపోయి, ఆయన మంత్రముగ్ధమైన వేణువుకు ఆకర్షించబడి, వశపడిపోయి, ఈ ఒకే ఒక్క గాఢావేశం కోసం మానవ బాధ్యతలను, విధులను వదలివేస్తూ, క్రమానుగతంగా పెరుగుతూ తగ్గుతూ ఉండే దాని దశల యందలి సంయోగంలోని పరమ సుఖానికి, విరహ బాధలకు, శాశ్వతాపేక్షలకు మరియు పునః కలయికకు తొట్టతొలుత జనించిన కోరిక ద్వారా దైవం కోసం పయనించే మానవ ఆత్మ ప్రేమలీలను ప్రతీకగా చేసి వర్ణించింది.

CWSA 20:379

కృష్ణ
(ద్వైదీ)

ఓ అపార దివ్యప్రకాశమా, సత్యమా, ఓ ఆత్మ-విస్తారముతో
హద్దులు లేని మహాప్రదేశమా,
నాశములేని కరములతో, వైభవోపేతమైన ముఖముతో, నీ వెవ్వరిని ఆలింగనం
చేసికొని దాచావు, దాగి వున్నావు?
మహాప్రదేశము, మహాకాలము వ్యర్థముగా పడియున్నవి, "శూన్యము మేము,
ఎవ్వరు లేరు".
మహదాత్మ, మహద్విశ్వము కేకలిడుచు వ్యర్థముగా పెనుగులాడుచున్నవి, "నేను,
కేవలము నేను".
"ఏకమున్నదచట, మహదాత్మ యొక్క ఆత్మ, మహదాత్మ యొక్క
మహద్ ప్రదేశము, దివ్య జల ఊట యొక్క మహాకాలము,
దివ్య హృదయముల యొక్క హృదయము, మనస్సుల యొక్క మహా మనస్సులు,
కేవల మాయన యొక్కడే యుపస్థితుడై యున్నాడు, దివ్యత్వం, దివ్యంగా
ఓ శూన్యములేని నిరపేక్ష స్వయం-లీనమా, వైభవోపేతమా, నిశ్శబ్దమా,
కౌగలించు చేతులు పట్టు, ముద్దాడు ఎర్రని పెదవులూదు అయన వేణువును.
సమస్తమును ఆయన ప్రేమించు, సమస్తమును ఆయన కదలించు,
సమస్తము ఆయనవే, సమస్తము ఆయనే;
అనేక కరములు ఆయన చాపల్యమును సంతృప్తిపరచు, ఆయన మధుర
పారవశ్యమును భరించు
ద్వంద్వమేకంలో, ద్వైదీభేద మెరిగినవారు భావమందు సమృద్ధులు,
పరిష్వంగమునకు రెండు, అగుటకు నొక్కటి, ఇది యాతని అద్భుత రహస్యము.

CWSA 2:637

కృష్ణుడు దివ్య సహ ఆటగాడు

కృష్ణుడు, అంతస్థిత దైవం, ప్రతివారిలోను, అన్నింటిలోను ఉన్న దివ్యపురుషుడు. ఆయన కూడా సర్వోత్కృష్టంగా పరాత్పరుని దివ్యానంద, ప్రేమల అంశమే.

అతడు ఆయన దరహాస దయాళువు, క్రీడోల్లాసుడు. ఏకకాలంలో ఆటగాడు, ఆట, తనతో ఆడే సహ ఆటగాళ్ళు అతడే. అతడు ఆడే ఆ ఆట, దాని ఫలితాలు రెండు పూర్తిగా తెలిసినవీ, రూపకల్పన కావించినవీ, ఇచ్ఛగించినవీ, వ్యవస్థీకరించబడినవీ, వాటి ఎరుకతో సమగ్రంగా ఆడేవీ అవటం మూలంగా ఉండేదంతా క్రీడానందమే తప్ప మరొకటి ఉండే అవకాశమే లేదు. ఆ విధంగా కృష్ణుని చూడటమంటే అంతరంగ దైవాన్ని కనుగొనటమే, కృష్ణునితో ఆడటమంటే అంతరంగ దైవంలో తాదాత్మ్యం చెందడమే, ఆయన చైతన్యంలో పాలు పంచుకోవడమే. ఈ స్థితిని నీవు సాధించితే, నీవు తక్షణం దివ్యక్రీడలోని ఆనందంలోకి ప్రవేశిస్తావు; తాదాత్మ్యత ఎంత సంపూర్ణమైతే అంత ఎక్కువగా ఆ స్థితి పరిపూర్ణతను సంతరించుకుంటుంది.

కాని చైతన్యంలో ఎక్కడో ఒక మూల సర్వసాధారణమైన గ్రహణశక్తి, సర్వ సాధారణమైన అవగాహన, సర్వ సాధారణమైన ఇంద్రియ సంవేదన ఉండినట్లైతే, అప్పుడు నీవు ఇతరులు అనుభవించే కష్టాన్ని చూస్తావు, అటువంటి ఆటలో ప్రీతిని పొందే దైవం తప్పకుండా, ఘోరంగా చిత్రహింసలు పెట్టేవాడని నీవు అంతిమంగా తీర్పు నిస్తావు; కాని దానికి మారుగా, నీవు దైవంతో తాదాత్మ్యతానుభవాన్ని పొంది ఉంటే గనక, నీవు ఆయన అపారతను, ఆటలో ఆయన ఉంచే అద్భుతమైన ప్రేమను మరచిపోలేవు. మనది పరిమితమైన దృష్టి అవడం మూలంగా ఈ రకంగా న్యాయనిర్ణయం చేస్తున్నామని అప్పుడు నీ కర్థమౌతుంది. అంతేకాక ఐచ్ఛికంగా చిత్రహింసలకు లోనయ్యేవాడుగానే కాకుండా, ప్రపంచానికి మనుష్యులకు అత్యంత వేగవంతమైన దారుల ద్వారా పరిపూర్ణత వైపు పురోగమించేవారి అడుగులలో గొప్ప మేలు చేసే కారుణ్యంగానూ, ఆ పరిపూర్ణత కూడా, ఇంకా, ఎల్లప్పుడూ సాపేక్షమైనదిగా, ఎల్లప్పుడూ అధిగమించబడేదిగానూ తెలుస్తుంది. కాని ఈ పురోభి వృద్ధి కోసం ప్రేరేపణ చేసే ఈ బాధానుభవం ఇక ఎంత మాత్రమూ అవసరం లేని ఒక రోజు తప్పక వచ్చి తీరుతుంది, అప్పుడు పురోభివృద్ధి ఇంకా ఎక్కువెక్కువగా సామరస్యతలోను, ఆనందంలోను జరుగ గలదు.

CWM 10:51-52

దివ్యబాలుడు కృష్ణుడు

కృష్ణుడు ఏకకాలంలో సార్వజనీన విశ్వదైవానికి మరియు అంతస్థితదైవానికి ప్రాతినిధ్యం

వహించేవాడు, ఒకరెవరైనా ఆయనను తన అస్తిత్వం అంతరంగంలోను, అభివ్యక్తమైన ప్రపంచ మంతటిని ఏర్పరచేదాని నంతటిలోను కలుసుకొన గలిగివవాడు.

అతడు బాలుడుగానే ఎప్పుడూ ఎందుకు వర్ణించబడతాడో నీకు తెలుసా? అది ఎందువల్లనంటే, అతడు నిరంతర పురోగమనంలో ఉంటాడు. ప్రపంచం పరిపూర్ణ తను పొందేదాకా అతని ఆట కూడా పరిపూర్ణతను పొందుతూ ఉంటుంది — నిన్నటి ఆటే రేపటి ఆట ఎంత మాత్రం కాదు; ప్రపంచం ఆయన ఆటకు ప్రతిస్పందించ గలిగే సమర్థత పొందేవరకు, దైవంతో దానిని అనుభవించే వరకు, ఆయన ఆట ఎక్కువెక్కువగా సామరస్యంగా, అనుకూలంగా, సంతోషభరితంగా తయారవుతూనే ఉంటుంది.

*

గోలోకం సంపూర్ణంగా ఆధ్యాత్మిక కాంతులతో వెలిగిపోయే దివ్యప్రేమ, దివ్యసౌంద ర్యం, దివ్యానందాల ప్రపంచం. మనం వైకుంఠమును లేదా గోలోకమును ప్రతిదానిని దివ్యత్వంయొక్క ప్రపంచంగా, విష్ణువు లేదా కృష్ణులదిగా అనుకుంటే సహజంగానే మనం దాని స్థానాన్ని లేదా దాని మూలాన్ని ఊర్ధ్వమనస్సు అంతస్తులో అన్వేషించ మొదలుపెడతాం. ఊర్ధ్వమనస్సు దేవతలయొక్క అత్యున్నత ప్రపంచాల అంతస్తు. కాని వైకుంఠం, గోలోకం అనేవి మానవజాతికి అతీతమైన మానవ ఊహల అస్తిత్వ స్థితులు. గోలోకం దివ్యప్రేమ, దివ్యసౌందర్యం, దివ్యానందాల ప్రపంచం, సంపూర్ణంగా ఆధ్యాత్మిక కాంతులతో వెలుగు లీనేదనేది విశదమే (ఆవు ఆధ్యాత్మిక కాంతికి ప్రతీక), దానిలోని ఆత్మలు రక్షకులు లేదా వశంలో ఉంచుకున్నవారు, గోపాలురు, గోపికలు. దీని అభివ్యక్తతకు ఒక అంతస్తును ప్రత్యేకించవలసిన ఆవశ్యకత ఏమీ లేదు — యదార్థానికి దానిని ప్రతిబింబించటానికి లేదా దాని వశంలో ఉండటానికి లేదా దాని స్థితిగతుల ననుభవించటానికి ఏ చైతన్య అంతస్తు లోనైనా అవకాశం ఉంది — మానసికం, ప్రాణికం లేదా సూక్ష్మభౌతిక అంతస్తులోనైనా కూడా. అందువలన నీవు పేర్కొన్నటువంటి వివరణ మినహాయించబడ నక్కరలేదు, అది పూర్తిగా సాధ్యమే.
CWSA 28:140

కృష్ణునితో సహ ఆటగాడుగా ఉండాలంటే

వైవిధ్యమైన క్రీడతో కూడిన ఈ ప్రపంచం దాని ప్రాణులకు ఆనందాన్నిచ్చే ఉద్దేశంతో

సృష్టించబడింది. ఈ ఆనంద క్రీడ అంతం కావాలనేది భగవంతుని యొక్క ఉద్దేశం కాదు. ఈ ప్రపంచాన్ని ఆనందంతో ముంచెత్తడానికి అతడు ప్రాణులను తన కామ్రేడ్లుగా, సహ ఆటగాళ్ళుగా కావాలని కోరుకుంటున్నాడు. మనం అజ్ఞానాంధకారంలో ఉన్నాం; దానికి కారణం, ఆట సాగడానికి ప్రభువు తనను తాను దూరంగా ఉంచుకున్నాడు, ఆ విధంగా తనను తాను గుర్తించలేని విధంగా అస్పష్టతతో చుట్టివేసుకున్నాడు. ఎన్నో మార్గాలు ఆయన చేత స్థిరపరచ బడ్డాయి. వాటిని గనక అనుసరిస్తే అవి వారిని చీకటి నుంచి వెలుపలకు తీసుకువచ్చి, భగవంతుని బృందంలోకి చేరుస్తాయి. ఒకరి కెవరికైనా ఆట రుచించకపోతే, విశ్రాంతి తీసుకోదలచుకొంటే, భగవంతుడు అతడి కోరికను ఈడేరుస్తాడు. కాని ఒకరు గనక, ఆయన కోసం ఆయన మార్గాన్ని అనుసరిస్తే, అప్పుడు భగవంతుడు అతణ్ణి ఈ ప్రపంచంలో కాని, మరెక్కడైనా కాని అర్హుడైన తన సహ ఆటగాడుగా ఎంచుకుంటాడు. అర్జునుడు కృష్ణునికి అత్యంత ఇష్టమైన కామ్రేడ్ , సహ ఆటగాడు, కనుకనే అతడు గీత యొక్క పరమోత్కృష్ట రహస్యాన్ని బోధగా అందుకున్నాడు.

Sri Aurobindo, Bengali Writings, p. 84

భాగవతం, బృందావనాల నిజాలు

ప్రశ్న: భూమిపై కాక బృందావనం మరే చోటనైనా ఉందా?

సమా: ...దేవతల లోకంలో ఒక ఆదర్శవంతమైన, సామరస్యతతో కూడిన బృందావనం ఉంది, దానితో పోలిస్తే ప్రాపంచిక బృందావనం కేవలం వికృతం, వ్యంగ్యం.

ఎవరైతే అంతరంగంలో అభివృద్ధి చెందారో వారు వారి భావనలోగాని లేదా వారి మనస్సులోగాని కంటికి కనపడని ఈ వాస్తవాలను గ్రహించగలరు, వాటి నుంచి స్ఫూర్తిని అందుకోగలరు. కనుక భాగవత గ్రంథకర్త లేదా గ్రంథకర్తలు కచ్చితంగా ఒక అంతరంగ ప్రపంచం మొత్తంతో, అనగా సౌభాగ్యవంతమైన, నిజంగా వాస్తవంగా ఉన్నదానితో సంబంధం కలిగినవారై, వారక్కడ చూసి అనుభవించిన ప్రతిదానిని వర్ణించడం లేదా వెల్లడి చేయడం జరిగింది.

కృష్ణుడు మానవరూపంలో, భూమి మీద జీవిస్తూ ఉండటం జరిగిందా లేదా అనేది కేవలం చాలా అప్రధానమైన విషయం (బహుశా ప్రత్యేకించి చారిత్రక దృక్పథం ప్రకారంగానైతే తప్ప), ఎందువల్లనంటే కృష్ణుడు యదార్థం, సజీవం,

ప్రభావకారి అయిన అస్తిత్వం; ఆయన ప్రభావం భువి యొక్క పురోగతికి, పరివర్తనకు దోహదపడే గొప్ప విషయాలలో ఒకటి. అదే భాగవత పురాణంలో తెలుపబడిన శ్రీకృష్ణుని కథ.

CWM 10:60-61

దైవం మానవజాతితో వ్యవహరించే తీరు

...మహాభారతగాథలో వెనుకనున్న మానవుడైన కృష్ణుని పాత్రకు, ఒక విలక్షణమైన, చాలా మటుకు ప్రతీకగా ప్రాధాన్యత ఉంది. అది మహానాయకుడుగా కాదు, కాని దాని నిగూఢ కేంద్రంగా, మరుగున ఉన్న మార్గదర్శకుడుగా. అందులో ఆయన కొనసాగించిన కార్యం మొత్తం ప్రపంచం యొక్క మనుజుల, దేశాల కార్యం. అందులో కొంతమంది ఒక విశేష ప్రయత్నానికి, వ్యక్తిగతంగా వారికి లాభపడని ఫలితానికి సహాయకులుగా వచ్చారు. అటువంటి వారికి అయన నాయకుడు, కొంత మంది దానికి ప్రత్యర్థులుగా వచ్చారు, అటువంటి వారికి ఆయన సైతం ప్రత్యర్థే, వారి పథకాలను చిత్తు చేసేవాడు, వారిని దునుమాడేవాడు. ఇంకా కొంతమందికి దుష్టత్వమంతటిని ప్రేరేపించేవాడుగానే కాక పురాతనమైన వారి క్రమ వ్యవస్థను, వారి సుపరిచిత ప్రపంచాన్ని నాశనం చేసి, విశిష్టమై ఉత్తమైనటువంటి భద్రమైన లోకాచారాలను సమకూర్చేవాడుగా కనిపించేవాడు. అందులో కొంతమంది సుసం పన్నం కావలసినవాటికి ప్రతినిధులు, అటువంటివారికి సలహా నొసగేవాడు, సహాయకుడు, స్నేహితుడు. ఎక్కడైతే కార్యసరళి సహజమైన మార్గాన్ని అనుసరిస్తుందో లేదా కార్యశీలురు వారి శత్రువుల చేతిలో కష్టాల బారిన పడవలసి ఉండి, ఆధిపత్యశక్తిని పొందడానికి సంసిద్ధులను చేసే విషమ పరీక్షలను వారు సహించవలసి వస్తుందో, అటువంటప్పుడు అవతారమూర్తి, అగోచరుడు లేదా ప్రత్యేక సందర్భాలలో అవసరమైన ఓదార్పుకు, సహాయానికి మాత్రమే కనిపించువాడు, కాని ప్రతి సంక్లిష్ట పరిస్థితిలో ఆయన హస్తం కనపడేది. అందరూ, తమను తాము ఆచారాలను సమర్థించే వారుగా ఊహించుకొనేవారైనప్పటికీ అతని సన్నిహిత స్నేహితుడు, ప్రధాన పనిముట్టు, అర్జునుడు సైతం, తాను ఉపకరణమన్న సంగతిని గ్రహించలేకపోయాడు; చిట్టచివరికి ఇంత కాలంగా తన దివ్య స్నేహితుని నిజంగా తెలుసుకోలేక పోయానని వాపోయాడు. అతడు ఆయన వివేకవంతమైన సూక్ష్మబుద్ధి నుంచి సలహాను పొందాడు, ఆయన

అధిపత్యశక్తి నుంచి సహాయం పొందాడు, తాను ప్రేమించాడు, ప్రేమించబడ్డాడు. ఆయన దివ్యప్రకృతిని అర్థం చేసుకోలేకపోయినా కూడా ఆరాధించాడు; కాని అందరి వలెనే స్వయం అతని స్వార్థపూరిత అహం ద్వారానే అతడికి మార్గదర్శనం ఇవ్వడం జరిగింది. అతడికి సలహాను, సహాయమును, నిర్దేశనమును మహా అజ్ఞాన పరిభాషలోనే ఇవ్వటమూ, వాటిని అజ్ఞాన తలంపులతో అతడు గ్రహించడమూ జరిగింది. కురుక్షేత్రంలో సమస్తమూ యుద్ధం అనే భయంకర స్థితికి నెట్టబడే క్షణం వరకూ, తాను ఎంచుకున్నవారికి సైతం ఆయన తనను తాను బహిర్గతం చేసుకోలేదు. చిట్టచివరికి ఆ అవతారమూర్తి తన దర్శనాన్ని అనుగ్రహించాడు, అప్పటికీ యోధుడిగా కాదు, కాని యుద్ధ భవితవ్యాన్ని ఏదైతే మోస్తున్నదో అటువంటి యుద్ధ-రథానికి సారథిగా మాత్రమే.

ఆ విధంగా శ్రీకృష్ణుడు దైవం మానవజాతితో వ్యవహరించే తీరుకు ప్రతీక అయినాడు.

CWSA 19:17-20

శ్రీకృష్ణార్జునుల సాహచర్యపు ప్రతీక

శ్రీకృష్ణార్జునుల సాహచర్యపు ప్రతీక, మానవ మరియు దివ్య ఆత్మలు భారతీయ ఆలోచనా స్రవంతిలో ఇతరత్రా ఇంద్రుడు, కుత్సుడు ఒకే రథంలో కూర్చున్నట్లుగా, ఉపనిషత్తులో జంటపక్షులు ఒకే చెట్టు మీద కూర్చున్న ఉపమాలంకారంగా, జ్ఞానం కోసం నరనారాయణ రూపాలతో జంటగా తపస్సు చేసే ఋషులుగా వ్యక్తీకరించబడింది. మూడింటిలోనూ గీత చెప్తున్నట్లుగా, మన దృష్టికి ద్యోతకమయ్యే కర్మ సమస్తం దివ్యజ్ఞానంలో పరాకాష్ఠ నొందుతుందనే భావన కనపడుతుంది. ఇక్కడ కర్మ ఆ జ్ఞానానికి చేర్చడానికి బదులుగా దివ్య మహాజ్ఞాని తనకు తానుగా పాత్రను నిర్వహిస్తున్నాడు. ఈ మానవుడు, ఈ దైవము, అర్జునుడు, కృష్ణుడిగా కలసి ప్రశాంతమైన ఆశ్రమంలో ధ్యానం చేసే దివ్యజ్ఞానులుగా కాకుండా యుద్ధరంగమందు విసరబడతున్న బాణాల మధ్యన కోలాహలంతో కూడిన రణరంగంలో రథంపై ఒకరు, యోధుడిగా ఒకరు పగ్గాలు చేతబట్టినవానిగా నిలిచారు. కనుక గీతాచార్యుడు కేవలం మనిషిలో భగవంతుడు తనకు తానుగా జ్ఞానపరిభాషలో ఆవిష్కరించుకొనేవాడుగా మాత్రమే కాకుండా, ఎవరైతే మనిషిలో భగవంతుడిగా

మొత్తం ప్రపంచ కర్మను కదలింప జేస్తున్నాడో, ఎవరి ద్వారా, ఎవరి కోసం మన మొత్తం మానవజాతి మనుగడ సాగిస్తున్నదో, సంఘర్షిస్తున్నదో, ప్రరిశ్రమిస్తున్నదో, ఎవరి వైపు మానవజాతి మొత్తం పయనిస్తూ పురోభివృద్ధి నొందుతున్నదో ఆ దైవము. అతడే మన కర్మల, త్యాగాల రహస్య దివ్యప్రభువు, మానవ ప్రజానీకాల దివ్యస్నేహితుడు.

CWSA 19:17-20

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

శ్రీకృష్ణుని చారిత్రక వైశిష్ట్యత

భువిపై శ్రీకృష్ణుని ఉనికి, వాస్తవం

శ్రీకృష్ణుని చారిత్రక వైశిష్ట్యత తక్కువ ఆధ్యాత్మిక ప్రాముఖ్యత కలది, ముఖ్యమైనది కానప్పటికీ దానికి గణనీయమైన విలువ ఉంది. నాకు అనిపించటం లేదు శ్రీకృష్ణుడు ఒక కవితా సృష్టి, లేదా పౌరాణిక కల్పన కాదు అని అనడానికి సకారణ సందేహం ఉంటుందని. నిజానికి, శ్రీకృష్ణుడు భూమిపై ఉండి భారత గత చరిత్రలో తన పాత్ర పోషించాడు.

రెండు వాస్తవాలు స్పష్టంగా కనిపిస్తాయి; 1. శ్రీకృష్ణుడు ఒక గొప్ప ఆధ్యాత్మిక వ్యక్తిగా పరిగణించబడ్డాడు. అతని ఆధ్యాత్మిక ప్రతిభ ఒక ఉపనిషత్తులో ప్రస్తావించ బడింది.సాంప్రదాయికంగా అతనిని ఒక దివ్యపురుషునిగా భావించారు. మరణానంతరం ఒక దైవంగా పూజించారు. ఇది మహాభారతము, పురాణగాథలలో ప్రస్తావించబడిన దానికి తోడైనది. భారత ఆధ్యాత్మిక ప్రవాహంలో ఒక భాగమైన భాగవత మతాభివృద్ధికి శ్రీకృష్ణుని పేరుతో గల సంబంధం కేవలం ఒక కవితాసృష్టి లేదా పౌరాణిక కల్పనపై ఆధారపడి ఉన్నదనడానికి కారణం లేదు. మహాభారతం ఒక గొప్ప ప్రబంధం, చరిత్ర కాదు, కాని ఒక గొప్ప చారిత్రకాంశంపై నిర్మించబడిన ప్రబంధం. సంప్రదా యంగా ప్రజల జ్ఞాపకాలలో నిక్షిప్తమైనది. దీనితో సంబంధం ఉన్న కొన్ని పాత్రలు, ఉదాహరణకు, ధృతరాష్ట్రుడు, పరీక్షిత్తు, నిజంగా ఉండేవారు. శ్రీకృష్ణుడు నాయకునిగా, యోధునిగా, రాజనీతిజ్ఞుడిగా పోషించిన పాత్రలు

నిజంగా ఉండవచ్చని అంగీకరించవచ్చు. దీనికి సంప్రదాయబద్ధమైన చారిత్రక విలువ నీయవచ్చు. దీనిలో లేశమాత్రం కట్టుకథ కాని, కవితాకల్పన గాని లేదు. అందుచే, సిద్ధాంతపరంగా శ్రీకృష్ణుడు చారిత్రక వ్యక్తి అని నిస్సందేహంగా చెప్పవచ్చు. కాని, నా దృష్టిలో అంతకు మించిన దొకటి వున్నది. నేను ఎల్లప్పుడూ శ్రీకృష్ణుడు అవతారమనే విష యం వాస్తవమని నమ్మాను. జీసస్ చారిత్రకాంశం ఎట్టిదో, శ్రీకృష్ణుని చారిత్రకాంశం కూడ అట్టిదనే అంగీకరిస్తాను.

చారిత్రక శ్రీకృష్ణుని ఉనికి నిస్సందేహం.

చారిత్రక కృష్ణుడు నిస్సందేహంగా వున్నాడు. ఛాందోగ్యోపనిషత్తులో అతని పేరు మొదట ప్రస్తావించబడినపుడు ఆధ్యాత్మిక సాంప్రదాయంలో అతడు పర బ్రహ్మాన్ని తెలిసిన వ్యక్తిగా ప్రఖ్యాతి చెందాడు. అతని వ్యక్తిత్వము, జీవన పరిస్థితులు ఎంతగా ప్రఖ్యాతి చెందాయంటే అతడు తన తల్లి యగు దేవకికి నందనుడిగా అందరకు తెలియబడ్డాడు. అదే ఉపనిషత్తులో, విచిత్రవీర్యుని కుమారుడైన ధృతరాష్ట్రుని పేరు ప్రస్తావించబడింది. సంప్రదాయంలోను, మహాభారత కథనంలోను వారిరువురు ఎక్కువగా ప్రస్తావించబడడం వల్ల, వారు సమకాలీనులని భావించవచ్చు. ఈ పాత్రలతో కూడిన మహాభారత ప్రబంధం, దానిలోని కురుక్షేత్ర యుద్ధం మానవజాతి జ్ఞాపకాలలో చెరగని ముద్ర వేశాయి. క్రీస్తు పూర్వ శతాబ్దాలలో, శ్రీకృష్ణుడిని, అర్జునుడిని మతపరంగా పూజించేవారు. ఈ కారణాల చేత, మతపరమైన, వేదాంత పరమైన సంప్రదాయంలో గీతలో చాలా అంశాలు దీని నుండి పోగుచేయబడి ఉండవచ్చు. జ్ఞాన, కర్మ, భక్తి యోగాలు, వాటి పునాదులు మానవ దేహధారి శ్రీకృష్ణునిచే బోధింపబడి ఉండవచ్చు. ఈ విషయాలలో శ్రీకృష్ణుడు మొదటి బోధకుడు లేదా ఆద్యపురుషుడు కావచ్చు. గీత శ్రీకృష్ణుడు బోధించిన భారతీయ వేదాంత ధోరణికి ప్రతీక. శ్రీకృష్ణ ప్రబోధిత గీతా తత్వానికి చారిత్రక శ్రీకృష్ణుడితోను, అర్జునుడితోను, కురుక్షేత్ర యుద్ధంతోను గల సంబంధం కేవలం నాటకీయ కల్పనను మించినది.

మహాభారతంలో శ్రీకృష్ణుడు చారిత్రక పాత్రధారి గాను, అవతారంగాను చిత్రించబడ్డాడు. అప్పటికే క్రీస్తు పూర్వం 5 వ శతాబ్దం, ఒకటవ శతాబ్దం మధ్యకాలం నాటికే, శ్రీకృష్ణుని ఆరాధన, అవతార తత్వం, ప్రజలలో వ్యవస్థీకృతమై ఉండవచ్చు.

ప్రస్తుత మహాభారత ప్రబంధ ఛాయలు ఆ కాలంలోనే రూపుదిద్దుకొని ఉండొచ్చు. ఈ ప్రబంధంలోనే, బృందావనంలో అవతారమూర్తి చిన్ననాటి చరిత్ర సూచించబడింది. ఈ జీవిత విశేషాలే గొప్ప శక్తివంతమైన ఆధ్యాత్మిక చిహ్నాలుగా పురాణాలలో అతిశయించబడి ఉంటాయి. 'హరివంశం' లో కూడా శ్రీకృష్ణుని జీవిత విశేషాలు ప్రస్తావించబడ్డాయి. ఇవన్నీ పరంపరాగత ఆధ్యాత్మిక చిహ్నాలుగా గొప్ప ప్రభావం చూపాయి. ఇవే అంశాలు పురాణ కథనాలకు మూలమయి వుంటాయి.

బృందావనం, గోకులం, గోపికలు — వారి లీల

బృందావనం కథ వేరే విషయం. మహాభారత కథలో దీని ప్రస్తావన లేదు. దీని మూలం పౌరాణికం. ఒక సంకేతాత్మకంగా సమాచారం తెలుపుటకు ఉద్దేశించ బడింది. ఓ సమయంలో ఇలానే అనుకున్నాను. తరువాత ఆ భావన వదిలిపెట్టాను. ఈ విధంగా పెడదారి పట్టించేదేదీ పురాణాలలో లేదు. నా కేమనిపిస్తుందంటే, ఇది ఎక్కడో వాస్తవంగా జరిగిన విషయం లేదా ఎక్కడో జరగబోతోందనడానికి సూచన. ఈ దృష్టిలో గోపికలు చిహ్నాలు కాదు, నిజాలు. చిహ్నాలు, గుప్తసత్యాలు ఒకటి కాదు. చిహ్నాలు మానసిక కల్పనలు లేదా వినోద కల్పనలు, కాని గుప్త విష యాలు వాస్తవాలు. ఎక్కడో జరిగే వాస్తవాలు — భూలోక జీవితానికి నిజం కావచ్చు, ప్రభావం చూపొచ్చు.

గోపికల లీలలు దివ్యమైన గోకులంలో సదా చోటు చేసుకునే విషయాలు. అవే ప్రాపంచికమైన బృందావనంలో భవిష్యత్తులో కూడా జరుగుతాయి; వాటి అర్థం అంతరాత్మలో వాస్తవం చేయబడుతుంది. భువిలో చోటు చేసుకున్న శ్రీకృష్ణావతార ఘట్టంలో పురాణ రచయితలు ఇది వాస్తవంగా జరిగినట్లుగా భావించి వ్రాసారని ఊహిస్తాను. భారతదేశ ఆధ్యాత్మిక భావనలో ఆ విధంగానే ముద్ర పడింది.

అంతరంగ సంపర్కం అధిక ప్రాముఖ్యత గలది

ఈ విషయాలకు సంబంధించి రేకెత్తిన ప్రశ్నలకు, ఊహాగానాలకు ఆధ్యాత్మిక జీవితంతో ఆవశ్యకమైన సంబంధమేమీ లేదు. ఇక్కడ ప్రధానమైన విషయమేమిటనగా శ్రీకృష్ణునితో సంబంధం నెలకొనాలి. శ్రీకృష్ణచైతన్యం దిశగా ఎదగాలి, అతని సాన్నిధ్యం పొందాలి, అతనితో ఆత్మానుబంధం ఏర్పడాలి, ఆధ్యాత్మిక సంపర్కం ఏర్పడాలి. అది

పొందేవరకు, ఆకాంక్ష, భక్తిలో ఎదుగుదల, ఈ దారిలో పొందగలిగినంత వెలుగు లేదా జ్ఞానం సాధించాలి. ఇవి పొందిన వ్యక్తికి, వాటి సామీప్యంలో జీవించినవారికి, శ్రీకృష్ణుని వాణి విన్నవారికి, శ్రీకృష్ణుని ఒక స్నేహితునిగా, ప్రేమికునిగా, మార్గ దర్శిగా, ఆచార్యునిగా, గురువుగా గుర్తించినవారికి, అన్నింటికి మించి కృష్ణస్పర్శ వల్ల తమ చైతన్యమంతా మార్పుచెందినవారికి, తమలోనే 'అతని' ఉనికిని పొందిన వారికి, లేదా, ఆ అనుభూతి పొందినవారికి, ఇటువంటి ప్రశ్నలు, ఊహాగానాలు, కేవలం బాహ్యవినోదం కొరకు మాత్రమే.

అదే విధంగా, తన అంతరంగంలోనే గల బృందావనంతో, గోపికలతో, వారి లీలలతో, వాటి అందము, ఆనందం అనుభూతి చెంది వేణునాదం విన్నవారికి ఇతరమైనవేవీ పట్టవు.

కాని, వేరొక దృక్పథంలో, కృష్ణావతార చారిత్రిక సత్యాన్ని అంగీకరించ గలి గిన వారికి, గొప్ప ఆధ్యాత్మిక లాభం ఉంటుంది. పరిణామం చెందుతున్నప్పటికీ, ఇంకా ఎంతో అపరిపక్వంగా ఉన్న భూమిని కనీసం ఒక మారు దైవం తన దివ్య ప్రకృతితితో స్పృశించాడని, దానిపై తన సంపూర్ణ అవతరణ సాధ్యమని చూపాడని నిశ్చయమైన నమ్మకం ఉన్నవారికి ఇంకా స్పష్టమైన ఉన్నత ఆధ్యాత్మిక శిఖరాలు పొందగల అవకాశం ఉంటుది.

CWSA 28:482-84

బాహ్య విషయాలు అప్రధానం

అవతార తత్వం ఆ విధంగా అర్థం చేసుకున్నపుడు మనం ప్రస్తుతం చర్చిస్తున్న గీతయొక్క ప్రధాన బోధలకు గాని లేక ఆధ్యాత్మిక జీవనానికి గాని, బాహ్య విషయాలు అప్రధానం. క్రీస్తుయొక్క చారిత్రకత వంటి వానిపై యూరపులో చెలరేగిన వివాదాలు భారతీయ ఆధ్యాత్మిక బుద్ధికి వృధా కాలయాపన అనిపిస్తుంది. వాటికి కొంత చారిత్రక ప్రాధాన్యత ఉన్నట్లు అంగీకరిస్తాము, కాని మతపరమైన ప్రాధాన్యత నీయము. ఎందుకంటే, జీసస్, జోసఫ్ అనే వడ్రంగి కుమారుడు, నజరత్ లో పుట్టితేనేమి, బెత్లహేమ్‌లో పుట్టితేనేమి, ఎక్కడో నివసించి పాలకులపై నిరసన చూపే బోధలు చేసాడనే కల్పిత నేరంపై శిలువ వేయబడితేనేమి, కాకపోతేనేమి, ఆధ్యాత్మికానుభవం ద్వారా అంతరంగంలో క్రీస్తును తెలుసుకోగలిగినపుడు అతని బోధల కాంతిలో ఉన్నతంగా

జీవించగల్గినపుడు, దేవుని ఎదుట ప్రాయశ్చిత్తం చేసుకోడం ద్వారా, ప్రకృతి నియమాల పాశం నుండి తప్పించుకో గలిగినపుడు, (క్రీస్తు శిలువ దీనికి చిహ్నం) మన ఆధ్యాత్మిక సత్తాలో దేవునిచే సృష్టించబడ్డ క్రీస్తు నివసిస్తున్నపుడు, మేరీ కుమారుడైన క్రీస్తు కష్టాలు పడి, భౌతికంగా జీవించి జూడియాలో చనిపోయాడా లేదా అనే విషయం అప్రస్తుతం. అదే విధంగా శ్రీకృష్ణుడు శాశ్వత దైవం యొక్క మానవావతారమా లేక మానవజాతి చారిత్రక బోధకుడా, నాయకుడా అనే విషయం అప్రస్తుతం.

అందుచే గీతాబోధ సారాంశాన్ని అన్వేషిస్తున్నప్పుడు, దేనిని మాత్రమే అత్యవసరంగా పట్టించుకోవాలంటే మహాభారతంలో, కురుక్షేత్ర యుద్ధరంగంలో అర్జునుని బోధకుడు, మానవరూప దైవం, అయిన కృష్ణుని ఆధ్యాత్మిక ప్రాముఖ్యతనేగాని ఇతర విషయములను కాదు.

CWSA 19:15

అనువాదం: యస్. వై. సోమయాజులు

శ్రీకృష్ణుడు అవతార పురుషుడు

అవతరణలోని అంతరార్థము, ప్రయోజనము

దైవ సాక్షాత్కారమును గురించి ఆలోచించునపుడు అందరూ అది సర్వసాధారణమగు మానవ ఆచార వ్యవహారాల నిర్వహణలో ఒక అసాధారణ పరిపూర్ణత కనబరచటం అని ఊహిస్తారు — ఒక అసామాన్య వ్యవహార శైలి అని, రాజకీయ చతురత, కవితాత్మక లేక కళాత్మక నైపుణ్యత, సునిశిత జ్ఞాపకశక్తి, భౌద్ధిక పరమగు పొరపాట్లకు తావివ్వక పోవుట, ఓటిమికి గాని వైఫల్యానికి గాని లోను గాకపోవుట లాంటివి; లేదా వారి ఆలోచనల్లో మెదిలేది నేను అసలు ఆహారం తీసుకోనని ఊహించటం లేక రోజూ వారీ బొంబాయి కాటన్ మార్కెట్టు షేర్ల విలువలు వారికి తెలియపరచటం లాంటివి; ఇనుపమేకులపై శయనించుట, లేక వాటిని భక్షించుట లాంటి మానవాతీత చర్యలు చేసేవారంతా యోగులు అనుకోవటం. అటువంటి లక్షణాలకు, చర్యలకు దైవసాక్షాత్కారంతో ఎలాంటి సంబంధమూ లేదు.

ఆ విధంగా ఆలోచించినట్లయితే, మాయలేడిని ఒక సాధారణ లేడిగా తలచి

వెంబడించినందున శ్రీరాముడు సైతం దైవం కానేరడు. అదే విధంగా జరాసంధుని దాడి తట్టుకోలేక ద్వారకలో తలదాచుకున్న శ్రీకృష్ణుడు కూడా దైవం కానేరడు. ఈ విధమైన మానవసహజ ఊహాగానాలు నమ్మదగినవి కావు. దివ్యత్వం పనిచేసే తీరు పూర్తిగా వేరొక చేతనావస్థను అనుసరించి వుంటుంది — ఊర్ధ్వ మందున్న పరమసత్య చేతన మరియు పృధ్వీగతమైన దివ్యలీల. దాని కార్యాచరణ కూడా ఆ దివ్యలీల అవసరాని కనుగుణంగా నుంటుంది గాని మానవుల ఆలోచనా సరళి కనుగుణంగా ఏమి చేయాలో, చేయకూడదో నన్న విధంగా కాదు. ఇది ప్రధానంగా అర్థం చేసుకోవలసిన విషయం; లేనట్లయితే దైవసాక్షాత్కారం గురించి ఎవరూ ఏమీ తెలుసుకోలేరు.

CWSA 28:474-75

శ్రీకృష్ణావతారంలోని అనేక కోణాలు

శ్రీకృష్ణుడు ఒక అవతారం. వారు మానవాకృతిని ధరించి, మానవ శారీరక, మానసిక, స్వాభావిక ధర్మాలను అనుసరించి అందు కనుగుణంగా తమ లీలామానుషకేళీ హేలను కొనసాగించారు. ఆ విన్యాసంయొక్క అసలైన అతీంద్రియ తత్వాన్ని తెలుసుకోగలిగితే ఈ విశ్వగత క్రీడయొక్క అర్థాన్ని, లక్ష్యాన్ని, విధానాన్ని తెలుసుకో గలుగుతాము.

ఈ మహాద్భుత క్రీడావిన్యాసంలోని విశిష్ట లక్షణం ఏమిటనగా అది సమగ్ర, సంపూర్ణ, విజ్ఞాన ప్రేరణతో ఉపక్రమించబడిన కార్యక్రమం. అట్టి దాని విశ్వాసం, దాని కార్యక్రమానికి ఆధారభూతమైన జ్ఞానం ఏమిటో భగవద్గీతలో వెల్లడించబడింది.

మహాభారతంలో శ్రీకృష్ణుని పాత్ర ఒక క్రియాశీలుడైన నాయకుడు, ఒక మహా యోగి, ప్రాపంచిక జ్ఞానం మూర్తీభవించిన మహామనీషి పాత్ర; ఒక సామ్రాజ్య స్థాపకుడు, ఒక రాజనీతి విశారదుడు, ఒక మహావీరుడు, క్షత్రియ దేహధారియగు బ్రహ్మజ్ఞాని పాత్ర. అతని జీవితంలో మన మొక సాటిలేని సాక్షాత్కార వైభవాన్ని, మహోత్కృష్టమైన దైవశక్తి, మహాశక్తుల మానవాతీత మహాద్భుత క్రీడాకలాపాన్ని గమనిస్తాము.

అట్టి మావవాతీత, మహాద్భుత రహస్యానికి భగవద్గీత ఒక నిర్దిష్ట నిర్వచనము.

శ్రీకృష్ణుడు ముల్లోకాలకు ప్రభువు. విశ్వగతుడగు వాసుదేవుడైనప్పటికీ తన

మహత్వాన్ని మరుగుపరచి, మనుషులతో పుత్ర, భ్రాతృ, భర్త, మిత్ర, సన్నిహిత, సహచర, శత్రువు లాంటి సంబంధాలను నెలకొల్పుకొని తన క్రీడాకలాపాన్ని సాగించటానికి ఉపక్రమించాడు. ఆతని జీవితంలో పరమోత్కృష్టమైన ఆర్య విజ్ఞాన సంపదయొక్క రహస్యము, భక్తిమార్గముయొక్క విశిష్ట అంతర్భావము ఇమిడి వున్నాయి. వాటి సారభూత సూత్రాలు కూడా భగవద్గీత బోధనలో భాగాలే.

శ్రీకృష్ణ సాక్షాత్కారం ద్వాపర, కలియుగాల సంధికాల మందు జరిగింది. కల్పము పునరావృతమయ్యే సందర్భాలలో, పరిణామ ప్రక్రియ చక్రగతుల ననుసరించి భగవంతుడు పరిపూర్ణంగా అవతరిస్తాడు. చాతుర్యుగాలలోకి కలియుగము అతి శ్రేష్టమైనదే కాక అతి నికృష్టమైనది కూడా. ఈ యుగం కలిపురుష ప్రభావితమైన పాలనా కాలం. కలిపురుషుడు పాపభూయిష్టమగు కర్మానుష్ఠానాన్ని ప్రేరేపిస్తాడు. అతడు మానవుని పురోభివృద్ధికి ఆగర్భ శత్రువు. మానవజీవితం పరమ భ్రష్టుత్వం, అధఃపతనం, కలి ఏలుబడి కాలంలోనే సంభవిస్తాయి. అయితే మానవులకు అట్టి ఆటంకాలను ఎదురొడ్డి పోరాడే శక్తి పెంపొందుతుంది, పూర్వసృష్టి అంతమై నూతన సృష్ట్యారంభం జరుగుతుంది. ఈ పరిణామం కలి కాలమందు కూడా కొనసాగుతుంది. సృష్టి పరిణామ క్రమంలో సమూలంగా అంతమొందే హానికారక మూలశక్తులు, అమితమైన అభివృద్ధి చోటుచేసుకోవటం మూలంగా, కచ్చితంగా నిర్మూలించబడతాయి. మరో దిశగా, నూతన సృష్టి బీజాలు నాటబడి మొలకెత్తుతాయి; ఈ బీజాలు కలియుగ మంతరించుటతో ఆవిర్భవించే సత్యయుగంలో వృక్షాలుగా ఎదుగుతాయి.

Bengali Writings, p. 95

శ్రీఅరవిందులు

శ్రీకృష్ణుని రాజీకయ లక్ష్యం

ఐక్యత, ధర్మబద్ధమైన పాలన లేక సామ్రాజ్య వ్యవస్థ ప్రతిష్ఠాపన శ్రీకృష్ణుని రాజకీయ లక్ష్యం. మగధ రాజగు జరాసంధుడు అట్టి ప్రయత్నం అదివరలోనే చేసినప్పటికీ, అతని బలం ప్రజాకంటకమైనందున, అధర్మవర్తనపై ఆధారపడినందున, చిరకాలం నిలువలేదు. అందువలన శ్రీకృష్ణుడు భీముని చేత జరాసంధుని వధింప జేసి ఆ ప్రయత్నం భంగపరిచాడు. అయితే, శ్రీకృష్ణుని లక్ష్యసాధనకు గర్వాంధులు,

శక్తిమంతులు అగు కురువంశీయులు ప్రధానమైన అడ్డంకిగా నిలిచారు. కౌరవులు చాలా కాలంగా భారతదేశపు ప్రముఖ పాలకు లందరిలోకి అధిక ప్రాధాన్యత గలవారిలో ముఖ్యులు. సమానస్థాయి గల స్వతంత్ర రాజులలో ఉన్నతమైన నాయకత్వ స్థాయి వారికి వంశపారంపర్య హక్కుగా సంక్రమించింది — ఒక నిరంకుశ ఆధిపత్యాధికారం. వారి గర్వాహంకారాలు, శక్తిసామర్థ్యాలు చెక్కు చెదరనంత కాలం, భారతదేశమందు ఐక్యతను స్థాపించుట అసాధ్యమని శ్రీకృష్ణునికి అర్థమయింది. అందుచేత కురువంశ నిర్మూలనకు కృతనిశ్చయు డయినాడు. అయితే భారత సామ్రాజ్యాధిపత్యానికి కురువంశీయులకు వారసత్వ హక్కు వున్నది. ఈ విషయాన్ని శ్రీకృష్ణుడు విస్మరించ లేదు. అనువంశికంగా సంక్రమించిన హక్కును హక్కుదారునికి దక్కనీయకపోవటం అధర్మ కార్యమవుతుంది గనుక భావి సామ్రాట్టుగా, న్యాయబద్ధంగాను, కురువంశ పెద్దగాను హక్కుదారుడైన యుధిష్ఠురుని నియమించుటకు యెన్నుకున్నాడు.

శ్రీకృష్ణుడు పరమోత్కృష్ట ధర్మశీల సంపన్నుడు

శ్రీకృష్ణుడు పరమోత్కృష్ట ధర్మశీలత గలవాడు. తనకు అత్యంత ప్రీతిపాత్రులగు యాదవులకు కౌరవ వంశస్థుల స్థానే రాజ్యాధికారం కట్టబెట్టగల సమర్థత గలవాడైనప్పటికీ, అట్టి ప్రయత్నానికి ఒడిగట్టలేదు. అర్జునుడు తనకు అత్యంత ప్రియమిత్రుడైనప్పటికీ పాండవాగ్రజుడగు యుధిష్టరుని హక్కును కాలదన్ని అర్జునుడికి ఆధిపత్యం అంట గట్టలేదు. అయితే, కేవలం వయస్సునుగానీ, హక్కుభుక్తాన్ని గాని ఆధిపత్య స్థానానికి అర్హతగా పరిగణించుటలో హాని కలిగే ప్రమాదమున్నది. యుధిష్టురుడు అధర్మవర్తనుడు, ప్రజాకంటకుడు, లేక అసమర్థుడు అయివుంటే, తప్పక మరొకరిని రాజుగా ఎన్నుకొని వుండేవాడు. జన్మతః, వారసత్వ హక్కుదారుడిగా, దేశంలో పాటించబడుతున్న సాంప్రదాయా నన్నుసరించి, తగిన లక్షణాలు గలవాడిగా యుధిష్టురుడు ఆ హోదాకు తగిన అర్హత గలవాడు. అతని కన్నా అధిక నాయకత్వ లక్షణాలుగల, అధిక శక్తిశీలురైన, అధిక సమర్థతగల రాజు లెందరో వున్నప్పటికీ, కేవలం శక్తిసామర్థ్యాలు మాత్రమే రాజ్యాధినేత పదవికి అర్హత కలిగించలేవు. రాజు అయినవాడు ధర్మబద్ధమైన పాలనకు భద్రత కల్పించాలి, రాజప్రతినిధులను, ప్రజలను సంతృప్తులుగా నుంచాలి, దేశానికి రక్షణ నీయగలగాలి. ఈ మూడు లక్షణాలలో, మొదటి రెండింటిలో యుధిష్టురునికి సమానమైనవాడు వేరొకడు లేడు; అతడు

ధర్మదేవత పుత్రుడు, దయాదాక్షిణ్యాలు, ధర్మనిరతి గలవాడు, సత్యావాక్పరిపాలకుడు, సత్యసంధుడు, సత్యకార్య తత్పరుడు. తన ప్రజలకు అత్యంత ప్రీతిపాత్రుడు. అర్హతకు అవసరమైన చివరి లక్షణంలో లోటు ఏమైనా వున్నా దానిని వీరోచితులగు ఆతని సహోదరులు భీమార్జునులు తీర్చగల సమర్ధులు. అప్పటి సమకాలిక భారతావనిలో పంచపాండవు లంతటి శక్తిసంపన్నులు, వీరోచితులగు రాజులు లేరు. అందువలన ఒక్కసారి జరాసంధుడి వధతో ఆటంకము తీరిపోగానే, శ్రీకృష్ణుని సలహా మేరకు, యుధిష్టర మహారాజు రాజసూయ యాగాన్ని పురాతన సాంప్రదాయానుసారం ఆచరించి సార్వభౌము డైనాడు.

శ్రీకృష్ణుడు ఆరితేరిన రాజనీతిజ్ఞుడు

శ్రీకృష్ణుడు ఎంతటి ధర్మశీలత గలవాడో అంతటి రాజనీతిజ్ఞుడు. ఒక సాంప్రదాయ బద్ధమైన విధానంగాని, నియమం గాని లోపభూయిష్టము, హానికారకము, అవసరాలకు సమయానుకూలంగా సానుకూలమైనది కాదని తోచినప్పుడు, దానిని మార్పు చేయుటకు వెనుకాడేవాడు కాడు. దేశకాల పరిస్థితుల కనుగుణంగా ఆచారవ్యవహారాలను మార్చగల ప్రధాన సంస్కర్త. పాత విధానాలకు కట్టుబడిన పూర్వాచార పరాయణుడి దృష్టిలో ఒక వినూత్న సాహసానికి పాల్పడటమే ఒక మహా పాపము. యుధిష్టురుడి పతనంతో శ్రీకృష్ణుడికి తెలిసివచ్చింది, తెలియడం కాదు, మొదటి నుండి అతనికి తెలుసు, ఎందుకనగా అతడు దైవం కనుక —ద్వాపరయుగానికి సరిపడు ఆచార వ్యవహార శైలి యధాతథంగా కలికాలంలో పాటించబడ కూడదు అని. అందువలన అతడు తన భావి ప్రయత్నాలను ఆ మార్గంలో కొనసాగించ లేదు. కలి కాలానికి అనువైన రాజతంత్ర మేదైతే యుద్ధము, సంక్షోభంలాంటి వాటికి ప్రాధాన్యత నిస్తుందో దాని ననుసరించాడు. భవిష్యత్తులో సామ్రాజ్య పురోగతిని నిరాటంకం గావించుటకు గర్వాహంకారంతో మత్తెక్కిన కౌరవజాతి శక్తిసామర్థ్యాలను నిర్వీర్యం గావించాడు. కౌరవులకు అనాదిగా ప్రత్యర్థులు, సమాన శక్తిమంతులు అగు పాంచాలదేశ రాజులను కౌరవులను నిర్మూలించుటకు ప్రేరేపించాడు. కౌరవులపై పగతో రగులుతున్న ఇతర రాజ్యాధిపతులను యుధిష్టురునిపై ప్రేమతోనో లేక ధర్మసంస్థాపన పైన, ఐక్యతపైన గల ఇష్టంతోనో పాండవ పక్షాన చేరటానికి ఆకర్షితులను చేసాడు. యుద్ధానికి కావలసిన ప్రాథమిక ఏర్పాట్లను గావించాడు. శాంతి సమకూరదని, ఒక

వేళ ప్రాప్తించినా ఎంతో కాలం నిలువదని శ్రీకృష్ణునికి తెలుసు. అయినప్పటికీ, ధర్మమార్గాను సరణపై గల గౌరవంతో, రాజనీతిని సక్రమంగా పాటించాలనే అభిలాషతో శాంతిస్థాపన ప్రయత్నాలను అంకితభావంతో చేపట్టాడు.

కురుక్షేత్ర సంగ్రామం

కురుక్షేత్ర సంగ్రామం శ్రీకృష్ణుడు అనుసరించిన రాజనీతి వలన సంభవించిన పరిణామం అని నిస్సందేహంగా చెప్పవచ్చు. అతని లక్ష్యాలు కౌరవులను అంతమొందించడం, క్షత్రియుల అధికారాన్ని అంతమొందించట, ఒక నిర్వివాద సామ్రాజ్యాధిపత్యం మరియు భారతదేశ ఏకతను ప్రతిష్ఠించటం. ధర్మబద్ధమైన పరిపాలనా వ్యవస్థను స్థాపించుటకై చేసిన యుద్ధం న్యాయసమ్మతమైనది. ఆ న్యాయబద్ధమైన పోరాటంలో దైవ నియుక్తమైన విజేత వీరాధి వీరుడైన అర్జునుడు. అతడు దైవశక్తితో ఉద్యమించాడు. అర్జునుడు గనుక అస్త్రసన్యాసం గావించి వుంటే శ్రీకృష్ణుడు పడ్డ శ్రమ అంతా వృధా ప్రయాస అయ్యేది, భారతదేశ ఏకత సిద్ధించేది కాదు, దేశ భవిష్యత్తుకు ఒక తీవ్ర దుష్పరిణామం త్వరలోనే దాపురించేది.

మహాభారత కాలం

మహాభారత కాలంలో అవని అంతా అమానుషమైన ఆసురికశక్తి భారంతో కుంగిపోతూ ఉండింది. అంతకు పూర్వంగాని, తదుపరిగాని అంతటి బలమైన, ఉగ్రతరమైన, శక్తివంతమైన క్షాత్ర ఆధిపత్య శక్తి విజృంభించి యుండలేదు, కాని అంతటి ఘోర భీకరశక్తి ఒక శుభ ప్రయోజనార్థం వినియోగించే అవకాశం లేశమాత్రం లేకుండింది. ఆ శక్తికి వాహికలుగా నున్నవారందరిలో ఆసురికప్రవృత్తి, స్వాతిశయం, గర్వాహంకారం, స్వార్థం, నిరంకుశత్వం నరనరాలలో నిండి వుండింది. శ్రీకృష్ణుడు ఈ ఆధిపత్యశక్తిని నిర్మూలించి, ధర్మస్థాపన చేయకపోయినట్లయితే పై నుదహరించిన దుష్ఫలితాలలో ఏదో ఒకటి తప్పక సంభవించి వుండేది. భారతదేశం అతి త్వరలోనే క్రూరులు, సంస్కారహీనులైనవారి చేతుల్లో పడి వుండేది. గుర్తించవలసిన విషయ మేమిటంటే కురుక్షేత్ర సంగ్రామం అయిదువేల సంవత్సరాల క్రితం చోటు చేసుకుంది; రెండు వేల సంవత్సరాలు గడిచిన తరువాత క్రూరాతిక్రూరులైన విదేశీయులు మొట్టమొదట సారి దాడి సలిపి సింధు నది ఆవల వద్దకు విజయవంతంగా చేరగలిగారు; ఆ

విధంగా అర్జునుడు నెలకొల్పిన ధర్మబద్ధమైన పాలన, భగవత్ప్రేరిత క్షాత్రశక్తి ప్రభావంతో దేశానికి రక్షణగా నిలిచింది. ఆ సమయంలో కూడా దేశంలో క్షాత్రశక్తి ఎంత ప్రబలంగా ప్రోగై వుండిందంటే, దానిలోని అతి స్వల్ప శాతం సైతం దేశాన్ని రెండువేల సంవత్సరాలు చైతన్యవంతంగా నుంచగలిగింది. ఆ క్షాత్రశక్తి బలంతోనే చంద్రగుప్తుడు, పుష్యమిత్రుడు, సముద్రగుప్తుడు, విక్రముడు, సంగ్రామసింహుడు, ప్రతాపుడు, రాజసింహుడు, ప్రతాపాదిత్యుడు, శివాజి లాంటి మహాపురుషులు దేశానికి దాపురించిన దురదృష్ట పరిస్థితులపై పోరాటం సాగించారు. ఈ మధ్యనే జరిగిన గుజరాత్ యుద్ధంలో మరియు లక్ష్మీబాయి చితిమంటలలో ఆ పోరాటజ్వాలల నుంచి వెలువడ్డ చివరి నిప్పురవ్వ ఆరిపోయింది. దానితో శ్రీకృష్ణుడి రాజకీయ విశ్వా సంయొక్క సత్ఫలితం, దాని విశిష్టత అంతరించాయి. ఆ కారణంగా భారతావనిని మరియు ప్రపంచాన్ని రక్షించటానికి మరొక్క పరిపూర్ణ దివ్యావతార ఆవశ్యకత ఏర్పడింది. ఆ దివ్యావతార ఆవిష్కరణ అంతమొందిన పరబ్రహ్మశక్తిని పునః ప్రజ్వలింప చేసింది. ఆ దివ్యశక్తి క్షాత్రశక్తిని సృష్టించింది. కురుక్షేత్ర రక్తాభిషేకంలో భారతదేశ క్షాత్రశక్తిని శ్రీకృష్ణుడు హరించలేదు. అందుకు విరుద్ధంగా అమానుషమైన అసురశక్తిని నిర్మూలించుటతో అతడు పరబ్రహ్మ శక్తిని, క్షాత్రశక్తిని రక్షించాడు....

భగవంతుడు భారతదేశాన్ని కురుక్షేత్రంలో రక్షించాడు

కలియుగంలో భారతదేశం పతనావస్థకు చేరిందన్న విషయం ఎవరూ కాదనలేరు. కానీ భగవంతుడు భువి పైకి దిగివచ్చింది పతనావస్థను కొనితేవడానికి కాదు, దైవావతార లక్ష్యాన్ని, పరమ ధర్మాన్ని, ప్రపంచాన్ని, మానవావళిని రక్షించడం కోసం. కలియుగంలో ప్రత్యేకంగా దైవం, తనను తాను ఒక పరిపూర్ణావతారంగా అభివ్యక్త పరచుకుంటాడు. కారణ మేమిటనగా కలియుగంలో మనిషి పతనమయ్యే ప్రమాదం అధికంగా నున్నది, అధర్మాచరణ అతి సహజంగా పెరిగే అవకాశమున్నది. అందువలన మానవజాతిని రక్షించుటకు, అధర్మాన్ని అంతమొందించుటకు, కలిపురుషుని మార్గాన్ని అడ్డుకోవడం ద్వారా న్యాయాన్ని, ధర్మాన్ని స్థాపించుటకు ఈ యుగంలో అవతారాలు మళ్ళీ మళ్ళీ పునరావృత మవుతుంటాయి. శ్రీకృష్ణుడి అవతారం నాటికే కలిప్రాభవం ప్రారంభమయ్యే సమయం ఆసన్నమయింది. ఆతని ఆగమన భయంతో కలిపురుషుడు తన రాజ్యంలోనే తాను కాలూనలేకపోయాడు.

దైవానుగ్రహం వల్లనే పరీక్షిత్తు కలిపురుషుని సార్వభౌమాధికారాన్ని ఆతని పాలనాకాలంలోనే అనుభవించనీయ లేదు. ప్రత్యామ్నాయంగా కలి పరిపాలనకు అయిదు గ్రామాలను అనుగ్రహించాడు. కలియుగారంభం నుండి మానవుడు కలిపుర ుషుల మధ్య ఒక భీకర పోరాటం చెలరేగింది; అది కలియుగాంతం వరకు కొనసాగు తుంటుంది. ఈ పోరాటం కొనసాగినంత కాలం నాయకులుగా, సహాయకులుగా పాత్రను పోషించటానికి తరచుగా దైవాంశలు దిగివస్తుంటాయి, దైవసాక్షాత్కారాలు జరుగుతుంటాయి. కలియుగారంభంలోనే దివ్యశక్తిని, దివ్యజ్ఞానాన్ని, దైవభక్తిని, నిష్కామ కార్యక్రమాలను చెక్కుచెదరకుండా నిలుపడానికి, అవి యుద్ధమందు ఉపకరించునట్లుగా బోధించుటకు, దైవం మానవాకృతిని దాల్చాడు. భారతదేశ భద్రతలోనే మానవజాతి బాగోగులు, అందుకై ఆకాంక్ష, అందుకు పునాది ఆధారపడి వుంటాయి. కురుక్షేత్రంలో దైవం భారతదేశానికి ఆ భద్రతను ప్రసాదించాడు. ఆ రక్తసంద్రంలో ఆ మహాపురుషుడు, లయకారకుడగు కాలపురుషుని రూపంలో ఒక నూతన ప్రపంచావిష్కరణ కేళీవిలాస ఆనందానుభూతిని పొందుట ప్రారంభించాడు.

Benagali Writings, pp. 139-50

శ్రీఅరవిందులు

ధర్మరక్షణ

శ్రీకృష్ణావతారం గురించి పౌరాణిక మరియు జనబాహుళ్య భావన ఏమిటనగా కౌరవుల అధర్మవర్తన ఏదైతే దుర్యోధనుడు మరియు అతని సహోదరులలో మూర్తీ భవించిందో అది భూమికి ఎంత భారంగా పరిణమించిందంటే, భూదేవి భగవంతుడిని దిగివచ్చి తన భారాన్ని తగ్గించమని ప్రార్థించవలసి వచ్చింది. ఆ ప్రకారం విష్ణుమూర్తి శ్రీకృష్ణునిగా అవతరించి దౌర్జన్యానికి గురి అయిన పాండవులకు విమోచన కలిగించి, అధర్మ వర్తనులగు కౌరవులను అంతమొందించాడు. ఇతః పూర్వం చోటు చేసుకున్న విష్ణ్వావతారాలకు గల కారణాలు కూడా అలాంటివే, ఉదాహరణకు, శ్రీరామావతారం రావణుని దురాగతాలను, పరశురామావతారం యుద్ధోన్మాదులగు రాచరిక వర్గీయులైన క్షత్రియుల అక్రమ, అరాచక కృత్యాలను, వామనావతారం దైత్యరాజగు బలి చక్ర వర్తి పాలనను అంతమొందించుటకు అనే అభిప్రాయం బహుళ వ్యాప్తి చెందింది. కానీ అవతారం యొక్క కేవల క్రియాశీల, నైతిక లేక రాజకీయ లక్ష్యం ఏదైతే

ప్రజాభిప్రాయ మరియు పౌరాణిక రంగును పులుముకుందో అది అవతారం యొక్క అసలు లక్ష్యం కాదు. అది దాని ఆధ్యాత్మిక అంశాన్ని పరిగణనలోకి తీసుకోదు. ఈ బాహ్య ప్రయోజనం మాత్రమే దాని సర్వస్వం అయితే, బుద్ధుడు, ఏసుక్రీస్తుల ఉద్యమ లక్ష్యం ఏదైతే దుష్కృత్యాలకు పాల్పడేవారిని నిర్మూలించి మంచివారిని రక్షించడం కాకుండా సర్వజనావళికి ఒక వినూత్న ఆధ్యాత్మిక సందేశాన్ని అందించి, వారంతా దివ్యత్వంలోకి ఎదిగి, ఆధ్యాత్మిక సిద్ధిని పొందగల ఒక నూతన ధర్మాన్ని బోధిస్తుందో, దానిని అవతార లక్ష్యం నుండి తొలగించవలసి వస్తుంది. ఆలా కాకుండా, ధర్మమనే పదానికి కేవలం మతపరమైన అర్థాన్ని ఆపాదిస్తే అది మతపరమైన మరియు ఆధ్యాత్మికపరమైన జీవన ధర్మ మనే అర్థాన్నిస్తుంది. అప్పుడా విషయం యొక్క సారాంశాన్ని అందుకోగలుగుతాము. కానీ అవతార కార్యంలోని అతి ప్రధానమైన అంశాన్ని విస్మరించే ప్రమాదంలో పడతాం. దైవావతరణల చరిత్రలో ఎల్లప్పుడూ ద్వివిధ కార్యాచరణను గమనిస్తాము. అవతారం మానవ జీవితంలో దైవకార్యాచరణను చేపడుతుంది. ఆ విధంగానే లోకంలో దైవసంకల్పం, దివ్యజ్ఞానం పనిచేసే తీరును చేపడుతుంది. ఆ కారణంగా అంతరాత్మలో చోటు చేసుకునే అంతర్గత పురోగతి ద్వారా మరియు జీవితంలో చోటు చేసుకునే ఉపరితల మార్పు ద్వారా బాహ్యమందున, అంతరంగ మందున ఎల్లప్పుడు అవతారం తనను తాను సాఫల్యం చేసుకుంటుంది.

CWSA ????????? 169-170

శ్రీకృష్ణుని సందేశం

ఆధ్యాత్మికత జీవితం నుండి వేరైనదిగా భావించటం ఒక పొరపాటు. అదొక పొరపాటని మరో మారు చెపుతున్నాను. ఈశోపనిషత్తు అంటుంది, "సర్వం త్యజించు, అంతటిని ఆనందంగా అనుభవించటానికి, ఏ వ్యక్తి స్వాధీనమందున్న నీదికాని దానిని దురాశతో కాంక్షిచకు. కానీ, ఈ ప్రపంచమందు నీవు చేయవలసిన కార్యాలను కచ్చితంగా నిర్వర్తించు, నీ వందేళ్ల జీవితాన్ని జీవించాలని వాంఛించు; నీ కర్మబంధాల నుండి తప్పించుకొనుటకు నీకు వేరొక మార్గం లేదు." మతపరమైన మూర్ఖత్వ పరమావధి ప్రపంచం యొక్క పోరాటాలను మించనదని అనుకోవటం ఒక పొరపాటు. శ్రీకృష్ణుడు అర్జునుడికి పదే పదే చేసే హెచ్చరిక పోరాటం ఆవశ్యకమని నొక్కి

చెపుతుంది; "పోరాడి నీ విరోధులను ఓడించు! నన్ను స్మరిస్తూ పోరాడు!, ఆధ్యాత్మికతను గుండెల నిండా నింపుకొని సర్వకార్యాలను నాకు సమర్పించి, కోర్కెలను విడిచిపెట్టి, స్వార్థప్రయోజన ఆకాంక్షలను విడనాడి .పోరాడు! నీ అంతరాత్మ అల జడిని నీ నుండి దూరం చేయి." ఒక నైష్ఠిక మతాచారరపరాయణుడు తన సాధారణ కార్యకలాపాల నుండి విడవడకపోయినప్పటికీ, కఠినమైన ప్రాపంచిక కర్మాచరణకు అతి సాత్వికుడిగా, అతి సాధు స్వభావుడిగా, అతి ప్రేమమయుడిగా లేక నిర్వీర్యుడిగా, నిరుత్సాహిగా మారుతాడు అని అనుకోవటం పొరపాటు. ఇందుకు వ్యతిరేక భావన నిచ్చే భగవద్గీతలో ఈయబడిన సమాధానానికి విరుద్ధమైనది, రాజీపడనిది వేరొకటి లేదు; ""ఎవరైతే తమ స్వభావం నుంచి అహంకారమును, స్వార్థపరతను తొలగించుకుంటారో, ఎవరు తమ అంతరాత్మను తమ చర్యల ప్రభావంతో క్షోభకు గురి కానీయరో, వారు ప్రపంచ మంతటినీ మృత్యువాత పడవేసినప్పటికీ, వారు మృత్యువుకు కారకులు గాదు, వారు నియమోల్లంఘన చేసినట్లు గాదు". స్వయంగా కురుక్షేత్ర మహాసారథి, విధ్వంసము, మృత్యువు తాండవమాడిన యుద్ధక్షేత్రమందు అర్జున రథసారథి, అతడే కర్మయోగానికి ప్రతిరూపంగా, నిర్వచనంగా నిలుస్తాడు. ఎందుకనగా శరీరమే రథం, ఇంద్రియాలు దానిని నడిపే గుర్రాలు, రక్తసిక్తము, ధూళిదూసరితము, పంకిలమైన ప్రాపంచిక దారుల గుండా శ్రీకృష్ణుడు మానవుని అంతరాత్మను వైకుంఠానికి చేరుస్తాడు.

CWSA 13:12

జన్మ కర్మ చ మే దివ్య మేవం యో వేత్తి తత్వతః
త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి మా మేతి సోర్జున!
వీతరాగ భయ క్రోధా మన్మయమా ముపాశ్రితా
బహతో జ్ఞాన తపసా పూతా మద్భావ మాగతాః

గీతను, గీతయొక్క సత్యార్థాలను తెలిపే విధానం

నేనొక మనిషిని కలిసాను. నా వయస్సు బహుశా ఇరవై ఒకటి అయి వుంటుంది, ఇరవైయో ఇరవై ఒకటో అనుకుంటాను. నేను కలిసిన వ్యక్తి ఇక్కడి నుండి వచ్చిన ఒక భారతీయుడు. అతను నాతో గీతను గురించి మాట్లాడాడు. ఒక అనువాదం వుండింది కానీ అది అధ్వాన్నంగా వుండింది. దానిని చదవమని సలహా ఇచ్చాడు. అందుకు విధానం తెలిపాడు – అది అతని విధానం. నాకు చెప్పాడు, "గీతను చదువు, ఈ గీత అనువాదం అంత గొప్పగా లేదు కానీ ఫ్రెంచి భాషలో ఉన్నది అది ఒక్కటే". ఆ సమయంలో మరే ఇతర భాషలలో దేనినైనా అర్థం చేసుకోగలిగేదానిని కాదు. అదీ గాక, ఆంగ్లానువాదాలు కూడా ఎంతో అధ్వాన్నంగా వుండేవి. అయినా అవి నా వద్ద లేవు. శ్రీఅరవిందులు వారి వ్యాసాలను అప్పటికి వ్రాయలేదు.

అతను అన్నాడు, "గీతను చదువు, శ్రీకృష్ణుడిని సర్వవ్యాపకుడగు భగవంతుని చిహ్నంగా, అంతస్థుడగు దైవంగా పరిగణించు". అతను చెప్పినదంతా అదే. ఇంకా అన్నాడు, "శ్రీకృష్ణుడు గీతలోని అంతస్థమైన దైవమని, నీలోని దైవం కూడా అతడే అన్న భావనతో చదువు". ఆశ్చర్యమేమిటంటే, ఒక మాసంలో పని పూర్తిగా జరిగింది!

CWM 6:298-99

శ్రీకష్ణుడు అధిమానస ఆవతరణకు దారిని తెరిచాడు

శ్రీకష్ణుడు అధిమానస అవతరణ సంభావ్యతను, దానితో పాటు దానిని సిద్ధింప చేసుకోగలిగే స్థిరమైన, క్రియోన్ముఖమైన విధానాలను వెల్లడి చేసాడు. బుద్ధుడు మానసిక దశ నుండి నేరుగా పరమాత్మలో లయమొందే నిర్వాణ దశకు చేరడానికి ప్రయత్నించాడు. తదుపరి, ఆదిశంకరులు దానిని మరో మార్గంలో సాధించుటకు ప్రయత్నించాడు. ఇద్దరికీ నామరహితుడు, నిరాకారుడు అగు పరబ్రహ్మను చేరుటకు మధ్యన వున్న ఇతర దశలను దాటవేయటంలో ఏకాభిప్రాయం వుండింది. అందుకు భిన్నంగా శ్రీకష్ణుడు పరిణామక్రమ మార్గానుసరణను పాటించాడు. ఆ మార్గంలో తరువాత వేసే అడుగు నిరాకార నిర్గుణ పరబ్రహ్మ వైపుగా కాదు, అతిమానసం వైపుకు. మధ్యంతర దశలను అధిగమించే ప్రయత్నంలో బుద్ధుడు, ఆదిశంకరులు

ఇద్దరూ విముక్తికి దారితీసే క్రియోన్ముఖ కోణాన్ని విస్మరించి అడ్డదారిని తొక్కే పొరపాటు చేసారని అనుకుంటాను. అందువలన కల్కి దానిని సరిచేయవలసి వచ్చింది.
CWSA 28:487

శ్రీకృష్ణుడు దివ్య చైతన్య ప్రకాశం కాడు. శ్రీకృష్ణుడి అవతరణలోని అర్థం అధిమానస దివ్యత్వం అవతరించి స్వయంగా అతిమానసాన్ని, దివ్యానందాన్ని కొనిరాకపోయినా వాటి అవతరణకు కావలసిన ఏర్పాట్లు గావించుటను సూచిస్తుంది. శ్రీకృష్ణుడు దివ్యానందమయ కోశానికి ప్రతీక; అధిమానసం ద్వారా పరిణామక్రమ మార్గం తన దివ్యానందమయ స్థితికి చేర్చటానికి దానిని బలపరుస్తాడు.

*

శ్రీకృష్ణుడు శ్రమించినది అధిమానస చైతన్యం మానసికంలోను, ప్రాణికంలోను క్రియాశీల మగుటకు.

*

చెప్పబడిన దేమిటనగా శ్రీకృష్ణుడు భూమిపై అవతారంగా ఆవిష్కరించడం మానవులకు అధిమానస చేతన వెల్లడి కాగల సంభావ్యతను కల్పించి, దానికి కట్టుబడి వుండుటకు అని. ఏ విధంగానైతే శ్రీరామావతారం మానసికపరమైన మానవమాత్రుడి రూపం దాల్చిందో, ఆ విధంగా. ఒక వేళ శ్రీకృష్ణుడే ఒక అధిమానస 'దైవం' అయివుంటే, దాని అర్థం అతడు దైవావతారం కాదని, దైవం కాదు కానీ తానే దైవాన్నని వాదించే వేరెవరో నని — అనగా ఏదో విధంగా తాను దైవమని తలిచే ఒక దేవత అని.

*

అతి కొద్దిమంది మాత్రమే శ్రీకృష్ణుని ఒక అవతార పురుషుడిగా గుర్తించారని నేననుకుంటాను. కచ్చితంగా అది ఏమాత్రం సార్వత్రిక గుర్తింపు కాదు. అతనికి అత్యంత సన్నిహితులుగా మెలగిన కొందరు కూడా ఆ విధంగా పరిగణించ లేదనిపిస్తుంది — అంతగా ప్రముఖులు కానటువంటి విదురుడు మొదలగువారు తప్ప.

శ్రీకృష్ణునితో పాటు వున్న వారందరు, చూడటానికి మనుషుల మాదిరిగానే కనిపించేవారు. వారి మధ్య పరస్పర సంభాషణ, కార్యాచరణ మనుషులు తమ తోటి మనుషులతో జరిపినట్లుగానే వుండేది. వారి చుట్టూ వున్నవారు వారిని దేవతలుగా భావించలేదు. శ్రీకృష్ణుడు స్వయంగా ఒక మానవమాత్రుడిగానే చాలామందికి



శ్రీకృష్ణుడు భువిపై అవతరించింది విముక్తిని, దివ్యానందాన్ని ప్రసాదించటానికి

శ్రీకృష్ణునికి సంబంధించినంత వరకు, అతను భువికి దిగి వచ్చింది విముక్తిని, దివ్యానందాన్ని అందివ్వటానికి; ప్రకృతి ప్రకంపనాలకు, నియమాలకు, తమ భావోద్వేగాలకు, తప్పిదాలకు దాసులైన మానవులకు, వారు సర్వేశ్వరుడి శరణు చొచ్చినట్లయితే సమస్త బంధనాల నుండి, పాపాల నుండి విముక్తి పొందగలరని ప్రబోధించడానికి. కానీ మానవులు వారి అవినీతికరమైన అలవాట్లకు, నీతినియమాలకు చాలా వరకు వశ్యులు (ఎందుకనగా, అవినీతి లేకుండా నీతి నియమ నిష్ఠ వుండదు) పాపభూయిష్టమైన నడవడిపై వారికి ప్రీతి మెండుగా నుండుటచేత నిష్కళంక జీవనశైలిగల ఎవరిని కూడా సహించ లేరు. అందువలననే శ్రీకష్ణుడికి తాను స్వయంగా అమరుడైనప్పటికీ, అతనికి ఈ క్షణాన బృందావనంలో భౌతికమైన శారీరక ఉనికి లేదు.

CWM 10:59-60 — *అనువాదం: అందుగులపాటి కైలాసపతి*

తెలుసు. కేవలం కొందరు మాత్రమే అతనిని దైవంగా ఆరాధించారు.

CWSA 28:499-00

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

యోగేశ్వరః కృష్ణ

శ్రీకృష్ణుని పట్ల ప్రేమ, భక్తి

...ఇప్పుడు శ్రీకృష్ణుని విషయానికి వద్దాం. సునాయసంగా, ముక్కుసూటిగా ఆయన వైపు కెందుకని వెళ్ళడం లేదు. సునాయసంగా చేరడమంటే ఒక ప్రగాఢ విశ్వాసం కలిగి వుండడం. ఆతడు తప్పక వింటాడనే దృఢ నమ్మకంతో ప్రార్థించాలి. సమాధానం రావడంలో ఆలస్యం జరిగితే, ఆతడికి తెలుసు, ఆతడు ప్రేమమయుడు అని దృఢంగా నమ్మాలి. అంతేగాక కాలనిర్ణయంలో అంటే యెప్పుడు బదులివ్వాలో తెలిసిన అత్యంత ప్రజ్ఞావంతుడాయన అని కూడా దృఢంగా విశ్వసించాలి. ఆతడు వచ్చినప్పుడు యెదురు దెబ్బలు తగిలి రాళ్ళ మీద పడిపోకుండా, అవస్థ పడకుండా వుండేందుకు యీ మధ్యకాలంలో ప్రశాంతంగా నీ క్షేత్రాన్ని స్వచ్ఛంగా తయారు చెయ్యి. అదీ, నా సలహా, నేనేం చేప్తున్నానో నాకు తెలుసు — ఎందుకనంటే నీవేం చెప్పినప్పటికీ, మనుషుల కుండే యిబ్బందులు, సంఘర్షణలు అన్నీ నాకు తెలుసు, అంతే గాదు వాటి నివారణ కూడా నాకు తెలుసు. అందుగనే, సంఘర్షణలను, యిబ్బందులను వీలైనంత వరకు తగ్గించడానికి తక్కువ సమయం మాత్రమే పట్టేటట్లు నేనెప్పుడూ వాటి మీద వత్తిడి కలిగిస్తుంటాను — అంతరాత్మికం వైపు మలుపు దిరిగి, విశ్వాసం, పరిపూర్ణ, సరళమైన, నమ్మకం మీద ఆధారపడడం జరిగేటట్లు వత్తిడి కలిగిస్తుంటాను. ఇవి వైష్ణవ యోగసూత్రాలు అని నీకు మరోసారి గుర్తు చేస్తున్నాను. మోహం, విరహాల మధ్య వూగిసలాడే మరో వైష్ణవ మార్గం వున్నదనే మాట నిజమే. ఏ మార్గాన్నైనా చిత్తశుద్ధితో ఆచరించేవాడు భగవంతుని చేరుకొంటాడు అనేదాన్ని నీవు అనుసరిస్తున్నట్లుగా కన్పిస్తోంద, కాని దాన్ని నేను కాదనను. దాన్ని అనుసరించేవాళ్ళు విరహంలోని, భగవంతుని దాగుడుమూతలాట

లోని, దివ్యప్రియుడు కన్పించకపోవడం, కవ్విస్తుండడం లాంటి వాటిలో కూడా ఒక రసాన్ని కనుగొంటారు. వాళ్ళు తమ జీవితకాలమంతా ఆతని వెంటపడతూనే వున్నా, తమ దృష్టి నుండి తప్పించుకుపోతున్నాడనీ, అందులో కూడా వాళ్ళు రసాన్ని ఆస్వాదించామనీ, ఆయన వెంట పడకుండా వుండలేమనీ వారిలో కొందరు గానం చేసారు. కాని నీకు మాత్రం అందులో రసం కన్పించలేదు. అందుకని నీవు చెప్పినదానికి నా నుంచి అంగీకారాన్ని ఆశించవద్దు. వీలైనన్ని విధాలుగా శ్రీకృష్ణుని వెంటపడు, ఆతనిని చేరుకొంటాననే దృఢనిర్ణయంతో ఆయన వెంటపడు. చేరుకోలేనేమో అనీ, లేక మధ్యలో ఆగిపోతానేమో అనీ అనుకోవద్దు. సుమా!

CWSA 29:487--88

శ్రీకృష్ణుని సరాసరిగా చేరుకోవడం అంత తేలిక కాదు

శ్రీకష్ణుని సరాసరి చేరుకోవడం, మంచిదీ కాదు, తేలికా కాదు. కొన్ని సందర్భాల్లో సాధకుని ధోరణిలో స్పష్టత, యేక మనస్కతలలో జోక్యం చేసుకొనేదేదైనా చొరబడితే అది అత్యంత ప్రమాదకారి కూడా అవుతుంది. అటువంటప్పుడు యే తప్పుడు కోరికైనా, అహంభావమైనా, గర్వమైనా, లైంగిక అపరిశుద్ధతైనా, అత్యాశయైనా లేక యితర బలహీనత ఏదైనా సాధనను అపమార్గం పట్టించి, భగ్నం చేసి, కుప్పకూల్చి ఆధ్యాత్మికంగా భ్రష్టు పట్టేటట్లు చేయడానికి దారి తీయవచ్చు. స్వయంగా శ్రీకష్ణుని ప్రభావం, అది నిజంగా ఆయనదే అయితే, అపకారం కలిగించే ప్రభావం కాలేదు. కాని యితర ప్రభావాన్ని అతనిదిగా పొరపడి, అంగీకరించడం తేలికగా జరుగుతుంది. ముఖ్యంగా ఆతడు దివ్యప్రేమ, దివ్యసౌందర్యం, దివ్యానందాల ప్రభువు. అపసవ్య విధానాలను అనుసరించే వాళ్ళందరూ తమ అన్వేషణలో, అతని వైపు వెళ్ళడంలో గూడా సమస్త విధానాలు అనుసరించే ప్రమాదం వుంది. అందుచేతనే కృష్ణుని మరో విధంగా గాక గురువు ద్వారానే చేరాలని కొంతమంది ఋషులు చెప్పడానికదే కారణమై వుండవచ్చు. మానవ స్వభావానికి సంబంధించిన సాధారణ లక్ష్యాలు, ఫలితాలపై వ్యామోహం వుండగూడదని, వైరాగ్యం తప్పనిసరి అనీ వాళ్ళు గట్టిగా చెప్పడాని కదే కారణం. ఆతని కోసం క్షేత్రం స్వచ్ఛంగా తయారయ్యేంత వరకు కృష్ణుడు తనను తాను మనకు చూపుకొనకపోవడానికి కారణం కూడా అదే. ఆతనిలా తనను చూపుకొనే యేదైనా శక్తి లేక ప్రభావం, ఆయనలా కన్పించే రూపాన్ని లేక

ఆయనదే అన్పించే కంఠస్వరాన్ని అనుకరిస్తూ జోక్యం చేసుకోవచ్చు. దానికి లోబడితే ప్రమాదంలో పడ్డట్లే. నిజంగా సంసిద్ధం కానివారికి, ఆయన నిజంగా కన్పిస్తే అది కూడా అతనిని అయోమయానికి గురిచేస్తుంది. అందుచేత యీ ప్రమాదాలకు వ్యక్తి జాగరూకుడై వుండాలి. వాటికి వ్యతిరేకంగా గురువే అతనికి రక్షణ యిచ్చే కవచంలా తనను నిలబెట్టుకుంటాడు.

CWSA 29:488-89

కృష్ణుడు ప్రేమపాత్రుడు

...నిన్ను వేధిస్తున్న విషయాన్నే తీసుకొందాం. అది భక్తుని అనుభూతికి, పరిశీలకుని పరిశీలనకు మధ్య నెలకొనే సంశయాస్పద స్థితి. నిజమే, భక్తుడు కృష్ణుని ప్రేమిస్తాడు. ఎందుకనంటే కృష్ణుడు ప్రేమించదగ్గవాడు గనుక, అంతేగాని మరే కారణం చేత కాదు. అది అతని అనుభూతి, పైగా అది యథార్థమైన అనుభూతి. తనలోని యేది తనను ప్రేమించేట్లు చేసిందనిగాని, తన భావావేశాలను విశ్లేషించుకోవాలని గాని తన బుర్రను వేడెక్కించుకోవలసిన పని లేదతనికి. తాను ఆతనిని ప్రేమిస్తున్నాననే వాస్తవం చాలు అతనికి. కృష్ణునిలోని ప్రేమింపజేసే గుణంలోనే, ఆతడు తనను చూపించుకొనే విధానంలోనే, ఆతని పిలుపులోనే, వేణునాదంలోనే కృష్ణుని కృపా కటాక్షం వుంది. అది చాలు అతనికి హృదయానికి, అతనిలో యింకేవైనా అధికంగా వుందనుకొంటే అది, యితరులు, లేక సర్వ్వేలూ ఆయన వేణుగానాన్ని వినాలనీ, ఆయన మోమును దర్శించాలనీ, యీ ప్రేమ సమస్త మాధుర్యాన్నీ, ప్రహర్షాన్నీ అనుభూతి చెందాలనే కోర్కెై వుంటుంది.

బాహ్య పరిస్థితుల కంటె ఆంతరిక సంసిద్ధత చాలా ప్రధానం

ఉదాహరణకు, బ్రాహ్మణస్త్రీలు కృష్ణుని పిలుపుకు బదులు పలుకలేదు. గోపికలే యెందుకని పిలుపును అందుకొని వెంటనే బదులు పలికారు అని అడిగేది, అడిగేవాని మనస్సే గాని, హృదయం కాదు. ఒకసారి మనస్సు ఇలా ప్రశ్నిస్తే, చెప్పగలిగిన సమాధానాలు రెండున్నాయి. ఏ కారణమూ లేని కృష్ణుని సంకల్పం, మనస్సే చెప్పే ఆతని నిరపేక్ష నిర్ణయం, లేక ఆతని నిర్హేతుక చాపల్యత, లేక పిలువబడిన హృదయ సంసిద్దత, అంటే అధికార భేదం. మూడవ సమాధానం; పరిస్థితులు,

ఉదాహరణకు ఆధ్యాత్మిక క్షేత్రాన్ని పరిమితులు గల రక్షణ ప్రదేశాలుగా చేయడం (అంటే పరిమితీకరిస్తూ చుట్టూ హద్దు లేర్పరచడం — అను). కాని పరిస్థితులు యే విధంగా, దివ్యకృపను పనిచేయకుండా ఆపగలవు. ఆవరణలుగా విడగొట్టబడి నప్పటికీ, క్రైస్తవులు, మహ్మదీయులు కృష్ణుని కృపకు తప్పక బదులు పలుకుతారు. పులులు, పిశాచాలు గూడా, ఆయనను చూడడం జరిగితే, ఆయన మురళీరవాన్ని వినడం జరిగితే, తప్పక ఆతనిని ప్రేమిస్తాయి. కాని కొంతమందే దానిని వినడం, ఆయనను దర్శించడం జరుగుతోంది, యితరు లెందుకని వినలేకపోతున్నారు, కనలేకపోతున్నారు? ఇక్కడ మనకు రెండు ప్రత్యామ్నాయాలు కన్పిస్తున్నాయి. ఎంచుకొనడానికి గాని, తిరస్కరించడానికి గాని, దయచూపడానికి, చూపకపోవడానికి, లేదా కనీసం తన దయను త్వరితంగా చూపించడంలో గాని, ఆలస్యంగా చూపించ డంలో గాని, యెటువంటి కచ్చితమైన కారణం లేకుండానే కృష్ణుని దివ్యకృప తానెవరిని పిలవాలని సంకల్పిస్తుందో వారినే పిలుస్తుంది. లేకపోతే తన పిలుపు విన గానే చలించి, యెగిరి గంతులేస్తూ వచ్చేందుకు సిద్ధంగా వున్న హృదయాలను ఆయన పిలుస్తాడు. అటువంటప్పుడు గూడా తగిన సమయం వచ్చేదాకా ఆతడు వేచి వుంటాడు. బాహ్యసంబంధ అర్హత మీద లేక యుక్తమైనదిగా కన్పించే ఆకారం మీద అది ఆధారపడదనే మాట నిస్సందేహంగా యథార్థమే. అది అనేక గట్టి పొరలలో చిక్కుపడిపోయి వున్నప్పటికీ మనకు కన్పించని, కృష్ణునికి మాత్రమే కన్పించేదీ, మేలుకొనడానికి సంసిద్ధంగా వున్న హృదయమూ అయి వుండవచ్చు. వేణునాదం ప్రారంభం కాక ముందే చాలా కాలం నుండీ బహుశా అదక్కడ వేచి వుండి వుంటుంది. మేలుకొలిపే స్వరాలు విన్నపుడు హృదయం యెగిరి గంతులేస్తూ రాకుండా కఠిన పొరలచే వెనుకకు బలవంతాన నెట్టబడకుండా, ఆ పొరలను కరగించివేయడంలో అతను తీరిక లేకుండా వుండి వుండవచ్చు. గోపికలు విని అడవి లోనికి పరుగులు పెట్టారు — యితరులలా చేయలేదు — లేక అదొక జానపదుని సంగీతమని గాని, లేక ఒక అనాగరిక గోవుల కాపరైన ప్రియుడు తన ప్రేయసి కోసం వేణువు నూదు తున్నాడని గాని, శిక్షణ పొందిన, సంస్కారం గల గుణవంతుని చెవులు, దైవం పిలుపుగా దానిని గుర్తించ తగనిదని గాని, వాళ్ళు దానిని గురించి ఆలోచించారా?

అధికార భేదం

అధికార భేదాన్ని గురించి చెప్పవలసి వుంది. అయితే దానిని విశాల హృదయంతో అర్థం చేసుకోవాలి. కొందరికి కృష్ణుని మురళీరవాన్ని వినగల అధికారం వుండవచ్చు. కొందరికి క్రీస్తు పిలుపుకు, శివతాండవానికి స్పందించే అధికారం వుండవచ్చు. ప్రతివారికీ తనదంటూ ఒక మార్గం వుంది, దైవం పిలుపుకు అతని స్వభావం బదులు పలికే ప్రత్యేక విధానం వుంది. అధికారాన్ని గురించి కఠినమైన మానసిక మాటలలో చెప్పలేం. అది ఆధ్యాత్మికానికి సంబంధించినది, సూక్ష్మ మైనది, మార్మికమైనది, పిలువబడినవానికి, పిలిచిన దైవానికి మధ్యగల రహస్యం అది.

CWSA 29:491-92

శ్రీ అరవిందులు

శ్రీకృష్ణుడు, ఆతని గారడి

కృష్ణుడే కావాలనుకొంటే అతడు కృష్ణుని తప్పక సంపాదించుకొంటాడు — కాని కృష్ణుడు అతనిని చాలా యిబ్బంది పెడ్తాడు. యెప్పుడైనా హఠాత్తుగా రావచ్చు గాని వెంటనే మాత్రం రాడు. కాని ఆతనినే పిచ్చిగా, ఉడుం పట్టు పట్టినట్లు, దేనికైనా సరే తెగించి అందుగు సంసిద్ధమై ఆతనినే కోరుకోవాలి. కోరడం లాగానే, వేచి వుండడం కూడా అతనికి తెలిసి వుండాలి. ఎంతో కాలం తిరస్కరణకు గురి కావలసి వచ్చినా, వెనుకాడకుండా పట్టుబడ్తూనే వుండాలి, అంతరాత్మిక సంబంధమైనది అలా చేయగలుగుతుంది. దానినెలా చేయాలో మనస్సు, ప్రాణికాలు కూడా నేర్చుకోవాలి.

*

అత్యున్నత ఆధ్యాత్మిక భాగాల నుండి, భౌతికం వరకూ గల సమస్త అస్తిత్వ సమస్తాంగాలలలో దైవం యెడల సంపూర్ణ, సమగ్ర, పరిపూర్ణ ప్రేమస్వరూపం రాధ. దైవం యెడల సమస్త అస్తిత్వపు పరిపూర్ణ ఆత్మసమర్పణను, సంపూర్ణ సమర్పణను కొనితెస్తుంది, దేహంలోనికి, అత్యంత పదార్థ ప్రకృతిలోనికి పరమానందాన్ని ఆవాహన చేస్తుంది.

CWSA 32:72-73

కృష్ణుడు మాయావి అనీ, ఆతనితో వ్యవహరించడం కష్టమనీ, ఆటాడటం కష్టమనీ, లీల అనబడే ఆతని క్రీడావిలాస ధోరణిని ఆతని అనుయాయూలు వెంటనే మెచ్చరనీ ప్రసిద్ధి చెందిన మాట నిజం. కాని ఆతని మాయలలో ఒక హేతుబద్ధత, ఒక రహస్య విధానం వుంది. వాటి నుండి ఆతడు వెలువడి, నీతో మంచిగా వుండడం మొదలు పెట్టినప్పుడు ఆతడెంతో మహిమాన్వితమైన ఆకర్షణ కలవాడిగా, మోహం కలిగించే వానిగా, పరవశింప జేసేవానిగా కనిపిస్తాడు. అది యింతవరకూ నీవు పడిన బాధనంతా పరిహరిస్తుంది, పరిహరించడం కంటే అధికమే చేస్తుంది.

*

గోపికలు సాధారణ స్త్రీలు గారు. 'అసాధరణ' అనే పదానికున్న మాములు అర్థంలో. పరాకాష్టకు చేరిన వారి ప్రేమచేత, భావావేశపూరిత భక్తి చేత, యెట్టి మినహాయింపులు లేని ఆత్మార్పణచేత వారు అసాధరణ జీవులైనారు. ఇతర విషయాలలో, చదువు సంధ్యలు, బాహ్య శుచి, శుభ్రత వగైరా వగైరా విషయాల్లో అతని దెంత తక్కువ స్థాయి యైనా అతనికి పైన చెప్పిన గోపికల కున్న ప్రేమ లాంటిది వుంటే అతడు తేలికగా కృష్ణుని అనుసరించి ఆతనిని చేరుకోగలడు. అదే గోపికల సంకేతంలోని అర్థంగా నాకు కన్పిస్తోంది. అందులో యింకా అనేకమైన విశిష్టత లున్నాయి, నిజమే; ఆ అనేకమైనవాటిలో ఇది ఒకటి మాత్రమే.

*

రాధతో వున్న కృష్ణుడు దైవప్రేమకు సంకేతం. వేణునాదం దైవప్రేమ పిలుపుకు, నెమలి విజయానికి సంకేతాలు.

CWSA 30:156

శ్రీకృష్ణకాంతులు

పసిడి, నీలం కాంతులు రెండూ కృష్ణుని కాంతులే.

CWSA 30:118

తెలుపు వన్నెగల నీలం కృష్ణుని లేక నా కాంతి. మదురు నీలాలు తరచుగా ఉన్నత చేతన నుండి వెలువడే కాంతిని సూచిస్తాయి.

*

రంగుకు సంబంధించి కచ్చితమైన లక్షణం దాని ఛాయ మీద, స్వభావం మీద,

నీలకాంతి అర్థం ఆధారపడి వుంటుంది. చంద్ర-కాంతిలాంటి తెలుపువన్నె గల నీలం, కృష్ణుని కాంతి లేక శ్రీఅరవిందుని కాంతి అని ప్రసిద్ధి — తేలికపాటి నీలం తరచుగా దీప్తివంతమైన మనస్సుకు చెందినదై వుంటుంది — ఉన్నత మనస్సుకు చెందిన మరో ముదురు నీలం కాంతి కూడా వుంది. ప్రాణికంలో ఒక శక్తికి సంబంధించిన, నీలలోహిత వర్ణానికి దగ్గరగా వుండే మరో కాంతి కూడా వుంది.

CWSA 30:126

కృష్ణునికి సంబంధించిన విభిన్న కాంతు లున్నాయి — తేలికపాటి వజ్రనీల కాంతి, యెరుపు ఛాయగల లేతనీల కాంతి, ముదురు నీలకాంతి, వగైరా. అది యే భూమిక మీద అభివ్యక్తమౌతుందో దాని మీద దాని ఛాయ ఆధారపడి వుంటుంది.

అధిమనస్సులో కృష్ణుని కాంతి వజ్రనీలం, ఎరుపు ఛాయగల లేతనీలం అంతః స్ఫూర్తి మనస్సులో కృష్ణుని కాంతి.

*

కృష్ణుని కాంతికి సంబంధించిన తెలుపువన్నె గల చంద్రకాంతి నీలం వున్నది — భక్తికి సంబంధించిన యెరుపు ఛాయగల నీలకాంతి, భౌతికమనస్సుకు చెందిన ముదురు నీలం, ఉన్నత మనస్సుకు చెందిన నీలమణి నీలం తదితర అనేక రకా లున్నాయి.

*

నీలం అంతా కృష్ణుని కాంతి కాదు. నీలం రాధ వర్ణం కూడా.

*

దైవ కనికరపు కాంతి లేక రంగు నిజానికి నీలి ఊదా కాంతి, అలాగే కృష్ణుని కృప కాంతి కూడా.

CWSA 30:125

*

వైష్ణవభక్తి, అతిమానస యోగం

కృష్ణుడు భక్తికి సంబంధించి, నేను అనేక సార్లు చెప్పాననుకొంటున్నాను. కృష్ణుని ఆరాధనకు, లేక వైష్ణవభక్తి రూప ఆరాధనకు నాకెట్టి అభ్యంతరం యెంత మాత్రం లేదు. అలాగే నా అతిమానస యోగానికి, వైష్ణవభక్తికి మధ్య కూడా యే విధమైన

అసంగత్వమూ లేదు. వాస్తవానికి అతిమానస యోగానికి ఒక ప్రత్యేక, విశిష్టమైన రూపమంటూ యేదీ లేదు. అన్ని దారులూ, దైవానికే దారి తీసేటట్లు, అన్ని విధానాలు అతిమనస్సుకే దారితీస్తాయి.

నేను నీకు తప్పకుండా సహాయం చేస్తాను, చేస్తూనే వున్నాను, యెప్పుడూ చేస్తూనే వుంటాను. అలా చేయకుండా వుంటాననీ, లేక నిన్ను పంపించి వేస్తాననీ, అనుకోవడంలో అర్థం లేదు. పట్టుదలతో నీవు కొనసాగితే, నీవు కోరుకొనేటటువంటి శాశ్వతభక్తి, సాక్షాత్కారాలు నీకు ప్రాప్తించకుండా పోవు. సర్వం సంసిద్ధమై, సమయ మాసన్నమైనదని ఆతడు తెలుసుకొన్నప్పుడు ఆతడు వాటిని అనుగ్రహిస్తాడని కృష్ణునిపై పూర్తి నమ్మకముంచడాన్ని నీవు నేర్చుకోవాలి.

*

ప్రతి వ్యక్తీ తన స్వకీయ మార్గంలో పయనించాలి

...కృష్ణుని కాంక్షించడంలోనూ, లేక నీవు దివ్యానందాన్నడగడంలోనూ లేక సంయోగం కాంక్షించడంలోనూ లేక అటువంటి మరిదేనిలోనైనా నా కెటువంటి అభ్యంతరం లేదని అనేకసార్లు గతంలో చెప్పే వున్నాను. అతిమనస్సునే కాంక్షించా లనీ, లేక నన్ను అవతారంగా అంగీకరించాలనీ నేనెప్పుడూ నిన్ను గాని ఇతరులనుగానీ బలవంత పెట్టలేదు. నీవు లేక యితరులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా యివి వెలువడ్డాయి. నేను వాటిని జ్ఞానానికి సంబంధించిన విషయాలుగానే చూచాను. తన స్వకీయ మార్గంలో, తన స్వకీయ స్వభావాన్ననుసరించి ప్రతి వ్యక్తీ తన గమ్యాన్ని చేరవలసిందే. వైష్ణవాదార్శా న్ననుసరించి అహైతుక భక్తి, అత్యున్నతమైన, అతి త్వరితంగా గమ్యాన్ని చేర్చే మార్గం. దానికి తగినవానిని కాదని యెవరైనా అనుకొంటే, సహైతుక భక్తి అతనికి బాగానే సరిపోతుంది. లేక అసలు భక్తి వైపే తిరగలేడనుకుంటే యితరమైన అనేక మార్గాలున్నాయి. దేన్నీ అనుసరించడాని కిష్టపడకపోయినా 'యక్స్' వేసిన ప్రశ్నకు నేనిచ్చిన సమాధానంలో చెప్పినట్లు, పరమాత్మను లేక భగవంతుని, లేక కృష్ణుని లేక శ్రీమాతను లేక మరి దేన్నైనా కనుగొనాలని అతని స్వభావంలో దేనివల్లనైనా వత్తిడి కలిగి, అది దాని వెంటపడితే, అదే అతని మార్గమౌతుంది.

నీలో వున్న తపనను నీవు తెలుసుకొంటే, మంచిది, దాన్నే నీవు తిన్నగా అను

సరించు — మరెటువంటి ప్రశ్నల అవసరం లేదు, యిటూ, అటూ పోవలసిన అవసరం లేదు. హృదయం కాంక్షించేదానిని అది చేరేంతవరకు హృదయాకాంక్షనే అనుసరించాలి.

CWSA 29:487-93

కృష్ణ

భువి కావలిగ వున్న కృష్ణ పాదాలకై కాంక్షించు
భువి ఆకొన్న హృదయ సంవేదన నెరిగిన నేను
ఈ భయంకర మధుర జగతి లోనికి
అంతరాత్మ జననాని కర్థమ్ము కనుగొంటి తుదకు.
అమృత నేత్రాల సుందర రూప దర్శనమయ్యె
దివ్యప్రియుని మురళీరవ గాఢావేశమ్ము వింటి
నా హృదయమందు నిత్య మూగివైన విషాదమును
చ్యుతిలేని ప్రహర్షపు ఆకస్మిక ఆగనమ్ము నెరింగితి
చెంతకు మరింత చెంత కారవమ్మాకర్షించు
విచిత్ర సుఖానుభూతితో జీవితమ్ము పులకరించు
తన ప్రభువు తనతో వసించుటకై, తనను స్పర్శించుటకై, కౌగలించుటకై
తాను వలపింప జేయు చోటు సమస్త విశాల ప్రకృతి
గతించన యుగాలీ ఒక్క ఘడియకై జీవించె
తుదకు నాలో, ప్రపంచమ్ము, ధన్యనైతినని పులకించె

*

విశ్వతాండవం

(కృష్ణ తాండవం, కాళీతాండవం)

విశ్వతాండవ నృత్యానికి కలవు రెండు లయలు.
బాధ, విషాద, విధి నిర్ణయ లయల కనుగుణంగా
భయ, మాధుర్యాల జీవన చదరంగంలో
నర్తించే కాళీ పదఘట్టనలను వింటున్నా నిరంతరం.

ఆచ్ఛాదిత మహోపదేశితుడి కఠిన పరీక్షకు
మృత్యు కౌగిలితో యోధుడైన అంతరాత్మ క్రీడకు
విధి భీకర వ్యాయామశాల లోని మల్లయోధునకు
దివ్యకృపకు ఒకే ఒక మార్గం ఆత్మబలిదానం,
మర్మాలకు కీలకాన్ని మానవ విషాదాలు రూపునిచ్చాయి
స్వప్న మహా కాలాల వ్యర్థాల నుండి పరమ సత్యపు యిరుకు బాట
పదార్థ సమాధి నుండి లేచేందుకు అంతరాత్మ సప్తద్వారాలు
ఆమె విషాదాంత రచనా వస్తువు సామాన్యోద్దేశ్యాలు.
కాని ప్రకృతి ద్వారా కృష్ణుని తాండవం సాగి
ఎప్పుడు ఆతని మధురమైన హాసం, ప్రహర్షం, ప్రేమ ముసుగు తొలగిపోతుందో?

CWSA 2:608, 590

శ్రీఅరవిందులు

శ్రీఅరవిందులు, శ్రీకృష్ణుడు

వాసుదేవస్సర్వమితిః మనుష్యుల నుంచి వేరుచేసి తన యెత్తైన గోడలతో నన్ను బంధించిన జైలు వంక చూచాను. అదింకెంత మాత్రం జైలు కాదు, నన్ను చుట్టుముట్టి వున్న వాసుదేవుడే. నా జైలుగది ముందున్న చెట్టుకొమ్మల క్రింద నడిచాను, అది చెట్టు కాదు, వాసుదేవుడే అని నాకు తెలిసింది. అచట నిలబడి తన నీడను నాపై బరపుతున్న వాసుదేవునిగా చూచాను. నా జైలుగదికి తలుపు లాగా తన ధర్మాన్ని నిర్వర్తిస్తున్న కటకటాల వంక చూచాను, అక్కడ కూడా వాసుదేవుడే దర్శన మిచ్చాడు. నన్ను రక్షిస్తూ, కావలి కాస్తూ నిలుచున్న నారాయణునిగా జైలు సిపాయిని చూచాను. నాకు పడకగా ఉపయోగపడేందు కిచ్చిన ముతక కంబళ్ళపై పరుండినపుడు, నా చుట్టూ, నా మిత్రుడు, ప్రియుడు అయిన శ్రీకృష్ణుని బాహువులనే సంవేదించాను. ఆతడు నా కిచ్చిన లోతైన దృష్టి ప్రప్రథమ ప్రయోజనం యిది. జైలులోని ఖైదీలను, దొంగలను, హంతకులను, వంచకులను చూచినపుడు, వాసుదేవుడినే చూచాను. ఈ

మసిబారిన అంతరాత్మలు, దుర్వినియోగపరచబడిన దేహాలలో నేను కనుగొన్నది నారాయణునినే.

CWSA 8:5

కృష్ణునివైపు తిరగడం ఒక అవరోధం కాదు

నీవు కృష్ణుని వైపు మరలడం అనేది ఒక అవరోధం కాదని యిదివరకే చెప్పానను కొంటాను. ఏదేమైనప్పటికీ నీ ప్రశ్నకు సమాధానంగా నీ కనుకూలంగా దానినే నేను ధృవీకరిస్తున్నాను. నా స్వకీయ సాధనలో ఆతడే స్వయంగా నిర్వహించిన అత్యధిక భాగాన్ని పరిగణన లోనికి తీసుకొంటే, నీ సాధనలో ఆతడు నిర్వహించే పాత్రను అభ్యంతరకరమైనదిగా చెప్పడం వింతగా అనిపిస్తుంది. శాఖీయ తత్వం ఒక మౌఢ్యానికి, కర్మకాండలు వగైరాలకు సంబంధించిన దవుతుందే గాని, ఆధ్యాత్మిక అనుభవం అవ్వదు. కృష్ణుని మీద యేకాగ్రత అంటే, ఇష్టదేవతకు ఆత్మార్పణ గావడం అన్న మాట. నీవు కృష్ణుని చేరితే దైవాన్ని చేరతావు. నిన్ను నీ వతని కర్పించుకోగలిగితే, నిన్ను నీవు నాకూ యిచ్చివేసుకోగలవు. ఈ విషయాన్ని కనుగొనడంలో నీ అశక్తత యెందుకనంటే, నీవు భౌతికానికి సంబంధించిన విషయాల మీద తెలిసో తెలియకో యెక్కువ పట్టుబడ్తున్నావు.

శ్రీఅరవిందులు
అనువాదం: కె, వి. రావు

శ్రీకృష్ణుడు, వేదాలు

శ్రీకృష్ణుడు నాకు వేదాల యొక్క యదార్థమైన అర్థం తెలిపాడు. అంతే కాదు, మానవ బాష రూపకల్పనను, దాని మూలాలను తెలియపరచే ఒక నూతన భాషా శాస్త్రి పరిజ్ఞానాన్ని అందించి దాని ఆధారంగా ఒక కొత్త 'నిరుక్తము' (వేదాంగ అర్థ నిర్వచనము) రచించి తద్వారా వేదానికి గల గూఢార్థ విశ్లేషణ చేయడం కూడా తెలిపాడు. భారతీయులకు గాని, యూరోపియన్లకు గాని తెలియని ఉపనిషత్తు లన్నింటి అర్థాన్ని తెలిపాడు. అందువలన సమస్త వేదవేదాంతాలను పునః విశదీకరించి మత వ్యవస్థ, దాని మూలంగా, ఎలా ఏర్పడింది, అంతటా అది ఒకే విధంగా జరిగిన తీరు, నేను వివరించవలసి వచ్చింది. ఈ విధంగా ప్రపంచంలో మతపరమైన

జీవన విధానానికి భారతదేశం కేంద్రమని, భారతదేశం తన సనాతన ధర్మమార్గం ద్వారా ఆ వ్యవస్థను కాపాడుటకు నిర్దేశింపబడిందని నిరూపించబడుతుంది.
CWSA 36:177-178

సిద్ధి దివస్: శ్రీకృష్ణుడు శ్రీఅరవిందుల శరీరమందు చేరిక

1926 లో నేనొక అధిమానస కల్పన చేయటానికి ఉపక్రమించాను. అదేమిటనగా నేను అధిమానసాన్ని ఈ భూమిపై పదార్థం లోనికి కొనివచ్చాను. (అతీతమైన అద్భుతాలు, రకరకాల సంఘటనలు జరగటం ఆరంభమవుతుండింది.) నేనడిగాను ఈ దేవతల నందరినీ అవతరించమని, తమకు తాముగా ఒక శరీరంతో అభివ్యక్తం కమ్మని (వారిలో కొందరు సేసమిరా ఒప్పుకోలేదు). సరే, స్వయంగా నా కళ్ళతో ఏ శ్రీకృష్ణుడైతే అప్పటికే శ్రీఅరవిందులతో సంపర్కంలో నున్నాడో ఆ శ్రీకృష్ణుడిని చూసాను. అతడు శ్రీఅరవిందుల శరీరమందు చేరడానికి సమ్మతించాడు. అది నవంబరు 24 న జరిగింది, ఆ రోజునే 'దివ్యమాత' ప్రారంభం.

అది ఈ విధంగా నుండింది: శ్రీకృష్ణుడు శ్రీఅరవిందుల శరీరంలో చేరటానికి, అక్కడ స్థిరపడటానికి సమ్మతించాడు. ఒక చోట అవతరించటానికి, ఒక దేహంలో స్థిరంగా నుండటానికి మరియు కేవలం అడపాదడపా విచ్చేస్తూ, తరచూ పరిభ్ర మిస్తూండే ప్రభావానికి చాలా వ్యత్యాసం ఉంది, నీకు తెలుసా. దేవతలు అన్ని వేళలా అటూ ఇటూ తిరుగుతుంటారు. మనం కూడా మన అంతరంగ అస్తిత్వాలలో చలిస్తూ వుంటాము, ఒకేసారి వేల కొలది చోట్ల నటిస్తుండటం తెలిసిన విషయమే. ఎప్పుడో ఒకసారి రావటానికి మరియు శాశ్వతంగా ఒకే దేహానికి కట్టుబడి వుండటానికి, ఒక శాశ్వత ప్రభావానికి మరియు ఒక శాశ్వతమైన ఉనికికి మధ్య వ్యత్యాస ముంది....

వారు మనుషులతో వ్యవహరించటం మాని తమ గదిలో ఏకాంతంగా గడపటానికి నిర్ణయించుకున్నది అప్పుడే....

ప్రతి దేవత ఒక వ్యక్తిలోకి అవతరింప జేయడం కోసం నేనొక రకామైన 'అధిమానస కల్పన' చేయడం ప్రారంభించాను. ఒక అసాధారణమైన ఊర్ధ్వగమన మలుపు అది! సరే, ఈ వ్యక్తులతో నేను సంబంధం నెలకొల్పుకొని శ్రీకృష్ణునితో చెప్పాను. "ఇదంతా చాలా బాగుంది, కానీ ఇప్పుడు నేను కోరేది భూమి పైన ఒక సృష్టిని — నీవు అవతరించాలి?" 'సరే' అన్నాడు. అప్పుడాయనను స్వయంగా కళ్ళతో

చూచాను (అంతరంగ నేత్రాలతో అనుకోండి) శ్రీకృష్ణుడు తనకు తానుగా శ్రీఅర విందులతో కలసిపోవడం.

ఇది 1926 లో జరిగింది.

అది కేవలం... (ఏ విధంగా చెప్పాలి?) శ్రీకృష్ణుడు పాల్గొనటంలా ఉండింది. అది శ్రీఅరవిందులకు ఎలాంటి మార్పును కలిగించలేదు: అది గత కాలానికి చెందిన ఆకృతి ఒకటి ప్రస్తుత కాల్పనిక సృష్టిలో పాల్గొనటానికి సమ్మతించటం తప్ప అంతకు మించి మరేమీ కాదు. అది కొంతకాలం క్రిందట జరిగిన భగవంతుని అవ రోహణ ఒకటి నూతన సాక్షాత్కారంలో పాలు పంచుకొనుటకు ఇప్పుడు సమ్మతిని తెలపడం.

పరమ శివుడు, అందుగు భిన్నంగా, సమ్మతించ లేదు. “కాదు, నీవు నీ కార్యాన్ని ముగించినప్పుడే నేను వస్తాను, ప్రపంచం ప్రస్తుతమున్న స్థితిలో నేను రాను కానీ ఉపకరించటానికి సిద్ధంగా నున్నాను” అని అన్నాడు.

The Mother: Conversations with a disciple, August 2, 1961

శ్రీకృష్ణునితో నడవటం

గతంలో శ్రీఅరవిందులు అక్కడ వున్నప్పుడు, నేను ఆ ఇంట్లో నివసించాను. అది ఇప్పుడు అనుబంధ శయనాగారం. అక్కడ ఒక పెద్ద వసారా వుండేది. ఆ వసారాలో అటూ ఇటూ పచారు చేస్తుండేదాన్ని. (శ్రీఅరవిందులు తన గదిలో పని చేసుకుంటూండే వారు). నేను ఒక్కతినే నడిచేదాన్ని. కానీ ఎప్పుడూ ఒంటరిగా లేను; శ్రీకృష్ణుడు ఎప్పుడూ అక్కడ వుండేవాడు — దైవంగా గుర్తింపు పొందిన శ్రీకృష్ణుడు. అయితే అతడు ఆజానుబాహుడు, బహు అందగాడు, అతనిది పరిహాస్యాసపదమైన నీల మేఘచ్ఛాయ కాదు, ఆ బూడిద వర్ణపు నీలం! ఆ విధంగా కాదు. ఎల్లప్పుడు, మేము ఎల్లప్పుడూ కలిసి పచారు చేసేవాళ్ళం, ఇద్దరం కలసి నడిచేవాళ్ళం. అతను కొంత వెనుకగా, (వెనుకుచూపే సంజ్ఞ) దాదాపు మెడకు, భుజాలకు వెనుక వుండేవాడు. నేను కొద్దిగా ముందర వుండేదాన్ని, నా తల అతని భుజంపై వాలి వున్నట్లుగా. అతను నడుస్తుండేవాడు (నా తల ఆతని భుజంపై ఆనుకున్న అనుభూతి నాకు కలుగ లేదు, కానీ అది ఆ విధంగా నుండేది). అలా నడుస్తుండేవాళ్ళం, మాట్లాడుకునేవాళ్ళం. ఆ మాదిరిగా సంవత్సరం పైగా కొనసాగింది, ప్రతి రోజూ

తెలుసా. తరువాత ఆగిపోయింది. ఆ తరువాత అతన్ని అప్పుడప్పుడు చూసేదాన్ని (మేము కొత్త ఇంటికి మారినప్పుడు చూసాను): కొన్ని సార్లు రాత్రులందు, నేను బాగా అలసివున్నప్పుడు అతను వచ్చేవాడు, నేను అతని భుజంపై ఆనుకొని నిదురించేదాన్ని. కానీ, నాకు బాగా తెలిసింది, అది శ్రీఅరవిందులు తమను తాము వ్యక్తపరచుకునే ఒక విధానమని. ఇక్కడికి నేను వచ్చినప్పుడు (శ్రీమాత ప్రస్తుతమున్న గది) శ్రీఅరవిందులు వెళ్ళిపోయారు. నా మంత్రం వల్లె వేసుకుంటూ పచారు చేయటం ప్రారంభించాను. శ్రీఅరవిందులు అరుదెంచారు. శ్రీకృష్ణుడు ఏ స్థానంలోనైతే ఉండేవాడో అదే స్థానంలో వారు వున్నారు. (తల వెనుక చూపే అదే సంజ్ఞ) నేను నడిచేదాన్ని. అతను అక్కడే వుండేవారు. ఆ విధంగా ప్రతి రోజూ కలిసి నడిచేవాళ్ళం. ఆ అనుభవం ఎంత ప్రగాఢంగా, ఎంత అద్భుతంగా పరిణమించిందంటే, నాలో ఒక ఆలోచన మొలకెత్తింది, "ఎందుకోసం మనుషుల బాగోగులు గురించి, విషయాల గురించి పట్టించుకోవాలి, ఎప్పటికీ ఇలానే వుండి పోవాలని నా కోరిక". ఆయన నా ఆలోచనను పసిగట్టారు. ఇలా అన్నారు, "ఇకపై నేను రావటం లేదు". అంతే, ఆగిపోయారు. "చాల మంచిది" అనుకొని ఆ దివ్య ప్రభువు నుద్దేశించిన నా మంత్రం జపించటం ప్రారంభించాను. అతను రావాలని, నాతో కలసి నడవాలని, వేరొక రూపంలో గాకుండా స్వయంగా తానే రావాలని చాలా ప్రయత్నించాను. అంతే, ఆ దివ్యశక్తి, ఆ దివ్య ఉనికి, సమస్తము అక్కడ ప్రత్యక్షమయినాయి. అతడు నా వెన్నంటి వున్న అనుభూతి అధికంగా, సుస్పష్టంగా కలిగింది — భావనామాత్రంగా. కొన్ని దినాల వరకు నేను దేనికో దగ్గర అవుతున్నాననే ఒక విధమైన భావన కలిగింది. నిన్నటి దినాన ఆ భావన అరగంట సేపు కొనసాగింది. అది అతి సన్నిహితమైన దివ్య ఉనికి — దివ్యసన్నిధి — ఒక యదార్థమైన, సమగ్రమైన ఉనికిలా వుండింది. స్వయంగా ఆ దివ్యపురుషుడే నాతో ఇలా అన్నాడు, "మొదట శ్రీకృష్ణుడు, తదుపరి శ్రీఅరవిందులు, ఆ తరువాత నేను" అని.

The Mother: Conversations with a disciple, 18th June, 1965

శ్రీకృష్ణునితో తాదాత్మ్యం

నా స్వంత ఆధ్యాత్మిక గొప్పతనము శ్రీకృష్ణుని ఆధ్యాత్మిక ప్రతిభా విశేషంతో పోల్చి నాదే శ్రేష్టమైనదని వాదిస్తానని ఊహించకు. ఆ ప్రశ్న ఎప్పుడు యుక్తమవు

తుందంటే శ్రీఅరవింద సాంప్రదాయము, వైష్ణవ సాంప్రదాయము రెండూ ఒకదాని కొకటి భిన్నమైన, పరస్పర వైరుధ్యం గల మతవర్గాలుగా విడిపోయి, ప్రతి సాంప్ర దాయము తనదైన దైవమే గొప్పది అని పట్టు పట్టినప్పుడు మాత్రమే. ఇప్పుడున్న పరిస్థితి అలాంటిది కాదు. మరో విషయం. ఏ కృష్ణుడిని నేను సవాలు చేయాలి? సర్వాతిశాయి అగు దైవమైన గీతలోని శ్రీకృష్ణుడినా లేక పరమాత్ముడు, పర బ్రహ్మము, పురుషోత్తముడు, విశ్వవ్యాప్తుడు, పరమేశ్వరుడు, జగత్ప్రభువు, సర్వ మయుడు, వాసుదేవుడు, సర్వజీవుల హృదయాలలో అంతస్థుడిగా నున్నవాడినా లేక బృందావనంలో, ద్వారకలో, కురుక్షేత్రంలో అవతరించిన దైవము. నా యోగానికి మార్గదర్శి, ఎవరితోనైతే నేను తాదాత్మ్యం చెంది వున్నానో, అతడినా? అదంతా నాకు ఏదో వేదాంతపరమైన, మానసికమైన విషయం కాదు; దినదినం, గంట గంటకు సిద్ధించే, నా చైతన్యపు మూలపదార్థానికి సన్నిహితమైన సాక్షాత్కారం.

CWSA 35:431-32

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

దివ్యావతార ఆగమనం వలన కలిగే అంతర్గత ఫలితాలు

దివ్యావతార ఆగమనం వలన అంతర్గతంగా లభ్యమయ్యే ఫలితాలను అందుకోగల వారెవ్వరు? ఎవరైతే ఆ దివ్యావిర్భావ మరియు దైవకార్యాచరణల యదార్థ లక్షణాలను తెలుసుకొని, తమ చేతనలో ఆతని ఉనికి నిలుపుకొని, తమ అస్తిత్వం ఆసాంతం ఆతనికి శరణాగతి గావిస్తారో, — 'మన్మయామాం ఉపాశ్రితః' — ఎవరు ఆత్మజ్ఞాన సిద్ధితో పవిత్రీకరించబడి నిమ్నప్రకృతి నుండి విముక్తులై దివ్య అస్తిత్వ మరియు దివ్యస్వభావ స్థాయిని — 'యద్భావం' —అందుకోగలరో, అట్టివారు ఆ ఫలితాలను పొందుతారు. దివ్యావతార ఆగమనం జరిగేది మనిషిలోని నిమ్నస్వభావాని కన్నా మిన్నదైన దివ్యస్వభావాన్ని బహిర్గతం చేయడానికి; దివ్యప్రేమ, దివ్యశక్తి, దివ్యప్రకాశ భరితమైన, విశ్వగతమగు, వ్యక్తిగతంకాని, నిస్వార్థ, నిరహంకార, స్వేచ్ఛాయుత దైవకార్యాచరణలు ఏమిటో వెల్లడించటానికి, మానవచేతనను తన దివ్యవ్యక్తిత్వంతో నింపి, పరిమితమగు అహంకారపూరిత వ్యక్తిత్వం స్థానే దైవికమైన వ్యక్తిత్వాన్ని

ప్రతిష్టించి తద్వారా అది అహం నుండి ముక్తం గావించబడి అనంతమైన విశ్వగత స్థితిలోకి, జననమరణ పరంపర నుండి అమరత్వం లోకి ఎదుగుటలో చేయూత నివ్వటానికి దివ్యావతారం ఉపకరిస్తుంది. అవతార పురుషుడి రాక దివ్యశక్తి, దివ్యప్రేమ సమన్వితమైనది. మానవులను తనకు ఆకర్షితులను చేసి తద్వారా వారి ప్రశాంత జీవనశైలికి సరిపడని మానవ సంకల్పాలు, మానవ సహజ భయాందోళనలు, సంఘర్షణలు ఆగ్రహావేశాలలో మ్రగ్గకుండా వాటి వలన కలిగే అశాంతి, బాధ నుండి ముక్తులై దివ్యమైన ప్రశాంత మహదానంద వాతావరణంగల దైవసన్నిధిలో ఆశ్రయం పొందుటకు ఉపకరిస్తుంది. అతడు ఏ రూపంతో, ఏ నామంతో, ఎటువంటి దివ్యలక్షణాలతో అవతరిస్తాడనేది అంత ప్రధానమైన విషయం కాదు, ఎందుకనగా అన్ని మార్గాలలో, వారి స్వభావానికి అనుగుణమైన విధంగా మనుషులు దైవనిర్దేశిత మార్గాన్ని అనుస రిస్తున్నారు. చివరకు అవి ఆతని దరి చేరుస్తాయి. ఆ దైవంయొక్క ఏ లక్షణము వారికి అనువైనదిగా నుంటుందో ఆ మార్గానుసరణ వారికి ఉత్తమమైనది. మనుషులు దైవాన్ని ఏ విధంగా నమ్ముతారో, ఏ విధంగా అతనిని ప్రేమించి ఆతనిలో ఆనందం పొందుతారో, దైవం కూడా ఆ విధంగానే మనిషిని నమ్ముతాడు, ప్రేమిస్తాడు, అతనిలో ఆనందం పొందుతాడు — "యే యధా మాం ప్రపద్యంతే తాం స్తదైవ భజామ్యహం".

CWSA 19:175-176

శ్రీఅరవిందులు

అనువాదం: తుమ్మల లక్ష్మి

అఖిల

అఖిల భారత పత్రిక

డిశంబరు 2016



కాలచక్ర భ్రమణము

21/12/22

కాలచక్ర భ్రమణం

విషయ సూచిక

సంపాదకీయం: కాలం ఒక అంతు తెలియని సమస్య. అది సృష్టిలోని సమస్తాన్ని నియంత్రిస్తున్నదని తోస్తుంది. కానీ, ఒక సునిశిత దృష్టికి కాలం కేవలం పరాత్పరుని సాధన మనిపిస్తుంది. ఏకము, అనంతము అగు దైవం వివిధ స్థాయిలలో, శక్తుల సంకీర్ణమైన ప్రయోగంతో తనను తాను వ్యక్తపరచుకొని తదనుగుణంగా అనేక లోకాలను విభిన్న దేశకాల పరిస్థితుల కనుగుణమైన లక్షణాలతో సృష్టిస్తాడు. విశ్వ వ్యాప్తంగా సాగే ఈ క్రీడావిలాసంలో సృష్టి, స్థితి, లయల లయబద్ధమైన చక్రభ్రమణం పునరావృతం అవుతుంటుంది. అది ప్రత్యేకంగానో లేక సమిష్టిగానో చోటు చేసుకొ వచ్చు. అయినప్పటికీ మన సాధారణ దృష్టికి అవివేకమైనదిగా కనిపించే ఆ క్రీడ వెనుక రహస్య మొకటి దాగి వుంది. భగవంతుడు ప్రపంచాన్ని పురోగమన పథంలో పరిపూర్ణత, పరిపక్వత దిశగా ఒక పద్ధతిలో నడిపించుటకు కీలకమైన ఆధారం అది. పరమేశ్వరుని తాండవం; ఒకప్పుడు తీవ్రంగా, భీకరంగా, ఒకప్పుడు ఆహ్లాదభరితంగా, ఆనందపారవశ్యంగా సాగుతూ, వ్యక్తుల, దేశాల గతిని, భవితవ్యాన్ని తల క్రిందులు చేస్తుంది, తారుమారు గావిస్తుంది. సాధారణ జనులు మరియు గొప్ప సామ్రాజ్యాధిపతుల ప్రాభవం, విరియబూసే పూవులు సౌందర్య ప్రకృతి సహజ సూర్యోదయాస్తమానాలు, నక్షత్రమండల కాంతులు క్రియాత్మకమగుట, అంతరించుట, ఆ విశ్వనర్తకుడి నాట్యభంగిమల కనుగుణంగా జీవం పోసుకోవడం లేదా నిర్జీవమవడం సంభవిస్తుంది.

ఈ సంచికలో శ్రీమాతారవిందులు ఈ కాలచక్రగతుల వెనుక దాగివున్న రహస్యాన్ని వెలుగులోకి తెచ్చిన వైనాన్ని పాఠకులతో పంచుకుంటున్నాము.

అనువాదం: అందుగులపాటి కైలాసపతి



శ్రీమాత

వాసుదేవ సర్వమితి

'వాసుదేవ సర్వమితి' అను పదబంధ ఉద్దేశ్యం ఇది: విశ్వమే పరబ్రహ్మము. విశ్వమందలి సర్వస్వము పరబ్రహ్మము, విశ్వాతీతమైన దంతయు పరబ్రహ్మము — 'విశ్వం విష్ణుః'. భగవద్గీత ప్రప్రథమముగా భగవంతుని సర్వలోక, సర్వభూత, సర్వవ్యాప్త, సర్వంసహా స్థితిపై ఊనిక నుంచుతుంది. ఎందుకనగా, అట్టి ప్రాధాన్యత నీయనప్పుడు, మనస్సు దాని మహోన్నత లక్ష్యాన్ని అందుకోలేక, కేవలం ప్రాపంచిక విషయాలపై మొగ్గు చూపుతుంది లేదా జగత్తునందు చోటు చేసుకొనే ఏదో ఒక పాక్షికమైన దైవిక అనుభవానికి వశవర్తి అవుతుంది. గీత ఆ పైన ప్రాధాన్యత నిచ్చేది దైవం సర్వాన్ని చైతన్యవంతం మరియు క్రియోన్ముఖం గావించే ఆతని సర్వాంతర్యామిత్వ స్థితికి. ఎందుకనగా అది జగత్ వ్యాపకంగా సాగే సర్వ కార్యాచరణలోను, అపారమగు ఆధ్యాత్మిక ఆత్మ చైతన్యంలోను దైవం తనంతట తాను కాలపురుషునిగా వ్యక్తమై తన విశ్వగత కార్యక్రమాన్ని నిర్వహిస్తాడని నిరూపిస్తుంది. తరువాత మానవదేహంలో దైవం దివ్యపురుషునిగా వసిస్తుంటాడనే కఠోర సత్యాన్ని నొక్కి చెపుతుంది. ఎందుకనగా సర్వజీవులలోను, సమస్త వస్తుసముదాయంలోను దైవం అంతస్థుడై వున్నాడు. ఈ విధంగా లోపల నున్న దివ్యత్వాన్ని గుర్తించకపోతే, వ్యక్తి ఉనికిలో గల దైవికమగు పరమార్థం విస్మరించబడటమే గాక సర్వోత్కృష్టమైన ఆధ్యాత్మిక సంభావ్యతలకు గల అమోఘశక్తిపై మనకుండే తీవ్రమైన అభిలాష అణగారిపోతుంది. మానవజాతి యందు అంతరాత్మకు, అంతరాత్మకు మధ్య గల సంబంధాలు అల్పమైనవిగా, పరిమితమైనవిగా, అహంకారపూరితమైనవిగా మిగిలిపోతాయి. చివరిగా, అది విశ్వ మందలి సమస్త వస్తు సంపదలో దైవం స్వయం వ్యక్తమయ్యాడని, అవన్నీ 'ఏకం' అగు దైవం యొక్క వెలుగు, శక్తి, ప్రకృతి నుండి ప్రభవించినవేనని ధృవీకరిస్తుంది. ఆ విధమైన గ్రహింపు దివ్యజ్ఞాన సిద్ధికి ఆవశ్యకం. అస్తిత్వము మరియు స్వభావమంతా సమగ్ర రీతిలో దైవం దిశగా మరలుట, ప్రపంచమందు సమస్త కార్యనిర్వహణ దైవ శక్తి ద్వారా గావించబడుతుందని మనిషి నమ్ముట, అతని మానసిక స్థితి మరియు సంకల్పము దైవకార్యాచరణ కనుగుణంగా మలచబడుట, దైవికమైనదిగా ఉపక్రమిం చుట, ఉద్దేశ్యం లోకహితార్థంగా సాగుట మొదలగు కార్యక్రమమంతా వ్యక్తి అనబడు

జీవుని ద్వారా మానవాళికి అందించుట, దివ్యజ్ఞాన సిద్ధిపై ఆధారపడి వుంటుంది.

CWSA 19:216
316.

శ్రీ అరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

కాలమొక వినాశకర శక్తి

ఇదే కురుక్షేత్రం ప్రదర్శించే మహాద్భుత శక్తి

శ్రీకృష్ణుడు ఉన్నట్లుండి ప్రత్యక్షం కాడు; అనేక దశాబ్దాలుగా జరుగుతున్న పరిణామాల ఫలితంగా ఆయన అర్జునునకు కనిపిస్తాడు. భారత కథలో జరిగేవన్నీ రానున్న భయంకర యుద్ధం వైపుగానే పయనిస్తాయి. జరిగేదాన్ని ఎవరూ ముందుగా అంచనా వెయ్యలేరు. యుద్ధాన్ని నివారించాలని ప్రయత్నించేవారంతా ఒక విధంగా దాన్ని ప్రయత్నపూర్వకంగానో, అప్రయత్నంగానో — రాబోయే పరిణామాలను కొద్దో, గొప్పో ఊహించగలవారైనా — యుద్ధాన్ని ఆపలేకపోయారు. విధి బలీయమైనది!

కాలచక్రాన్ని ఎవరూ అపలేరు. నిష్కామకర్మను ప్రబోధించిన శ్రీకృష్ణుడు కూడా తప్పనిసరియై హస్తినకు దూతగా వెళ్ళాడు. కాలప్రభావానికి ఎవరైనా తలవంచాలిసిందే కదా.

సముద్రం వేపు ఉరకలు వేస్తున్న నదిలా, అగ్నికీలల వైపు దూకుతున్న శలభంలా తాము, తమ రథ, గజ, తురగ చతురంగ బలాలు ఎట్లా మృత్యువు కోరలకు బలియైన సంగతి యుద్ధం పరిసమాప్తి అయిన తరువాతనే వారంతా గ్రహించ గలిగారు. ఇదంతా ఒక లీలగా జరిగింది. ఇందులో అతిభయంకర ఘట్టాలు, మధురాతి మధుర అనుభవాలు కూడా వుంటాయి. ఈ విధంగా బృందావనం మృత్యుహేలగా ముగుస్తుంది. ఇదంతా ప్రకృతిలోని సామరస్యమే. ఇందులో అనుకూలతలు, వ్యతిరేకతలు విడదీయలేని భావాలు. ఒకటి లేకుండా వేరొకటి లేదు. ప్రేమ ఉన్నచోట ద్వేషం కూడా వుంటుంది. ప్రకృతిలో పాశవికత నుండే పరిణామం ప్రారంభం అయింది. క్రమేణ పరిపూర్ణత్వ దిశగా ఎదుగుతున్నది. పంకిలంలోనే కదా పుష్పం వికసించేది.

రూపాంతరం అన్నా ఇదే. శివం, శాంతం, సుందరం, ఆనందం ఈ పరిణామంలోని దశలే.

CWSA 13:30-31

వినాశం పురోగమనానికి మొదటి నియమం

"నా సంకల్పం వలననే వినాశనం జరుగుతున్నది. ఇందులో నుండే ధర్మం ఆవిర్భవిస్తుంది. అందులకే ఈ కురుక్షేత్ర సంగ్రామంలో నేను ఉండాల్సి వచ్చింది". అని అంటాడు శ్రీకృష్ణుడు. "ధర్మ క్షేత్రే కురుక్షేత్రే" అన్నప్పుడు దాని అర్థం ఇదే. కురుక్షేత్రం ధర్మానికి ప్రాతిపదిక అన్నమాట. ఇలాగే అన్వయించుకోవాలి. ధర్మాన్ని పునః ప్రతిష్ఠించటానికే వినాశనం జరుగుతుంది! ఇట్లాగే కాలభ్రమణంలో వినాశకర శక్తులు ప్రపంచమంతా తాండవిస్తాయి, కేవలం కురుక్షేత్రంలోనే కాదు.

"జరగబోయే ఫలితాన్ని నేను గమనిస్తూనే వున్నాను. రానున్నది అనివార్యం మానవశక్తి దాన్ని అడ్డుకోలేదు. కనీసం మార్చనూ లేదు. జరగబోయేదాన్ని నేను ఇప్పటికే చేసేశాను. మీరు దీన్ని కనీసం ఊహించనైనా లేరు. నేను కాలాన్ని, ప్రాత కట్టడాలను కూల్చివేసి వాటి స్థానంలో నూతన ఆవిష్కరణలు ప్రవేశపెడతాను. ఒక అద్భుత నూతన ప్రపంచం మిరుమిట్లు గొలుపుతూ మీ ముందు ప్రత్యక్షం అవుతుంది" అని ప్రకటిస్తాడు శ్రీకృష్ణుడు. "కాలము, ప్రపంచపు పోకడ మన కర్మ లను నడిపిస్తాయి. కాని, నేను చేసేది సర్వకాలములకు సంబంధించినది" అని కూడా వివరిస్తాడు.

"నేనే కాలాన్ని, సర్వ వినాశకారక శక్తిని", అని భగవానుడే స్వయంగా ఒప్పు కుంటాడు. దీన్ని బట్టి సృష్టి, వినాశము ఆయన లీల అని మనం నమ్మాలి. వినాశము కూడా కాలగమనంతో వచ్చే మార్పే గదా!

సృష్టి, స్థితి, లయలు వరుసగా జరిగిపోతునే ఉంటాయి. సృష్టికర్త ఎప్పుడూ నూతనత్వాన్ని అన్వేషిస్తూనే వుంటాడు. ఈ విధంగానే ప్రపంచం ముందుకు పోతూ వుంటుంది. మరో విషయం ఏమిటంటే, నశించడమే పురోగతికుండే మొదటి నియమం.

ఎవరు తనలోని నిమ్నప్రకృతిని జయించలేడో అతడు ఊర్ధ్వజీవనాన్ని అందుకో లేడు. మనం దీన్ని బహిరంగంగానూ చూడవచ్చు. ఒక జాతి, సమాజం లేదా దేశం తన పాతకాలపు అలవాట్లను వదిలించుకోకపోతే అది తన వినాశనాన్ని తానే

కొనితెచ్చుకుంటుంది. కాని ఆ శిథిలాల నుండి మరో కొత్త సమాజం లేక జాతి ఆవిర్భవిస్తుంది. ఒకనాటి భూతాలను నాశనం చేయకపోతే మనకు నిలువ నీడే వుండదు. రాక్షసులను సంహరించాకే దేవతలు ప్రశాంతంగా ఊపిరి పీల్చుకున్నారు, ధర్మం పునః ప్రతిష్టాపనం అయింది.

పరిణామ పథం

ఈ విధమైన యుద్ధములను, వినాశనమును ఎవరు వదిలించుకోవా లనుకుంటారో వారు సృష్టి ధర్మానికే వ్యతిరేకం అనుకోవాలి. నిమ్నశక్తుల ప్రభావంలో ఉంటే 'అర్జున విషాదయోగం' లో వున్నట్లే! అట్టివారు ప్రతిదాన్ని అనుమానించి వ్యతిరేకిస్తారు. ఇదే "అనార్యజుష్టము", "అకీర్తికరము" కూడా.

శ్రీకృష్ణుని మాటలలో చెప్పాలంటే "క్లైబ్యం మాస్మగః, క్షుద్రం దౌర్బల్యం" అని హెచ్చరించాల్సి వుంటుంది. ఇది ఆధ్యాత్మిక దౌర్యల్యం కూడా! అలాంటివారు ప్రకృతి సత్యాన్ని గాని, జీవితానికి ఆధారమైన కర్మసిద్ధాంతాన్నిగాని నమ్మలేరు. ఎవరు అమరత్వాన్ని కోరుకుంటారో వారే యుద్ధానికి భీతి చెందనివారు. మరణం వలన నియంత్రించబడే ఈ ప్రపంచాన్ని దాటి పైనున్న అంతరాలలో మాత్రమే దివ్యశక్తి ఉంటుంది. దానిని కనుగొనడం కేవలం వ్యక్తిగత సాధనకు మాత్రమే పరిమితమౌతుంది. దీని ప్రభావం బయట ప్రపంచంపై పడదు. కాకపోతే పరిణామక్రమంలో తాము ఎంత వెనుకబడి యున్నామో తెలుసుకుంటే, వారు వేదనకు గురియౌతారు.

CWSA 19:383-85

దాగియున్న సత్యం

దివ్యత్వానికి సమీపంలో ఉన్నామనుకున్నవారి ఆనందాలకు అవధులే వుండవు. కాళీమాత దర్శన రహస్యం అదే. ఆమె రౌద్ర భయంకరమూర్తి, కాని ఆమె కరాళ బాహువుల ప్రక్కనే అభయహస్తం, వరదహస్తం కడా వుంటాయి. ఇది మృత్యువు సన్నిధిలోనే అమరత్వం కూడా వుంటుందనటానికి సంకేతం. కాబట్టి దివ్యత్వ పాలనలో అసురశక్తులకు తావు వుండదు అనేది గ్రహించవచ్చు. అసురశక్తుల ఘోర పరాజయానికి, వినాశానికి కాళీమాత సంకేతం. దివ్యత్వంలో తన్మయులే దివ్యనామ జపంలో తన్మయులైన సిద్ధులు.మా భయంకరమైన రూపంలో దాగియున్న అభయప్రదాయినిని

మాత్రమే చూస్తారు. రౌద్రాకారం చూడటానికి మాత్రమే భయంకరంగా కనిపిస్తుంది. అది నిజంగా వినాశకారి కాదు. అభయాన్ని, శాంతిని పొందాలంటే దుర్మార్గాన్ని వినాశం చెయ్యాలి గదా! కాలం దీన్ని కకావికలు చేసి లోనున్న శాశ్వత సత్యాన్ని బహిర్గతం చేస్తుంది. అదే అనంత దైవాంశ. దృశ్యమాన ప్రపంచం అంతా అందులో ఇమిడి యుంది. సృష్టికర్త లేక కర్త్రిణి బ్రహ్మ కన్నా ఇది అతీతమైనది. సృష్టి, స్థితి, లయ కారకుల కన్నా ముందుగా ఉన్నది ఈ శక్తియే.

అసలైన సృష్టి శాశ్వతమైనది. అదే సర్వాంతర్యామి సంకల్ప, వికల్పాలు దాని లక్షణం. గోచరము, అగోచరము దాని స్వభావాలు. అనంతకోటి బ్రహ్మాండంలో ఉన్న ప్రాణులన్నీ దాని ప్రతిరూపాలే. ప్రపంచంలోని చర్యలన్నీ దానివే. అది యదార్థమా, మిథ్యా అనేది అగోచరం. అనంత కాలంలో మనం మార్పుకు లోనవుతాయనుకున్నవన్నీ దానికి శాశ్వత సత్యాలుగా కనిపిస్తాయి. అనంత కాలభ్రమణంలో అది ఒక్కటే శాశ్వతం. దానికి మార్పు ఉండదు.

CWSA ?:389-90

కలియుగము వినాశనానికి, తిరిగి పునర్జీవనానికి సంకేతం

కాలమహిమ, దైవేచ్ఛ ఏ దిశగా కదలుతున్నాయో గమనించటం, వాటి లక్ష్యాలను అంచనా వేయటం చాలా ముఖ్యం. మనం ఊహించుకునే పరిష్కార మార్గాలు కేవలం వ్యక్తిగతం. కలిపురుషుడు గాని, కాలమహిమ గాని, మృత్యువుగాని సంభవించేది లోకక్షయానికే. ఇక భగవంతుని అనివార్య వినాశకర శక్తిని ప్రస్తావించటం ఎందుకు? ఎక్కడ వినాశనం వుందో అక్కడే పునర్జీవనం కూడా వుంటుంది. దైవం ఎప్పుడూ నూతన ఆవిష్కరణలు చేస్తూనే వుంటాడు. వాటిని తెలుసుకొని సహకరించటమే మన విధి. దైవమార్గం అంత తేలికగా బోధపడదు. వినాశనాన్ని మనం అంటిపెట్టుకొని ఉండకూడదు. యుద్ధభూమిలో కనపడే తాత్కాలిక గుడారాలే శాశ్వత

ప్రతి ఉషోదయం నూతనమే. అదే అభివృద్ధి. మనం కూడా నిదానంగా పయనిస్తున్నది భవిష్యత్తు దిశగానే — శ్రీమాత
CWM 15:74

సాధాలు అనుకునే మనం దైవమార్గాన్ని అన్వేషించలేము.

పండితులు సత్యయుగానికి, కలియుగానికి ఉన్న భేదాన్ని అంచనా వేశారు. కాని, దీన్ని ఆచరణలో పెట్టే విషయంలో వారు తప్పటడుగు వేశారు. కలియుగం యుగాంతానికి దారి తీస్తుందని వారు విశ్వసించలేదు. అంతేగాని నూతన శకానికి అది జన్మ నివ్వగలదని వారు విశ్వసించలేదు. అంతేకాదు అది నూతన శకానికి జన్మ నివ్వగలదని వారికి అవగతం కాలేదు. జరిగిపోయిన కాలాన్ని వారు అంటిపెట్టు కొని అదే శాశ్వతం అని వారు నమ్మారు. ఆ విలువలు నశిస్తాయని, నూతన విలువలు ఆ స్థానంలో ప్రతిక్షేపించ బడతాయని వారు అనుకోలేదు. సముద్రతీరం వెంబడి వున్న గుడిసెలు కొన్నాళ్ళకు భవంతులుగా మారవలసినదే అనే సత్యాన్ని వారు దర్శించలేదు. ఒక విధంగా ఈ నూతన కట్టడాలు కూడా సముద్రపు అలల తాకిడికి బలి కావలసిందే కదా! ఆ సమయం త్వరలో ఆసన్నం అవుతుందని అను కుందాం, వచ్చిందే అనుకుందాం. ఇటుగా వస్తున్న సముద్రపు అలల ఘోష వినండి. అది భీకరంగా లేదూ? చూడండి, మెల్లమెల్లగా మన అశాశ్వత గుడారాలు ఎలా ధ్వంసమై, సముద్రపు పెను అలల నురుగులో కలిసిపోతున్నాయో. నూతన నిర్మాణా నికి ఇంకా సమయం రాలేదా? వచ్చింది. జనాన్ని చూడండి, హడావిడిగా ఎలా అటూ ఇటూ తిరుగుతున్నారో, దేన్నో వెతుకుతున్నట్లుగా లేదూ? అవతారాలు, మహిమలు, విభూతులూ తొక్కిసలాట! కలియుగం మరో సత్యయుగానికి నాంది పలికినట్లు లేదూ!

CWSA 12:55-56

మరో విధంగాను జరగవచ్చు

ఒక వేళ అందరూ తమ విద్యుక్త ధర్మాలను చేతనైనంత వరకు నిజాయితీగా నిర్వర్తించారనుకోండి. ఊర్ధ్వదిశగా పయనించటం దానంతట అదే సాగిపోతుంది. ఏ వినాశనమూ ఉండదు. పునర్జీవనం అనివార్యం అని నేను అనుకోవటం లేదు. కాని అది ఇప్పటి వరకూ అలానే జరుగుతున్నది.

ప్రకృతి సంకల్పించిన కార్యక్రమానికి మద్దతు ఇవ్వటం మన విధి అని నాకు అనిపిస్తున్నది. ప్రకృతి నిరంతరమూ ఇప్పటిదాకా చేస్తున్నదానిని మనం ఎలా కాదనగలం? అదే సమయంలో దాన్ని మనం గుడ్డిగా అనుసరించాలని కూడా

నేను అనుకోవటం లేదు. ఇబ్బందులు వుండటం తథ్యం. చిన్న చిన్న ఘర్షణలు జరుగుతాయి కూడా! మన కుటుంబాలలో కూడా అంతేగా! సృష్టి తన మార్గాన్ని కొనసాగిస్తూనే వుంది. సృష్టించటం, నాశనం చేయటమే దాని లీల. మనం ఒక విధంగా వినాశనాన్ని ఆపే ప్రయత్నం చేయవచ్చు. మనకు ఆ ప్రయత్నంలో ఆమె సహకారం కూడా లభిస్తే వినాశాన్ని ఆపటం అసంభవం కానే కాదు.

ఒకటి మాత్రం నిజం. వినాశము, పునర్నిర్మాణము అనే పాత మార్గము కాకుండా మరో పద్ధతి కూడా వుందని సృష్టి కర్త్రిణిని గనుక ఒప్పించగలిగితే అది మనందరికి ఆమోదయోగ్యం కావటం తథ్యం.

శ్రీమాత

అనువాదం: కె. ఆర్. ఎల్. నరసింహారావు

కాలతరంగాలు

ఆద్యంతాలు లేవు

115 — పూర్ణసంఖ్య బ్రహ్మంగా నున్న సుదీర్ఘంగా పునరావృతమయ్యే దశాంకము బ్రహ్మము. దాని కాలం యొక్క ఆవృత్తి మొత్తం ప్రారంభమైనట్లు మరియు ముగిసినట్లు అనిపిస్తుంది కానీ దాని భిన్నాంశము శాశ్వతము; దానికి ముగింపు లేదు, యదార్థమైన ప్రారంభమూ లేదు.

116 — విషయాల ప్రారంభము మరియు ముగింపు అనునది మన అనుభవం యొక్క సాంప్రదాయక సూచన. వాస్తవానికి ఈ పదాలకు యదార్థత లేదు; ముగింపు లేదు మరియు ప్రారంభమూ లేదు.

CWSA 12:436 శ్రీఅరవిందులు

ప్రశ్న: శ్రీఅరవిందులు అంటారు: "ప్రారంభము లేదు మరియు ముగింపు లేదు", సృష్టి లయములు కేవలం బాహ్య చేతన కలిగించే భ్రమ మాత్రమేనని?

సమా: విషయాలను వ్యక్తపరచడానికి మనం పదాలను విధిగా వాడవలసి వస్తుంది కానీ వాటి సారాంశమైన దానిని మనం విస్మరిస్తాము. మనకు 'శాశ్వత దివ్యతత్వం'

గా, 'పరమేశ్వరుడు' గా, 'దైవం' గా, ప్రకటితమైనవాటికి ప్రారంభంగాని, ముగింపు గాని లేదు. 'ఉన్నది' అని అనవలసినస్తుంది గాని, ఆ విధంగా నుండదు, కారణం, అది స్పష్టంగా వ్యక్తమగుటకు గాని, కాకపోవుటకు గాని, రెండింటికీ అతీతం; వ్యక్త మయ్యేదానిలోని అసలు విషయాన్ని అర్థం చేసుకొనుటకు గాని, గ్రహించుటకు గాని అశక్తులం — 'తత్' అదే, ప్రారంభంగాని, ముగింపుగాని లేనిది అదే. అయితే, 'తత్' నిరంతరంగా, శాశ్వతంగా ప్రారంభమయ్యే దానిగా, ముగిసే దానిగా వ్యక్తమవుతుంటుంది. 'ముగింపు' కు కేవలం రెండే రెండు మార్గాలున్నాయి. ఒకటి విధ్వంసంగా, సర్వనాశనంగా కనిపించేది, మరొకటి రూపాంతరీకరణంగా కనిపించేది. సాక్షాత్కారం వ్యక్తమగుట పరిపూర్ణమయ్యే కొద్దీ, విధ్వంసం యొక్క ఆవశ్యకత తగ్గుతుంది, క్రమేపీ ఒక దశలో కనిపించకుండా పోతుంది; దాని స్థానంలో క్రమానుసారంగా జరిగే రూపాంతరీకరణ ప్రక్రియ చోటు చేసుకుంటుంది.
CWM 10: 216-17.

పులకరింత గొలిపే సాక్షాత్కారం

ఈ విధమైన సాక్షాత్కార స్ఫూర్తి నాకు కలిగింది — ఒక 'పులకరింత' గొలిపే సాక్షాత్కారం. అది ఒక మారు తెరుచుకుంటుంది, ఒక మారు సంకోచ మొందుతుంది, మళ్ళీ తెరుచుకుని, మళ్ళీ మూసుకుపోతుంది. ఇలా కొనసాగే క్రమంలోని ఒక దశలో, దాని ద్రవరూపస్థితి, మలచబడుటకు వీలైన మెత్తదనం, దాని మార్పుచెందగల శక్తి, ఎలా గుంటుందంటే సరికొత్తగా రూపకల్పన గావించటం కోసం దానిని పూర్వస్థితికి మార్చవలసిన అవసరం వుండదు. రూపాంతరీకరణ క్రమంగా చోటు చేసుకుంటుంది. థియోను అంటుండేవాడు, ఇది ఏడవ విశ్వసృష్టి అని. అంతకు పూర్వం ఆరు ప్రళయాలు ఏర్పడ్డాయని. ఇది ఏడవ సృష్టి అని, కానీ ఈ సృష్టి పూర్వస్థితికి చేరకుండానే రూపాంతరం చెందటం సాధ్యపడుతుందని. ఈ విషయం అంత ముఖ్యమైనది కాదు. ఎందుకనగా శాశ్వత చైతన్యం పొందగానే పరిస్థితులు ఏ విధంగా మారినా దానికి ప్రాధాన్యత లేదు. పరిమితమైన మానవచేతనకు ఒక ముగింపులేనిది పొందాలనే గాఢ కోరిక గాని, అవసరం గాని వుంటుంది. కారణం అంతర్గతంగా 'శాశ్వతత్వం గురించిన జ్ఞాపకం' అనేది ఒకటుంటుంది. ఆ స్మృతి సాక్షాత్కారం శాశ్వతత్వంలో పాలు పంచుకోవాలని ఆకాంక్షిస్తుంది. ఆ శాశ్వతత్వ భావన కలిగి క్రియాశీలమైనట్లయితే, విచారించ నవసర ముండదు. ఒక జీర్ణమైన వస్త్రాన్ని విసర్జించితే, నీవు

విచారించవు గదా? (నీకు దానిపై మక్కువ వుండవచ్చు, కానీ విచారించవు). ఇది కూడా అలాంటిదే. ఒక ప్రపంచం మాయమయి పోతే, దాని అర్థం అది దాని నిర్దేశిత కార్యాన్ని పూర్తిగా నెరవేర్చిందని, అది దాని సాధ్యతలకున్న అవకాశా లన్నింటినీ వాడుకున్నదని, వేరొక సృష్టి దాని స్థానంలో రావలసి వున్నదని.

Conversations with a disciple, March 4, 1966

శాశ్వతత్వ భావన, భూమండల ఆయుః పరిమాణం

చేతనలోను, పురోగతిలోను నీ స్థాయి అల్పమైనదైతే, ఈ భూమండలం కనుమరుగు కాగూడదని, అది కొనసాగాలని (ఇష్టమైనంత మేరకు రూపాంతరం చెందుతున్నా, భూమండలం మాత్రం శాశ్వతంగా నుండాలి) అభిలషిస్తావు. కొంతకాలం పోయిన తరువాత, నీవు మరింత పరిపక్వత పొందినప్పుడు ఈ విషయాని కిచ్చే ప్రాముఖ్యత తగ్గుముఖం పడుతుంది. ఇక నీకు శాశ్వతత్వ భావనతో ఎడతెగని సన్నిహిత సంబంధం ఏర్పడితే, ఆ భావన నీ ఇష్టాయిష్టాలపై ఆధారపడి వుంటుంది; అటుపైన అది అవసరమైనదిగా నుండదు. ఎందుకనగా అది క్రియాత్మకమగు చేతనను ప్రభావితం చేయదు కాబట్టి.

అది ఒక కళాకారుడు తనను తాను మెరుగు పరచుకొనేందుకు అవసరమైనన్ని ప్రయత్నాలు చేసి, చివరకు నూతన సాక్షాత్కారాలను గ్రహించి, తనను తాను వాటికి, వాటి అవసరాలకు అనుగుణంగా, పూర్తిగా మలచుకో గలిగినట్లుగా నుంటుంది. ఆ విధంగా చేయటంలో సమస్తాన్నీ మరో మారు సమీకరించి, సంస్కరించి, తిరిగి సంసిద్ధం చేయవలసిన అవసరం వుండదు. కానీ, ఇప్పుడు అది, నేను చెప్పినట్లుగా, నీ ఇష్టాయిష్టాలపై ఆధారపడి వుంటుంది. మరో విధంగా చెప్పాలంటే, సాక్షాత్కారం జరిగింది వాస్తవికతను ప్రకటించటంలోగల ఆనందాన్ని పొందటం కోసం (కేవలం ఆనందానికో లేక ఆసక్తి కలిగో లేక... ఏదైతేనేం). ఒక్కసారి ఏదైతే ప్రకటించబడిందో అది అభివ్యక్తమయ్యే నూతన శక్తులతో నిరంతరం రూపుదిద్దబడుటకు కావలసినంత మెత్తదనాన్ని, గ్రహణశక్తిని, అనుకూలతను, విశాలతను సంతరించుకుంటే, ఒక పని చేయడానికి ఇదివరలో చేసినదానిని చెడగొట్టవలసిన అవసర ముండదు.

ఆవృత రేఖ తనకు తానుగా వ్యక్త పడింది. ఈ లోకోక్తిని ప్రకటిస్తూ, "ఏది ప్రారంభమౌతుందో, అది ముగియాల్సిందే..." అది మానవ సహజమైన మానసిక

కల్పన లేవైతే నిజం కావలసిన అవసరం లేదో, వాటిల్లో ఒకటిగా తోస్తుంది.

Conversations with a disciple, March 4, 1966

సృష్టియొక్క చక్రగతులు — క్రమానుసార సాక్షాత్కారం

సృష్ట్యారంభ ప్రక్రియలో సృష్టి నిర్మాణ కార్యక్రమాన్ని అనుసరించి దాని రక్షణ కార్యక్రమం కొనసాగి, లయమొందే లేక నాశనమొందే కార్యక్రమంతో ముగుస్తుంది. "ఏది ప్రారంభమౌతుందో అది ముగియాల్సిందే" వగైరా, వగైరా అని కూడా పదే పదే చెప్పబడింది.

నిజానికి మన ప్రపంచ చరిత్రలో ఆరు దశలు వరుసగా చోటు చేసుకున్నాయి. అవి సృష్టితో ప్రారంభమై, స్థిరపడిన స్థితిలో కొనసాగి, సర్వనాశనంతో అంతమొంది, ప్రళయం సంభవించుటతో తిరిగి మూలస్థితికి అనగా ప్రారంభదశకు చేరుకున్నాయి. అందుచేత ఇది ఒక సాంప్రదాయంగా స్థిరపడింది. అయితే, ఏడవ సృష్టి ఒక విధంగా సంస్కరించబడినదని, అనగా సృష్టి నిర్మాణ ప్రారంభదశ తదుపరి మామూలుగా స్థిరమైన దశకు బదులు ఒక క్రమానుసారమైన, సంస్కారవంతమైన దశ అనుసరిస్తుంది. ఆ దశలో దైవసాక్షాత్కారం మరింత సంపూర్ణంగా వ్యక్తమౌతుంది. ఆ కారణంగా, నాశన మొందే స్థితి గాని, మూలస్థానానికి చేరే స్థితిగాని అవసర ముండదు. మనం ప్రస్తుతమున్న దశ కచ్చితంగా ఆ ఏడవదశ అని, అనగా దాని అంతం ఒక ప్రళయంతో, మూలస్థానానికి చేరటంతో, విధ్వంసంతో, కనుమరుగవటంతో జరగదని, అందుకు బదులు శాశ్వతంగా కొనసాగే ప్రగతిశీల స్థితి ఏర్పడుతుందని ప్రకటించబడింది. ఎందుకనగా దాని నిర్మాణంలో దైవం మరింత సంపూర్ణంగా అభివ్యక్తమవుతాడు.

శ్రీఅరవిందులు నిరంతరం కొనసాగే తెరుచుకోవడం అనగా క్రమానుసారంగా ప్రగతిపథంలో సాగే సృష్టిలో అధికమైన పరిపూర్ణతతో అభివ్యక్తమయ్యే దైవం గురించి ప్రస్తావిస్తారు. ఇట్టి క్రమానుసారమైన అభ్యుదయ దశ లక్షణ మేమిటనగా, ప్రారంభ దశకు తిరిగి చేరటము, విధ్వంసము కావడము వాటి అవసరం లేకుండా పోతుంది. పురోగతి చెందనిదంతా కనుమరుగైపోతుంది. ఆ కారణంగానే భౌతిక దేహాలు మరణిస్తాయి. వాటికి పురోభివృద్ధి చెందే లక్షణం లేదు. కొంత కాలం వృద్ధిచెందుతాయి, కాని అక్కడితో అభివృద్ధి ఆగిపోతుంది. చాలా సార్లు కొంతకాలం స్థిరంగా

వుండి అటుపిమ్మట క్షీణించడం మొదలవుతుంది, చివరకు మాయమౌతుంది. ఆ విధంగా ఎందుకు జరుగుతుందంటే, భౌతిక దేహం ఏదైతే ప్రస్తుతం భౌతిక పదార్థంగా నున్నదో, దానికి నిరంతరం వృద్ధి చెందుటకు తగినంతగా మలచబడగల లక్షణం లేదు. దానిని అందుకు అనువైనదిగా చేసి, భౌతిక దేహం నాశనమొందటానికి, మరణించటానికి అవసరం లేనంతగా సంస్కరించడం అసాధ్యమేమీ కాదు.

కానీ, అధిమానస అవరోహణ జరిగితే గానీ అది సాధ్యపడదు. ఎందుకనగా అధిమానస శక్తి ఇంతవరకు సాక్షాత్కరించిన శక్తు లన్నింటిలోకి ఉన్నతమైనదే కాక అది దేహానికి నిరంతరం వృద్ధిచెందే లక్షణాన్ని కలిగిస్తుంది, అనగా దైవాంశ తెరుచుకోవటాన్ని అనుసరించ వీలు కలిగిస్తుంది.

CWM 7:205

ప్రగతి పథగామి యగు విశ్వం

శూన్యవాదులు, నిర్వాణ మార్గానుసరులు, మాయావాదులు వున్నారు. ఏదో ఒక రూపంలో దుష్టశక్తుల ప్రమేయాన్ని స్వాగతించే మత సాంప్రదాయా లున్నాయి. ఇక నిరంతరం క్రమానుసారంగా దైవాన్ని వ్యక్తపరచే స్వచ్ఛమైన వైదిక సాంప్రదాయమున్నది. వీటిలో ఏదో ఒక మార్గాన్ని ఎవరి ఇష్టాని కనుగుణంగా వారు ఎన్నుకుంటారు. అయితే, విశ్వం క్రమబద్ధంగా ప్రగతి పథంలో సాగుతుందనే సూత్రం ఆధారంగా శ్రీఅరవిందులు దేనినైతే పరమ సత్యంగా భావించారో, దాని ప్రకారం ప్రతి క్షణం ఏమి జరిగినా అది సంపూర్ణమైనది ప్రకటితమగుటకు అత్యుత్తమంగా ఉపకరించేది అని నమ్మవలసి వస్తుంది. అది బేషరతుగా తార్కికమైన అభిప్రాయం. అదీ గాక, వైరుధ్య భావనలన్నీ ఉదయించటానికి కారణం, కొద్దో గొప్పో ఏదో ఒక దానిపై నిశ్చితమైన ఉన్ముఖత కనబరచటం, ఒక హోదాపై మక్కువ చూపటం అని నేను నమ్ముతాను. 'పాపము' లేక 'పొరపాటు' అనుకోకుండా చోటు చేసుకున్నదని, తత్కారణంగా అందుకు కర్తయగు మనిషిని వెనక్కులాగే లేక ముందుకు తోసే శక్తుల మధ్య సంఘర్షణ చెలరేగుతుందని నమ్మేవారందరు సహజంగానే ఆ సంభావ్యతను ప్రశ్నించవచ్చు. కానీ, ఎవరైతే ఆధ్యాత్మికంగా దైవ సంకల్పంతో లేక పరమ సత్యంతో అనుసంధానం చెంది వున్నారో అట్టివారికి ప్రతి సందర్భంలోను, వ్యక్తిగతంగా దాని ఫలితం దక్కడానికి అత్యుత్తమమైనది సంభవిస్తుందని చెప్పవచ్చు.

అన్ని సందర్భాల్లోను అలాగే జరుగుతుంది. పరమాత్మ తనను గురించిన ఆత్మ జ్ఞానాన్ని తనకు తానే వ్యక్తపరచుకున్నట్లుగా, విశ్వం కూడా తెరుచుకుంటుందని గ్రహించినవారు మాత్రమే షరతులు లేని అత్యుత్తమమైనది లభ్యమవుతుందని అంగీకరిస్తారు.

మరచుట్టలా తిరుగుడుగా ఊర్ధ్వముఖంగా ఎగసే విశ్వం కదలిక

సృష్టి సమస్తం సృష్టికర్తయగు పరమేశ్వరునితో సంయోగమొందే దిశగా కదులుతున్నదని చెప్పవచ్చు. కానీ అంతకు ముందుగా ఒక వాస్తవాన్ని గుర్తించాలి, పరిణామ ప్రక్రియ అంతా ఒక మరచుట్టలా తిరుగాడుతూ ఊర్ధ్వముఖంగా కదులుతుంటుందని. ఈ కదలికలో లెక్కలేనన్ని దశలున్నాయి. ప్రతి దశలోను నిలువుగీతలా ఊర్ధ్వముఖంగా సాగే ఒక పెరుగుదల సాధించబడుతుంది. కానీ, ఎవరైనా తిరిగి ప్రారంభస్థానానికి మరోసారి చేరుకోవాలంటే చుట్టూ గుండ్రంగా తిరిగి రావాలి. అయితే, ఆ చేరిక కొంత ఉన్నత స్థాయిలో జరుగుతుంది. అందువలన ఇతర విషయాల నిర్వహణలో గడిపే సమయంలో, ఇతర దశలను అందుకొనే క్రమంలో, మొట్టమొదటి దశను మరవటం సంభవిస్తుంది. మానవ చరిత్రలో ఈ ప్రక్రియ ఈ విధంగా విశదీకరంచబడింది.

ఒక అద్భుతమైన నాగరికత విలసిల్లింది. అన్ని రకాల సృజనాత్మక విశేషాలు — శాస్త్రీయమైనవి, కళాత్మకమైనవి, రాజకీయ, వ్యవస్థాపక, సామాజిక దృష్టిలో అసాధారణమైనవి — గల నాగరికతతో కూడినవి. గతంలోని అతి శ్రేష్ఠమైన నాగరికతలకు చెందిన మరుగున పడ్డ జ్ఞాపకాలు మాత్రమే మిగిలాయి. ఉదాహరణకు, భారత మరియు ఆఫ్రికా ఖండాలు కలిసి వున్నప్పటి కాలం నాటి నాగరికతను తీసుకుంటే ఆ ఛాయలు కూడా ఇప్పుడు కనిపించవు. (ఆ నాగరికత అవశేషాలైన మానవజాతు లేమైనా వుంటే తప్ప). ఆ విధంగా హఠాత్తుగా అంతరించిపోయిన నాగరిక సమాజా లున్నాయి. వాటి ననుసరించి పూర్తిగా అంధకారం, అచేతన, అజ్ఞానంలో అలమటించిన ఆదిమానవ జాతులు — దాదాపుగా జంతు జీవనశైలికి దగ్గరగా నున్నవి — నివసించిన యుగాలు గడిచిపోయనవి. ఆ విధంగా అంధకార బంధురమైన ప్రపంచ చరిత్రలో కకావికలమైన జీవన వ్యవస్థగల కాలం చాలా గడిచింది. హఠాత్తుగా, ఆ దశలో ఒక అతి గొప్ప అనుభవం చోటు చేసుకొంది. ఒక

ఉన్నత స్థాయికి చెందిన, అత్యున్నత జీవన వైశిష్ట్యతగల, సంస్కారవంతమైన మార్పు సిద్ధించింది. అంధకారమయమైన ఆ కాలంలో పడిన శ్రమ ఫలితంగా ఒక విశిష్టమైన దివ్యపదార్థ ప్రపంచం, కొంత ఉన్నత వ్యవస్థను వ్యక్తపరచ గలిగేది, సృష్టించబడింది. అటు తరువాత, మరొక మారు, ప్రపంచమంతా క్రూరం, అనాగరికం, అస్పష్టం, అజ్ఞానం, బాధాతప్తం అయింది. తరువాత, వేల సంవత్సరాలు గడిచిన పిమ్మట హఠాత్తుగా మరో కొత్త నాగరికత ఆవిర్భవిస్తుంది.

ఈ పరిస్థితినంతా క్రిందనున్న భూలోకవాసిగా పరిశీలిస్తే, నిన్ను నీవు ఇలా ప్రశ్నించుకుంటావు, "పురోగతి ఎక్కడ వుంది?" అని. ఎందుకనగా ఎల్లప్పుడూ అది కనుమరుగవుతుంటుంది, కూలిపోతుంటుంది లేక కుళ్ళిపోతుంది, సర్వనాశన మవుతుంటుంది., చివరికి స్మృతి పథం నుండి తొలగిపోతుంది. మానవాళి మరోమారు అతిసామాన్య, అవ్యస్థిత, తెలిసీతెలియని స్థితికి పడిపోతుంది. అయినప్పటికీ మరొకసారి అంతా ప్రకాశవంత మవుతుంది. అట్టి ప్రకాశవంతమైన స్థితిలో నున్న వ్యక్తి అంటాడు, "ఇప్పుడు మనకు చిక్కింది, అది సరియైనది, ఇక మనం మళ్ళీ పడిపోకూడదు...."

అయితే ఇప్పటి వరకు, పునరావర్తనం జరుగుతూనే వుంది.

CWM 5:247-48

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

మహాకాలంలో దైవ వర్తనము

కాలపురుషుడు

క్రియాకలాపా లన్నింటిలోను, పెద్ద యెత్తున జరిగే మానవ కార్యాచరణలలోను, కాలపురుషుని ఆత్మశక్తి, ఉనికి ఉన్నది . ఆతనకు తాను స్వయంగా అభివ్యక్తమయ్యే దానిని యూరపులో జెయిట్జయిస్ట్ అని, భారతదేశంలో కాలపురుషుడని పిలుస్తారు. ఆ పేర్లే అత్యంత భావగర్భితమై వున్నాయి. కాళీమాత అందరికి అమ్మ, అంతటికీ లయకారిణి అగు ఆమె, మానవజాతి హృదయంలో నిగూఢంగా పని చేసే మహాశక్తి కూడా. ఆమె, నిర్విరామంగా కొనసాగే మనుషులు, సంస్థలు, ఉద్యమాలు ఊపందుకొని ఉధృతమైన స్థితుల్లో తనంతట తాను వ్యక్తమౌతుంది. కాలపురుషుడు, ఆమెలోని జీవశక్తి. అది విస్తారమై, బయల్పడి ప్రపంచ ప్రగతిని, దేశాల భవితవ్యాన్ని మలుస్తుంది. అది తనంతట తాను తన సంకల్పాన్ని నెరవేర్చుకోగల ఉత్ప్రేరక శక్తి. ఒక్కసారి అంతర్గతంగా నున్న జీవశక్తి ప్రేరణతో ఉపక్రమించిందంటే, కాలపురుషుడు మరియు అమ్మ దానిని స్వాధీనపరచుకొని, సన్నద్ధపరచి, పరిపక్వం గావించి, ఫలవంతం చేస్తారు. ఎప్పుడైతే జెయిట్జయిస్ట్, కాలపురుషుడు, ఒక స్థిర కక్ష్యలో కదులుతాడో, అప్పుడు ఏర్పడివున్న శక్తి ప్రసరణ నిర్ధారిత లక్ష్యం వైపు ఉధృతంగా వ్యాపింప చేయుటకు విశ్వశక్తులన్నీ ఆహ్వానించబడతాయి. ఏదైతే దానికి సచేతనంగా సహకరిస్తుందో, అది దాని పరిమాణాన్ని పెంచుతుంది. అయితే, ఏదైతే దానిని ఆటంకపరుస్తుందో అది దాని పరిమాణాన్ని మరింత అధికం చేస్తుంది. పెనుగాలి వీస్తున్న సముద్రంపై అలలు ఒకసారి ఎగసి, ఒకసారి పడిపోయినట్లుగా, ఒకసారి విజయోత్సాహంతో ఉవ్వెత్తున ఉప్పొంగి, మరోసారి నిరుత్సాహ అగాధాలలో పడిపోయినట్లుగా, నిగూఢమై వున్న మూలస్థానమైన జీవశక్తి ప్రేరణ ముందుగానే నిర్ధారితమైన సాఫల్యత దిశగా దానిని ముందుకు తోస్తుంది. మనిషి సహకరించవచ్చు లేదా ప్రతిఘటించవచ్చు కానీ జెయిట్జయిస్ట్ శ్రమిస్తాడు, రూపుదిద్దుతాడు, లొంగతీసుకుంటాడు, పట్టు వదలడు.

CWSA 13:29-30

యుగధర్మము మరియు మానవజాతి చతుర్దశలు

యుగధర్మమనేది ఒకటున్నది, మనం జీవించే యుగానికి సరియైన వ్యవస్థలు, కార్యకలాపాలకు చెందినది. ఎందుకనగా కార్యాచరణ నిజానికి దేశ కాల పరిస్థితుల పైన, సంకల్పబలం పైన, కర్తయొక్క తెలివితేటలు, సమర్థత పైన ఆధారపడి వుంటుంది. ఒక యుగానికి సరిపోయిన వ్యవస్థలు మరొక యుగానికి సరిపడవు. ఒక సామాజిక వ్యవస్థను మరొక సామాజిక వ్యవస్థతో, ఒక మతాన్ని మరొక మతంతో, ఒక నాగరికతను మరొక నాగరికతతో భర్తీ చేస్తూ నిరంతరం దైవం మనిషిని మరింత ఉన్నతమైన, సమగ్రమైన పరిపూర్ణత పొందగల స్థితి వైపు కొనిపోతున్నాడు. ఎప్పుడు దైవం తన విశ్వపరివేష్టనా క్రమంలో ఒక స్థిరమైన విశ్వవ్యాప్త సామరస్య స్థితిని నెలకొల్పుతాడో, అప్పుడు అది మానవజాతికి సత్యయుగం. ఎప్పుడైతే సామరస్యత కుంటుపడి దానిని కాపాడుట కష్టతరమౌతుందో — మానవుల స్వభావంలో మార్పు వలన కాదు కానీ ఒక నిర్బంధానికి గురికాబడి లేక రాజకీయ కారణంగా — అది మానవజాతికి త్రేతాయుగం. ఎప్పుడైతే ఆ విధంగా కుంటుపడిన సామరస్యత మనుగడకు ముప్పు వాటిల్లుతుందో, అడుగడుగునా అతి జాగ్రత్తతో, శ్రమతో కూడిన నియంత్రణతో గానీ దానిని కాపాడ వీలుకాదో అప్పుడు అది మానవజాతికి ద్వాపరయుగం. ఎప్పుడైతే అఖండత్వం ముక్కలై, సమస్తము కూలిపోయి నాశనమొందుతుందో, ఆ విశ్వగత సంక్షోభాన్ని ఏ శక్తీ ఆపలేదో, అప్పుడు అది కలియుగం. మానవ ఆలోచనలు, వ్యవస్థలు ఆ క్రమంలో కొనసాగుతాయి. పెద్ద యెత్తున జరిగే కార్యకలాపాలకు సర్వదా, వివరాలలో అంత సమగ్రత చోటు చేసుకోకపోవచ్చునేమో గానీ, ఈ సూత్రం వర్తిస్తుంది. ప్రతి మానవ మతం, సమాజం, నాగరికతలకు ఈ నాలుగు దశలుంటాయని చెప్పవచ్చు. ఎందుకనగా, ఈ కార్యగతి అతి సహజమైనదే కాక అత్యంత శ్రేయస్కరమైనది. ఇది నిరాశావాదాన్ని సమర్థించటం కాదు, అలాగే దుఃఖభాజితమైన వినాశనానికి, మూగబోయిన విధివ్రాతకు ప్రమాణ వచనం కాదు. ఒక స్థితిపై నున్న అనురాగబంధంతో మానవజాతి సాధించిన ఘనకార్యాల ఆభిజాత్యాన్ని, వాటి పతనాన్ని సహజంగా ఊహిస్తూ, తరచూ దుఃఖాక్రాంతులను చేసే విషయం కాదు. ప్రతి సత్యయుగానికి కలిప్రభావం కూడా వున్నట్లయితే అందుకు సమానంగా ప్రతి కలియుగానికి సత్యయుగ వాసనలు కూడా వుంటాయి. ఆ వినాశనం

ఈ సృష్టికి అవసరం. ఆ విధంగానే కొత్త సామరస్యత ఎప్పుడైతే సమగ్రపరచ బడుతుందో అది క్రితం కన్నా మెరుగైనదిగా నుంటుంది. కాని నెమ్మదిగా సాగే పునః సృష్టిలోను, సృష్టిప్రక్రియ పూర్తికాని దశలోను, ఒక దౌర్బల్యం, ఓటమికి దారితీసే ఒక అసంపూర్ణ విజయం, ఒక నిరుత్సాహ ధోరణి, శక్తివిశ్వాసాలు క్షీణించటం వలన విడిపోవటం, యుద్ధ వాతావరణ మేర్పడటం, హింస, పీడించటం, అల్లకల్లోలం, అణగద్రొక్కుట లాంటి ఆవాంఛనీయ పరిణామాలు క్రమ్ముకుంటాయి. కాబట్టి, మానవలోక మంతా సర్వనాశనమైపోతున్నదని దీనాతిదీనంగా రోదిస్తుంది. కానీ వారు మార్పుకు, సంకుచిత భావాలకు ప్రాధాన్యత నీయకుండా దైవప్రేమ, ప్రజ్ఞలపై విశ్వాసం కలిగి వుంటే ఇదంతా పునరుద్భవించబోతున్నదని కేరింతలు పెడతారు.
CWSA 12:54-55

కాళి — మహామాయి

కురుక్షేత్ర మందలి మహానరమేధం ఏదైతే సక్రమమైనదని భావించబడిందో, అదే భావన లోకమందు జరుగుతున్న సంఘటన లన్నింటికీ, దైవలీలగా పరిగణించబడి సృష్టి, స్థితి లయకారకా లన్నింటికీ వర్తిస్తుంది.

ఈ ప్రబోధం యొక్క విశిష్టత సంఘంలో ఉన్నతులైనవారి కుద్దేశించబడింది. ఎవరైతే ప్రబలమైన మార్పులు తేవటానికై నియమించబడ్డారో వారు 'జియట్ జీస్ట్' (కాలపురుషుడు) శక్తితో నిండి వుంటారు. కాళీమాత వారిలోకి ప్రవేశించింది. ఆమె మనిషిలోకి ప్రవేశించిందంటే, సాధ్యాసాధ్యాలను, హేతుబద్ధతను లెక్కచేయదు. ఒక పిల్లవాడు బంతిని ఎంత తేలికగా అటూ ఇటూ ఎగురవేయగలడో, ఆ మహాప్రకృతి శక్తి నక్షత్రాలను వాటి వక్ర కక్ష్యలలో అలా పరిభ్రమింప జేయగలదు. ఆ శక్తికి అసాధ్యమైనదంటూ ఏదీ లేదు. ఆమె 'అఘటనా-ఘటన-పతియాసి', అసంభవమన్నదాన్ని సంభవింప జేయగల నేర్పరి. ఆమె 'దేవాత్మ శక్తిః స్వగుణైర్నిగుఢః', తన స్వంత కార్యాచరణ విధానాల్లో నిగూఢమై వున్న దివ్య మహాశక్తి. ఆమె ఏ ప్రయోజనార్థం నియమించబడిందో దానిని నెరవేర్చడానికి సమయం తప్ప మరేమి ఆమెకు అక్కర లేదు. కాలానుగుణంగా ఆమె కదలాడుతుంది. ఆ కదలికయే తనకు తానుగా సాఫల్యతను జేకూర్చుకుంటుంది, తన సాధనా సంపత్తిని సృష్టించుకుంటుంది, తన లక్ష్యాలను నెరవేర్చుకుంటుంది. ఆమె ఒకరిలో అధికంగా పనిచేయడం, వేరొకరిలో

తక్కువగా పని చేయటమనేది అనుకోకుండా జరిగేది కాదు. ఒకడు ఎన్నుకోబడ్డాడు అనగా అతడు అందుకు పాత్రుడు కాబట్టి. ఎన్నుకోబడిన తరువాత ప్రయోజనం నెరవేరే వరకు అతనిని ఆమె నిరాకరించదు, అలాగే అతడు తనను నిరాకరించ నీయదు....

ఒక వ్యక్తి తన పనిని నిరాకరించినట్లుగా కనిపిస్తే, దాని అర్థం ఆతని పని ముగిసిందని, మరొకరి కోసం కాళీమాత అతనిని వదిలివేసిందని. ఒక ఘన కార్యం నిర్వహించిన వ్యక్తి కూల్చబడి నాడంటే అందుకు కారణం అతడు అహంకారంతో తన లోని శక్తిని దుర్వినియోగపరచి నందున ఆ శక్తి నెపోలియన్‌ను, ఏ విధంగా భగ్నపరిచిందో, ఆ విధంగానే అతనిని ముక్కలు ముక్కలుగా ఖండించిందని. కొన్ని ఉపకరణాలు ప్రియమైనవిగా నిలువ చేయబడతాయి, కొన్ని విసిరివేయబడి ముక్కలైపోతాయి, కానీ అన్నీ ఉపకరణాలే. ఇదే విశిష్ట వ్యక్తుల యొక్క గొప్పతనం; వారు వారి స్వయంశక్తితో గొప్ప సమస్యలను పరిష్కరించలేరు కాని అందుకు ఉపయుక్తమౌతారు, పరిష్కరించగల దివ్యశక్తి ఉపయోగార్థమై ప్రత్యేకంగా రూపొం దించబడిన ఉపకరణాలు వారు. ఫ్రెంచి విప్లవం సృష్టించడంలో మిరాబూ ఎంతో సహాయం చేసాడు, ఏ వ్యక్తి సహాయం చేయనంతగా. అయితే, తదుపరి స్వయంగా దానికి వ్యతిరేకిగా రాచరికపు ఏలుబడికి గట్టి ఆసరాగా మారి విప్లవ చక్రాన్ని ఆప ప్రయత్నించాడు. అంత గొప్ప ఫ్రెంచి నాయకుడు వెనుకంజ వేయుటతో, ఫ్రెంచి విప్లవం ఆగిపోయిందా? కాళీమాత తన పాదాన్ని మిరాబూపై మోపింది, అంతే, అతడు నామరూపాలు లేకుండా పోయాడు, కానీ విప్లవం కొనసాగింది. ఎందుకనగా విప్లవం 'జెయిట్జయిస్ట్' యొక్క అభివ్యక్తి, విప్లవంయొక్క సంకల్పం.

సర్వదా ఈ మాదిరిగా జరుగుతూ వుంటుంది. ఘనకార్యాలు చేయటానికి తామే బాధ్యులమని గర్వించిన మనుషులు — ప్రాథమికంగా వారు అందుకు చేదోడుగా నున్నందున — కాలగతిలో కలిసిపోతారు; వారి కీర్తిశకలాలపై ఇతరులు ముందుగు సాగుతారు. ఎవరైతే వారిలోని కాళీమాత ప్రాభవంతో ముందుకు కొని పోబడతారో, ఎవరు విధివ్రాతకు ఎదురు తిరుగుతారో, వారు మాత్రమే నిలువగలరు.

వ్యక్తుల గొప్పతన మన్నది వారిలో అంతర్గతంగా నున్న శాశ్వత దైవశక్తియొక్క గొప్పతనం.

CWSA 13:31-32

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: సిహెచ్. హర్షవర్ధన రాజు

ప్రశ్న: ఇప్పుడు అతిమానసం భూమిపై దిగింది కదా, మరి ప్రస్తుత ప్రపంచ పరిస్థితిని మార్పు చేయడం కోసం యుద్ధం అవసరమా?

సమా: అది ప్రపంచ దేశాల గ్రహణశక్తిపై ఆధారపడి వుంటుంది. విశాల దృక్పథంతో త్వరత్వరగా అవి నూత్న శక్తులకు తగినంత వేగంగా వాటి అభిప్రాయాలను, చర్యలను మార్చుకోగలిగితే, యుద్ధంయొక్క అవసరం తప్పిపోవచ్చు. కానీ దాని భయం ఎప్పుడూ పొంచి వుంటుంది, కేవలం తాత్కాలిక విరమణలా వుంటుంది. ప్రతి తప్పిదం, చైతన్యాన్ని మసకబరచే ప్రతి చర్య, ఈ భయోత్పాతాన్ని తీవ్రతరం గావిస్తుంది.

అయినప్పటికీ, అంతిమ విశ్లేషణలో తేలేదేమిటంటే, ప్రతి విషయం వాస్తవానికి దివ్యకృపపై ఆధారరపడి వుంటుందని. మనం మాత్రం భవిష్యత్తులోకి విశ్వాసంతో, ప్రశాంతతతో చూడాలని, అదే సమయంలో మనకు సాధ్యమైనంత వేగంగా పురోగమించాలని.

CWM 10:53

మూలం: శ్రీమాత

అనువాదం: సిహెచ్. హర్షవర్ధన రాజు

భవిష్య ఆవిష్కరణ

అపరోక్ష జ్ఞానం

భౌతిక దురవస్థనూ, అసమానత్వంతో కూడిన ప్రపంచ సంపద పంపిణీని చక్కదిద్ది తొలగించవచ్చుననే విషయాన్ని ఒకరు చక్కగా అర్థం చేసుకోగలరు. దాని నంతటినీ ఆర్థిక, సామాజిక పరిష్కారాలు తొలగించగలవని ఒకరు తలపోయవచ్చు, కాని ఈ ప్రత్యేక దీనావస్థ, ఈ మానసిక దైన్యం, ఈ ప్రాణిక వికారం — ఇది మటుకు మార్పు నొందడం లేదు, అది మార్పుకు ఇష్టపడటం లేదు. ఎవరైతే ఈ రకమైన మానవజాతికి చెందినవారవుతారో, వారు ముందుగానే యోగ్యతను కోల్పోయినవారై విచ్ఛేదనకు గురి అవుతారు.

అతిమానసంతో ఐక్యం కాగలిగిన, తనను తాను విమోచనం చేసుకోగలిగిన మానవ చైతన్యం, మానవజాతిలోని ఆ భాగం, పూర్తిగా పరివర్తన చేయబడుతుంది. బాహ్యరూపంలో ఇంకా అభివ్యక్త మవకపోయినప్పటికీ అది భావికాలపు వాస్తవికత వైపుకు కదులుతూ ఉంటుంది. జంతువుల నిరాడంబరతకు చాలా దగ్గరగా ఉన్న భాగం, మహాప్రకృతికి దగ్గరగా ఉన్నది, అది మహాప్రకృతిలో తిరిగి విలీనం చేయబడు తుంది, సంపూర్తిగా తిరిగి జీర్ణం చేసుకోబడుతుంది. కాని మానవ చైతన్యంలోని చెడిపోయిన ఆ విభాగం, మనస్సు దానిని దుర్వినియోగం కావించటం మూలంగా, ఈ వికారాన్ని ఆమోదించటం మూలంగా అది రద్దు చేయబడుతుంది.

అటువంటి లక్షణం కలిగి ప్రయత్నం నిష్ఫలమైపోయిన మానవజాతి — విశ్వ చరిత్ర గతి నుంచి అదృశ్యమైపోయిన ఎన్నో విధాలైన ఇతర నిరర్థక జాతుల మాదిరిగానే, తొలగించబడుతుంది.

కొంతమంది ప్రవక్తలు గతంలో ఇటువంటి ఆవిష్కరణను దర్శనం చేసారు. కానీ సర్వసాధారణంగా జరిగే విధానంగానే, అది కలగలసిపోయింది, వారు దర్శించిన ఆవిష్కరణలో, తమకు తాముగా ఆమోదం తెలిపిన మానవజాతిలోని భాగాన్ని ఉద్ధరించేటటువంటి, ఈ భౌతిక ప్రపంచాన్ని పరివర్తన చేసేటటువంటి అతిమానస ప్రపంచ దర్శనం కలగలేదు. అయినప్పటికీ, ఈ వికార మానవచైతన్య విభాగంలో జన్మించిన మానవజాతికి ధైర్యాన్నివ్వటానికై విశ్వాసం ద్వారా విముక్తి బోధించబడింది:

ఎవరికైతే మహాపదార్థంలో దైవం చేసిన త్యాగం మీద విశ్వాసం ఉంటుందో వారు మరియొక ప్రపంచంలో స్వతస్సిద్ధంగా రక్షింపబడతారు — కేవలం విశ్వాసం మాత్రమే, ఏ అవగాహనా లేనిది, మేధోపరంగా ఎటువంటి జ్ఞానమూ లేనిది. వారు అతిమానస ప్రపంచాన్ని ఎన్నడూ చూడలేదు సరి కదా, ముకుళమైనటువంటి మహా పదార్థంలో దైవం చేసిన త్యాగమూ, అది, దైవం మహాపదార్థంలో తనకు తాను సంపూర్ణంగా ప్రకటించుకోవడానికి దారితీస్తుందనే దానిని కూడా వారు చూడడం జరగలేదు.

Conversations with a disciple: June 1958

అసురుడు విలీనమైపోవడం — మార్పు చెందడం

ప్రశ్న: మాతా, అసురులలో దైవానికి చెందినదేదో కొంత ఉంటుందని చెప్ప బడింది.

సమా: సహజంగానే!

ప్రశ్న: అటువంటప్పుడు, దైవం అసురుడితో యుద్ధం చేసేటప్పుడు, అసురుడి లోని దైవం ఏం చేస్తుంది?

సమా: అతడు తిరిగి దైవంలోకి వెళ్ళిపోతాడు. నీకు ఆ కథ తెలుసు కదా? అతడు తిరిగి దైవంలో కలిపివేయబడతాడు, రామాయణంలో లాగా. ఈ విషయంలో ఆ కథ పూర్తిగా నిజం....

ప్రశ్న: అటువంటప్పుడు దైవం దైవంలోకి ఉపసంహరించుకొంటే తప్ప పరివర్తన వచ్చే అవకాశమే లేదు కదా?

సమా: అదా, ఎందుకు. అది ప్రళయం కదా! అది పరివర్తన కాదు. అది భూవిలీనం. ఆరు మార్లు సృష్టి జరిగిందని చెప్పబడింది, అనగా, ఆరుసార్లు విశ్వం బాహ్యంలో ప్రకటితమైంది, ఆ ఆరుసార్లు విశ్వం వెనక్కి తిరిగి వెళ్ళింది — పవిత్ర గ్రంధాలలో అది వివరంగా చెప్పబడింది, నీకు తెలుసా — తిరిగి వెనక్కి దైవంలోకి వెళ్ళిపోయింది. కాని, అది ఇదే ముగింపు అని చెప్పబడింది. స్పష్టంగా, అది ఒక ముగింపు, కాని పూర్తిగా కాదు. అందుకు కారణం సృష్టికి ఏదో కొరత, అందువల్ల తిరిగి తయారు చేయడానికి ఉపసంహరణ ఆవశ్యకమైంది. ఇంకా ప్రస్తుతంలోని మన సృష్టి ఏడవదని చెప్పబడింది, ఏడవదవటం మూలంగా అది అసలైనది, అనగా, ఇది ఆఖరుది, అది

తిరిగి ఉపసంహరించుకోబడదు, అది పరివర్తన చేయబడుతూ కొనసాగుతూ ఉంటుంది, ఇంకా ఎక్కువెక్కువగా పరిపూర్ణమవుతూ ఉంటుంది, ఉపసంహరించుకో నవసరం లేకుండానే....

ప్రస్తుత సృష్టి లక్షణం, సమత్వం; అందువలననే ఈ సృష్టిలో ప్రతిదీ దాని స్థానంలో కచ్చితంగా ఉన్నట్లైతే, పరిపూర్ణమైన సమతౌల్యంలో ఉంటే, అప్పుడు దుష్టత్వం అనేది ఎక్కడా ఉండదని చెప్పబడింది. దుష్టత్వం అంటే ఏమిటి? — విషయాలు సమతూకంలో లేకపోవడం! చెడు అనేది దానికదే దేనిలోనూ లేదు, కేవలం స్థితిలోనే తప్పు ఉంది, అసలైన స్థానంలో లేకపోవడం.

ప్రశ్న: అప్పుడు అసురుల స్థానం ఏమిటి?

సమా: దైవంలోకి తిరిగి ప్రస్థానం. గొప్ప అసురులు నలుగురున్నారు. ఆ నలుగురిలో, ఇద్దరు మారిపోయారు. వారు దైవకార్యంలో పాలు పంచుకుంటున్నారు. మిగిలిన ఇద్దరూ ఇంకా పట్టుకుని వేళ్ళాడుతూనే ఉన్నారు. వారు ఆ విధంగా ఎంతకాలం ఉండగలరు? వారి సంగతి చూద్దాం. వారికి, రెండింటి మధ్య ఎంపిక చేసుకనే అవకాశం ఉంది. మార్పు చెందబడటం, అనగా, వారి స్థానాన్ని వారు తీసుకొని, మొత్తం సంపూర్ణతలో సమంగా నిలిపి ఉంచడం లేక మరింకో విధంగా లీనమైపోవడం, అనగా, వారి ఆద్యంలో తిరిగి వారు కలిసిపోవడం.

వారిలో ఒకడున్నాడు. అతడు చాలా మటుకు మార్పుకు ప్రయత్నించాడు, కాని సఫలీకృతుడవ లేదు. అది చేసినప్పుడు, అతినికి అది చాలా అసౌకర్యంగా తోచింది, కాబట్టి అతడు దానిని మరొక సమయానికి వాయిదా వేసాడు.

ఇంకొకరి విషయంలో, అతడు ఆ ప్రయత్నానికి తిరస్కరణ చూపాడు. అతడు ప్రపంచంలో చాలా, చాలా ముఖ్యమైన స్థానాన్ని వశం చేసుకొన్నాడు. కారణం, జనులు విషాయల పరిజ్ఞానం లేనివారు, అతనిని 'ప్రపంచ దేశాల ప్రభువు' గా పిలుస్తారు. యదార్థానికి, కొంత తడవు క్రితం నేను ప్రపంచాన్ని పాలించే శక్తుల గురించి మాట్లాడాను, వారు, వారి పరిపాలనను వదులుకోవటానికి ఏమాత్రం సిద్ధంగా లేరు. వారు దానితో చాలా బాగా సంతృప్తిగా ఉన్నారు — అతడు అంతమయ్యే రోజు ఒకటి వస్తుందని అతడికి తెలియనిది కాదు. అయినప్పటికీ, అతుడు ఎల్లప్పుడూ దానిని చేయగలిగినంత కాలం వాయిదా వేస్తూ ఉంటాడు.

కాని, వారికి మానవక్షేత్ర పరిధులు లేకపోవడం మూలంగా, అది చాలా కాలం

కొనసాగగలదు, అంతే కదా? భూమి మీద ఎక్కడో ఒక చోట మానవచైతన్యం వారి ప్రభావానికి ప్రతిస్పందించటానికి తయారుగా ఉన్నంతకాలం వారు కొనసాగుతారు. కనుక నీవు సమస్యయొక్క గంభీరతను ఊహించుకోగలవు! ఇప్పుడు అది వ్యక్తుల ద్వారా జరగదు, దేశాల ద్వారా వారు వారి శక్తి ప్రభావాన్ని బలంగా చూపిస్తారు.
CWM 6:170-72

కలియుగం అంతమైంది, కేవల మిప్పుడే
ఇటీవలి ప్రచండమైన హఠాత్ పరిణామంయొక్క అంతరించు గతం
దేశాలను వణికించగలదు, అది దాటిపోయినప్పుడు,
దుష్టత్వాల ప్రక్షాళన జరిగిన భూమి మరింత రమణీయ శిఖరమును నిర్మించు.

CWSA 2:244

శ్రీఅరవిందులు

మూలం — అసురుల అంతం

ప్రశ్న: మీరు నాలుగు దివ్యశక్తులున్నాయని చెప్పారు; దివ్యప్రేమ, దివ్య ప్రకాశము, దివ్యసత్యము, మహామృత్యువుకు విరుద్ధం.

మాత: అంటే

ప్రశ్న: (మరొక బిడ్డ నవ్వుతూ) దివ్యజీవితం!

మాత: ఆహా!

ప్రశ్న: అప్పుడు ఈ నాలుగు శక్తులు దైవం నుంచి వేరుపడిపోయి, మారిపోయి అనృతంగా...

మాత: అవును, అది ఏదో అటువంటిదే! అది ఏదో అటువంటిదే!

దివ్యప్రకాశం లేక దివ్య చైతన్యం మహా అంధకారం లేక మహా అచేతన అయింది. దివ్యప్రేమ మరియు దివ్యానందాలు మహాద్వేషం మరియు మహాబాధగా, దివ్యసత్యం మహా అనృతంగా, దివ్యజీవితం మహామృత్యువుగా అయిపోయింది. సరే, ఇప్పుడు మొదటి రెండు... కాని, కచ్చితంగా అదే పరిస్థితులలో కాకుండా, మొదటివాడు మారిపోయి, పనిచేస్తున్నాడు, కాని అతడు మానవశరీరం తీసుకోవటానికి తిరస్కరించాడు. అతడు దానిని తాను కొనసాగించే పనులకు పరిమితి అన్నాడు; బహుశా ఒక రోజు అతడు ఒక మానవ శరీరాన్ని తీసుకోవచ్చు, కాని ప్రస్తుతానికి మటుకు

అతడు తిరస్కరిస్తున్నాడు. రెండవవాడు, మార్పుచెందాడు, అతడు తన సొంత ఇచ్ఛ ననుసరించి విలీనమైపోయాడు. అతడు స్వయం తనదైన మూలంలో లీనమై పోయాడు. చివరి వారిద్దరూ ఇంకా పట్టుకుని వేళ్ళాడుతున్నారు

మహామృత్యువు అవతరించటానికి ప్రయత్నించాడు. కాని అతడు పరివర్తన కాలేకపోయాడు. అతడు అవతరించటానికి ప్రయత్నించాడు, అది ఒక విధంగా చాలా అరుదు. కాని అది పాక్షికంగా మాత్రమే జరిగింది, పూర్తి అవతరణ కాదు. అది వారికి చాలా కష్టం, పూర్తి అవతరణ. మానవదేహాలు చాలా అల్పమైనవి, మానవచైతన్యం చాలా అల్పం.

ఇంకొకరి విషయంలో, అతడి నుంచి బహిర్గతమయ్యే అంశలున్నాయి, అవి చాలా కార్యశీలమైనవి. అవి ఇటీవలి భూచరిత్రలో చాలా పెద్ద పాత్రనే పోషించాయి.

ప్రశ్న: అసురులు వారిలో వారు పోట్లాడుకోరా?

మాత: అహా అవశ్యం, అవశ్యం! సరిగ్గా అసురుల ప్రభావాలతో ఉన్న మానవుల మాదిరిగానే. వారి మధ్య వారు ఆగర్భ శత్రువులు. మనం దానిని అవశ్యం ఒక వరంగా భావించవచ్చు, ఎందువల్లనంటే, వారిలో వారికి అవగాహన ఉంటే, విషయాలు చాలా ఎక్కువగా కష్టతరంగా అవుతాయి. బహుశా అది ఆ విధంగా ఉందంటే, దానికి ప్రపంచాన్ని పాలిస్తున్న సమతౌల్య సూత్రమే కారణం. అది ఆ విధంగా ఉండుట వారి బలశక్తి ప్రభావాన్ని తగ్గించడానికే. కాని ఇంకా... ఆ అనృతదేవుడికి నిజంగానే చాలా ప్రభావం ఉంది. ఇది నీకు సంసర్గం ద్వారా సంక్రమించే వ్యాధుల లాగా అంత బలంగానూ సంక్రమిస్తుంది. ఇంకా ఎక్కువ బలంగా!

ప్రశ్న: ప్రియమైన మాతా, మహా అనృతం అవతరించడానికి ప్రయత్నించలేదా?

మాత: అతడు తన అంశలను భూమి మీదకు పంపాడు, కాని అది మార్పుకోసమని నేననుకోను. ఏమైనా గాని, అతడు అందులో సఫలీకృతుడు కాలేదు.

ప్రశ్న: కాని హానికారకమైన శక్తుల ఆకర్షణకు మనిషే ఎందుకు కేంద్రబిందు వవుతున్నాడు? అతడు చాలా పరిమితుడు కదా!

మాత: అవును, అంతే కాకుండా, సర్వ సాధారణంగా వారు ఒక మనిషి మీద మాత్రమే పనిచేయరు. కాని వారు భూవాతావరణాన్ని తమ చెప్పుచేతలలోకి తీసుకోవాలని ప్రయత్నిస్తారు, అర్థమౌతున్నదా, మనుషులని తమ అధీనంలోకి తీసుకోకుండా, వారు భూవాతావరణం మీద ఆధిపత్యం పొందలేరు, కారణం

మనిషిలోనే ఇహలోకానికి సంబంధించిన అత్యున్నతమైన శక్తి అభివ్యక్తమవుతుంది. మార్పు కోసం మానవ శరీరాన్ని తీసుకోవటమనేది వాస్తవంలో చాలా.... సమాధానం పూర్తిగా చాలా తేలిక. అది ఎందువల్లనంటే మనిషిలో చైత్య అస్తిత్వం ఉంది, లొంగిపోవటానికి అతడు ఎంత చేయవలసి ఉందో అంతగా తిరస్కరించినా కూడా, శాశ్వతంగా చైత్య అస్తిత్వ ప్రభావాన్ని అడ్డుకోగల అసురుడెవరో లేడు, అతనిని అది చాలా దగ్గరగా కట్టి పడవేస్తుంది. కచ్చితంగా అదేవారి ఉనికిలో ఉన్న వైరుధ్యం.

CWM 6:173-174

చిట్టచివరికది వచ్చెను, పెద్దలు ముందే చూసిన రోజు,
పట్మాస్‌లో జాన్ చూచినది, షెల్లీ కలలు కనినది,
నమ్మిన దర్శన, వ్యర్థ తలంపులు
దివ్యానంద స్వర్గ నగరము, స్వర్ణయుగము.

CWSA 2:244

శ్రీఅరవిందులు

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

భిన్న ధృవాల ప్రపంచం యొక్క అంతం

ప్రశ్న: ప్రస్తుత ప్రపంచ రాజకీయం అమెరికా, రష్యా అనే రెండు పెద్ద కూటములుగా విడిపోయింది. వీటి మధ్య సంధి కుదరడమసాధ్య మౌతుందా?

అమ్మ: ఓహ్! అది చాలా సులభం, అది చాలా సులభ సాధ్యమని వాళ్ళకు తెలియదు, అంతే. చివరకు అదే జరిగేది అని కూడా అంటున్నాను నేను. ఇవి కేవలం పైకి కన్పించే విషయాలు మాత్రమే, స్వప్రయోజనాలపై అసక్తులు మాత్రమే. స్వప్రయోజనాల గురించి వాళ్ళకున్న భావాలు మాత్రమే. కాని యదార్థ పరిష్కారం కనుగొంటే.... ఒక వేళ కనుగొంటే అని కూడా కాదు, కనుగొంటారు, యథార్థమైన ఆర్థిక పరిష్కారాన్ని అన్వయింపజేస్తే వాళ్ళ సమస్య మూలాలే కుప్ప కూలిపోతాయి. అప్పుడు మిగిలేది చాలా చాలా పైపై నుండే రాజకీయ దృక్పథం మాత్రమే. అది చాలా డొల్ల, గాఢత లేదు, అన్నింటినీ మించి కేవలం మాటలు, పెద్ద పెద్ద మాటలు, కాని, చూడూ, వాళ్ళ దృక్పథానికి దాదాపు యథార్థమైన ఆధారం నేను చెప్తున్న రెండు విషయాలలో వుంది. ఒకటి రాబడికి సంబంధించినది. రెండవది ఆర్థిక లావాదేవీలకకు సంబంధించినది.

ఆర్థిక లావాదేవీల సమస్య పరిష్కారమైనది అంటే, పరిష్కారాన్ని అన్వయిస్తే, యీ రాజకీయ భేదాలకు ఆధారమైనవాటిల్లో అధిక భాగం అంతరించిపోతాయి. జీవిత సమస్యలను, ఆ సమస్యలకు పరిష్కారాన్ని, అదివరకున్నదానికి వ్యతిరేక దృష్టితో చూడడం మీద ఆధారపడి వుంది. వీళ్ళేమో విషయం ఇది అంటారు, వాళ్ళేమో అది అలా అని అంటారు. కచ్చితంగా నేను చెప్పినట్లు, పెద్దగా వినపడాలని, పెద్దగా ప్రభావం చూపాలని యేమీ లేనిదాని నుండి విషయాలను యేర్చి కూర్చేవారిని గురించి గాక అత్యంత నిజాయితీపరుల గురించే నేను మాట్లాడుతున్నాను. కాని మనం సమస్య హృదయం లోనికి పోయి చూస్తే అక్కడ పెద్ద భేదం కన్పించదు.

చాలామంది వున్నారు — నేను మాట్లాడుతున్నది జనాన్ని గురించి, వ్యక్తుల గురించి గాక ప్రభుత్వాల గురించి — కమ్యూనిస్టులం కాదని నాటకమాడేవాళ్ళు చాలామందే వున్నారు. పూర్తిగా కమ్యూనిస్టులలాగే, కమ్యూనిస్టుల కంటే యింకా మరింత తీవ్రంగా పనిచేసే ఒక విధానం వాళ్ళకుంది.

CWM 7:300-01

*

ప్రశ్న: ప్రియజననీ, అతిమానసం భువిపై అవతరించిందన్నారు. అంటే అసలైన అర్థమేమిటి. "వాగ్దానం చేసిన విషయాలు నెరవేరుతాయి" అని కూడా చెప్పారు. ఏమిటీ 'విషయాలు'?

అమ్మ: ఆహ్! అది నిజంగా అజ్ఞానం. ఏనాడో యీ వాగ్దానం జరిగింది, చాలా కాలం క్రితం అది జరిగింది — ఇక్కడ మాత్రమే గాదు — భూమి ఆరంభమైనపుడే ఆ వాగ్దానం జరిగింది. ప్రవక్త లందరి నుండి భవిష్యత్తును తెలిపే అనేక రకాల వాక్కులు వెలువడ్డాయి. "ఒక నూతన స్వరం, ఒక నూతన భువి వుంటాయి, ఒక నూతన జాతి ఉద్భవిస్తుంది, ప్రపంచం రూపాంతరం చెందుతుంది...." సమస్త సంప్రదాయాలకు సంబంధించన ప్రవక్తలు యీ విషయం చెప్పారు.

ప్రశ్న: "అవి నెరవేరాయి" అని మీరన్నారు?

అమ్మ: అవును, అయితే?

ప్రశ్న: నూతన జాతి యెక్కడ?

అమ్మ: నూతన జాతా? నిరీక్షించు, యెదురుచూస్తూ వుండు... కొన్ని వేల సంవత్సరాలు, అప్పుడు చూస్తావు.

మనస్సు భూమి మీదకు అవతరించిన తర్వాత, భువి వాతావరణంలో మనస్సు అభివ్యక్తం గావడానికి మొట్టమొదటి మనిషి దర్శన మివ్వటానికి మధ్య దాదాపు పది లక్షల సంవత్సరాలు గడచి వుంటాయి. ఇప్పుడు అది వేగంగా జరుగుతుంది, యెందుచేతనంటే మనిషి దానిని ఆశిస్తున్నాడు, అతనికో అస్పష్టమైన భావం వుంది. ఒక అర్థంలో మానవాతీతుని రాక కోసం యెదురు చూస్తూ కాంక్షిస్తున్నాడు. కాని పూర్వం కోతులు మనిషి పుట్టాలని ఆశించలేదు, అవి ఆ విషయాన్ని[1] గురించి ఆలోచించనే లేదు. — దానికొక మంచి కారణం వుంది, బహుశా అవి యెక్కువగా ఆలోచించ లేకపోవడమే అయ్యుంటుంది. కాని మనిషి దానిని గురించి ఆలోచించాడు, యెదురు చూస్తున్నాడు గనుక అదింకా వేగంగా జరుగుతుంది. వేగం అంటే యింకా బహుశా వేల సంవత్సరాలు అని అర్థం. దానిని గురించి కొన్ని వేల సంవత్సరాల తర్వాత మళ్ళీ ముచ్చటించుకోవాలి.

(నిశ్శబ్దం)

అంతరంగంలో యెవరు సంసిద్ధులై వుంటారో, ఉన్నత శక్తులకు ఉన్మీలనమై, వాటితో సంపర్కం పెట్టుకొని వుంటారో, అతిమానస ప్రకాశంతో, చేతనతో ప్రత్యక్ష వ్యక్తిగత సంపర్కం కలిగి వుంటారో, వారు భూవాతావరణంలో మార్పును అనుభూతి చెందుతారు.

కాని అందుకోసం... దానిలాగా వున్నదాన్ని అది మాత్రమే తెలుసుకో గలుగుతుం

---

1. 1956 ఏప్రియల్ బులెటిన్‌లో రెండు సందేశాల రూపంలో ఫిబ్రవరి 29 న జరిగిన అతిమానస అభివ్యక్తిని గురించి అమ్మ యీ విధంగా ప్రకటించారు.

ప్రభూ నీవు సంకల్పించావు, నేను నిర్వహించాను
నూతన వెలుగు భువిపై ప్రసరించింది
ఒక నూతన ప్రపంచం జన్మించింది
వాగ్దానం చేసిన విషయాలు నెరవేరాయి.

"భువిపై అతిమానస అభివ్యక్తి యిక నెంత మాత్రం ఒక వాగ్దానం కాదు, అదొక సజీవ వాస్తవం, ఒక సత్యత".

"అదిక్కడ పనిచేస్తోంది, మిక్కిలి అంధుడైనవాడు, అత్యంత బుద్ధిహీనుడు, అత్యంత అయిష్టత చూపించేవాడు సైతం, దానిని గుర్తించక తప్పని రోజొకటి వస్తుంది'.

దన్నట్లు, అతిమానస దివ్యచేతన మాత్రమే భూవాతావరణంలో అతిమానసం పనిచేస్తున్నట్లు తెలుసుకోగలుగుతుంది. ఏదో ఒక కారణం చేత యీ గ్రహణశక్తిని అభివృద్ధి చేసుకొన్నవాళ్ళు దానిని చూడగలరు. ఆంతర అస్తిత్వ స్పృహ కూడా లేనటువంటివాళ్ళు — కొంచెం ఆంతరంలో నివసించేవాళ్ళు — తమ అంతరాత్మ యెలా వుంటుందో యేమాత్రం చెప్పలేనివాళ్ళు భూవాతావరణంలో వచ్చిన భేదాన్ని గ్రహించడానికి సంసిద్ధులు కాలేదని కచ్చితంగా చెప్పవచ్చు. అందుకోసం వాళ్ళింకా చాలా దూరం పయనించవలసి వుంది. ఎందుకనంటే యెవరి చేతన హెచ్చుతగ్గులుగా కేవలం బాహ్య అస్తిత్వం మీదే — మనఃప్రాణదేహాల మీదే కేంద్రీకృతమై వుంటుందో వాళ్ళు వాటిని గుర్తించడానికి, విషయాలు వూహించని విధంగా ఒక అసంగతమైన రూపం తీసుకోవలసి వుంటుంది. అప్పుడు, అవిగో మహిమలు, అంటారు.

పరిస్థితులను, లక్షణాలను మార్పు చేస్తూ, విస్తృత పరిధిలో విస్తరించే ఫలితాన్ని చూపిస్తూ క్రియాశక్తులు జోక్యం చేసుకుంటున్న నిరంతర మహిమను వాళ్ళు మహిమ అనరు. ఎందుకనంటే వాళ్ళు చూచేది కేవలం పైకి కన్పించే ఆకారాన్నే, అది చాలా సహజం అన్పిస్తుంది. కాని నిజం చెప్పాలంటే, సంభవించే యే అత్యల్ప విషయం గురించైనా నీవు లోతుగా విచారిస్తే అది మహిమాన్వితం అని వప్పుకొన కుండా వుండలేవు,

నీవు లోతుగా విచారించకుండా, అవి యేమిటి, అలా యెందుకున్నాయి అని ప్రశ్నించకుండా యదాతథంగా తీసుకొవడమే అందుక్కారణం, లేకపోతే "నిజంగా యిది చాలా ఆశ్చర్యం కలిగిస్తోందే! యిదెలా జరిగింది?" అని నీలో నీవు అనుకొనేటట్లు చేసే అనేక సందర్భాలు ప్రతి రోజూ తారసపడ్తాయి. విషయాలను పై పైన చూడడం అనేది పూర్తిగా ఒక అలవాటుగా మారిపోయింది.

CWM 8:126-28

28 జనవరి 1964

(ఈ క్రింద ఉదహరించిన సంభాషణ దివ్యజననికి 'బి' అనే ఒక బెంగాలీ శిష్యునికి మధ్య జరిగింది. ఈ సంభాషణ జరుగుతున్నపుడు టేపులలో నిక్షిప్తం చేయలేదు, కేవలం స్మృతి ననుసరించి తరువాత వ్రాసాడు.)

బి: నేను కలకత్తా వెళ్తున్నాను. ప్రస్తుతం జరుగుతున్న మతకలహాల గురించి

పరిష్కారం యేమిటని వాళ్ళు నన్నడుగుతారు.

అమ్మ: చేతన పరివర్తన చెందాలి, అదే పరిష్కారం. నాకు తెలుసు వాళ్ళు (పాకిస్థానీయులు) చెడుగా, జంతువుల్లా ప్రవర్తించారు — మనుష్యుల కంటే జంతువులే నయం — కాని యిక్కడివాళ్ళు కూడా అదే చేస్తే జనంచేత చెడుపనులు చేయించే శక్తుల చేతుల్లో పడిపోతారు. అది ఆ శక్తుల పట్టును మరింత దృఢం చేస్తుంది. ఈ విధంగా ఎగబడడం పరిష్కారం కాదు.

బి: అక్కడున్న జనం నిస్పృహ చెందుతున్నారు, వాళ్ళకు పరిష్కారం కన్పించడం లేదు, యే దారిన వెళ్ళాలో యెవరికై చూడాలో తెలియడం లేదు. వాళ్ళు అపమార్గంలో పోతున్నారు, సరైన నాయకత్వంలేక తప్పుదారి పడ్తున్నారు. ఈ యిబ్బందులలో అధిక భాగానికి దేశవిభజన కారణం కాదా?

అమ్మ: అవును, మతవిభజన, దేశవిభజన స్వప్రయోజనాల కోసం విభజన! జనం గనుక మనమంతా పోట్లాడుకొనే అన్నదమ్ములం కాదు, మన సామాన్య మూలం గురించి యెరుక గలిగిన అన్నదమ్ములం అనుకొంటే...

బి: మీ రెప్పుడొస్తున్నారు?

అమ్మ: నే నక్కడ లేననే భ్రమపడ వద్దు. నేనున్నాను, నా క్రియాశక్తి, చేతన అక్కడున్నాయి. కాని స్వీకరించేవాళ్ళు లేరు. చైనా సమస్య వచ్చినపుడు అక్కడ యుద్ధరంగంలో వున్నాను. ఘనిష్టంగా, స్పష్టంగా నే నక్కడున్నాను, కాని అక్కడ నన్ను స్వీకరించింది ఒక్క చైనావాళ్ళు మాత్రమే అని చెప్పడానికి విచారిస్తున్నాను. వాళ్ళలో ముందుకు దూసుకుపోవాలనే ప్రేరణ అదృశ్యమైంది, అదీ, స్వీకరిచండమంటే. ఎవరికీ తెలియదు వాళ్ళెందు కుపసంహరించుకొన్నారో! భారతదేశం వైపు కొంతమందిని మాత్రమే అది తాకింది., వాళ్ళు ఆ భయంకర స్థితులను నాకు తరువాత చెప్పారు.

రెండో ప్రపంచ యుద్ధానంతరం దగ్గర్నుంచీ నేను కాళికాదేవిని ప్రశాంతంగా వుంచుతున్నాను, కాని ఆమె యెంత అసహనంగా వుంటోందో! కాలం చాలా క్లిష్టంగా వుంది, యెప్పుడైనా యేదైనా జరుగవచ్చు. జనం వాళ్ళ అహాన్ని వదులుకొంటేనే యేదైనా!

బి: నేనో తేలికైన మార్గం చెపుతున్నా — మీ వైపు తిరగడం.

అమ్మ: నేనిప్పుడు నీకు చెప్పిన విషయాన్ని చెప్పవలసిన సమయం బహుశా

వచ్చిందనుకొంటాను. సందర్భం వచ్చినపుడు నీవా విషయం చెప్పవచ్చు. నీ విశ్వాసాన్ని నిలబెట్టుకొంటూ ఒక యోధునిలా ముందుకు వెళ్ళు.

*

బి: "మరో యుద్ధ మంటూ వస్తే అది భారత గడ్డ మీదే" అని ఒకప్పుడెప్పుడో మీరన్నారు.

అమ్మ: అవును, చాలా కాలం క్రితం అన్నాను. కాని భారతదేశం పాకిస్థాను మధ్య విభజన జరిగాక శ్రీఅరవిందులు చాలా గట్టిగా హెచ్చరిస్తూ యిలా వ్రాసారు. ఈ విభజన తప్పకుండా యెలాగోలా అంతమవ్వాలి, "యే విధంగానైనా సరే" అన్నారు. నాతో యింకా యిలా అన్నారు "అలా చేయడానికి వాళ్ళంగీకరించ లేకపోయినట్లైతే యుద్ధం చేస్తారు...."

16 సెప్టెంబరు 1965

*

రష్యా, అమెరికాల మధ్య సౌహార్ద్రత నెలకొనేందుకు నేను కొన్ని సంవత్సరాల నుండి కొంత పని చేస్తున్నాను. కెన్నడీ హత్య జరిగినపుడు, కృశ్చేవ్ బాగా నిల ద్రొక్కుకున్నపుడు నేనా విషయంలో సఫలమయ్యానని అనుకొన్నాను. ఇద్దరూ నిష్క్రమించారు! ఒకరు హత్యకు గురైయ్యారు, రెండో వ్యక్తి పదవీచ్యుతు డయ్యాడు.

సరే చూద్దాం...

సైనిక పరిష్కారం కంటే వేరేదేమీ కన్పించడం లేదు.

పాకిస్థాను భారతదేశంలో భాగమైపోవడం జరిగితేనే ఆ సమస్య పరిష్కారమైనట్లు.

ఎవరి వత్తిడీ లేకుండా వాళ్ళు ఆ పరిష్కారానికి రావచ్చు....

25 సెప్టెంబరు 1965

*

బాహ్యపరిస్థితులు భారతదేశాన్ని పాకిస్థానుతో తిరిగి యేకమవ్వాలని వత్తిడి చేస్తే తప్ప వాళ్ళందు కంగీకరించరు.

అలా జరగడానికి సన్నాహం జరుగుతోంది, అది ఒకేసారి అంతటినీ భగ్నం చేస్తుంది.

10 నవంబరు 1965

*

భారతదేశం, పాకిస్థానుల మధ్య ఆ యుద్ధం స్పష్టంగా... (మాటల్లో యెలా చెప్పాలి? నా దగ్గర కొచ్చే మాటలు ఆంగ్లంలో వస్తున్నాయి) ఎర్రచైనా ఉద్యమంలో సరితూగ గల శక్తితో ఒక గొప్ప 'ఆసియా దేశాల కూటమి' ని సృజించాలని కోరే పరమ సత్య క్రియాశక్తుల ప్రేరణచేత, ప్రేరణ క్రింది ఆ పని మొదలై నడుస్తోంది. వాస్తవంగా పాకిస్థాను, తక్కిన ప్రాంతాలు అంటే నేపాలు, టిబెట్, బర్మా కూడా కలిపి, దక్షిణాన సిలోన్ అన్నీ కలిపిన కూటమిగా అది రూపొందాలి. అందులో ప్రతి దేశం స్వయం ప్రతిపత్తితో అభివృద్ధి చెందాలి, పూర్తి స్వేచ్ఛను కలిగి వుండాలి. శాంతి కావాలి అని కాంక్షించే ఆ సామాన్య ఆకాంక్షతో ఒకటై పోయి, విభజన శక్తుల దాడికి వ్యతిరేకంగా పోరాడాలి. అది చాలా స్పష్టం, అది సంకల్పించబడింది....

21 సెప్టెంబరు 1966

*

సరే పశ్చిమంలో వాళ్ళు పోరాడ్డం నిలిపేశారు... అంటే అర్థం సమస్య సమసిపోలేదని.

ఈ సారికి మళ్ళీ జరుగదు.

అలా జరుగదు. ఎలా జరుగుతుందో దర్శించాను. యుద్ధం ద్వారా జరుగదు. పాకిస్థానులో వివిధ భాగాలు విడిపోతాయని ఆందోళన చేయడం ద్వారా అది జరుగుతుంది. అలా అనే అయిదు ప్రాంతాలున్నాయి. విడిపోయి అవి భారతదేశంలో కలిసిపోయి ఒక విధమైన కూటమిగా యేర్పడతాయి. అదిగో అలా ఆ పని జరుగుతుంది.

అది అంతర్గతంగా ముక్కలౌతూ వస్తుంది, అవును, నేను దర్శించాను, అదే జరుగుతుంది, అలాగే జరుగుతుంది.

నేను చూచాను, (ఈ మధ్యనే). అదే రోజో నాకు గుర్తు లేదు. హఠాత్తుగా వున్నట్లుండి చూచాను. గంటపాటు దర్శనంతో దైవశక్తితో సంపర్కం యేర్పడింది. అది... అద్భుతంగా వుంది, విషయాలు అసాధారణంగా తయారైనాయి. అప్పుడు వెంటనే మరునాడు వార్తలన్నీ మారిపోయాయి. నిజంగా అసాధారణ స్థితి అది. కచ్చితంగా యేం మారిపోయాయి. నిజంగా అసాధారణ స్థితి అది. కచ్చితంగా యేం జరిగిందో దాన్ని కాదు నేను దర్శించింది. కాని దాన్ని యెన్నో సంవత్సరాల ముందు దర్శించాను... సరే అదేమంత చెప్పుకోదగ్గ విషయం కాదు... సరే...

జరుగబోయే వాటిల్లో ఒకటి అమెరికా మారడం. దానికి చాలా కాలం పడ్తుంది.

కాలాంతరంలో జరుగబోయే వాటిల్లో ఒకటి అమెరికా మార్పు, మరొకటి

వివరించిన మానవ ఐక్యత ఆదర్శా న్ననుసరించి భారతదేశంలోని రాష్ట్రాలన్నీ ఒక సంయుక్త కూటమిగా యేర్పడాలి. సరిగ్గా శ్రీఅరవిందులు తెలియజేసిన విధంగా అదే భావంలో, అమెరికా సంయుక్త రాష్ట్రాల మార్పు జరగాలి. కాని అందుకు చాలా కాలం పడ్తుంది.

దిమదర్ : ఒక శిష్యునితో సంభాషణ, 18 డిసెంబరు 1971

ఇది మనిషి పురోగతి, ఏలనంటే కలియుగం
స్వర్ణయుగాన్ని సిద్ధం చేస్తుంది. మనం పాపం అనేది
మనిషి లోలోతుల్లో ఆతడే వదలివేసినవి
ఆతని తీర్థయాత్రలో, ఆ మహాచోదకుడు దారి చూపుతాడు.

ఘర్షించి బాధపడి చెడును విడుస్తాడు. వెనుక
ఏలనంటే, ఆతనిని విడువకుండా సదా తిరిగి వస్తుంది.
బాధ అనే అగ్నిలో పుతం పెట్టబడ్తాడు
అధిక మాధుర్యాని కర్హమయ్యేందుకు, అధిక శక్తిని పొందడానికి

CWSA 2:244

శ్రీఅరవిందులు

స్వేచ్ఛానువాదం: కె. వి. రావు

మహాప్రళయకాల విధ్వంసం — ఛిన్నమస్త

కాలగతిలో భువిపై ఎప్పుడు నూతన సృష్ట్యారంభం జరిగినా లేక భూవాతావరణంలో నూతన చైతన్య ఆవిష్కరణ చోటు చేసుకున్నా, అది గత సృష్టి సర్వం విధ్వంసం కాబడి అంతరించిన పిదపనే సంభవమవుతుంది. మహాశివుని నర్తనకు రెండు లక్షణాలున్నాయి, ఒకటి సృష్టి గావించుటలోని పరమానందం, రెండు, ధ్వంసం చేయుటలోని సంతోషం. — లాస్యము, తాండవము. ఇంతవరకు ఈ రెండూ సమానంగానే అవసరమయినాయి — పరస్పర పూరకాలుగా.

విధ్వంసం అనగా అనవసరమైన, అనర్హమైన నూతన ఆవిష్కరణను అంగీకరించు

టకు సమ్మతించని, దానిని ఆటంకపరచి, తిరస్కరించ ప్రయత్నించే దానినంతటినీ నాశనం చేయటం. అనివార్యమగు నూతన భవితకు యుక్తము కానిదాని నంతా ధ్వంసం గావించటం. ప్రాపంచిక పరిణామ క్రమం ఒక ప్రగతి బాటలో పయనించడం. ఆ వేగానికి అనుగుణంగా అడుగేయ లేకపోతే నీవు ఆ బాట నుండి తొలగిపోవాలి లేదా తరువాతి దశకు చేరడానికి అడ్డంకిగా నున్న నీవు తొలగించబడతావు.

నీవు గత సృష్టి సాంప్రదాయానికే కట్టుబడి లేక కనీసం దానిపై ప్రేమను చంపుకోలేక దానినే అంటిపెట్టుకొని వున్నట్లయితే ఆ విధ్వంసం బాధను కలిగించవచ్చు, భయంకరమైనది లేక జుగుప్సాకరమైనది కావచ్చు. కానీ, నీవు కొత్తను ఆకాంక్షిస్తే, ఉదయించబోయే భవితలో పాల్గొనుటకు ఇష్టపడితే, ఇప్పటికే ఆ భవితకు చెందినట్టి భావన వుంటే, ఈ విధ్వంసం యొక్క ఆవశ్యకతను గ్రహించ గలుగుతావు, పని వేగవంతం కావటానికి దానిని స్వాగతిస్తావు, దానిలో ఆనందం కూడా పొందుతావు. విధ్వంసం గావించటంలో ఆనందం అనుభవిస్తావు — అధమ పక్షం మహాశివుడు అనుభవిస్తాడు, దివ్యశక్తి అనుభూతిని పొందుతుంది.

అలాంటిదేదో ఒకటి, నిజానికి అట్టిదే, జరుగుతున్నది: మహాకాళి తన సన్నాహ కార్యక్రమాన్ని, తొలగించివేసే, ధ్వంసం చేసే, అంతమొందించే కార్యాన్ని, మహా లక్ష్మి, మహాసరస్వతుల మార్గం నిరాటంకం గావించే కార్యాన్ని ప్రారంభించింది. మహేశ్వరి యొక్క ప్రేమ, జాలి, ఆ పనికి అనుమతిస్తుంది, బలపరుస్తుంది. ఎంతో ప్రేమతో, శ్రద్ధతో నిర్మించిన, ఇంకా నిర్మిస్తున్న నూతన సృష్టి, నూతన ప్రపంచం సన్నద్ధమయింది — భౌతిక క్షేత్రంలో తనంతట తాను అభివ్యక్తమవటానికి, భూమిపై సశరీరంగా వ్యక్తమవటానికి, సన్నద్ధంగా నుంది కానీ పృథ్వి ఇంకా సన్నద్ధం కాలేదు, వాస్తవానికి మనిషి ఇంకా సిద్ధపడలేదు, ఇంకా దానిని తిరస్కరిస్తున్నాడు, గతించిన పాత ప్రపంచాన్నే గట్టిగా పట్టుక వ్రేలాడుతున్నాడు; అతడు ఈ అసత్యమైన, మోసపూరితమైన క్రీడావిలాసాన్ని ఇష్టపడుతాడు. బహుశా అతని అహంకారపూరిత స్వభావానికి, ప్రచ్ఛన్న వేషధారణకు, సత్యం చూడలేనంత అసాధారణగు ప్రకాశవంత మైనది అయి వుండవచ్చు. ఆ కారణంగా అతను నవ్యచేతనను, నూతన వాస్తవికతను సాధ్యమైనంతగా అడ్డుకుంటాడు. శ్రీమాత తన అపారమైన ప్రేమానురాగాలతో ఆ తిరస్కృతిని తనపై వేసుకొనుటకు ప్రయత్నించింది, సాధ్యమైనంత వరకు స్వాభావిక స్థితులను సమ్మతింప జేసి మార్చే ప్రయత్నం చేసింది. అటుపైన, ఇక

చేసేది ఏమీ లేనందున తనను తాను ఉపసంహరించుకొని, అనివార్యమైన కార్య నిర్వహణను తన మరొక పక్షానికి వదిలివేసింది. ఆ కార్యం అత్యంత దృఢమైన గత ప్రపంచాన్ని నామరూపాలు లేకుండా చేయటం. అది ఒక ఆవశ్యకత, భూమండలానికే కాదు, మనిషికి కూడా మేలు కలగటానికి.

ఆ పని మొదలయింది. దానిని మహాశివుని నర్తనమని, భీకర రూపధారిణి యగు మహాకాళి కరాళ నృత్యమని ఏ పేరుననైనా పిలువవచ్చు. పని మొదలై,దాని దారిలో అది వడివడిగా సాగిపోతున్నది — విధ్వంసం, సర్వనాశనం, ఛిన్నాభిన్నమవడం — అవును, అదే ప్రథమ ఫలితం. మనకు నచ్చినా, నచ్చకపోయినా ఇప్పటికే దానిని వీక్షిస్తున్నాము, దానిలో భాగస్వాముల మైనాము, అది పరమేశ్వర శాసనం, తప్పక తీరవలసిందే. ఎవరు పరమసత్యాన్ని అంటిపెట్టుకొని వుంటారో వారు జీవించి వుంటారు, అసత్యంతో సఖ్యత పెంచుకున్నవారు నశిస్తారు. మనిషికి ఎరుకతోనో లేక ఎరుక లేకనో ఏదో ఒక దానిని ఎన్నుకోవటం తప్ప వేరొక మార్గం లేదు.

అది ఒక అనివార్యమగు దశ; నీవు పరమ సత్యానికి ఆశ్రితుడవైనట్లయితే వగవటానికి, బాధపడటానికి ఏమి లేదు.

తరువాతి దశ, సహజంగానే, అవశేషాల తొలగింపు, పూర్తిగా తొలగించుట — సత్యానికి వ్యతిరేకమైనదానిని, గతించిన ప్రపంచ శిథిలావశేషాలను వదిలించుకొనుట, మలినమైన, అస్పష్టమైనదాని నంతటినీ క్షేత్రపరిధి నుండి తొలగించుట. అప్పుడు మాత్రమే నూతన వాస్తవికత ముందుకు రాగలదు, శ్రీమాత ఉద్యమ లక్ష్యం నేరవేరుతుంది.

తనంతట తానుగా రూపొందిన నూతన జగత్తు ఇప్పటికే ప్రత్యక్షమయింది. ఆశ్రమం లోపల, బయటా ఏది జరుగుతున్నా అది జరిగేది నూతన సృష్టి వీలైనంత తొందరగా బహిర్గతం కావాలన్న ఉద్దేశంతోనే. నూతన వాస్తవికత ఏదైతే ఒక చోట ప్రతిష్ఠింపబడిందో అది అక్కడ నుండి బహిర్గతమవడానికి దానిని కప్పివున్న ఉపరితల ఆవరణ — ఒక జడమైన పెంకులాంటి ఆచ్ఛాదన అనవచ్చు — ఛేదించబడుతున్నది. అది శ్రీమాత స్వయం ఆత్మానుగతంగా నిర్వహించు కార్యం. ఆమె తన ఛిన్నమస్తాకృతిని దాల్చింది. (సర్వావయవ హోమం, మహాబలి, పూర్ణాహుతి, సర్వ విధ్వంసకర కార్యనిర్వహణ గావించే రూపం). ఆమె ధ్వంసం చేస్తున్న వస్తువులన్నీ స్వయంగా ఆమెవే. ఒక విధంగా ఆమె తన దేహమందలి పాత నిరుపయోగమైన జీర్ణావయవాలను

విసర్జిస్తున్నది. ఈ సందర్భంలో శ్రీఅరవిందుల పంక్తులను గుర్తు చేసుకోవచ్చు:

"... ఈ కాలం తరచూ భయంకరమైనదిగా, ఒక దావాగ్నిగా, ఒక సుడిగాలిగా, ఒక పెనుతుఫానుగా, ద్రాక్షరసం పిండే యంత్రచాలన లాంటి తీవ్రత గల భగవదాగ్రహంలా వుంటుంది; కానీ అందులో, తన సంకల్పం యొక్క నిజాయితీపై గల గట్టి విశ్వాస బలంతో దృఢంగా నిలబడగలవాడే తప్పక స్థిరంగా నిలిచేవాడు. అతడు పడిపోయినప్పటికీ తప్పకుండా తిరిగి లేస్తాడు; గాలిలో కొట్టుకపోయినట్లు కనిపించినా తప్పక తిరిగి వస్తాడు. ప్రాపంచిక జ్ఞానం తెలిపే రహస్యాల గుసగుసలకు చెవి యొగ్గకుండా జాగ్రత్త పడు; ఎందుకనగా ఇది ఎదురుచూడనిది సంభవమయ్యే కాలం."

భగవత్కాలం

Collected Works of Nolinikanta Gupta, Vol. 6, pp. 256-258

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

గరుడ గమన వేగంతో మంచికి అండగ నిలుచుట
కారణమాతడి అధిక ప్రయాసకు.
అనంత లోకాల నుండి ఆతని ఆగమనం
మరణాంతర వస్తువులతో అమరుటకు అమరత్వం.
దేహమందు విస్తృతమగు అంతరాత్మ నిండుటకై
బాధనొందు భూమి నంత దైవపరం గావించును.
అక్షయమగు ఇచ్ఛాబల పట్టొదలని ఆసరాతో
మృత్యుముఖం నుండి ఎదుగు దివ్యమైన పుట్టుకగా.

అనువాదం: అందుగులపాటి కైలాసపతి